
వాడ్రేవు చినవీరభద్రుడు

ఆ వెన్నెలరాత్రులు



వాడ్రేవు చినవీరభద్రుడు

ఆ వెన్నెలరాత్రులు

AA VENNELA RATRULU

(Those Moonlit Nights)
A novel by
Vadrevu Chinaveerabhadrudu

April, 2025

Coverpage photograph courtesy:
Vijay Jeedigunta

Coverdesign, composing and Layout
Chinaveerabhadrudu

ebook released by
Vadrevu Ch Veerabhadrudu
First Floor, House No.56, SVK Nilayam
Navodaya Colony
Mehdipatnam
Hyderabad 500028
Telangana State, India

For more resources please visit
www.chinaveerabhadrudu.in

మా బాల్యమిత్రుడూ

మా ఊరిని ఎంతో ప్రేమించినవాడూ ఇప్పుడు స్వర్గంలో నివసిస్తున్న

శ్రీధర మల్లికార్జునరావుకి

మనసులో మాట

ఆ వెన్నెల రాత్రులు వాడ్రేవు చినవీరభద్రుడుగారు తమ బ్లాగ్ నా కుటీరంలో పెట్టడానికి మొదలు పెట్టినప్పుడు అది ఎన్ని రోజులు నడుస్తుందనే అంచనా లేదు. ఒకటి రెండు రోజులు గడిచేసరికి రోజూ ఉదయాన్నే గోదావరిలో నీళ్ళు ఎంత చల్లగా వున్నాయో తెలియకుండా దిగితే ఎంత ఉలికిపాటు కలుగుతుందో అలా మనసు ఉలిక్కిపడింది. ఇంకొంచెం లోపలికి వెళ్ళేసరికి lightheaded feel వచ్చింది. కారణం ఇంతే. నా ఇరవై ఏళ్ళ మనసు డెబ్భై ఏడేళ్ళ శరీరంనుండి విడివడి ఆ మాయాలోకంలోకి చేరింది. అప్పటి నుంచి ఒకటే కోరిక: ఇది ముగియకపోతే ఎంత బాగుంటుంది!

నన్ను ముందు ఆకర్షించిన మాట 'ఆ'. ఏ వెన్నెల రాత్రులు ? ప్రేమ కథల్లో, కావ్యాల్లో. కవితల్లో వెన్నెల రాత్రులకు ప్రత్యేకమైన స్థానం వుంది. ఇది ఇద్దరి ప్రేమ కథ అని పాఠకులు పొరబడడానికి అవకాశం ఇవ్వరు రచయిత. మనకు కథ చెప్పే విమల మధ్య వయస్కురాలు, ఆమె భర్త డాక్టర్, పిల్లలు కూడా పెద్దవాళ్ళే. ప్రేమ విషయంలో తల్లిదండ్రులతో ఘర్షణ పడుతున్న పొరుగింటి మాధురి మీరెప్పుడైనా ప్రేమించారా అన్న ప్రశ్న ఆమెను గతంలో ఆమె ప్రేమించిన కాలానికి తీసుకుని వెళుతుంది. మళ్ళీ ఒకమారు ఆ రోజుల్ని జీవించేలా చేస్తుంది, మనం కూడా గాఢంగా ఆ రోజుల్ని అనుభవించేలా చేస్తుంది.

సాధారణంగా ఈ ఫ్లాష్ బ్యాక్ కథలకి కథలో ఓ శ్రోత ఉంటారు. రచయిత మాస్టర్ స్ట్రోక్ ఏమిటంటే కథకురాలికి మనకూ మధ్య ఎవరూ అడ్డుగా లేరు. మనం విమలతో మమేకమై ఆమె అనుభూతులన్నింటినీ మనవిగా చేసుకునే అవకాశం ఇచ్చారు రచయిత.

రసజ్ఞులైన, ఆ తరానికి చెందిన పాఠకులకు ఇదొక టైమ్ ట్రావెల్. ఈ తరం పాఠకులకు ఒకప్పటి జీవనవిధానాన్ని పరిచయం చేస్తుంది.

చదువు ముగించి, పై చదువులకు వెళ్ళే అవకాశం లేదనే విషయాన్ని పెద్ద అసంతృప్తి లేకుండా తీసుకుని కాలం గడుపుతున్న విమలకు కలకత్తానుండి తూర్పు కనుమలలో ఓ గిరిజన గ్రామం కేంద్రంగా సర్వే చేయబోతున్న జియాలజిస్ట్‌కి బొటానికల్ సెక్షనులో పని చేయడానికి వెళ్ళే అవకాశం వస్తుంది. ఆమె కుటుంబంనుండి ఏమీ వ్యతిరేకత లేకపోవడం నాకైతే ఆశ్చర్యం కలిగించలేదు. విమల తండ్రి ఆమెను ఆ సమయానికి ఆ గ్రామానికి చేర్చి, అక్కడ వసతి సదుపాయం చేసి వెళ్లిపోతారు.

విమల తన జీవితంలో మొదటిసారి బొత్తిగా అపరిచితమైన ప్రపంచంలో ఓ ప్రయాణం మొదలు పెడుతుంది. ఆమెకు ఆశ్రయమిచ్చిన సూర్యనారాయణగారి కుటుంబంతో సులభంగా ఇమిడిపోతుంది. ఆ తర్వాత ప్రొఫెసర్ సేన్‌గుప్తా తన అన్న కూతురు వనలతా సేన్‌తో రావడంతో మనం అడవిబాట పడతాం. విమల, విమలతోబాటు మనమూ సేన్‌గుప్తా నుండి పాఠాలు నేర్చుకుంటాం: ప్రకృతిలో దేనిని ముట్టుకోవడానికీ మనకి హక్కు లేదనీ, మొక్కలు మాట్లాడతాయనీ, ప్రకృతిలో అన్నిట్లోనూ వున్నది ఒకే మూలపదార్థం అనీ. 'నేను ఒంటరిదాన్ని కాననీ, సమస్త మహారణ్యం నన్నొక్కసారిగా తనదానిగా చేసుకున్నదనీ అనిపించింది.' (ఈ రహస్యం నాకు తెలియడానికి కొన్ని దశాబ్దాలే పట్టింది.) సాధారణంగా నవలలు చదివేటప్పుడు కథ ఏమయిందో తెలుసు కోవాలన్న కుతూహలంలో వర్ణనలు, చర్చలు స్కిప్ చేస్తారు పాఠకులు. కానీ ఇక్కడ రచయిత మనకు విమల జీవితం ఏ బాటన నడిచిందో ముందే చెప్పేయడంవల్ల మనం ప్రొఫెసరు గారి పాఠాలు, వనలత పాడే బెంగాలీ పాటలు, వాటికి రచయిత చాలా థాట్‌ఫుల్‌గా ఇచ్చిన తెలుగు అనువాదంతో సహా ఆసక్తితో, ఆనందంతో వింటాం. బై ద వే వ్యక్తిగతంగా నాకు నజ్రుల్ గీతాల పరిచయంతో మరోలోకంలోకి వీసా దొరికింది.

సేన్‌గుప్తా విమలకు ఓ మంత్రదండంతో అడవి రహస్యాలు తెలుసుకునే మార్గం చూపెడితే, ఈ సర్వేలో భాగంగా వచ్చిన ఆంత్రొపాలజిస్టు డాక్టర్ మిశ్రా విమలకు గిరిజనుల జీవితాన్ని పరిచయం చేస్తాడు. సాధారణంగా మనం ఎంత 'నా' అన్న కాన్సెప్ట్‌తో మునిగి పోతామంటే మన చుట్టూ వున్న సమాజంలో మిగతా వర్గాల పట్ల దృష్టి సారించం. మిశ్రా మాటలు, అక్కడికక్కడే సమస్యలకు పరిష్కారం కనుక్కోవాలన్న తపన విమలకు కొత్త చూపునిస్తాయి. సర్వే కన్నా ముందు ఆ గ్రామంలో గిరిజనుల జీవితం, పిల్లల బడి విషయంలో మిశ్రా తెచ్చే మార్పులు విమల ఆలోచనా విధానాన్ని సమూలంగా మారుస్తాయి.

అప్పటిదాకా ఆ గ్రామంలో విప్పారిన కళ్ళతో ఇంద్రచాపాన్ని మాత్రమే చూసిన విమల గిరిజన కుటుంబాలలో కనిపించే పేదరికాన్ని చూస్తుంది. ఒక విస్తరాకుల కట్టకు రెండు పైసలు పెంచితే వారి ఆర్థిక పరిస్థితి ఎంత మెరుగు పడుతుందో గమనిస్తుంది. అంతేకాక పరిస్థితులు మెరుగుపడాలంటే గిరిజనుల ప్రయత్నం, కోరిక తప్పనిసరి అని తెలుసు కుంటుంది. మిశ్రా నోట రచయిత ఈ మాటలు చెప్పిస్తారు : 'ఆయన (గాంధీగారు) దృష్టిలో పదవి అంటే స్వయంపాలన, ఉద్యోగం అంటే ప్రజలతో కలిసి జీవించడం. రాజ్యాధికారం కోసమో, లేదా మరిన్ని ఉద్యోగాలకోసమో పాకులాడేవాళ్ళు ఎప్పటికీ ప్రజలకి విముక్తినివ్వలేరు'. 'లెట్ మీ కరెక్ట్ మైసెల్ఫ్. అసలు ప్రజలకు ఒకళ్ళు విముక్తి నివ్వడమేమిటి? వాళ్ళ విమోచన మరొకళ్ళు సాధించడమేమిటి? అది ప్రజలు తమంత తాముగా చేసుకోగల పని. మనం చెయ్యవలసిందల్లా మనదగ్గర ఏ రంగంలో ఎక్స్‌పర్టీజ్ ఉంటే దాన్ని ఆ రంగంలో ప్రజలకు ఉచితంగా ధారపోయ్యడమే'. అంతేకాక ప్రభుత్వాలు ఈ దిశగా పని చేయనంతకాలం ఎక్స్‌ట్రీమిస్టులు పుట్టుకు వస్తూనే వుంటారన్న, మనం నిత్యం చూస్తున్న సత్యాన్ని కూడా అతని చేత చెప్పిస్తారు.

మనం ఇంతవరకు రాజు, విమల పాత్రలాగానే, నవల పొడుగునా కనిపించే పాత్ర గురించి మాట్లాడుకోలేదు. కాకినాడలో డిగ్రీ చదువుతున్నా, కాలేజిలోకన్నా ఆ గ్రామంలోనే ఎక్కువ కాలం గడిపే సామాజికస్పృహ వున్న యువకుడు. గ్రామంలో జరిగే అన్ని కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనే అతడు విమలకు సహజంగానే మంచి స్నేహితుడు. క్రమేణా విమలపట్ల ఆకర్షితుడవుతున్నాడని మనకు తెలుస్తుంది. కానీ విమలకు ఆమె తన మునుపటి జీవితానికి తిరిగి వెళ్ళిపోయాక , చిన్నపిల్లల బడిలో ఉద్యోగంలో చేరిన కొన్ని నెలలకు అతను ఓ ఉత్తరం రాసేదాకా తెలియదు. అప్పటికే విమల జీవితం ఏ దిశగా వెళ్ళాలో నిర్ణయం అయిపోయింది. ఐనా విమల గాభరా పడుతుంది, తననుండి ఏమైనా తప్పు సందేశాలు వెళ్ళాయా అని లోతుగా విశ్లేషించుకుంటుంది .

ఆ గ్రామం, గ్రామస్థులు, అడవి, కొండలు, శబ్దాలు, నిశ్శబ్దం, వెన్నెలరాత్రులు, ప్రొఫెసర్ సేన్‌గుప్తా , వనలత, మిశ్రా అందరితో బాటు రాజుని కూడా ప్రేమించింది. ఆ కొన్ని నెలల పాటు సాగిన ఓ ప్రేమకథలో అతడూ ఓ భాగం. అంతే కాని అతడికి విడిగా విమల హృదయంలో స్థానం లేదు.

విమల ఆలోచనలు రచయిత తార్కికంగా తీసుకుని వచ్చిన తీరు మనల్ని చాలా ఆలోచింపజేస్తుంది. మనం చదివే ప్రేమ కథలు, చూసే సినిమాలు వారి పెళ్ళితో శుభం కార్డు పడడమే సహజం అనుకునే స్థాయికి మనల్ని తెచ్చాయి. కానీ కలిసి మెలిసి తిరిగిన

వారందరిలోనూ ప్రేమ భావం కలగదు. ఇష్టం ప్రేమగా మారడానికీ, సహజీవనాన్ని కోరుకోవడానికీ ఇంకా చాలా పారామీటర్సు కలవాలి. యువత కాస్త నిమ్మళంగా ఆలోచించ గలిగితే ఎన్నో ప్రమాదాలు జరగవు కదా అనిపిస్తుంది.

కథనం ఉత్తమపురుషలో సాగితే ఒక ప్రమాదం రచయితని నేనుగా భావించడం. రెండోది పాఠకులు ఆ 'నేను' కావడం. వ్యక్తిగతంగా ఆ రెండో అనుభూతి పుష్కలంగా దొరికింది. అన్ని అనుభవాలు పంచుకోను కాని రచయిత తాను పుట్టి పెరిగిన గిరిజన గ్రామం, అడవిలో తిరుగుతున్న రోజుల్లో, ఇంచుమించుగా 1965-70 మధ్యలో నేను అరకులో నా గ్యాంగుతో తిరిగాను. ఓ మారు బొర్రాగుహలను కాగడా వెలుగులో చూస్తూ చివరిదాకా వెళ్ళాం. ఓ చిన్న చెలమ దాటి ఓ సన్నపాటి చీలికగుండా పాకుతూ బయటకు వస్తే కళ్ళకు మిరుమిట్లు గొలిపే పచ్చని కొండలు. గ్రాండ్ కాన్యను అంచున నిలబడినప్పుడు కూడా నాకీ అనుభూతి కలగలేదు.

ఈ వెన్నెలరాత్రులలో భావావేశం ఎంత వుందో శాస్త్రీయ జ్ఞానం, సామాజికజ్ఞానం వాటి గురించిన చర్చ అంత వుందని చెప్పుకున్నాం. రచయిత విజయం ఎక్కడ అంటే అవి ఆయన మస్తిష్కంలోంచి వచ్చిన ఆలోచనలే అని మనం భావించేలా రాయడం. ఈ నవల ఆయన బ్లాగులో రోజూ చదువుతున్న పాఠకులం ఆ కావ్యాత్మకమైన వర్ణనలు, ఆ అడవి, పొరపాటున దారితప్పిన విమల భయాందోళనలు, సేన్‌గుప్తా ఫిలసాఫికల్-సైంటిఫిక్ దృక్పథం, వనలత పాటలు, గిరిజనుల సమస్యలు, వాటికి పరిష్కారం చూపాలనే మిశ్రా తపన, అందరిలో ఒకడిగా రాజు మెలిగే తీరు గమనిస్తూ వచ్చాం. అది ఏ రోజుకా రోజే కలిగిన అనుభూతి. ఇప్పుడు ఇది రాయడానికోసం మళ్ళీ చదివినప్పుడు ఎన్నో పరస్పరవిరుద్ధమైన విషయాలను ఎంత నైపుణ్యంతో కలిపి అల్లారు అనిపించింది.

సాధారణంగా రచయితని ముందు పరిచయం చేసి రచనను తర్వాత పరిచయం చేస్తారు. నేను రచయిత అందరికీ తెలిసిన మంచి పేరున్న కవి, విమర్శకుడు, అనువాదకుడు, చిత్రకారుడు, నిత్యాన్వేషి, దార్శనికుడు-ఈయనను పరిచయం చేసే అర్హత నాకు లేదు అన్న భావనతో ఈ మనసులో మాట చెప్పే ప్రయత్నం మొదలు పెట్టాను. మనసులో మాటలో భాగం ఆయన పట్ల నాకున్న అభిమానం, ఆవేదన కూడా. ఇంత ప్రత్యేకత ఉన్న వ్యక్తి మలెనాడులో పుడితే కువెంపు సరసన జ్ఞానపీఠ అవార్డుతో నిలబడేవారు అనిపించింది.

విజయవాడ **కల్యాణి నీలారంభం**

6-6-2023

అడవికి చెల్లించిన గురుదక్షిణ

చినవీరభద్రుడిగారి కవితల మీదుగా సహృదయమిత్రులు రాస్తున్న పరామర్శలన్నీ చూస్తూ ఉన్నాను. ఒకే మనిషిని ఒక్కొక్కరం ఒక్కో స్తరంలో చూస్తాం కనుక నావొక నాలుగు మాటలు కలిపే ప్రయత్నం ఇది.

నేను కవిత్వం చదివి అర్థం చేసుకోగల పాఠకురాలిని కాకపోయినా భద్రుడిగారి కొన్ని కవితలూ ముఖ్యంగా ఎక్స్ప్రెషన్సు తలచుకోని కాలాలు అరుదు. వేపపూలగాలి, ఫాల్గుణమాసపు చంద్రుడు, శరత్పూర్ణిమ, కనిపించని కోయిల పాట, ఆలస్యంగా పూయడం వల్ల ఇంకాస్త ఎదురుచూసేలా చేసే మా ప్రాంతపు వేపపూత ఇట్లాంటివెన్నో ఆ మనిషి ప్రకృతిసంబంధి అనిపించేలా మాయ చేస్తాయి. అంతలో 'పునర్యానం' లో వినమ్రపు భరతవాక్యంగా 'వాక్కుకి కృతజ్ఞతలు, మాటలకి కృతజ్ఞతలు' అని మొదలుపెట్టి చెల్లించిన కృతజ్ఞతలు చదివాకా జ్ఞానసంబంధి కావడమే పడుతుంది నాకు ఎక్కువగా.

పోయినేడాది కుదిరినంతకాలం అన్నిరకాలైన సాంఘికమాధ్యమాలకూ వీలైనంత దూరం జరిగాను, ఆ కాలంలోనూ వదలని ఒకే బ్లాగు చినవీరభద్రుడిగారిదే. ప్రతీ ఉదయం తన చదువరి సిద్ధమయ్యేలోపు ఆ రోజు పోస్టును కానుక చేసేవారు. ఒక విషయమా!! ఒక జాగ్రాలో ఒదిగే సంగతులా!! ఒక స్థాయికి కుదించగల విస్తృతా!! వేకువనే ఆ పోస్టు చదువుకుని ఒక మాట చెప్పో ఎక్కువసార్లు ఏమీ చెప్పకుండానో ఆ రోజు మనకు చూపించబోయే కళల్లోకి నెమ్మదిగా ఒదిగేపోయేలా చేసిన మెడిటేటివ్ అనుభూతి నా వరకూ.

'దివ్యప్రేమగీతాల'తో మొదలయ్యి, 'పోస్టు చేసిన ఉత్తరాలూ', 'బసవపురాణం ప్రసంగాలూ', 'బసవన్న వచనాలు', 'ఆషాఢమేఘం', కల్యాణి గారికి కానుక చేసిన

'ప్రేమగోష్ఠి' దాకా ఎన్నో వైవిధ్యపు రచనలు. నన్నూ నాలాగే చాలామంది సహ పాఠకులను అమితంగా ఆకట్టుకున్న 'ఆ వెన్నెల రాత్రులు' నవల మాత్రం అత్యంత ప్రత్యేకం.

ఆ వెన్నెలరాత్రుల్లో మనల్ని తన వెంట తిప్పుతూ అన్ని సొబగుల్నీ చూపించే అమ్మాయి విమల. ఈ కాలపు అమ్మాయి మధురిమ 'నువ్వు కూడా నీ జీవితంలో ఎప్పుడేనా ప్రేమించేవా?'అని అడిగిన ప్రశ్నకు విమల మనోక్షేత్రంలో 'మాఘమాసపు వేళ మామిడి తోట పక్కనుంచి పోయినప్పుడు పరిమళాలు నీ మీద కూడా వర్షించినట్టు ముప్పిరిగొన్న గత స్మృతులే' తరువాతి కథ మొత్తం.

ఈ కథ భద్రుడు గారు కావ్యస్పర్శతో రాయాలని చేసిన సంకల్పం. 1986 లో మొదలుపెట్టి అనుకోని కారణాలకి వాయిదాపడి మళ్లీ 2002 లో రెండు భాగాలంత రూపుదిద్దుకుని, ఇంకో విధంగా ఆగిపోయి, చివరకు ఇప్పుడు విశ్రాంతజీవనం మొదలు పెట్టిన ప్రారంభపుకాలంలో ముప్పై భాగాలుగా రాసి పూర్తి చేసారు.

ఈ కథ చెప్పడానికి చినవీరభద్రుడు ఒక బొటానిస్టు అయ్యారు, ఒక జియాలజిస్టు, ఒక ఇండాలజిస్టు, ఒక యాంత్రొపాలజిస్టు, ఒక పాలియాంటాలజిస్టు, ఒక సాహసి, ఒక అన్వేషకుడు, ఒక పరిశోధక విద్యార్థి, ఒక వైల్డ్ యువకుడూ, ఒక ప్రొఫెసర్, ఒక దేశం నుంచి విడిపడ్డ బిడ్డా, ఒక కవీ, ఒక కథకుడూ అన్నిటినీ మించి ఒక మహా స్వాప్నికుడు అయ్యారు. కథలోని ముఖ్య పాత్ర ప్రొఫెసర్ సేన్‌గుప్తా ఇలా అంటారు:

> నేను హాఫ్ జియాలజిస్టు– హాఫ్ పొయెట్‌ని అని. కాదు, నేను పొయెట్‌ని కూడా కాదు. నేను డ్రీమర్‌ని. ఎప్పుడూ నేనో డ్రీమ్‌టైమ్‌లో జీవిస్తూ ఉంటాను.

ఆ డ్రీమ్ టైమ్లో అన్నీ సుసాధ్యాలు. ఈ కథ రాయడం కోసం 1921 లో బ్రాండీస్ రాసిన భారతదేశంలోని వృక్షాలను గురించిన పుస్తకం ఆదిగా 2022 లో హాలిడే రాసిన 'అదర్ లాండ్స్' వరకూ ఎన్నో పుస్తకాలూ చదివి, అత్యంత నైపుణ్యంతో పాఠకులకు అవసరమైనంత, కొన్నిసార్లు కాస్త ఎక్కువ జ్ఞానాన్ని పంచిపెట్టారు. ఈ రోజున పరిశోధక విలువగా ఉన్న మల్టీ డిస్సిప్లినరీ స్టడీస్ గురించి ఎంతో సరళంగా చెప్పిన విధానం ఒక పరిశోధక విద్యార్థిగా నేను విలువనిచ్చే సంగతి.

బహుశా నవలలో సగం ఎత్తిరాయదగ్గ వాక్యాలే. కానీ, రెండు మూడు మాత్రం ఉదాహరిస్తాను.

ఆ రోజులూ, ఆ రాత్రులూ గుర్తురాగానే తొలివేసవి రాత్రుల రాధామనోహరాల పూల గాలి, ఆ బార్బెట్‌లు, ఆ వార్బ్లర్లు, హేమంతకాలపు ఆ పంటకోతలు, ఆ ఎడ్లబళ్ళు, ఆ పండగలు, ఆ అడవిదారులు, ఆ గిరిజనులు, ఆ ప్రాచీన శిలలు, ఆ ఆకురాలే అడవులు, ఆ చెట్లు, ఆ ఎండుటాకుల చప్పుడు, ఆ తొలివసంత మధురిమ– అవన్నీ నన్ను ముంచెత్తుతున్నాయి...

ఆ పాటలు, ఆ కవితలు, ఆ నవ్వులు, ఆ ఆటలు, ఆ సాయంకాలపు నడకలు, రాత్రి పొడుగునా భూమ్మీద గంధపు పొడిలాగా రాలే వెన్నెల, అపరాహ్ణాలవేళ అడవిలోనూ, ఊళ్ళోనూ కూడా ఆవరించే నిశ్శబ్దం, ఆ ఏరు, ఆ నీటిగలగల, ఆ యూకలిప్టస్ తోటలు, ఆ టేకుచెట్ల అడవి, ఆ కోవిదారపుష్పాలు, ఆ నాటకాల రిహార్సళ్ళు– ఒక పూలబండిలాగా వీటన్నిటినీ నిండా నింపుకుని అప్పటి జీవితం నా ఇంటిముందు వచ్చి ఆగినట్టుగా ఉంది. ..

అబ్బ! ఏమి వెన్నెల! అలాంటి రాత్రి అప్పటిదాకా నా జీవితంలో నేనెప్పుడూ చూసి ఎరగను. ఆ క్షణాన అప్పటిదాకా నన్ను కమ్ముకున్న భయం, అలసట అన్నీ ఎవరో మంత్రించినట్టుగా మాయమైపోయాయి. చుట్టూ చూసాను. ఊరంతా ఇళ్ళ గడ్డికప్పులమీద, ఇళ్ళముందు చెట్లమీద, దూరంగా కొండల మీద, ఎటుచూసినా వెన్నెల. అడవిలో అప్పటిదాకా వినిపిస్తూ వచ్చిన అరుపులు కూడా ఆ వెన్నెలని చిక్కబరుస్తున్నాయి. చిమ్మెటలన్నీ ఎక్కడికక్కడ రాలుతున్న వెన్నెలని తీగలు చుడుతున్నట్టుగా ఉన్నాయి. అదొక అపూర్వమైన నిశ్శబ్దం. ఆ వెలుగంతా నాకోసమే కురుస్తున్నట్టుగా, పండగలాంటి ఆ వెన్నెలకి నన్ను అతిథిగా ఆహ్వానించినట్టుగా అనిపించింది. ..

ఎవరెస్టు పర్వతం ఎక్కడానికి బయల్దేరిన ఒక మౌంటెనీర్ని ఎవరో అడిగారట: ఆ పర్వతం ఎందుకు ఎక్కాలనుకుంటున్నారు అని. ఎందుకంటే, అదక్కడ ఉంది కాబట్టి అని చెప్పాడట ఆయన. అది కాదు కారణం. నేనేమను కుంటా నంటే, ఆ కొండలోనూ, అతనిలోనూ ఒకే పదార్థం ఉంది కాబట్టి, ఆ పదార్థం నిరంతరం ఏదో చెప్పలేని అశాంతితో చలించిపోతూ ఉంది కాబట్టి అంటాన్నేను. ..

శంకరాద్వైతం ఇంతకుమించి ఇంకేదో చెప్పిందనుకోను నేను.

ఇక ఆ లాండ్ స్కేప్స్ వర్ణన చెప్పనలవికాని సౌందర్యం. ఒక్కో వాక్యానికీ ఒక్కో నీటిరంగులచిత్రం కానుక చేయతగ్గ విలువనిండినవి.

> మీకో సంగతి చెప్పనా! మనిషి ఎక్కడికి వెళ్ళినా తనదంటూ ఒక చిన్న ప్రపంచాన్ని తన వెంటపెట్టుకునే వెళతాడు. ఆ ప్రపంచాన్ని తాను పోగొట్టుకున్నాడని అనుకుంటాడుగానీ అది ఎక్కడికీ పోదు. అతనిలోనే ఉంటుంది. ఆ మనిషేగనుక ఒక కవినో, గాయకుడో చిత్రకారుడో అయితే అతడు ఎవరిని కలిస్తే వాళ్ళకి కూడా ఆ ప్రపంచాన్ని ఇంత తుంచి పంచిపెడతాడు. గురుదేవులు జీవించినంతకాలం చేసింది ఆ పనే...

ఈ చినవీరభద్రుడు చేస్తున్నదీ ఆ పనే. చిన్నప్పుడు పుట్టి పెరిగిన కొండపల్లె నుంచీ, జ్ఞానంతో సముపార్జించుకున్న ఉపనిషత్తులేమీ, చీనా కవుల స్ఫూర్తేమీ.. అందరూ అన్నీ ఎప్పటికీ తనతోనే వుంటాయి, చిన్న చిన్న తునకలుగా పంచబడుతూనే ఉంటాయి. అందుకే ఈ అగస్త్యుణ్ణి చూసినప్పుడు నేను అసాధ్యం అనుకోను, అచ్చెరువొందుతాను.

ఈ ఒక్క నవల చినవీరభద్రుడు అడవికీ, అమృతసంతానానికి, ఆరణ్యకకూ, గురుదేవునికీ చెల్లించిన గురుదక్షిణ.

సోనిపట్ **సునీతరత్నాకరం**

27-3-2024

ఉదకదొళగె బయ్చుట్ట బయ్యేయ కిచ్చినంతిద్దిత్తు
ససియొళ గణ రసద రుచియంతిద్దిత్తు
ననెయొళగణ పరిమళదంతిద్దిత్తు
కూడల సంగమదేవర నిలవు
కన్నెయ స్నేహదంతిదిత్తు

(నీటిలో రగులుతున్న నిప్పులాగా, సస్యంలో ఒదిగి ఉన్న సారంలాగా, మొగ్గలో ఒదిగి ఉన్న పరిమళంలాగా, కూడల సంగమ దేవుని ఉనికి కన్యస్నేహంలాంటిది)

బసవణ్ణ

1

నువ్వు కూడా నీ జీవితంలో ఎప్పుడేనా ప్రేమించేవా?' అని అడిగింది మధురిమ.

ఆమె నేత్రాల్లో పసితనపు కుతూహలం. నిర్మల కాంతి. ఎదురుగా హుసేన్ సాగరు పదిగంటల ఎండవేళ నీలిపూత పూసిన అద్దంలా మెరుస్తోంది. ఆదివారం తీరిక మనుషుల్ని పోగేసుకుంటోంది.

నెక్లెసు రోడ్డు పైన ట్రాఫిక్ చిక్కనవుతోంది. మధురిమ ప్రశ్న నన్ను కలవరపరిచింది.

ఆమె ఎంత మామూలుగా అడిగిందని. కానీ ఆ ప్రశ్న నాలో లేవనెత్తగల కల్లోలం ఆ చిన్నారి హృదయానికి ఊహకి కూడా అందేది కాదు. మాఘమాసపువేళ మామిడి తోట పక్కనుంచి పోయినప్పుడు పరిమళాలు నీ మీద కూడా వర్షించినట్టు నా గత స్మృతులు నన్నొక్కసారిగా ముప్పిరిగొన్నాయి.

ఆమె ప్రశ్నకేమని జవాబివ్వాలి?

మధురిమ నేనుంటున్న అపార్ట్ మెంటులో నా పొరుగు ఫ్లాటు వాళ్ళమ్మాయి. వాళ్ళ నాన్న హైకోర్టులో సీనియర్ అడ్వొకేటు. తల్లి యూనివెర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో రీడరుగా పనిచేస్తోంది. మధురిమకి ఒక తమ్ముడు. ఇంజనీరింగు చదువుతున్నాడు. ఆమె ఈ మధ్యనే కంప్యూటర్ సైన్సులో గ్రాడ్యుయేషను పూర్తి చేసింది. ఆమెని ఏదో ఒక అమెరికా సంబంధాని కిచ్చి పెళ్ళి చేయాలని తల్లిదండ్రుల అన్వేషణ. అందులో అసహజమేమీ లేదు. ఇప్పుడు నా చుట్టూ ఉండే సమాజానికి భూలోక స్వర్గం అమెరికానే కదా. కాని చిక్కెక్కడొచ్చిందంటే ఆ అమ్మాయి తన కాలేజిలోనో లేదా తాను ప్రాక్టీసు చేస్తున్న కంప్యూటర్ లాబులోనో ఒక పిల్లవాడితో ప్రేమలో పడింది. ఆ కుర్రవాడు కూడా అమెరికా వెళ్ళే అర్హతలున్నవాడే.

కానీ అతని కుటుంబపరిస్థితులు అందుకు అనుకూలంగా లేవు. మధు తల్లిదండ్రులకా తమ కాబోయే అల్లుడు అమెరికా వెళ్లడం తప్పనిసరి.

మధు ప్రేమ జాడ ఏ మేరకో చూచాయగా వాళ్ళమ్మ పసిగట్టింది. అప్పటినుంచీ ఆమె కూతురిని వేధించడం మొదలుపెట్టింది. ఆ వేధింపు పైకి కనబడేది కాదు. విద్యాధికురాలూ, యూనివెర్సిటీ అధ్యాపకురాలూ కాబట్టి ఆమె తక్కిన తల్లుల్లాగా బయటికి బిగ్గరగా మాట్లాడదు. కానీ ఒక నిఘా వేసే ఉంటుంది. కూతురికి వచ్చే ఫోను కాల్సు మీదా, ఆమె కదలికల మీదా కెమేరా పెట్టినట్లు ఉంటుంది. ఆ ఉక్కిరిబిక్కిరి వాతావరణాన్ని భరించలేక, తన వేదన ఎవరికీ చెప్పుకోలేక మధురిమ కొన్నాళ్ళు నలిగిపోయింది.

ఆమెకి నా మీద గురి ఎందుకు కుదిరిందో, ఎప్పుడు కుదిరిందో గాని నాతో కలిసి మాట్లాడటానికి నెమ్మదిగా ఆసక్తి కనపరచడం మొదలుపెట్టింది.

ఆమె అప్పుడూ అప్పుడూ సందేహిస్తూనే తన ఆవేదనని నాతో పంచుకోవాలనే సంకేతాలివ్వడం చూసి నేనే ఒక రోజు అడిగాను ఆమెని. అప్పుడు చెప్పుకొచ్చింది. అంతా ఒక్కసారిగా కాదు, అప్పుడప్పుడు. తొలియవ్వనంలో అడుగుపెట్టిన ఒక యువతి తన ప్రేమానుభవాన్ని మొదటిసారిగా చెప్తున్నప్పుడు వినడం ఒక ప్రార్థనాసమావేశంలో కూచోడం లాంటిది. ఉదయపు వేళ వీచే గాలుల్లో ఉండే తాజాదనం, బలం, ఉత్సాహం ఉంటాయి ఆ అనుభవంలో.

ఆమె తన మిత్రుణ్ణి తొలిసారిగా ఎక్కడ చూసిందీ, అప్పుడతను వేసుకున్న చొక్కా రంగు దగ్గరినుంచీ, ప్రతి ఒక్క వివరాన్నీ వదలకుండా, ఏది చెప్పకపోయినా, ఎక్కడో ఏదో తప్పిపోతుందేమోనన్నంత ఆత్రుతతో, గాయని రాగాన్ని ఆలపించేటప్పుడు ఏ గమకాన్నీ ఎక్కడా తప్పిపోనివ్వకుండా స్వరప్రస్తారం చేసినట్టుగా ఆమె చెప్పుకొచ్చింది. నేనామె చెప్పేదంతా ఏదో ఒక మంచి కావ్యాన్ని విన్నట్టుగా విన్నానే గాని ఒక సమస్యని వింటున్నా ననుకోలేదు. ఆమెకి ఏదో ఒక పరిష్కారాన్ని వెంటనే చూపించి తీరవలసిన బాధ్యత నామీద ఉందనీ నేననుకోలేదు. ఆమె కూడా అటువంటి అభ్యర్థననేమీ చెయ్యలేదు.

'ఆంటీ! మీరు నా మాట విన్నట్టు లేదు. నేనడిగాను మీరు కూడా ఎవరినేనా ప్రేమించారా? లేక డాక్టరుగార్నే ప్రేమించారా?' మళ్ళీ అడిగింది మధురిమ.

చిరునవ్వు నవ్వేను. 'నీ ప్రశ్న నేను ముందే విన్నాను మధూ. కాని ఏమి చెప్పాలో, ఎలా చెప్పాలో తెలియక, ఆలోచనలో పడ్డాను. ఏమన్నావూ, ఎవర్నేనా ఎప్పుడేనా ప్రేమించేనా అని కదూ. నీ ప్రశ్న వినగానే ప్రేమ అంటే ఏమిటన్న పెద్ద సందేహంలో

పడిపోయాన్నేను. అయినా ఆ మాట వినగానే నాకేదో గుర్తొచ్చింది. బహుశా ఆ అనుభవానికీ, ప్రేమ అన్నమాటకీ ఏదో సంబంధం ఉండే ఉండాలి కాబోలు. లేకపోతే నువ్వు ఆ ప్రశ్న వెయ్యగానే ఆ అనుభవాలే ఎందుకు గుర్తు రావాలి నాకు?'

నిజమే. ఆ అనుభవాలే ఎందుకు గుర్తు రావాలి? అసలు ప్రేమంటే ఏమిటి? నాకే నవ్వొచ్చింది. జీవితం మూడువంతులు గడిచిపోయిన ఈ వేళ ఈ తరుణి నన్నెందుకీ ప్రశ్న ఎదట నిలబెడుతోంది? డాక్టరుకి చెప్తే నవ్వుతాడు. 'నీలో ఇంకా పసితనం పోలేదు విమలా' అంటాడు.

మధురిమని చూసాను. జీవితం ఇప్పుడిప్పుడే ఆమెలో రేకలు విప్పుకుంటోంది. నలభయ్యేళ్ళ కిందట నేను ఇలానే ఉండేదాన్ని. కళ్లు తెరిచే లోపునే కాలం దొర్లిపోయింది. అందుకు నాకు చింత లేదు. పశ్చాత్తాపం లేదు. కానీ ఒక బెంగ మటుకు మిగిలిపోయింది. గడిచిపోయిన బాల్యం ఇక ఎన్నటికీ తిరిగిరాదన్నప్పుడు కలిగే బెంగ, చిన్ననాటి స్నేహితులు ఇంక మళ్లీ కనిపించరన్నప్పుడు కలిగే బెంగ. తీయని బెంగ. తలపు మెదిలినప్పుడల్లా పువ్వు పొత్తిలిలో పొంచిన ముల్లులాగా మెత్తగా గుండెలో దిగబడే బెంగ.

'చెప్తాను మధురిమా. నీకెందుకో చాలా చెప్పుకోవాలని ఉంది. నా మనసు మడతల్లో మరుగున పడిన మొగలిరేకల్లాంటి, బొగడపూవుల్లాంటి జ్ఞాపకాలేవో నీకు చెప్పుకోవాలని ఉంది. అవి చెప్తే నా బరువేదో తీరుతుందని కాదు. నీలాంటి లేత హృదయం ఆ సంగతులు వింటే ఎంతో కొంత పరవశిస్తుందనీ, ఆ పారవశ్యం నీ నిర్మల ప్రేమానందాన్ని మరికొంత బలపరుస్తుందనీ చెప్తాను' అన్నాను.

దూరంగా బుద్ధశిల ఎండలో మెరుస్తూ వజ్రచ్ఛేదిక ప్రజ్ఞాపారమిత సూత్రలా ఉంది. ఒక తెరచాపబోటు నీలి జలఫలకం పైన తెల్లని బ్రష్షుతో గీతలు గీస్తూ సాగుతోంది. పచ్చికలో ఎండా తేమా ఆర్ద్రంగా స్పృశించుకుంటున్నాయి. మధురిమ చీర అంచు రెపరెప లాడుతోంది. దానిపైన ఆకుపచ్చని గీతల డిజైనుని కొంతసేపు చూస్తూండిపోయాను. ఆ కొద్ది క్షణాల్లో నా మనసు నలభైయ్యేళ్ళ కిందటి జ్ఞాపకాలమైదానాల్లోకి పరుగెత్తింది. ఎక్కణ్ణుంచి మొదలుపెట్టను? ఏ బిందువు నుంచి?

'మధూ, ప్రేమంటే ఏమిటో నీకు అర్థమయిందంటావా? నాకిన్నేళ్ళయినా అర్థం కాలేదు. నేనెవర్నీ ప్రేమించానని కూడా చెప్పలేను. నాకూ డాక్టర్‌కీ మధ్య ఉన్నది ప్రేమ అని నేననుకోను. డాక్టరు కూడా అనుకుంటాడనుకోను. మేమిద్దరం మంచి స్నేహితులం. పెళ్ళి మమ్మల్ని ఒక్కటి చేసినా ఆ తరువాత మమ్మల్ని కలిపి ఉంచుతున్నది స్నేహమే.

మాకు ఒకరితో ఒకరం కలిసి జీవించడం బావుంటుంది. నా మనసులో కలిగే తలపులన్నీ అతడికి చెప్పుకుంటాను. అతని భావాలన్నీ నాతో పంచుకుంటాడు. ఏ ఒక్కరోజైనా ఒకరి నొకరం ఏ కారణం వల్ల మిస్సైనా ఆ రోజంతా ఎంతో వెలితిగా, శూన్యంగా ఉంటుంది. కానీ దీన్ని ప్రేమ అనగలనా? అనలేననిపిస్తుంది. ప్రేమ, స్నేహం రెండు పదాలు అనుకుంటే, ఆ రెండింటికీ మధ్య పోలిక తెస్తే, ఏది ఎక్కువనో నేను తేల్చి చెప్పలేను. కాని స్నేహంలో అనంతమైన బాధ్యత ఉంటుంది. ప్రేమలో ఆ బాధ్యత ఉందా? లేక ప్రేమ ఈ లోకవ్యవహారంలో మనకు తెలిసిన పదాల ద్వారా తెలుసుకోగలిగే భావన కానే కాదా?'

'నా జీవితం చాలా వరకు నేను కోరుకున్నట్టుగానే నడిచింది. అలాగే మా తల్లిదండ్రులు కోరుకున్నట్టు కూడా. నా జీవితంలో నాకు లభించినవీ, నేను పొందినవీ, పొందలేనివీ కూడా నాకు ఏ మేరకో అర్థమయ్యాయనే అనాలి. అదెలాంటిది అంటే, నువ్వు ఓ ఇంటర్వ్యూకి వెళ్ళావనుకో. ఎంతోకొంతసేపు వెయిటు చేసిన తరువాత వాళ్ళు నిన్ను లోపలకి పిలిచి ప్రశ్నలు అడిగారనుకో.నువ్వు కొన్ని చెప్పగలుగుతావు. కొన్ని చెప్పలేకపోతావు. కొన్ని తప్పు చెప్పావని బయటికి వచ్చాక గ్రహిస్తావు. ఆ ఇంటర్వ్యూలో నువ్వు సెలక్టు కాలేదనుకో. ఓ క్షణం బాధపడతావు. ఎంపిక అయ్యావనుకో. సంతోషిస్తావు. కాని నిజంగా ఆ ప్రక్రియ అంతా నీకేమి అర్థమయ్యిందని? అయినా అందులో నీ భాగస్వామ్యం ఉందని నువ్వూ, ఆ ఇంటర్వ్యూ బోర్డూ కూడా అంగీకరిస్తారు కాబట్టి అదంతా నీకు అర్థమయినట్టే భావిస్తావు. కాని అదే నీ ప్రమేయమేమీ లేకుండానే నీకో ప్రశంస లభించింది అనుకో, లేదా నువ్వో నింద మోయవలసి వచ్చిందనుకో. అప్పుడు? దాన్ని అదృష్టమని కానీ, దురదృష్టమని గానీ అనడం కన్నా చెయ్యగలిగింది ఏమన్నా ఉంటుందా?

మధురిమా, జీవితంలో మనం ఒక ఇంటర్వ్యూకి వెళ్ళడం లాగా మన పూర్తి ప్రమేయంతోనూ, ఒక యాక్సిడెంటు లాగా మనం బాధ్యతేమీ లేకుండానూ జరిగే అనుభవాలు కూడా కొన్నుంటాయి. వాటిని మనం అదృష్టమనీ అనలేం, మన దురదృష్టమనీ అనలేం. బహుశా ప్రేమానుభవం అటువంటిదే అనుకుంటాను. కానీ ఒక్కటి మాత్రం చెప్పగలను. ప్రేమానుభవానికొక్కదానికే మన నిజస్వరూపాన్ని మనకు తెలియచేసే శక్తి ఉందనుకుంటాను. ఎవరి జీవితంలో ప్రేమ సంభవిస్తుందో వారి జీవితానుభవంలో మరేది సంభవించకపోయినా పర్వాలేదనుకుంటాను. 'ప్రేమ కలుగక బతుకు చీకటి' అని ఒక కవి అన్నాడని ఎవరో చెప్పగా విన్నాను.అక్కడ చీకటంటే వారి జీవితంలో మరేదీ లేదని

కాదు, ఏదీ కనిపించదనీ కాదు. అలాగని సూర్యుడు లేకపోవడమనీ కాదు. కాని చంద్రుడు కూడా లేకపోవడం అది. ఊహించు. చంద్రుడు లేకపోవడం. ఎట్లా ఉంటుందది? పుట్టినప్పటినుంచీ ఒక్కసారేనా చంద్రుడుండే రాత్రిని చూడని అనుభవం?

కానీ నా జీవితంలో ఆ చంద్రుడు వెలిగిన రాత్రులు ఒక్కటి కాదు, ఎన్నో ఉన్నాయి. అవి నా జీవితంలో సంభవించడానికి నా ప్రమేయమేమీ లేదు. వెన్నెల కాయడానికీ, చంద్రుడు హంసలాగా ఆకాశంలో తిరుగాడటానికీ నా ప్రమేయముంటుందా? చెప్పు. ఆ వెన్నెల నా మీద వర్షించడానికి నా ప్రయత్నమేముంటుంది? అది నా అదృష్టమో, దురదృష్టమో నేనింతదాకా నిర్ణయించుకోలేకపోయాను. కానీ ఆ వెన్నెల రాత్రులు మాత్రం నా ఆత్మనంటిపెట్టుకునే ఉన్నాయి. ఆ రాత్రుల గురించే నేనిప్పుడు నీకు చెప్పాలను కుంటున్నది, వింటావా?

మా నాన్న వి-లో పెద్ద ట్రాన్సుపోర్టు కంపెనీలో పనిచేస్తుండేవాడు. సరుకులు చేరవేసే వ్యవహారాలు అజమాయిషీ చేస్తుండేవాడు. అందుకని నెలలో ఇరవై రోజులకు పైగా ఊరికి బయటే గడపవలసి వచ్చేది. ఇంట్లో మేము ముగ్గురం పిల్లలం. నా చెల్లెలు రజని, తమ్ముడు ప్రశాంత్. మా అమ్మే మా పనులన్నీ చూస్తుండేది. మా ఇంట్లో మా కుటుంబం మాలో మేమే ఒక ప్రపంచంగా జీవించేవాళ్లం. మాకు ఎవ్వరికీ ఏ లోటూ లేకుండా ఉండాలని మా అమ్మా నాన్నా తపనపడుతుండేవారు. మా ముగ్గురు పిల్లలకీ ఎవరి వస్తువులు వాళ్ళకి సబ్బూ తువ్వాలూ దగ్గర్నుంచి కూడా ఏర్పాటు చేసి వుంచేవారు, దేనికోసమైనా వెతుక్కునే అవసరం గానీ, లేదన్న భావన గానీ లేకుండా. మా నాన్న ఊళ్ళో ఉన్నప్పుడు నెలకి రెండు సార్లు అందరినీ సినిమాకి తీసుకువెళ్ళేవాడు. మా ఇల్లు కాక బయటి జీవితం గానీ, స్నేహాలుగానీ, కనీసం పరిచయాలు గానీ మాకు తెలియదు. నా బాల్యమంతా, అలాగే నా విద్యార్థి జీవితం కూడా ఒక టైమ్ టేబులు కి అనుగుణంగా నడిచిపోయిందనే చెప్పాలి.

నీ చిన్నప్పుడు నీ జీవితంలో ఏ అలవాట్లు బలంగా ఉంటే నీ తక్కిన జీవితమంతా కూడా అవే బలంగా ఉండి నడిపిస్తాయి. అంటే పైకి స్పష్టంగా తెలియకపోయినా వాటి ప్రభావం నీ ప్రతి ముఖ్యనిర్ణయంలో ఉండి తీరుతుంది. బహుశా నా జీవితం దాదాపు అరవయ్యేళ్ళుగానూ కూడా ఆ ప్రకారమే నడిచిందనాలి. మధ్యలో ఆ ఎనిమిది నెలలూ తప్ప. కాని ఆ ఎనిమిదినెలలూ నా జీవితంలో అలా గడవకపోయుంటే నేను ఇప్పుడున్నట్టుగా ఉండి ఉండేదాన్నా? నీ ప్రశ్నని అర్థం చేసుకోవాలనుకునేదాన్నా?

నేను అప్పుడే నా గ్రాడ్యుయేషను పూర్తి చేసి ఉన్నాను. సైన్సులో ముఖ్యంగా బోటనీతో డిగ్రీ తీసుకుంటే ఏమి భవిష్యత్తు ఉంటుందో నాకు ఇప్పటికీ తెలియదు. అసలు నేను బోటనీ ఎందుకు ఎంపిక చేసుకున్నానో కూడా నాకు తెలియదు. బహుశా మా గర్ల్స్ హై స్కూల్లో బయాలజీ చెప్పే మేడం నాకు ఇష్టమైనందువల్లనా? అదే చిత్రం. ఆమె పట్ల ఇష్టానికే నేను ఇంటరులో బి.పి.సి తీసుకున్నా, బోటనీలో బి.ఎస్.సి చదివినా మళ్ళీ అటువంటి మేడం నాకెప్పుడూ తారసపడలేదు. ఇప్పుడాలోచిస్తే అనిపిస్తోంది. బహుశా ఆ ఎనిమిదినెలల అనుభవాల కోసమే నేనా చదువు చదివానేమో అని.

నా గ్రాడ్యుయేషను పూర్తయింది. రిజల్ట్సు కూడా వచ్చాయి. నాకు ఫస్ట్ క్లాసు వచ్చింది. నాకు ఎం.ఎస్.సిలో చేరాలని ఉంది. కానీ నాన్న ఆలోచనలు వేరే ఉన్నాయి. ఏదన్నా సంబంధం కుదిరితే పెళ్ళి చేసేయాలన్న ఆలోచనలో ఉన్నాడు. నా బాధ్యత తీరితే రజనిపైనా ప్రశాంత్ పైనా దృష్టి పెట్టొచ్చని ఆయన ఉద్దేశ్యం అయి ఉండొచ్చు.

నాన్న నన్ను యూనివెర్సిటీలో జాయిను చెయ్యడానికి ఉత్సాహం చూపకపోవడంతో నేను కూడా ఏమీ చెయ్యలేక రెండుమూడు నెలలు ఇంట్లోనే గడిపేసాను. రజని ఇంగ్లిషు లిటరేచరులో బి.ఏ చేస్తూంది అప్పుడు. తమ్ముడిని నాన్న ఇంటరు లో సైన్సులో జాయిను చేసాడు. వాణ్ణి ఇంజనీరింగు చదివించాలని ఆయన కోరిక.

రోజులట్లానే గడిచి ఉండేవేమోగాని అనుకోకుండా చిన్న మలుపు తిరిగింది నా జీవితం అప్పుడు. ప్రొఫెసరు సేన్‌గుప్తా అని కలకత్తా యూనివెర్సిటీలో జియాలజి హెడ్ ఆఫ్ ద డిపార్ట్ మెంటు, ఈస్టరన్ ఘాట్సు మీద పరిశోధనకు, ఒక ప్రాజెక్టు తీసుకున్నాడు. అదొక మల్టీ డిసిప్లినరీ స్టడీ. అందులో జియాలజి, బోటని, యాంత్రొపాలజీకి చెందిన విద్యార్థులు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా అవసరమయ్యారు. మా బోటనీ లెక్చరరుకి ఆయన బాగా మిత్రుడు. ఈయన డాక్టరల్ థీసిసుకి ఆయన ఎక్సర్టనల్ ఇవేల్యుయేటరుగా ఉన్నారట. అప్పటినుంచీ వారిద్దరి మధ్యా స్నేహం. ఆ ప్రొఫెసర్ ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లని కలకత్తా నుంచి తేలేడు కదా. అదీకాక ఫీల్డులో పనిచెయ్యాలంటే స్థానికులైతేనే ఎక్కువ వీలు. అందుకని ఎవరేనా విద్యార్థులు తనకి సహకరిస్తారేమోనని ఆయన మా లెక్చెరరుని అడిగాడట. మా లెక్చరరు బోటనీ విభాగంలో నా పేరు సూచించాడు. మా నాన్న మొదట్లో ఒప్పుకోలేదు. ఊరు దాటి ఇల్లు దాటి నేనెప్పుడూ బయటికి వెళ్ళింది లేదు. నన్ను వదిలి ఉండటం మా వాళ్ళకిగాని, వాళ్ళని వదిలి ఉండటం నాకు గాని ఎన్నడూ అనుభవానికి రాని విషయం. కానీ మా లెక్చెరరు సరాసరి మా ఇంటికి వచ్చి నాన్నతో మాట్లాడి ఒప్పించడంతో నాన్న కాదనలేకపోయాడు.

మా నాన్న కాదనలేకపోవడానికి ముఖ్యమైన కారణం మరొకటి కూడా ఉంది. ప్రొఫెసరుగారి కూడా ఆయన కలకత్తా విద్యార్థిని వనలతా సేన్‌గుప్తా కూడా ఆ ఫీల్డువర్కుకి రాబోతున్నది. వనలత ప్రొఫెసరుగారి అన్నగారి కూతురు. ఆమె జియాలజీలో డాక్టరేటు చేస్తోంది. ప్రొఫెసర్‌కి జియాలజీలో తీరని జీవితాశయాల్ని ఆమె ద్వారా సాధించాలని పట్టుదలట. ఆ వయసుకే ఆమె ఎన్నో సెమినార్లలో పాల్గొందిట. ఆమె కూడా ఆ ఈస్టరన్ ఘాట్సు ప్రాజెక్టులో సహపరిశోధకురాలు. పెళ్ళి కాని మరొక అమ్మాయి, అదీ ప్రొఫెసరు గారికి స్వయానా అన్నకూతురు ఆ ప్రాజెక్టులో ఉందని తెలియడంతో నన్ను ఫీల్డువర్కుకి పంపడం గురించి నాన్న ఇంక పెద్దగా ఆలోచించలేదు.

ఈ రోజు మీరు ప్రపంచంలో ఎక్కడికేనా సాహసంగా వెళ్ళిపోగలుగుతున్నారు. పెద్ద చదువులు చదువుకోడానికి అమెరికా, ఆస్ట్రేలియా– ఎక్కడికన్నా భయం లేకుండా వెళ్ళిపోగలుగుతున్నారు. మీ తల్లిదండ్రులు కూడా మరో ఆలోచనలేకుండా మిమ్మల్ని పంపగలుగుతున్నారు. పంపగలగడమే కాదు, మీరు విదేశాలకు వెళ్లి తీరాలని కలలు కంటున్నారు కూడా.. కాని నలభయ్యేళ్ళ కింద ఇది ఊహకి కూడా అందని విషయం. ఒక ఆడపిల్ల ఒక రాత్రి రైలు ప్రయాణం చెయ్యవలసి వస్తే కూడా తండ్రినో, అన్ననో, తమ్ముడో ఎవరో ఒకరు వెంటలేకుండా ప్రయాణం చెయ్యడం ఊహకి కూడా అందని విషయం. అలాంటిది ఎక్కడో మా ఊరికి అయిదారువందల కిలోమీటర్ల దూరంలో అడవిలో నన్ను అన్ని నెలలపాటు ఇంటికి దూరంగా మా నాన్న ఎలా ఉండనిచ్చాడో ఇప్పుడు తలుచుకుంటే చాలా ఆశ్చర్యంగానూ, నమ్మశక్యం కాకుండానూ ఉంది.

ఊహించు. మొబైలుఫోన్లూ, వాట్సపులూ, ఈ–మెయిళ్ళూ లేని కాలం. ఇప్పుడు గ్లోబుకి అవతల ఉన్నవాళ్ళు కూడా ఒకరినొకరు చూసుకుంటూ ఇక్కడున్నవాళ్ళతో వీడియో కాలు చేసుకోగలిగే రోజులు. అప్పట్లో ఒక ట్రంకాలు అంటేనే ఒక రోజంతా పట్టేది. పొద్దున్న బుక్ చేస్తే ఒక్కొక్కసారి సాయంకాలానికిగాని కాల్ కనెక్టయ్యేదికాదు. ఒకసారి కాల్ బుక్ చేస్తే చేసినప్పణ్ణుంచీ అక్కడే ఎదురుచూస్తూ గడపాల్సి వుండేది.

ఎవరికేనా ఉత్తరం రాస్తే, వాళ్ళు వెంటనే జవాబు రాసినా కూడా వాళ్ళేం రాసారో తెలియడానికి కనీసం వారం రోజులేనా పట్టేది. ఇప్పట్లాగా చాట్ లోనో, మెసెంజరులోనో, వాట్సపులోనో ఇలా సందేశం పంపగానే అలా జవాబు వచ్చే కాలం కాదు. అసలు ఇలాంటి కాలమంటూ ఒకటి వస్తుందనిగాని, రాగలదని గాని మాకు ఆ రోజుల్లో ఊహకి కూడా లేదు.

అలాంటి రోజుల నాటి అనుభవాల గురించి నీతో మాట్లాడాలి అనుకోగానే ముందు నీకూ నాకూ మధ్య యోజనాల దూరం ఉందనిపిస్తోంది–'

అని ఆగాను. ఎందుకంటే మధురిమ దృష్టి నా మాటల మీద లేదు. ఆమె మొబైలు స్క్రీన్ పదే పదే బ్లింకు అవుతుండటం నాకు తెలుస్తూనే ఉంది.

ఆమె మెసేజిలు చూసుకుంటూ ఉంది.

నేను మాట్లాడటం ఆపినట్టు క్షణం తర్వాత ఆమెకి స్ఫురించగానే మొబైలు మీంచి చూపులు నా వైపు తిప్పి–

'మమ్మీ నుంచి మెసేజిలు ఆంటీ. ఇందాకటినుంచి. ఎక్కడున్నావు, ఏం చేస్తున్నావు, వెంటనే ఇంటికి రా అంటో. మీతో కలిసి బయటకి వచ్చాను అని రిప్లై ఇచ్చాను గాని, వినడం లేదు' అంది.

మొదటిసారిగా ఆ అమ్మాయి మాటలు నాకు పూర్తిగా నమ్మాలనిపించలేదు. ఆమె తల్లినుంచి మెసేజిలు వస్తూండవచ్చుగాని, ఆమె దృష్టిని పక్కకు తప్పించే శక్తి ఆ మెసేజిలకు లేదని నేనూహించగలను.

'సరే, మధూ, బయల్దేరదాం. కాబ్ బుక్ చెయ్యి' అన్నాను.

నిజానికి ఆమె నన్ను నువ్వెవరినైనా ప్రేమించావా అని అడిగినప్పుడు నా నుంచి ఆశించిన సమాధానం అవును లేదా కాదు అని మాత్రమే అని నాకు తట్టింది. నేను అవుననో, కాదనో ఏదో ఒకటి సూటిగా చెప్పకుండా ఏవేవో జ్ఞాపకాల్ని నెమరెయ్యడం మొదలుపెట్టాక ఆమెకి ఆసక్తి ఎలా ఉంటుంది? కానీ, నిజంగా, ఎవరేనా, తాము ఎవరో ఒకరిని ప్రేమించామనో, ప్రేమించలేదనో చెప్పగలిగితే వాళ్ళకన్నా అదృష్టవంతులు మరొకరు ఉండరేమో!

'ఆంటీ, ఓలా టు మినిట్స్ డిస్టన్సులో ఉంది' అంది మధురిమ.

మేము రోడ్డు వైపు కదిలాం.

❋

2

ఇంటికి తిరిగి వచ్చేసిన చాలా సేపటిదాకా మధురిమ అడిగిన ప్రశ్న నన్ను వెంటాడుతూనే ఉంది. ఇదే ప్రశ్న పాతికేళ్ళ కిందటనో, ఇరవయ్యేళ్ళ కిందటనో, కనీసం పదేళ్ళ కిందటనో అడిగి ఉంటే ఏమి జవాబు చెప్పి ఉండేదాన్నో తెలియదు. కాని ఇప్పుడు అరవయ్యేళ్ళ వయసులో ఈ ప్రశ్న నాకు కొత్తగా అనిపించడమే కాక, నాలోపల్లోపలి అస్తిత్వాన్నే తాకినట్టనిపించింది.

నేను చెప్పాలనుకున్నవాటిని వినడం మీద మధురిమకి బహుశా ఇంక ఆసక్తి ఉంటుందనుకోను. ఆమెనేకాదు, అసలు ఏ శ్రోతకీ ఆసక్తి ఉంటుందనుకోను. ఆమె బహుశా నన్ను మళ్లా ఈ ప్రశ్న అడుగుతుందని కూడా నేను అనుకోవడం లేదు. ఒకవేళ ఆమెకి నా జ్ఞాపకాలు చెప్పినా కూడా అవి ఆమెకి ఏ మాత్రం దారిచూపిస్తాయి? ఆమెకి వాటిలో ఎటువంటి స్ఫూర్తి దొరుకుతుంది?

మధురిమనో, మరొక శ్రోతనో పక్కనపెట్టి అసలు అన్నిటికన్నా ముందు నాతో నేనే ఈ జ్ఞాపకాల్ని పంచుకుందామనిపించింది.

జ్ఞాపకాలు చిత్రమైనవి. అవి నిశ్చలంగానూ, స్థిరంగానూ ఉంటాయనుకుంటామా, కాదు. అవి కూడా మనతో పాటే ప్రయాణిస్తూ ఉంటాయి, ఎదుగుతూ ఉంటాయి. జీవితం ప్రతి మలుపులోనూ మనం కొత్త అనుభవాలకు లోనైనప్పుడల్లా అవి కూడా మనతో పాటు మారతాయి. అవి చాలా సజీవాలు. వాటికంటూ ఒక ప్రత్యేకమైన అస్తిత్వం, జీవితం ఉంటాయనిపిస్తుంది.

జ్ఞాపకాలు సగంలో ఆగిపోయిన కలలన్నాడు ఒక కవి. అతనికి అలా ఎందుకనిపించిందో ఊహించగలను. అతను బహుశా జీవితంలో ఏదో ముఖ్యమైన దశలో నిల్చున్నప్పుడు, ఏదో ఒక వైపు ప్రయాణం మళ్లా మొదలుపెట్టవలసి వచ్చినప్పుడు, అతడి జ్ఞాపకాలు కూడా మధ్యలో ఆగిపోయి ఉంటాయి. నీ జీవితగమనంలో నువ్వొక నిశ్చల బిందువుకు చేరుకున్నప్పుడు, మరొక కొత్త ప్రయాణమేదీ ఇప్పట్లో మొదలు పెట్టవలసిన అవసరం కనబడనప్పుడు నీ జ్ఞాపకాలు కూడా నిశ్చలంగానూ, మళ్ళీ మళ్ళీ తలుచుకో దగ్గవిగానూ అనిపించడంలో ఆశ్చర్యం లేదు. లేదా ఇదిగో ఇలా ఎవరో నిన్నొకసారి పట్టి గుంజినప్పుడు, నీలోపలి జ్ఞాపకాలు కూడా కదిలి నీ బాహ్యజీవితం కూడా పెద్ద కుదుపుకి లోనవ్వచ్చు కూడా.

ఈ రోజు నాకు జరిగింది అదే. నువ్వెవరినైనా ప్రేమించావా అని మధురిమ అడిగి నప్పుడు ప్రేమించలేదని చెప్పవచ్చు. సూటిగా. ఎందుకంటే నేనెవరితోనూ ప్రేమలో పడలేదు, ఏ వయసులోనూ, జీవితపు ఏ మలుపులోనూ కూడా. కాని అలా ఎందుకు చెప్పలేక పోయాను? ఆమె ఆ ప్రశ్న అడగ్గానే ఏదో పురాతనమేఘం నామీంచి పయనించినట్టుగా, ఏ దూరతీరాలనుంచో ఏదో పాట వినబడ్డట్టుగా, ఏ నదీప్రవాహమ్మీంచో ఎక్కడివో పూలు తేలుకుంటూ వచ్చినట్టుగా ఒకప్పటి నా జ్ఞాపకాలు నాకెందుకు గుర్తొచ్చాయి? నన్నెందుకు ఉక్కిరిబిక్కిరి చేసాయి?

ఇప్పుడు మధురిమకోసం కాదు, నా కోసం నేనే ఆ జ్ఞాపకాల్లోకి అడుగు పెట్టాలను కుంటున్నాను. అదొక మంత్రలోకం. చెట్లు మాట్లాడినరోజులు. కొండలు నీ దగ్గరికి నడిచి వచ్చిన రోజులు. ఆకాశం నీ కోసం ఆగి నిలబడ్డ రోజులు. నువ్వు ఇంటికి చేరుకునేటప్పటికి ప్రతి రాత్రీ చంద్రుడు కూడా నీకోసం నడిచి వచ్చిన రోజులు.

ఆ రోజులూ, ఆ రాత్రులూ గుర్తురాగానే తొలివేసవి రాత్రుల రాధామనోహరాల పూలగాలి, ఆ బార్చెట్లు, ఆ వార్ఝర్లు, హేమంతకాలపు ఆ పంటకోతలు, ఆ ఎడ్ల బళ్ళు, ఆ పండగలు, ఆ అడవిదారులు, ఆ గిరిజనులు, ఆ ప్రాచీనశిలలు, ఆ ఆకురాలే అడవులు, ఆ చెట్లు, ఆ ఎండుటాకుల చప్పుడు, ఆ తొలివసంత మధురిమ– అవన్నీ నన్ను ముంచెత్తు తున్నాయి. తొలివానలు పడగానే నేలలో విత్తనాల కలవరింతల్లాగా నాలో ఏ నాటివో అనుభవాలు, ఇన్నాళ్ళూ నిద్రాణంగా ఉండిపోయినవి ప్రాణంతో కదలాడుతున్నాయి. ఆ పాటలు, ఆ కవితలు, ఆ నవ్వులు, ఆ ఆటలు, ఆ సాయంకాలపు నడకలు, రాత్రి పొడుగునా భూమ్మీద గంధపుపొడిలాగా రాలే వెన్నెల, అపరాహ్ణాలవేళ అడవిలోనూ, ఊళ్ళోనూ కూడా ఆవరించే నిశ్శబ్దం, ఆ ఏరు, ఆ నీటిగలగల, ఆ యూకలిప్టసు తోటలు, ఆ

టేకుచెట్ల అడవి, ఆ కోవిదారపుష్పాలు, ఆ నాటకాల రిహార్సళ్ళు– ఒక పూలబండిలాగా వీటన్నిటినీ నిండా నింపుకుని అప్పటి జీవితం నా ఇంటిముందు వచ్చి ఆగినట్టుగా ఉంది.

జ్ఞాపకాల్లో మరో విశేషముందని కూడా తెలుస్తోంది. అవి మన అనుభవాల్ని యథాతథంగా మనకి తిరిగి గుర్తుచేస్తున్నట్టే ఉంటాయిగాని, వాటిలో మరెన్నో జ్ఞాపకాలు కలగలిసిపోయి ఉంటాయి. నది ప్రవహించిన ప్రతి ప్రదేశంలోంచీ కొంత కొత్తమట్టిని పోగేసుకుని ముందుకు ప్రవహించేట్టు, మన జ్ఞాపకాలు కూడా ఆ తర్వాతి జీవితపు అనుభవాలనుంచి కూడా కొంత కాంతినీ, కొంత చీకటినీ, కొంత సుగంధాన్నీ, కొంత మరపునీ, వెరపునీ కూడా తమలో కలుపుకుంటాయి. చాలాసార్లు అవి అప్పటి రోజుల్నే గుర్తు చేస్తున్నట్టుంటాయిగాని, వాటి ఉద్దేశ్యాలు మారిపోయి ఉంటాయి, అవి మనకి అందిస్తున్న సందేశాలు కూడా మనం ఎదురుచూస్తున్నట్టుగా మనకి ఎదురుకావు.

ప్రతి జ్ఞాపకం కూడా ఒక కథ. అందులో కొంత కల్పన ఉంటుంది. కొన్ని కలలు ఉంటాయి. నెరవేరినవీ, నెరవేరనవీ కూడా. నువ్వొక జ్ఞాపకాన్ని తలుచుకుంటున్నావంటేనే బహుశా నీలో మళ్ళా కొత్త కల ఏదో మొగ్గ తొడుగుతున్నదని అర్థం. అందుకనే ఏమో జ్ఞాపకాలు సగంలో ఆగిపోయిన కలలు అన్నాడు ఆ కవి.

నేను ఈస్టరన్ ఘాట్సు మీద ఫీల్డువర్కు కోసం వెళ్ళాలని నిశ్చయించుకున్నాక దసరా వెళ్ళేదాకా ఆగవలసి వచ్చింది. సాధారణంగా ఫీల్డువర్కు సీజను నవంబరునుంచి మొదలై ఆరేడునెలలపాటు మార్చి, ఏప్రిల్ నెలలదాకా సాగుతుంది. వానాకాలం పూర్తయి, వేసవి ఎండలు ఇంకా ముదరకముందే ఫీల్డులో చెయ్యాలనుకున్న అధ్యయనం పూర్తిచేసు కునేట్టుగా ప్లాను చేసుకుంటూ ఉంటారు. ఆ వచ్చేవాళ్ళు కలకత్తా నుంచి వస్తున్నారు కాబట్టి పూజాసెలవులు అయ్యాక వాళ్ళు వస్తామని ఉత్తరం రాసారు. తాము స్టడీ చేయబోతున్న ప్రాంతంలో బేస్‌కాంపు ఒక గ్రామంలో ఏర్పాటు చేసుకుంటున్నామనీ, తాము వచ్చేలోపే నేను వెళ్ళి అక్కడ ఉండగలిగితే మంచిదని కూడా ప్రొఫెసరు ఉత్తరం రాసాడు. ఆ గ్రామం విశాఖపట్టణం, తూర్పుగోదావరి జిల్లాల సరిహద్దులో, మన్య ప్రాంతంలో ఒక ఊరు. నేనెప్పుడూ అటవీ ప్రాంతానికి వెళ్ళినదాన్ని కాదనీ, అసలు ఏ పల్లెటూళ్ళో కూడా ఎప్పుడూ ఒక్కరోజు కూడా ఉండలేదనీ మా నాన్న ఆయనకు ఉత్తరం రాసిన మీదట ప్రొఫెసరు ఆ సలహా ఇచ్చాడు. చదువుకునేటప్పుడు బొటానికలు టూర్సుకి వెళ్ళకపోలేదుగానీ, అవి దాదాపుగా పిక్‌నిక్ లానే గడిచాయి. చదువుకునే రోజుల్లో చదువు మీద ధ్యాస నిజంగా ఎక్కడ ఉంటుంది గనక!

విజయదశమి వెళ్ళిన మర్నాడు మేము ఆ ఊరికి ప్రయాణమయ్యాం. నాన్నా నేనూ రైలు మీద ముందు విశాఖపట్టణం వెళ్ళాం. అక్కణ్ణుంచి బస్సు పట్టుకుని నర్సీపట్నం వెళ్ళాం. నర్సీపట్నం నుంచి బస్సు ఒక పట్టాన దొరకలేదు. అక్కడే ముఖం కడుక్కుని ఇడ్లీ తిన్నాం, కాఫీ తాగాం. మేము ఎక్కవలసిన బస్సు దొరికి ఆ ఊరు చేరుకునేసరికి మధ్యాహ్నం రెండుదాటింది. మాకు దారి తెలియక చుట్టు తిరిగి వచ్చామనీ, రాజమండ్రి నుంచి నేరుగా రావచ్చని తర్వాత చెప్పారు. కాని ఆ ఊళ్ళూ, ఆ దారులూ నేను మొదటిసారి ప్రయాణిస్తున్నవి కావడంతో కళ్ళప్పగించి చూస్తూ ఉండిపోయాను. ఇంటికి దూరంగా వెళ్తున్నాననీ, అమ్మకి, తమ్ముడికీ, చెల్లెలికీ కొన్నాళ్ళు దూరంగా ఉండవలసి ఉంటుందనీ నాకు గుర్తేలేదు.

నేననుకుంటాను– తొలిసారి చూసే ప్రతి లాండ్ స్కేప్ మనకి మళ్ళా ఈ ప్రపంచంలో కొత్తగా పుట్టిన అనుభవం లాంటిదని. అది మనకి కొత్త నేత్రాల్నీ, కొత్త వీనుల్నీ అందిస్తుంది. అన్నిటికన్నా ముఖ్యం అలవాటుగా మారిపోయిన జీవితచక్రాన్ని అది బద్దలుగొడుతుంది. లేకపోతే నువ్వెన్నేళ్ళు జీవించు, అదే వీథి, అదే దారి, అవే ముఖాలు– నిండుగా జీవించిన క్షణాల్ని నీకు ఎప్పటికీ ప్రసాదించలేవు.

మాకు ఆ ఊళ్ళో ఒక ఫారెస్టు ఆఫీసరు పేరు చెప్పి ఆయన్ని కలవమని ప్రొఫెసరు రాసాడు. మేము ప్రయాణం మొదలుపెట్టేముందే నాన్న ఆ ఫారెస్టు ఆఫీసరుకి టెలిగ్రాం ఇచ్చాడు. మేము ఆ ఊళ్ళో దిగగానే ఆ ఫారెస్టు ఆఫీసరు ఇల్లు కనుక్కోడం ఏమంత కష్టం కాలేదు. ఆ ఊరు చాలా చిన్న ఊరు. ఆరేడువందల మించి జనాభా ఉండదు. మొత్తం కలిపి వందా నూటయాభై ఇళ్ళుంటాయి. ఆ ఊరుని ఆనుకుని కొండలు. ఒక రకంగా దాన్ని కొండకింద పల్లె అని చెప్పవచ్చు. ఆ ఊరి చివర, కొండపక్కన, మామిడిచెట్ల తోపు వెనక ఆ ఫారెస్టు ఆఫీసరు ఇల్లు. మేము వెళ్ళేటప్పటికి ఆయన ఇంట్లో లేడు. కాని మేము వస్తామని ఇంట్లో ముందే చెప్పి వెళ్ళాడు. మా కోసం ఏర్పాట్లు కూడా చేసి వెళ్లాడు.

ఆ ఫారెస్టు ఆఫీసరు ఇల్లు చిన్న పొదరిల్లులాగా ఉంది. ఇంటిచుట్టూ కంచె. ఇల్లొక కుటీరంలాగా ఉంది. కోపురు గడ్డి కప్పు. ఇంటి ఆవరణలో రకరకాల చెట్లు ఉన్నాయి. కంచె వారగా టేకు చెట్లు ఉన్నాయి. వాటిని చూస్తే అయిదారేళ్ళ వయసుకన్నా మించి లేవనిపించింది. బహుశా ఆ ఆఫీసరు ఆ కుటీరం కట్టుకుని కూడా అయిదారేళ్ళకు మించి ఉండదనిపించింది. ఆ అవరణలో నిమ్మ, నారింజ, బొప్పాయి, ఉసిరి లాంటి మొక్కలున్నాయి. ఇంటిముందు ఆవరణలో పూలమొక్కలున్నాయి. ఇంట్లోకి అడుగుపెట్టే

గేటుదగ్గర వెదురుతడికతో అల్లిన ఆర్చిమీదుగా మాధవీలత తీగ పాకించి ఉంది. ఆ ఇల్లు పరిమళాలు మూటగట్టిపెట్టిన పెట్టెలాగా ఉంది.

మేము ఇంట్లో అడుగుపెట్టగానే ఆ ఫారెస్టు ఆఫీసరుగారి శ్రీమతి, తనని గ్రేస్ అని పరిచయం చేసుకుంటూ, మమ్మల్ని సాదరంగా స్వాగతించింది. సాధారణంగా అలాంటి సమయాల్లో అడిగే ప్రశ్నలు, ప్రయాణం బాగా జరిగిందా లాంటివి పూర్తయ్యాక, ఆమె మా స్నానానికి ఏర్పాట్లు చేసింది. మా స్నానాలు, భోజనాలు అయ్యేటప్పటికి ఆ ఫారెస్టరు గారు కూడా వచ్చాడు. ఆయన పేరు జోసెఫ్. నలభై నలభై అయిదేళ్ళ వయసు ఉండవచ్చు. మనిషి, ఎత్తరి, విశాలమైన నుదురు, కొనదేలిన ముక్కు, గంభీరమైన రూపం. ఆయన వస్తూనే ముందు అన్నమాట 'వెల్ కమ్ టు అవర్ ఫారెస్ట్' అని.

ఆ మాట వినగానే నాకేదో గమ్మత్తుగా అనిపించింది. 'మా ఇంటికి స్వాగతం అనవచ్చు, లేదా వెల్కమ్ టు మై ఫారెస్ట్' అనవచ్చు. అది ఆయన అడవి. కాని అవర్ ఫారెస్ట్ అన్నాడే, ఆ మాట గుర్తొస్తే, ఇప్పటికీ నాలో ఒక పులకింత కలక్కుండా ఉండదు.

మన అడవి.

పుట్టి బుద్ధెరిగాక నేనెప్పుడూ ఏ అడవిలోనూ వెళ్ళి ఉన్నది లేదు. వెళ్ళి ఉంటానని కూడా అనుకోలేదు. అలాంటిది ఒక అడవి నాదవుతుందనే ఊహనే నాలో ఏదో సున్నితమైన తీగల్ని మీటింది.

జోసెఫ్‌గారు నేను అక్కడున్నన్నాళ్ళూ ఒక కుటుంబానికి అతిథిగా ఉండటానికి వాళ్ళతో మాట్లాడిపెట్టాడు. సాయంకాలం మమ్మల్ని వాళ్ళింటికి తీసుకువెళ్ళాడు. ఆ ఇంటిపెద్ద సూర్యనారాయణమూర్తి ఉపాధ్యాయుడు. ఆయన ఆ ఊళ్ళో స్కూల్లో కాకుండా ఆ లోపల నాలుగైదుకిలోమీటర్ల దూరంలో ఉండే మరో ఊళ్ళో పంచాయతీసమితి స్కూల్లో పనిచేస్తుంటాడు. రోజూ సైకిలు మీద ఆ స్కూలుకి వెళ్లి వస్తుంటాడు.

ఆయన శ్రీమతి రామలక్ష్మి, ఆయన ఆమెని రమా అని పిలుస్తుండేవాడు, పెద్దగా చదువుకున్నది కాదు. బహుశా ఒకప్పటి చాలామంది స్త్రీలలానే ఆమె చదువుకూడా అయిదో తరగతితో ఆగిపోయి ఉంటుంది. కాని సౌమ్యురాలు. నిష్కారణంగా ప్రేమించగల శక్తిగలది. కాబట్టే ఆ ఇంట్లో నేను అన్ని నెలలు ఉండగలిగాను. వాళ్ళకిద్దరు పిల్లలు. వాళ్ళ పేర్లు ఏవో ఉన్నాయిగాని వాళ్ళిద్దర్నీ పెద్దమ్మాయి, చిన్నమ్మాయి అనే పిలిచేవారు. నాక్కూడా వాళ్ళు అలాగే గుర్తుండిపోయారు.

మేము వాళ్ళింటికి వెళ్ళగానే రామలక్ష్మిగారు, ఆ తర్వాత కాలమంతా నేను ఆమెని పిన్నీ అనే పిలిచేదాన్ని, ఆ ఫారెస్టరుగారితో మేము ఆ రాత్రినుంచే అక్కడ ఉండిపోతామనీ, మా సామాను పంపించెయ్యమనీ అన్నది. ఏముందికనుక నా లగేజి? పాత గ్రే కలరు వి ఐ పి సూట్ కేసు, ఒక హోల్డాలూనూ. ఆ ఆదరణ, అరమరికల్లేని ఆ ఆప్యాయత నాన్న హృదయానికి హత్తుకున్నాయి.

సూర్యనారాయణగారి ఇల్లు మట్టి ఇల్లు. పేడతో అలికిన మట్టి అరుగులు. తాటాకు కప్పు. ఇంటి చుట్టూ కంచె. ఇంట్లో వంటగది కాక, మరో రెండు గదులు. ఒకగదిలో ఆ కుటుంబమంతా గడిపేవారు. నేనున్నన్నాళ్ళూ నాకోసం మరో గది ఇచ్చేసారు. మొదట్లో ఆ పిల్లలిద్దరూ తల్లిదండ్రుల్తో పాటు వాళ్ళ గదిలోనే పడుకునేవారుగాని, నేను రెండో వారానికల్లా వాళ్ళని నాతో పాటు నాగదిలోనే పడుకోమన్నాను. ఆ రోజునుంచీ నేను వాళ్ళకి అక్కనైపోయాను. సూర్యనారాయణగారికీ, రామలక్ష్మిగారికీ నిజంగా పెద్దకూతురినై పోయాను.

ఆ మొదటిరోజు రాత్రి మా నాన్న వాళ్ళతో చాలాసేపు మాట్లాడుతూ ఉన్నాడు. వాళ్ళ గురించీ, ఆ ఊరు గురించీ వివరాలు అడుగుతూ ఉన్నాడు. తెల్లవారేక ఆ సూర్యనారాయణ గారు నాన్నకి ఊళ్ళో కొందరు పెద్దల్ని, కరణం, మునసబు, సర్పంచి, స్కూలు టీచర్లు మొదలైనవాళ్ళని పరిచయం చేసాడు. నాన్న తనకు పరిచయమైన ప్రతి ఒక్కరికీ నా బాధ్యత అప్పగిస్తూనే ఉన్నాడు. ఆ మధ్యాహ్నం మళ్ళా నర్సీపట్నం వెళ్ళి అక్కణ్ణుంచి విశాఖపట్టణానికి ప్రయాణమైపోయాడు.

వెళ్తున్నప్పుడు నా చేతిలో కొద్దిగా డబ్బు పెట్టాడు.

'నీకు వాళ్ళేదో రెమ్యూనరేషను ఇస్తారని ప్రొఫెసరుగారు చెప్పారు. వాళ్ళివ్వనీ, ఇవ్వకపోనీ, ఈ డబ్బులుంచు' అన్నాడు. 'పెద్దవాళ్ళు, చదువుకున్నవాళ్ళు, ఏదో చదువుకు సంబంధించిన పనికోసం నిన్ను పిలిచారు. నాకు అదే చాలు' అని అంటూ 'ఈ ఊళ్ళో వాళ్ళని చూస్తుంటే మంచివాళ్ళల్లానే కనిపిస్తున్నారు. ఇది అడవిలో ఊరేగాని, అడవిలాగా లేదు' అని కూడా అన్నాడు.

ఆ రోజంతా నేను ఎక్కడికీ వెళ్ళలేదు. నాన్న ఉన్నంతసేపూ తెలియలేదుగానీ, నాన్న వెళ్ళిపోగానే ఎందుకో చాలా బెంగగా అనిపించింది. వెళ్తూ వెళ్తూ నాన్న నాకు ఒక డజను పోస్టు కార్డులు మా ఇంటి అడ్రసు రాసిపెట్టి నా చేతికిచ్చి వెళ్ళాడు. వారం వారం నా క్షేమసమాచారాలతో ఉత్తరాలు రాయమని చెప్పాడు. ఆ కార్డులు చూడగానే చాలా

బెంగగా అనిపించింది. మొదటి కార్డు తీసుకుని అప్పటికప్పుడే నాన్నకి ఉత్తరం రాయాలనిపించింది.

ఆ సాయంకాలం ఏడు కూడా దాటకుండానే రాత్రిభోజనాలు చేసేసాం. నేనుంటున్న గదిలో ఒక ఎలక్ట్రిక్ బల్బు. కాని ఆ మట్టిగోడల మధ్య ఆ బల్బు వెలుతురు మందగించి కనిపిస్తూంది. ఒక్కర్తినీ ఆ గదిలో పడుకున్నానన్నమాటేగాని నా మనసు అక్కడ లేదు. ఆ వేళకి మా ఇంట్లో తమ్ముడూ, చెల్లెలూ ఏం చేస్తూంటారా అని ఊహించాను. నాన్న రైలెక్కి ఉంటాడా లేదా అనుకున్నాను. ఆ గదిలో మంచాలేమీ లేవు. నేలమీద ఒక చాప, చాప మీద బొంత, తలగడ. పైన మిద్దె కప్పు కాకపోవడంతో, వెదురుకప్పూ, తాటాకులూ కనిపిస్తూ ఉన్నాయి. అక్టోబరు నెలకే అక్కడ చలికాలం వచ్చేసినట్టుగా ఉంది. ఆ కప్పు చలిని జల్లెడ పడుతున్నట్టుగా ఉంది. కొంతసేపటికి చలి నన్ను వణికించడం మొదలు పెట్టింది. అక్కడ మరొక్క రోజు కూడా ఉండలేననిపించింది. తెల్లవారగానే ఆ ఇంటివాళ్ళకి చెప్పి, ఫారెస్టరుగారికి చెప్పి వెనక్కి వెళ్ళిపోవాలని గట్టిగా అనుకున్నాక గానీ నిద్రపట్టలేదు.

కానీ మళ్ళా అర్ధరాత్రి మెలకువ వచ్చేసింది. ఆ చీకట్లో, ఆ మట్టిగదుల ఇంట్లో, ఆ పైకప్పుమీంచి లోపలకి ధారాపాతంగా దిగుతున్న చలిలో, నేనెందుకు అక్కడున్నానో నాకు ఒక క్షణం అర్థం కాలేదు. ఎక్కడో అడవిలోంచి ఏవో అరుపులు వినిపిస్తున్నాయి. కుక్క ఒకటి విసుగులేకుండా మొరుగుతూనే ఉంది. ఎవరో ఒకటే సణుగుతున్నట్టుగా చిమ్మెటలు గీపెడుతున్నాయి. గదిలోపల దండెం మీద వేసిన గుడ్డలు అట్టకట్టిన నీడల్లాగా ఉన్నాయి. నాకు చెప్పలేనంత భయం పుట్టింది. వెళ్ళి ఆ పక్క గది తలుపు తట్టి నేను కూడా వాళ్ళ మధ్య ముడుచుకుపడుకోవాలన్న కోరికని అతి కష్టం మీద నిగ్రహించు కోగలిగాను.

లేచి వాచీ చూసుకున్నాను. హెచ్.ఎం.టి రేడియం ముల్లు వాచీ. డిగ్రీలో చేరినప్పుడు నాన్న కొనిచ్చాడు. నీ జీవితంలో అడల్ట్ హుడ్ ఎప్పుడు మొదలయ్యింది అని ఎవరేనా అడిగితే ఆ రిస్టు వాచీ పెట్టుకున్న మొదటిరోజునే అని చెప్తాను.

టైము మూడు కావొస్తూంది. గదిలో పడుకోలేక ఏమైతే అయిందని నెమ్మదిగా తలుపు తెరుచుకుని బయటికి వచ్చాను. ఊరంతా మాటుమణిగి ఉంది. ఇంట్లోంచి బయటకి వచ్చాను. ఇంటిముంగిట్లో నిల్చున్నాను. ఇంటి ఆవరణలో విరగబూసిన మందార చెట్టు మీద తెల్లని గీతలు గీసినట్టు ఆకుల మీదా, పూలమీదా వెన్నెల. మరికొంత ముందుకొచ్చి తలెత్తి ఆకాశం కేసి చూసాను. పడమటి దిక్కుగా ప్రయాణిస్తున్న త్రయోదశి చంద్రుడు.

ఇంక ఉండబట్టలేక కంచెకి కట్టిన తలుపు కూడా తెరిచి బయటకొచ్చి నిలబడ్డాను. అబ్బ! ఏమి వెన్నెల! అలాంటి రాత్రి అప్పటిదాకా నా జీవితంలో నేనెప్పుడూ చూసి ఎరగను. ఆ క్షణాన అప్పటిదాకా నన్ను కమ్ముకున్న భయం, అలసట అన్నీ ఎవరో మంత్రించినట్టుగా మాయమైపోయాయి. చుట్టూ చూసాను. ఊరంతా ఇళ్ళ గడ్డికప్పులమీద, ఇళ్ళముందు చెట్లమీద, దూరంగా కొండలమీద, ఎటుచూసినా వెన్నెల. అడవిలో అప్పటి దాకా వినిపిస్తూ వచ్చిన అరుపులు కూడా ఆ వెన్నెలని చిక్కబరుస్తున్నాయి. చిమ్మెటలన్నీ ఎక్కడికక్కడ రాలుతున్న వెన్నెలని తీగలు చుడుతున్నట్టుగా ఉన్నాయి. అదొక అపూర్వమైన నిశ్శబ్దం. ఆ వెలుగంతా నాకోసమే కురుస్తున్నట్టుగా, పండగలాంటి ఆ వెన్నెలకి నన్ను అతిథిగా ఆహ్వానించినట్టుగా అనిపించింది.

ఎవరో నా పక్కన నిలబడి నా చెవిలో రహస్యం చెప్తున్నట్టుగా 'వెల్ కమ్ టు అవర్ మూన్లిట్ నైట్' అని అంటున్నట్టుగా అనిపించింది. చంద్రుడు ఒక నావలాగా ఆకాశంలో మరింత మరింత దూరం ప్రయాణిస్తోనే ఉన్నాడు. నేను కూడా ఆ నావమీద ప్రయాణిస్తోనే ఉన్నాను. అప్పటికి కొద్దిసేపటికిందటే ఆ ఊరువదిలిపెట్టి వెళ్ళిపోవాలని అనుకున్న విషయం ఆ క్షణాన గుర్తేలేదు. తెల్లవారుతూనే ఇంటివాళ్ళకి చెప్పి ఎలాగేనా వెనక్కి వెళ్ళిపోవాలని అనుకున్న విషయమే ఆ సమయంలో మర్చిపోయాను. ఆ వెన్నెల్లో ఆ రాత్రి అలా ఎంత కాలమేనా నిలబడిపోవాలనిపించింది. ఏదో అపురూపమైన మహిమ నాలోపలకంటా ప్రవహించినట్టనిపించింది. ఆకాశంలో ఎవరో ఏదో మూలికని అరగదీస్తూ ఉన్నారనీ, ఆ సారమేదో నాలోపలకీ ఇంకిపోతోందనిపించింది.

అలా ఎంతసేపు గడిచిందో తెలీదు. ఇంతలో తొలికోడి కూసింది.

❋

3

ఆ మర్నాటికి స్కూళ్ళు తెరిచారు. నేనుంటున్న పిన్నిగారి పిల్లలు పెద్దమ్మాయి, చిన్నమ్మాయి బడికి బయల్దేరారు. బడి అంటే ఎక్కడో లేదు, ఆ ఇంటి ఎదురుగా ఉన్న రామకోవెలనే బడి. ఆ రెండురోజులూ నిశ్శబ్దంగా ఉన్న ఆ వీథి బడితెరవగానే కిలకిల్లాడటం మొదలు పెట్టింది. ఆ సాయంకాలం ఆ పిల్లలిద్దర్నీ నాకు ఊరంతా తిప్పి చూపించమని అడిగాను.

ఆ ఊరు ఎటువేపు తిరిగినా అయిదారు ఫర్లాంగులకి మించి లేదు. ఊరికి ఉత్తరం వేపు ఒక కొండవాగు. దాని మీద కొత్తగా వేసిన బ్రిడ్జి. ఆ వంతెన దాటాక దళితవాడ. మరోవేపు ఊరుదాటగానే రోడ్డుమీదకీ ప్రవహిస్తున్నట్టుండే కొండ. ఆ కొండవాలు ఒక చాపరాయిలాగా పరుచుకుని ఉంది. ఆ చాపరాయి దగ్గర్లోనే ఫారెస్టు ఆఫీసరుగారి ఇల్లు. మేముంటున్న ఇంటికీ రామకోవెలకీ మధ్య సన్నని లోపలిదారి. ఆ దారమ్మట లోపలకి వెళ్తే అసలైన ఊరు. అదంతా కొండరెడ్లు నివసించే ఒక చిన్నపాటి గిరిజన గ్రామం. ఆ దారి అలా అడవిలోకి, కొండలమధ్యలోయలోకీ సాగిపోతుంది.

రామకోవెలకి ఎదురుగా రోడ్డు. తారురోడ్డు. ఆ రోడ్డు దాటి పడమటి వైపు కూడా ఊరు విస్తరించి ఉంది. రోడ్డు పక్కనే మునసబు గారి బంగళా. ఆ పక్కన కొత్తగా వెలిసిన ఒక చిన్న టీదుకాణం. దాని పక్కన గిరిజన కార్పొరేషనువారి డిపో. ఆ బంగళాకు మరొక పక్క చింతచెట్ల వరస. వాటిమీద పూలు పూసినట్టుగా కొంగలు. ఆ చింతచెట్ల వెనగ్గా ఉన్న ఇంటిముంగట పందిరిమీద రంగువిరజిమ్మినట్టు ఎఱ్రటి బోగనువిల్లియా.

ఆ ఇంటిపక్కనుంచి లోపలకి నడిస్తే, ఆ సన్నని దారి అటూ ఇటూ మలుపులు తిరిగి ఊరుకింద చెరువుగట్టుమీదగా పొలాల్లోకి సాగిపోతుంది. ఆ చెరువు గట్టుకింద

అరటితోట, చెరకు తోట. ఏటిమీద బ్రిడ్జి దాటి మరికొంతముందుకు నడిస్తే తారురోడ్డు మలుపు తిరిగేచోట గ్రామదేవత గుడి. ఆ గుడి చుట్టూ జీడిమామిడితోటలు. ఆ తోటలు దాటి, రోడ్డుమలుపు దాటాక మరికొంత ముందుకి నడిస్తే ఫారెస్టు డిపార్ట్ మెంటు పెంచుతున్న టేకుచెట్ల వనం.

మళ్ళా వెనక్కి వస్తే, బ్రిడ్జి ఇంకా ఎక్కకముందే ఒకవైపు గట్టుమీద కొండమామిడి చెట్ల డొంక. అది ఊరికి శ్మశానం. దానికి ఆవల, ఏటి గట్టుకి పైన పొలాలు, ఆ పొలాలమ్మట మళ్ళా ఊళ్ళోకి అడుగుపెట్టే చోట మరొక చెరువు. దాన్ని పెద్ద చెరువు అంటారని చెప్పారు పిల్లలు. ఆ చెరువు మీద పెద్ద రావిచెట్టు. ఆ చెరువు పక్క చిన్న డొంక. ఆ డొంకపక్కనుంచి లోపలకీ మరొక గిరిజన గ్రామానికి పొయ్యే ఒక మట్టిబాట.

ఆ డొంకదారికి అవతలపక్క బావి. ఊరంతటికీ అదొక్కటే బావి అని విన్నాను. ఆ బావి చుట్టూ నీళ్ళు తోడుకుంటున్న స్త్రీలు, ఆ పక్కనే స్నానం చేస్తున్న యువకులు, దానికి కొద్దిగా దిగువన చిన్నపాటి దొరువులో గేదెల్ని తోముతూ కొందరు. ఆ బావి పక్కన సగం పాడైపోయి కూలిపోడానికి సిద్ధంగా ఉన్న పాత బడిబిల్డింగు. ఇంకా కూలిపోని ఒకపక్క గోడమీద 'చేనుకు చేవ, రైతుకు రొక్కం గ్రోమోర్' అని ఒక నినాదం.

ఏటికి దిగువవేపు చాకళ్ళు గుడ్డలుతికే చోటు. అక్కడొక తుమ్మచెట్టు. గుడ్డలు ఉడకబెట్టే బాన, పొయ్యి. అక్కడ వెడల్పుగా లోతుతక్కువగా పరుచుకున్న ఏటిపాయ. ఆ పాయదాటి అవతలి వైపు కాలినడకన ఆ గట్టు ఎక్కితే అక్కడొక యూకలిప్టసు తోట. ఆ పైన దూరంగా పొలాలకి ఆవల ఆకుపచ్చని సముద్రతీరమ్మీంచి ఎగిసిపడుతుండే కెరటాల్లాగా కొండలు, తెల్లటినీలంగా, నీలంపు ఆకుపచ్చగా, ఆకుపచ్చని మంచులా.

ఆ ఏటినుంచి పొలంగట్లమీద ఒడుపుగా దారిచేసుకుంటూ అడుగులో అడుగు వేసుకుంటూ కడవల్లో తాగడానికి మంచినీళ్ళు తోడి తెచ్చుకుంటున్న స్త్రీలు. తడిసి ఒకవైపు నీళ్ళు చిందుతున్న ఆ కడవల అంచుల మీంచి బంగారం తుంచుతున్నట్టుగా సాయంకాలపు సంధ్యారశ్మి.

ఊరికి తూర్పువేపు దాదాపుగా ఊరిని ఆనుకుని మూడు కొండలు. ఆ కొండల్లో మరీ దక్షిణంగా ఉండే కొండ మీద ఎప్పుడూ ఎగురుతూ ఉండే ఒక జెండా.

ఊరిమధ్యలో చిన్న కాలువ, దానిమీద ఒక తూము. ఆ తూము పక్క ఒక ఊడుగ చెట్టు. ఆ తూముకి ఎదురుగా రోడ్డుకి అవతల వైపు చిన్నపాటి చెరువులాగా నీళ్ళు చేరిన దొరువులు. ఆ గుంతల్లో మెట్టతామరపూలమొక్కలు.

శరత్కాలం కావడంతో పొలాల్లో వరిచేలు పచ్చగా కలకల్లాడుతున్నాయి. సన్నని వరికంకులు ఇప్పుడిప్పుడే మొగ్గ తొడుగుతున్నాయి. గాలికి ఆ వెన్నులు ఊగినప్పుడల్లా అసంఖ్యాకమైన చుక్కలు గాల్లో తేలుతున్నట్టుగా ఉంది. ఆ పొలాలకు దిగువ ఏటి ఒడ్డున అక్కడక్కడా రెల్లు పొదలు.

ఊరంతా తిరిగి చూడటానికి నాకు రెండు గంటలమించి పట్టలేదు. కాని ఆ కొండల మధ్య, ఆ గ్రామం, ఆ మొక్కలు, ఆ దొరువులు, ఆ తీగలు, ఆ కొంగలు, ఆ పొలాలు, ఆ తోటలు ఎన్నాళ్ళనుంచో నాకోసం ఎదురుచూస్తున్నట్టుగానూ, అవీ నేనూ కూడా కలిసి ఒక పడవమీద ప్రయాణం మొదలుపెట్టినట్టుగానూ అనిపించింది.

ఆ మర్నాడు మధ్యాహ్నం మూడింటికి నాకు ఫారెస్టు ఆఫీసరుగారినుంచి కబురు వచ్చింది. వాళ్ళింటికి వెళ్ళేటప్పటికి ఆ ఇంటిముందు ఒక జీపు ఆగి ఉంది. ఇంట్లో అడుగుపెట్టగానే ఒక పెద్దాయన, ఆయనతో పాటు ఒక యువతీ కనిపించారు. వాళ్లని పరిచయం చేసుకోకముందే నాకు అర్థమయింది వాళ్ళే ప్రొఫెసరుగారూ, వనలతా సేన్‌గుప్తా అని. నేను వాళ్ళకి నమస్కారం చేసి నన్ను పరిచయం చేసుకున్నాను.

ఆ ప్రొఫెసరుగారు దాదాపు అరవైఏళ్ళకు దగ్గరలో ఉన్నట్టుగా ఉన్నాడు. ఆయన్ని చూడగానే శరత్‌బాబు శేషప్రశ్న నవల్లో ఆశుతోష్‌గుప్త లాగా అనిపించాడని రాజు తర్వాత నాతో అన్నాడు. అప్పటికి నేను శేషప్రశ్న చదవలేదు. కాని తర్వాత చదివాక ఆ పోలిక మరీ అన్యాయం అనిపించింది. అదీకాక ఆశుతోష్ బాబు తనని రోగిష్ఠిమనిషిగా పరిచయం చేసుకుంటాడు. కాని ప్రొఫెసరు సేన్‌గుప్తాని మొదటిసారి చూడగానే ఆయన ఎంతో ఆరోగ్యవంతుడిగానూ, ఆ ఆరోగ్యం అన్నిటికన్నా ముందు మానసికమనీ కూడా అనిపించ కుండా ఉండదు. దబ్బపండులాంటి దేహమేకాని, ఏళ్ళ తరబడి కొండల్లో, కోనల్లో తిరిగి నందువల్ల ఆ చర్మం పైన పలచని ఊదారంగు పొర పేరుకుందా అనిపిస్తుంది. ఆయన్ని చూడగానే ముందు మనల్ని ఉన్నచోటే కట్టిపడేసేది ఆయన చిరునవ్వు. పసిపాపల్లో మాత్రమే కనవచ్చే ఆ చిరునవ్వు.

ఆయన నన్ను చూస్తూనే కుర్చీలోంచి లేచి నిల్చున్నాడు. స్థూలకాయుడు కాబట్టి లేవడంలో కొద్దిగా తొట్రుపడ్డా, మొహమాటానికి సగం లేచి ఆగిపోకుండా, పూర్తిగా, సంతోషంగా, స్వాగతపూర్వకంగా లేచి నించున్నాడు. రెండు చేతులూ చాపి దగ్గరగా తీసుకున్నాడు. నా తండ్రి దగ్గర నేనెప్పుడూ అటువంటి ఆలింగనం ఎరగను గాని, పితృ వాత్సల్యాన్ని రెండుచేతుల్తోనూ పంచవచ్చునని అప్పుడే తెలిసింది నాకు.

ఆయన తన పక్కన కూచున్న వనలతని పరిచయం చెయ్యబోతుంటే-

'తెలుసు నాకు, వనలత' అన్నాను ఇంగ్లిషులో.

వనలత ప్రేమగా చెయ్యి చాపింది. ఆమెకి పాతికేళ్ళవయసు ఉండవచ్చు. ఏదో బెంగాలీ నవల్లోంచి సరాసరి ఈ అడవికి నడిచి వచ్చినట్టుగా ఉంది. విరబోసుకున్న కురుల మధ్య, గుండ్రంగానూ, పుష్టిగానూ ఉన్న ఆ వదనం పొద్దున్నే నిండుగా పూసిన తామరపువ్వులాగా ఉంది. మరీ ముఖ్యంగా ఆ కళ్ళు, ఆ పెదాలు, ఆమె నాతో కరచాలనం చేస్తూ ఇష్టంగా తలూపగానే ఆమె చెవిలోలాకులు రెండు పూలరేకుల్లాగా అటూ ఇటూ ఊగాయి.

'ఆర్ యు కంఫర్టబుల్ ఇన్ ఇంగ్లిష్?' అని అడిగాడు ప్రొఫెసరు.

అవునన్నాను.

ఆ తర్వాత మా సంభాషణ మొత్తం ఇంగ్లిషులోనే సాగింది. ప్రొఫెసరు ఇంగ్లిషు ఉచ్చారణలో బంగ్లా యాస బాగా ఉండటంతో నాకు మొదట్లో ఆయన మాటలు అంత స్పష్టంగా అర్థం కాలేదు. కాని వనలత చిన్నప్పణ్ణుంచీ ఇంగ్లిషు మీడియంలో చదువుకుని ఉండి ఉంటుంది కాబోలు, ఆమె ఇంగ్లిషు సులభంగానూ, సరళంగానూ వినబడుతూ ఉంది.

ప్రొఫెసరు ముందు నా బస గురించీ, నాకు ఆతిథ్యమిస్తున్న కుటుంబం గురించీ అడిగాడు. వాళ్ళని వెంటనే వెళ్ళి కలుద్దామన్నాడుగాని, జోసెఫ్ ఆ తర్వాత కలుద్దాం, పర్వాలేదన్నాడు. ప్రొఫెసరు నన్ను బోటనీ గురించీ, మొక్కల గురించీ, నా చదువుగురించీ, మార్కుల గురించీ అడుగుతాడనుకున్నానుగానీ ఆయన ఎక్కువ మా కుటుంబం గురించీ, నా తల్లిదండ్రుల గురించీ, మా తమ్ముడి గురించీ, చెల్లి గురించీ, మా ఇష్టాయిష్టాల గురించీ-ఇలాంటివే ఏవేవో అడుగుతూ ఉన్నాడు.

ఈ లోపు గ్రేస్ మేడం మాకు టీ తీసుకొచ్చింది. టీతో పాటు బిస్కట్లు కూడా. సేన్‌గుప్తా ఆ టీ తాగిన పద్ధతి నాకు చాలా కొత్తగా, గమ్మత్తుగా అనిపించింది. అలా టీ తాగవచ్చునని నాకు అప్పటిదాకా తెలియలేదు. ఆయన టీ తాగుతున్నంతసేపూ మమ్మల్నే కాదు, మొత్తం ప్రపంచాన్ని ఆ టీపాయి చుట్టూ కూర్చోబెట్టుకుని కబుర్లు చెప్పినట్టుగా ఉంది.

'డు యు నో! వియ్ షుడ్ నాట్ డ్రింక్ టీ' అన్నాడు ఆయన మాటల మధ్యలో.

నేను అర్థం కానట్టు చూసాను.

'రాదర్, వియ్ షుడ్ సేవర్ ఇట్' అన్నాడాయన నవ్వుతూ.

'సేవరింగ్ టీ ఈజ్ ఎ సెరిమొని, యు నో' అని కూడా అన్నాడు.

ఆ టీ సెరిమొని అయ్యేటప్పటికి ఆయన నాకు ఎంతో కాలంగా తెలిసినవాడిలానూ, నా చిన్నప్పుడు మా పొరుగింట్లో ఉండే పెద్దమనిషిగానూ, నా ప్రైమరీ స్కూలు టీచరుగానూ మారిపోయాడు.

ప్రొఫెసరుగారికీ, వనలతకీ జోసెఫ్ గారు ముందు విలేజిచావిడిలో తాత్కాలికంగా బస ఏర్పాటు చేసాడు. ఆ విలేజి చావిడి బ్రిటిష్‌కాలం నాటి బంగళా. దాదాపుగా శిథిలావస్థకు చేరుకుంటూ ఉంది. ఆ ఊరికి గవర్నమెంటు సిబ్బంది ఎవరు వచ్చినా అక్కడే బస ఏర్పాటు చేస్తూ ఉంటారు. ఇప్పుడు ఈ కలకత్తా బృందానికి కూడా వారం రోజుల పాటు అక్కడే బస ఏర్పాటు చేసామనీ, ఈలోపు తాను వాళ్ళకోసం కట్టిస్తున్న కుటీరం పూర్తయిపోతుందనీ జోసెఫ్ గారు చెప్పాడు.

అప్పుడు ఆయన తన ఇంటికి కొద్దిగా వెనగ్గా, కొండవార కడుతూ ఉన్న ఆ కుటీరానికి మమ్మల్ని తీసుకువెళ్ళి చూపించాడు. అది మట్టి గోడల ఇల్లు. మట్టి అరుగులు. తాటిదూలాల్తో, వెదురుబొంగుల్తో కప్పు అల్లి దాని మీద గడ్డి కప్పు వేస్తున్నారు. చుట్టూ వెదురుకంచె పెడుతున్నారు. ఆవరణలో కొన్ని బొప్పాయిమొక్కలు, ఒక పక్కగా నాలుగైదు నీలగిరిమొక్కలు కూడా నాటి ఉన్నాయి. అవి కాక ఎప్పటివో చాలా ఏళ్ళుగా పెరుగుతూ వస్తున్న మామిడిచెట్లు కూడా ఉన్నాయి. కుటీరానికీ, కొండవాలుకీ మధ్య రెండుమూడు చింతచెట్లు, ఒక వేపచెట్టు కూడా ఉన్నాయి.

బహుశా ప్రొఫెసరు ఇక్కడికి స్టడీ కోసం వస్తున్నాడని తెలిసినవెంటనే ఫారెస్టు ఆఫీసరు కుటీరం నిర్మించే పని మొదలుపెట్టినట్టున్నాడు. ఆ కుటీరం, దాన్ని అక్షరాలా కుటీరం అనవచ్చు, దాన్ని చూడగానే సేన్‌గుప్తా కొంతసేపు దిగ్భ్రాంతితో అట్లాగే నిలబడి పోయాడు. ఆయన చూపులుడిగి నిలబడ్డాడని కూడా చెప్పవచ్చు.

'ఓహ్! బ్యూటిఫుల్! సింప్లీ ఎ ప్లేస్ ఆఫ్ పారడైజ్ ఆన్ ద ఎర్త్' అంది వనలత. ఆమె చిన్నపిల్లలా ఆ కుటీరం చుట్టూ తిరిగింది. ఆ మట్టిగోడల్ని చేతుల్తో తాకింది. ఇంకా తడి ఆరని ఆ మట్టిని తన కోమలమైన అంగుళుల్తో మృదువుగా తాకి చూసింది. చింతచెట్టుమీద గుత్తులుగుత్తులుగా వేలాడుతున్న చింతకాయల్ని చూసింది.

'మీరు ఈ వారం రోజులూ ప్రిపరేటరీ వర్కు ఏదైనా ఉంటే చూసుకోండి. రేపు సాయంకాలం చిన్న గేదరింగు ఏర్పాటు చేసాను. ఊళ్ళో పెద్దమనుషులు కొందరిని పిలుస్తున్నాను. మిమ్మల్ని వాళ్ళకి పరిచయం చెయ్యడానికి' అన్నాడు ఫారెస్టు ఆఫీసరు.

సేన్‌గుప్తా తలపంకించాడు, కాని ఆయన దృష్టి ఇంకా మనుషుల మధ్యకి రాలేదు.

ఆ మర్నాడు సాయంకాలం జోసెఫ్ తన కుటీరం అరుగుమీదనే రెండుమూడు చాపలు పరిచాడు. పది కుర్చీలు తెప్పించి ఒక పక్కగా వేయించాడు. నెమ్మదిగా ఒకరూ ఒకరూ పెద్దమనుషులు అక్కడకు చేరుకునేటప్పటికి చీకటి పడటం మొదలయ్యింది.

ఆ అరుగుమీదనే చిన్న వేదికలాగా నాలుగు కుర్చీలు వేసి ఫారెస్టు ఆఫీసరు ప్రొఫెసరు సేన్‌గుప్తాని, వనలతనీ, నన్నూ కూర్చోమన్నాడు. వచ్చినవాళ్ళందరికీ మంచినీళ్ళూ, బిస్కట్లూ, టీ ఏర్పాటు చేసాడు. గ్రామపెద్దల్లో ముఖ్యమైన వాళ్ళంతా వచ్చారనుకున్నాక, అందరినీ ఉద్దేశించి చెప్పడం మొదలుపెట్టాడు.

'వీరు ప్రొఫెసరు సేన్‌గుప్త. ప్రపంచవ్యాప్తంగా గౌరవం పొందుతున్న శాస్త్రవేత్త. వీరు మన ప్రాంతంలో ఉండే కొండల గురించీ, అడవులగురించీ, మన కొండరెడ్ల గురించీ కూడా పరిశోధన చెయ్యడానికి వచ్చారు. ఇక్కడ ఆరునెలలైనా ఉంటారు. వీరికి అన్ని ఏర్పాట్లూ చెయ్యమని, ఏ అవసరం వచ్చినా దగ్గరుండి చూసుకోమనీ మా కన్సర్వేటరు గారు మరీమరీ చెప్పారని మా డి.ఎఫ్.ఓ గారు నాకు పర్సనలుగా చెప్పారు. ఇటువంటి వారు మన గ్రామానికి రావడం, ఇక్కడ రీసెర్చి చెయ్యడం మన గ్రామం చేసుకున్న అదృష్టంగా భావిస్తున్నాను. వీరికి మనందరి తరఫునా స్వాగతం పలుకుతున్నాను' అన్నాడు. అక్కడున్నవారంతా ఆ మాటలకి ఆమోదపూర్వకంగా చప్పట్లు కొట్టారు.

'కొండల మీద పరిశోధన అంటే ఏమిటి చేస్తారు?' అనడిగాడు ఒకాయన. ఆయన అడిగిన ప్రశ్న ఏమిటో జోసెఫ్‌గారు సేన్‌గుప్తాకి ఇంగ్లిషులో తిరిగిచెప్పాడు. అప్పుడు తనే ఆ అడిగినాయనతో–

'కొండలు అంటే రాళ్ళు, ఆ రాళ్ళు ఎలా ఏర్పడ్డాయి, ఎలా వ్యాపించాయి, ఎలాంటి మార్పులు చెందుతూ ఉన్నాయి లాంటివన్నీ పరిశోధిస్తారు. ఆ శాస్త్రాన్ని జియాలజి అంటారు' అని చెప్పాడు.

'అంటే పొలాల్లో బావులు తవ్వడానికీ, బోర్లు వెయ్యడానికీ ఎక్కడ నీళ్ళు పడతాయో అది చెప్పేవాళ్ళే కదా జియాలజిస్టులంటే' అన్నాడు మరొకాయన.

'అవును' అన్నాడు ఫారెస్టు ఆఫీసరు. 'అయితే వీరు చేసే పరిశోధన అంతకన్నా పెద్దది. దాని వల్ల ముందు ముందు మన ప్రాంతం గురించి చాలా విషయాలు మనకి తెలుస్తాయి' అని కూడా అన్నాడు.

అప్పుడు వనలతనీ, నన్నూ అక్కడున్నవాళ్ళకి పరిచయం చేసాడు. అప్పటికే రెండు మూడు రోజులుగా నన్ను చూస్తున్న ఆ గ్రామస్థులకి నేను అక్కడికి ఎందుకొచ్చానో ఇప్పుడు అర్థమయినట్టు తలాడించారు. కాని వారందరి దృష్టీ ప్రధానంగా వనలత మీదనే ఉంది. ఆమె విరబోసుకున్న శిరోజాలు, తొడుక్కున్న టీషర్టూ, జీన్సు పాంటూ వాళ్ళకి కొత్తగా ఉన్నాయి. ఎక్కడో సీమనుంచి దిగివచ్చిన దొరసానిలాగా ఉందనుకున్నారు వాళ్ళు.

'వనలత అంటే టాగూరు నవల్లో కేరక్టరా' అనడిగారు ఎవరో. అది కూడా ఇంగ్లిషులో అడిగారు. అంతా ఆ ప్రశ్న వినబడ్డ దిక్కుకి చూసారు. అక్కడ అరుగుకింద నిలబడి ఉన్న నలుగురైదుగురు యువకుల్లో ఒకరు ఆ ప్రశ్న అడిగారు.

'ఎవరు అడుగుతున్నది?' అనడిగాడు జోసెఫ్ ఆ దిక్కుకేసి చూస్తూ,

'నేను సార్, రాజుని' అంటో ముందుకొచ్చాడో యువకుడు. చూడటానికి చాలా సాదాసీదాగా ఉన్నాడు. కాని ఆ కనుచీకటిలో కూడా ఆ కళ్ళు షార్పుగా కనబడుతున్నాయి. జోసెఫ్ ఆ ప్రశ్నకి ఏమి జవాబివ్వాలో తెలీక 'అరె రాజూ! కిందనే నిలబడిపోయారు, పైకి రండి, ఇక్కడికొచ్చి కూచోండి' అంటో అక్కడ ఖాళీగా ఉన్న ఓ కుర్చీ వేపు చూపించాడు.

కాని ఆ యువకుడు ఆ ప్రశ్న ఇంగ్లిషులో అడగడంతో, సేన్‌గుప్తాకి అతను ఏమడుగుతున్నాడో అర్థమయింది. అతణ్ణి ముందుకు రమ్మని పిలిచాడు.

'ఐ వండర్ హౌ సమ్‌వన్ కుడ్ మెన్షన్ గురుదేవ్ ఇన్ దిస్ రిమోట్ ఫారెస్ట్' అని అన్నాడు. టాగోరు అనే మాట వినగానే ఎవరో తనని అమాంతం బెంగాలుకు ఎత్తుకు పోయినట్టుగా వుంది ఆయన ముఖం ఆ సమయంలో. అప్పుడు నింపాదిగా ఇంగ్లిషులోనే జవాబిచ్చాడు.

'లేదు, వనలత గురుదేవ్ నవలల్లో నాయిక కాదు. మా దగ్గర జీబనానందదాస్ అని మరొక గొప్ప కవి ఉన్నాడు. ఆయన వనలతాసేన్ అని ఒక కవిత రాసాడు. మా అన్నయ్యకి ఆ కవిత అంటే చాలా ఇష్టం. అఫ్ కోర్స్, నాకు కూడా ఇష్టమే. అసలు ఆ కవితంటే ఇష్టపడని బెంగాలీ ఎవరూ ఉండరు. అందుకని మా అమ్మాయికి ఆ పేరు

పెట్టుకున్నాం' అన్నాడు.

అప్పుడు గ్రామస్థులవైపు తిరిగి 'మీరంతా ఈ సాయంకాలం మా కోసం ఇక్కడికి వచ్చినందుకు హృదయపూర్వకంగా ధన్యవాదాలు చెప్పుకుంటున్నాను. మేము చెయ్యబోయే పరిశోధన మీకు నేరుగా ఉపయోగపడుతుందని చెప్పలేను. కాని జాతికి ఉపయోగ పడుతుంది, దేశానికి ఉపయోగపడుతుంది. మనుషులు ఎక్కడున్నా ఒక కుటుంబమే అని నాకు ఈ సాయంకాలం మరో సారి రుజువయ్యింది. మీ అందరికీ మరోమారు ధన్యవాదాలు' అని చెప్పి అందరికీ శిరసు వంచి నమస్కరించాడు.

మమ్మల్ని కూడా లేచి నిలబడి నమస్కరించమన్నాడు. ఆయన ఇంగ్లిషులో చెప్పిన మాటల్ని ఫారెస్టు అధికారి అందరికీ మళ్ళా తెలుగులో అనువదించి చెప్పాడు. మరోసారి అంతా చప్పట్లు కొట్టారు.

టీ, బిస్కట్లు సర్వ్ చేసారు. టీ తాగుతుండగా సేన్‌గుప్త ఆ రాజు అనే యువకుణ్ణి దగ్గరగా పిలిచాడు. అతడి తలమీద చేయివేసి ఆశీర్వాదపూర్వకంగా తలనిమిరాడు.

'ఈ పున్నమి రాత్రి గురుదేవుల పేరు ప్రస్తావించి మీరు మా బెంగాల్ని తాడుకట్టి ఇక్కడిదాకా లాక్కొచ్చేసారు' అని అంటూ 'గురుదేవ్ పుస్తకాలు ఏం చదివారు మీరు?' అనడిగాడు. ఆ పిల్లవాడు ఏదో చెప్పడం మొదలుపెట్టాడుగాని అప్పటికే గ్రామస్థులంతా లేచి ఒక్కొక్కరే మా దగ్గరనుంచి సెలవు తీసుకుని వెళ్ళిపోతూండటంతో ఆ మాటలు నాకు స్పష్టంగా వినబడలేదు.

❋

4

ఆ తర్వాత రెండుమూడు రోజుల్లో జోసెఫ్‌గారు మా టీముకి కావలసిన ఏర్పాట్లు మొత్తం చేసిపెట్టారు. సేన్‌గుప్త ఒక జీపుని విశాఖపట్టణంలోనే కిరాయికి మాట్లాడి తెచ్చుకున్నారు. ఆ జీపు డ్రైవరు రాంబాబుది అనకాపల్లి. జీపుకి అతనే ఓనరు కమ్ డ్రైవరు. పాతికేళ్ళ కుర్రవాడు. ఇంకా పెళ్ళికాలేదు. కాబట్టే ఎన్ని నెలలైనా ఇక్కడ ఈ బృందంతో పనిచెయ్యడం కోసం సిద్ధపడి వచ్చాడు. ఇక్కడ వాళ్ళకి ఒక వంటమనిషిని, తోడుగా పనులు చేసిపెట్టడానికి మరొక మనిషిని జోసెఫ్ మాట్లాడిపెట్టాడు. ఆ వంటమనిషి రాజుల కుటుంబాలకు చెందిన నడివయసు స్త్రీ. ఆమె పేరు అప్పలకొండమ్మ. ఆ పనిమనిషి గిరిజనమహిళ. ఆమె పేరు రాములమ్మ. రోజూ ఫీల్డువర్కులో సాయం చెయ్యడానికీ, రాళ్ళ సాంపిల్సు కలెక్టు చేసాక వాటిని కేంపుకి తీసుకొచ్చి అక్కణ్ణుంచి ట్రాన్సుపోర్టులో పంపడానికీ, అలాగే రోజూ అడవికి, కొండకీ వెళ్ళినప్పుడు అక్కడ జంగిలు క్లియరెన్సుకీ, దారి చూపించడానికి కూడా ఫారెస్టు ఆఫీసరు మనుషుల్ని మాట్లాడిపెట్టాడు. వాళ్ళని అజమాయిషీ చెయ్యడానికీ, సేన్‌గుప్తా ఇచ్చే ఆదేశాల ప్రకారం ఎప్పటికప్పుడు పనులు చేయిస్తూ ఉండటానికి దేవయ్య అనే మనిషిని కూడా మాట్లాడిపెట్టాడు.

రెండు మూడురోజుల్లోనే పెద్ద కేంపు తయారయ్యింది. ఈ లోగా సేన్‌గుప్త ఒకటి రెండు సార్లు తాను పని ఎక్కడనుంచి మొదలుపెట్టాలో ఫీల్డు సర్వే చేసుకుని వచ్చాడు. తన దగ్గర ఉన్న టోపో షీట్ల ప్రకారం, ఫారెస్టు ఆఫీసరు ఇచ్చిన సమాచారాన్ని పోల్చుకుంటూ గంగన్న పాకలు అనే రిజర్వు ఫారెస్టుని ఆనుకుని ఉన్న పనసమామిడి కొండని మొదటి దశలో స్టడీకోసం ఎంచుకున్నాడు. మేముంటున్న ఊరునుంచి ఆ కొండ అయిదారు కిలోమీటర్ల దూరంలో లోపలకీ ఉంటుంది. మధ్యలో మడేరు అనే పెద్ద కొండవాగు

దాటాలి. తారురోడ్డుగాని, మట్టిబాటగాని లేకపోయినా జీపు పోడానికి దారి అనుకూలంగానే ఉందన్నాడు ప్రొఫెసరు.

అన్ని ఏర్పాట్లూ పూర్తిగా చూసుకున్నాక ఆయన ఒక రోజు మా అందర్నీ కూచోబెట్టి మేము చెయ్యాల్సిన పని వివరించాడు. ఆయన దగ్గర ఉన్న టోపో షీటులో 500 మీటర్ల చొప్పున ఒక గ్రిడ్డు తయారుచేసుకున్నాడు. ప్రతి రోజూ పొద్దున్నే ఏడింటికి బ్రేక్ ఫాస్టు చేసి ఏడున్నరకల్లా జీపు ఎక్కాలి. ఎనిమిదింటికి సైట్ దగ్గర ఉండాలి. అప్పణ్ణుంచి ఒంటి గంటదాకా తాను ఎంపికచేసిన గ్రిడ్డుని అనుసరిస్తూ పని చెయ్యాలి.

పని అంటే ఆయన ఆ కొండ తాలూకు రాళ్ళనీ, ఔట్ క్రాప్పునీ, ఫోల్డ్సునీ, ఫాల్ట్సునీ చూసుకుంటూ మాపు చేసుకుంటూ వెళ్తాడు. ఆయన మార్కు చేసుకుంటూ వెళ్ళిన దారి పొడుగునా ఆసక్తికరంగానూ, మరింత లోతుగా పరిశీలించదగ్గవిగానూ అనిపించిన రాక్సుని వనలత మరింత దగ్గరగా, మరింత వివరంగా పరిశీలించాలి. వాటిని మరిన్ని టెస్టులకీ, అనాలసిసుకీ పంపడానికి సాంపిల్సు కట్ చెయ్యాలి. నేను వారిద్దరి వెనకా, ఆ మార్కు చేసిన దారిపొడుగునా ఉన్న ఫ్లోరాని గుర్తుపట్టాలి. వాటిని మాపు మీద మార్కు చెయ్యాలి. చిన్న చిన్న మొక్కలూ, మూలికలూ, ఫెర్నులూ లాంటివయితే సాంపిల్సు సేకరించాలి. చెట్లైతే వాటి గుర్తులు పెట్టుకోవాలి. సైంటిఫిక్ నేమ్సు రాసుకోవాలి. రేర్ స్పీషిసు అయితే వాటివి కూడా ఆకులు, కాయలు, పండ్లు సాంపిల్సు సేకరించాలి.

ఒంటిగంటకి పని ముగించాక మళ్ళా ఇంటికి వచ్చేటప్పటికి రెండవుతుంది. లంచ్. ఆ తర్వాత రెండు మూడు గంటల పాటు విశ్రాంతి. పొద్దున్న చూసిన రాళ్ళమీదా, మొక్కల మీదా, తక్కిన ఆసక్తికరమైన అంశాల మీదా రోజూ సాయంకాలం డిస్కషను ఉంటుంది.

మా టీములో ఒక యాంత్రొపాలజిస్టు కూడా రావలసి ఉంది. అతనితో పాటు ఒక పాలియాంటాలజిస్టు కూడా వస్తే బాగుణ్ణని సేన్‌గుప్తా అనుకోవడంతో వాళ్ళు మార్చి నెలాఖరుకి గాని మాతో చేరే అవకాశం లేదని తెలిసింది. అప్పటిదాకా అయిదు నెలల పాటు మేము ముగ్గురమే, అంటే ప్రొఫెసరు, వనలత, నేనే మొత్తం పరిశోధకబృందం అన్నమాట.

తీరా ఫీల్డువర్కు మొదలైన మొదటిరోజున నేను విలేజిచావడికి వెళ్ళి సేన్‌గుప్తాకి గుడ్‌మార్నింగ్ చెప్పగానే ఆయన నన్ను ఎగాదిగా చూసాడు. ఎందుకలా చూస్తున్నాడో అర్థం కాలేదు. మమ్మల్ని చూసి వనలత బయటికి వచ్చాక నేను చేసిన పొరపాటు నాకు అర్థమయింది. పాంటూ, షర్టూ వేసుకుని ఫీల్డుకి వెళ్ళడంలో ఉన్న సౌకర్యం చీరకట్టుకుని

పోవడంలో లేదని గ్రహించాను. కాని ఏమి చెయ్యను? ప్రొఫెసరు నాకు ముందే చెప్పి ఉండవలసింది.

ప్రొఫెసరుకి నా పరిస్థితి అర్థమయింది.

'నీకు పంజాబీ డ్రెస్సులాంటిది ఒక్క జత కూడా లేదా?' అనడిగాడు. నా సూట్ కేసులో ఒకటి ఉందని గుర్తొచ్చింది. అది కూడా మా చెల్లెలిది. నేను బయల్దేరేముందు చివరి నిమిషంలో రజని దాన్ని నా సూట్ కేసులో కుక్కిపెట్టడం గుర్తొచ్చింది.

ఉందని చెప్పాను. వెంటనే వెనక్కి వెళ్ళి డ్రెస్సు ఛేంజి చేసుకుని వచ్చాను. ఈలోపు ప్రొఫెసరు ఫారెస్టు ఆఫీసరుని పిలిచి నాకు అర్జంటుగా అరడజను డ్రెస్సులు కుట్టించిపెట్టే ఏర్పాటు చెయ్యమని చెప్పాడు.

మేము ఫీల్డుస్టడీకి వెళ్ళిన ఆ మొదటిరోజు నేనెప్పటికీ మర్చిపోలేను. జీపులో ముందు సీటులో ప్రొఫెసరు కూచున్నాడు. వెనక ఒక వైపు వనలత, నేనూ కూచున్నాము. మరొక వైపు దేవయ్య కూచున్నాడు. మాతో పాటు పెద్ద బాగునిండా చిన్నవీ పెద్దవీ సుత్తులు, రాక్ పిక్సు, చిజెల్సు, గ్లోవ్సు, కళ్ళద్దాలు, రెండుమూడు రకాల షూసు, హాండ్ టవల్సు, రోప్స్, టేప్స్, బేసిన్సులాంటివన్నీ పట్టుకు బయల్దేరాం. వనలత చేతుల్లో నల్లని వెల్వెట్ పౌచులో జియాలజిస్టు కంపాసు ఉంది. ఆమె మెడలో బైనాకులర్సు వేలాడుతున్నాయి. ఆమె ఒళ్ళో ఒక నోట్‌పాడు ఉంది. దానికి ఒక రబ్బరుబాండు చుట్టి ఉంది.

నేను కూడా జీపు ఎక్కి ఆమె పక్కన కూచోగానే ఆమె మా పక్కనున్న బాగులోంచి ఒక నోట్ పాడూ, పెన్నూ తీసి నాచేతుల్లో పెట్టింది. ఆ నోటు పాడు చిన్నప్పుడు స్కూల్లో ప్రాక్టికల్సు రాసుకోడానికి వాడుకునే వన్‌సైడ్ రూల్డ్ నోట్‌బుక్కు. కుడివైపు రూళ్ళూ, ఎడమవైపు తెల్లకాగితమూను.

ఆమె నా చేతుల్లో ఆ నోటుబుక్కు పెట్టగానే నాకు మళ్ళా అక్షరాభ్యాసం మొదలైనట్టుగా, నేను ఆ రోజే కొత్తగా బళ్ళో చేరినట్టుగా అనిపించింది.

మేము వర్క్ సైటుకి చేరుకోగానే అందరం జీపు దిగ్గానే ప్రొఫెసరు సేన్‌గుప్త అతి ప్రయత్నం మీద మోకాళ్ళమీద ముందుకు వాలి మా ఎదురుగా ఉన్న కొండకి నమస్కారం పెట్టాడు. కొంతసేపు కళ్ళుమూసుకుని ఏదో ధ్యానిస్తున్నట్టుగా నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

దేవయ్య అప్పటికే పురమాయించిన మనుషులు అయిదారుమంది అక్కడ సిద్ధంగా మాకోసం ఎదురుచూస్తూ ఉన్నారు. అక్కడంతా బాగా తుప్పలు, పొదలు అల్లిబిల్లిగా

అల్లుకుపోయి ఉన్నాయి. ప్రొఫెసరు తన భుజాన ఉన్న సంచిలోంచి టోపో షీటు తెరిచాడు. ఆ రోజు మేము చూడవలసిన గ్రిడ్డు కొంతసేపు పరిశీలనగా చూసాడు. మా నడక ఎటు నుంచి మొదలుపెట్టబోతున్నామో దేవయ్యకు చేత్తో చూపించాడు. అప్పుడు మా వైపు తిరిగి–

'కమ్ లెట్ అజ్ ఓరియెంట్ అవర్ ట్రాన్సెక్ట్ వాక్ ఫ్రమ్ దిస్ సైడ్' అన్నాడు.

నేనెప్పుడూ కొండల్ని దగ్గరనుంచి చూసిందీ లేదు. అడవిలో అడుగుపెట్టిందీ లేదు. ఊళ్ళో సూర్యోదయం అయినప్పటికీ సూర్యుడు ఇంకా అడవిలో కొండలమీదకి ఎక్కలేదు. అక్కడ అప్పుడప్పుడే తెల్లవారుతున్నట్టుగా ఉంది. ఆ పొద్దుటి పూట అడవి అంతా పసరు వాసన వేస్తూ ఉంది. మా ఎదురుగా ఉన్న కొండ ఒక్కటి కాదు, ఒకదానికొకటి అల్లుకుని భుజం భుజం పట్టుకుని నిలబడ్డట్టుగా ఒక కొండల వరస ఉంది.

ఇప్పుడు మేము ఆ కొండలు ఎక్కాలా అనుకున్నాను. వనలత కంపాసు తెరిచి దిక్కులు స్టడీ చేస్తూ ఉంది. ప్రొఫెసరు నాలుగైదు అడుగులు ముందుకు వేసి నన్ను దగ్గరకు పిలిచాడు.

'ఇవి ఏ అడవులో చెప్పగలవా?' అనడిగాడు.

నాకు అడవులు రెండు రకాలన్న విషయం గుర్తుంది.

'ఇది ట్రాపికల్ డెసిడ్యువస్ ఫారెస్టు కదా' అన్నాను.

ఆయన చిరునవ్వుతో తలూపాడు. ముందు ఉద్యోగం ఇచ్చి ఆ తరువాత ఇంటర్వ్యూ చేసాడన్నమాట అనుకున్నాను.

'యెస్. దీజ్ ఆర్ డ్రై డెసిడ్యువస్ ఫారెస్ట్స్' అన్నాడాయన.

'కాని ఈ ప్రాంతంలో అక్కడక్కడా మాయిస్ట్ డెసిడ్యువస్ ఫారెస్టు కూడా ఉంటుంది. నీకు తెలుసా, పాచెస్ ఆఫ్ సవానా కూడా ఉంటాయి' అని అన్నాడు.

సవానా అంటే గడ్డిభూములని గుర్తుంది. అవి ఎక్కడో ఆఫ్రికాలో కదా ఉంటాయి అనుకున్నాను.

'వెయ్యా పదిహేనువందల అడుగుల ఎత్తులో కొండలమీద మరీ ఫ్లాట్ సర్ఫేస్ ఉన్నచోట ఇక్కడ కూడా సవానా టైప్ ఫారెస్ట్ కనిపిస్తుంది. ఇప్పుడు కాదు గానీ, తర్వాత ఎప్పుడేనా కొండ ఎక్కినప్పుడు చూద్దాం' అన్నాడు.

మొదటిసారి చూసినప్పుడు నన్ను పలకరించడానికి లేచినిల్చున్నప్పుడు తొట్రుపడ్డ స్థూలకాయం కాస్తా అడవిలో ఆ కొండ దగ్గరకు వెళ్ళేటప్పటికి తేలికపాటి దేహంగా మారిపోయినట్టుంది. ఆయన చకచకా అడుగులు వేస్తూ ముందుకు నడుస్తున్నాడు. మిలటరీ వాళ్ళు వేసుకునేలాంటి ఆయన కాన్వాస్ షూసు తపతప చప్పుడు చేస్తున్నాయి.

'ఒరూ, లెట్ అజ్ మూవ్ దిస్ సైడ్' అన్నాడు ఆయన వనలతతో. అక్కడ కొండ వాలు పైకి ఎక్కడానికి అనువుగా ఉంది. మేము కొంత దూరంపాటు ఆ వాలమ్మటే కొండ ఎక్కాక అక్కడ పెద్ద పెద్ద బండరాళ్ళతో పాటు కొండ ముందుకు పొడుచుకు వచ్చినట్టుగా ఉన్నచోట ఆయన ఆగాడు.

'సీ దిస్ ఔట్‌క్రాప్' అన్నాడు.

దాని దగ్గరకు వెళ్ళాడు. ముందు చేత్తో ఆ రాయిపైన ఆప్యాయంగా తడిమాడు. వేలితో ఆ రాతి అంచుల్లో గీతల్ని గుర్తుపట్టే ప్రయత్నం చేసాడు. రెండుమూడు సార్లు ఆ రాతికి దగ్గరగా ముఖం పెట్టి అక్కడేవో అక్షరాలు రాసి ఉన్నట్టుగా, వాటిని చదవడానికి ప్రయత్నిస్తున్నట్టుగా కళ్ళు చికిలించి చూసాడు.

'దేవయ్యా, కమాన్, గివ్ మీ మై హేమర్' అన్నాడు.

దేవయ్య వెనగ్గా ఒకతను మా బాగు మోసుకుంటూ వస్తున్నాడు. అతణ్ణి ముందుకు రమ్మని పిలిచి ఆ బాగు తెరిచి ప్రొఫెసరు చిన్నపాటి హేమరు ఒకటి బయటికి తీసాడు. ఆ సుత్తితో ఆ రాతిమీద మూడు సార్లు చిన్నగా తాటించాడు. మళ్లా నేనెక్కడున్నానో అని అటూ ఇటూ వెతుక్కుని నాకేసి చూసి 'డు యు నో? ద రాక్స్ స్పీక్ టు అజ్' అన్నాడు. 'ఇప్పుడు నేను వాటిని పర్మిషన్ అడిగాను. పని మొదలుపెడతామనీ, కొన్ని సాంపిల్స్ కోసం అక్కడక్కడా రాళ్ళు ముక్కలు చేసుకుంటామనీ అడిగాను. 'ద రాక్స్ గేవ్ దైర్ అసెంట్!' అన్నాడు.

అదంతా నాకొక సైంటిఫిక్ స్టడీ కన్నా కూడా ఒక రిచ్యువలులాగా అనిపించింది. నాముందొక పురాతనమానవుడు తొలిరోజుల్లో చెట్లు నరికేముందు, వేటకి బాణం సంధించే ముందు ప్రకృతిని వేడుకున్నట్టుగా ఆయన ఆ కొండల్నీ, ఆ రాళ్ళనీ ప్రార్థిస్తున్నట్టుగా అనిపించింది. నాకు తెలీకుండానే నాలో ఏదో గంభీరభావన ఉదయించింది. ఆ క్షణాన ఆయన రామలక్ష్మణుల్ని వెంటబెట్టుకుని అడవిలో నడుస్తున్న విశ్వామిత్రుడిలాగా అనిపించాడు.

నన్నూ, వనలతనీ కళ్ళద్దాలు పెట్టుకొమ్మని చెప్పి, తాను కూడా జేబులోంచి కళ్ళద్దాలు తీసుకుని పెట్టుకున్నాడు. అవి సాధారణంగా మోటారుసైక్లిస్టులు పెట్టుకునే రైడింగ్ గ్లాసెసు లాంటివి. అప్పుడు ఆయన హేమరు తీసుకుని ఆ పెద్ద బండరాయి ముందుకు పొడుచుకు వచ్చినచోట అంచు తెగినట్టుగా ఉన్నచోట సుత్తితో గట్టిగా మోదాడు. అరవయ్యేళ్ళకు దగ్గరపడుతున్న ఆ శరీరంలో అంత బలం ఉంటుందని ఊహించలేదు. రెండో దెబ్బకే ఆ రాయి విరిగి రెండు పెద్ద పెళ్ళలు మా ముందు రాలిపడ్డాయి. చిన్నచిన్న తునకలు దూరంగా ఎగిరిపడ్డాయి. ఆయన ముందుకు వంగి ఒక రాతిశకలాన్ని ఏరి చేతుల్లోకి తీసుకున్నాడు. బాగులోంచి చిజ్లెర్లు తీసి ఆ రాతిముక్కని కోసుగా ఉన్నవైపు నున్నగా ట్రిమ్ము చెయ్యడం మొదలుపెట్టాడు. ఆయన ఆ రాతిని చెక్కడం చూసి దేవయ్య ముందు కొచ్చి ఆయన చేతుల్లోంచి ఆ రాతినీ, ఆ చిజ్లెర్నీ తీసుకోబోయాడు. కాని ఆయన అతణ్ణి వారించి తానే ఆ రాతిని చెక్కడం మొదలుపెట్టాడు.

ఆ పని చేస్తున్నంతసేపూ ఆయన దృష్టి ఆ రాతిమీదనే ఉంది. ఆ సమయంలో ఆయన ఒక జియాలజిస్టుగా కాక, ఒక శిల్పిగా కనిపించాడంటే అతిశయోక్తి కాదు. దాదాపు మూడు అంగుళాల వెడల్పు, నాలుగంగుళాల పొడవు ఉండేట్టుగా ఆ రాతిని ట్రిమ్ముచేసాక ముందుకు నాలుగడుగులు వేసి అక్కడే ఒక చెట్టునీడన కూచున్నాడు. నన్ను కూడా తన పక్కకి వచ్చి కూచోమన్నాడు.

తాను వేసుకున్న జెర్కిన్ పాకెట్టులోంచి నోటు పాడు తీసుకున్నాడు. అందులో అప్పటికే రాసి ఉన్న పేజీలు పక్కకి తిప్పి ఒక ఖాళీపేజీ తెరిచాడు. ఆ పేజీల్లో ఎడమవైపు పేజీ ఖాళీగానూ, కుడివైపు పేజీ ఒక గ్రాఫు కాగితం లానూ ఉంది. జేబులోంచి బాల్ పెన్ను తీసి ఆ కాగితం మీద ముందు ఆ రోజు తేదీ రాసాడు. దాన్ని అండర్‌లైను చేసాడు.

'గివ్ మీ థెర్మో అండ్ కంపాస్' అన్నాడు వనలతతో.

ఆమె తన చేతుల్లో ఉన్న కంపాసు ఆయనకిచ్చి, బాగులోంచి చిన్న చెక్కపెట్టె బయటకు తీసింది. అందులో రెండుమూడు రకాల థర్మామీటర్లు ఉన్నాయి. ఒక థర్మామీటరు ఆయనకిచ్చింది. ఆయన ఆ థర్మామీటరు ఒకసారి గట్టిగా విదిలించి రెండు వేళ్ళ మధ్యా పట్టుకుని కళ్ళు చికిలించి చూసాడు.

23 డిగ్రీ సెల్సియస్. 73.4 ఫారన్ హీట్.

'చూడు విమలా. ఫీల్డ్ వర్కర్‌కి నోట్‌బుక్ అంటే చేత్తో పట్టుకు నడిచే గుండెకాయ లాంటిది. మనం ఏమి చూసినా అది ఇక్కడ ఎప్పటికప్పుడు నోట్ చేసుకోవాలి. మా యూనివెర్సిటీ ప్రొఫెసరు మాకో సామెత చెప్పేవాడు. 'ఎంత వెలిసిపోయినా కూడా ఇంకు మెమరీ కన్న గొప్పది' అంటో, ఆ నోటుబుక్కులో లాటిట్యూడ్, లాంగిట్యూడ్‌లు నమోదు చేసాడు. వాటికింద పనసమామిడికొండ అని రాసాడు. దానికింద 9.30 ఎ.ఎం. అని టైము రాసాడు.

అప్పుడు ముందు 'ఎన్' అని ఉత్తరం దిక్కును మార్కు చేసుకున్నాడు. దాని కింద తాను చూస్తున్న కొండ ఆకృతిని స్థూలంగా గీతలాగా గీసుకున్నాడు. తాను కట్ చేసిన రాక్ సాంపిలు సైజు నమోదు చేసాడు. దానిమీద సీరియలునంబరు 1/ 80 అని రాసాడు.

తన జెర్కిన్ ఎడమవైపు పాకెట్లోంచి మాగ్నిఫయింగు గ్లాసు తీసి ఆ సాంపిలుని పరీక్షించడం మొదలుపెట్టాడు. కొంతసేపు పరిశీలనగా చూసాక ఆ నోట్‌బుక్కులో 'ఖోండలైట్ ఫోలియేటెడ్ మెటమార్ఫిక్' అని కూడా రాసుకున్నాడు. పక్కన 'గ్రాన్యులార్' అని రాసుకుని దాని చుట్టూ బాక్సులాగా గీత గీసాడు. దానికింద 'ద ఫస్ట్ నోట్ ఫ్రమ్ ద ఆర్కియన్ టైమ్స్' అని రాసుకున్నాడు. ఆ సాంపిలుని వనలత చేతికిచ్చి నంబరు వెయ్యమన్నాడు. ఆమె బాగులోంచి రెడ్ స్కెచ్చిపెన్ను తీసి ఆ సాంపిలు మీద పెద్ద అక్షరాలతో నంబరు రాసిపెట్టింది.

ఆయన ఆ రాక్ కట్ చేసి ఆ సాంపులు ఛిజెలు చేయటం నాకోసమే చేసి చూపించిన ఒక డెమాన్‌స్ట్రేషను లెసను అనిపించింది.

అప్పుడు ప్రొఫెసరు నన్ను నా నోట్‌బుక్కు తెరవమని చెప్పి, తాను రాసుకున్నట్టే తేదీ, లాట్-లాంగ్‌లు, ఊరు, కొండ, ఆర్.ఎఫ్ అన్ని వివరాలూ రాయించి, 'ఇప్పుడు నువ్వు ఈ చుట్టుపక్కల ఉన్న మొక్కల వివరాలూ, చెట్ల వివరాలూ రికార్డు చెయ్యి' అన్నాడు. మళ్ళా తనే 'నువ్వు ఆ మొక్కల్ని గుర్తుపట్టగలవా? వాటి సైంటిఫిక్ నేమ్సు రాయగలవా?' అనడిగాడు.

నేను తెల్లమొహం వేసాను. మోనో కాటిలెడను, డైకాటిలెడను అనే పదాలు తప్ప ఆ క్షణాన నాకు మరేమీ గుర్తు రాలేదు. ఒక అడవి ముందు నిలబడ్డప్పుడు అంతదాకా నేను చదువుకున్న చదువు ఎంత నిష్ప్రయోజనమో నాకు ఒక్కసారిగా తెలిసి వచ్చింది.

ప్రొఫెసరు నా అవస్థ చూసి చిరునవ్వాడు. ఆ చిరునవ్వు నన్ను చెప్పలేనంతగా తేలికపరిచింది.

'నో ఇష్యూస్. ఐ కెన్ అండర్ స్టాండ్. ప్లీజ్ కలెక్ట్ ద సాంపిల్స్. గివ్ ఈచ్ వన్ ఆఫ్ దెమ్ ఎ నంబర్. ఇంటికి వెళ్ళాక ఓపిగ్గా రిఫర్ చేసి డిటెయిల్డ్ నోట్సు రాసుకుందువు గాని' అని అన్నాడు. 'అండ్, రిమెంబర్, నీ నోట్సులో వట్టి సాంపిల్సూ, డిటెయిల్సూ కాదు. ప్రతి రోజూ ఫీల్డ్‌లో నువ్వేం ఫీలయ్యావో ఆ ఫీలింగ్స్ కూడా రికార్డు చెయ్యాలి. మా ప్రొఫెసర్ అనేవాడు 'ఫీల్డ్ నోట్ బుక్ ట్రావెలర్ స్కెచ్‌బుక్ లాంటిది. సముద్రం దగ్గరికి వెళ్ళావనుకో. ఆ ఉప్పదనం కూడా ఆ బొమ్మల్లోకి రావాలి. అలాగే మీరు ఫీల్డ్ మీదకి వెళ్ళినప్పుడు, ఆ సంతోషం, ఆ సైలెన్స్ కూడా మీ నోట్‌బుక్ లోకి రావాలి' అనేవాడు.

'ఆయన ఎప్పుడూ డార్విన్ నోట్‌బుక్స్ గురించి చెప్పేవాడు. ఆ నోట్‌బుక్స్‌లో రాళ్ళ గురించీ, ఫాజిల్సూ, మొక్కలూ, జంతువుల గురించీ మాత్రమే కాదు, మాపులు, డ్రాయింగ్స్, షాపింగ్‌లిస్టులు, వ్యాసాలు, నోట్సు, డైరీ ఎంట్రీలు అన్నీ ఉన్నాయి. మనం ఫీల్డ్‌లో గడిపిన రోజుల్ని మన నోట్‌బుక్స్ మన వెంట తీసుకురావాలంటే అలాగే నింపిపెట్టుకోవాలి వాటిని అనేవాడు.'

'ఇప్పుడు నీక్కూడా అదే మాట చెప్తాను. నీ నోట్ బుక్కులో మొక్కల్తో నీ కాన్వర్సేషన్స్ రికార్డు చెయ్యాలి, తెలుసునా?' అని అన్నాడు.

నాకు వళ్ళు ఝల్లుమంది.

మొక్కల్తో సంభాషణ.

మొక్కల్తో మాట్లాడవచ్చుననే నాకెవరూ ఇప్పటిదాకా చెప్పలేదు. ఆ ఊహనే ఎంతో థ్రిల్లింగుగా అనిపించింది. నేను అప్రయత్నంగా నా చుట్టూ చూసాను. అక్కడ కొండచుట్టూ, కొండమీదా పెరిగిన తరులతాగుల్మాదులన్నీ నాతో మాట్లాడటానికి నా చుట్టూ మూగేయి అనిపించింది. తమతో తాము పోటీపడుతున్నట్టుగా అనిపించింది. నేను ఒంటరిదాన్ని కాననీ, సమస్త మహారణ్యం నన్నొక్కసారిగా తనదానిగా చేసుకున్నదనీ అనిపించింది.

❋

5

వారం రోజుల్లో తయారవుతుందన్న కుటీరం పూర్తిగా తయారయ్యేసరికి రెండువారాలు దాటింది. దీపావళి వెళ్ళిన రెండోనాడు ఆ కుటీరంలో ప్రవేశించడానికి జోసెఫ్ గారు ఏర్పాట్లు చేసారు. దాన్ని ఆయన దాదాపుగా గృహప్రవేశంలాగా చేయించారు. ఆ రోజు కూడా మళ్ళా ఊళ్ళోవాళ్ళని పిలిచారు. గ్రామపెద్దల్నీ, ఫారెస్టు డిపార్టుమెంటులో తనతో పనిచేసే సిబ్బందినీ, చుట్టుపక్కల స్కూళ్ళల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్నీ భోజనానికి ఆహ్వానించేరు.

ఆ కుటీరం చూడటానికి చాలా అందంగా తయారయ్యింది. వంటగదికాక రెండు గదులూ, ఒక వీథరుగూ ఉన్నాయి. ఆ రెండు గదుల్లోనూ వెదురుతోనే మంచాల్లాగా ఏర్పాటు చేసారు. ఇంటి ఆవరణలో మామిడిచెట్ల కింద కూచోడానికి కొయ్యతోనూ, వెదురుతోనూ సీట్లు ఏర్పాటు చేసారు. సాయంకాలం పూట లాంతరు తగిలించుకోడానికి ఒక లాంటర్న్ పోస్టు కూడా.

ఆ కుటీరానికి ఏం పేరు పెడితే బాగుంటుందని జోసెఫ్ సేన్ గుప్తాని అడిగాడు. ఆయన ఒకటి రెండు నిమిషాలు ఆలోచించి 'బొకుల్ కుటి' అని పెట్టండి అన్నాడు.

వకుళ కుటి.

బొగడపూల పొదరిల్లు.

'గురుదేవులకి ఎంతో ఇష్టమైన పూలచెట్టు అది' అని అన్నాడు.

ఆ రోజు మాకు ఫీల్డు వర్కు ఆఫ్. మధ్యాహ్నం విందు ముగిసాక నేను ఇంటికి వచ్చేస్తుంటే వనలత 'సాయంకాలం రారాదూ కాసేపు మాట్లాడుకోవచ్చు' అంది. ఆమె

నాతో ఆత్మీయంగా మాట్లాడిన మొదటి సందర్భం అది. నాకు ఆశ్చర్యం వేసింది. సంతోషంగా కూడా అనిపించింది.

ఆ సాయంకాలం ఇంకా వెలుతురు ఉండగానే నేను వకుళకుటికి వెళ్లాను. ప్రొఫెసరుగారూ, వనలతా రెండు గదుల్లోనూ తమ సామాను సర్దుకుంటూ ఉన్నారు. నేను వనలత గది గుమ్మం దగ్గర నిలబడగానే ఆమె చిరునవ్వుతో నా చెయ్యిపట్టుకుని తనగదిలోకి తీసుకువెళ్ళింది. అక్కడ ఒకవైపు బల్లమీద ఆమె పుస్తకాలతో పాటు ఒక ఖాళీకప్పుని ఫ్లవర్‌వాజుగా మార్చిపెట్టుకుంది. మరో పక్క వెదురుదండెం మీద ఆమె దుస్తులు, వెదురు మంచం మీద ఒక కొత్త పరుపు, బహుశా జోసెఫ్ గారే ఏర్పాటు చేసి ఉంటారు. దాని మీద బెంగాల్‌కాటను బెడ్‌స్ప్రెడ్. లేతపసుపు అంచుతో తెల్లటిదుప్పటి. తలగడకి కూడా అదే డిజైన్ పిల్లోకవరు. ఒక్కరోజులో వాళ్ళ చుట్టూ వాతావరణాన్ని మాజికలుగా మార్చేసారు అనుకున్నాను. అక్కడ ఒక కేనుమోడా మీద కూర్చోబోతుంటే, 'పర్వాలేదు, కాట్ మీదనే కూచో' అంది.

ఆ మంచం మీద కూచుని చుట్టూ పరికించాను. ఆ బల్లమీద నేను అంతకుముందు గమనించని చిన్న వస్తువొకటి కనబడింది. నల్లగా దీపం ప్రమిదలాగా ఉంది.

'ఏమిటది?' అనడిగాను.

'అదా!' అంటో ఆమె దాన్ని తీసి నా చేతుల్లో పెడుతూ 'మై ఫస్ట్ ఫాజిల్ కలెక్షన్' అంది.

దాన్ని పరిశీలనగా చూసాను. అది ఏదో పక్షినో, కీటకమో లేదా ఏదో జంతువు ఎముకనో లేదా దంతమో భూమిపొరల్లో నిక్షిప్తమైపోయి శిలాజంగా మారిపోయి ఉండవచ్చనుకున్నాను.

'యు నో. దట్స్ ఎ రేర్ ప్లాంట్ ఫాజిల్. ఇట్ మస్ట్ బి ఆఫ్ ఎ మిలియన్ యియర్స్ ఓల్డ్. నేను మొదటిసారి ఒక హిమాలయన్ స్టడీ టూర్‌లో వెళ్ళినప్పుడు దొరికింది. ఇది నా ఫీల్డ్ వర్క్ టాలిస్‌మన్ అనుకో. ఇది దగ్గరుంటే ఫీల్డ్‌వర్క్‌లో ఎలాంటి ఇబ్బందులూ ఉండవని నమ్ముతాను' అంది.

'ఇది కూడా నేను కాకూ (చిన్నాన్న) నుంచి నేర్చుకున్న పాఠమే. ఆయన దగ్గర ఒక పీస్ ఆఫ్ రాక్ ఉంటుంది ఎప్పుడూ. అది ఆయన కర్నూలు-కడప బేసిన్‌లో పనిచేస్తున్నప్పుడు శ్రీశైలంలో దొరికింది. ప్రి కేంబ్రియన్ కాలానికి చెందిన క్వార్ట్జ్. 70 కోట్ల సంవత్సరాల వయసు ఉండొచ్చు ఆ రాతికి. దాన్ని ఆయన ప్రాణంలాగా

చూసుకుంటాడు. ఎక్కడికివెళ్ళినా కూడా ఉంటుంది. చివరికి కలకత్తాలో ఉన్నప్పుడు కూడా తన బెడ్‌రూములోనే పెట్టుకుంటాడు' అంది.

నేను ఆ వృక్షశిలాజాన్ని మరోసారి నా వేళ్ళతో తడిమి చూసాను. ప్రొఫెసరు నన్ను మొక్కల్తో మాట్లాడటం మొదలుపెట్టమన్నాడు. మొక్కలంటే ఈ వృక్షశిలాజాలు కూడానా? ఎన్నో లక్షలసంవత్సరాల కింద ఏ హిమానీ ప్రవాహాల్లోనో కొట్టుకొచ్చిన ఒక ఆకు ఎక్కడో ఏ జలాశయం కిందనో రాళ్లపొరలమధ్య చిక్కుకుపోయి ఇలా ఘనీభవించింది. ఇప్పుడు నేను దానితో ఏ భాషలో మాట్లాడాలి?

మేము మాట్లాడుకుంటూ ఉండగా రాములమ్మ టీ తీసుకొచ్చింది.

'మనం ఈవెనింగ్ వాక్‌కి వెళ్దామా?' అనడిగింది వనలత.

నేను ఆ ఊరు వెళ్లిన రెండోరోజున తిరిగిందే తప్ప మళ్ళా ఊళ్ళోగాని, ఊరు బయటగాని నడిచింది లేదు. ఆమె ఈవెనింగ్ వాక్ అనగానే నాకు ఏటి ఒడ్డున యూకలిప్టసు తోట గుర్తొచ్చింది.

'నేనో స్పాట్ చూసాను. అక్కడిదాకా వెళ్దామా' అనడిగాను.

తీరా మేము గది తలుపు దగ్గరకు వేసి బయటికి అడుగుపెట్టబోతుంటే ప్రొఫెసరు కూడా తన గదిలోంచి బయటకి వస్తూ తాను కూడా మాతో పాటు నడుస్తానన్నాడు.

మేము నేరుగా రోడ్డమ్మట ఏటిదాకా వెళ్ళి, అక్కడ రోడ్డు దిగి మట్టిబాటమ్మట ఏటి మలుపు వైపుకు తిరిగాం. ఆ ఏరు చూస్తూనే ప్రొఫెసరు 'అయ్యో, నేను షూస్‌తోనే వచ్చేసేనే? ఇప్పుడెలా' అన్నాడు.

'ఆ షూస్ తీసి నాకివ్వండి. ఏరు దాటాక మళ్ళా వేసుకుందురు గాని' అన్నాను.

ఆయన షూస్ విప్పడమైతే విప్పాడుగాని నేను వాటిని పట్టుకుంటానంటే ఒప్పుకోలేదు. వాటిని తనే ఎడమచేత్తో పట్టుకుని ఆ కాలవనీళ్ళల్లో దిగాడు.

'మరీ లోతుగా లేదు' అన్నాడు, సులువుగా అడుగుతీసి అడుగు వేస్తూ.

ఏరు దాటి అవతలి వైపు వున్న యూకలిప్టసు చెట్ల దగ్గరకి నడిచాం. శరత్కాలపు చల్లదనం ఆ చెట్లకింద మామీద ఒక వస్త్రం కప్పినంత దగ్గరగా అనుభవానికొచ్చింది. చెట్ల మీద పూత చివరిరోజుల్లో ఉంది. ఆకులు ముదురునీలంవన్నె తిరిగి ఇంక

పండిపోడానికి సిద్ధమవుతూ ఉన్నాయి. గాలి వీచినప్పుడల్లా ఆ వనం మా మీద సుగంధ తైలం స్ప్రే చేస్తున్నట్టుగా ఉంది.

ఆ చెట్ల కిందనే కొద్దిగా సమతలంగానూ, పొడిగానూ ఉన్న చోటు చూసుకుని ప్రొఫెసర్ సేన్‌గుప్త చతికిలబడి కూచున్నాడు. నేనూ, వనలతా ఆ తోటలో అటూ ఇటూ పచార్లు చెయ్యడం మొదలుపెట్టాం. సాయంకాలపు బంగారు కాంతి తెల్లటి చెట్ల కాండాల మీద పడుతూ ఉంటే ఆ వెలుగు నిలువుటద్దాల మీద పడుతున్నట్టుగా ఉంది. ఇంతలో ఎవరో ఆ ఏటికి అడ్డం పడి వేగంగా మావైపు వస్తూండటం కనిపించింది.

ఆ వచ్చేదెవరై ఉండవచ్చునా, ఎందుకొస్తున్నారా అని మేము ఆలోచనలో పడి ఉండగానే మాముందు ఒక యువకుడు ప్రత్యక్షమయ్యాడు.

'నేను సార్ రాజుని' అన్నాడు.

మేము గుర్తు తెచ్చుకునేలోపే-

'ఆ రోజు కలిసాం కదా. టాగోర్ నవల్లో కేరక్టరా మీరు అని అడిగానే ఆ రాజుని' అన్నాడు.

ఆ రోజు అతణ్ణి కనుచీకటిలో చూసినందువల్ల నిజంగానే గుర్తులేదు. కాని ఇప్పుడు చూస్తుంటే ఆ రోజు కనిపించినట్టే ఈ రోజు కూడా ఆ కళ్ళు షార్పుగా కనిపిస్తున్నాయి. షార్పు గానే కాదు, ఆ చూపుల్లో ఒక దీప్తి కూడా ఉంది.

అతను నేరుగా ప్రొఫెసరు సేన్‌గుప్తకి ఎదురుగా తను కూడా నేలమీద చతికిలపడి కూచున్నాడు.

'మీరు ఇలా ఏటి వైపు నడుస్తుండటం కనబడింది. సాయంకాలం వేళ ఇలా ఎక్కడికి వెళ్తున్నారో అర్థం కాలేదు. అందుకని మిమ్మల్ని ఫాలో అయ్యాను. మీరు ఈవెనింగ్ వాక్‌కే కదా వచ్చారు' అన్నాడు.

సేన్‌గుప్తా అతణ్ణి మందహాసంతోనే పలకరించి అవునన్నట్టుగా తలాడించాడు.

'మీరు మధ్యాహ్నం లంచ్‌కి వస్తారనుకున్నాం. ఎందుకు రాలేదు?' అనడిగాడు అతణ్ణి.

'లంచ్‌నా ? ఎందుకు? ఎక్కడ' అనడిగాడు రాజు.

సేన్‌గుప్తా ఏమీ మాట్లాడలేదు. బహుశా జోసెఫ్ అతనికి ఆహ్వానం పంపించకపోయి ఉండవచ్చు. తాను అనవసరంగా ఆ ప్రస్తావన తెచ్చానా అనుకున్నట్టున్నాడు.

'ఈ రోజు ప్రొఫెసరుగారు కొత్తకుటీరంలో గృహప్రవేశం చేసారు. అందుకని ఫారెస్ట్ ఆఫీసరుగారు లంచ్ హోస్ట్ చేసారు. బహుశా మిమ్మల్ని పిలిచినట్టు లేదు' అన్నాన్నేను అతనితో.

'అలానా! నేను ఊళ్ళో లేను. కాకినాడనుంచి మధ్యాహ్నమే వచ్చాను. అందుకని నాకు తెలియలేదు' అన్నాడు. 'గృహప్రవేశమా! ఓ కొత్త కుటీరం కదా! ఫారెస్టరు గారి ఇంటిదగ్గర. కడుతుండగా చూసానులే' అని కూడా అన్నాడు.

'మీరు కాకినాడ ఎందుకు వెళ్లారు' అనడిగాను. 'ఇంతకీ మీరేం చేస్తుంటారో చెప్పనేలేదు' అని కూడా అన్నాను.

'నేను డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాను. మా నాన్నగారు ఇక్కడ రైతు. మాకు ఒక మామిడితోట కూడా ఉంది. కాని ఆయనకి నేను రైతుని కావడం ఇష్టం లేదు. చదువు కోవాలని కోరిక. అందుకని కాకినాడలో చదువుకుంటున్నాను. అక్కడ రూము తీసుకుని ఉంటున్నాను. ఎప్పుడు తోచకపోయినా ఇదిగో ఇలా వచ్చేస్తుంటాను' అని చెప్పాడు.

ఒక విధంగా ఆ అయిదారువాక్యాల్లో తన మొత్తం బయోడేటా చెప్పేసాడనే అనుకున్నాను. అతను చెప్పిన వివరాల్ని ఇంగ్లిషులోకి అనువదించి సేన్‌గుప్తాకి చెప్తుంటే 'ఓ ఐ యామ్ సారీ. ఇంగ్లిషులో చెప్పి ఉండాల్సింది. ఇక మీదట ఆ పొరపాటు చెయ్యను' అని ఇంగ్లిషులోనే చెప్పాడు.

సేన్‌గుప్తా మళ్ళా అతణ్ణి చూసి మందహాసం చేసాడు. ఆ పిల్లవాడిలో ఆయన్నేదో మొదటిచూపులోనే ఆకర్షించింది అనుకున్నాను.

'బి ఏ లో ఏమిటి సబ్జెక్ట్స్?' వనలత అడిగింది.

'పొలిటికల్ సైన్స్, ఇకనమిక్స్, హిస్టరీ'

'ఒరుణిమా! మన శచీంద్రది కూడా ఇదే కాంబినేషన్ కదా' అనడిగాడు సేన్‌గుప్త.

'ఒరుణిమా ఎవరు?' అనడిగాడు రాజు. శచీంద్ర ఎవరు అని అడగవలసింది మర్చిపోయి.

'ఒరుణిమా అంటే నేనే' అంది వనలత నవ్వుతూ.

'అదేమిటి మీ పేరు వనలత కదా. జీవనానందదాస్ పొయెంలో కేరక్టరు కదా. జీబనానందదాస్. యామై రైట్?' అనడిగాడు రాజు.

'అవును. జీబొనానందదాస్‌నే. ఒరుణిమ కూడా ఆయన పొయెంలో కేరక్టర్‌నే' అంది వనలత మళ్ళా నవ్వుతూ. ఈ సారి ఆమె నవ్వులో చిన్న కొంటెతనం కూడా వచ్చి చేరింది.

'ఒక మనిషికి రెండు పేర్లా! అది కూడా రెండు కవితలనుంచా! దిస్ మస్ట్ బి ఎ గ్రేట్ లగ్జరీ, ఐ బిలీవ్' అన్నాడు రాజు.

ఈసారి వనలత వదనంలో నవ్వు అదృశ్యమై గంభీరంగా మారింది. 'వనలత మా నాన్న పెట్టిన పేరు. కాని మా కాకూకి నన్ను చూస్తే తాను ఎప్పుడో వదిలిపెట్టిన గ్రామాలు, మర్చిపోయిన గ్రామాలు గుర్తొస్తాయట. జీబొనానందదాస్ ఒక కవితలో అరుణిమా సన్యాల్ అనే ఆమె గురించి ప్రస్తావిస్తాడు. ఆమెని చూస్తే ఎప్పుడో కనుమరుగైన గ్రామాలు గుర్తొస్తాయంటాడు. అందుకని కాకూ నన్ను ఒరుణిమా అని పిలుస్తుంటాడు' అంది.

'కనుమరుగైన గ్రామాలా? ఎందుకు? ఏదైనా ట్రాజెడీ ఉందా మీ జీవితంలో?'

అలా చకచకా నిస్సంకోచంగా ప్రశ్న వెనక ప్రశ్న అడుగుతున్న ఆ పిల్లవాణ్ణి చూసి నాకు ఆశ్చర్యం వేసింది. చూసిన రెండోరోజునో, మూడో రోజునో ఇలా ప్రశ్నలు అడగడం నాకైతే ఊహకి కూడా అందని సంగతి.

కాని సేన్‌గుప్త అతడికి జవాబిచ్చాడు.

'అవును. ఐ యామ్ ఎ విక్టిమ్ ఆఫ్ పార్టిషన్. వుయ్ ఆర్ ఆల్ విక్టిమ్స్' అని వనలతని కూడా చూపిస్తూ, 'ఇన్నొసెంట్ విక్టిమ్స్మి మేమంతా' అని అన్నాడు.

అప్పుడు సుదీర్ఘంగానే తన గురించి చెప్పుకొచ్చాడు. ఆయన పుట్టింది తూర్పు బెంగాల్లో. దేశవిభజనలో అది తూర్పుపాకిస్తానుగా మారిపోయింది. సేన్‌గుప్తల పూర్వీకులు ఆయుర్వేదవైద్యులు. బ్రిటిష్ పాలనాకాలంలో కొందరు సేన్‌గుప్తలు రెవల్యూషనరీలుగా కూడా మారారు. సేన్‌గుప్త తండ్రి ఒకప్పుడు పెద్ద లాయరు. కానీ సహాయ నిరాకరణ ఊద్యమంలో పాల్గొన్నప్పుడు తన వృత్తి వదిలిపెట్టేసాడు. కొన్నాళ్లు జైలుకి కూడా వెళ్ళాడు. ఉద్యమంలో పోగొట్టుకున్నది పోగా, మిగిలిన ఆస్తిపాస్తులతో కుటుంబం నడుపుకుంటూ ఉండేవాడు. జాతీయోద్యమం ఆ కుటుంబాన్ని దెబ్బ తీయలేదు.

కానీ పార్టిషను పూర్తిగా ధ్వంసం చేసేసింది. దాంతో సేన్‌గుప్త తండ్రి తన ఇద్దరు మగపిల్లల్నీ, ఇద్దరు ఆడపిల్లల్నీ తీసుకుని భారతదేశానికి వచ్చేసాడు. అక్కడ తమ ఇల్లు, పొలాలు, బంధువర్గం అన్నీ వదులుకుని వచ్చేసాడు. అప్పటికి సేన్‌గుప్త ఢాకాలో గ్రాడ్యుయేషను పూర్తిచేసాడు. వాళ్ళన్నయ్య పోస్ట్ గ్రాడ్యుయేషను చదువుతున్నాడు. కాని పార్టిషనులో కట్టుగుడ్డల్తో కలకత్తా వచ్చేసాక సేన్‌గుప్త తండ్రి ఆ అనుభవాన్ని తట్టుకోలేక పోయాడు. వచ్చిన కొన్నాళ్ళకే మరణించాడు. సేన్‌గుప్త అన్నయ్య కలకత్తాలో చిన్న ఉద్యోగంలో చేరి తమ్ముణ్ణి చదివించాడు. చెల్లెళ్ళకు పెళ్ళిళ్లు చేసాడు. తల్లిని దగ్గర పెట్టుకుని చివరిదాకా ఆమెకు సేవచేసాడు. సేన్‌గుప్తాకి లెక్చెరరు ఉద్యోగం దొరికాక అన్నయ్యకు తోడుగా నిలబడ్డాడు. ఆ కుటుంబం మళ్ళా ఆర్థికంగా నిలబడింది. సేన్‌గుప్తకి తన అన్నయ్య అంటే తండ్రితో సమానం. అపారమైన గౌరవం. తమ కుటుంబాలను నిలబెట్టాడని చెప్పలేనంత కృతజ్ఞతాభావం.

'కాని నేను నా పుట్టిన ఊరికి మళ్ళా వెళ్ళలేకపోయాను. నేను పెద్దయి ఉద్యోగం వచ్చాక కూడా మా నాన్నని తీసుకు వెళ్ళలేకపోయాను. జీవితమంతా ఈ లోటు నన్ను వెంటాడుతూనే ఉంటుంది' అన్నాడు సేన్‌గుప్తా.

'ఎందుకు? బంగ్లాదేశ్ వెళ్ళడం కష్టమేమీ కాదు కదా?' అనడిగాడు రాజు. నాక్కూడా అదే ప్రశ్న నోటిలో ఆడుతూ ఉంది.

'అవును. వెళ్లగలను. ఢాకా యూనివెర్సిటీనుంచి కూడా చాలా సార్లు పిలిచారు. కాని, వెళ్లలేదు' అన్నాడు ఆయన.

'అవును వెళ్ళలేదు. ఎందుకంటే?–' తన ఎదట రాలి పడి ఉన్న యూకలిప్టస ఆకునొకటి చేతుల్లోకి తీసుకుని దాన్ని ఒక పక్షిరెక్కను తడిమినట్టు ఆప్యాయంగా తడిమాడు.

'వెళ్ళలేను కాబట్టి' అన్నాడు.

'ఎప్పటికీ వెళ్ళలేను కాబట్టి' అని అన్నాడు మరోసారి.

ఈసారి ఆ కంఠం చాలా బలహీనంగా ఉంది. మరోక్షణం ఆగితే ఆయన భోరున ఏడుస్తాడేమో అనిపించింది. కాని తనను తాను సంబాళించుకున్నాడు.

'ఒరుణిమా, నాకేదైనా ఒక గీతం వినాలని ఉంది' అన్నాడు.

'వనలత పాటలు పాడుతుందా?' ఆశ్చర్యపోయి పైకే అడిగేసాను.

వనలత చిరునవ్వి, గొంతు సవరించుకుంది.

'షల్ ఐ సింగ్ ఏ ఉదాసీ హవార్?' అనడిగింది ఆయన్ని.

ఆ పాట వినగానే ఆయన కళ్ళల్లో ఒక మెరుపు కనబడింది. కాని అది సంతోషపు మిలమిల కాదు. ఏదో జీర. ఎప్పటివో అనుభవాలు నిన్ను ఎప్పటికీ వదలవని తెలిసిన ఒక ఎరుకతో వచ్చే జీర. కాని నిన్ను వదిలిపెట్టని నీ బాధ ఒక్కటే నీ నిజమైన తోడు అని తెలియడంలోని సంతోషం కూడా ఉంది ఆ మెరుపులో.

'యే ఉదాసీ హవార్ పొథే పొథే.. పాడు ఒరుణిమా, పాడు, ప్లీజ్' అని అన్నాడు ఆయన ఆర్తిగా, బేలగా, లాలనగా.

వనలత పాడటం మొదలుపెట్టింది.

'యే ఉదాసీ హవార్ పొథే పొథే..'

ఆయన వెంటనే ఆమెని ఆపాడు.

మాతో 'చూడండి. ఆ ఉదాసీ హవా. ఆ మాట గుర్తుపెట్టుకోండి. ఉదాసీ అంటే' అని దానికి తగ్గ ఇంగ్లిషుపదం కోసం వెతుక్కున్నాడు. స్ఫురించలేదు.

'ఉదాసీ హవార్– సుచిత్రా మిత్రా గొంతులో వినాలి ఆ పదం. ఆ మాటే చెప్పాను ఆమెకి. ఆ ఒక్కపదంలో సముద్రమంత శూన్యం ఇమిడ్చిపెట్టాడు గురుదేవ్. ఆ బరువు అందరూ తేలిగ్గా మొయ్యగలిగేది కాదు. ఐ యామ్ సారీ, ఒరుణిమా గో ఆన్' అని అన్నాడు.

'యే ఉదాసీ హవార్ పొథే పొథే..'

వనలత పాట మొదలుపెట్టింది.

ఆమె గొంతులో ఏమి తియ్యదనమో గాని, యూకలిప్టస్ గాలి దానిముందు తేలిపోయింది.

ఏ ఉదాసీ హవార్ పొథే పొథే
ముకుల్ గులి ఝురే
అమి కుడియె నియేచ్చి

తొమార్ చొరొణె దియేచ్ఛి
లాహెూ లాహెూ కొరునో కొరె

(ఈ ఉదాసీన పవన పథంలో మొగ్గలు వాడిరాలిపోతున్నాయి. నీకు సమర్పించడానికి ఏరితెచ్చుకున్నాను ఈ పూలని, ప్రభూ, కరుణతో స్వీకరించు)

ఆమె ఆ పల్లవి వెంట ఒక చరణం ఆలపించింది. ఆ చరణం తరువాత మరొక చరణం–

జాఖోన్ జాబొ చోలే ఒరా ఫూట్బే తొమార్ కొలే
తోమార్ మాలా ఘటార్ అంగుల్ గులి మొధురొ బేదొనొభొరే
జెనో అమాయ్ స్మొరొణొ కరే

(నేను సెలవుతీసుకున్న తరువాత అవి నీ ఒడిలో విప్పారతాయి. అప్పుడు వాటిని మాలగా అల్లుతున్న నీ అంగుళులు నా మధురవేదనని ఇంచుక స్మరించాలని నా కోరిక)

బోకథాకావ్ తోంద్ర హరా బిఫోలో బథాయ్
డాక్ దియే హెూయ్ షోరా ఆజ్ బిభొరొ రాతే

(నిద్రకరువైన కోకిల తన విఫలవ్యథతో ఈ రాత్రంతా పాడుతూనే ఉంటుంది)

దుజొనేర్ కనాకని కొథా దుజొనేర్ మిలొనొ బిహ్వలతా
జ్యోత్స్నధరాయ్ జాయ్ భీసే జాయ్ దొలేర్ పూర్ణిమతే
ఏ ఆభాస్ గులి పోడ్బే మాలొయ్ గథా కాల్ కే దినేర్
తోరే తోమార్ అలొసొ దిప్రోహరె

(మన గుసగుసలు, మన సమ్మోహభరిత సంగమం తొలివసంత జ్యోత్స్నలో కొట్టుకు పోతాయి. రేపటి నీ సోమరి మధ్యాహ్ననికి మాలగా గుచ్చిన స్మృతులు మాత్రమే మిగుల్తాయి)

ఆమె పాడుతున్నంతసేపూ ఆ యేరు, ఆ చెట్లు, ఆ పొలాలు అన్నీ ఆగిపోయి వింటున్నట్టే ఉన్నాయి. ఆ గీతంలో విషాదం లేదు. జీవితం పట్ల అంగీకారం ఉంది. ఈశ్వరుడి చరణాల ముందు తాను సమర్పించగలిగింది తన వేదనని మాత్రమే అనే ఒక నిర్లిప్త ఆరాధన ఉంది. ఆమె పాడటం ముగించేటప్పటికి ఎక్కడో పద్మానదిమీంచి వీచిన గాలి ఆ ఊరిచివర ఏటిదాకా ప్రసరించిందనిపించింది.

మా మధ్య నిశ్శబ్దం అలముకుంది.

'కమాన్ లెట్ అజ్ మేక్ ఎ మూవ్' అన్నాడు సేన్‌గుప్త అందరికన్నా ముందు తానే లేస్తూ.

మేము కూడా లేచి ఆయన్ని అనుసరించాం.

ఏరు దాటి మళ్ళా మట్టిబాటవెంబడి రోడ్డుమీద అడుగుపెట్టేసరికి ఆకాశంలో నెలవంక. ఇంకా అరుణిమ చెరిగిపోని ఆ సాంధ్యగగనం మీద ఆ నెలబాలుడు కూడా ఆ పాట వినడానికి ఆకాశంలో అడుగుపెట్టాడా అనిపించింది.

'గురుదేవుల గీతం ఏది విన్నా నన్ను నేను నిగ్రహించుకోవడం కష్టమైపోతుంది' అని అన్నాడు సేన్‌గుప్త. 'ఆయన ఎంత ఆనందం చూసాడో అంత దుఃఖం కూడా చూసాడు. గురుదేవులు రాసినంత విస్తారంగా రాయలేదుగాని జీవన్ బాబులో కూడా ఆ వెలుగూ, చీకటీ అంత ఇంటెన్స్‌గానూ కనిపిస్తాయి'అని అన్నాడు.

'జీవనానందబాబుది బారిసాల్. మాకులానే ఆయన కూడా కొన్నాళ్ళు ఢాకాలో, ఆ తర్వాత చాలాకాలం కలకత్తాలో గడిపాడు. గురుదేవుల్లానే జీవన్‌బాబు కూడా అవిభక్త బెంగాల్ సౌందర్యానికి వారసుడు. ఆ నదులు, ఆ పొలాలు, ఆ పడవలు, ఆ కొంగలు, ఆ రెల్లుపూలు, ఆ రావిచెట్లు, ఆ బుల్బుల్ పిట్టలు–టాగోర్, జీవన్ బాబు– వీళ్ళిద్దరిలోనే నేను నా బెంగాల్‌ని చూసుకుంటూ ఉంటాను' అని అన్నాడు.

ఆ సాయంసంధ్యవేళ ఆ కొండప్రాంతంలో ఆ ఏటి ఒడ్డున ఆ తండ్రీ కూతుళ్ళతో నడుస్తూ, ఆయన టాగోర్ గురించీ, జీవనానంద దాస్ గురించీ చెప్తో ఉంటే, ఆ మాటలు వింటూ వాళ్లతో పాటు కలిసి నడిచిన ఆ సమయం నేనెప్పటికీ మర్చిపోలేను.

'మీకో సంగతి చెప్పనా! మనిషి ఎక్కడికి వెళ్ళినా తనదంటూ ఒక చిన్న ప్రపంచాన్ని తన వెంటపెట్టుకునే వెళతాడు. ఆ ప్రపంచాన్ని తాను పోగొట్టుకున్నాడని అనుకుంటాడుగానీ అది ఎక్కడికీ పోదు. అతనిలోనే ఉంటుంది. ఆ మనిషేగనుక ఒక కవినో, గాయకుడో చిత్రకారుడో అయితే అతడు ఎవరిని కలిస్తే వాళ్ళకి కూడా ఆ ప్రపంచాన్ని ఇంత తుంచి పంచిపెడతాడు. గురుదేవులు జీవించినంతకాలం చేసింది ఆ పనే. జీవన్ బాబు కలకత్తా వచ్చినా కూడా తన బారిసాల్‌నీ, తన కీర్తనకోలా, తన ధనశ్రీ నదుల్నీ, ఆ పలాశ వృక్షాల్నీ, ఆ పంటపొలాల్నీ వెంట పెట్టుకునే వచ్చాడు. ఏ పొలిటికల్ పార్టిషన్ కూడా

బ్రేక్ చెయ్యలేని దేశం అతనిది. నాకు మా ఊరు చూడాలనిపించినప్పుడల్లా ఒక బావుల్ గీతాన్నో, ఒక జీవన్ బాబు కవితనో, గురుదేవులు రాసిన కథనో ఆశ్రయిస్తాను. వాటిని నానుంచి ఎవరూ తీసుకుపోలేరనిపిస్తుంది. ఆ గ్రామాలు నిజంగా కనుమరుగైపోయాయా అని అనుమానం వస్తే, ఇదుగో, మా ఒరుణిమ నా కళ్ళముందే కదుల్తూ అవెక్కడికీ పోలేదని గుర్తుచేస్తూనే ఉంటుంది' అని కూడా అన్నాడు.

ఆయనతో నడుస్తూ ఆ మాటలు వింటూండగా నాకు మొదటిసారిగా నా జీవితం నా ఇల్లు, నా కుటుంబం అనే సరిహద్దుల్ని దాటి ప్రపంచమంతా విస్తరించింది అనిపించింది. ఇదుగో నా పక్కన ఒక మానవుడున్నాడు, ఇతడి వెనక నదులున్నాయి, కొండలున్నాయి, మహాకవులున్నారు అని నాకు నేను చెప్పుకున్నాను. నా హృదయం గొప్ప కృతజ్ఞతా భావంతో నిండిపోయింది. దాన్ని ఎలా ప్రకటించాలో తెలీక నా పక్కనే నడుస్తున్న వనలత చేయి నా చేతుల్లోకి తీసుకుని ప్రేమగా, మృదువుగా నొక్కాను.

మేము ఊరిమధ్యకు చేరుకున్నాక, ఇక నేను మా ఇంటికి వెళ్తానని సెలవు తీసుకున్నాను. వారిద్దరూ ముందుకు నడిచారు. రాజు కూడా వాళ్ళతో వెళ్ళబోయినవాడల్లా ఆగి నాతో పాటు మా వీథిలో అడుగుపెట్టాడు. అతను మా ఇంటికి వస్తాడా అనుకున్నాను. రమ్మని పిలవాలా వద్దా తేల్చుకోలేకపోయాను.

కాని అతను నాతో మరేమీ మాటలు పొడిగించలేదు. నేను మా ఇంటిముందు ఆగగానే తాను 'వస్తానండీ, గుడ్ నైట్' అని వెనక్కి తిరిగాడు. బహుశా ఆ నాలుగడుగులూ నాతో కలిసి నడవడం కోసమే అతను మా ఇంటిదాకా వచ్చాడనుకున్నాను.

నేను ఇంట్లో అడుగుపెట్టగానే మా పిన్నిగారు ఆ ఇంటి వాకిట్లో కనబడింది. ఆమె అప్పటికే నన్ను చూస్తూ ఉన్నదని నాకు అర్థమయింది. ఆ కంచె మీంచి ఆమె చూపులకి మేము రోడ్డుమీద నడుస్తూండటం, రాజు నాతో పాటు వీథిలో అడుగుపెట్టి ఇంటిదాకా నాతో కలిసి అడుగులు వెయ్యడం కనిపిస్తూనే ఉందని నాకు అర్థమయింది.

నన్ను చూస్తూనే ఆమె 'వాడితో మాట్లాడకు. వాడో మెంటల్' అంది.

మెంటల్?

ఎందుకు, ఏమిటి అని అడగాలనిపించింది.

కాని అడగలేదు.

ఎందుకో నేనతనితో కలిసి ఆ నాలుగడుగులు నడిచి ఉండవలసింది కాదని పించింది. కాని ఆ సాయంకాలం వరసగా జరుగుతూ వచ్చిన ఆ సంఘటనల్లో నేను కోరుకుంటే జరిగింది ఏ ఒక్కటైనా ఉందా?

❋

6

అడవిలో మొక్కల్నీ, చెట్లనీ సులువుగా గుర్తుపట్టడం కోసం ప్రొఫెసరు నాకు డయట్రిస్ బ్రాండిస్ రాసిన 'ఇండియన్ ట్రీస్' అనే పుస్తకం ఇచ్చాడు. బ్రాండిస్ భారతదేశంలో అటవీశాఖకీ, సైంటిఫిక్ ఫారెస్ట్రీకి పితామహుడని ప్రొఫెసరు చెప్పాడు. అప్పటికి అరవయ్యేళ్ళ కిందట రాసిన ఆ పుస్తకం చూస్తుంటే నాకు మతిపోయింది. జర్మన్ థరోనెస్ అంటారే, అది ఆ పుస్తకం ప్రతి పేజీలోనూ కొట్టొచ్చినట్టుగా కనబడింది. అందులో చెట్లు, పొదలు, తీగలు, వెదురుజాతుల్తో సహా అప్పటి బ్రిటిష్ ఇండియాలో కనవచ్చే వృక్షవిజ్ఞానం దాదాపుగా సమస్తం ఉంది. ఆ పుస్తకానికి 'ద ఫ్లోరా ఆఫ్ బ్రిటిష్ ఇండియా' అనే పుస్తకం స్ఫూర్తి అనీ, దురదృష్టవశాత్తూ అది కలకత్తాలో ఉండిపోయిందని ప్రొఫెసరు నిట్టూర్చాడు.

'ఇంత వివరంగా మొక్కలగురించీ, చెట్ల గురించీ ఎప్పుడో పుస్తకాలు రాసిన తర్వాత ఇప్పుడు మళ్ళా మనం కొత్తగా పరిశోధించడానికేముంది?' ఒకరోజు ధైర్యం తెచ్చుకుని ప్రొఫెసర్ని అడిగేసాను.

అప్పుడు ప్రొఫెసరు చెప్పిన జవాబు నాకు కనువిప్పు.

ఆయన ఏమన్నాడంటే, 'అటువంటి పుస్తకాలు నువ్వు చెప్పినట్టే విజ్ఞానసర్వస్వాలు. వాటికవే ఒక యూనివెర్స్ లాంటివి. కాని మనం ఎప్పటికప్పుడు ఆ యూనివెర్స్‌ని తిరిగి చిన్న చిన్న తావుల్లో అన్వేషించాలి. 'బిట్ బై బిట్' పునర్నిర్మించుకోవాలి. మైక్రో లెవెల్ మాపింగ్ చేసుకోవాలి. ఎందుకంటే ఇలాంటి పుస్తకాల్లో చూడటానికి అన్నీ ఉన్నట్టు కనిపించినా తీరా నువ్వు ఫీల్డ్ మీదకు వెళ్ళినప్పుడు కొత్త మొక్కలూ, పొదలూ, తీగలూ

కనిపించినప్పుడు, ఈ పుస్తకంలో అవి కనిపించకపోవచ్చు. అలాంటి చాలా గాప్‌లు మనకి అడుగడుగునా ఎదురవుతాయి. ప్రతి శాస్త్రవేత్తా తన ముందున్న పరిజ్ఞానాన్ని వీపున మోసుకుంటూనే బయల్దేరతాడు. ఎప్పుడు ఆ మూటలో అతనికి కావలసినసమాచారం దొరకదో, ఆ రోజు అతనికి పండగ అనుకో. ఎందుకంటే, ఈ విశ్వపరిజ్ఞానానికి తనవంతు కాంట్రిబ్యూషన్ తాను సమకూర్చే అవకాశం అప్పుడతనికి దొరుకుతుంది. హు నోస్? బ్రాండిస్ చూడలేని మొక్కలో, మూలికలో విమలమ్మకి దొరికే ఛాన్స్ ఉండవచ్చు కదా!'

ప్రొఫెసరు చెప్పిన మాటలు ఎంత నిజమో నాకు ఆ తర్వాత దాదాపుగా ప్రతిరోజూ అనుభవంలోకి వస్తూనే ఉండేది. ఉదాహరణకి రాకాముఖి అనే చిన్న మొక్కని నేను మొదటిసారి చూసినప్పుడు నాకు దాని గురించిన వివరాలేవీ బ్రాండిస్ పుస్తకంలో కనబడలేదు. దానికి బదులు పిట్టోస్పర్మ్ ఫ్లోరిబండం అనే మొక్క గురించి ఉంది. జోసెఫ్ గారిని అడిగితే కూడా ఏమీ చెప్పలేకపోయాడు.

ఆ తర్వాత ఎన్నో ఏళ్ళకి ఇంటర్నెట్టు అందుబాటులోకి వచ్చాక కానీ రాకాముఖి శాస్త్రీయ నామం పిట్టోస్పరం నపోలెన్సి అని తెలుసుకోలేకపోయాను. అంటే బ్రాండిస్ తర్వాత బోటనిస్టులు మరొక అడుగు ముందుకు వేసి ఆ కుటుంబంలోనే మరొక సూక్ష్మ భేదాన్ని పట్టుకున్నారన్నమాట. గోల్డెన్ ఫ్రాగ్రెన్స్ అని పిలిచే ఆ మొక్క సుగంధాన్ని బ్రాండిస్ ఆఘ్రాణించలేకపోయాడు కదా అనుకున్నాను.

ప్రొఫెసరు మరో మాట కూడా చెప్పాడు.

'ఆ నాచురలిస్టులు, ఆ జియాలజిస్టులు, ఆ యాంత్రొపాలజిస్టులు ఎంత గొప్ప వర్క్ చేసినా కూడా వాళ్ళది సింగిల్ యూనివెర్స్ మాత్రమే. యూనివెర్స్ అనే పదానికి సరిగ్గా సరిపోతారు వాళ్ళు. అంటే వాళ్లది ఒకటే ప్రపంచం అన్నమాట. అఖండ ప్రపంచం. టోటల్. బట్ నాట్ ఇంటెగ్రల్. ఇప్పుడు మనం మల్టీ యూనివెర్స్‌లో అడుగుపెడుతున్నాం. ఇంతదాకా మనకు పరిచయమైన యూనివెర్సులన్నింటినీ పక్కపక్కన పెట్టుకుని మరీ మాపు చేసి చూసుకోవాలి. అందులో ఎక్కువతక్కువలుంటే సరిచేసుకోవాలి. దిస్ ఈజ్ ద ఎరా ఆఫ్ మల్టీ డిసిప్లినరీ స్టడీస్. ఒక రాయి, రాయి పక్కన మొక్క, ఆ మొక్క పక్కన మట్టి, ఆ మట్టిలో ఉన్న మాయిశ్చర్, ఆ పొలం దున్నుకునే రైతు, అతని అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్, అతని చుట్టూ ఉండే మైథాలజీ– ఇవన్నీ కలిపి మనం తెలుసుకోవాలి. ఎంత వీలైతే అంత తెలుసుకోవాలి. అప్పుడే మనకి ఈ ప్రపంచం కొద్దిగానైనా పరిచయం కావడం మొదలవుతుంది.'

ఏమి మాటలవి! నేను మాటలుడిగి ఆ మాటలే వింటూ ఉండిపోయాను.

వకుళకుటికి మారిన తర్వాత మా బృందం పని ఒక క్రమపద్ధతిలోకి కుదురుకుంది.

రోజూ పొద్దున్న ఏడింటికల్లా కొండమ్మగారు టిఫిన్, కాఫీ సిద్ధంచేసేసేవారు. నేను కూడా బ్రేక్‌ఫాస్టు, లంచి ప్రొఫెసరుగారి దగ్గరే చెయ్యడం మొదలుపెట్టాను. డిన్నరు మాత్రమే పిన్నిగారింట్లో చేసేదాన్ని. వకుళకుటి దాదాపుగా ఒక బాచిలర్లమెస్సులాగా తయారయ్యింది. మేము ముగ్గురమే కాక, దేవయ్యా, రాంబాబూ, ఇంకా ఆ రోజుకి ఎవరుంటే వాళ్ళంతా అక్కడే బ్రేక్‌ఫాస్టు చేసేవారు. ప్రొఫెసరు తీసుకునే అల్పాహారం నిజంగా అల్పాహారమే. బ్రెడ్డు, జామ్, ఒక బాయిల్డు ఎగ్గు మాత్రమే తినేవాడు. ఎప్పుడేనా దోసె, ఆమ్లెట్టు లాంటివి వేసినప్పుడు తను కూడా ఒకటి తినేవాడు. వనలతకి ఆంధ్రా వంటలు బాగా నచ్చాయి. ఆమె అడిగి మరీ చేయించుకునేది. బ్రేక్ ఫాస్టు అయ్యాక, జీపు ఎక్కేముందు, ఆమె మళ్ళా అందరికీ రసగుల్లానో, సందేశ్‌నో ప్రసాదం పంచినట్టు అందరి చేతుల్లో కొద్దిగా కొద్దిగా పెట్టేది. ఇక హుషారుగా కబుర్లు చెప్పుకుంటూ జీపులో బయల్దేరే వాళ్లం.

లంచికి ఇంటికి వచ్చేటప్పటికి వేడి వేడిగా చపాతీలు, అన్నం, కూరా, సాంబారు ఉండేవి. ఊరగాయలు, స్వీటు కూడా తప్పనిసరి. ఒక్కోసారి సాయంకాలం డిస్కషనుకి నేను మళ్ళా వకుళకుటికి వెళ్ళినప్పుడు వేడి వేడి పుల్కాలూ, కుర్మా నోరూరిస్తూ సిద్ధంగా ఉండేవి. ఆ మామిడిచెట్ల కింద వెదురుకర్రల్తో కట్టిన ఆ సీట్లమీద కూర్చునేవాళ్ళం. సంభాషణలు కొండల దగ్గర మొదలై రాళ్ళమీంచి నడుస్తూ ఎక్కడెక్కడికో వెళ్ళిపోతుండేవి.

ప్రొఫెసరుగారు వకుళకుటిలోకి మారినప్పణ్ణుంచీ పనిలో కూడా వేగం పెరిగింది. ఆ మాటే ప్రొఫెసరుతో అంటే ఆయనొక ఆఫ్రికన్ ప్రోవెర్బ్ కోట్ చేసాడు: 'యువకుడొక్కడూ నడిస్తే వేగంగా నడుస్తాడు, వృద్ధుడొక్కడూ నడిస్తే నెమ్మదిగా నడుస్తాడు, ఇద్దరూ కలిసి నడిస్తే బహువేగంగా నడుస్తారు' అని.

ఆ మాట నిజమే. ఒకసారి ఫీల్డు మీదకు వెళ్ళాక ప్రొఫెసరు నడక మొత్తం మారి పోయేది. ఆయనలో ఒక యువకుడు ప్రత్యక్షమయ్యేవాడు. ఒక్కోసారి ఏదో ఒక బండరాతి మీద నిలబడి డాన్సు చేసేవాడు. అప్పుడప్పుడు బిగ్గరగా కేరింతలు కొట్టేవాడు. అడవిలో ఏదైనా పక్షి కూత వినబడితే తానూ తిరిగి కూత పెట్టేవాడు.

కాని కొన్ని కొన్ని సార్లు ఆయన మౌనంగా ఉండిపోయేవాడు. ఏ చెట్టుకిందనో కూచుండిపోయేవాడు. లేదా ఏ బండనీడనో కళ్ళు మూసుకుని మౌనంలోకి వెళ్ళిపోయే

వాడు. ఆయన అలసట వల్ల అలా కూచుంటున్నాడని మొదట్లో అనుకున్నాను. కాని అలాంటి సమయాల్లో వనలత ఆయన దగ్గరికి కూడా వెళ్ళేది కాదు. నేను ఒకసారి ఆయన్ని పిలవబోతే సైగలతోటే వారించింది. నెమ్మదిగా ఆయన్ని అలాంటి సమయాల్లో దూరం నుంచే ఆసక్తిగా చూస్తుండేదాన్ని. కొన్నిసార్లు ఆయన ఒక చిన్న రాతినో లేదా ఎండుకొమ్మనో ఒళ్ళో పెట్టుకుని పసిపాపను ఒళ్ళో నిద్రబుచ్చుతున్న తల్లిలాగా అరమోడ్పు కళ్ళతో చాలాసేపు కూచుండిపోయేవాడు. నేను నా కుతూహలం ఆపుకోలేక అట్లాంటి ఒక క్షణంలో ఆయన దగ్గరకి వెళ్ళి నిలబడ్డాను. పిల్లిలాగా నడిచి వెళ్ళినా కూడా నా అడుగుల చప్పుడు ఆయనకి వినబడినట్టుంది. కళ్ళు తెరిచి నాకేసి చూసాడు. నాకు భయం వేసింది. పురాణాల్లో తపసు చేసుకుంటున్న మునుల్ని నాలాంటి వాళ్ళు తపసు భగ్నం చేసినప్పుడు ఆ మునులు శాపాలు పెట్టిన కథలు గుర్తొచ్చాయి. కాని ఆయన నాకేసి చాలా ప్రేమగా చూసాడు. ఏ లోకాలదో నిశ్శబ్దం, తేజస్సు ఆ చూపుల్ని అంటిపెట్టుకుని ఉన్నాయనిపించింది. ఎక్కడికో వెళ్ళి అమృతం తాగివచ్చిన చూపులవి. ఆ మాధుర్యం నామీద కూడా కొంత వొలికింది.

'డిస్టర్బ్ చేసానా?' అనడిగాను, చుట్టూ చూస్తూ, నా అదృష్టం కొద్దీ వనలత దగ్గరలో లేదు.

'నో నాట్ ఎట్ ఆల్' అన్నాడాయన.

'రా, ఇలా వచ్చి కూచో' అన్నాడు, తన పక్కన చోటు చూపిస్తూ.

ఆయన ఒక బొడ్డచెట్టు నీడన కూచున్నాడు. పన్నెండు గంటల ఎండ వేళ. కానీ ఆ నీడలో చెప్పలేనంత తేమ తగుల్తూ ఉంది. ఆయన ముఖంలో నాకు ఎటువంటి అలసటా కనిపించలేదు. అయినా ఏదో ఒక రకంగా మాటలు కొనసాగించాలని అడిగాను

'బాగా అలసటగా ఉంటోందా? రోజూ మీరు ఫీల్డుకి రాకపోతే మాత్రం ఏమవు తుంది? నేనూ, వనలతా ఉన్నాం కదా.'

'అలాగా' అన్నాడాయన. అప్పటిదాకా కాళ్ళు బారచాపుకు కూచున్నవాడు సర్దుకుని కూచున్నాడు. ఆయన ముఖంలో చిరునవ్వు ఒక నీడలాగా కదిలిపోయింది.

'నేను ఇంతదూరం వచ్చిందే ఈ కొండల్లో గడుపుదామని. లేకపోతే కలకత్తాలోనే ఉండిపోయేవాణ్ణి కదా. నెలల తరబడి యూనివెర్సిటీలో నా ఛాంబర్లోనో, ఆ లెక్చర్ హాల్సులోనో, సెమినార్ హాల్సులోనో గడుపుతుండాలి. అప్పుడు నాకు ఎంత శూన్యంగా

అనిపిస్తుందో చెప్పలేను. వాళ్ళంతా చాలా స్ట్రేంజ్‌గా, నాకు ఏ మాత్రం సంబంధం లేని వాళ్ళలాగా కనిపిస్తారు. ఒక్కొక్కప్పుడు ఆ కేంపస్‌లో నాకు నేనే ఒక ఏలియన్ లాగా కనిపిస్తాను. కాని ఇదుగో చూడు, ఇలా కొండల మధ్యకి వచ్చినప్పుడు, ఈ చెట్లకింద నడుస్తున్నప్పుడు, ఇలా నీలాంటి వాళ్లతో కలిసి ఈ మొక్కల్ని వెతుక్కుంటున్నప్పుడు నాకు నా సొంత వూరికి వెళ్ళిపోయినట్టు ఉంటుంది. నీళ్ళు దొరికిన చేపలాగా, వెన్నెల దొరికిన చకోరంలాగా అయిపోతాను' అన్నాడు.

అప్పుడు కొంతసేపు నిశ్శబ్దంగా ఉండిపోయాడు. ఏవో మాటలు వెతుక్కుంటూ వాక్యాలు పేర్చుకుంటున్నవాడిలాగా తనలో తానే గొణుక్కుంటూ ఉండిపోయాడు. మళ్ళా ఒక్కసారి తనను తాను విదిలించుకుని తన ఒళ్ళో ఉన్న రాతి శకలం తన చేతుల్లోకి తీసుకున్నాడు.

'సీ. దిస్ పీస్ ఆఫ్ రాక్. డు యు నో హౌ ఓల్డ్ దిస్ మస్ట్ బి?' అనడిగాడు.

'నేను జియాలజీలో పూర్' అన్నాను నవ్వుతో. ఆయన దగ్గర నెమ్మదిగా చనువు ఏర్పడుతూండటం నాకు తెలుస్తూనే ఉంది.

'ఓకే. డు యు నో వేర్ ఇట్ ఈజ్ బార్న్?'

ఆ రాతిముక్క. దాన్నొక కుందేలుపిల్లలాగా చేతుల్తో ఆప్యాయంగా తడుముతో, ఇదెక్కడ పుట్టిందో నీకు తెలుసా అనడుగుతున్నాడు. నేను మాట్లాడలేదు.

'చూడు, విమలా, ఇది అంటార్కిటికాలో పుట్టింది' అన్నాడు.

అంటార్కిటికా!

నేను సరిగానే విన్నానా?

అప్పుడాయన కాళ్ళు మరీ దగ్గరగా లాక్కుని బాసింపట్టు వేసుకోడానికి ప్రయత్నించాడు. అంటే నాకొక కొత్త పాఠం చెప్పడానికి సిద్ధమవుతున్నాడన్నమాట.

అప్పుడు ఆయన మాట్లాడిన ప్రతి ఒక్క మాట ఒక తేనెచుక్క. ఎన్నో ఏళ్ళ పాటు ఎన్నో పుస్తకాలు, పరిశోధనలు, అడవులు, కొండలు తిరిగి ఏరి తెచ్చుకున్న తేనె అది.

'ఈ తూర్పు కనుమలు ఒకప్పుడు ఇండియాలో భాగంగా ఉండేవి కావు. ఒకప్పుడు మా జియాలజిస్టులకి వెస్టర్న్ ఘాట్స్ మీద ఉన్న ఇంటరెస్ట్ ఈస్టరన్ ఘాట్స్ మీద ఉండేది

కాదు. ఎందుకంటే వెస్టర్న్ ఘాట్స్‌లో లాగా ఇక్కడ పెద్ద పెద్ద శిఖరాలు, స్టీప్ గోర్జెస్, ఎస్కార్ప్‌మెంట్లు, డీప్ వేలీస్ కనబడవని. కానీ జియొలాజికల్ టైమ్‌లో చూస్తే ఈ ఘాట్స్ పెద్ద పుస్తకం లాంటివి. ఒక పుస్తకం కాదు, కొన్ని వాల్యూమ్స్. మనమింకా వాటి అట్టలు మాత్రమే చూస్తున్నాం. ఇండెక్స్ దాకా కూడా రాలేదు.

ఈ భూఖండం దాదాపు యాభై కోట్ల సంవత్సరాల కిందట ఇండియాని ఢీకొంది. ఆ కొల్లిజన్ లోంచి ఈ శిఖరాలు ఏర్పడ్డాయి. ఏళ్ళ తరబడి ఆ మహాపర్వతాలు కరిగిపోగా కరిగిపోగా మిగిలిన కొండలు మనం చూస్తున్నవి. కొంతమంది చెప్పేదాన్ని బట్టి ఈ ఘాట్స్ ఒక ఇండిపెండెంట్ బ్లాక్. ఎప్పుడో 250 కోట్ల సంవత్సరాల కిందట ఆర్కియన్ టైమ్స్‌లో ఇది అంటార్కిటికాలో భాగమైంది.'

'మరికొంత మంది దృష్టిలో ఇది మొదటినుంచీ అంటార్కిటికాలో భాగమే. ఇప్పటికి నూట డెబ్భై, నూట అరవై కోట్ల సంవత్సరాల కింద పెద్ద మాగ్మాటిజంకి లోనయ్యాయి. మాగ్మాటిజం అంటే తెలుసు కదా! భూమిలోపల ఇంకా కుతకుత ఉడుకుతూ చల్లారని పదార్థం పైకి పొంగినప్పుడు గట్టిపడి క్రస్ట్‌గా ఫార్మ్ కావడం. మనం చూస్తున్న ఈ దృశ్యప్రపంచమంతా అనుక్షణం మార్పుకి లోనవుతూ ఉంటుంది. కానీ భూమిలోపల ఆ కోర్, దాని పైన మేంటిల్– అవి మాత్రం భూమి పుట్టినప్పుడు ఎలా ఉన్నాయో ఇప్పటికీ అలానే ఉన్నాయి. 250 కోట్ల కిందటి భూమి జ్ఞాపకాలు ఎలా ఉన్నాయో తెలుసు కోవాలనుకుంటే ఇదిగో, ఈ రాయిని తడిమి చూడు' అని తన చేతిలో ఉన్న ఆ శిలాశకలాన్ని నా చేతుల్లో పెట్టాడు.

నా ఒళ్ళు జలదరించింది.

ఆ చిన్న రాతిముక్క ఒక చిన్న చేపపిల్లలా నా చేతుల్లో కదుల్తోందా అన్న భ్రాంతికి లోనయ్యాను క్షణం పాటు.

'నిజమే. ఈ రాయి ఎంతో ఎరోజన్‌కి లోనయ్యింది. యాభై కోట్ల సంవత్సరాల పాటు ఎండకి ఎండి వానకు తడిసింది. కాని అదంతా పైపైన మాత్రమే. దీనిలోపల ఆ ఒరిజినల్ మాటర్ అలానే ఉంది. అండ్, యు నో. దట్ ఈజ్ నాట్ ఎ డెడ్ మాటర్. ఇట్ ఈజ్ ఎవర్ ఇవాల్వింగ్, కంటిన్యువస్లీ మెటామార్ఫింగ్.'

మొదటిసారిగా నా చేతుల్లో ఉన్న ఆ చిన్న రాయి కూడా ఒక మొక్కలాంటిదే అనిపించింది నాకు.

'ఇంకో సంగతి చెప్పనా! నీ చేతిలో ఉన్న ఆ పీస్ ఆఫ్ రాక్‌లో మహాసముద్రాల రహస్యాలున్నాయి. కొన్ని కోట్ల సంవత్సరాలుగా కాంటినెంట్స్ చేస్తూ వచ్చిన ప్రయాణ రహస్యాలున్నాయి. ఆ చిత్రలిపి నువ్వు చదవడం నేర్చుకోవాలేగాని, అదొక కాంటినెంటల్ ట్రావెలోగ్' అని కూడా అన్నాడు.

ఇంతలో వనలత మమ్మల్ని వెతుక్కుంటూ అక్కడికొచ్చింది. చాలా సేపటిగా ఎండలో పనిచేస్తూ ఉందేమో ఆమె ముఖమంతా చెమట పట్టి ఉంది. ఎప్పుడూ విరబోసుకుని ఉండే ఆ కురుల్ని వదులుగా ముడివేసుకుంది. ఆమె టీషర్టు మొత్తం చెమటతో తడిసిపోయి ఉంది. నుదుటన పెట్టుకున్న బొట్టు ఎప్పుడో చెమటకి తడిసి ఎక్కడో జారిపోయి ఉంటుంది.

ఆమె వస్తూనే ఉస్సురంటూ వగరుస్తూ సేన్‌గుప్త పక్కన కూలబడింది. సేన్‌గుప్త ఆప్యాయంగా ఆమె చెయ్యి తన చేతుల్లోకి తీసుకున్నాడు.

'ఏమి చెప్తున్నాను? దిస్ పీస్ ఆఫ్ రాక్ ఈజ్ ఎ బండిల్ ఆఫ్ మెరైన్ మెమొరీస్ అని కదా. అవును. మహాసముద్రగర్భం ఎలా ఉంటుందో చూడాలంటే ఈ రాతిని బద్దలు గొడితే తెలుస్తుంది' అని వనలతతో 'ఇవన్నీ నువ్వు ఎప్పుడూ వినే మాటలే. బోరు కొడుతుందేమో నీకు' అన్నాడు.

'నో. నాట్ ఎటాల్' అంది వనలత.

'కాకూ ఈ మాటలు ఎన్ని సార్లు చెప్పినా నాకు వినాలని ఉంటుంది. ఎందుకంటే అదంతా షీర్ పొయెట్రీ' అని అంది నాతో.

'అవును. నిజమే. నేను మాట్లాడేది పొయెట్రీనే. నా తోటి జియాలజిస్టులు నన్ను ఆటపట్టిస్తుంటారు. నేను హాఫ్ జియాలజిస్టు– హాఫ్ పొయెట్ అని. కాదు, నేను పొయెట్‌ని కూడా కాదు. నేను డ్రీమర్‌ని. ఎప్పుడూ నేనో డ్రీమ్ టైమ్‌లో జీవిస్తూ ఉంటాను. మీకు తెలుసునా? ఆస్ట్రేలియాలో కొన్ని ఇండిజీనస్ గ్రూప్స్ ఉన్నాయి. వాళ్ళు తామెప్పుడూ తమ ఏన్సెస్టరల్ డ్రీమ్ టైమ్ లోనూ, డ్రీమ్ స్పేస్ లోనూ మటుకే జీవిస్తున్నామనుకుంటూ ఉంటారట. నేను కూడా అలాంటి ఒక అబొరిజినల్‌ని మాత్రమే' అన్నాడు.

'అండ్ ఐ కీప్ టెల్లింగ్ హిమ్ దట్ హిజ్ ట్రైబ్ ఈజ్ అల్మోస్ట్ గెటింగ్ ఎక్స్టింగ్విష్డ్' అంది వనలత.

'మీరు సముద్రం గురించి చెప్తున్నారు' అన్నాను సంభాషణని మళ్ళా దారికితేవాలని.

'సముద్రం. యెస్. ఈ రాయిలో సముద్రాల జ్ఞాపకాలున్నాయి అన్నాను కదా. ఆ మాటకొస్తే నీలోనూ, నాలోనూ కూడా ఉన్నది సముద్రమే. తెలుసా! సోడియం, పొటాషియం, కాల్షియం– ఈ మూడూ సముద్రజలాల్లో ఏ ప్రపోర్షన్లో ఉన్నాయో మన వీన్స్‌లో కూడా అదే ప్రపోర్షన్‌లో ఉన్నాయి. మన అంతరాంతరాల్లో మనం ప్రతి ఒక్కరం ఒక సముద్రాన్ని మోసుకు తిరుగుతున్నాం. మన పూర్వీకులు సముద్రంలో పుట్టిన ఒక ఏకకణ జీవి అని మనం ఎప్పుడూ మర్చిపోకూడదు. కార్బన్ డయాక్సైడ్, సల్ఫర్, నైట్రొజెన్, ఫాస్ఫరస్, పొటాషియం, కాల్షియం– ఈ పదార్థాలతోటే ప్రకృతి కొన్ని కోట్ల సంవత్సరాలుగా ప్రయోగాలు చేస్తూ వస్తోంది. ఆ ప్రయోగపరంపరలో, ఆ పరిణామ క్రమంలో, చేప, కప్ప, రెప్టైల్, పక్షి, మేమల్, ఇదిగో ఇప్పుడు ఇక్కడ ఈ సేన్‌గుప్త, ఈ ఒరుణిమ, ఈ విమల కూడా వచ్చారు. కాని ఈ లాంగ్ అండ్ ఎసిడ్యువస్ ప్రాసెస్ ఆఫ్ ట్రయల్ అండ్ ఎర్రర్ లో వీళ్ళేమీ చివరి మజిలీ కాదు. వీళ్ళని దాటి ప్రకృతి ఇంకా ముందుకు పోతున్నది, మనం గమనించడం లేదంతే.'

'కాబట్టి–' అని ఆగి ఆయన తన పైనున్న చెట్టుకేసి చూసి 'ఇదేమి చెట్టు?' అనడిగాడు నన్ను.

'బొడ్డ చెట్టు. మొరాసియే ఫామిలీ. ఫైకస్ జీనస్. సైంటిఫిక్ నేమ్ ఫైకస్ రేస్ మోసా' అన్నాను గబగబా, పాఠం అప్పచెప్పినట్టుగా. బ్రాండిస్ నా పరువు కాపాడేడు అనుకున్నాను.

'ఓహ్! ఔదుంబరమా! గుడ్. కాబట్టి నేను చెప్పేదేమంటే, ఇదిగో, ఈ ఔదుంబరం, నీ చేతుల్లో ఉన్న ఆ రాయి, ఈ కొండ, నువ్వూ, నేనూ అందరం ఒకే కుటుంబానికి చెందిన వాళ్ళమే. మనందరం మోసుకుంటూ తిరుగుతున్నది ఒకే భూమి జ్ఞాపకాలే, ఒకే సముద్రం జ్ఞాపకాలే. ఈ జ్ఞాపకాల్తోనే మనం పరిణామం చెందుతున్నాం. కొత్త రూపాలు పొందుతున్నాం. కాని ఆ పాత జ్ఞాపకాల్ని వెంటతీసుకుపోతూనే ఉన్నాం. ఈ సృష్టిలో ఏదీ నిశ్చలం కాదు. ఈ కొండ, చెట్టు, ఇదుగో, ఈ విరిగిపోయిన రాయి, ఈ ఎండిపోయిన కొమ్మ ప్రతి ఒక్కరం ప్రయాణిస్తోనే ఉన్నాం. బట్, ఎట్ డిఫరెంట్ లెవెల్స్ ఆఫ్ స్పీడ్. కాని అందరం ప్రయాణిస్తూనే ఉన్నాం. మనమందరం సహయాత్రికులం, ఇంకా చెప్పాలంటే ఆల్ ఆఫ్ అజ్ ఆర్ ఆన్ ద సేమ్ పిల్‌గ్రిమేజ్.'

ఆయన తన తలమీంచి మెడమీదకు ఒరుగుతున్న వాట్సన్ హేట్ సర్దుకుని మళ్లా చెప్పడం మొదలుపెట్టాడు.

'లెట్ అజ్ కమ్ బేక్ టు దిస్ పీస్ ఆఫ్ రాక్. థోరో ఒకచోట ఒక చేపపిల్ల గురించి రాస్తూ దాన్ని ఏనిమలైజ్డ్ వాటర్ అన్నాడు. పందొమ్మిదో శతాబ్ది ఇవొల్యూషనిస్టులు రాతిలో జీవం లేదనీ, అది పరిణామక్రమంలో అన్నిటికన్నా అడుగున ఉన్న ఇనార్గానిక్ మేటర్ అనీ, పరిణామక్రమంలో మనిషి అందరికన్నా అత్యున్నత స్థాయిలో ఉన్నాడనీ వాదించారు. అది కూడా, యు నో, వాళ్ల దృష్టిలో, నాట్ ఆల్ హ్యూమన్ బీయింగ్స్, ఒన్లీ ద యూరోపియన్ మాన్. కాని, వాళ్లకి తెలీదు, ఆ యూరపియన్ మాన్ కూడా ఈ పరిణామక్రమంలో ఈ రాయిలాంటివాడే, రాదర్, ఎ మూవింగ్ స్టోన్.'

ఆయన ఒక క్షణం ఆగేడు. కాని ఆయన ఉద్వేగం ఆయన్ని ఆగనివ్వలేదు.

'తాను ఎందుకు ఇక్కడున్నదో ఈ రాతికి ఎంత తెలుసో మనం ఇక్కడెందుకున్నామో మనకీ అంతే తెలుసు. ఎవరెస్టు పర్వతం ఎక్కడానికి బయల్దేరిన ఒక మౌంటెనీర్ని ఎవరో అడిగారట: ఆ పర్వతం ఎందుకు ఎక్కాలనుకుంటున్నారు అని. ఎందుకంటే, అదక్కడ ఉంది కాబట్టి అని చెప్పాడట ఆయన. కాని అది కాదు కారణం. నేనేమనుకుంటానంటే, ఆ కొండలోనూ, అతనిలోనూ ఒకే పదార్థం ఉంది కాబట్టి, ఆ పదార్థం నిరంతరం ఏదో చెప్పలేని అశాంతితో చలించిపోతూ ఉంది కాబట్టి అంటాన్నేను. ఇక్కడ నేను కూర్చుని ఏం చేస్తున్నాను అనుకుంటున్నావు కదా. ఇదుగో, ఆ రాతితో మాట్లాడుతున్నాను. దానికేసి చూస్తున్నాను. అది కూడా నాకేసి చూస్తోంది. మేమిద్దరం మౌనంగా కొన్ని కోట్ల, బిలియన్ల సంవత్సరాల వెనక్కి ప్రయాణిస్తున్నాం. ఒకప్పుడు ఈ భూమి సూర్యుణ్ణుంచి విడివడ్డ కొత్తలో మనిషీ, మొక్కలూ, మత్స్యాలూ సరే, సముద్రాలు కూడా, పర్వతాలు కూడా లేవు. ఆ తొలిరోజుల్లో ఇంకా వేడితో రగిలిపోతూన్న భూమినుంచి ఒక ముక్క విడిపోయి చంద్రుడిగా మారిపోయింది. అలా ఆ ముక్క తెగిపోయిన చోట పెద్ద అగాధం ఏర్పడింది. అసంఖ్యాక సంవత్సరాల పాటు కురిసిన వర్షాలకు ఆ అగాధం నిండి సముద్రంగా మారింది. మొదటి సముద్రం అది ఈ భూమ్మీద' అని అన్నాడు.

ఒక నిముషం మౌనంగా ఉన్నాడు. అప్పుడు మళ్లా 'ఆ వానలు ఎక్కణ్ణుంచి వచ్చాయి?' అని అడిగి తనే చెప్పడం మొదలుపెట్టాడు.

'మండుతున్న భూగర్భం నుంచి పైకెగిసిన ఉష్ణవాయువులు ఆకాశాన్ని చేరి చల్లారుతూ వానలుగా తిరిగి భూమిని చేరుకోడం వల్ల కురిసాయి. మండుతున్న రాళ్ళు వాయువుగా

మారి, వాయువు నీళ్ళుగా మారి, నీళ్ళు మళ్ళా ప్రాణికోటిగా మారి, ప్రాణులు మరణించి మళ్లా రాళ్లుగా మారి– దేర్ ఈజ్ ఎ ప్రావిడెన్స్ ఇన్ ద ఫాల్ ఆఫ్ ఏ స్పారో అన్నాడు హామ్లెట్. ఒక రాయిలో, ఇదుగో, చూడు ఈ ఎండుకొమ్మలో'– అంటో తనపక్కన పడి ఉన్న ఎండిపోయిన చిన్న కొమ్మని చూపిస్తూ – 'ఈ ఎండుకొమ్మలో మొత్తం ఇవొల్యూషన్ అంతా ఉంది. ఇక్కడ కూచున్నప్పుడు నేను ఈ పదార్థంలో, కాదు ఈ పదార్థ పరిణామ ప్రయాణంలో ఒకడినైపోతాను. దేశం, కాలం మర్చిపోతాను' అన్నాడు.

'ఈ భూమి మీద నీళ్లు ఎలా వచ్చాయి? చాలా థీరీస్ ఉన్నాయి. ఈ మధ్య జెయింట్ ఇంపాక్ట్ థీరీ అని ఒకటి ప్రపోజ్ చేస్తున్నారు. నాలుగున్నర బిలియన్ల సంవత్సరాల కిందట ఒక పెద్ద గ్రహం భూమిని డీకొట్టింది. దాన్ని థీయా అంటున్నారు. థీయా అంటే గ్రీకు పురాణాల్లో చంద్రుడికి తల్లి. ఆ థీయా ఈ గాయాని అంటే ఈ పురాతన పృథ్విని ఢీకొట్టినప్పుడు దానిలోని కొంత భాగం భూమిలో కలిసిపోయింది. ఆ థీయానే భూమ్మీదకి నీళ్ళు పట్టుకొచ్చింది అని ఒక ఊహాగానం. ఏమో. రకరకాల సిద్ధాంతాలు. ఏదీ ఖచ్చితంగా తెలీదు. కాని నాకు అర్థమయినంతవరకూ ఒకటి మాత్రం నిశ్చయంగా చెప్పగలను. కొంత సూర్యరశ్మి, కొంత చంద్రకాంతి, కొంత నక్షత్రధూళి– ఇవన్నీ కలిస్తేనే, ఈ రాయీ, రప్పా, చెట్టూ, చేమా, నువ్వూ నేనూ మనందరం ఏర్పడ్డాం. మనందరిలో ఉన్న ధూళి ఒక్కటే, జీవం ఒక్కటే. అందుకనే మనకి ఒకరి పట్ల ఒకరికి ఇంత ఆసక్తి. లేకపోతే ఎక్కడి ఢాకా, ఎక్కడి కలకత్తా, ఎక్కడి సేన్‌గుప్తా? ఎక్కడి పనసమామిడి కొండ? ఒకవేళ నేను ఇక్కడికి రాకపోయుంటే, ఆశ్చర్యం లేదు, ఈ కొండనే కలకత్తా వచ్చి ఉండేది!' అన్నాడు.

దేవయ్య మమ్మల్ని వెతుక్కుంటూ వచ్చాడు. 'రెండయిపోయింది, బయల్దేరదాం' అన్నాడు.

'యెస్, యెస్' అన్నాడు సేన్ గుప్తా. తనకి ఆసరాగా వనలత చేయూతకోసం చూస్తూ లేచి నిలబడబోయాడు. నేను చప్పున ఆ చేయి అందుకున్నాను. నేను కూడా వనలతలాగా ఆ బృందంలో శాశ్వతసభ్యురాలినైపోతే ఇలా వాళ్ళతో పాటు కొండలూ, కోనలూ తిరుగుతూ ఉండవచ్చుకదా అనిపించింది. కలకత్తా యూనివెర్సిటీలో నాక్కూడా సీటు దొరుకుతుందా అని ప్రొఫెసర్ని అడగాలనిపించింది.

❋

7

మన జ్ఞాపకాలకీ, కలలకీ మధ్య మరో సామ్యం కూడా ఉంది. కలల్లాగే జ్ఞాపకాల్లో కూడా మనుషులకీ, స్థల, కాలాలకీ రూపురేఖలు మారిపోతాయి. కలల్లోలాగే ఎవరో, ఎక్కడో కలుసుకున్నవాళ్ళు నీ ఇంట్లోనో, ఆఫీసు కారిడారులోనో ప్రత్యక్షమయినట్టే, నువ్వు కూడా ఎక్కడో మునిగి ఎక్కడో తేలతావు. ఎవరు మరెవరి షర్టో ధరిస్తారు. ఎవరు మరెవరి భావాలో ప్రకటిస్తారు. ఏదో జానపదకథలోలాగా ఒకరి దేహానికి మరొకరి శిరస్సు అతుక్కు పోతుంది. విడదియ్యాలని ప్రయత్నిస్తావుకాని, ఆ ప్రయత్నంలోనే అప్పట్లో నీకు అర్థంకాని విషయమేదో ఇప్పుడు కొత్త సత్యంగా స్ఫురిస్తుంది.

ప్రొఫెసర్ని అడిగితే కలలకి కూడా ఒక జియాలజీ ఉందంటాడేమో.

జియాలజీ ఆఫ్ డ్రీమ్స్.

సముద్రాల మీద ఏళ్ళ తరబడి ఉపరితలాల్లో పెరిగిన జీవజాలం, ప్లాంక్టాన్, మరణించినప్పుడు, నెమ్మదిగా కిందకి దిగి సముద్రగర్భంలోకి చేరుకుని గట్టిపడి స్లేట్ లాగా మారుతుందనీ, ఏళ్ళ తరబడి ఆ స్లేట్లు, అప్పటికే ఉన్న సముద్రగర్భంలోని రాళ్ళమీద పలకలు పలకలుగా పేరుకుంటాయనీ, టెక్టానిక్ ప్లేట్లు కదిలినప్పుడు ఈ పలకలు ఆ కదలికల్ని వేగవంతం చేస్తాయనీ చెప్పాడొకరోజు. బహుశా ఇప్పుడు డ్రీమ్సుది కూడా అదే ప్రాసెసు అంటాడేమో.

ఏం? ఎందుకు కాకూడదు? నీ రోజువారీ అనుభవాలూ, ఆ ఇన్సిగ్నిఫికెంట్, మైన్యూట్ గెస్చర్లు అవన్నీ గాల్లో కలిసిపోతాయా? లేదు. రోజూ నీకు దొరికే చిన్నచిన్న సంతోషాలు, నువ్వు మింగాల్సి వచ్చే చిన్నవో పెద్దవో అవమానాలు, పైకి నెత్తురు

కారకపోయినా లోపలకీ గాటుపడే గాయాలు– ఎక్కడికి పోతాయవన్నీ? డెడ్ ప్లాంక్టాన్ లాగా అవి నెమ్మదిగా నీ అంతరంగంలోకి దిగుతాయి. అప్పటికే అక్కడ కుతకుతా ఉడుకుతున్న అంతరంగ గర్భం ఉంటుంది. ఇవి పోయి దాని మీద పలకలు పలకలుగా పేరుకుంటాయి. ఇంతలో ఏదో ఒక అనుభవం ఒక టెక్టానిక్ ప్లేటు కదిలినట్టుగా నీలోపల నిన్ను కుదిపేస్తుంది. మహాసముద్ర ఫలకమూ, భూగర్భఫలకమూ ఒకదాన్నొకటి రాచుకోవడం మొదలుపెడతాయి. అప్పుడు నీ అంతరంగంలో ఏ ప్రకంపనలు కలుగుతాయో గాని, అవి మళ్ళా నీ బయటి జీవితాన్ని కుదిపెయ్యడం మొదలుపెడతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే మనిషి ఒక మెటామార్ఫోస్డ్ డ్రీమ్.

లేదా యానిమలైజ్డ్ డ్రీమ్.

నవంబరు నెలలో ఒక సాయంకాలం. నేను ఇంట్లో కూచుని ఆ రెండు మూడు రోజులుగా సేకరించిన ఆకులూ, కాయలూ సాంపిళ్ళు ఆల్బంలో అతికిస్తూ ఉన్నాను. చిన్నమ్మాయి నా పక్కనే కూచుని ఒక్కొక్కటీ శ్రద్ధగా అందిస్తూ ఉంది. నేను అంటిస్తున్నవాటిని పేరుపేరుగా అడుగుతూ ఉంటే వివరిస్తూ ఉన్నాను. ఇంతలో పెద్దమ్మాయి లోపలకి వచ్చి 'అన్నయ్య నిన్ను పిలుస్తున్నాడు' అంది

'అన్నయ్య ఎవరు?'

ఆ ఆల్బం, ఆ కాగితాలు చిన్నమ్మాయిని చూస్తూ ఉండమని చెప్పి సందేహంగానే బయటికి వచ్చాను. అక్కడ కంచె దగ్గర తలుపుకి బయట, గుమ్మంలో అడుగుపెట్టకుండా నిల్చున్నాడు.

రాజు!

అక్కడిదాకా వెళ్లాలా వద్దా, అతణ్ణి పలకరించాలా వద్దా అన్న తటపటాయింపుతోనే ఆ కంచె వైపు అడుగులేసాను.

'బాగున్నారా? ఎలా జరుగుతోంది మీ ప్రాజెక్టు?' అనడిగాడు.

మనిషి ఎక్కడికో బయల్దేరినవాడల్లే ఉన్నాడు. భుజాన బాగు, ఇస్త్రీ చేసిన షర్టు. తలకి నూనె రాసినట్టు లేదు, గాలికి ఊగుతున్న జుత్తు. ఎప్పట్లానే ఆ షార్ప్ లుక్స్.

ఇప్పుడు ఇక్కడ ప్రత్యక్షమయ్యాడేమిటి ఇలా చెప్పాపెట్టకుండా అనుకున్నాను. ఆ మధ్య ఒకరోజు సాయంకాలం ప్రొఫెసరుతో మాట్లాడుతున్నప్పుడు ఆయనే హటాత్తుగా అడిగాడు.

'వేర్ ఈజ్ దట్ బాయ్?' అని.

నాకు వెంటనే తట్టలేదు. ఎవరని అడిగాను. ఆ రోజు సాయంకాలం ఏటిదగ్గర మా సంభాషణ గుర్తు చేసాడు ప్రొఫెసరు. అప్పుడు గుర్తొచ్చాడు రాజు.

'ఏమో. నాకు కూడా కనబడలేదు. కాలేజికి వెళ్లిపోయాడేమో' అన్నాను.

'లేదు. అతను ఆ రోజే కాలేజినుంచి వచ్చానని చెప్పాడు కదా' అన్నాడు ప్రొఫెసరు. మెర్క్యురియల్ మెమొరి.

అవును కదా అనుకున్నాను. ఆ వెంటనే ఆ సాయంకాలం మా పిన్ని గారు అతణ్ణి పిచ్చాడు అన్నమాట కూడా గుర్తొచ్చింది.

'మా పిన్ని గారు అతనో వైల్డ్ ఫెలో అన్నారు' అన్నాను. మెంటల్ అనే పదం ఎందుకో నాకే నచ్చలేదు.

'వ్హైల్డ్?' కళ్ళు పెద్దవిచేసి మరీ అడిగాడు ప్రొఫెసర్. డబ్ల్యూ తర్వాత హెచ్ కూడా చేరుస్తూ. మామూలుగానే పలచగా ఉండే ఆయన కనుబొమలు ఆ ప్రశ్న అడుగుతున్నప్పుడు మరీ పలచగా సాగిపోయాయి.

'ఇఫ్ హి ఈజ్ కాల్డ్ వైల్డ్, దెన్ వన్ మస్ట్ ఫాల్ ఇన్ లవ్ విత్ హిమ్ ఎట్ ఒన్స్' అన్నాడు ప్రొఫెసరు.

నాకు అర్థం కాలేదు.

అతణ్ణి ప్రేమించాలా? ఆ వైల్డ్ ఫెలోని. ఎందుకని?

వనలత అప్పుడే జుట్టు చిక్కు తీసుకుంటూ వచ్చి కూచుంది. మేం ఏం మాట్లాడు కుంటున్నామో అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తూ ఉంది.

'ఈజ్ వైల్డ్ నెస్ ఎ వర్ర్యూ?' అనడిగాను ప్రొఫెసరుని.

ప్రొఫెసరు తల అడ్డంగా ఊపాడు. అది నా ప్రశ్నకి అవుననడమో కాదనడమో అర్థం కాలేదు.

'అతని వయసు ఏ మాత్రం ఉండవచ్చు?' అనడిగాడు ప్రొఫెసరు. తనే మళ్ళా 'మస్ట్ బి హార్డ్లీ నైంటీన్ ఆర్ ట్వెంటీ. అవునా? ఆ వయసులో నవయువకులు వైల్డ్‌గాకాక

మరోలా ఎలా ఉంటారు? ఒకప్పుడు మన ఫ్రీడమ్ మూమెంట్‌ని లీడ్ చేసింది ఎవరో తెలుసా? వాళ్ళంతా టీనేజర్స్. ఖుదీరాంబోస్ పేరు విన్నావా? బ్రిటిష్ రాజ్ మీద మొదటి బాంబు విసిరిన పిల్లవాడు. అప్పుడు అతని వయసు ఎంతో తెలుసా? ఒన్లీ నైంటీన్. మన సమాజానికి ఉడుకురక్తాన్ని ఎలా గౌరవించుకోవాలో తెలీదు' అన్నాడు.

'కాని వివేకానంద అన్నారు కదా, వాట్ వుయ్ వాంట్ ఈజ్ మజిల్స్ ఆఫ్ ఐరన్ అండ్ నెర్వ్స్ ఆఫ్ స్టీల్' అంది వనలత.

'దట్ ఈజ్ ద ప్రోబ్లెమ్' అన్నాడు ప్రొఫెసరు. 'స్వామీజీ కుడ్ హేవ్ యాడెడ్ బర్నింగ్ హార్ట్స్ ఆల్సో. ఎందుకంటే ద గ్రేటెస్ట్ అసెట్ ఆఫ్ స్వామీజీ వజ్ హిజ్ బర్నింగ్ హార్ట్. ఆయన అందరికీ అటువంటి బర్నింగ్ హార్ట్ ఉంటుందనుకున్నాడు. కానీ 'మెన్ విత్ మజిల్స్ ఆఫ్ ఐరన్ అండ్ స్టీల్ నెర్వ్స్, బట్ వితౌట్ ఏ బర్నింగ్ హార్ట్'– తొందరలోనే మెషిన్స్‌గా మారిపోతారు. మన స్కూల్సూ, కాలేజెస్‌లో జరుగుతున్నదిదే. అయినా కూడా ఇంకా ఒక యువకుడు, వైల్డ్‌గా ఉండగలుగుతున్నాడంటే, హౌ కెన్ ఐ నాట్ అఫర్డ్ టు ఫాల్ ఇన్ లవ్ విత్ హిమ్?'

మళ్ళా రెండో సారి లవ్ అన్న మాట వాడాడు.

ఇప్పుడు నా ఎదురుగా నిలబడ్డ ఈ పిల్లవాణ్ణి చూస్తుంటే, 'లవ్', 'లవ్' అనే రెండు మాటలు రెండు పక్షుల్లాగా అతని చుట్టూ గిరికీలు కొడుతున్నట్టుంది.

నాకు నవ్వొచ్చింది.

'స్మైల్ చేస్తున్నారుగాని, జవాబివ్వడం లేదు' అన్నాడతను.

ఇంతలో హటాత్తుగా గుర్తొచ్చింది. పిన్నిగారు ఈ దృశ్యం చూస్తే? నాకు చాలా అనీజీగా అనిపించింది. ఎవరో వెనక నిలబడ్డట్టుగా వెనక్కి తిరిగి చూసాను.

మై గాడ్! సరిగ్గా అప్పుడే మా పిన్నిగారు ఇంట్లోంచి ఆ వాకిట్లోకి అడుగుపెడుతూ ఉన్నారు.

నాకు చాలా సిగ్గుగా అనిపించింది. చాలా గిల్టీగా కూడా అనిపించింది. అప్పుడు అతణ్ణి అక్కణ్ణుంచి వెళ్ళిపొమ్మనేదా? అది మరింత అసహ్యంగా ఉంటుంది. లోపలకు రమ్మనేదా? అది నా ఇల్లు కాదు, నాకు ఆ అధికారం లేదు. పోనీ నేను అక్కణ్ణుంచి తప్పుకునేదా? అది లేనిపోని అనుమానం కలిగిస్తుంది. నాకు ఏమి చెయ్యాలో తెలీక, సతమతమవుతున్న, ఆ క్షణంలోనే–

'పిన్నిగారూ! బావున్నారా!' అనడిగాడు రాజు.

అన్‌ప్రెడిక్టబుల్ ఫెలో.

ఆమె అసలే సౌమ్యురాలు. అతనలా పలకరించేటప్పటికి కంగారు పడిపోయింది.

'బావున్నాను బాబూ, నువ్వు కూడా బావున్నావు కదా. ఏమిటి ఈ మధ్య కనిపించడం లేదు? అమ్మగారు బాగున్నారు కదా' అని, అలాంటివే ఒకటి రెండు కుశలప్రశ్నలు అడిగి 'అక్కడే నించున్నావేం, లోపలకి రా బాబూ' అంది.

'లేదండీ, ఇప్పుడు కాకినాడ వెళ్ళిపోతున్నాను. లాస్ట్ బస్‌కి' అన్నాడు.

ఇన్‌కారిజబుల్ ఫెలో.

లాస్ట్ బస్ వచ్చేటప్పటికి ఏడున్నరా ఎనిమిదవుతుంది. ఇప్పుడింకా ఆరు కూడా కాలేదు. అర్థమయింది, నాతో మాట్లాడటంకోసమే, అతను అంత తొందరగా అక్కడి కొచ్చేడని.

కాని పిన్ని గారు మరింకేమీ సంభాషణ పొడిగించకుండా అక్కణ్ణుంచి వెళ్ళిపోయేరు. నేను బతికి బయటపడ్డాననుకున్నాను.

'మిమ్మల్ని ప్రొఫెసరు తలుచుకున్నారు ఒకసారి' అన్నాను అతనితో.

'అవునా!' అన్నాడు అతను. అతనిముఖంలో సంతోషం చూసింది. 'ఆయన చాలా పెద్ద మనిషి. గొప్పవాడు. ఆ రోజు ఆయన గురించి తెలిసాక ఆయనంటే ఏదో తెలియని ఇష్టం కూడా కలిగింది' అని అన్నాడు, ఇంగ్లిషులో.

'ఏమి ఇంగ్లీషులో మాట్లాడుతున్నారు! నేను తెలుగమ్మాయినే' అన్నాను.

అతను నవ్వేసాడు.

'మీరంతా చాలా ఇంటెలిజెంట్. మా కాలేజిలో లెక్చెరర్లు మీముందు ఎందుకూ పనికి రారు. మీతో ఇంగ్లిషులోనే మాట్లాడాలి' అన్నాడు, కాని ఈ సారి తెలుగులో.

'అంత వద్దులెండి. కాని మీరు చెప్పిన మాటలు ప్రొఫెసరు గారికి సరిపోతాయి. ఆయన జీనియస్. ఆయనతో కలిసి నడుస్తుంటే కూడా యూనివెర్సిటీలో ఉన్నట్టే ఉంటుంది' అన్నాను.

'జీనియస్. నిజమే. కాని అంతకన్నా కూడా ఆయన చాలా కైండ్ హార్టెడ్ అనిపించాడు నాకు. ఆయన మాట్లాడుతున్నప్పుడు ఆ కళ్ళు చూసారా! ఆ కళ్ళు కూడా మనతో మాటాడుతూ ఉంటాయి' అని అన్నాడు.

నవ్వేసాను.

ఎందుకు నవ్వుతున్నారు?

'ఏమీ లేదు. ఇక్కడికి వచ్చేక రాళ్లు మాట్లాడతాయని తెలిసింది, మొక్కల్తో మాట్లాడాలని తెలిసింది. ఇప్పుడు కళ్ళు కూడా మాట్లాడతాయని తెలుస్తోంది. ఇంకా ముందు ముందు ఇంకేమి మాట్లాడతాయో అని!'

'హాస్యానికి అనడం లేదు. ఏవైనా మాట్లాడవచ్చు. ఏం? ఎందుకు మాటాడకూడదు? మనం వినాలేగానీ. ఇదిగో ఇప్పుడు ఈ చంద్రుడు మాట్లాడటం మొదలుపెట్టాడు. మీకు వినబడటం లేదా?' అని దూరంగా ఆకాశంలో వ్యాపిస్తున్న వెన్నెల వైపు చూపించాడు.

అటు వైపు చూసాను.

ఆ ఇంటిముందు వీథి లోపలకీ వెళ్ళి కొండరెడ్ల ఇళ్ళమధ్యనుంచి అడవిలోకి అదృశ్యమైపోయే మలుపు లోంచి చంద్రుడు కొండమీదకు ఎక్కుతున్నాడనుకుంటాను. చెట్టపట్టాలు వేసుకుని యుగాలుగా ఆ కొండలు నిలుచున్నచోట, చంద్రుడు రాకముందే ఆ అడవులమీంచి సముద్రపు హెూరులాగా వెన్నెల వినిపిస్తోంది. తూర్పు దిక్కున ఏదో పండగ మొదలైనట్టు, బృందాలు, బృందాలుగా మంగళవాద్యాల ఊరేగింపు మొదలైనట్టు, వేల పిచికారీలతో చందనద్రవాన్ని విరజిమ్ముతున్నట్టు వెన్నెల. నాకు కనిపిస్తున్నంతమేరా ఆకాశమంతా వెన్నెల పొగ. చెట్ల చిటారుకొమ్మల మీద, ఇళ్ళ కప్పులమీద, మా వీథిలో మా ఇంటిపక్క ఉన్న చింతచెట్టుమీద, ఇంటి ఎదురుగా ఉన్న రామకోవెల కప్పుమీద, నా ఎదట ఉన్న యువకుడి జుత్తుమీద, నా చీరమీద ఎక్కడ చూడు వెన్నెల దుమ్ము. నా భుజం మీద ఏదో చందనచూర్ణం రాలుతున్నదేమో అన్న భ్రాంతిలో దాన్ని దులుపుకోడానికి అప్రయత్నంగా నా వేళ్ళతో నా భుజం తడుముకున్నాను.

ఏళ్ళ తరబడి గడ్డకట్టిన మంచు కరిగినప్పుడు కూడా ఇంత నునువెచ్చదనం భూమ్మీద ప్రవహించదేమో అనిపించింది. ఆ వీథిలో పిల్లలు ఆడుకుంటున్న అరుపులు, రోడ్డుమీద మనుషులు మాట్లాడుకుంటున్న మాటలు ఆ వెన్నెల వడిలో ముద్దలుముద్దలుగా కరిగి

పోతున్నాయి. ఇంతదాకా అనుభవానికి రాని లేతతెమ్మెర ఒకటి నా ఒళ్లంతా చుట్టబెడుతూ అడవిలోకి సాగిపోయింది.

మరుక్షణంలో నేను అక్కడున్న ప్రతి ఒక్క అస్తిత్వాన్నీ మర్చిపోయాను. నా ఎదట ఉన్న ఆ కుర్రవాడు నా కళ్ళముందు అదృశ్యమైపోయాడు. ఇప్పుడు నా చూపులన్నీ ఆ కొండమీద దిగిన అతిథి మీదనే ఉన్నాయి. చంద్రుడు ఉదయిస్తే ఎలా ఉంటుందో నా జీవితంలో నేనెప్పుడూ చూడలేదు. ఒక చంద్రోదయం ఒక ప్రపంచం మీద ఇంత మంత్రజాలం చెయ్యగలదని నాకెప్పుడూ తట్టలేదు.

ఆ క్షణాన నేనేమి చూసాను? నాకేమి జరిగింది? చెప్పలేను. కాని ఆ రోజు నేను దేవగంగాస్నానం చేసాను. అంతకు ముందు ఎన్నడూ నేను అంత నిర్మలమైన జలాల్లో నిలువెల్లా మునిగిందిలేదు, ఆ తర్వాత, ఇప్పటిదాకా, కూడా లేదు.

ఆ రాత్రి నేను వెన్నెల సుగంధాన్ని కూడా గుండెలోతుకీ ఆఘ్రాణించాను. చందనం అనే పదం వాడుతున్నానుగాని అది మరొక పదం దొరకనందువల్ల మాత్రమే. వెన్నెల తావిని మనం మనకు తెలిసిన మరొక సువాసన దేంతోనూ పోల్చలేం.

నిజానికి అది ఘ్రాణేంద్రియానికి సంబంధించిన అనుభవం కాదు. కాని వెన్నెల ముందు మనలో మన మానవపూర్వ అస్తిత్వాన్ని దేన్నో జ్ఞప్తికి తెస్తుంది కాబట్టి, దాన్ని మనం ప్రథమక్షణాల్లో వాసనచూసినట్టే గుర్తుపడతాం కాబట్టి, చందనం, సుగంధం లాంటి పదాలు వాడడం. కాని ఆ రాత్రి నాకు అనుభవానికి వచ్చినదాన్ని వివరించడానికి నేను నేర్చుకున్న తెలుగు, చదువుకున్న తెలుగు సరిపోవు.

ఆ అనుభవం నాలో కలిగించిన ఉద్రేకాన్నీ, ఉపశమనాన్నీ మాటల్లో పెట్టాలంటే, సముద్రాల భాష కావాలి, సుగంధ ఓషధుల భాష కావాలి, సరీసృపాల భాష కావాలి. అవును, సరీసృపాలే. ఎందుకంటే, అక్కడ నిలబడ్డంతసేపూ, నా చర్మం ఆ వెన్నెల్ని అవిశ్రాంతంగా ఆస్వాదిస్తూనే ఉంది. సరీసృపాలు తమకి అందుతున్న రుచిని వాసనగా మార్చుకున్నట్టు, నా చర్మానికి అందుతున్న ఒక మధుస్పర్శని నేను చందనచర్చగా గుర్తుపడుతూ ఉన్నాను.

ఆ తర్వాత ఎన్నో సార్లు ఆ సాయంకాలం గుర్తొచ్చినప్పుడల్లా– ఆ ఊరు, ఆ గడ్డికప్పు ఇల్లు, ఆ కంచె, ఆ కంచె మీద పాకిన కాకరతీగె పూలు, అప్పుడు, 'చూడండి, ఆ చంద్రుడు కూడా మాట్లాడుతున్నాడు, మీకు వినబడుతోందా' అన్న మాటలు, ఆ తర్వాత, ఆ తర్వాత ఏముంది?

చందన చూర్ణం, చందన సుగంధం, చందన స్నానం.

నేననుకుంటాను, ఆ వెన్నెల్లో ఆ ఊరు, అప్పటిదాకా నేను ఆ ప్రొఫెసరుగారి బృందంలో ఒకతెగా తిరుగుతూ ఆ రాళ్ళతోటీ, ఆ మొక్కలతోటీ చేసిన సంభాషణలు, అపారమైన ఆ గ్రామాకాశం, అవిరళమైన ఆ తేజోనిశ్శబ్దం- అవన్నీ నాతో లేకపోయి ఉంటే, ఆ చంద్రోదయం నాకు అలా అనుభవానికి వచ్చి ఉండేదికాదేమో అని.

ఆ తర్వాత జీవితంలో ఎన్నో సార్లు మళ్ళా ఆ ఊరు వెళ్ళాలనీ, కాలండరులో కార్తిక పున్నమి ఎప్పుడొస్తుందో చూసుకుని మరీ వెళ్ళాలనీ అనిపించేదిగాని, ఉహు, ఆ సంధ్యాసౌరభం నా మీంచి మరొకసారి వీస్తుందని నేను నమ్మలేకపోయాను.

ఆ తరువాత ఒకటి రెండు సార్లు ఆ అనుభవాన్ని విశ్లేషించుకుందామని చూసాను. అది సాధ్యం కాలేదు సరికదా, అనవసరం కూడా అనిపించింది. ఎందుకంటే ప్రొఫెసరు చెప్పినట్టు నాలో ఉన్న కొండా, కోనా, రాయీ, రప్పా, అన్నీ కలిసి ఆ వెన్నెలకి ప్రతిస్పందించాయని అనుకోవాలి.

బహుశా చెట్ల మీద కాయలు వెన్నెల్ని పీల్చుకుని పండటం మొదలుపెట్టినట్టు, పొలాల్లో వరికంకులు వెన్నెల్ని రసంగా వడగట్టుకున్నట్టు నేను కూడా ఆ వెన్నెల్ని నాలోకి ఒంపుకున్నానని గ్రహించాను. ఒక జీవితకాలానికి అటువంటి ఒక రాత్రి చాలు.

ఆ రాత్రి ఆ పిల్లవాడు బస్సు వచ్చేదాకా అక్కడే నిలబడి ఏదో మాట్లాడుతూనే ఉన్నాడు. నేను కూడా అక్కడే నిలబడిపోయాను. నేను మాట్లాడిందేమీ లేదు. వింటూనే ఉన్నాను. ఏమి విన్నాను?

చంద్రుడి మాటలు, చెట్ల గుసగుస, వెన్నెల నిశ్శబ్దం.

❋

8

హేమంతఋతువు మొదలవుతూనే రెల్లు పూయడం ఆగిపోయింది. ఏటి ఒడ్డున దొరువుల దగ్గరా, మరీ లోతట్టుగా ఉన్న వరిచేల పక్కనా నిన్నటిదాకా గుంపులు గుంపులుగా వాలిన తెల్లనెమళ్ళు ఎగిరిపోయినట్టు రెల్లు అదృశ్యమైపోయింది. ఒకరోజు మేము అడవినుంచి తిరిగివస్తూండగా దూరంగా కనిపిస్తున్న రెల్లు పొదలు చూపించి 'జీవన్ బాబుకి ఎంతో ఇష్టమైన కాశ పుష్పాలు కనుమరుగైపోయాయి, ఇంక పొయెట్రీ కనిపించదు' అన్నాడు ప్రొఫెసరు. కానీ వారం రోజులు తిరక్కుండానే 'ఎక్కడ చూసినా కవిత్వమే. ఈ అద్భుతమైన ఋతువుని నేనిక్కడ చూస్తానని అనుకోలేదు' అన్నాడు.

ఆ హేమంతాన్ని మేము గుండెనిండా ఆఘ్రాణించామని చెప్పాలి. అసలు హేమంత ఋతువుని చూడాలంటే పట్టణాల్లోనూ, పల్లెల్లోనూ, తోటల్లోనూ కాదు, అడవీ, పల్లె అల్లుకునే చోట చూడాలి. ఒకవైపు అడవి తనను తాను పండించుకుంటూ ఉంటుంది. అది ఒక పరిణత దశ. ఆ తర్వాత తనని తాను పూర్తిగా రిక్తం చేసుకున్నాక కానీ వసంతం రాదు. మరొక వైపు పుడమి తనను తాను పూర్తిగా ప్రకటించుకుంటూ ఉంటుంది. అన్నేళ్ళుగా తాను స్వీకరించిన సూర్యరశ్మినీ, చంద్రకాంతినీ పంటలు పండించి వెనక్కి ఇస్తుంది. ఇప్పుడు నీకు ఆ రోజుల గురించిన జ్ఞాపకాల్ని ఒక్కమాటలో చెప్పు అనడిగితే పక్వానికొస్తున్న పంటపొలాలమీద రాలే మంచుసుగంధం అని చెప్తాను.

వేసవిరోజుల్లో వట్టివేళ్ల తడికల్ని మాటిమాటికీ నీళ్లతో తడుపుతూ ఉంటే మట్టివాసన లాంటి ఒక శీతలసుగంధం మన చుట్టూ అల్లుకుంటుంది చూడు, అట్లాంటి సుగంధమే అక్కడ ప్రతి రోజూ అనుభవానికొచ్చేది. నేలమీద పరిచిన వట్టివేళ్ళ తడకల్లాంటి ఆ పైరుపచ్చల్ని రాత్రంతా మంచు తడిపిన సువాసన.

మనం ఒకప్పుడు గడిపిన రోజుల్ని చాలా కాలం తర్వాత జ్ఞాపకం చేసుకోబోతే మన జీవితాన్ని మలుపు తిప్పిన సంఘటనలనో, హృదయాన్ని తీవ్రంగా ఉద్రేకించినవో, గాయపరిచినవో అలాంటివేవో అనుభవాల్ని గుర్తుతెచ్చుకుంటాం. కాని నిజానికి మన జీవితంలో ఆ రోజులు పూర్తిగా ఇంకేది అట్లాంటి నాటకీయక్షణాల్లో కాదు. మామూలు రోజులు, మామూలు ఉదయాలు, చిన్న చిన్న రోజువారీ రుటీను అలవాట్లు, ఎలాంటి హడావిడీ లేని కలయికలు, చిన్న చిన్న దగ్గరి దగ్గరి ప్రయాణాలు– ఆ రోజుల్ని ఆ రోజులుగా మార్చేవి ఇవే. ఆ కాలమంతా ఒక వర్ణచిత్రం అనుకుంటే ఈ చిన్న చిన్న బ్రష్ స్ట్రోక్సు తోటే ఆ రంగుల బొమ్మ పూర్తయ్యేది.

ఇన్నాళ్ళ తరువాత ఆ హేమంతకాలాన్ని గుర్తుచేసుకుంటూ ఉంటే నాకొక రంగుల చీర నేసుకుంటున్నట్టుగా ఉంది. ఒకసారి చీరాలలో ఒక నేతపనివారి ఇంట్లో ఒక చీర నేస్తున్న దృశ్యం చూసాను. ఆ మగ్గం, ఆ నేతపనిమనిషి, ఆ ఇంటిగోడలు– అదంతా ఒక గ్రేయిష్ బాక్ గ్రౌండు. బహుశా, కొంత గ్లూమీ బాక్ గ్రౌండు కూడానేమో. కానీ ఆ మగ్గం మీద అల్లుకుంటున్న ఆ నేతచీరలో ఎన్ని రంగులు, ఎన్ని మోటిఫ్స్, ఎంత ఇంద్రజాలం! ఆ రంగులు ఎక్కడున్నాయి? ఆ నేతపనిమనిషి హృదయం ఎంత వర్ణభరితం కాకపోతే ఆ వస్త్రం అంత వర్ణసుశోభితం కాగలుగుతుంది!

ఆలోచిస్తున్నాను, ఆ హేమంతమాసాల రంగులు నాలో ఉన్నాయా, ఆ అడవినుంచి ఒలికి పొలాల్లోకి ప్రవహించాయా, లేక ఆ పొలాల్లో వికసించి నాలోకి ప్రసరించాయా?

ఒకరోజు ప్రొఫెసరు అన్నాడు: 'నేను పొయెట్రీ అదృశ్యమైపోయిందనుకున్నాను. కాదు, పొయెట్‌తో పాటు ఇప్పుడు ఇక్కడికి పెయింటరు కూడా వచ్చాడు. బాగా పండి బంగారు వన్నె తిరుగుతున్న ఆ పొలాల్ని చూస్తుంటే రామ్ కింకర్ బైజ్ అనే చిత్రకారుడి చిత్రలేఖనాలు గుర్తొస్తున్నాయి' అని చెప్పాడు.

రామ్‌కింకర్ శాంతినికేతనులో పనిచేసాడట. అడవుల్నీ, పైర్లనీ, పల్లెల్నీ చిత్రించడానికి రామ్‌కింకర్ ఆకృతులకోసం వెతుక్కోడనీ, రెండు మూడు రంగుల్ని అలవోకగా పూత పూస్తాడనీ, ఆ రంగుల పూత మీద అటూ ఇటూ నాలుగైదు గీతాలు గీసి విడిచిపెడతాడనీ చెప్పాడు. అది నిజంగానే గొప్ప దర్శనం. ఒక విధంగా చెప్పాలంటే విహ్వాలదర్శనం కూడా. మరేం చేయాలో తెలియక నాలుగు గీతలు గీయడమేమో కూడా. లేకపోతే ఆ రంగులవిభ్రమాన్ని ఎలా వర్ణించగలుగుతాం?

నాక్కూడా ఒకటి రెండు రంగుపూతల్తోనూ, నాలుగైదు గీతల్తోనూ ఆ హేమంత సౌందర్యాన్ని మళ్ళా నా కళ్ళముందుకు తెచ్చుకోవాలని ఉంది. కాని నేను రామ్‌కింకర్

లాగా సిద్ధహస్తురాల్ని కాను. ఆ చిత్రకారుడికున్నంత ఆత్మనిర్భరత నాకుందనుకోను. కాబట్టి ఒక కుంచె తీసుకుని చిన్న చిన్న చిరుపూతలతోనే వర్ణవిలేపనం మొదలుపెడతాను.

ఎక్కణ్ణుంచి మొదలుపెట్టను? ముందు ఆ అపరాహ్ణాల్లో ఆ పొలాల మీద పరుచుకునే మేఘాల నీడలు కనిపిస్తున్నాయి. ఆ నీడలు మరికొంచెం సేపు తమనట్లా కావిలించుకోవాలని మత్తుగా మూలుగుతుండే ఆ పొలాలే నా కళ్ళముందు మెదుల్తున్నాయి. ఒక తెల్లటి గుడ్డతీసుకుని శరత్కాలం శుభ్రంగా తుడిచిపెట్టిన ఆకాశం మీద కదిలే మేఘాల్ని నువ్వు చూడాల్సింది వాటి వెలుగులో కాదు, నీడల్లో. మధ్యాహ్నం పొద్దు వాటారుతూ సాయంసంధ్యగా మారే వేళల్లో కొండలమీదా, సుదూర దిగంతందాకా పరుచుకున్న పంటపొలాల మీదా మేఘాల నీడల్ని చూడటం ఒక అనుభవం. ఎవరన్నా నీకు అంత దగ్గరగా జరగాలంటే నువ్వు కూడా అంత పరిపక్వమై ఉండాలన్నమాట.

ఒక్కొక్క ఋతువు మనకి చేరువకావడానికి ఒక్కొక్క ఇంద్రియాన్ని ఎంచుకుంటుంది అనుకుంటాను. హేమంతానిది ఘ్రాణేంద్రియం. వసంతానిది శ్రవణేంద్రియం. ఏమో, నేను సరిగ్గా చెప్పలేకపోతూండవచ్చు. వర్షాకాలానిది శ్రవణేంద్రియం కాదా? ఆ వసంత మాసపు రోజుల్లో అడవి అంతా అల్లుకున్న ఆ తీపిపూల సుగంధం ఘ్రాణేంద్రియానిది కాదా?

కాని ఎందుకో, ఇప్పుడు ఈ క్షణాన మాత్రం హేమంతం అంటే సుగంధం అనే గుర్తొస్తూ ఉంది నాకు. మార్గశిరమాసంలో ఆరోజు మేము అడవి నుంచి వెనక్కి వచ్చేటప్పటికి బాగా పొద్దుపోయింది. చీకటి పడుతూ ఉంది. మేము కొండ బాటమ్మట, మడేరు దాటి, మట్టిబాట వెంబడి ఊళ్ళోకి మలుపు తిరిగే చోట, నేనెన్నడూ పీల్చి ఉండని మధురమైన సువాసన ఒకటి నన్ను వెనక్కి లాగినట్టుగా గుంజింది. 'అదేమి ఫ్రాగ్రెన్స్?' అని వనలత కూడా అడిగింది.

'వెలగపండ్ల వాసన' అన్నాడు రాంబాబు, స్టీరింగు మీంచి తలకూడా పక్కకు తిప్పకుండా. ఎన్నేళ్ళుగానో, ఆ వేళల్లో, ఆ వెలగపండ్ల పిలుపు ఎన్నో సార్లు విని విని అలవాటైపోయినవాడిలాగా.

'వుడ్ యాపిల్! ఒక్కసారి ఆ చెట్టు దగ్గరికి తీసుకువెళ్ళవా?' అనడిగింది వనలత చాక్లెట్ కోసం మారాం చేసే చిన్నపిల్లలా.

'చీకటి పడుతోంది కదమ్మా' అన్నాడు దేవయ్య.

'ఒక్కసారి! ఓన్లీ వన్ మినిట్ ప్లీజ్' అంది వనలత.

రాంబాబు బండి బాక్ చేసాడు. ఆ చెట్టు మరీ దూరంలో లేదు. అంతా కిందకి దిగాం. సాయం సంధ్యాగగనం మీద మిగిలిన రెండు మూడు మేఘాల్ని అంటుకున్న నారింజరంగు వెలుతురు మసగ్గా మాకు దారి చూపించింది. ఆ చెట్టు కిందకి పోయి చూద్దుం కదా, విరగ్గాసిన ఆ చెట్టుమీదనే పండి, మూడు నాలుగు, వెలగపండ్లు కింద రాలి ఉన్నాయి. మరికొన్ని ఇంకా చెట్టుమీదనే పండుతూనే ఉన్నాయి.

'ఇంకో నెలరోజులు పోతే ఇక్కడంతా తాండ్ర అచ్చులు పోసినట్టు ఉంటుంది' అన్నాడు రాంబాబు.

కింద రాలిపడ్డ ఆ పండ్ల కేసి చూసాను. పగిలి నెర్రెలు విచ్చిన ఆ పండ్లలోంచి తీపిదనం పొంగిప్రవహిస్తోంది. రాగిరంగు తీపిచారికలు ఆ చెట్టుకింద అల్లిబిల్లిగా అల్లుకు పోయాయి. చీమలు బారులు కట్టి ఆ దారులవెంట సంతోషపు బిడార్లు నడుపుతున్నాయి. ఆ పండ్ల పైన అడవిదోమలు తలుపు దగ్గర నిలబడ్డ గాయకబృందాల్లాగా తంత్రీవాద్యాలు మీటుతున్నాయి. శ్రోతల్తో పనిలేని సంగీతసమారోహం అది. అక్కడకు మాలాంటి ఒక మానవబృందం చేరుకోగలదని ఆ చెట్టు ఊహించినట్టులేదు. ఊహించిఉంటే ఆ సుగంధాన్ని మరింత దాచుకునేదో లేక మరింతగా వర్షించేదో నేను చెప్పలేను.

అక్కడ మేము ఆ సుగంధాన్ని ఆఘ్రాణించినంత ఆఘ్రాణించి తక్కింది గాలికీ, గంధర్వులకీ వదిలిపెట్టి జీపు ఎక్కాం. కొంతసేపు గడిచాక దేవయ్య 'ముందు ఆ వాసన తగలగానే వెలగ పండ్ల వాసన అనుకోలేదు. ఇక్కడేదో పాము తిరుగుతోంది అనుకున్నాను' అన్నాడు.

'అదేమిటి?' అని అడిగాడు ప్రొఫెసరు.

'ఎక్కడేనా ఇంత ఘాటుగా పండ్ల వాసన సోకితే అక్కడొక తాచుపామో, జెర్రిగొడ్డో తిరుగుతూ ఉంటుందంటారు మా ఊళ్ళో' అన్నాడు దేవయ్య.

నేను ఇంటికి తిరిగి వచ్చాక కూడా ఆ పండ్లవాసనతో పాటు ఆ మాటలు కూడా నన్ను వదల్లేదు. ఆ రెండింటినీ కలిపి ఎలా అర్థం చేసుకోవాలో తెలియలేదు. కాని ఇన్నేళ్ళు గడిచాక ఇప్పుడు గ్రహిస్తున్నాను, జీవితం ఫలవంతమయ్యే ప్రతి తావు పక్కనా గాఢమైన కోరిక ఒకటి పూర్తి సంతృప్తితోనో, పూర్తి అసంతృప్తితోనో పాములాగా పాకుతూనే ఉంటుందని. లేదా మరోలా కూడా అనుకోవచ్చు. ఆ సర్పం నీ పక్కనే పొంచి ఉండి

నీకొక పరిపక్వతాభ్రాంతి కలిగిస్తూ ఉంటుందని కూడా. ఏదోను ఉద్యానంలో ఆది స్త్రీపురుషుల మధ్య సాతాను ఒక సర్పంలాగా ప్రవేశించినప్పుడు, 'ఎనిమి ఇన్ వెయిట్' లాగా ఉన్నాడు అనలేదా కవి! బహుశా పూర్వకాలపు గ్రామీణులకి ఈ రహస్యం బాగా తెలుసనుకుంటాను.

బాగా పాలుపోసుకున్న పొట్టల్తో విప్పారిన పొలాల మీద ఎక్కడెక్కడినుంచో పిట్టలు వచ్చివాలినట్టు, ఆ హేమంత ఋతువుని తలుచుకుంటేనే ఎన్నెన్ని జ్ఞాపకాలో నా చుట్టూ మూగుతున్నాయి. మరీ ముఖ్యంగా ఆ రాత్రి.

డిసెంబరు మొదటివారమో, రెండో వారమో గుర్తులేదు. ఆ ఆదివారం మాకు ఫీల్డు వర్కు లేదు. మధ్యాహ్నం వకుళకుటిలోనే నా లంచి కూడా. కబుర్లు చెప్పుకుంటూ లంచికి కూచున్నప్పుడు ప్రొఫెసరు తన ప్లేట్లో వడ్డించిన చేపల పులుసు చూసి ఆశ్చర్యపోయాడు.

'ఎక్కడిది ఈ ఫిష్?' అని అడిగాడు, అప్పటికే ఉండబట్టలేక, ఒక ముక్క తుంపి నోట్లో వేసుకుంటూ.

'రాజు గారి అబ్బాయి తీసుకువచ్చాడు' అంది కొండమ్మగారు.

ఏ రాజు గారి అబ్బాయి అని అడగబోయి, రాజు అయి ఉండవచ్చు అని స్ఫురించి, 'ఎప్పుడొచ్చాడు రాజు' అని అడిగాను ఆమెని.

'రాజునా? ఎక్కడున్నాడు? నేను రమ్మంటున్నానని కబురుపెట్టండి' అన్నాడు ప్రొఫెసరు. ఆయన నిజంగానే ఆ పిల్లవాడితో ప్రేమలో పడిపోయినట్టే ఉన్నాడు.

ఆ కబురు ఎంత తొందరగా చేరిందోగాని, మేము టీ తాగే వేళకి రాజు అక్కడికి ఎగిరి వచ్చి వాలాడు. ఈసారి అతణ్ణి చూస్తే వనలత కళ్ళల్లో కూడా ఒక మెరుపు కనబడింది.

'థాంక్యూ వెరీ మచ్. మేమిక్కడికి వచ్చాక ఫిష్ సంగతే మర్చిపోయాం. ఎలా తట్టింది మీకు మాకీ గిఫ్ట్ ఇవ్వాలని?' అనడిగింది ఆమె.

'ఎప్పుడొచ్చారు' అని కూడా అడిగింది.

'నిన్ననే వచ్చాను. రాత్రి పంట కాపలాకి వెళ్ళాను. పొద్దున్నే ఇంటికొస్తుంటే అప్పుడే ఎవరో ఏటిదగ్గర గాలాలు పట్టుక్కూచున్నారు. నేను కూడా వాళ్ల దగ్గర గంటసేపు కూచుని దొరికినవి దొరికినట్టుగా మూటగట్టి మీకు పంపాను' అన్నాడు.

'థాంక్స్ ఎ టన్' అన్నాడు ప్రొఫెసరు.

వనలత చేపల సంగతి మర్చిపోయి పంట కాపలా అన్న మాట పట్టుకుంది.

'పంటలు కాపలా కాయడమంటే రాత్రంతా మేలుకుని ఉంటారా?' అనడిగింది. ఎక్కడ కూచుంటారు? ఎక్కడ పడుకుంటారు? వైల్డు యానిమల్సు వచ్చి మీద పడితే ఏమి చేస్తారు– లాంటి ప్రశ్నల పరంపర కురిపించింది. ఒక ఇలస్ట్రేటెడు జంగిలు బుక్కు తెచ్చి చూపిస్తే పేజీలు తిప్పుతూ ప్రశ్నలడిగే పిల్లలాగా.

రాజు ఆమె ప్రశ్నలన్నిటికీ ఓపిగ్గా జవాబులిస్తూ ఉన్నాడు.

ఎండ వేడితగ్గి పలచని పసుపు రంగులోకి తిరిగింది. పక్కనున్న అడవిలోంచి రెడ్ వెంటెడ్ బుల్బులు ఇందాకటినుంచీ ఒకటే పాటలు పాడుతూ ఉంది. మధ్యాహ్నం వేళల్లో వకుళకుటి దగ్గర కూచున్నప్పుడల్లా రెడ్ వెంటెడ్ బుల్బులో లేకపోతే రెడ్ విష్కర్డ్ బుల్బులో పాటలు పాడుతూనే ఉంటాయి. అవి పాటలు పాడుతున్నంతసేపూ అడవి అడవిగా మారిపోతూ ఉంటుంది.

పంటచేలో రాత్రి కాపలా సంగతి అలా ఉంచి, అసలు పండిన పంటచేలల్లో నిదానంగా నాలుగడుగులు కూడా నేనెప్పుడూ నడిచింది లేదు. రాజూ, వనలతా మాట్లాడు కుంటూ ఉంటే, నాక్కూడా వెన్నువాలుతున్న వరిపైర్లమీంచి వీచే పండుగాలులు వంటిని తాకుతున్నట్టు అనిపించింది.

'కాకూ, షల్ వుయ్ స్పెండ్ దిస్ నైట్ ఇన్ ద ఫీల్డ్స్?' అనడిగింది ప్రొఫెసర్ని. ఆయన్ని చూద్దును కదా, అప్పటికే ఆయనకి రెండు భుజాలకీ వెనకవైపు రెక్కలు విప్పారుతూ ఉన్నాయి.

రాత్రి పొలాల్లో గడపాలంటే ఏర్పాట్లు చేయడానికి ముందే చెప్పాలనీ, అందుకని ఆ మర్నాడు వెళ్దామనీ అన్నాడు రాజు. మర్నాడు అడవినుంచి తొందరగా వచ్చేసి మరీ చీకటిపడకుండా పొలాలకు వెళ్దామనీ, కాని ఒక రాత్రంతా గడపడం కష్టమవుతుందనీ, కొంతసేపు అక్కడ గడిపి వచ్చేద్దామనీ అన్నాడు.

నేను మర్నాడు పిన్నిగారికి అదంతా చెప్పి, రాత్రి రావడం ఆలస్యమవుతుంది కాబట్టి వకుళకుటిలోనే పడుకుంటానని చెప్పాను. పిల్లలు పెద్దమ్మాయీ, చిన్నమ్మాయీ కూడా వస్తామన్నారుగానీ, ఆ రాత్రి ఎలా ఉంటుందో నాకే తెలియదు, మరోసారి తీసుకువెళ్తానని చెప్పాను

ఆ సాయంకాలం మేము టీ తాగిన వెంటనే పొలాలకి బయల్దేరాం. ఆ ఊళ్ళో చెరువుకీ, బావికీ మధ్యలో అల్లిబిల్లిగా అల్లుకున్న డొంక దారిన లోపలకి కొంతదూరం నడిచాక, మట్టిబాట దిగి పొలం గట్లమ్మట నడిచి మరీలోపలకి వెళ్ళాక ఎదురయ్యాయి రాజూవాళ్ల పొలాలు. వరిచేలు. దూరంగా చెరకుతోట. చేలకి దిగువగా, మరీ దగ్గరా, మరీ దూరంకాని చోట ఏరు మలుపు తిరుగుతూ ఉన్నచోటు. ఆ వొంపుదగ్గర పెద్ద తెల్లమద్ది చెట్టు.

అక్కడ ఏ అలికిడీ లేదు, వరికంకులు ఆకాశంతో మొదలుపెట్టిన మాటలు తప్ప. ఆ పొలాల మధ్య అక్కడక్కడా మంచెలు. రాజు మమ్మల్ని తమ పొలంలో కట్టిన మంచె దగ్గరకు తీసుకువెళ్లాడు. మనుషుల అలికిడి మోసుకుంటూ గాలి తొందరతొందరగా ఏ వార్త చేరవేసిందోగాని, ఏటి ఒడ్డుమీంచి కొంగలు ఒక్కసారిగా పైకి లేచాయి. దూదిపింజల్లాగా పైన సాగుతున్న మేఘాలనుంచి తునిగిపోతూ గాల్లో తేలుతున్న దూదిపోగుల్లాగా కొంగలు.

'ఓహ్! బలాకలు' అన్నాడు సేన్ గుప్త.

'దే లుక్ లైక్ పొయెమ్స్ ఆఫ్ గురుదేవ్!' అని కేరింతలు కొట్టాడు.

'ఆ మంచె ఎక్కుదామా?' అనడిగింది వనలత.

తాను కూడా ఆ మంచె ఎక్కితే కూలిపోక తప్పదనీ, ఆ ఆలోచన వదిలిపెట్టమన్నాడు ప్రొఫెసరు. కానీ తననైనా ఎక్కనివ్వమని వేడుకుంది. కానీ కింద ప్రొఫెసర్ని ఒక్కరినీ వదిలి ఆమెతో పాటు ఆ మంచె ఎక్కాలనిపించలేదు నాకు. రాజు సాయం చేస్తూ ఉంటే ఆమె నెమ్మదిగా ఆ మంచె పైకి ఎక్కింది.

'ఓహ్! స్పెక్టాక్యులర్!' అంటో అరిచింది పైకి ఎక్కాక.

ఆమె కళ్ళతోనే ఆ దృశ్యం ఎలా ఉంటుందో ఊహించుకునే ప్రయత్నం చేసాను. ఆమె అరుపు విని దూరంగా ఉన్న పొలాల్లోంచి కూడా మంచెల మీంచి అరుపులు వినవచ్చాయి. చెరువులో రాయి వేస్తే బుడగలు తేలినట్టుగా ఆ పొలాలమీద ఆ అరుపులు గెంతుకుంటూ తేలిపోయాయి.

నేనూ, ప్రొఫెసరూ అక్కడ పొలం గట్టుమీద కూచున్నాం. రాజూ, వనలతా మంచె మీదనే కూచుని మాటాడుకుంటూ ఉన్నారు. ప్రొఫెసరు ఉన్నట్టుండి నిశ్శబ్దంలోకి జారిపోయాడు. ఆయనకి ఆ క్షణాన బంగ్లాదేశ్ పంటపొలాలు గుర్తు వస్తూ ఉండవచ్చు.

లేదా చివరి రెల్లుపూలు రాలిపోయాక ఆ లాండ్ స్కేప్ వదిలి పెట్టి వెళ్ళిపోయాడనుకున్న జీవన్‌బాబు మళ్ళీ తిరిగివస్తూ కనిపించి ఉండవచ్చు. నేను ఆయన మౌనాన్ని భగ్నం చెయ్యాలనుకోలేదు. నిజానికి నేను అటువంటి ఒక తావుకు చేరుకోవాలనే ఎన్నాళ్ళుగానో అనుకుంటున్నాననీ, ఎట్టకేలకు ఆ తావుకి చేరుకున్నాననీ అప్పుడే తెలుసుకున్నాను. నువ్వు చేరుకోవలసిన తావుకి చేరుకున్నట్లు తెలియడానికి గుర్తు అదే: మాటలు ముగిసిపోయి, మౌనం మొదలుకావడం.

కొంతసేపటికి ఎలాగైతేనేం వనలత ఆ మంచె దిగింది.

'ఏముంది ఆ పైన?' అనడిగాడు ప్రొఫెసరు.

'అక్కడా! ఎవరో వదిలిపెట్టి వెళ్ళిన పాటలున్నాయి' అంది వనలత. అలాకాక మరోలా ఏమి చెప్పగలదు? అప్పటికే ఆమె వంటిమీదా, వస్త్రాల మీదా మేఘాలనుంచి రాలిన ఆరెంజ్ డస్ట్.

'గ్లాడ్ టు నో దట్' అన్నాడు ప్రొఫెసరు తలూపుతూ. కాని వనలత ఆయన మాటలు ఇంకా ఆమె చెవుల్ని చేరకుండానే

'ఆజ్ ధానెరి ఖేతే రోద్రో ఛాయా-'

అని గీతం అందుకుంది. ఆ మాటలు వింటూనే సేన్‌గుప్త చలించిపోయాడు. 'ఒరుణిమా, ఒరుణిమా' అని ప్రేమగా మూలిగాడు.

వనలత పాట కొనసాగించింది.

ఆజ్ ధానెరి ఖేతే రోద్రో ఛాయా
లూకొచూరి ఖేలా రే భాయ్, లూకొచూరి ఖేలా
నీల్ ఆకాశే కే భాషాలే సాదా మేఘిర్ భేలా రే భాయ్
లూకొచూరి ఖేలా

(పంటపొలాల్లో ఎండా, నీడా దాగుడుమూతలాడుతున్నాయి, ఎవరు నీలాకాశంలో మేఘాల తెల్లతెరచాపలెత్తారు?)

ఆజ్ భ్రోమొర్ భోలే మోధు ఖేతే
ఉడే బేడాయ్ ఆలోయ్ మేతే

(తుమ్మెదలు ఈ రోజు తేనెకోసం పరుగులుపెట్టడం మాని, ఆ కాంతిలో ఊరికే గెంతుతున్నాయి)

ఆజ్ కీషర్ తారే నొదిర్ చారే చోకచోకిర్ మేలా
ఒరె జాబోనా ఆజ్ ఘోరే రె భాయ్ జాబొ న ఆజ్ ఘోరే

(ప్రేమపక్షులెందుకు ఈ రోజు నది ఒడ్డుకి చేరుకున్నారు? ఈ రోజు ఇంట్లో గడిపే రోజు కాదు కనుకనా)

ఒరె, ఆకాశ్ భేంగే బాహిర్కే ఆజ్ నేబోరె లుట్ కొరే
జెనొ జోవార్ జాలె ఫేనార్ రాశి బతాసి ఆజ్ చూట్ చె హాసీ
ఆజ్ బీన్ కాజే బాజియే బన్సి కాట్బె సకొల్ బేలా

(ఈ రోజంతా మనం ఆకాశంలోకి రెక్కలు చాపి ఆరుబయలుని కొల్లగొట్టుకుందాం. కెరటాలమీద నురుగులాగా, గాల్లో తేలివచ్చే నవ్వుల్లాగా ఈ రోజంతా మనం సోమరిగా గడుపుదాం, పిల్లంగోవి ఊదుకుందాం)

ఆమె పాడుతుండగా ఆమె కురులమీంచీ, కపోలాల మీంచీ వెన్నెల చిందటం మొదలుపెట్టింది. సేన్‌గుప్త ఆమె భుజం చుట్టూ ఆప్యాయంగా చెయ్యివేసాడు.

'ఒరుణిమా, గురుదేవ్ మనకోసమే ఈ పాట రాసాడు కదూ. యు మేడ్ మై డే' అన్నాడు.

'మాక్కూడా' అన్నాడు రాజు. అతడి కళ్ళల్లో వాళ్ళ సంతోషం ప్రతిఫలిస్తూ ఉంది.

'ఏం రాజూ? మీరెప్పుడొచ్చినా చంద్రుణ్ణి వెట్టబెట్టుకొస్తున్నారు? ఏమిటి మీ ఇద్దరి మధ్యా రిలేషన్' అన్నాన్నేను.

'అలాగా? మీరే నన్ను చంద్రుడికి పరిచయం చేస్తున్నారనుకుంటున్నానే' అన్నాడు రాజు.

అలా మేము ఎంత సేపు కూర్చున్నామో మాకే తెలియదు. ఆ మేఘాల నీడ పరుచుకున్న పొలాలమీంచి నెమ్మదిగా సంధ్యనడిచివెళ్ళిపోయిన తర్వాత ధూపం చల్లినట్లుగా అల్లుకున్న వెన్నెల. దూరంగా పల్లెల్లో వెలిగించిన దీపాలు. అదొక మంత్రమయ లోకం.

ఇన్నేళ్ల తర్వాత ఆ వెన్నెల ఆ వెన్నెలసంజ గుర్తొస్తుంటే అపారమైన నీలాకాశం కింద ఆడుకుంటున్న పిల్లలు నా కళ్ళ ముందు మెదులుతున్నారు. అన్ని చింతలూ, చికాకులూ పక్కనపెట్టి దాగుడుమూతలు ఆడుకుంటున్న పిల్లలు. ఏం చేస్తే ఇప్పుడు నేను మళ్లా ఆ పిల్లల ప్రపంచంలోకి పోగలుగుతాను?

❋

9

ఒకరితో ఒకరికి మాటాడుకోడానికి తీరికలేనంతగా మధువు సేకరించుకునే తేనెటీగల్లాగా మేము పనిలో కూరుకుపోయాము. నాకు అప్పగించిన గ్రిడ్డు పొడుగునా ఉన్న మొక్కల్నీ, చెట్లనీ, తీగల్నీ గుర్తుపట్టి మాపులో గుర్తుపెట్టగలిగే సామర్థ్యం నేను తొందరగానే సాధించుకున్నాను.

ఒక చెట్టునో, చామనో గుర్తుపట్టగానే దాన్ని స్థానికంగా ఏ పేరుతో పిలుస్తారో చెప్పడానికి జోసెఫ్ గారు నాకు ఒక ఫారెస్టు వాచరుని సాయంగా ఇచ్చారు. చెల్లన్నదొర అనే ఆ వాచరు కొండదొర. యాభై ఏళ్ళ పైబడ్డ వయస్సు. అప్పటికి పాతికేళ్ళుగా వాచరుగా పనిచేస్తున్నాడు. పదవతరగతి కూడా పూర్తి చెయ్యకపోవడంతో పై ఉద్యోగాలకి ప్రమోషను పొందలేకపోయాడు. కాని అతణ్ణి అడవిపండితుడని చెప్పవచ్చు. తక్కినవాళ్ళకన్నా అతడు రెండాకులు కాదు, రెండువందల ఆకులు ఎక్కువ చదివాడు.

అది ఇప్పట్లాగా ప్లాంట్ ఫైండర్లూ, ప్లాంట్ నెట్లూ లేని కాలం. మేము గుర్తుపట్టలేని మొక్కనో, చెట్టునో కనిపించినప్పుడు, దాని సాంపిల్సును సేకరించి, డ్రాయింగు వేసిపెట్టుకోడం తప్ప మరేమీ చెయ్యలేకపోయేదాన్ని.

కాని నాకు గుర్తున్నంతలో దాదాపు రెండువందల యాభైకి పైగా చెట్ల జాతుల్ని గుర్తుపట్టాము. అవి యాభైకి పైగా కుటుంబాలకు చెందిన చెట్లూ, మొక్కలూ అని గుర్తు.

అన్నిట్లోనూ ఫబేసియై కుటుంబానికి చెందిన మొక్కలూ, చెట్లూ ఎక్కువ సంఖ్యలో కనబడ్డాయి. కాలేజీలో లెగుమనేసీ అని చదువుకున్న ఫబయేసి మొత్తం వృక్షకుటుంబాలు అన్నిటిలోనూ మూడవ అతి పెద్ద కుటుంబం. ఉష్ణమండల దేశాల్లో దాని రాజ్యం చాలా

పెద్దది. సండ్ర, గనర, దిరిసెన, మోదుగ, రేల, ఇరిడి, బాడిత, కానుగ, ఏగిస, ఆరె, దేవకాంచనం లాంటి ఆ చెట్ల నీడలు ఇప్పటికీ నన్ను వెన్నంటి ఉన్నట్టే అనిపిస్తుంది. ఆ హేమంతకాలమంతటా, మధ్యాహ్నాల్లో ఆ కోవిదారవృక్షాల ఘాటైన మధురసుగంధం ఇంటికి వచ్చాక కూడా నాతోనే వస్తున్నట్టు ఉండేది. ఇప్పుడు కూడా ఎప్పుడేనా ఏ రెస్టరెంటు దగ్గరో, ఏ పార్కు బెంచీ పక్కనో నవంబరు, డిసెంబరు నెలల్లో విరగబూసే ఆ ఊదారంగు పూల సువాసన నన్ను తాకగానే నేనొక్క క్షణం మైమరుస్తాను. అల్లసాని పెద్దన రాసిన కవితలో అతడి కాళ్ళకు పసరు రాసుకుంటే తక్షణమే హిమాలయాలకు వెళ్ళిపోయాడని చదువుకున్నాం. కాని బహీనియా ఫ్రాగ్రెన్సు ఇప్పుడు సోకినా కూడా నేను మరుక్షణమే ఆ తూర్పుకనుమల్లోకి ఎగిరిపోగలను.

తూర్పుకనుమల్లో ఫబేసియై తర్వాత ఎక్కువ జాతులు రుబియేసియై కుటుంబానికి చెందినవని పుస్తకాల్లో రాసారుగాని, నాకు ఎక్కువ మాల్వేసియై కుటుంబమే కనిపించింది. బూరుగ, తెల్లబూరుగ, కొండ పత్తి, కొండ తామరలాంటి చెట్లు. అందులోనూ బూరుగచెట్ల గురించి నేను ముందుముందు ఎలానూ తలుచుకోబోతున్నాను కాబట్టి ఇప్పటికి కష్టం మీదనే నన్ను నేను నిగ్రహించుకుంటూ మొరేసియై కుటుంబాన్ని గుర్తు చేసుకుంటున్నాను. అవన్నీ దాదాపుగా ఫైకస్ జాతి చెట్లు. పనస, రావి, మేడి, జువ్వి, బొడ్డ, బరణిక లాంటి చెట్లన్నమాట. ఫిలంతసియై కుటుంబం కూడా పెద్దదే అంటారుగాని నేను చూసిన మొక్కల్లో ఒక్క ఉసిరి చెట్లు తప్ప మరేవీ నాకిప్పుడు గుర్తులేవు.

కాని ఒక అడవినుంచి నువ్వు ఒక్క జ్ఞాపకం మించి ఎక్కువ మూటగట్టి తెచ్చుకోడానికి అనుమతించమంటే ఉసిరిచెట్ల జ్ఞాపకమొక్కటీ చాలంటాను. చెట్టంతా, ప్రతి కొమ్మనా, ప్రతి కొమ్మ మొదట్లోనూ, ప్రతి ఒంపులోనూ ఒళ్లంతా పులకించినట్టుగా విరగ్గాసిన ఆ ఉసిరిచెట్లని ఎలా మర్చిపోగలుగుతాను? కోతులు ముట్టుకోనందుకు అనుకుంటాను, ఆ కాయలు చెట్లమీద గుత్తులుగా గుత్తులుగా కనబడేవి. వాటిని నెమ్మదిగా కోసుకునే ఓపికలేక, మనుషులు కోతులకన్నా క్రూరంగా ఆ కొమ్మలు విరిచి, ఆ చెట్లు దులిపి పొయ్యేవారు. వాళ్ళు వెళ్ళిన చాలాసేపటిదాకా అడవి కార్చిన కన్నీటిచుక్కల్లాగా ఉసిరికాయలు ఆ నేలలో, గడ్డిమీద చెల్లాచెదురుగా పడి ఉండేవి.

ఇందాకా ఏమన్నాను? అడవినుంచి ఒకే ఒక్క జ్ఞాపకం తెచ్చుకోమంటే ఉసిరిచెట్లను తలుచుకుంటాను అని కదా. బహుశా, ఈ లోకం వదిలివెళ్ళిపోయేటప్పుడు ఏదన్నా ఒక్క వస్తువు వెంటతీసుకుపోడానికి అనుమతిస్తామంటే ఒక్క ఉసిరికాయ చాలనుకుంటాను. ఉసిరికాయ కొరికి ఆ వగరు, ఆ పులుపు, ఆ చేదు అట్లా కొంతసేపు నోట్లో నానాక నీ

లాలాజలమంతా తీపెక్కుతుంది చూడు– బహుశా, మానవజీవితసారమంతా ఒక ఉసిరికాయని కొరికి రుచిచూస్తే తెలుస్తుందనుకుంటాను.

కొన్ని కుటుంబాల వృక్షజాలం ఎక్కువ రకాలు లేకపోయినా, ఆ ఉన్నవే విస్తారంగా అడవి పొడుగునా కనబడేవి. వాటిలో అన్నిటికన్నా ముందు తలుచుకోవలసింది కొంబటేసియా కుటుంబానికి చెందిన నల్లమద్ది, తెల్లమద్ది, తాడి, కరక చెట్లు. అడవిలో అడుగుపెట్టగానే ముందు పలకరించేవి నల్లమద్ది చెట్లే. కొండవాలులోనూ, ఏటిమలుపులోనూ జెండాలు పాతినట్టు తెల్లమద్ది చెట్లు. ఇక ఫాల్గుణమాసంలో రాబోతున్న వసంతానికి దూతలాగా చిగురించే కరకచెట్ల పచ్చదనాన్ని వర్ణించడం నాకు సాధ్యం కాదు.

ఇవి కాక, మామిడి, కొండమామిడి, నల్లజీడి, సీతాఫలం, రామాఫలం, దుద్దుగ, చిలకదుద్దుగ, జీలుగు, ఈత, అందుగ, కొండగోగు, తపసి, రేగు, గుమ్మిడి, నెమలి, వేప, వెలగ, నేరేడు, మారేడు, కుంకుడు, చింత, పాల– ఆ చెట్లన్నీ నాకు అడవిపెద్దల్లాగా, ఏ క్రెటాషియసు యుగంలోనో అవీ, నేనూ కలిసి తొలిసారి సూర్యకాంతికి చేరువైనట్టుగానూ కనిపించేది.

ప్రతి చెట్టునీ చూడగానే, బహుశా ప్రొఫెసరు ఇచ్చిన తర్ఫీదు వల్ల కాబోలు, ముందు నాకు ఒక పిలుపు వినబడేది. అక్కడ ఆ చెట్టునీడన రెండుమూడు నిమిషాలు మౌనంగా నిలబడేదాన్ని. నా మునివేళ్లతో ఆ బెరడుని మృదువుగా స్పృశించేదాన్ని. ఒక్కొక్కప్పుడు పక్కన ఎవరూ లేనప్పుడు, రెండు చేతులూ చాపి ఆ చెట్టుని కావిలించుకునేదాన్ని. నిండుగా పూసిన వేపచెట్టునో, నిండుగా ఫలాల్తో బరువెక్కిన మారేడుచెట్టునో, వెలగచెట్టునో, మామిడి చెట్టునో నీ రెండుబాహువుల్తోనూ చుట్టినా కూడా ఇంకా ఆ చెట్టు నీకు పూర్తిగా అందదు చూడు, అప్పుడు అచ్చంగా, ఆ చెట్టు మీ అమ్మలానూ, నువ్వు మీ అమ్మ మోకాళ్లను వాటేసుకుంటున్న పసిబిడ్డలానూ అయిపోతావు.

అసలు ఈ అనుభవాలన్నీ తలుచుకోవడం పక్కన పెట్టి ముందు ఆ చెట్లతో నా అనుభవాల్ని, ఆ ప్రథమ సందర్శనాల్ని, ఆ ప్రథమ పరిష్వంగాల్ని పేరుపేరునా తలుచుకోవాలని ఉంది. ప్రతి ఒక్క చెట్టునీ మొదటిసారి చూసినప్పుడు సూర్యుడు ఎక్కడ ఉన్నాడు, గాలి ఎటువైపు నుంచి వీస్తూ ఉంది, అడవిలో ఏ పిట్ట పాటపాడుతూ ఉంది, ఆ చెట్టున విరబూసిన ఆ పూల తావి నన్ను తాకినప్పుడు నాలో చెలరేగిన మధురోహలు ఎలాంటివి– మొదలైనవాటితో ప్రతి ఒక్క చెట్టునీ గుర్తుతెచ్చుకోవాలని ఉంది. పట్టణాల్లో మామూలుగా చూసే మామిడి, చింత, వేప, దిరిసెన, తురాయి, టేకు లాంటి చెట్లు కూడా అడవిలో

చూసినప్పుడు ఎంతో కొత్తగా కనిపించాయి. సింహాల్నీ, పులుల్నీ జూలో చూడటానికీ, అడవిలో చూడటానికీ మధ్య ఉన్న తేడా అంతా అందులో ఉంది.

కొన్ని చెట్లు నాకు బాగా స్నేహితులైపోయాయి. వాటిలోనూ, నాలోనూ ఒకలాంటి హృదయస్పందననే ఉందనుకుంటాను. అన్నింటిలోనూ ముందు గుర్తొస్తున్నవి, తురాయి చెట్లు. గుల్‌మొహర్. డెలొనిక్స్ రెజియా. కానీ వనలత వాటిని కృష్ణచూర వృక్షాలని పిలిచేది. చూర అంటే మకుటమట! తురాయి అంటే కూడా అదే కదా అర్థం! కాని కృష్ణుడు నెమిలి తురాయి వదిలి ఈ ఎర్రతురాయి ఎందుకుపెట్టుకున్నాడు?

'కృష్ణ చూరనా? అయితే రాధాచూర కూడా ఉందంటావా? ఏమిటి?' అనడిగాను ఒకసారి.

'ఎందుకు లేవు! ఉన్నాయి కదా' అంది.

పచ్చతురాయి, కొండచింత, దిరిసెన అని పిలిచే పూలచెట్టు, మన నగరంలో వసంతకాలంలో అవిరామంగా పసుపుపూల వాన కురిపించే ఆ చెట్లే రాధాచూరవృక్షాలట.

ఉన్నాయట్లా, ప్రతి ఒక్క చెట్టుతో పెనవేసుకుని ఒక కథ, ఒక స్మృతి, ఒక పరిమళం.

'ఈ పూలని మీరేమని పిలుస్తారు' అనడిగాను చెల్లన్నదొరని.

'అవా అమ్మగారూ, వాటిని మేము కోడిజుత్తు పూలంటాం' అన్నాడు. పిల్లలు ఆ పూలకేసరాల్తో కోడిపందేల ఆటలాడుకుంటారట.

ఎక్కడి కృష్ణచూర శబ్దం! ఎక్కడి కోడిజుత్తు పూలు!

ఒక్క పూలగుత్తి చుట్టూ ఎంత వైవిధ్యం! ఆ రెండు శబ్దాల్లో ఏది స్వీకరించదగ్గదో, ఏది వదిలిపెట్టదగ్గదో నేనిప్పటికీ తేల్చుకోలేకపోయాను.

మేము అడవిలో ఫీల్డువర్కు కి వెళ్ళినప్పుడు ప్రొఫెసరు ఎప్పుడేనా ఒక్కడూ ధ్యానంలోనో, మౌనంలోనో కూచుండిపోయినప్పుడు ఆయన్ని డిస్టర్బు చేయకూడదనే నేను కూడా అనుకున్నాను. అందుకని ఆయన్ని చూసి కూడా నాదారిన నేను నా పనిలో నిమగ్నమై పోయేదాన్ని. కాని ఒక్కోసారి ప్రొఫెసరు తన పని వదిలిపెట్టి నాదగ్గరకే వచ్చేవాడు. నాతో ఏదో ఒక సంభాషణ మొదలుపెట్టేవాడు.

గొప్ప ఆధ్యాత్మిక గురువుల దగ్గర ఉండే శిష్యులకి ఇలాంటి అనుభవాలు లభిస్తూ ఉంటాయి కాబోలు. అంటే తామేదీ అడక్కుండానే గురువులే తమంత తాముగా తమ దగ్గరికొచ్చి ఏదో ఒకటి చెప్తూ ఉండటం. ఎక్కువ జెన్ బౌద్ధంలో అలాంటి కథలు ఉంటాయంటారు. ప్రొఫెసరు తనంతటతానే నా దగ్గరకొచ్చి తనంతతానే ఏదో ఒక పువ్వు గురించో, పిట్టగురించో, రాయిగురించో, రప్ప గురించో చెప్పాలని బహుశా నాక్కూడా లోపల్లోపల గాఢమైన కోరిక ఉండేదనుకుంటాను. అది ఆయనకు ఎలానో తెలిసేదను కుంటాను.

ఒకరోజు నేను ఒక బండమీద కూచుని దగ్గరలో కనిపిస్తున్న ఒక కంపకేసి చూస్తూ ఉన్నాను. హేమంతఋతువు మామూలుగా పూలకీ, తేనెటీగలకీ దగ్గర కాదు. పూలదీ, తుమ్మెదలదీ వసంతఋతువు. ఆ కాలంలో అవి పాడుకోవలసినంతగా పాటలు పాడుకుంటేనే, మధుకోశాన్ని కొల్లగొట్టుకుంటేనే, ఆ అమృతభాండాన్ని ఫలాలుగా, పంటలుగా చేత ధరించి హేమంత ఋతువు అడుగుపెడుతుంది. అందుకనే హేమంతం మొదలవుతూనే సీతాకోకచిలుకలు కూడా తూర్పుకనుమలనుంచి పడమటికనుమలకి వలసపోతాయి. కాని ఆ రోజు నా ఎదురుగా ఇంకా ఒక పొద పూలతో విరబూసి ఉంది. దానిమీద తేనెటీగలు విహ్వలంగా భ్రమిస్తోనే ఉన్నాయి.

ప్రొఫెసరు వచ్చి నా పక్కన కూచున్నట్టు నాకు తెలియలేదు. ఆయన 'ఏమి చూస్తున్నావు?' అని అడిగేదాకా.

నాకు చాలా సంతోషంగా అనిపించింది ఆయనలా వచ్చి కూచుంటే. ఏదో ఒక రకంగా మాటలు పొడిగిస్తే, ఇవాళ గొప్ప ప్రసంగమే సాగుతుందని ఆశపుట్టింది.

'ఆ లంటానాని చూస్తున్నాను. తక్కిన పూలన్నిటికీ ఏదో ఒక సీజన్ ఉంటుంది కాని, వీటికి ఏ సీజనూ లేదు. చాలా జెనరస్ అనిపిస్తాయి. అందులోనూ, ఎన్ని రంగులో చూడండి!' అన్నాను. నాక్కూడా ప్రొఫెసరు భాష కొద్దికొద్దిగా పట్టుబడింది అనుకున్నాను.

ప్రొఫెసరు రెండు మూడు నిమిషాల పాటు ఆ పులికంప పొదలకేసి కన్నార్పకుండా చూసాడు. వాద్యకారుడి అంగుళుల కొసలు హార్మోనియం మెట్లని తాకీతాకకుండా చలిస్తున్నంత వేగంగా ఆ పూలమీద వాలితేలుతో, తేలివాలుతో ఉన్న ఆ తేనెటీగల్ని చూసాడు.

అప్పుడు దీర్ఘంగా శ్వాస వదిలి

'విమలా, యు నో –' అన్నాడు.

నేను చెవుల్ని దొప్పగా చేసుకుని ఆయన వైపు ఒగ్గాను. 'యు నో ' అని అన్నాడంటే ఆ తర్వాత తేనె వర్షిస్తుందని నాకు తెలుసు.

'ఈ పూలే లేకపోతే మనం లేము తెలుసునా. ఇవంటే, ఇవని కాదు, ఇవి ఇన్వేజివ్. అసలు పూలగురించే మాట్లాడుతున్నాన్నేను' అని అన్నాడు.

పూలకీ, మనిషికీ సంబంధం ఏమిటి? మరొక కొత్త పాఠం మొదలవుతోందని అర్థమయింది. వనలత కూడా ఎక్కడున్నా వెంటనే ఇటొస్తే బాగుణ్ణు అనుకున్నాను.

'భూమ్మీద జీవజాలం వికసించిన చరిత్రని పూలకి ముందూ, పూలతర్వాతా అని రెండు అధ్యాయాలుగా విభజించవచ్చు. ఒక రచయిత ఏం రాసాడంటే, ఎవరేనా గ్రహాంతరవాసి వేరే చోటనుంచి కొన్ని కోట్ల సంవత్సరాలుగా భూమిని చూస్తూ ఉంటే, ఇప్పటికి పదికోట్ల సంవత్సరాలనుంచి మాత్రమే ఈ రంగులు అతడికి కనబడుతూ ఉంటాయని. ఎందుకంటే పదికోట్ల సంవత్సరాలకింద ఈ భూమ్మీద పువ్వుల్లేవు. ఊహించు, నాలుగువందల నలభై కోట్ల సంవత్సరాల పాటు భూమి తన జడలో పూలు ముడుచుకుని ఎరగదు. అప్పుడు ఎటు చూసినా ఒకే ఒక్క ఆకుపచ్చ ఉండేది. ఆ ఆకుపచ్చ కూడా వ్యాపించకపూర్వం, కుతకుతా ఉడుకుతున్న భూగర్భంతాలూకు, ఎరుపు, గంధకజ్వాలల తాలూకు పసుపు, కరిగి కెరటాల్లాగా ఎగిసిపడుతున్న లావా తుపాన్ల ధూమ్రవర్ణాలు మాత్రమే భూమికి తెలిసిన రంగులు'.

'ఇప్పటికి పాతికకోట్ల సంవత్సరాల కిందట, సరీసృపాలు తలెత్తిన కాలంలో గాలిద్వారా విత్తనాలు ప్రయాణించి చెట్లు ప్రపంచమంతా వ్యాపించడం మొదలయ్యాక, వాటిమీద ఆధారపడి బతికే రెప్టైల్స్ భూమ్మీద ప్రాణంపోసుకున్నాయి గాని, వాటికింకా, అన్నిరకాల శీతోష్ణాల్నీ తట్టుకునే శక్తిరాలేదు. బల్లుల్లాంటి పక్షులు మాత్రమే బతగ్గలిగిన కాలం అది. మన పూర్వీకుల పూర్వీకుడు ఆ కాలంలో ఏదో ఒక చిన్న ఎలకలాంటి ప్రాణిలాగా ఎక్కడో ఊపిరితీస్తూ ఉండేవాడు.'

'ఆ మహాయుగం ముగిసిపోతూండగా, ఊహించని ఒక మహావిప్లవం సంభవించింది. అది పూల విప్లవం. మీరు ఏంజియోస్పెర్మ్స్ అంటారే ఆ మొక్కలన్నమాట. ఏంజియో స్పెర్మ్ అంటే ఏమిటి? భద్రంగా ఒక పెట్టెలో దాచిపెట్టిన విత్తనం అన్నమాట. అంతేనా, ఆ పెట్టెకి కింద పోగులుపోగుల్లాంటి లింకులు కూడా. ఆ పెట్టె గాల్లో ఎక్కడికి ఎగిరినా ఆ విత్తనానికి ఏమీ కాదు. ఆ పోగుల వల్ల అది దేనికన్నా అతుక్కోగలదు. కుంతి కర్ణుణ్ణి పెట్టెలో పెట్టి గంగలో వదిలినట్టు, ఆ పెట్టె ఆ విత్తనాన్ని ఎంత దూరప్రాంతానికైనా

క్షేమంగా తీసుకుపోగలదు. అది ఒక్కటే కాదు, ఆ విత్తనం కుక్కిపెట్టిన ఒక ఎనర్జీ కాప్సూల్. అలా పౌష్టికాహారం ఒక విటమిన్ మాత్రలాగా దొరకడం మొదలయ్యాక, క్షీరదాలకి వంట్లో రక్తాన్ని వెచ్చగా నిలుపుకోవడం సాధ్యమైంది. లేకపోతే అంతకుముందు శీతాకాలమంతా అవి హైబర్నేషన్లో గడపక తప్పేదికాదు. పూలవల్ల అపారమైన ఆహారం రెడీ–టు–ఈట్ ఫుడ్ లాగా దొరకడం మొదలయ్యాక పక్షులు ఎగరడానికీ, క్షీరదాలు వర్ధిల్లడానికీ, పరిణామ క్రమంలో మనిషి తలెత్తడానికీ దారి సులువయ్యింది' అన్నాడు ప్రొఫెసరు.

ఆయన మళ్ళా ఆ పూలకేసి చూసాడు. ఎరుపు, గులాబి, పసుపు, లేతనీలం, ఊదా– అసంఖ్యాకమైన రంగుపూల గుత్తుల్తో ఆ పొదమొత్తం ఒక పూల గుత్తిలాగా ఉంది.

'మనకి తెలియట్లేదుగానీ, మనరహస్యం ఈ పూలకి తెలుసనిపిస్తుంది. అందుకనే పరిణామక్రమాన్ని ఎంతో చక్కగా వివరించాడనుకున్న డార్విన్ కూడా పూలవిప్లవం దగ్గరికి వచ్చేసరికి దాన్ని ఎబొమినబుల్ మిష్టరీ అని అనకుండా ఉండలేకపోయాడు' అని అన్నాడు.

అప్పుడు లేవబోయాడు. కాని ఎవరో తన కాళ్లు పట్టుకుని ఆపినట్టు మళ్లా చతికిల బడ్డాడు.

'పూలు, రాళ్ళు, మొక్కలు– చివరికి, ఇదిగో ఈ స్పైడర్ వెబ్ చూడు' అని ఒక పొదనీ దానిపక్కనున్న నరవేప చెట్టునీ అల్లుకుంటున్న ఒక సాలీడుని చూపించాడు. ఆ హేమంత ప్రభాతకాంతిలో ఆ సాలీడుగూడు మంత్రసౌధపు ద్వారానికి వేలాడుతున్న జలతారు తెరలాగా ఉంది.

'చివరికి ఈ సాలీడు గూడుని చూసినా కూడా నేనొక అద్వితీయమైన ఆనందంలో మునిగి పోతాను. నీకు సందేహం రావచ్చు, ఈయన సైంటిస్టు కదా, ఇలా మాట్లాడు తున్నాడేమిటి? అని. నిజమే, నేను సైంటిస్టునే. అది నా అబ్జర్వేషన్స్‌లో. వాటిని అనలైజ్ చెయ్యడంలో మాత్రమే. కానీ నా అనుభూతిలో నేనొక మిస్టిక్కుని. మామూలుగా ఒక జియాలజిస్టు జీవితంలో ఏదీ డ్రమటిక్ కాదు. కాని నాలాంటివాడికి ప్రతి ఒక్కరోజూ పొయెటిక్‌గానే ఉంటుంది'.

'చూడు, ఈ కొండలు, ఇప్పటికి, ముప్ఫై ఏళ్ళుగా వీటి చుట్టూ తిరుగుతూనే ఉన్నాను. జియాలజి లో చేరినప్పుడు తరగతిగదిలో మొదటిరోజుల్లో ఏం చెప్తారో తెలుసా? మీరు ఏది చూసినా దాన్ని క్షుణ్ణంగా పరిశీలించండి. వాటి కొలతలు రికార్డు చెయ్యండి. చూసిన వివరాలన్నీ డిటెయిల్డ్‌గా రాసుకోండి. సాంపిల్స్ సేకరించండి అని చెప్తారు. కాని

స్టూడెంట్‌గా ఉన్నప్పుడూ, ఆ తర్వాత నేనే టీచరుగా మారినప్పుడూ కూడా, అక్కడ క్లాసులో ఏం చెప్తానో, ఏమి విన్నానో గాని, తీరా చేసి ఒక కొండముందు నిలబడేటప్పటికి నా మైండ్ మొత్తం ట్రాఫిక్ జామ్ అయిపోతుంది. రంగులు కలపడం గురించి ఎంత చదివినా, ఎంత నేర్చుకున్నా, తీరా తన ఎదట ఉన్న దృశ్యాన్ని చిత్రించమనేటప్పటికి, పెయింటర్స్‌కి కూడా అలాగే భావప్రవాహం ఆగిపోతుందని విన్నాను. ఎందుకో తెలుసునా? ఎంత చెప్పినా సైంటిఫిక్ మెథడ్ ఈజ్ అల్టిమేట్లీ టు-డైమెన్షనల్. ఒక కళాకారుడు మాత్రమే తాను చూసినదాన్నీ, అనుభవించినదాన్నీ త్రీ-డైమెన్షనల్‌గా మనకి అందించగలుగుతాడు.'

ఇంతలో నా ఆరాటం వనలతకి వినబడింది కాబోలు, ఆమె కూడా మమ్మల్ని వెతుక్కుంటూ అక్కడికి వచ్చింది. ఖాకీ పాంటు, ముదురు ఆకుపచ్చరంగు టీషర్టు. కంఠం చుట్టూ ఎర్రటిస్కార్ఫుతో ఆమె ఒక రెడ్ బ్రెస్టెడ్ రాబినులాగా ఉంది. జీవనానందుడు ఆమె కళ్ళని చూసే వనలతాసేన్ కవితలో కళ్లని పక్షిగూళ్ళల్లాంటి నేత్రాలు అన్నాడేమో!

ఆమెని చూస్తూనే ప్రొఫెసరు మాటలు మరింత ఉద్వేగభరితంగా మారాయి.

'విమల అడిగింది నన్ను, మీరెందుకు ఎప్పుడూ పొయెటిక్‌గా మాట్లాడుతుంటారు అని. (నేను అడిగానా?) నేనేం చెప్తున్నానంటే, పొయెట్‌దీ, జియాలజిస్టుదీ కూడా ఒకటే ఫీల్డ్ అని. బోత్ ఆఫ్ దెమ్ బిలాంగ్ టు ద లాండ్ ఆఫ్ వైల్డర్ నెస్ అని.'

'ఒకసారి నా నోటంట వైల్డర్‌నెస్ అనే మాట విని నా కొలీగ్ ఒకడు వైల్డర్‌నెస్ అంటే మనుషులు తిరుగాడే చోటుకాదనీ, ఒక యూనివెర్సిటీ ప్రొఫెసరుగా నేను సివిలైజ్డ్ వరల్డ్ గురించి మాట్లాడాలి తప్ప వైల్డ్ ప్లేసెస్ గురించి కాదనీ వాదించాడు-' అని ఆగాడు.

ఆ పెద్దమనిషి గుర్తుకొచ్చినట్టున్నాడు.

'పూర్ ఫెలో' అని అన్నాడు చిరునవ్వుతో.

'వాడికేం తెలుసు? గారీస్నైడర్‌ని చదివితే తెలుస్తుంది. మనం వైల్డర్‌నెస్‌కి ఇచ్చే డెఫినిషన్లన్నీ మనుషుల వైపు నుంచి చెప్పుకుంటున్న మీనింగ్స్ అని. ఈ మనిషెంత? ఈ నాలుగున్నర బిలియన్ల జియొలాజికల్ టైమ్‌లో మనిషి బతుకెంత? వైల్డర్‌నెస్ కి మనుషుల వైపునుంచి కాదు, ఈ రాళ్లవైపు నుంచి అర్థం చెప్పాలి, ఈ మహారణ్యాల వైపు నుంచి అర్థం చెప్పాలి, ఏనుగులు, కొండచిలువలు, ఎలుగుబంట్ల దృష్టిలో అర్థం చెప్పాలి' అని అన్నాడు ఉద్వేగంగా.

అప్పుడు ఒక క్షణం అటూ ఇటూ వెతుక్కున్నాడు. మంచినీళ్ళకోసం అని నాకు అర్థమయింది. నా దగ్గరున్న బాటిలు ఇచ్చాను.

ఆ బాటిలు మొత్తం గటగటా తాగేసాడు. నీళ్ళు అతని పెదాలమీంచి కంఠం మీదుగా షర్టు మీదకీ కారిపోయాయి.

'వాడికి తెలియందేమంటే, సైంటిఫిక్ ఎక్స్ పీరియెన్స్‌లో కూడా మూడు దశలుంటాయి. మొదటి దశలో మన అంచనాలు ఊహలు తలకిందులవుతాయి. రెండో దశలో మనం మనల్ని నెమ్మదిగా కూడగట్టుకుంటూ మన ముందున్న వాస్తవంతో ఒక అంగీకారానికి వస్తాం. మనం గ్రహిస్తున్న చిన్న చిన్న సత్యాలు తెలియడం మొదలుపెట్టాక మన ముందున్న ప్రపంచం గురించి ఏం తెలుసుకోగలమో ఏం తెలుసుకోలేమో తెలుసుకోవడం మూడవ దశ. ఆ మూడవదశలో అన్నిటికన్నా ముందు వినయం కావాలి. నువ్వు నిజమైన జియాలజిస్టువి, బోటనిస్టువి, నాచురలిస్టువి ఎప్పుడవుతావంటే, అడవికీ, కొండలకీ నువ్వు ఒక శిష్యురాలివి కాగలిగినప్పుడు. గుర్తుపెట్టుకో. మనం ఒక స్థలానికి వెళ్ళామంటే అది మనకి వట్టి అనుభవంగా మాత్రమే కాదు, ఒక ఎవర్ లాస్టింగ్ ఇంప్రెషన్‌గా మారిపోవాలి. మనం ఎంతసేపు చూసినా ఉపరితలం మాత్రమే చూడగలం. ఈ రాళ్ళు, ఈ ఆకులు, ఈ కణాలు మైక్రోస్కోపులో పెడితే మరికొంత లోతుకి చూడగలం. మీ కార్బన్-14 డేటింగ్ మెథడ్ మిమ్మల్ని మహా అయితే నలభై వేల ఏళ్ళదాకా వెనక్కి తీసుకువెళ్ళగలదు. ఆ తర్వాత?'

'నేనేమంటానంటే నువ్వు ఎంతైనా పరిశీలించు, ఎంతలోతుగానైనా విశ్లేషించు, కానీ ఆ వండర్‌కి దూరంకాకూడదు. విమలా, నువ్వు రోజూ ఎన్నో మొక్కల్ని చూస్తున్నావు, గుర్తుపడుతున్నావు, రికార్డు రాసుకుంటున్నావు, కాని గుర్తుతెచ్చుకో, మొట్టమొదటిసారి ఒక మొక్కకి వేర్లుంటాయని నీకెప్పుడు తెలిసింది? నేలలోంచి ఒక మొక్కని బయటికి పీకినప్పుడు దాని వేర్లు అల్లిబిల్లిగా అల్లుకుపోయి కనబడ్డ దృశ్యం ఎప్పుడు చూసావు? ఆ క్షణం గుర్తుందా? కుడ్ యు రికలెక్ట్ దట్ సెన్స్ ఆఫ్ వండర్?' అనడిగాడు నా కళ్ళల్లోకి చూస్తూ.

నేను గుర్తుతెచ్చుకోడానికి ప్రయత్నించాను.

'విమలా, ఒరుణిమా, రిమెంబర్, మనం ఒక అనాది నిర్మలత్వం నుంచి ఎంత దూరంగా జరిగిపోయామో ఇలాంటి చోట్లకి వచ్చినప్పుడే తెలుస్తుంది. వాడు, ఆ కొలీగ్ మానవమేధ అంటే బ్రెయిన్ ఒక్కటే అనుకుంటున్నాడు. యు నో. నక్షత్రధూళీ, కాలమూ, ప్రొటోప్లాజమూ కలిస్తేనే మానవమేధ తయారయ్యేది అని వాడికి ఎలా చెప్పేది?'

'నువ్వు మొదటిసారి ఒక కొండ దగ్గర నిలబడ్డప్పుడు కాలం దేశం ఖండించుకునే ఆ బిందువు దగ్గర నీకు కలిగిన అనుభవాన్ని అనుభూతిని నువ్వు ఎప్పటికీ టు డైమెన్షనల్ మ్యాపులోకి కుదించలేవు. అందుకనే మళ్ళా మళ్లా నువ్వు ఆ కొండల దగ్గరికి తిరిగి వెళు తూనే ఉంటావు. అవి నీకు మళ్లీమళ్లీ చదవాలి అనిపించే ఒక ప్రాచీనకావ్యం లాగా కనిపిస్తాయి. ఒక పర్వతశ్రేణి తాలూకు చరిత్ర అనేక కాండలుగా, పర్వాలుగా మలిచిన ఇతిహాసం లాంటిది. నువ్వు స్టడీ చేస్తున్న, అనలైజ్ చేస్తున్న ఔట్‌క్రాప్ మహా అయితే ఆ ఇతిహాసంలో ఒక పేరాగ్రాఫ్ లేదా ఒక శ్లోకం అన్న సంగతి నువ్వు మర్చిపోకూడదు. ఈ రహస్యం చీనా చిత్రకారులకి తెలుసు. వాళ్లు చిత్రించిన షాన్-సుయి చిత్రలేఖనాలు చూడు. వాటిల్లో మనిషి కనిపించనే కనిపించడు. ఒకవేళ ఉన్నా అంగుష్ఠమాత్రుడిగా కనిపిస్తాడు. కాబట్టి ఫస్ట్ లెర్న్ హుమిలిటీ. ఒకణ్ణి నేను ఆర్టిస్టు అనో, జియాలజిస్టు అనో ఎప్పుడు అనగలనంటే, వాడి అణువణువులోనూ, ఒక అబ్సొల్యూట్ హుమిలిటీ కనిపించాలి. దట్ హి షుడ్ కన్సిడర్ హిమ్‌సెల్ఫ్ లైటర్ దేన్ ద లైటెస్ట్ పార్టికల్ ఆఫ్ డస్ట్'

అప్పటికే చాలాసేపటిగా మాటాడుతూండటంతో సేన్‌గుప్త అలసిపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. ఆయన నుదుటిమీద, ముక్కుమీదా, చెంపలమీదా చెమట పడుతోంది.

'కాకూ, షల్ వుయ్ మేక్ ఎ మూవ్' అంది వనలత. అని తన చేయి ఊతంగా ఆయన్ని లేపింది. పైకి లేచి నిలబడి ప్రొఫెసరు సేన్‌గుప్త తన ఎదట ఉన్న కొండని మరోసారి ప్రేమగా పరికించాడు.

'విమలా! మనం యుద్ధభూమిలో అలిసి మూర్ఛపోయినప్పుడు మనకి ప్రాణం పొయ్యడానికి ఏఒక్క మూలికనో చాలదు. అందుకే కాబోలు హనుమాన్ ఏకంగా ఒక కొండనే పట్టుకొచ్చాడు' అని అన్నాడు.

❋

10

పంటకోతలు మొదలయ్యాయి. ఆ ఊళ్ళో పొలాలు నీటిపారుదల పెద్దగా ఉన్నవి కాదు. ఇప్పట్లాగా ఎక్కడ చూసినా గొట్టపుబావులు కనిపించే కాలమూ కాదు. నాలుగైదు చిన్న చెరువులకింద ఉండే వరిచేలు పుష్టిగా ఎదిగాయి. అవికాక వర్షాధారానికి పెరిగిన చేలు కూడా ఏ తుపానులూ తాకనందువల్లా, విస్తారంగా మంచుకురుస్తున్నందువల్లా కొద్దో గొప్పో ఏపుగానే పెరిగాయని చెప్పవచ్చు.

నా కళ్ళముందే ఆకుపచ్చని వరిచేలు ముందు గోధుమరంగులోకీ, ఆ తర్వాత బంగారుపసుపురంగులోకీ మారిపోతూ ఉండటంతో నా కళ్ళు ప్రతి రోజూ తూనీగల్లాగా ఆ పొలాల మీదనే ఎగుర్తుండేవి. వరిచేలల్లో కోతలు మొదలయ్యాక ఆ గ్రామసీమ స్వరూపమే మారిపోయింది. ప్రతి ఒకరి ముఖంలోనూ ఏదో సాఫల్యం, ఏదో సంతోషం. ఆ రోజులంతటా కనిపించేమేరదాకా లోకమంతా తలుపుల్లేని ఇల్లులాగా కనిపించేది. ఆ రోజుల్లో ఆ దారమ్మట ఏ బాటసారి నడిచి వెళ్తున్నా ఆ పొలాల మీది గాలులు అతణ్ణి అకారణంగా ముద్దాడుతున్నట్టుగా అనిపించేది. బహుశా నేనొక్కర్తినే ఆ సాయంకాలాలు ఆ పొలంగట్లమీంచి నడిచి వెళ్ళి ఉంటే ఆ చేలు నా దోసిళ్ళనిండా ధాన్యం ధారపోసి ఉండేవనిపించేది.

ఆ పొలాల్ని చూస్తూ ఉంటే, ఒక్కరోజు కూడా అక్కడ దుక్కి దున్నక పోయినా, నాట్లు వెయ్యకపోయినా, కలుపు తియ్యకపోయినా– ఆ పంటంతా నా చేతికొచ్చినట్టే కనబడేది. ఆ పొలాలన్నీ నావేననీ, ఆ పంటలు బాగా పండేక, ఇవాళో, రేపో ఊళ్ళో వాళ్ళందరినీ పిలిచి ఎవరికి ఎంత కావాలో అంత కోసి తీసుకుపొమ్మని చెప్పబోతున్నాను అనుకునేదాన్ని.

అలాంటి రోజుల్లో ఒక ఆదివారం రాజు పొద్దున్నే మా ఇంటికొచ్చాడు. వకుళకుటికి వెళ్దామన్నాడు. ఆదివారం ఒక్కరోజే ప్రొఫెసరుకి విశ్రాంతిదొరికే రోజు, ఆయన్ని ఎందుకు డిస్టర్బు చేయడమన్నాను. కాని ఎక్కువసేపు వుండొద్దనీ, ఊరికే చూసి వచ్చేద్దామనీ అన్నాడు. తీరావెళ్ళాక అసలు విషయం బయట పెట్టాడు.

తమ వరిచేలో కోతలు మొదలుపెట్టారు, తీసుకువెళ్ళి చూపించడానికి వచ్చానని చెప్పాడు. ప్రొఫెసరు నన్నేమనుకుంటాడో అనుకున్నాను. ఆ రోజు ఆయన అప్పటిదాకా కలెక్టు చేసిన సాంపిళ్లు నంబర్లవారీగా పాక్ చేసుకుంటున్నాడు. దేవయ్య, రాంబాబు ఆయనకి సాయం చేస్తున్నారు. ఆ మధ్యాహ్నం వాటిని నర్సీపట్నంలో ట్రాన్సుపోర్టులో ఇవ్వాలని అనుకుంటున్నారు.

రాజు చెప్పిన మాటలు విని ప్రొఫెసరు ఒక క్షణం ఆలోచనలో పడ్డాడు. అది తటపటాయింపుకాదు, తాను కూడా మాతో రావాలని ఒకక్షణం ప్రలోభానికి లోనయ్యాడేమో అనుకున్నాను. చివరికి తాను రాలేననీ, నేనూ, వనలతా వస్తే తీసుకువెళ్ళొచ్చనీ చెప్పాడు.

'లంచ్?' అంది వనలత. అప్పటికింకా పదిదాటలేదు. 'అక్కడే' అన్నాడు రాజు.

'ఎక్కడ? పొలాల్లో?' అనడిగింది ఆమె. ఆ కళ్ళల్లోంచి పసితనం ఒలికిపోతూ ఉంది.

ఊరికి అడ్డం పడి, పొలాలమ్మట నడుచుకుంటూ రాజు వాళ్ళ చేలదగ్గరకి చేరుకున్నాం. మేము అంతకుముందు ఒక వెన్నెల సాయంకాలం అడుగుపెట్టిన చేలే అవి. అప్పుడు అంత స్పష్టంగా కనిపించని ఆ చెరువూ, దూరంగా ఏరూ. కనుచూపుమేరంతా నడుస్తున్న కోతలు– ఆ దృశ్యంలో చెప్పలేనంత ఉత్సవ సంరంభం కనిపించింది. రాజూ వాళ్ళ చేలో కోతలు అప్పటికే మొదలయ్యాయి. ఆ కోస్తున్న స్త్రీలకి నడుందాకా ఎదిగిన చేలు. వాళ్ళు కోతలు సాగిస్తున్నట్టు లేదు. పొడుగ్గానూ, వెడల్పుగానూ నేలమీద పరిచిన పసిడి అంచు చీరని పదిమందీ వరసగా మడుస్తున్నట్టుంది. మేమిద్దరం కొంతసేపు వాళ్ళనట్లానే కన్నార్పకుండా చూస్తూ ఉండిపోయాం. వాళ్ళ పాదాల మువ్వల చప్పుళ్ళు, చేతులనున్న గాజుల గలగలలు, మధ్యలో ఎవరో ఉండీ ఉండీ ఒక పాటని గాల్లోకి ఎగరెయ్యడం, తక్కినవారు బంతి అందుకున్నట్టుగా ఆ ఎగిరివస్తున్న పాటని తామందరూ అందుకోవడం, ఆ పొలంగట్టుమీద తాటిచెట్లు గాలిపటాలు ఎగరేస్తున్నట్టుగా ఆకాశంలో కదలాడుతున్న తెల్లటిమేఘాలు, పచ్చటిపొలాలమీద పరుచుకుంటున్న వాటి నీడలు, కోసి పక్కన పడేస్తున్న వరికంకుల్ని పనలు కడుతుండగా చుట్టూ ఝుమ్మంటూ రేగుతున్న

జోరీగలు, తూనీగలు, గాల్లో ఎగురుతున్న గడ్డిపోగులు, మధ్యమధ్యలో అరుపులు, పురమాయింపులు, నవ్వులు, ఎకసెక్కాలు– బహుశా ఈ రోజు కోసమే రైతులు అన్నినెలల పాటు ఓపిగ్గా ఎదురుచూస్తారన్నమాట అని అనుకున్నాను. హార్వెస్ట్ అనే పదం పూర్తి స్పెల్లింగు అప్పుడు బోధపడింది.

'నేను కూడా కొయ్యొచ్చా?' అనడిగింది వనలత. ఆమె అడుగులు అప్పటికే ముందుకుపడుతూ ఉన్నాయి. రాజు ఆమె చేతికి ఒక కొడవలి ఇచ్చాడు. ఆమె దాన్ని చేతుల్లోకి తీసుకుని ఆ కక్కుల్ని అంచమ్మటే పైపైన వేళ్లతో తాకింది. బహుశా ఒక కొడవలి చేతుల్తో పట్టుకున్నది ఆమె జీవితంలో అదే మొదటిసారి అయి ఉండవచ్చు. ఆమెని చూస్తే నాక్కూడా ఒక కొడవలి చేతుల్లోకి తీసుకోవాలనిపించింది. నేను అడిగేలోపు రాజు నాక్కూడా ఒకటి చేతికందించాడు. మా ముందు రంగులతాడులాగా లయబద్ధంగా ఊయలూగుతున్న ఆ శ్రామికస్త్రీలకి ఒక పక్క చేరబోయాం. కాని వాళ్లు మా ఇద్దర్నీ తమ మధ్యకి రమ్మన్నారు. ఒకామె తను చేస్తున్న పని ఆపి ఆ కొడవళ్లు ఎలా పట్టుకోవాలో, ఎడమచేత్తో వెన్నులు ఎట్లా పిడికిట్లో ఇముడ్చుకోవాలో, కుడిచేత్తో ఆ వెన్నుల్ని ఎట్లా కొయ్యాలో చూపించింది. ఆ రోజు వనలత చీరె కట్టుకుంది. ఆమే, నేనూ ఇద్దరమూ కొంగు నడుం చుట్టూ బిగించాం. ఎవరేనా దూరం నుంచి చూస్తే మేము కూడా ఆ గ్రామీణ స్త్రీలలో ఒకరమే అనుకుంటారనిపించింది. సంతోషంగా అనిపించింది. గర్వంగా కూడా అనిపించింది. చిన్నప్పుడు స్కూలు బాగులూ, ఆ తర్వాత హాండు బాగులూ తగిలించుకుని నలుగురితో కలిసి స్కూలుకో, కాలేజికో, ఆఫీసుకో మాత్రమే వెళ్ళి వస్తూండటం అలవాటయిన జీవితానికి మొదటిసారిగా కొడవళ్ళు పట్టుకోవడం కొత్త జన్మ ఎత్తినట్టుగా అనిపించింది.

ఎన్నేళ్ళనుంచో వరిపొలాల్లో నాట్లు వెయ్యడం, పండినపొలాల్లో కోతలు కొయ్యడం అలవాటయినవాళ్లల్లాగా చకచకా ఆ వరిచేల పొడుగునా కోతలుకోస్తూ వెళ్ళిపోతున్నామనీ, అప్పుడంతా ఆశ్చర్యంతో, ఆరాధనతో మమ్మల్నే చూస్తున్నారనీ మదిలో ఒక దృశ్యం లీలగా మెదిలింది. కానీ వనలతా, నేనూ కూడా కంకులు ఎడమచేత్తో పట్టుకోడమైతే పట్టుకున్నాంగానీ తీరా వాటిని కొయ్యాల్సివచ్చేసరికి కొడవళ్లు ఒక పట్టాన సాగలేదు. మా అవస్థ చూసి ఒకరిద్దరు నవ్వుకుంటున్న చప్పుడు వినబడింది కూడా. కాని మాకు ఆ కోతలెలాకొయ్యాలో చెప్పినామె మాత్రం 'అమ్మగోరూ, అలానే, అలానే, సక్కంగా కోస్తున్నారు, అలానే, అలానే' అంటూ ఉంది. నాలుగైదు నిమిషాల తర్వాత వాళ్ళు మమ్మల్ని మర్చిపోయారు. తమ పనిలో తాము లీనమైపోయారు. కాని మాకు ఆ పని మధ్యలో

వదిలిపెట్టబుద్ధి కాలేదు. ఆ చేలకీ, మాకూ మధ్య ఆ కొన్ని క్షణాల్లోనే అనుబంధం బలపడిపోయింది. 'అలానే, అలానే' , కోసుకుంటూ ముందుకు వెళ్లాం. ముఖం మీద పడుతున్న ముంగురుల్ని వెనక్కి తోసుకుంటూ, చెంపలమ్మటా, మెడచుట్టూ పడుతున్న చెమట మధ్యమధ్యలో తుడుచుకుంటూ, పళ్లు బిగబట్టి, కనీసం గంటసేపేనా కొడవళ్ళు చకచకలాడిస్తూనే ఉన్నాం. తీరా చేస్తున్న పని ఆపి చుట్టూ చూసేసరికి అంతదాకా మాకు అటూ ఇటూ ఉన్న ఆడవాళ్ళంతా అయిదారడుగులు ముందుకు వెళ్ళిపోయారు. మా ఎదట నాలుగైదు అడుగుల వెడల్పున ఇంకా కోతకొయ్యని చేను!

మా సామర్థ్యం చూసుకుని మాకిద్దరికీ నవ్వొచ్చింది. సిగ్గేసింది కూడా. 'దిస్ ఈజ్ ట్రూలీ యాన్ ఔట్ క్రాప్' అంది వనలత. ఏదన్నా కొండమధ్యలో శిలాభాగం ముందుకు పొడుచుకు వచ్చినట్టు ఉంటే దాన్ని 'ఔట్ క్రాప్' అంటారు జియాలజీలో.

'యాన్ ఔట్‌స్టాండింగ్ ఔట్ క్రాప్' అన్నాన్నేను, నవ్వుతో. కాని నా నవ్వులో నిస్పృహ ఉంది. పొలాలకు దూరంగా పుట్టిపెరిగిన నా జీవితంలో దేన్ని చూసుకు గర్వించాలో తెలియలేదు నాకు.

అక్కడ మంచె కింద పండుగడ్డి పరిచి ఉంది. వాటిమీద ఖాళీ గోనెసంచులు పరిచిపెట్టారు. రాజు మమ్మల్ని అక్కడకు తీసుకువెళ్ళాడు. అతని ఇంటినుంచి కారియరు వచ్చింది. ఒకామె ఆ మంచెకింద నీడలో మాకు అరటాకుల్లో అన్నం వడ్డించింది. కోతలు నడుస్తున్న ఆ పంటచేలో, ఆ మంచె కింద ఆ మధ్యాహ్నభోజనం ఒక అనుభవం. అన్నం తిన్నాక అక్కడే కొంతసేపు మేనువాల్చాము. మాగన్నుగా కునుకుపట్టింది.

మేము మళ్లా కళ్ళు తెరిచేటప్పటికి కోతలు ఆగిపోయాయి. అప్పటిదాకా కోసి పనలు కట్టిన వరికంకులు తెచ్చి కుప్పపోస్తున్నారు. మేము లేచి ఆ కుప్పలదగ్గరికి వెళ్ళాం. ఆ కుప్పలు నూర్చడానికి కళ్ళం సిద్ధం చేస్తున్నారు. ధాన్యం కుప్పలచుట్టూ బంతిపూలు దండలాగా పరిచారు. అప్పటికే అక్కడికి పాటలు పాడుకుంటూ యాచనచేసుకునే ఒక కుటుంబం వచ్చి నిలబడింది. వాళ్ళల్లో మగాయన చిన్నతంబురాలాంటిది మీటుతో ఏదో పాట పాడుతూ ఉన్నాడు.'అచ్చం మా బావుల్ సింగర్సు లాగా ఉన్నారు' అంది వనలత.

ఆ పంటచేలని వెతుక్కుంటూ ఒక పాట చేరుకునేటప్పటికి ఆ హేమంతం పరిపూర్ణమైందనిపించింది. కోసికుప్పపోసిన ఆ ధాన్యపు కంకుల్ని చూస్తే ప్రకృతి అన్ని నెలలుగా, అన్ని దివారాత్రాలు, ఆ సాఫల్యసంతోషం కోసమే వేచి ఉందా అనిపించింది. బహుశా, రాత్రి కోవెల్లో పవళింపు సేవ ముగిసాక, దేవుడు ఎవరికీ తెలియకుండా పెరటి దోవన ఆ పొలాల్లోకి వచ్చేస్తాడని కూడా అనిపించింది.

'ఇంక బయల్దేరతాం, ఇంట్లో ఎదురుచూస్తుంటారు' అన్నాను. 'అప్పుడేనా' అంది వనలత. ఆమెని చూడబోతే ఆ రాత్రంతా కూడా అక్కడే గడిపేలా ఉంది. పొద్దు వాలుతున్న వేళ ఆ మనుషులు, ఆ వరికుప్పలు, ఆ మంచె, ఆ శ్రామికులు ప్రతి ఒక్కరినీడలూ పొడుగ్గా సాగుతున్నాయి. దూరంగా ఏటి ఒడ్డుమీంచి కొంగలు ఆకాశంలోకి ఒక్కసారిగా లేచాయి.

'ఆ ఏటి దగ్గరకి తీసుకువెళ్తారా?' అనడిగింది వనలత రాజుని. రాజు కూడా బహుశా అలాంటిదేదో మేము అడగాలనే ఎదురుచూస్తున్నట్టుగా, ఆ మాటవినగానే, చప్పున, 'పదండి,మళ్ళా చీకటిపడితే కష్టం' అని ముందుకు దారితీసాడు.

హేమంతకాలం కావడంతో ఆ ఏటినీళ్ళు చాలా తేటగా ఉన్నాయి. ఆ నీళ్ళ దగ్గర అడుగుపెట్టగానే ముందు ముఖం కడుక్కున్నాం. నరాలు జివ్వుమన్నాయి. నీళ్ళల్లో పాదాలు పెట్టగానే చలికొరికింది. కానీ, ఆ మొదటిక్షణమే. మరీ అంతగా లోతులేని, మోకాళ్ల దాకా కూడా రాని ఆ ఏటిలో వనలత పరుగులు పెట్టడం మొదలుపెట్టింది. నన్ను కూడా తనతో పాటు గెంతులాడమంది. సందేహంగా నిలబడి చూస్తున్న నా మీద రెండుచేతుల్తోనూ నీళ్ళు రువ్వింది. ఆ నీళ్ల తుంపరమీదపడగానే నాకు ప్రాణం లేచి వచ్చినట్టనిపించింది. నేను కూడా చీర మోకాళ్లదాకా పైకిలాగి, కుచ్చిళ్ళు పైకిలాగి బొడ్డున దోపి ఒక్క ఉదుటున ఆ నీళ్ళల్లోకి గెంతాను.

చల్లటినీళ్ళు. ఎక్కడో కొండలమీద మూలికల్ని ఒరుసుకుంటూ ప్రవహించిన నీళ్ళు రాత్రంతా నక్షత్రకాంతితో తడిసిన మంచుని కడుపారా తాగిన నీళ్ళు తల్లి లేగదూడని దగ్గరకు లాక్కున్నట్టు మమ్మల్ని వాత్సల్యంతో అక్కున చేర్చుకున్నాయి. అలా ఎంతసేపు ఆడామో తెలియదు, కేరింతలు కొట్టాం, ఒకరిమీద ఒకరం నీళ్ళు చల్లుకున్నాం. మా ఇద్దరి చీరలూ తడిసిపోవడం కూడా మేము గమనించుకోలేదు. తీరా ఆ ఆటలమధ్యలో ఒకసారి తలతిప్పి పక్కకు చూసేసరికి మమ్మల్నే చూస్తో రాజు! నీళ్ళకు తడిసిన మా దేహాల యవ్వనం ఒక ఆకృతిగా అతడికి మొదటిసారిగా గోచరించినట్టుంది. ఒక మగపిల్లవాణ్ణి చూసి మొదటిసారిగా నాకు సిగ్గుముంచుకొచ్చింది.

వడివడిగా నీళ్ళల్లోంచి బయటికి వచ్చాం. తడిసిన దుస్తుల్తో మా ఇంటికి వెళ్తే మా వాళ్లు నా గురించి ఏమనుకుంటారో అని అప్పుడు తెలివొచ్చింది. అందుకని ముందు వకుళకుటికి బయల్దేరాం.

ఆ రోజు నుంచి సంక్రాంతి పండగ అయిపోయేదాకా మేము ప్రతి రోజూ ఒక పండగలాగా గడిపాం. క్రిస్మసు ముందురోజు సాయంకాలమూ, క్రిస్మసునాడూ కూడా జోసెఫ్ గారింట్లో పండగ. క్రిస్మసు ట్రీ పెట్టారు. ఇల్లంతా రంగుకాగితాల్తో, బెలూన్లతో అలంకరించారు. వాళ్లింటితో పాటు వకుళకుటిని కూడా అందంగా అలంకరించారు. క్రిస్మసు రాత్రి విందుతో పాటు గ్రేస్ మేడం క్రైస్తవ కీర్తనలు ఆలపించడం మరో విందు.

డిసెంబరు ముప్ఫై ఒకటి రాత్రి జోసెఫ్ గారు కాంప్‌ఫైరు ఏర్పాటు చేసారు. ఆ రాత్రి నేను సూర్యనారాయణగారినీ, వారి శ్రీమతినీ, ఆ పిల్లలిద్దర్నీ కూడా ఆ వేడుకకి తీసుకువెళ్ళాను. ఆ పిల్లలు కాంప్‌ఫైరు చూడటం అదే మొదటిసారి. రాజు తనతో పాటు ఒక గాయకబృందాన్ని పట్టుకొచ్చాడు. వాళ్ళల్లో ఇద్దరుముగ్గురు గిరిజన గాయకులు, ఒకరిద్దరు దళితులు కూడా ఉన్నారు.

కాంపు ఫైరు మొదలయ్యేముందు 'సరిగ్గా ఈ రోజుల్లోనే మా దగ్గర శాంతినికేతనులో పౌష్‌మేళా జరుగుతుంది. డిసెంబరు నాలుగోవారం అనుకోండి. బావుల్ గీతాలు, కీర్తనలు, కవితాగానం జరుగుతాయి' అన్నాడు సేన్‌గుప్త జోసెఫ్‌తో. బావుల్‌కవుల గురించీ, టాగోరు మీద వాళ్ళ ప్రభావం గురించీ కూడా రెండుమూడు మాటలు స్థూలంగా చెప్పాడు. ఆయన ఈ రోజుల్లో కలకత్తాలో ఉండి ఉంటే శాంతినికేతను వెళ్ళి ఉండేవాడు కాదేమోగాని, ఆ అడవిలో, ఆ గిరిజనగాయకుల్ని చూడగానే ఆయన పౌష్‌మేళాకి వెళ్లినట్టే ఉత్సాహపడ్డాడు. అందుకని కాంప్‌ఫైరు మొదలుకాగానే వనలతను ఏదేనా ఒక బావుల్ గీతం పాడమని అడిగాడు.

వనలత ముఖంలో కూడా ఎక్సైట్‌మెంటు కనిపించింది. ఆమె ఒకటి రెండు ట్యూన్లు హమ్ చేసింది. చివరికి 'మిలొన్ హొబె కొతొ దినె' అని ఎత్తుకుంది.

'ఓహ్! లాలోన్ ఫకీర్! గ్రేట్!' అన్నాడు ప్రొఫెసరు.

ఎదురుగా నెగడిలో నెమ్మదిగా జ్వాల చిగురించడం మొదలుపెట్టింది. శంఖం లాంటి వనలత కంఠంలోంచి ప్రాచీనసాగరఘోష వినిపిస్తున్నట్టుగా గీతం మొదలయ్యింది.

మిలొన్ హొబె కొతొ దినే
ఓ మిలొన్ హొబె కొతొ దినే
అమార్ మోనేర్ మానుషేర్ షానే
అమార్ మోనేర్ మానుషేర్ షానే.

(నామనిషిని కలుసుకునేదెప్పుడు? ఓ! నా ప్రియతముణ్ణి కలుసుకునేదెప్పుడు?)

చాతోకో థాకే ఆహెుర్నిషి
ఛే ఆచే కాలోశోషి
అమి హెూబో బొలె చొరొణో దాసి
ఓ తా హ్యా నా కోపాల్ గునే
ఆమార్ మోనేర్ మానుషేర్ షానే

(చకోరం రాత్రంతా మేలుకునే ఉంది. కృష్ణపక్ష చంద్రుడు కన్నార్పకుండా చూస్తున్నాడు. నీ చరణదాసిని కావాలని కోరుకుంటున్నాను. నా కోరిక తీరేదెన్నడు? నా మనిషిని కలుసుకునేదెప్పుడు?)

మేఘేర్ బిద్యుత్ మేఘే జామోన్
లుకా లే న పాయ్ అన్వేసోన్
ఆమి కలా రే హరయే జేమోన్
ఓఇ రూప్ హేరి ఎ దర్పనే
ఆమార్ మోనేర్ మానుషేర్ షానే

(మబ్బుల్లో మెరుపులాగా అది దాచితే దాగేదికాదు. నా ప్రియుడు దూరమైనప్పుడు నా అంతరంగదర్పణంలో అతణ్ణి కలుసుకోగలను. ఆ నా మనిషిని కలుసుకునేదెన్నడు?)

ఓ రూప్ జోఖోన్ స్మొరణే హెూయ్
థాకే న లోకోహా లొజ్జారో భోయ్
లాలోన్ ఫకీర్ భేభే బోలే సాదై
ఓ ప్రేమ్ సే జె కొరె సె జానె
ఆమార్ మోనేర్ మానుషేర్ షానే

(అతడి రూపు నా మనసులో పొడచూపగానే సిగ్గూ, శరం, లజ్జ, భయం సకలం వదిలిపెట్టేస్తాను. లాలోను చెప్తున్నాడు, ఆ ఒకే ఒక్కణ్ణి ప్రేమించినవాడు మాత్రమే అలాంటి మాటలు చెప్పగలడు. మరి ఆ నా ప్రియతముణ్ణి కలుసుకునేదెప్పుడు?)

జ్వాల ఇప్పుడు ఒక లతలాగా ఆ చీకటిని పెనవైచుకుంటోంది. నేనంతదాకా విని ఉండని ఏదో ప్రేమజీర వనలత గొంతులో ఆ రాత్రి లీలామాత్రంగా పొడగడుతున్నట్టు తెలుస్తోంది. లేదా ఆ పాట పాడే ప్రతి ఒక్కరికీ ఆ అనుభూతి గొంతులో పలుకుతుందా?

వనలత పాట ముగించగానే అంతా చప్పట్లు కొట్టారు, ఇక ఆ మిగిలిన రాత్రిని ఆ గాయకులు పూర్తిగా తమ సొంతం చేసుకున్నారు. వాళ్ళు తమతో పాటు ఒక హార్మోనియం పెట్టె, ఒక కంజిర, తబలా, తాళాలు తెచ్చుకున్నారు. ఆ బృందం నాయకుడు తమ్మారావు పౌరాణికనాటకాల్లో వేషాలువేస్తూ ఉంటాడట. వాళ్ళు పాండవోద్యోగ విజయాలు, హరిశ్చంద్ర లాంటి నాటకాల్లోంచి వాళ్లకి వచ్చిన పద్యాలు పాడారు. రాబోయే శ్రీరామ నవమికి వాళ్ళు కాంతామతి అనే ఒక నాటకం వెయ్యబోతున్నారనీ, ఇప్పణ్ణుంచే రిహార్సలు మొదలుపెట్టారనీ రాజు చెప్పాడు. వాళ్ళు ఆ నాటకంలోంచి కూడా కొన్ని పద్యాలు పాడారు, డైలాగులు చెప్పారు.

సేన్‌గుప్త ఆ నాటకబృందం మాటల్నీ, పద్యాల్నీ, పాటల్నీ తదేకంగా విన్నాడు. ఆ కాంపుఫైరు ఎర్రని వెలుగులో ఆయన ముఖమ్మీద రాత్రి పూటనే తామరపూలు పూస్తున్నంత సంతోషం కనబడుతూ వచ్చింది.

బాగా పొద్దుపోయేక కాంపుఫైరు ముగిస్తున్నట్టుగా జోసెఫ్ గారు ప్రకటించేక అందరూ ఇళ్ళకి బయల్దేరారు. నన్ను ఆ రాత్రికి తమదగ్గరే ఉంచెయ్యమని వనలత మావాళ్ళని అడిగింది. వాళ్లు కూడా ఇంటికి వెళ్లిపోయాక, డిన్నరుకి కూచున్నాం. మాతో పాటు రాజుని కూడా డిన్నరు చేసి వెళ్ళమని సేన్‌గుప్త ఆహ్వానించేడు.

కృష్ణపక్షపు రాత్రులు కావడంతో నక్షత్రాల వెలుగు తప్ప మరే వెలుతురూ లేదు. కింద ఆరుబయట లాంపుచుట్టూ వెలుగు తడిసిపోకుండా మంచు తెల్లటి గుడ్డ చుట్టినట్టుగా ఉంది. ఇంటిముంగిల్లోంచి, పక్కన అడవిలోంచి తొలిమామిడిపూత తీపి వాసన తాకుతూ ఉంది. ఆ సుగంధం మధ్య తేనె పరిమళంగా మారినట్టు పనసపూల వాసన.

డిన్నరు చేస్తున్నంతసేపూ సేన్‌గుప్త ఏమీ మాట్లాడలేదు. ఆయన ధ్యాస ఎక్కడో ఉన్నట్టే ఉంది. డిన్నరు ముగించాక మేము ఆ అరుగు మీద ఒక చాప వేసుకు కూచున్నాము. మామిడిచెట్లమధ్యనుంచి దశమిచంద్రుడు కనిపిస్తున్నాడు. సేన్‌గుప్త తన గదిలోకి వెళ్ళిపోకుండా కేను మోడా దగ్గరగా లాక్కుని మా పక్కన కూచున్నాడు.

'మీ డ్రామా ట్రూప్ నన్ను బంగ్లాదేశ్ తీసుకువెళ్ళిపోయారు. ఇందాకటినుంచీ ఒకటే స్ట్రగుల్ అవుతున్నాను, ఇక్కడికి రావడానికి. చాత కావడం లేదు' అన్నాడు రాజుతో.

'మా బెంగాల్లో జాత్రా నాటకాలు ఇలానే ఉంటాయి. చైతన్య మహాప్రభు కాలంలో మొదలయ్యాయి అవి. ఆయన కూడా ఆ నాటకాల్లో వేషాలు వేసేవాడట. ఇలానే మైథొలాజికల్ థీమ్స్. ఇలానే పద్యాలు, పాటలు, బిగ్గరగా చెప్పే డైలాగులు, రాత్రంతా

నడుస్తాయి. నా చిన్నప్పుడు జాత్రా నాటకాలు ఎక్కడ ఉన్నా మా అన్నయ్య తీసుకు పోయే వాడు. ఒక్కొక్కప్పుడు మా ఇంట్లో మా అమ్మానాన్నా పడుకున్నాక చెప్పకుండా గోడదూకి పరిగెత్తేవాళ్ళం. ఆ పద్యాలు నారాయణ గంజ్‌లో పాడుతుంటే రాత్రిపూట ఢాకా దాకా వినిపించేవి' అన్నాడు.

'జాత్రా గ్రేట్ ట్రెడిషన్. దాన్ని మోడల్‌గా తీసుకుని లోక్‌నాట్య, అంటే ఫోక్ థియేటర్ బెంగాల్‌లో ఎంత విస్తరించిందో తెలుసా? మూర్షిదాబాద్ విలేజెస్‌లో ఆడే ఆల్కాప్, జల్పాయిగురి ప్రాంతంలో కనిపించే మాన్ పాంచాలి, కాశ్ పాంచాలి, రంగ్ పాంచాలి, సుందర్ బన్స్‌లో బొన్ బీబీర్ పాల, ట్వెంటీ ఫోర్ పరగణాస్‌లో పుతుల్ నాచ్– ఎన్నిరకాలు ఫోక్ ఫామ్స్! వాటిని ఆడేవాళ్ళెవరో తెలుసా? ఇదిగో మీ ట్రైబల్స్ లానే మా సంతాలీలు, రాజవంశీల్లాంటి దళితులు, మార్జినలైజ్డ్ ముస్లిమ్సూనూ. వాళ్ళు బెంగాలీ జాత్రాని ఫోక్ థియేటర్‌గానూ, ఫోక్ థియేటర్‌ని లోకల్ థియేటర్‌గానూ మార్చేసారు. ఎన్ని రాగాలు, ఎన్ని కథలు, ఎన్ని పాటలు– హార్వెస్ట్ టైమ్‌లో, వసంతకాలంలో, పంటపొలాల్లో, నదీతీరాల్లో, సంతల్లో, పండగల్లో ఎక్కడ ఆ నాటకాలుంటే అక్కడకు పొయ్యేవాళ్ళం. అదొక మాజికల్ వరల్డ్' అని కళ్ళు అరమోడ్చాడు.

'ఎప్పుడేనా జీవితంలో మీకు అవకాశం దొరికితే నార్త్ బెంగాల్ తిరిగి చూడండి. యెట్ లీస్ట్ బీర్‌భూమ్ జిల్లా అయినా తిరిగి చూడండి. ప్రజల గుండె చప్పుడు ఎలా ఉంటుందో వినాలంటే కనీసం ఒక్క రంగ్ పాంచాలి నాటకమేనా చూడండి' అని కూడా అన్నాడు.

'మా దగ్గర కూడా ఎన్నో ఫోక్ ఫార్మ్సు ఉన్నాయి' అన్నాడు రాజు. 'పౌరాణిక నాటకాలు, బుర్రకథలు, హరికథలు, జక్కుల భాగోతాలు, తోలుబొమ్మలాటలు..' అంటో అతను ఇంకా చెప్పబోతుండగా, సేన్‌గుప్త అతడికి అడ్డుతగిలి–

'ఐ నో, ఇండియాలో ప్రతి ఒక్క చోట ఎన్నో కళారూపాలున్నాయి. రకరకాల కళారూపాలు ఉన్నాయి. కాని జాత్రాకి ఒక ప్రత్యేకత ఉంది. లెట్ మీ ఎక్స్ ప్లెయిన్ దట్. జాత్రా అంటే యాత్ర. థియేటర్ యాజ్ ఎ జర్నీ, యాజ్ ఏ పిలిగ్రిమేజ్. మీదగ్గర అటువంటి కాన్సెప్ట్ ఏదైనా ఉందా?' అనడిగాడు.

రాజు ఆలోచించాడు. 'మా దగ్గర కూడా డ్రామా ట్రూపులు ఊరూరా తిరుగుతారు. సురభి డ్రామా కంపెనీలు, కూచిపూడి భాగవతులు దేశమంతా తిరుగుతూనే ఉంటారు' అన్నాడు.

'యు ఆర్ లుకింగ్ ఫ్రమ్ ద లిటరల్ మీనింగ్ ఆఫ్ ద వర్డ్. నేను దాని మెటఫరికల్ మీనింగ్‌లో అడుగుతున్నాను. తారాశంకర్ బెనర్జీ రాసిన కొబి గుర్తుంది కదా నీకు ఒరుణిమా' అనడిగాడు వనలతని.

'ఇదే నేను ఎప్పుడూ చెప్పేది. సైన్సు, ఆర్ట్, లిటరేచర్ ఏదైనా గానీ నిన్నొక పిల్‌గ్రిమ్‌గా మార్చకపోతే దానికి అర్థం లేదు. చదువెందుకంటే బాగా ఆస్తిపాస్తులు సంపాదించి, జీవితంలో చక్కగా సెటిల్ అవడంకోసం అనుకుంటారంతా. కాదు, చదువు నిన్ను ప్రవహించే నదిగా మార్చాలి, నడిచే చెట్టుగా మార్చాలి. యు షుడ్ అల్టిమేట్లీ బికమ్ ఎ మూవింగ్ మెలొడీ, నాట్ ఎ హేంగింగ్ స్టార్. ఆర్ట్ ఈజ్ యాన్ యాంటీ- అక్యుములేషన్ మూవ్‌మెంట్. నా చిన్నప్పుడు ఆ జాత్రా బృందాల్ని చూస్తుంటే నాకు రెక్కలొచ్చినట్టుండేది. వాళ్ళల్లాగా నాక్కూడా, ఒక ఇంటికో, ఊరుకో అతుక్కుని ఉండిపోకుండా, ఒక సంచారిని కావాలని ఉండేది. ఒక లోకసంచారిగా. ఒక లోక్‌నాట్య సంచారిగా దేశమంతా తిరగాలని ఉండేది. బహుశా నేనొక సేన్‌గుప్తగా కాక ఒక రాజ్‌వంశీగా, ఒక సంతాల్‌గా పుట్టి ఉంటే వాళ్ళల్లో కలిసిపోయి ఉండేవాణ్ణేమో' అని అన్నాడు.

ఎవ్వరం ఏమీ మాట్లాడలేదు. అంతా ఆలోచనలో పడిపోయాం. బహుశా ఆ మాటల్లోని అంతరార్థాన్ని గ్రహించగలిగే వయసుకూడా కాదేమో అప్పుడు. తనకి నిద్రవస్తోందంటూ సేన్‌గుప్త తన గదిలోకి వెళ్ళిపోయాడు. వెళ్లిపోతూ, ఏదో గుర్తొచ్చినవాడిలా వెనక్కి తిరిగి 'విష్ యు ఆల్ ఏ హేపీ న్యూ యియర్' అన్నాడు. మేము కూడా ఆయనకి హేపీ న్యూ యియర్ చెప్పాం. మాలో మేము కూడా ఒకరికొకరం హేపీ న్యూ యియర్ చెప్పుకున్నాం. హ్యాపీ న్యూ ఇయర్ చెప్పుకోవడంలో ఉండే సరదా అప్పుడప్పుడే తెలుస్తున్న చిన్న పిల్లల్లాగా చెప్పుకున్నాం. ఒకరికొకరం కరచాలనం కూడా చేసుకున్నాం.

తను కూడా సెలవుతీసుకుంటానని రాజు అరుగు మీంచి కిందకి దిగాడు. మూడవ జాము రాత్రి కూడా గడిచిపోతూ ఉందని ఆకాశం గుర్తు చేస్తున్నది. అప్పటికే చంద్రుడు తేనెరంగు తిరుగుతున్నాడు.

❋

11

పందొమ్మిదో శతాబ్దంలో యూరోప్‌లో ఒక చిత్రకారుడు తనకన్నా వయసులో ఎంతో పెద్దవాడూ, పరిపూర్ణ నైపుణాన్ని సాధించినవాడూ అయిన మరొక చిత్రకారుణ్ణి చూడటానికి వెళ్ళాడుట. 'బొమ్మలు బాగా వెయ్యాలంటే ఏం చెయ్యాలి?' అనడిగాడట అతణ్ణి. ఆ పెద్దాయన ఆ యువకుడికి చెప్పాడట: 'బాగా వెయ్యాలని కాదు, ముందు, బొమ్మలు వెయ్యాలని కోరుకో. ఎలా వెయ్యాలంటే, నువ్వు నీ చిత్రించాలనుకున్న ప్రకృతి నీ కళ్ళ ముందుండాలి. ఒకవేళ నీ కళ్ళముందు ఆ దృశ్యం లేదనుకో. నీ జ్ఞాపకాల్లోంచి చిత్రించు' అని.

ఇప్పుడు నాకు ఆ నాటి ఆ జీవితాన్ని చిత్రించాలంటే మళ్ళా మరొకసారి ఆ ఊరు వెళ్ళాలని ఉంది. ఆ అడవిలో నడవాలని ఉంది. నిర్జనమైన కొండ అంచుల్లో నిలబడి ఆకాశాన్ని నోరారా పిలవాలని ఉంది. ఏటి ఒడ్డున రెల్లుదుబ్బుల్లో మాటుమణిగి, కొంగలు ఏమి చెప్పుకుంటున్నాయో వినాలని ఉంది.

కాని ఆ ఊరికి వెళ్ళలేను. వెళ్ళలేనని కాను, కాని వెళ్ళలేను. డా.సేన్‌గుప్తా బంగ్లాదేశ్‌లో తాను పుట్టిన గ్రామానికి పోగలనుకానీ, పోలేనని ఎందుకన్నాడో ఇప్పుడు తెలుస్తోంది. నువ్వు వెళ్ళగలవు, ఆ ఊరు అలానే ఉండవచ్చు, ఉండకపోవచ్చు. కానీ ఎవరో తత్త్వవేత్త అన్నాడని చెప్తారే, నేను కూడా ఆ మాటలే చెప్తున్నాను, నువ్వు అదే నదిలో కాదు, అదే అడవిలో కూడా రెండు సార్లు అడుగుపెట్టలేవు.

ఆ మహాచిత్రకారుడు తనని చూడటానికి వచ్చిన ఆ యువకుడికి చెప్పినమాటల్లో గొప్ప రహస్యం ఉందని నాకు ఇప్పుడు అనుభవానికొస్తోంది. నీ కళ్లముందున్నది నువ్వు

చిత్రిస్తే నువ్వు ఒక రిపోర్టరువి మాత్రమే అవుతావు. కాని దాన్ని నీ జ్ఞాపకాల్లోంచి బయటికి తీసినప్పుడు, ఆ అనుభవాల వేర్లు ఒకదానికొకటి ఎంత అల్లిబిల్లిగా అల్లుకుపోయాయో తెలుస్తుంది. అప్పుడు వాటిని ప్రత్యక్షంగా చూస్తున్నప్పుడు నీకు తెలీదు– కాని ఆ ఉదయాలు, ఆ సాయంకాలాలు, ఆ చింతచెట్లు, ఆ కొంగలు, ఆ మట్టిబాటలు, ఆ ఐరేణి కుండలు– ఇప్పుడు నీకు గుర్తొస్తుంటే వాటిలో నీ జీవితకాల బాధానందాలు సమ్మిళితమై నువ్వు వినని రాగాలు కొత్తగా వినడం మొదలుపెడతావు. జీవించినప్పుడు నీకు ఒకటే అనుభవం, కాని జీవితాన్ని తలుచుకున్నప్పుడు రెండు అనుభవాలు. రెండోసారి పుట్టడం లాంటిదది. కాని మొదటిసారి తెలియని సంతోషం ఇప్పుడు సగం బాధగా, సగం సంతోషంగా, వెరసి ఒక పూర్ణానందంగా అనుభవానికి రావడం.

రాత్రుళ్ళు ఆ తాటాకు ఇళ్ళకప్పుల్లోంచి చలి ధారాపాతంగా కురిసేది. నేనూ, పెద్దమ్మాయీ, చిన్నమ్మాయీ ఒకరినొకరం దగ్గరగా లాక్కుని ఒకరి డొక్కలో ఒకరం ముడుచుకుని పడుకునేవాళ్ళం. తెల్లవారుతూనే అన్నిటికన్నా ముందు నీళ్ళపొయ్యి దగ్గర చేరేవాళ్లం. వెచ్చని ఆ మంటకి చేతులు అడ్డుపెట్టి కాచుకుంటూ ఉంటే, వీపు మంచుకి తడిసిపోయేది. కొంతసేపయ్యాక మేము వెనక్కి తిరిగి వీపు మంటకి తగిలేలా కూచునే వాళ్ళం. ఇంతలో మళ్ళా వీపు వేడెక్కేది. ఇటు తిరిగేవాళ్ళం. ఊరంతా ఆవరించిన మంచు ఇంకా కరిగేది కాదు. సూర్యరథం ఊరవతలే ఆగిపోయిందా అనిపించేది. అడవి, కొండా, చెట్లూ, ఊరి చివర ఏరూ– అన్నీ మేలుకోడానికి బద్ధకిస్తున్నట్టే ఉండేది.

సంక్రాంతి రాబోతున్నవేళ పిన్నిగారు వాళ్ళింటిని కూడా అరుగులు మెత్తించి పేడతో అలికించారు. గోడలకి తెల్లటి సున్నం వెల్ల వేయించారు. ఇద్దరు ముసలమ్మలు, ఆ ఊరికి కిలోమీటరు దూరంలో ఉండే ఊరినుంచి వచ్చి రోజూ వెల్లవేసేవారు. బకెట్లలో సున్నం కలిపి చీపుర్లతో పూతమీద పూత వేస్తూ ఆ గోడలంతా వెల్లవేయడం చూస్తుంటే పండగ ప్రతి ఒక్క తావులోనూ అడుగుపెడుతున్నట్టుండేది.

పండగ అంటే ఏమిటి? అది ఒకరి ఇంట్లో వాళ్ల కుటుంబానికి మాత్రమే పరిమితమైన వేడుకలాగా కనిపించలేదు. అది ఊరంతటికీ వేడుక. అందరూ అందరి ఇళ్ళకీ వెళ్ళేవారు. ప్రతి ఒక్కరూ ప్రతి ఒక్కర్నీ పలకరించేవారు. ఆ రోజులంతటా దర్జీ సద్గురుమూర్తి మిషను ఖాళీ ఉండేది కాదు. పెద్దమ్మాయీ, చిన్నమ్మాయీ ఒక రోజంతా టైలరు దగ్గరే కూచుని తమ గౌన్లు దగ్గరుండి కుట్టించితెచ్చుకున్నారు.

పండగ ఇంకా మూడు నాలుగు రోజులుందనగా, రాజు ఒక మధ్యాహ్నం మా భోజనాలయ్యాక మమ్మల్ని తన ఇంటికి తీసుకువెళ్ళాడు. వాళ్ళ ఇల్లు ఊరికి తూర్పువేపున

శివార్లలో ఉంది. ఆ ఇంటికి వెళ్ళేదారిలో ప్రతి ఇంటి ముందూ చిక్కుడు తీగలు పూలు పూసి కనిపిస్తున్నాయి. ఇళ్ళ కప్పుల మీద అల్లుకున్న గుమ్మడితీగలకు పండుగుమ్మడి, బూడిదగుమ్మడి పండ్లు చుట్టుకుని ఉన్నాయి. రెండు అరచేతులు కలిపినా చాలనంత పెద్ద పెద్ద గుమ్మడి పూలు పచ్చగా వాటి చుట్టూ అల్లుకుని ఉన్నాయి. వాటిని చూస్తుంటే అన్నిటికన్నా ముందు అవే తొలిసూర్యకాంతిని కడుపారా తాగినట్టు కనిపిస్తున్నాయి.

రాజు వాళ్ళిల్లు పెద్ద ఇల్లు. పెద్ద ముంగిలి. ఎత్తైన అరుగులు. తక్కిన వాళ్ళ ఇళ్ళల్లో మట్టి అరుగులు కాగా వాళ్ళ ఇంట్లో అరుగులు గచ్చు చేసి ఉన్నాయి. గోడలు కూడా సిమెంటు గోడలు. కప్పు మాత్రం గడ్డి కప్పు. ఆ ఇంటి చుట్టూ కంచె పొడుగునా టేకు చెట్లు, ఒకపక్కంతా అరటిచెట్లు. దాదాపుగా అన్ని చెట్లూ గెలలు వేసి ఉన్నాయి. కొన్నింటికి ఊదారంగు పూలు. ఆ ఇంట్లో అడుగుపెట్టగానే అరిసెలు వండుతున్న వాసన గాల్లో స్వాగతమిచ్చింది. ఆ రోజో, ఆ ముందురోజో ఇంట్లో పూతరేకులు చుట్టి ఉంటారు, నెయ్యీ, ఏలకులూ కలిసిన సుగంధం చిక్కగా పొరలాగా పేరుకుని ఉంది. రాజు తండ్రి పెద్ద రైతు. ఆయనకి మాగాణి పొలాల్తోపాటు, అరటితోట, చెరకుతోట కూడా ఉన్నాయి. పెద్ద కుటుంబం. వాళ్ళ ఇంట్లో మమ్మల్ని ఎంతో ఆదరంగా పలకరించేరు. వెండి పళ్ళేల్లో అరిసెలు, పూతచుట్టలు పెట్టారు. కంచుగ్లాసుల్తో కాఫీ ఇచ్చేరు.

'ఇంటికొస్తే చాలు మా వాడు రోజూ మీ కబుర్లే చెప్తుంటాడు' అన్నది వాళ్ళమ్మగారు.

కొంతసేపు కూచున్నాక మళ్ళా నేరుగా ఊళ్ళోకి రాకుండా కొండరెడ్ల వీథిలోంచి మమ్మల్ని చుట్టు తిప్పి తీసుకొచ్చాడు రాజు. పండగ సంతోషం మాకు చూపించాలని.

సంక్రాంతి కొండరెడ్లకు పెద్ద పండగ. వాళ్ళు ఇళ్ళన్నీ బూజు దులిపి, గోడలు, అరుగులు మళ్ళా మట్టితో కొత్తగా మెత్తుకుంటున్నారు. ఇంటి అరుగుల పక్కన ఎర్రటి మట్టిమెత్తి దాని మీద తెల్లటిచుక్కల్తో ముగ్గులుపెట్టారు. గోడలమీద కూడా లతలూ, పూలూ తెల్లటి ముగ్గులూ పెట్టారు. వాటిని చూడగానే ప్రొఫెసరు 'జామినీరాయ్ గుర్తొస్తున్నాడు' అన్నాడు.

'సీ దోజ్ మోటిఫ్స్. బెంగాల్లో పటచిత్ర కళాకారులు గీసిన బొమ్మల్లాగా ఉంది ప్రతి ఇల్లూ. దీజ్ పీపుల్ మస్ట్ బి ఆర్టిస్ట్స్ ఆఫ్ ద హయ్యెస్ట్ ఆర్డర్. ఇంటినే కాన్వాసుగా మార్చేసుకున్నారు' అని అన్నాడు.

'జామిని రాయ్ చాలాకాలం యూరోప్‌ని అనుకరించాక, వన్ ఫైన్ మార్నింగ్, హి రియలైజ్డ్ దట్ ద రియల్ ఆర్ట్ వాజ్ దేర్ ఇన్ రూరల్ బెంగాల్. అంతే, కాళీఘాట్

పటచిత్రకారుల దగ్గరకి పోయి కూచున్నాడు. యు నో. దెన్ హి ఎమర్జెడ్ యాజ్ వన్ ఆఫ్ ద గ్రేటెస్ట్ ఆర్టిస్ట్సు ఆఫ్ బెంగాల్' అని కూడా అన్నాడు.

సంక్రాంతి దానికదే ఒక ఋతువు. తక్కిన ఋతువులకి చెట్లో, పొలాలో, నదులో కొత్త శోభ సంతరించుకుంటాయి. కాని సంక్రాంతివేళ ప్రతి ఇల్లూ కొత్త కళ సంతరించుకుంది. కొత్తధాన్యం దాచుకోడానికి గాదెలు తెరుచుకున్నట్టే, ఉత్తరాయణపు సూర్యకాంతిని దాచుకోడానికి ప్రతి ఇల్లూ తను ఒక గాదెగా మారిందా అనిపించింది. దివారాత్రాలు వెలిగించిన మట్టి ప్రమిదల్లాగా ఆ కొండరెడ్ల ఇళ్ళవరసలు కలకల్లాడేయి. దీపావళి ఒక రాత్రి పండగ. కాని సంక్రాంతి నెలరోజుల పండగ అనిపించింది.

ఆ రోజులంతటా ప్రతి రోజూ ఊళ్ళోకి కొత్త ధాన్యం మూటలు కట్టుకుని ఎడ్ల బళ్ళు అడుగుపెడుతూనే ఉండేవి. ఏటిమీద వంతెన దాటి, పొలాల మధ్యనుంచి ఊళ్ళోకి అడుగుపెట్టగానే చింతచెట్లమీద కొంగలు ఒక్కసారిగా కలకలం చేసేవి. ప్రతి రోజూ ఎవరో ఒకరింట్లో అటుకులు దంచుతున్న చప్పుడు వినిపించేది. మంగలంలో దోరగా వేయించిన కొత్తధాన్యం రోట్లో వేసి రోకళ్ళతో దంచుతుంటే గాజుల గలగలతో పాటు మనుషుల కిలకిలకూడా కలిసి వినిపించేది. ప్రతి ఇంటికీ బంతిపూల మాలలు తోరణా లయ్యేవి. తోటల్లో నారింజలు, కమలాలు పండిన నవసుగంధం వీథులదాకా వ్యాపించేది.

పండగ మూడురోజులూ ఊరూ, మనుషులూ, పశువులూ, బండ్లూ, చివరికి గోడలూ, అరుగులూ కూడా కొత్త అలంకారాల్తో మెరిసిపోయాయి. పండగరోజు ఆ ఊళ్ళో వాళ్ళంతా ఊరి వెనక ఉన్న కొండ ఎక్కారు. పండగరోజు కొండ ఎక్కే ఆ ఆచారం ఎక్కణ్ణుంచి వచ్చిందో నాకైతే తెలియలేదు. ఆ రోజు రంగురంగుల జెండాల ఊరేగింపులాగా కొండ పొడుగునా కనిపిస్తున్న మనుషుల్ని చూసి సేన్‌గుప్త ఆనందం పట్టలేకపోయాడు.

'దీజ్ ఆర్ ట్రూ మౌంటెన్ వర్షిప్పర్స్!' అన్నాడు. చప్పట్లు కొట్టాడు.

'ఒరుణిమా, టేక్ ఫొటోస్. మన డిపార్ట్ మెంట్‌లో చూపిద్దాం. దోజ్ ఫెలోస్ షుడ్ బి సెంట్ హియర్ ఫర్ ఏన్ ఓరియెంటేషన్' అని అన్నాడు.

ఆ రోజు సేన్‌గుప్తని, వనలతనీ సూర్యనారాయణగారు ఇంటికి భోజనానికి పిలిచాడు. అరటాకుల్లో పూర్తి తెలుగుభోజనం వడ్డించారు. ప్రతి ఒక్క వంటకాన్ని సేన్‌గుప్త పేరుపేరునా అడిగి మరీ ఆరగించాడు. ఆ తర్వాత ఆయన ఆ దంపతులిద్దరికీ కొత్త వస్త్రాలు కానుకచేసాడు.

'నేను పెద్దయ్యాక ఉద్యోగంలో చేరాక ప్రతి పండక్కీ మా పేరెంట్స్‌కి కొత్త వస్త్రాలు పెట్టాలనుకునేవాణ్ణి. కాని నాకింకా ఉద్యోగం రాకముందే మా నాన్న ఈ లోకం నుంచి సెలవుతీసుకున్నాడు. నాకు ఆ అదృష్టం లేకపోయింది. ఈ రోజు మీ రూపంలో వాళ్లకి ఈ నూతనవస్త్రాలు సమర్పిస్తున్నాను' అని అన్నాడు. ఆయన కళ్లల్లో పలచని నీటిపొర.

పండగ పేరు చెప్పి వారం రోజులు మేం ఫీల్డుకి పోలేకపోయాం. కాని రాజు ప్రతి రోజూ మమ్మల్ని సాయంకాలాలు ఎక్కడో ఒకచోటికి తీసుకుపోతుండేవాడు. ఒకరోజు వాళ్ల చెరకుతోటకి తీసుకువెళ్ళాడు. అక్కడ మొదటిసారిగా ఒక చెరకుగానుగ చూసాను. బెల్లం వండటం కూడా చూసాను. పెద్ద పాత్రలో చెరకుపోసం పోసి కలయదిప్పుతూ ఉంటే అది మరిగి మరిగి బెల్లంగా గడ్డకడుతూ ఉంది. ఆ బెల్లంపాకం పక్కన గుట్టలుగా పోసిన చెరకుపిప్పి. ఆ పిప్పినే మళ్లా పొయ్యిలో మంటపెట్టడానికి వాడుతున్నారు. మరొక పక్క ఈతాకుల చాప మీద అచ్చులు అచ్చులుగా పోసిన కొత్త బెల్లం. ఆ బెల్లం చుట్టూ, ఆ పిప్పిమీదా, ఆ బెల్లం వండుతున్న మనుషుల చేతులమీదా ఈగలు. ఆ ఈగలకి తీపి తప్ప మరొక రుచి తెలిసే అవకాశమే లేదు.

సాయంకాలాలు పొలాలమ్మట నడిచివెళ్ళేవాళ్ళం. వనలత అతణ్ణి ఏదో ఒకటి అడుగుతూ ఉండేది. కాని నా దృష్టి వాళ్ళ మాటల మీద ఉండేది కాదు. పంట కోసిన తర్వాత పొలాల్లో మిగిలిన పరిగె ఎవరో ఒకరు ఏరుకుంటూ ఉండేవారు. వాళ్ళు కూడా వెళ్ళిపోయాక రాలి పడ్డ గింజలకోసం గోరువంకలు వచ్చి వాలేవి. అవి వాలి ఎగిరిపోయిన తర్వాత కింద బొరియల్లోంచి ఎలకలు పైకి వచ్చి మిగిలిన కంకుల్ని నెర్రెల్లోంచి పాతాళం లోకి పట్టుకుపోయేవి. గంగిరెద్దులు ఆడించుకునేవాళ్ళు మొదలుకుని గోరువంకలదాకా సంక్రాంతి ప్రతి ఒక్కరికీ పెద్ద పండగే.

ఒకరోజు వనలత రాజుని సూటిగా అడిగేసింది.

'మీరెప్పుడు చూసినా ఇక్కడే కనిపిస్తున్నారు. మీ కాలేజి నడవట్లేదా? మీ చదువు సంగతేమిటి?' అని.

'అదొక పెద్ద చదువా? దానికేముంది? ఎలా రాసినా పాసైపోతాను' అన్నాడు. 'కాని ఎందుకో, ఇక్కణ్ణుంచి కాకినాడ వెళ్తానా, మర్నాడే మళ్ళా బస్సెక్కి ఇక్కడికి వచ్చెయ్యాలని ఉంటుంది. మా ఊరు నాతో పాటే వచ్చేస్తుంది. తెల్లవారినప్పణ్ణుంచీ, ఇక్కడుండొద్దు, వెళ్ళిపోదామంటుంది. ఏం చెయ్యను!' అన్నాడు.

'మీరు ఫైనలియరేమో కదా. ఫస్ట్ టూ యియర్స్ ఆవెరేజి ఎలా ఉంది?' అనడిగింది.

ఏదో చెప్పాడు టక్కున, ఎయిటీ అనో, ఎయిటీ టూ అనో. కానీ తర్వాత తర్వాత తెలిసింది, అతను ఆ మొదటి రెండేళ్ల పరీక్షలు కూడా రాయలేదని. మూడేళ్ళూ సింగిలు సిటింగులో రాద్దామని అనుకుంటున్నాడని. కానీ ఈ లోపు మా గాంగులో చేరాడు. ఎలా రాస్తాడో ఏమో అని అనుకున్నాను. చెప్పొద్దూ, జాలేసింది.

కానీ ఆ ఊరు అలాంటిది. అక్కణ్ణుంచి బయటి ప్రపంచంలోకి రావాలంటే మామూలు బలం చాలదు. భూమ్యాకర్షణ శక్తిని దాటి ఒక మనిషి తనంతతాను రోదసిలోకి ఎగరడం ఎంత కష్టమో, ఆ ఏరూ, ఆ కొండలూ, ఆ గాలీ, ఆ వెలుగూ మనమీద విసిరే వలనుంచి బయట పడటం కూడా అంతే కష్టం.

పండగ వెళ్ళిపోయాక మళ్లా మేము పనిలో పడ్డాక, ఒక సాయంకాలం వకుళకుటికి వెళ్లాను. ప్రొఫెసరు బాగా అలసిపోయి ఉన్నట్టున్నాడు, తన గదిలో విశ్రాంతి తీసుకుంటూ ఉన్నాడు. నేనూ, వనలత ఆ కుటీరం పక్కన మామిడిచెట్ల కింద కూచున్నాం. గాలినిండా మామిడిపూత.

మాటల మధ్యలో వనలత లోపలకి వెళ్ళింది. అంతలో, పోస్టుమాను రాజబాబు ఒక కవరు తీసుకొచ్చి నా చేతుల్లో పెట్టాడు. పసుపుపచ్చ కవర్. దాని మీదా 'మిస్ బనలతా సేన్‌గుప్త' అని పొందిగ్గా రాసిన అక్షరాలు. ఎవరో చాలా శ్రద్ధగా చదువుకునే స్కాలరు చేతిరాతలాగా ఉంది.

వనలత మళ్లా నా దగ్గరకు రాగానే ఆ కవరు ఆమె చేతుల్లో పెట్టాను. ఆమె 'ఏమిటిది?' అని అడుగుతూ దాన్ని చూస్తూనే ఉలిక్కిపడింది. ఆ కవర్ని చేతుల్తో రెండు వేపులా ఆప్యాయంగా తడిమింది. అంతలో ఆమె ప్రమేయం లేకుండానే కన్నీళ్ళు బొటబొటా కారడం మొదలుపెట్టాయి. మరుక్షణంలో వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టింది.

నాకు ఏమీ అర్థం కాలేదు. కంగారుగా అనిపించింది. ఏమై ఉంటుంది? ఎవరు రాసి ఉంటారు ఆ ఉత్తరం? అందులో ఏముందో కూడా చూడకుండానే, చదవకుండానే ఎందుకలా ఏడుస్తోంది? ఎప్పుడూ లేడిపిల్లలాగా చెంగుచెంగున గెంతులేసే ఆ బిడ్డ ఎందుకలా ఏడుస్తోంది?

కాని నేను ఆమెనేమీ అడగలేదు. మౌనంగా కూర్చుండిపోయాను. ప్రొఫెసరు బయటికొస్తే ఆమెని అలా చూస్తే ఏమనుకుంటాడో అని ఆత్రుత కూడా కలిగింది. కొంతసేపటికి వనలత తేరుకుంది.

'ఐ యామ్ సారీ' అంది, కళ్ళు తుడుచుకుంటూ.

'ఆ ఉత్తరంలో ఏముందో చూడకుండానే ఎందుకు మీకంత కష్టం కలిగింది?' అనడిగాను.

'ఆ లెటర్ లోనా? ఏముంటుంది? ఏమీ ఉండదు. బహుశా న్యూ యియర్ గ్రీటింగ్స్ తప్ప మరేమీ ఉండకపోవచ్చు' అంది.

ఈసారి మరింత ఆశ్చర్యపోయాను. వట్టి న్యూయియరు గ్రీటింగ్సుకే పట్టరానంత దుఃఖం ఎలా పొంగిపొర్లుతుంది? ఆమెని అటువంటి స్థితిలో అప్పటిదాకా ఎప్పుడూ చూడలేదు.

ఆమెని అడగడం కూడా సమంజసం కాదు అని ఊరుకున్నాను. రెండుమూడు నిమిషాలట్లా గడిచాయి. చిరుగాలి వీచినప్పుడల్లా మామీద కూడా మామిడిపూత రాలుతున్నది. అప్పుడప్పుడే ఆకుపచ్చని చుక్కల్లాగా తలెత్తుతున్న పిందెల్ని రామచిలుకలు కొరికిపడేస్తున్నాయి.

అప్పుడు వనలత నెమ్మదిగా, మెల్లగా 'ద గ్రీటింగ్స్ ఆర్ ఫ్రమ్ హిమ్' అంది.

డాక్టర్ నిహార్ రంజన్ రే వనలతకి సీనియర్ కొలీగు. అతనూ, వనలతా, ప్రొఫెసరు సేన్‌గుప్తా ఒక బృందం. చాలా తెలివైన విద్యార్థి. ఇప్పుడు యూనివెర్సిటీలో అసిస్టంటు ప్రొఫెసరుగా పనిచేస్తున్నాడు. అతనికి ముప్పై అయిదేళ్ళుంటాయి. పెళ్ళయింది, పిల్లల్లేరు. ఏ కారణం చాతనో భార్యాభర్తా విడాకులు తీసుకోవాలని అనుకుంటూ ఉన్నారు.

'ఇంకా ఆ ప్రపోజల్ మెటీరియలైజ్ కాలేదు. బెంగాలీ భద్రలోక్‌లో డైవోర్స్ తీసుకోవడం చిన్న విషయం కాదు.'

అతనూ, వనలతా ఒకరినొకరు ప్రేమించుకుంటున్నారు. ఆ డైవోర్సు విషయం ఒక కొలిక్కి వస్తే వనలత పెళ్ళి ముందుకు నడుస్తుంది.

'ప్రొఫెసరుకి తెలుసా?' అనడిగాను.

'కాకూకి తెలుసో లేదో నాకు తెలియదు. ఎప్పుడూ మాటమాత్రంగా కూడా అడగలేదు, అనుమానించలేదు. కాని తెలిస్తే మాత్రం అడ్డుచెప్పడు. వాళ్ళన్నకి సేన్‌గుప్త ఎంత చెప్తే అంత. ఆయన్ని ప్రొఫెసరు ఒప్పించగలడు అని నా నమ్మకం. కానీ, సమస్యల్లా మా

మమ్మీతో. ఆమె ఒప్పుకోదు సరికదా, గందరగోళం సృష్టించగలదు' అని అంది. అందుకనే మధురిమ కథ వినగానే నాకు వెంటనే వనలత గుర్తొచ్చింది.

'మరి వాళ్ళింట్లో సంగతేమిటి? అతని వైపు కూడా ఆలోచించాలి కదా. మరి మీరు వివరంగా మాట్లాడుకున్నారా?' అనడిగాను.

'ఏమిటి మాట్లాడుకోవడం? నేనిప్పటిదాకా అతణ్ణి ప్రేమిస్తున్నట్టే అతనికి చెప్పలేదు' అంది వనలత.

మరింత ఆశ్చర్యపోయాను.

'మరి అతను చెప్పాడా?'

'ఐ లవ్ యు అనా? లేదు. ఇప్పటిదాకా అతని నోటమ్మట ఆ మూడు మాటలు విననేలేదు' అంది

'ఒకరికొకరు చెప్పుకోకుండానే ఒకరినొకరు ప్రేమించుకున్నామని ఎలా అనుకుంటున్నారు?' అని అడిగాను.

'ప్రేమ ఎక్స్‌ప్రెస్ చేసేది కాదు విమ్మీ, ఫీలయ్యేది' అంది వనలత.

నాకేమనాలో తోచలేదు.

'కాని ఫీలింగ్స్ ఎన్నో రకాలుగా ఉంటాయేమో కదా. అది ప్రేమే అని మీకెలా తెలుసు?' అన్నాను మళ్ళా, ఏమిటో నా ప్రశ్నలు, నాకే చిరాకుపుట్టిస్తున్నాయి.

'తప్పకుండా తెలుస్తుంది. ఫర్ ష్యూర్, ప్రేమ ఈజ్ ఎ యునీక్ ఫీలింగ్' అంది వనలత, చిరునవ్వుతో.

వాన వెలిసిన తరువాత వెలుగులాగా కన్నీళ్ళకు తడిసిన ఆ చెంపలమీద ఆ చిరునవ్వు తళుక్కుమంది.

❋

12

మాఘమాసం మొదలవుతూనే కొండగాలి నన్ను తాకింది. మరీ అంత వెచ్చగానూ, మరీ అంత చల్లగానూ లేని ఆ నునువెచ్చని తెమ్మెర లాంటిది నన్ను అంతకుముందు తాకింది లేదు, ఆ తర్వాత ఇప్పటిదాకా కూడా అటువంటి స్పర్శ నేను తిరిగి పొందింది లేదు.

నేను ఆ ఊళ్ళో అడుగుపెట్టినప్పుడు అప్పుడే మహావర్షాలు ముగిసిపోయిన రోజులు. చిక్కటి, దట్టమైన అడవి. శరత్కాలంలో మొదటిసారి అడవిలో అడుగుపెట్టినప్పుడు ఇంకా చిత్తడి. అడవి అంతా గీపెట్టే చిమ్మెటల చప్పుడు. సూర్యకాంతిని జల్లెడపట్టడానికి కూడా చోటులేనంత దట్టంగా అల్లుకున్న శాఖోపశాఖలు. ఆకుపచ్చ, ముదురాకుపచ్చ, నీలం ఆకుపచ్చ, ముదురునీలం, లేతనీలం, పచ్చటినీలం– ఒక చిత్రకారుడన్నట్టుగా ఎన్ని రంగులు కలిపినా ఆ ఆకుపచ్చల్ని నువ్వు కాగితం మీదకు తేలేవు.

కానీ చూస్తూండగానే, మేము రోజూ అడవికి వెళ్ళి వస్తూండగానే, మాలో మేము మాట్లాడుకుంటూ ఉండగానే, ఆ ఆకులు పండి మా కళ్ళముందే గాల్లో వరదలాగా ప్రవహించి పోయేయి. హటాత్తుగా ఒక మాఘమాస ప్రభాతాన ఆ అడవిలో నిలబడగానే బూడిదరంగు, ఇటుక రంగు, ముదురు పసుపు, రాగి పసుపు, నీలమూ, రాగీ కలగలిసిన కిలుం రంగు, తుప్పురంగు కళ్ళముందు ప్రత్యక్షమయ్యాయి.

సృష్టి చిత్రకారుడి పెట్టెలో అన్ని మట్టిరంగులు, అన్ని బూడిదరంగులు, అంత రాగి, అంత అభ్రకం, అంత గిరిజం, అంత మంజిష్టవర్ణం, ఆంత కాకిబంగారం ఉండగలవని మనం ఊహించలేం.

ఆకుల్ని పూర్తిగా ఊడ్చేసిన కొమ్మలమధ్యనుంచి ఎవరో ఊళ పెడుతున్నట్టు బోలుగా వీచే గాలి, ఎవరో ఒక పచ్చని లతని ఇంద్రజాలంచేసి పండుగడ్డిగా మార్చినట్టు తేమలేని అడవి. డ్రై డెసిడ్యువసు ఫారెస్టు అంటే బొమ్మ గీసి మరీ వివరించినట్టుగా ఉంది అడవి.

శిశిరం అంటే మంచు అని విన్నాను. కాని టెంపరేటు, పోలారు జోన్లలో శీతాకాలమంటే అహర్నిశలు మంచు కురుస్తుండే దృశ్యాల్ని ఊహించవచ్చుగాని మనలాంటి ఉష్ణమండల అరణ్యాల్లో శిశిర ఋతువు అంటే చెట్లు బూడిదరంగులోకి మారిపోడమే అని అర్థం చేసుకున్నాను. ఎక్కడ కొండ అంచు అడవిగా మారిపోతున్నదో గుర్తుపట్టలేనట్టుగా చెట్లు బండల్లాగా, బండలు పొదల్లాగా కనిపించే కాలం. అంతదాకా పచ్చగా కలకల్లాడిన ఆ పత్రహరితం ఏమైపోయింది? ఆ చిగుళ్ళు ఎక్కడికి వెళ్ళిపోయాయి? ఆ మొగ్గలు, ఆ పూలు ఏ తలుపుల వెనక దాక్కున్నాయి?

కాని మాఘమాసపు అడవిలో నడవడంలో కొత్త అందం అనుభవంలోకి వచ్చింది నాకు. అంతకుముందు సూర్యరశ్మి చల్లని నీడగా మాత్రమే తెలిసేది. హేమంతకాలమంతటా అడవిపూల వాసన ఘాటుగా చుట్టుముట్టేది. ఇప్పుడు పత్రహీన శాఖా, ప్రశాఖలమధ్యనుంచి నునువెచ్చని సూర్యకాంతి నీ మీద పడుతుంటే అదొక జలపాతపు నులివెచ్చని తుంపరలో నిలువెల్లా స్నానం చేసినట్టు ఉండేది. సాయంకాలం ఆ చెట్లమధ్యనుంచి ఏటవాలుగా సంధ్యకాంతి ప్రసరిస్తున్నప్పుడు పొడుగ్గా పరుచుకునే ఊదారంగు నీడలు పలచటి నీటిపాయల్లాగా కనిపించేవి.

అలాంటి మాఘమాసపు అడవిలో ఒక రోజు నేనొక విచిత్రమైన అనుభవానికి లోనయ్యాను. అప్పటిదాకా పెద్ద పెద్ద వృక్షజాతుల్నీ, లతల్నీ గుర్తిస్తూ వచ్చిన నాకు ప్రొఫెసరు చిన్న చిన్న పొదల్నీ, మూలికల్నీ, మోసెస్ లాంటి నాచు, పాచిమొక్కల్నీ, ఫెర్ను లాంటి గడ్డిజాతుల్నీ గుర్తించమని చెప్పాడు. ఆ మొక్కల్ని వరసగా గుర్తుపడుతూ ఉండటంలో చాలాసేపే పట్టేది. ఈలోపు తక్కిన బృందం ముందుకు వెళ్ళిపోతూ ఉండేవారు. చెల్లన్నదొరనో లేకపోతే దారి చూపించడానికి నియమించుకున్నవాళ్ళల్లో ఎవరో ఒకరు నాకు తోడుగా ఉండేవారు. నా పని పూర్తయ్యేక వాళ్ళు నన్ను తక్కిన బృందం దగ్గరికి చేర్చేవారు.

అవాళ పొద్దున్నే పని మొదలుపెట్టినప్పుడు అంతా కలిసే ఉన్నాం. కాని ప్రొఫెసరు మార్కు చేసిన గ్రిడ్డులో ఆయన సాంపిళ్ళు సేకరించిన బండల పక్కనున్న పొదల్నీ, గడ్డినీ, మూలికల్నీ గుర్తుపడుతూ నాకు తెలీకుండానే నేను మరో కొండ ఎక్కి తక్కినవాళ్ళకి దూరంగా జరిగిపోయాను. అలా ఎంతసేపు గడిచిందో తెలీదుగాని, మధ్యలో ఒకసారి లేచి పక్కన

చూస్తే ఎవరూ కనబడలేదు. చుట్టుపక్కల కూడా ఏ అలికిడీ లేదు. గట్టిగా 'చెల్లన్నదొరా, చెల్లన్నదొరా' అని అరిచాను గాని జవాబు లేదు. 'వనలతా, వనలతా' అని గట్టిగా కేకలు పెట్టాను గాని నా పిలుపులు వెనుదిరిగి మళ్ళా నాకే తగుల్తున్నాయి. ఒక్కసారిగా కాళ్ళల్లో నిస్సత్తువ వచ్చేసింది. చెప్పలేని భయం ఆవహించింది. చుట్టూ ఊళ పెడుతున్న అడవి. ఎండిపోయిన తరుకాండాల మధ్యనుంచి బొరోమంటూ వీస్తున్న గాలి. ఉన్నట్టుండి ఏ చప్పుడూ లేకుండా గాలి కూడా వీచనంతగా స్తబ్ధమైపోయిన అడవి. ఇంతలో ఎక్కణ్ణుంచో ఒక వడ్రంగిపిట్ట చెట్టు బెరడుని చెక్కుతున్న చప్పుడు వినిపించింది. అలా ఎంతసేపు నించున్నాను, అరగంటసేపా, గంటసేపా తెలీదు. అప్పుడు నన్ను ఆవహించిన భయం క్రూరమృగాల భయమా, లేక నిర్జనస్థలంలో ఒక్కత్తినీ ఉండిపోయానన్న భయమా లేక అక్కడే జీవితకాలం పాటు ఉండిపోతానేమోనన్న భయమా? ఆ భయానికి రూపం లేదు, కారణం లేదు. అత్యంత ఆదిమభయం, నాకెన్నడూ అనుభవంలోకి రాని ఒక అపరిచిత ప్రకంపన.

ఒంట్లో జవసత్త్వాలు ఎవరో లాగేసినట్టుగా అలాగే ఒక చెట్టువార కూచుండిపోయాను. నోరు తడారిపోయి గొంతుక ఎండిపోతూ ఉంది. నా బాక్‌పాక్‌లో వాటరుబాటిలు ఉందన్న విషయం కూడా గుర్తులేదు. ఇంతలో నన్ను వెతుక్కుంటూ ప్రొఫెసరు, వనలత, దేవయ్య, రాంబాబూ, పనివాళ్ళూ మొత్తమంతా అక్కడికి చేరుకున్నారు.

ప్రొఫెసరు ఆ రోజుకి తక్కిన పని కాన్సిలు చేసేసాడు. ఇంటికి వచ్చేసాం. అక్కడే లంచి చేసి రెస్టు తీసుకోమన్నాడు. సాయంకాలం టీ తాగేవేళకి నేను తేరుకున్నాను. చెట్ల కింద కూచున్నాం. వకుళకుటి పక్కన చింతచెట్లమీద చింతకాయలు గుత్తులుగుత్తులుగా పండి వేలాడుతున్నాయి. కిందరాలిన చింతబొట్టల్ని ఉడతలు కొరికి తింటున్నాయి.

'నువ్వు బాగా భయపడ్డట్టున్నావు' అంది వనలత.

అప్పుడు గుర్తొచ్చింది నాకు. గాంధారి పాప గురించి. నేను అడవిలో తిరుగుతున్నప్పుడు ఒకసారి చెల్లన్నదొర చెప్పాడు, దూరంగా ఒక కొండ చూపించి, ఆ కొండ మీద గాంధారి పాప ఉంటుందనీ, అక్కడికి ఎవరూ వెళ్లరనీ. గాంధారి పాప అనే పేరే విచిత్రంగా అనిపించింది. ఎవరామె? అక్కడ ఎందుకుంటుంది అని అతణ్ణి అడిగిందిగాని, అతనికి అంతకుమించి ఏమీ తెలీదు. గిరిజనులకు అదొక సరిహద్దు. నిషిద్ధస్థలం. తమ ఊరు, అడవీ ముగిసిపోయే ఒక పెరిఫరీ. ఆ తర్వాత ఉన్నదంతా వాళ్ళకి చొరరాని చోటు, నడవరాని డొంక, చూడరాని పుంత.

'గాంధారిపాప గుర్తొచ్చింది. నేనెక్కిన కొండ గాంధారిపాప కొండనే ఏమో అనుకున్నాను. అందుకే భయం వేసింది. అక్కడే అదృశ్యమైపోతానేమో అనిపించింది. బహుశా నేను కూడా ఒక బండగానో, ఎండుకొమ్మగానో మారిపోతానేమో అని కూడా భయపడ్డట్టున్నాను' అన్నాను. గాంధారి పాప అంటే అంతకుముందు నేను విన్నది కూడా వాళ్ళకి చెప్పాను.

నేను చెప్తున్నంతసేపూ ప్రొఫెసరు తలవాల్చుకుని నిశ్శబ్దంగా విన్నాడు. టీ వచ్చింది. టీ ఒక గుక్క రుచి చూసి, అప్పుడు నాతో

'విమలా, ఈ రోజునుంచీ నువ్వు కూడా కొండరెడ్లలో ఒక మెంబరుగా మారిపోయేవు. యు ఆర్ రియల్లీ ఫార్చునేట్' అని అన్నాడు.

నాకు అర్థం కాలేదు.

'వాట్ ఐ మీన్– టుడే యు ఆర్ యాబుల్ టు షేర్ దైర్ మిత్. ఒక మనిషి తన తోటి మానవసమాజంతో కలిసి భోంచేస్తేనో, కలిసి కాలక్షేపం చేస్తేనో, వాళ్ళల్లో ఒకడు కాడు. వాళ్ళ మిత్స్‌ని పంచుకున్నప్పుడు, పంచుకోడం కూడా కాదు, వెన్ వన్ కెన్ ట్రూలీ లివ్ థైర్ మిత్స్, యాజ్ వన్ అమాంగ్ దెమ్– అప్పుడు మాత్రమే, అతడు వాళ్లల్లో నిజంగా ఒకడైనట్టు. ఇవాళ నీకు కలిగిన ఎక్స్ పీరియెన్స్ అదే. ఈ రోజు నువ్వు అనుభవించావే, ఆ ఏకాకితనం, ఆ భయం, ఆ నిస్సహాయత్వం– ఆ ట్రైబ్ లో ఎవరో మొదటిసారి అనుభవించి ఆ భయానికి గాంధారిపాప అని పేరుపెట్టాడు. ఆ రోజునుంచీ ఎవర్నీ అక్కడికి వెళ్ళొద్దని గీత గీసాడు. ఎందుకంటే అక్కడికి వెళ్తే ఎటువంటి భయం కలుగుతుందో అతడు అనుభవించి ఉంటాడు. దట్ ఫీలింగ్ ఆఫ్ అబాండన్‌మెంట్, అది మరెవరికీ రాకూడదనే అతడా టాబూ ఫిక్స్ చేసాడు. నువ్వు నీకు తెలియకుండానే ఈ రోజు ఆ టాబూ వయొలేట్ చేసావు. నువ్వొకవేళ వాళ్ళల్లో ఇప్పటికే ఒక మెంబరువి అయి ఉంటే ఈ వయొలేషన్ వల్ల నిన్ను బహిష్కరించి ఉండేవారు. కానీ నువ్వు ఒక ఔట్‌సైడర్‌గా ఈ ఎక్స్‌పీరియెన్స్‌కి లోనయ్యావు కాబట్టి ఈ రోజు నువ్వు ఆ సమాజంలో ఒక మెంబరువి కాగలిగే అర్హత సంపాదించుకున్నావు' అన్నాడు.

'ప్రొఫెసర్! మీరు ఆంత్రొపాలజీ కూడా చదువుకున్నారా?'అని అడిగాను. ఆయన మాటలు నాకు ఒక పట్టాన అర్థం కాలేదు.

'యు నో విమలా' ప్రొఫెసరు టీ కప్పు పక్కన పెట్టేసాడు. అరుగుమీద గోడకి జారగిలి కూచున్నాడు. నేను ఆయన ఎదురుగా కూచున్నాను.

ప్రొఫెసరు చెప్పడం మొదలుపెట్టాడు.

'యాంత్రొపాలజీ, బయాలజీ, జియాలజీ– ఈ పేర్లు పుట్టి మహా అయితే రెండు వందల ఏళ్ళు మించి ఉండదు. కాని నేను చెప్తున్నది లక్షల సంవత్సరాల మానవ అనుభవం గురించి. కోట్ల సంవత్సరాల ఇవొల్యూషన్ గురించి. డ్రిఫ్ట్, నాచురల్ సెలెక్షన్ ద్వారా మనం పూర్తిగా ఎక్స్‌ప్లెయిన్ చేయలేకపోతున్న హూమన్ ఇంటలిజెన్స్ గురించి'.

'నైంటీన్త్ సెంచరీలో డార్విన్ ఇవొల్యూషన్ గురించీ, నాచురల్ సెలక్షన్ గురించీ మాట్లాడుతున్నప్పుడు వాలేస్ అనే బయాలజిస్టు ఒక ప్రశ్న వేసాడు. 'అసలు మానవుడి బ్రెయిన్ ఎలా ఏర్పడింది?' అని. ఎందుకంటే అటువంటి బ్రెయిన్ ఇంతదాకా మనకు తెలిసిన ఏ స్పీషిస్ లోనూ, చివరికి తక్కిన మానవజాతులు అని చెప్పదగ్గ మరే హొమినిన్స్ లోనూ కూడా లేదు. నీకు తెలుసు కదా, తొలి మానవుడు ఇప్పటికి పాతిక లక్షల సంవత్సరాల కింద ప్రభవించాడనుకుంటే ఐస్ ఏజ్ లో తక్కిన అన్ని మానవజాతులూ అంతరించిపోయి చివరికి మన జాతి అంటే హొమోసేపియన్స్ మాత్రమే మిగిలారు. ఈస్ట్ ఆఫ్రికాలో , యురేషియాలో, ఆసియాలో, సౌత్‌ఈస్ట్ ఏసియాలో, సైబీరియాలో సంచరించిన హొమినిన్స్– అందరూ హిమయుగానికి తట్టుకోలేక అదృశ్యమైపోయారు. ఆ భయంకరమైన ప్రళయంలో బతికి బట్టకట్టింది, మన పూర్వీకులు, అంటే హొమోసేపియన్స్ మాత్రమే. ఈ సంగతి నీకు కూడా తెలుసు.'

ప్రొఫెసరు తన కాళ్ళు మళ్ళా దగ్గరగా లాక్కున్నాడు. తన వెనక ఉన్న పిల్లో చేతుల్లోకి తీసుకుని దాన్ని రెండుచేతుల్తోనూ దగ్గరగా లాక్కుని వళ్ళోపెట్టుకున్నాడు.

'హొమోసేపియన్స్– అంటే వైజ్ హూమన్స్– వాళ్ళు వైజ్ ఎలా అయ్యారు? ఎందుకయ్యారు? అదే వాలేస్ అడిగిన ప్రశ్న. నాచురల్ సెలెక్షన్ ప్రకారం ఒక స్పీషిస్ స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్‌లో గెలవడానికి దానికి తన నియరెస్ట్ రైవల్ కన్నా కొద్ది పాటి రిలేటివ్ సుపీరియారిటీ ఉంటే చాలు. కాని మనిషికి ఏప్ కన్నా ఎన్నో వేల రెట్లు ఈ అధిక సామర్థ్యం ఎలా వచ్చింది? ఎందుకు వచ్చింది? అఫ్ కోర్స్. వాలేస్ ఆ ప్రశ్న అడగడం వెనక, మనిషి వెనక ఒక భగవత్సంకల్పం ఉందని చెప్పడం ప్రధాన ఉద్దేశ్యం అనుకో. అలాగని అతను థీరీ ఆఫ్ ఇవొల్యూషన్‌ని తక్కువ చేయలేదు. కాని సైన్స్ అంటే ముందు ప్రశ్నించాలి కదా. అతను చేసిన పని అదే. 1870 లో ఒక సైంటిస్టు అడిగిన ఈ ప్రశ్నకి ఇప్పటిదాకా కూడా సరైన జవాబు రాలేదు. మరో సంగతి తెలుసా? హొమో సేపియన్స్ సాధించిన ఈ అపారమైన జ్ఞానం జియొలాజికల్ టైమ్‌లో చూస్తే ఒక్కక్షణంలో సాధించినట్టు.

మనిషి బ్రెయిన్ సాధించిన ఈ డెవలప్‌మెంట్ క్వాలిటీలోనే కాదు, టెంపోలో కూడా ఇట్ హేజ్ బీన్ ఎ మాటర్ ఆఫ్ గ్రేట్ వండర్. ఎలా? ఎలా సాధ్యమయింది ఇది?'

'తక్కిన జాతులకు లేనిదీ, మనిషికి మాత్రమే యునీక్ అని చెప్పదగ్గ లక్షణాలు కొన్ని ఉన్నాయి. మొదటిది, మనిషి బ్రెయిన్ సైజ్. అది అతను పుట్టినప్పటి సైజ్ కన్నా మొదటి ఏడాదే మూడింతలు పెరుగుతుంది. అలాకాక పుట్టినప్పుడే అంత సైజ్ ఉందనుకుందాం, అప్పుడతను పుట్టడమే అసాధ్యం. ఎందుకంటే ఏ తల్లీ కూడా అంత పెద్దతలకాయని ప్రసవించడం సాధ్యం కాదు. ఆ బ్రెయిన్ పెరగడానికీ, వివిధ రకాల స్పందనల్నీ, ప్రతిస్పందనల్నీ అర్థం చేసుకోడానికీ, గుర్తుపెట్టుకోడానికీ, తన మనుగడకు వాటిని ఎలా ఉపయోగించాలో తెలుసుకోడానికీ, మనిషికి చాలా సుదీర్ఘమైన చైల్డ్‌హుడ్ అవసరమవుతోంది. చేపలు, పక్షులు, మొక్కలు, రెప్టైల్స్, తక్కిన మామల్స్– మరే జాతిలోనూ ఇంత సుదీర్ఘశైశవం లేదు.'

'ఇక అన్నిటికన్నా ముఖ్యమైంది, ఆ బిడ్డ పెరగడానికీ, నిలదొక్కుకోడానికీ, తనంత తానుగా జీవిక కొనసాగించడానికీ ఒక కుటుంబ రక్షణ. ఇంత స్ట్రాంగ్ ఫామిలీ బాండ్స్– మనకి మరే జీవిలోనూ కనిపించవు.'

ప్రొఫెసర్ ఒక క్షణం ఆగాడు. మళ్లా చెప్పడం మొదలుపెట్టాడు.

'కాని ఈ లక్షణాలు దాదాపుగా నియాండర్ తల్ మానవుల్లో కూడా కనిపిస్తున్నాయి. బ్రెయిన్ సైజ్ గురించి చెప్పాలంటే సేపియన్స్ కన్నా నియాండర్‌తల్ మనిషి బ్రెయిన్ సైజు మరింత పెద్దది. కాని మానవపరిణామంలో ఇప్పటికి నలభైవేల ఏళ్ల కిందటనే వాళ్ళు అదృశ్యమైపోయారు. సేపియన్స్ మాత్రమే ప్లీస్టోసీన్ మహాయుగం దాటి, ఇప్పటికి పది, పదకొండు వేల ఏళ్ళ కిందట హోలోసీన్ లోకి అడుగుపెట్టారు? ఎందుకు? వాటీజ్ దట్ యునీక్ ఫీచర్ ఆఫ్ ద సేపియన్స్?'

'చాలా జవాబులు చెప్పారు. చెప్తూనే ఉన్నారు. పాలియాంటాలజిస్టులు ఒక పుర్రెనో, ఎముకనో, కొత్త ఫాజిల్‌నో కనుక్కున్న ప్రతి సారీ, కొత్త జవాబులు పుట్టుకొస్తూనే ఉన్నాయి. కానీ దాదాపుగా అందరూ అంగీకరిస్తున్న ఒక జవాబైతే ఉంది–'

అని ఆగి ఇంకొంచెం టీ కావాలన్నాడు. నేను వెళ్ళి టీ కలిపి తీసుకొచ్చాను. అంతసేపూ ప్రొఫెసరు మౌనంగానే ఉన్నాడు.

టీ అందుకున్నాక మళ్ళా ఒక గుక్క సిప్ చేసి కొనసాగించాడు.

'సేపియన్స్ ప్రత్యేకత, వాళ్ళ యునీక్ సామర్థ్యం వాళ్ళ భాష. భాష అంటే ఏదో ఒక భాష కాదు. దైర్ కెపాసిటీ టు కమ్యూనికేట్, ఆర్టిక్యులేట్, కెపాసిటీ టు కాన్సెప్చ్యువలైజ్– ఒక్క మాటలో చెప్పాలంటే, దైర్ సింబాలిక్ కమ్యూనికేషన్.'

'ఐస్ యేజ్ ముగిసిపోడంతోటే గొప్ప జాతులు అంతరించిపోయాయి. మహామృగాలు, మామత్స్, బైసన్స్ లాంటివన్నీ అదృశ్యమైపోయాయి. భూమ్మీద బ్రూట్ యానిమల్ డామినన్స్ ముగిసిపోయింది. కొంతమంది మూడు లక్షల సంవత్సరాల లెక్క చెప్తారుగాని, అంతకన్నా కూడా తక్కువ వ్యవధిలోనే లక్ష సంవత్సరాల కాలంలోనే మనిషి మనం ఊహించని ఈ అద్వితీయ సామర్థ్యాలు కైవసం చేసుకున్నాడు. ఎలా అంటే? చెప్పాను కదా, తన కమ్యూనికేషన్ సామర్థ్యం వల్ల.'

'ఒక జంతువు తక్కిన జంతువుల్తో ఎఫెక్టివ్‌గా కమ్యూనికేట్ చెయ్యాలంటే ఆ మంద మరీ పెద్దదిగా ఉండకూడదు. ముప్పై, నలభై, లేదా మాగ్జిమమ్, నూట యాభై. కానీ, కొన్ని లక్షలమందితో కమ్యూనికేట్ చెయ్యగల సామర్థ్యం సేపియన్స్ సాధించారు. లక్షలమందితో కమ్యూనికేట్ చెయ్యడమే కాదు, ఆ హెర్డ్ ఇంటెగ్రిటీ చెక్కుచెదరకుండా చూసుకోగల యునీక్ కెపాసిటీ– ఇక్కడే నియాండర్‌తల్ మానవుడు సేపియన్స్ ముందు ఓడిపోయాడు.'

'ఈ యునీక్ కేపబులిటీ సేపియన్స్ దేని ద్వారా సాధించారో తెలుసా? ఈ సృష్టిలో తక్కిన ప్రాణులు చూసినదాన్ని తమ తోటి ప్రాణులకు కమ్యూనికేట్ చెయ్యగలవు. కోతులైతే అబద్ధాలు కూడా ఆడగలవు. కానీ ఆ అబద్ధాలు కనిపించేవాటి గురించి మాత్రమే చెప్పగలవు. ఫర్ ఎగ్జాంపుల్, అదిగో పులి, పరుగెత్తు అని ఒక కోతి మరో కోతితో అబద్ధం చెప్పగలదు. కాని అలా చెప్పడానికి సృష్టిలో ఏది కనిపిస్తుందో దాన్ని మాత్రమే గుర్తుచేస్తూ చెప్పగలదు. లేనిదాన్ని ఊహించి తన తోటి ప్రాణితో కమ్యూనికేట్ చెయ్యగల సామర్థ్యం దానికి లేదు. మరే ప్రాణికీ లేదు, ఒక్క మనిషికి తప్ప.'

ఇప్పుడు ప్రొఫెసరు స్వరంలో మరింత స్పష్టత వచ్చింది. ఒక మనిషి తాను సాధించుకున్న స్పష్టతను మరొక మనిషికి అందించడంలో అనుభూతిచెందే తేటదనం అతని కంఠస్వరంలో వినిపిస్తూ ఉంది.

'సో, విమలా, ద మాటర్ ఈజ్ వెరీ సింపుల్. మనిషి మాత్రమే ఒక మైథాలజీ సృష్టించుకోగలడు. ఎందుకంటే, ఆ మైథాలజీ వల్ల, ఆ ఇమేజినేషన్ వల్ల, ఆ సింబల్స్ వల్ల అతను కొన్ని లక్షలమందిని ఒక జాతిగా, ఒక స్ట్రాంగ్లీ బాండెడ్ హ్యూమన్ గ్రూప్‌గా

మార్చగలడు. ఆ గ్రూపులో ఉండే లక్షలాది మంది మెంబర్సులో ఒకరికొకరు ఏ మాత్రం తెలియకపోయినా సరే– ఎందుకంటే వాళ్ళని కలిపేది, ఆ సింబల్స్, ఆ మైథాలజీ– అందుకని ప్రైమరిలీ, మాన్ ఈజ్ నాట్ ఓన్లీ ఏ సోషల్ యానిమల్ బట్ ఆల్సో ఏ మిత్ మేకింగ్ యానిమల్. ఏ స్టోరీ టెల్లింగ్ యానిమల్.'

'గాడ్, ట్రూత్, బ్యూటీ, జస్టిస్, గుడ్ నెస్– ఇవన్నీ అగోచరాలు. ఇంటేంజిబుల్ ఎంటిటీస్. కాని వీటికోసం మనిషి ప్రాణాలిచ్చెయ్యగలడు. నియాండర్‌తల్ మానవుడు కూడా అగోచరాల్ని కొంతవరకు ఊహించగలిగాడు గానీ, కొన్ని లక్షలమందికి చేరగల కాన్సెప్ట్‌ని అతను సృష్టించలేకపోయాడు. అది సేపియన్స్‌కి, అంటే మనకి మాత్రమే సాధ్యమయ్యింది.'

'దేవతలు, రాక్షసులు ఒకప్పటి సింబల్స్. మోడరన్ నేషన్ స్టేట్, కార్పొరేట్ బాడీస్, కరెన్సీ, ట్రేడ్ ఎగ్రిమెంట్స్, లీగల్ ఎంటిటీస్, హూమన్ రైట్స్– ఇలాంటివన్నీ ఇప్పటి సింబల్స్. మాన్ ఈజ్ ఎ సింబల్ క్రియేటింగ్ యానిమల్. నిరంతరాయంగా ప్రతీకల్ని సృష్టిస్తూనే ఉంటాడు. తాను సృష్టిస్తున్న ప్రతీకల్తో ఎంతమందితో కనెక్ట్ కాగలడన్నదే–అదే అతని నిరంతర అన్వేషణ.'

'నేనేమనుకుంటానంటే, షేరింగ్ ద ఇంటాంజిబుల్ కాన్సెప్ట్– ఇదే మనిషి జీవితానికొక మీనింగ్ సమకూరుస్తుంది. నువ్వు షేర్ చేసే సింబల్స్ బేసిక్ ఇన్‌స్టింక్ట్‌ని మాత్రమే మేల్కొల్పగలిగాయనుకో, అప్పుడు నువ్వు జెండాల దగ్గరే ఆగిపోతావు. నా దృష్టిలో అది లోయెస్ట్ ఫామ్ ఆఫ్ హూమన్ ఇంటరాక్షన్. గొప్ప ఆధ్యాత్మిక గురువుల దగ్గర, శిష్యులు కూచున్నప్పుడు, కేవలం నిశ్శబ్దంతోటే, ఆ గురువు తాను అనుభవిస్తున్న ప్రశాంతిని కమ్యూనికేట్ చేస్తాడు చూడు, ఐ థింక్, దట్ ఈజ్ ద హయ్యెస్ట్ ఫామ్ ఆఫ్ హూమన్ కమ్యూనికేషన్. ఇక తక్కినవన్నీ, నేను జియోలాజికల్ కాంగ్రెస్‌లో ఒక పేపర్ చదవడం, ఒరుణిమ గురుదేవ్ గీతం పాడుతుంటే మనమంతా మైమరచి వినడం లాంటివన్నీ ఆ మధ్యలో డిఫరెంట్ లెవెల్స్ ఆఫ్ కమ్యూనికేషన్ అనుకుంటాను.'

మాట్లాడటం ఆపి ఆయన తన కప్పులో ఉన్న టీ పూర్తిగా తాగి, కప్పు పక్కన పెట్టి, మళ్లా ఇలా చెప్పాడు:

'కాబట్టి విమలా, ఈ రోజు నువ్వు ఆ ట్రైబల్ సింబల్స్ ఆఫ్ కమ్యూనికేషన్లో ఒక సింబల్‌ని అనుభవంలోకి తెచ్చుకోగలిగావు. ఆ కొండ ఎక్కావు. నీకు తెలియదు, అదొక ఫర్ బిడెన్ జోన్ అని. బహుశా అందుకే ఆ వాచరుకూడా నీ దగ్గర లేదు అప్పుడు. కాని

నువ్వేది ఎక్స్ పీరియెన్స్ చేసావో అది మేము మిస్సయ్యాం. నువ్వు భయపడ్డావు నిజమేకాని, యు హేవ్ అండర్ గాన్ వన్ ఆఫ్ ద రేరెస్ట్ మొమెంట్స్ ఆఫ్ ఎ ప్రిమిటివ్ ఫియర్. ఐ ఎన్వీ యూ' అని అన్నాడు నవ్వుతూ.

'అంటే భయం కూడా అసూయపడదగ్గ విషయమేనా ప్రొఫెసర్?' అనడిగాను, ఉక్రోషంగా.

ఆయన పకపకా నవ్వేసాడు.

'భయం కాదు విమలా, ద ప్రిమిటివ్ ఫియర్, యాజ్ ఎక్స్ పీరియెన్స్డ్ బై ఎ ప్రిమిటివ్ ట్రైబల్ గ్రూప్. అంటే నువ్వొక ఆదిమ గిరిజన భాషను అనుభవంలోకి తెచ్చుకున్నావే, దానికి అసూయ కలిగింది అన్నాను. మనం కళలు నేర్చుకోడానికి, భాషలు నేర్చుకోడానికి, కొత్త ప్రదేశాలు చూడటానికి, కొత్త స్నేహాలు చేయడానికీ ఎందుకు అంత క్యూరియస్‌గా ఉంటామంటే, మనకు తక్కిన హ్యూమన్ గ్రూప్స్ తాలూకు సింబాలిక్ వరల్డ్ లోకి ప్రవేశించాలనే కోరికవల్ల. మనది కాని సింబాలిక్ వరల్డ్ ముందు మనల్ని భయపెడుతుంది, ఇన్సెక్యూరిటీ క్రియేట్ చేస్తుంది. కాని అది మనలో రేకెత్తించే క్యూరియాసిటీ కూడా తక్కువేమీ కాదు. టేక్ ఫర్ ఇన్‌స్టన్స్, ద ఎక్స్‌పీరియెన్స్ ఆఫ్ లవ్–' అని ఒక క్షణం ఆగాడు.

వనలత వైపు ప్రేమపూర్వకంగా చూసాడు. ఆమె ముఖంలో తత్తరపాటు కనిపించింది. ఆయన తన చూపులు ఆమె మీంచి మరల్చి నన్ను చూస్తూ చెప్పడం కొనసాగించాడు.

'ప్రేమ కూడా ఒక సింబాలిక్ కమ్యూనికేషన్. అది ఒక మనిషి తనకై తాను నిర్మించుకునే ఒక సింబాలిక్ వరల్డ్. ఆ భాష మరొక మనిషికి అర్థమయిందనుకో, వాళ్ళిద్దరూ ప్రేమలో పడ్డారు అంటాం. లేదనుకో, అతనేం చెప్తున్నాడో ఈమెకి ఎప్పటికీ అర్థం కానే కాదు.'

'అంటే ప్రేమ వట్టి సింబల్ మాత్రమేనా? అది ఒక ఫీలింగ్ కాదా? ఎక్స్ పీరియెన్స్ కాదా?' అనడిగింది వనలత. ప్రొఫెసరుతో ప్రేమ గురించి చర్చించడం బహుశా ఆమె జీవితంలో ఇదే మొదటిసారి అయి ఉండాలి.

ప్రొఫెసరు ఆమె కేసి అనునయంగా చూసాడు. చిన్నపిల్లని చూసినట్టుగా చూసాడు.

'యెస్. లవ్ ఈజ్ ఏన్ ఎక్స్‌పీరియెన్స్, ఇట్స్ ఎ ఫీలింగ్. అందులో కాదనడానికేముంది? ఇంకా చెప్పాలంటే ఇట్స్ ఎ డ్రీమ్. నువ్వు మాత్రమే కంటున్న కల. నీ కలని మరొక

మనిషికి కమ్యూనికేట్ చెయ్యడానికి ఏదో ఒక సింబాలిక్ ఫ్రేమ్‌వర్క్ తప్పనిసరి అని మాత్రమే నేను చెప్తున్నాను. ఆ డ్రీమ్‌ని ఒక ఫ్లాగ్ లాంటి సింబల్‌తో ప్రకటిస్తున్నావనుకో, దాని అర్థం నువ్వు ఎదుటిమనిషి ఇన్‌స్టింక్ట్స్ కి మాత్రమే అపీల్ చేస్తున్నావని. అదే నువ్వు అబ్సొల్యూట్ సైలెన్స్‌తో కమ్యూనికేట్ చేస్తున్నావనుకో, నువ్వు ఎవరిని ప్రేమిస్తున్నావో, వారి ఆత్మని రీచ్ అవుతున్నావని అర్థం. ఇద్దరు ప్రేమికులు తాము ఒకరినొకరు ప్రేమించుకుంటున్నామని అనుకుంటున్నప్పుడు వాళ్ళు ఏ సింబాలిక్ ఫ్రేమ్ వర్క్ లో కమ్యూనికేట్ చేసుకుంటున్నారో చూడమని చెప్తున్నాను, అంతే' అని అన్నాడు.

వనలత ఏమీ మాట్లాడలేదు. ప్రొఫెసరు మాటలు ఆమెకి గొప్ప నిశ్చింత కలిగించాయని నాకు తెలుస్తూనే ఉంది.

మరి నా సంగతి?

నాకు ప్రేమ అంటే ఏమిటో అప్పటిదాకా ఎప్పుడూ అనుభవంలోకి రానేలేదు. ప్రేమ అంటే స్త్రీపురుష ప్రేమ అన్న అర్థంలో. కాని ఒక మనిషి మరొక మనిషికి ఇవ్వగల ప్రేమ, బహుశా, మా నాన్న, మా అమ్మ, మా తమ్ముడు, చెల్లెలు– వాళ్ళదగ్గరనుంచి నేను పొందిందేమీ తక్కువకాదు. కాని తిరిగి వాళ్ళకు అంత ఇవ్వగలిగానా? కనీసం వాళ్ళిస్తున్న ప్రేమని నేను అర్థం చేసుకోగలుగుతున్నానని తిరిగి చెప్పగలిగేనా? లేక ప్రొఫెసరు చెప్పినట్టుగా, ఆ ఫ్రేమ్‌వర్కు పూర్తిగా సైలెన్సుకి చెందిందేనా?

ఇంక వెళ్ళొస్తానని లేచాను. చీకటి పడుతూ ఉంది. మా ఇంటిదాకా వచ్చి దిగబెడతామని ప్రొఫెసరూ, వనలతా కూడా బయల్దేరారు. మాఘమాసపు సంధ్యమామిడిపూల గాలితో మత్తెక్కిపోయి ఉంది. ఎక్కణ్ణుంచో జీడిమామిడిపూల గాలి కూడా ఎవరో తోటలో పాడుకుంటున్న పాటలాగా మంద్రంగా తేలివస్తోంది. చూస్తూండగానే సప్తమి చంద్రుడు ఆకాశంలో అడుగుపెట్టాడు. ఊరంతా సాంబ్రాణి ధూపం వేసినట్టు వెన్నెల. ఎక్కడో బంగ్లాదేశ్ లో పుట్టిన ఆ ప్రొఫెసర్, ఆ కలకత్తా యువతి, మాది కాని ఆ ఊరు, మాకేమీ కాని ఆ వీథులు– కాని కొద్దిరోజుల్లోనే మా మధ్య అల్లుకున్న ఆత్మీయత, ఆ పూలతావి, ఆ అగరు ధూపం–ఆ క్షణాన చెప్పలేని నిశ్శబ్దమేదో నా హృదయమంతా నిండిపోయింది.

ఒక్క మాటలో చెప్పాలంటే స్వీట్ సైలెన్సు.

❋

13

ఫిబ్రవరి చివరి వారంలో యూనివెర్సిటీనుంచి ప్రొఫెసరుని అర్జంటుగా వెనక్కి రమ్మని పిలుపు వచ్చింది. ముందు అనుకున్న ప్లాను ప్రకారం ఆయన మే నెలాఖరుదాకా ఫీల్డు వర్కులో ఉండాలి. అందుకు యూనివెర్సిటీ పర్మిషను కూడా తీసుకున్నాడు. కాని ఏవో అనుకోని పరిణామాలు, బహుశా ఆ వైస్ ఛాన్సలరు సెలవుమీద వెళ్ళడం లాంటిదేదో జరిగి, ఉన్నవాళ్ళల్లో సీనియర్ మోస్టు ప్రొఫెసరు ఈయనే కావడంతో ఈయన్ని వెనక్కి రమ్మని టెలిగ్రాములమీద టెలిగ్రాములిస్తూ ఉన్నారు.

ప్రొఫెసరుకి తిరిగి వెళ్ళక తప్పదని అర్థమయింది. అక్కడితో ఫీల్డువర్కు ఆపేద్దామనుకుంటే యాంత్రొపాలజిస్టు మార్చి పదిహేనుకల్లా వస్తాననీ, అప్పుడు వీలుకాకపోతే మళ్లా ఎప్పుడు వీలవుతుందో చెప్పలేననీ, ఉత్తరం రాసాడు. యూనివెర్సిటీని మరొక రెండు వారాల ఫీల్డువర్కుకి పర్మిషను అడిగి, మార్చి పదిహేనుకల్లా యాంత్రొపాలజిస్టు రాగానే తాము కలకత్తాకి బయల్దేరితే సరిపోతుందని ప్రొఫెసరు అనుకున్నాడు. వాళ్లతో పాటే నేను కూడా మా ఊరు వెళ్ళిపోవచ్చని అనుకున్నాం. కాని మార్చి మొదటివారంలో యాంత్రొపాలజిస్టు తనకి కూడా ఫీల్డు ఇన్వెస్టిగేటర్లు అవసరం అనీ, వాళ్ళు యాంత్రొపాలజీనే చదివి ఉండనక్కర్లేదనీ రాసాడు. అంటే ఆయనొక ఫీల్డు అసిస్టెంటు కోసం చూస్తున్నాడన్నమాట. ప్రొఫెసరు ఒక రోజంతా ఆలోచించినట్టున్నాడు, చివరికి సందేహిస్తూనే నన్నడిగాడు.

'విమలా, వుడ్ యు మైండ్ అసిస్టింగ్ హిమ్?' అని.

'ఎన్నాళ్ళుండవచ్చు ఆ వర్క్' అని అడిగాను.

'మన ఒరిజినల్ ప్లాన్ ప్రకారమే. మే నెలాఖరుదాకా ఉంటుంది. మేము ఇప్పుడు వెళ్ళి మళ్ళా ఏప్రిల్ రెండోవారానికల్లా వచ్చేస్తాం. ఆ తర్వాత మే చివరిదాకా మనం మళ్ళా కలిసి పనిచేసుకోవచ్చు' అన్నాడు.

'ఈలోపు నువ్వు రెండువారాలు మీ ఇంటికి వెళ్లిరావచ్చు' అని కూడా అన్నాడు.

నేను ఆలోచించాను. ఇక్కడికి వచ్చేటప్పుడే మే దాకా అనుకుని వచ్చాను కదా, ఉండిపోవడంలో ఇబ్బంది ఏమీ లేదనిపించింది. కాకపోతే మధ్యలో మళ్ళా రెండు వారాలు ఇంటికి పోయి రావడం మాత్రం అనవసరం అనిపించింది. ప్రతి వారం మా నాన్నకి ఉత్తరం రాస్తూనే ఉన్నాను. ఎప్పటికప్పుడు నా క్షేమసమాచారం తెలియచేస్తూనే ఉన్నాను. ఒకసారి ఇంటికివెళ్తే మళ్లా ఇంతదూరం రాబుద్ధి అవుతుందో లేదో అనుకున్నాను.

'ఇక్కడే కంటిన్యూ అవుతాను. మీరు చెప్పినట్టే ఆయనకి వర్క్‌లో నేను చెయ్యగల సాయం చేస్తాను' అని చెప్పాను.

ఆ తర్వాత మార్చి పదిహేనున వాళ్ళు వెళ్ళిపోయేదాకా వాళ్ళిద్దరూ నాకు మరింత ఆత్మీయులుగా మారిపోయారు. వాళ్ళు ఏప్రిల్లో మళ్ళా వస్తామని చెప్పినప్పటికీ, ఆ మధ్యలో నెల్లాళ్ల విరామం ఉంటుందన్న ఊహనే నాకెంతో బెంగ పుట్టించింది.

ఆ రోజులంతటా ప్రతి ఒక్క రోజూ ఆ మాఘమాసపు అడవిలో మేం కలిసి తిరిగాం, కలిసి పనిచేసాం. ప్రతిరోజు మా ఫీల్డువర్కుకి అదే చివరి రోజేమో అన్నట్లుగా, అంత ఇష్టంగా, అంత శ్రద్ధగా పని చేసాం.

నేనొకప్పుడు ఏటికొప్పాక గ్రామంలో కొయ్యబొమ్మలు తయారుచేసే కళాకారుల ఇంటికి వెళ్ళి చూసాను. ఆ ఇంట్లో బొమ్మలు చెక్కడానికి తెచ్చిన తెల్లపొలికి కట్టెలు పోగేసి ఉన్నాయి. కొన్ని కట్టెలు అడవినుంచి తెచ్చినవి తెచ్చినట్లే ఇంటిగోడకి ఆనించి ఉన్నాయి. కొన్ని ఒక పక్కన కట్టెల అడితీలో గుట్టలాగా పడేసినట్టున్నాయి. మరికొన్ని ముక్కలుగా నరికి పోగుపెట్టి ఉన్నాయి. ఇద్దరు పనివాళ్ళు మిషను రంపాలు పెట్టుకుని ఆ చిన్న చిన్న ముక్కల్ని తమకి కావలసిన సైజుల్లో చిత్రికపడుతూ ఉన్నారు. వాళ్ల చుట్టూ కిందనంతా ఆ రంపం పొట్టు పడి ఉంది. గాల్లో మరీ పలచని ఊక లాగా చిత్రికపడుతున్న దుమ్ము ఎగురుతూ ఉంది. మాఘమాసపు అడవి గుర్తొస్తే నాకు ఆ దృశ్యమే తలపుకొస్తూ ఉంది. ప్రకృతి చిత్రకారిణి ఆ బొమ్మలకు రంగులువెయ్యడానికి ఇంకా మరొక నెల ఆగాలి. ముందు ఆ అడవిలో అహర్నిశలు మాఘమాసపు రంపపుకోత నడవాలి.

ఒక పరిత్యాగ వ్రతదీక్షలో ఉన్నట్టుగా ఆకులన్నీ వదులుకుని రిక్త హస్తాల్తో కనిపించే జువ్వి, బిల్లుడు, నర్లింగ, పాలగొట్టి, పింద్రుగ, కుంకుడు, సండ్ర, నక్కెర, పొన్న, తుమికి, నెమలి లాంటి చెట్లూ, నవరత్నాలు, వెలుతురు చెట్టు, ఆలగొట్టి, చేకొరిస, భూతరాకాసి, ఆవు పుట్నాలు, తెల్లపులిచెరి, మంగ, పంచాంగం చెట్టు, బోయగాంధారి, ఉప్పి, సొప్పరి లాంటి పొదలూ, ఊరు అలం, చిత్రం అలం, నల్ల అలం లాంటి అలాలూ, వెంపలి, నక్కగడ్డ, గునుగులాంటి తుప్పలూ, యాదితీగలూ, ఎండిపోయిన తాళ్ళల్లాగా వేలాడే అడ్డ తీగలూ, పుల్లపుల్లని నల్లనల్లని పండ్లని విస్తారంగా కురిసి కురిసి వట్టిపోయిన పరిమ తీగలూ, ఎటూచూసినా బండలమీద పీచు ఎండబెట్టినట్టుండే గడ్డిదారులూ పరుచుకున్న రంగస్థలం మీద అడవి బూరుగచెట్లు మొదటి బుట్టబొమ్మల్లాగా కనబడ్డాయి.

పత్రహీన, హరితహీన, రసహీన జగత్తులో, ధూసర, ధూమ్రవర్ణాలు మాత్రమే రాజ్య మేలుతున్న దృక్పటంలో ఆ ఆ రక్తవర్ణాల బూరుగలు అడవిలో ఎవరో నాదస్వరం ఊదుతున్నట్టుగా కనబడ్డాయి.

ఆ మాఘమాసపు అడవిలో ఎక్కణ్ణుంచో ఎవరో ఒక సన్నని గొంతుతో మొదటి స్వరాలు పలుకుతున్నటుగా తొలిచిగుర్లు కనిపించగానే నాకెంత సంతోషం కలిగిందో చెప్పలేను. అన్నిటికన్నా ముందు ఆ తపసి వృక్షాలు. వాటికి నేను జీవితమంతా ఋణపడి ఉంటాను.

ఎటుచూసినా లోపలకి ముడుచుకుపోయి మరుభూమిలాగా, పాషాణహృదయ లాగా కనిపించే ఆ అడవిలో ఆ తెల్లటికాండాల మీద వనదేవత అభయహస్తాలు చాచినట్టుగా పెద్ద పెద్ద అరచేతుల్లాంటి ఆ కోవెల చెట్ల ఆకులు నామీద కరుణ కురిపించినట్టుగా ఉండేవి. అసలు ఆ చెట్లని చూస్తే, వనసామ్రాజ్ఞికి గొడుగులు పడుతున్నట్టుగా ఉండేవి.

అర్ధరాత్రి చిమ్మచీకటిలో ఒక వెన్నెలరేఖలాగా ఉన్నట్టుండి ఒక రోజు పొద్దున్నే మాకు తెల్లటిమొగ్గలు విప్పారుతున్న చెట్టు కనిపించింది. పాలకొడిసె చెట్టు. అందరం ఆ చెట్టు చుట్టూ చేరాం. ఈ సృష్టిలో ఇక పత్రహరితమన్నమాటనే వినబడదేమో అనే ఆ శైశిరపూర్వాహ్ణాన ఆ తెల్లటిమొగ్గల్ని చూడగానే వనలత అక్కడే అప్రయత్నంగా గొంతెత్తింది.

గొభీర్ నిశిథే ఘూమ్ భేంగే జాయ్ కె జెనో అమారే డాకే
షె కి తుమి? షె కి తుమి?

ఆ పల్లవి వినగానే ప్రొఫెసరు సేన్‌గుప్త చలించిపోయాడు. ఆయన ఆ పాలకొడిసె కొమ్మని కిందకు వంచి అప్పుడే రేకలు విప్పుకుంటున్న ఆ మొగ్గల్ని మృదువుగా కొనగోటితో తాకాడు.

'ఎన్నాళ్ళయింది ఒరుణిమా ఈ నజ్రుల్ గీతి విని! ఎప్పుడో నా యవ్వనదినాల్లో కలకత్తా వచ్చిన కొత్తలో కమల్ దాస్‌గుప్తా పాడగా విన్నాను. ఎప్పుడు నేర్చుకున్నావు ఈ పాట? ఇంతకుముందెప్పుడూ పాడగా వినలేదే!' అని అన్నాడు.

వనలత చిరునవ్వింది. ఆయనకేమీ జవాబివ్వకుండా మళ్ళా పల్లవి ఎత్తుకుంది.

గొభీర్ నిశిథే ఘూమ్ భేంగే జాయ్ కె జెనో అమారే డాకే
షె కి తుమి? షె కి తుమి?

(గంభీర నిశీథిలో ఎవరిదో స్వరం విని హటాత్తుగా మేల్కొన్నాను. అది నువ్వేనా? అది నువ్వేనా?)

ఆ తర్వాత చరణం వెనక చరణం పాడుతూనే ఉంది.

కార్ స్మృతి బుకే పశాణెర్ మతొ భా జాయే జెనొ థాకే
షె కి తుమి? షె కి తుమి?

(నా గుండెమీద బండలాగా బరువైన ఒక స్మృతి. అది నువ్వేనా? అది నువ్వేనా?)

కాహార్ క్షుధితొ ప్రేమ్ జెనో హాయ్ భీకా చాహియా కమియా బేడాయ్
కార్ సకొరుణ్ ఆంఖీ దుతి జెనో రాతేరొ తారార్ మొతో
ముఖొ పానే జే థకే
షె కి తుమి? షె కి తుమి?

(ఎవరిదో క్షుధిత ప్రేమ యాచిస్తో సంచరిస్తున్నది, ఎవరి కరుణామయ నేత్రాలో రాత్రి తారల్లాగా మెరుస్తున్నవి. వెతుక్కుంటున్న ఆ వదనం, అది నువ్వేనా? అది నువ్వేనా?)

నిశీర్ బాతాసే కహార్ హుతాశ్ దిరొఘొ నిశాస్ సమో
ఝుర్ తోలే ఎసే అంతొరే మోర్ ఓగో దురంతో మమో
షె కి తుమి? షె కి తుమి?

(ఈ నిశీథపవనం ఎవరిదో దీర్ఘనిశ్వాసాన్ని మోసుకు తిరుగుతున్నది, నా హృదయాన్ని కలచివేస్తున్నది, ఓ దూరమిత్రమా! అది నువ్వేనా? అది నువ్వేనా?)

మొహాసాగొరేర్ ధేయు ఏర్ మొతో ఋకే ఏసే బాజే కహార్ రోదొనొ
పియా పియా నామ్ జపే ఒభిరాం బొనేర్ పాపియా పాఖీ
ఆమారో చొంపా శాఖే
షె కి తుమి? షె కి తుమి?

(మహాసాగర ఘోషలాగా అది నా హృదయాన్ని కలతపెడుతున్నది, నా వనంలో సంపెంగ కొమ్మమీద పక్షి పాట వినిపిస్తున్నది. అది నువ్వేనా? అది నువ్వేనా?)

ఆమె పాడినంత సేపూ సేన్‌గుప్త ఆ కొమ్మని వదల్లేదు. ఎక్కడో తరుకాండాల్లో నిద్రిస్తూ, నిశాంతం లాంటి వసంతంకోసం ఎదురుచూస్తున్న ప్రతి పత్రవృంతాన్నీ, ప్రతి పుష్పవృంతాన్నీ ఆ పాట వెళ్ళి తట్టిలేపినట్టుగా అనిపించింది.

చుట్టూ కలయచూసాను. ఇంకా వసంతం రాకముందే, వసంతాగమనాన్ని ప్రకటిస్తున్న తపసిచెట్లు, పాలకొడిసె చెట్లు- వాటిని చూస్తూ

'షె కి తుమి? షె కి తుమి?'

అని నాలోనేనే ప్రశ్నించుకున్నాను. టాగోర్ పేరు విన్నానుగాని, నజ్రుల్ పేరు అప్పటిదాకా వినలేదు, ఆయన గీతం వినడం కూడా అదేమొదటిసారి. ఆ మాటే చెప్పాను సేన్‌గుప్తతో.

'నజ్రుల్ ని అందరూ రెబెల్ పొయెట్‌గా గుర్తుపెట్టుకున్నారు. కాని ఆయన మధురకవి కూడా. భక్తికవి కూడా. ఫాల్గుణం మీద, వసంతం మీద గురుదేవులు రాసిన పాటలకి ఏ మాత్రం తీసిపోని పాటలు రాసాడు. కాని ఇవ్వాళ మా ఒరుణిమ ఈ పాట పాడితే నాకెంత యాప్ట్‌గా , అప్రాప్రియేట్‌గా అనిపించిందో తెలుసా! విమలా, అంతా స్ప్రింగ్ సీజన్ గురించి మాట్లాడతారు. కాని మాఘమాసం చెట్లు నెమ్మదిగా నిద్రమేల్కొనే మాసం. ఫాల్గుణం వాటి ప్రభాతం. ఈ రెండు మాసాల్లోనే అడవి, చెట్లు, మొగ్గలు, పువ్వులు, పక్షులు, సమస్త ప్రకృతి మేల్కొనే వేళ. అందుకే నజ్రుల్ అడుగుతున్నాడు, నా తోటలో గొంతువిప్పిన ఆ పక్షివి నువ్వేనా?నువ్వేనా? అని' అన్నాడు సేన్ గుప్త.

ఆ రాత్రి ఇంటికొచ్చి పడుకున్నాక కూడా 'అది నువ్వేనా? అది నువ్వేనా' అనే మాటలే నా హృదయంలో మోగుతూ ఉన్నాయి. బహుశా ఆ అర్ధరాత్రి హటాత్తుగా మెలకువ

వస్తే, గది తలుపు తెరుచుకుని, కంచె తలుపు తీసుకుని, ఆ నీరవనిశీథిలో నలుదిక్కులా చూస్తో 'అది నువ్వేనా? అది నువ్వేనా?' అని బెంగగా, ఆశగా అడుగుతానేమో, ఆ అడవి దారుల్లో అడ్డం పడిపోతానేమో అని భయమేసింది.

ఇప్పటికీ, 'షె కి తుమి? షె కి తుమి?' అనే మాటలు గుర్తొస్తే చాలు, ఎవరో మా వీథిలో అర్ధరాత్రి మా ఇంటి అడ్రస్సు వెతుక్కుంటూ తిరుగుతున్నారనే అనిపిస్తుంది.

వేసవికి ఎండి నాలుక పిడచకట్టుకుపోయిన నేలమీద తొలి ఋతుపవన మేఘం చినుకులు రాలినట్టు, చీకటి గడిచి, ఇంకా తెల్లవారకముందు తూర్పుదిక్కున తెలినీలి రంగు తెరుచుకున్నట్టు, మాఘమాసపు అడవిలోకి ఫాల్గుణం ప్రవేశించింది. అడవిలో నల్లజీడి చెట్ల పండ్లు పక్వం కావడం మొదలుపెట్టాయి. ఊరి అంచుల్లో పొలాల్లో జీడిమామిడి చెట్లు పిందెతొడగడం మొదలయ్యింది. కొండల్లో కొండమామిడిచెట్లమీదా, ఊళ్ళో అంటుమామిడి చెట్ల మీదా పిందెలు కాయలుగా ఎదగడం మొదలయ్యింది.

చూస్తూనే మార్చి మాసంలో రెండువారాలూ గడిచిపోయేయి. వాళ్లు వెళ్ళబోయే ముందు రోజు సాయంకాలం వకుళకుటికి వెళ్ళాను. ప్రొఫెసరు సేకరించిన రాక్ సాంపిళ్లలో ఒకటి, ఇంట్లో పిల్లలకి చూపిద్దామని తీసుకువెళ్ళింది, నా దగ్గరే ఉండిపోయిందని గుర్తొచ్చింది. అది తిరిగి ఇచ్చేద్దామని వెళ్ళాను. ప్రొఫెసరు తన గదిలో ఉన్నాడు. సామాను సర్దుకుంటూ ఉన్నాడు. 'ఆ రాయి కోసం మళ్ళా ఇంతదూరం వచ్చావా' అనడిగాడు.

కాని వనలత ఆ రాతిని చేతుల్లోకి తీసుకుంది. చూస్తుండగానే ఆమె ముఖంలో భావోద్వేగాలు పొంగులెత్తాయి. ఆమెని అంతగా చలింపచేసింది ఆ రాక్ సాంపిల్ కాదనీ, అన్నాళ్ళుగా మేము అక్కడ కలిపి గడిపిన రోజులనీ నాకు అర్థమవుతూ ఉంది. వాళ్ళు మళ్లా వస్తారన్న ఊహ వల్ల కాబోలు నాకు అప్పటిదాకా ఎటువంటి బెంగా పుట్టలేదు. కాని వనలత మనసులో ఆ క్షణాన ఏ భావసంచలనం కదలాడిందో నాకు తెలియదుగాని ఆమె వెంటనే–

మొర ఝుంఝూర్ మతొ ఉద్దామ్
మొర ఝురొనార్ మతొ చొంచల్
మొర బిధతార్ మతొ నిర్భయ్
మొర ప్రకృతీర్ మతొ సచ్ఛల్

అని అందుకుంది. సేన్‌గుప్త లోపల నుంచే 'థాంక్ యూ ఫర్ నజ్రుల్ అగైన్' అని అరిచాడు.

వనలత 'కాకూ, కమ్ ఆన్, జాయిన్ మీ' అని ఇటునుంచి అరిచింది. ప్రొఫెసరు బయటకి వచ్చి ఆమె పక్కన చేతులు కట్టుకుని నిలబడి తను కూడా ఆ పల్లవికి గొంతుకలిపాడు.

మొర ఝుంఝూర్ మతొ ఉద్దామ్
మొర ఝురనార్ మతొ చొంచల్
మొర బిధతార్ మతొ నిర్భయ్
మొర ప్రకృతీర్ మతొ సచ్చల్

(మేము ఉరుములాగా శక్తిమంతులం, ఊటకాల్వలాగా ఉరుకులెత్తుతాం. విధాత లాగా నిర్భయులం, ప్రకృతిలాగా స్వచ్ఛజీవులం)

మొర ఆకాశేర్ మతొ బధహీన్
మొర మొరు సంచర్ బెడుయిాన్
మొర బంధనహీన్ జన్మస్ బధీన్
చిత్తముక్త శతదళ్

(మేము ఆకాశంలాగా బంధనరహితులం, ఎడారిలో సంచరించే బెడొయిన్లం, మేము స్వతంత్రులం, చిత్త ముక్త కమలాలం)

మొర సింధు జొవార్ కలొకల్ మొర పగల ఝొరార్ ఝొరజల్
కల కల్ కల్ చల చలచల్ కలకల్ కల్ చలచల్ చల్
కల కల్ కల్ చల చలచల్ కలకల్ కల్ చలచల్ చల్

(మేము సాగర కలకలనాదాలం, ఉన్మత్త ఝరీజలప్రవాహాలం, కలకల చల చల నాదాలం, నినాదాలం)

మొర దిల్ ఖొల ఖొల ప్రాంతర్
మొర శొక్తి అతల మొహిధర్
మొర హసి గానసొమ ఉచ్చల్
మొర బృష్టిర్ జొల్ బనఫల్ ఖాయి, స్వచ్ఛ శ్యామల్ బనతల్

(మేము హృదయం తెరిచిపెట్టుకున్న విశాల మైదానాలం, అజేయ మహీధరాలం, సంతోషంగా పాడుకునే గీతాలం, వర్షజలాలు ఆస్వాదిస్తూ, వనఫలాలు ఆరగిస్తాం, వనతలంలో స్వచ్ఛమైన పచ్చికబయళ్ళలో సంచరిస్తాం)

మొర ఝుంఝూర్ మతొ ఉద్దామ్
మొర ఝురనార్ మతొ చొంచల్
మొర బిధతార్ మతొ నిర్భయ్
మొర ప్రకృతీర్ మతొ సచ్చల్

(మేము ఉరుములాగా శక్తిమంతులం, ఊటకాల్వలాగా ఉరుకులెత్తుతాం. విధాత లాగా నిర్భయులం, ప్రకృతిలాగా స్వచ్ఛజీవులం)

ఆ తండ్రీ కూతుళ్ళిద్దరూ అలా అరుగు మీద నిలబడి ఒక జాతీయగీతాన్ని ఆలపిస్తున్నంత శ్రద్ధగా, ఉత్సాహంతో, ఉద్వేగంతో, ఉచ్చైస్వరంతో ఆ గీతం ఆలపించారు. పాట ముగిసిపోగానే వనలత నన్ను అమాంతం కావలించుకుంది. బుగ్గమీద ముద్దులు పెట్టింది. ఆమె కళ్ళల్లోంచి కన్నీరు ఉబికిపోతూ ఉంది.

ఆ మర్నాడు పొద్దున్నే ప్రొఫెసరు సేన్ గుప్త, వనలత కలకత్తా బయల్దేరిపోయారు. వాళ్ళని ఎక్కించుకున్న జీపు ఏరు దాటి, గ్రామదేవత గుడిదాటి, మలుపు తిరిగేదాకా రోడ్డుమీద నిలబడి ఆ దిక్కుకే చూస్తూండిపోయేను.

❋

14

వనలతా ప్రొఫెసరూ వెళ్ళిపోయిన రోజే యాంత్రొపాలజిస్టు మిశ్రా నుంచి టెలిగ్రాం వచ్చింది. ఆయన ముందు అనుకున్నట్టుగా మార్చి పదిహేనుకి రాలేకపోతున్నాననీ, బహుశా మార్చి నెలాఖరుకిగాని, ఏప్రిల్ మొదటివారానికిగాని వస్తానని మెసేజి ఇచ్చాడు. ఆ టెలిగ్రాం నా పేరుమీదనే ఇవ్వడంతో ఆ సంగతి తెలియచేస్తూ సేన్‌గుప్తాకి కలకత్తా అడ్రస్సుకి నేను కూడా ఒక టెలిగ్రాం ఇచ్చాను. ప్రొఫెసరు, వనలత వెళ్ళాక రెండు రోజులదాకా నాకు చాలా బెంగగా అనిపించింది. వాళ్ళతో కలిసి విశాఖపట్టణందాకా వెళ్ళిఉండవలసింది, దగ్గరుండి రైలు ఎక్కించి ఉండవలసింది అని ఎంతగానో అనుకున్నాను. వాళ్ళు వెళ్ళినప్పుడు రాజు వూళ్ళో లేడు. సంక్రాంతి పండగ సెలవుల తర్వాత కాకినాడ వెళ్ళినవాడు మళ్ళా రాలేదు. ఆ ఊళ్ళో ఆ ఇంట్లో ఆ చిన్నపిల్లలిద్దరూ తప్ప నాకు ఎవరూ స్నేహితులుకూడా లేరనిపించింది. అడవినుంచి నేను ఏరిన ఆకులూ, కొమ్మలూ ఆల్బమ్సు ఎప్పటికప్పుడు ప్రొఫెసరు కలకత్తా పంపించేస్తోనే ఉన్నాడు. దాంతో ఆ పనికూడా లేదు. ఆయన మొక్కల్తో నా సంభాషణలు మొదటిరోజు నుంచే నోట్సు రాస్తూ ఉండమన్నాడుగానీ ఒక్క పేజీ కూడా రాయలేకపోయాను.

ఇన్నేళ్ళ తరువాత ఇప్పుడు ఆలోచిస్తే, అసలు ఆ ప్రాజెక్టులో నేను చేసింది చాలా చాలా ప్రాథమికమైన పని అని తెలుస్తూ ఉంది. ఆయన మల్టీ డిసిప్లినరీ ప్రాజెక్టు అని చెప్పినప్పటికీ నేను చేసింది జియో బోటనీనో లేదా, బొటానికల్ జియాలజీనో కానే కాదు. జియోబోటనీ వర్కు చేయాలంటే జియొలాజికల్ సబ్ స్ట్రేటాని పట్టుకుని దాన్లో పెరుగుతున్న మొక్కల్ని అధ్యయనం చేయాలి. అది కూడా ఏదో ఒకసారి చేస్తే చాలదు. వరసగా రెండుమూడేళ్ళు అదే ప్రాంతానికి మళ్ళా మళ్ళా వెళ్ళి అధ్యయనం చెయ్యాలి.

ప్రొఫెసరూ, వనలతా జియాలజీలో చేస్తున్న పరిశోధన ఉన్నతస్థాయి పరిశీలన, పరిశోధన అని నాకు అర్థమవుతూనే ఉంది. అసలు వాళ్ళతో కలిసి ఒక ప్రాజెక్టులో పనిచేసానని చెప్పుకోడానికి కూడా నా గ్రాడ్యుయేషను అర్హత ఏ మూలకీ సరిపోదని నాకు అర్థమయింది. అయినా కూడా ఎందుకు ప్రొఫెసరు నాకు ఆ పని అప్పగించాడు? తాను తిరిగిన కొండలమ్మట ఉన్న మొక్కల్నీ, వృక్షజాతుల్నీ, గడ్డిజాతుల్నీ మాపింగు చెయ్యడమనే మరీ ప్రాథమికమైన పని ఎందుకు చేయించాడు?

ఇప్పుడు వ్యాప్తిలో ఉన్న చాలా పదాలు-బయో డైవర్సిటీ, ఇకో సిస్టమ్సు, మైక్రో వాటర్ షెడ్లు, లైవ్లీహుడ్ ఆపర్చునిటీసు లాంటి పదాలు అప్పటికి ఇంకా పెద్దగా ఎవరికీ తెలియదు. ఆయన ఏదైనా ఒక బయోడైవర్సిటీ ప్రాజెక్టు రూపకల్పన కోసం ఒక ప్రపోజలు తయారు చేయడానికి అటువంటి బేసిక్‌డాటా సేకరించాడా? ఆయన మనసులో ఏముంది? ఒక వేళ బయోడైవర్సిటీ ప్రాజెక్టే అనుకున్నా అది ఒక జియాలజిస్టు ఊహించగల ప్రతిపాదనైతే కాదు.

ప్రొఫెసరు ఆ రోజుల్లో అటువంటి అధ్యయనం చేపట్టడానికి నాకు రెండు కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి, ఆయన కాలం కన్నా ముందున్న వ్యక్తి. ఆయనలో ఒక జియాలజిస్టూ, ఒక నాచురలిస్టూ మాత్రమే కాక, ఒక యాంత్రొపాలజిస్టు కూడా ఉన్నాడు. కొండ అంటే అడవీ, అడవిలో ఉంటున్న ఆదివాసులూ కూడా అని ఆయన నమ్మకం. అదంతా ఒక సమష్టికుటుంబం అనే ఆయన విశ్వసించాడు. ఆ కుటుంబాన్ని ఎన్ని పార్శ్వాల్లో సమీపించగలిగితే అన్ని పార్శ్వాల్లో సమీపించాలని అనుకున్నాడు. ఇది నేను ఆయన్ని దగ్గరగా చూసినందువల్ల కలిగిన అభిప్రాయం. కానీ మరీ దగ్గరగా చూసినందువల్ల మరో అభిప్రాయం కూడా కలిగింది. ఆయనకి ఈ ప్రాజెక్టులన్నీ ఒక సాకు మాత్రమేననీ, ఆయన కోరుకున్నదల్లా, ఏదో ఒక నెపం మీద ఎప్పటికీ అడవికీ, కొండలకీ దగ్గరగా ఉండాలని మాత్రమేననీ, అందుకని ఏదో ఒక ఫండింగు కోసం ఏదో ఒక పేరుతో ప్రతిపాదనలు పంపిస్తూ ఉండేవాడేమో అని కూడా అనిపించింది.

ఇంతకీ నేను సేకరించిన సమాచారం ఆయన ప్రాజెక్టుకిగానీ లేదా ఏదో ఒక ప్రాజెక్టు కోసం ప్రపోజలు రాయడానికి గానీ ఎంతవరకూ ఉపకరిస్తుందో నాకు తెలియలేదు. కానీ నా వైపు నుంచి చూసుకున్నప్పుడు మాత్రం అది నాకు గొప్ప అవకాశం అనిపించింది. ఆ వంకన నేను అడవిని ఒక పాఠ్యపుస్తకంగా చదవగలిగాను. ప్రొఫెసరు మాటల్లో చెప్పాలంటే అనేక కాండలుగా, సర్గలుగా ఉండే మహాకావ్యంలో కనీసం కొన్ని సర్గలు చక్కటి గురువు సన్నిధిలో స్వాధ్యాయం చెయ్యగలిగాను. అన్నిటికన్నా ముఖ్యం, నాకు

తెలీకుండానే నేను అడవితో ప్రేమలో పడిపోయేను. వాళ్ళు వెళ్ళిన తర్వాత నాలుగైదు రోజులపాటు నేను గడపదాటకుండా ఇంట్లోనే గడపవలసి వచ్చినప్పుడుగానీ ఆ ప్రేమ ఎటువంటి ప్రేమనో నాకు తెలియరాలేదు.

చాలాసార్లు సేన్‌గుప్తా తన ఎదట ఉన్న కొండల గురించీ, భూమి గురించీ, సముద్రాల గురించీ చాలా సరళంగా చెప్పాలని ప్రయత్నించేవాడు. ఒకరోజు నాతో మాట్లాడుతూ, 'ఇంతకీ ఎర్త్ అంటే ఏమిటి? త్రీ మెటల్స్: కోర్ అంతా ఐరన్, మాంటిల్ మొత్తం బసాల్ట్, క్రస్ట్ అంతా గ్రానైట్–అంతే కదా' అని అన్నాడు. మరోసారి 'జీవపదార్థం అంటే ఏమిటి? సోడియం, పొటాషియం, కాల్షియం అంతే కదా' అని కూడా అన్నాడు. ఆయన ఒక్కొక్కప్పుడు తన ముందు కనిపిస్తున్న జీవవైవిధ్యాన్ని, వర్ణవైభవాన్ని, రూపసంపదని తట్టుకోలేక, తనకి తాను అట్లా ఓవర్ సింప్లిఫై చేసుకుని చెప్పుకుంటున్నాడా అనిపించేది. ఒకసారి నేను ఉండబట్టలేక అడిగాను, 'ఈ ప్రపంచం, ఈ ఫిజికల్ వరల్డ్, ఈ నాచురల్ వరల్డ్ మీరు చూస్తున్నంత సరళమైన ఫార్ములాలా?' అని.

'గుడ్ క్వశ్చన్' అన్నాడాయన.

అప్పుడు నింపాదిగా చెప్పుకొచ్చాడు.

'పందొమ్మిదో శతాబ్దినుంచీ సైన్సులో రెండు దృక్పథాలు స్థిరపడ్డాయి. ఒకటి న్యూటన్ పాయింట్ ఆఫ్ వ్యూ. మరొకటి డార్విన్ పాయింట్ ఆఫ్ వ్యూ. న్యూటన్, ఆ మాటకొస్తే, ఫిజిసిస్టులంతా ఈ ప్రపంచం, ఈ ఖగోళం, ఈ విశ్వం నిశ్చితమైన సూత్రాలప్రకారం నడుస్తున్నాయి, వాటిని ఏ విధంగానూ ఉల్లంఘించలేం అంటారు. మరొకవైపు డార్వినూ, ఆయనలాంటి నాచురలిస్టులూ కాదనలేని ప్రత్యక్ష సత్యం అంటారు. పరిణామంలో కూడా ఛాన్స్, అన్‌సెర్టనిటీ, అన్ ప్రెడిక్టబిలిటీ ఉన్నాయంటారు. బోత్ ఆర్ కరెక్ట్. బోత్ ఆర్ నాట్ కరెక్ట్. ఇద్దరూ కూడా సత్యాన్ని ఓవర్ సింప్లిఫై చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఫిజిసిస్టులు నా దృష్టిలో అద్వైతుల్లాంటివాళ్ళు. అంతిమసత్యం మార్పులేనిదీ, అది ఒక యూనివెర్సల్ రిథమ్, వేదకాలంలో చెప్పిన ఋతం లాంటిదని నమ్మేవాళ్ళు. నాచురలిస్టులు అంటే పరిణామవాదులు బౌద్ధుల్లాగా, శాక్తుల్లాగా ఈ ప్రపంచం ఇప్పుడున్నట్టు మరు నిమిషంలో ఉండదని చెప్తారు' అన్నాడు ప్రొఫెసరు. ఇంకా ఇలా చెప్పాడు.

'నా దృష్టిలో ఆ దర్శనాలు రెండూ కలిస్తేనే పూర్ణసత్యం. ఈ యూనివెర్స్ నిశ్చల సూత్రాల ప్రకారం నడుస్తోంది. కాని ఆ సూత్రాల్ని కనుగొంటున్నది ఎవరు? మానవుడు. ఆ మానవుడు ఎప్పటికప్పుడు ఇవాల్వ్ అవుతూనే ఉన్నాడు. అందుకనే అతను తాను

చూస్తున్న సత్యాన్ని కూడా ఎప్పటికప్పుడు కొత్తగా క్రియేట్ చేసుకుంటూ ఉన్నాడు. క్రియేటివ్ ట్రూత్. కొత్తగా ఉంది కదూ ఈ మాట!'

'ఇంతకీ నీ దర్శనం ఏమిటి?నువ్వేం చూస్తున్నావు అని నన్ను నిలదీసి అడిగావనుకో. నాకు ప్రకృతి కనిపిస్తూ ఉందనీ, దానిమధ్య ఏమీ అంటని పురుషుడు కూడా కనిపిస్తున్నాడనీ అంటాను. బేసికల్లీ ఐ యామ్ ఏ సాంఖ్యన్' అని కూడా అన్నాడు. 'కాని ఒకటి మాత్రం గుర్తుపెట్టుకో. ఒకటిలేకపోతే రెండోది లేదు. వివేకానందులు అన్నారు. స్పిరిట్ ఆర్ మాటర్. ఉన్నది ఒకటే. కాని ఒకటి లేకుండా రెండోది కనబడదు, అదే మాయ అని అన్నాడు స్వామీజీ' అని గట్టిగా నవ్వడం కూడా గుర్తుంది.

వనలత, ప్రొఫెసరు వెళ్ళాక, యాంత్రొపాలజిస్టు డా. మిశ్రా రావడం వాయిదా పడ్డాక, ఆ రెండు వారాల పాటు ఏం చెయ్యాలో నాకు తెలియలేదు. రెండురోజులు చాలా గ్లూమీగానే గడిచాయి. ఆ తర్వాత మరొక నాలుగైదు రోజులు గడిచేటప్పటికి అడవి పిలుపు వినబడడటం మొదలయ్యింది. మేము రోజూ జీపులో వెళ్ళే ఆ దారి, ముందు ఆ చాపరాయి, ఆ తర్వాత రోడ్డుపక్కనుంచి అడవిలోకి దారితీసే మట్టిదారీ, ఆ దారిపక్క చిన్న కుంట, ఆ కుంట పక్కన వెలగచెట్టూ, ఒకపక్కంగా నేరేడు చెట్ల వనం, ఆ మట్టిబాటమ్మట ముందుకుపోయేక తేటనీళ్ళతో చిన్ని చిన్ని కూనిరాగాలు తీస్తూ పారే కొండవాగూ, ఆ వాగు కూడా దాటేక, వరసగా కొండల వరస– ఆ పూర్వాహ్ణాలూ, ఆ హేమంతకాల ప్రభాతాలు, ఆ పుష్యమాసపు మంచుతెరలూ, ఆ మాఘమాసపు పల్చటి సాయంకాలపు నీడలు– నా చుట్టూ మూగినట్టుగానూ, నా కొంగుపట్టుకుని లాగుతున్నట్టు గానూ ఉండింది.

సేన్‌గుప్తా వెళ్ళేటప్పుడు ఆ జీపు ఎప్పుడేనా వాడుకోవచ్చని చెప్పివెళ్ళాడుగాని, ఊరికే అడవి చూడటానికి ఆ జీపుతీసుకుని పోలేననిపించింది. అలాగని ఒక్కర్తినీ నా అంతటనేను ఆ అడవిదారిన పోలేను. ఇంట్లో ఉన్న చిన్నపిల్లల్ని తీసుకుని సాయంకాలం పూట ఏటి ఒడ్డుదాకా నడవగలనుగాని, వాళ్లని తీసుకుని అడవికి పోలేను. అదీకాక, అడవికి ఎందుకు వెళ్తున్నావు అని అడిగితే ఏం చెప్పను? కొన్ని సాంపిళ్ళ కోసం అని చెప్పవచ్చుగాని, తీరా అడవికి వెళ్ళాక, ఒక్కర్తినీ అక్కడ ఏ కొండదగ్గరికి పోగలను? ఆ రోజు ఆ కొండమీద ఒక్కరినీ చిక్కుపడ్డప్పటి ఆ భయమైతే నన్నింకా వదలనే లేదు.

వారం రోజులు గడిచాయి. అతి కష్టం మీద గడిచాయి. అలాగని నేను ఖాళీగా గడిపానని కాదు. ఇంట్లో పిన్నిగారికి వంటపనిలోనో, ఏదో ఒక పనిలో సాయం చేస్తోనే

ఉన్నాను. పిల్లలిద్దరి చదువు ఎలా సాగుతోందో వివరంగా అడిగాను. వాళ్ల నోట్సులు చూసాను. ఒకటి రెండు సార్లు సూర్యనారాయణగారితో కూడా ఏదో ఒక సంభాషణ కొనసాగించే ప్రయత్నం కూడా చేసాను. కానీ, కాదు, అది సరిపోదు. నువ్వు మాట్లాడే మనుషులు రోజువారీ చిన్న చిన్న విషయాల్ని దాటి మరేదో ప్రగాఢమైన విషయం వైపు నీ దృష్టి మరల్చాలనీ, నువ్వు చూడలేకపోతున్న అందాల్ని చూపించాలనీ, కొత్త పాటలు, కొత్త మాటలు వినిపించాలనీ– మనలో ప్రతి ఒక్కరికీ తెలియకుండానే లోపల్లోపల ఒక బలమైన కోరిక ఉంటుందని ఆ వారం రోజుల్లో నాకు పూర్తిగా తెలిసొచ్చింది.

వారం రోజులు గడిచాక ఒక సాయంకాలం హటాత్తుగా ప్రత్యక్షమయ్యాడు రాజు. వస్తూనే 'మొన్న ఫాల్గుణపున్నమినాడు మీరంతా ఎక్కడికి వెళ్ళారు?' అనడిగాడు.

అసలు ముందు అతణ్ణి చూస్తేనే నాకు ప్రాణం లేచివచ్చినట్టనిపించింది. ఏదో చెప్పలేని సంతోషం ఒక తరంగంలాగా మనసులో ఎగిసిపడింది. ఎందుకని? ఏమో! నన్ను నేను ప్రశ్నించుకోడానికి బదులు–

'పున్నమినా? ఎప్పుడు?' అనడిగాను.

'మొన్ననే. మేం ప్రేమాభిషేకం సినిమా సెకండ్ షోకి పోయి వస్తున్నప్పుడు నా ఫ్రెండ్ అన్నాడు, చూడరా, పున్నమి ఎంత బావుందో అని. అప్పటికి కాకినాడ రోడ్లమీద సెకండ్ షో జనాలు కూడా వెళ్ళిపోయారు. వాడు ఆ మాట అనగానే నాకు మీరే గుర్తొచ్చారు. మీరంటే మీరొక్కరే కాదు, మీ గాంగ్ అంతా గుర్తొచ్చారు' అని అన్నాడు.

అంటే ఆ పున్నమి నాకు తెలీకుండానే నేనింట్లో ఉండగానే వచ్చి వెళ్ళిపోయిందన్న మాట! ఆ చంద్రుడు అడవిదారిన కొండ ఎక్కి, మా ఇంటిమీంచే రాత్రంతా ప్రయాణించి వెళ్ళిపోయాడన్నమాట!

నాకు చెప్పలేనంత బెంగ పుట్టింది. ఉక్రోషం కూడా తన్నుకొచ్చింది. కాని ఎవరి మీదని చూపించడం?

నెమ్మదిగా తేరుకుని 'మీరు అని అంటున్నారు? ఇప్పుడు నేనొక్కర్తినే ఉన్నాను, ప్రొఫెసరు, వనలతా కలకత్తా వెళ్ళారు' అన్నాను.

రాజుకి ఆ సంగతి తెలిసినట్టులేదు. అతనికి ఆ సంగతంతా వివరంగా చెప్పాను. డా.మిశ్రా రావడానికి మరో వారమో, రెండువారాలో పడుతుందేమో, అప్పటిదాకా, చెయ్యడానికి పనేమీ లేదని కూడా చెప్పాను.

'అయ్యో? నాకు చెప్పి ఉండాల్సింది. వెంటనే వచ్చేసి ఉండేవాణ్ణి' అని అన్నాడు. కాని ఎలా చెప్పడం? అది సరే, ఎందుకు చెప్పడం? అతనేమైనా మా ప్రాజెక్టులో మెంబరా? ఆ మాటే అడిగాను, నా గొంతులో నాకే తెలియని కొత్త కొంటెతనం.

'దానికేముంది? నన్ను మీ ఫీల్డ్ అసిస్టెంట్ అనుకోండి' అన్నాడు. 'ఈ రోజే వచ్చాను, మా అమ్మగారు చెప్పారు, మీరు అడిగారట కదా నా గురించి' అని కూడా అన్నాడు.

ముందొక క్షణం నాకు అర్థం కాలేదు, అప్పుడు గుర్తొచ్చింది, మూడు నాలుగురోజుల కిందట ఆమె పిన్ని గారిని కలవడానికి వచ్చినప్పుడు, పలకరించాను. మాటలమధ్యలో రాజు గురించి కూడా అడిగాను. అది మామూలు కుశలప్రశ్ననే. కానీ, మామూలు కుశలప్రశ్ననేనా?

'డన్. ఇంక ఇక్కడే ఉండిపోతాను. ఆ మిశ్రానో ఎవరో ఆయన వచ్చేదాకా మీకు నేనే కంపెనీ' అన్నాడు.

'మరి మీ చదువు? పరీక్షలు?'

'పరీక్షలు ఏప్రిల్ రెండో వారం నుంచి. కాలేజీలో ప్రిపరేటరీ హాలిడేస్ మూడ్ నడుస్తోంది. అందుకనే వచ్చేసాను' అన్నాడు.

అతను వెళ్ళిపోతాడేమో అనుకున్నాను, కానీ కదల్లేదు. చూడబోతే డా.మిశ్రా వచ్చేదాకా అతను అక్కడే కూచుండిపోయేటట్టే ఉన్నాడే అనుకున్నాను. పిన్నిగారు మధ్యలో ఒకటి రెండుసార్లు లోపలనుంచి తొంగిచూసారు. మాష్టారు స్కూలునుంచి ఇంటికి వచ్చి కూడా చాలాసేపే అయింది. కాని నేను ఆ ఇంటి వీథరుగుమీదా, అతను ఆ అరుగు పక్కన నులకమంచం మీదా కూచునే ఉన్నాం. అతనేదో మాట్లాడుతూనే ఉన్నాడు.

ఇంతలో మా ఇంటివీథి దాటుకుంటూ తియ్యని గాలి వీచింది.'వేపపూల గాలి! సీతమ్మ ఇంట్లోంచి అయ్యుంటుంది' అన్నాడు రాజు. సీతమ్మ గిరిజనమహిళ. ఆమె ఇంటి ముంగిట్లో పెద్ద వేపచెట్టు. ఆ చెట్టు మొత్తం ఫాల్గుణమాసాన్ని పూసినట్టుంది.

బహుశా రాత్రి ఎనిమిదై ఉంటుంది. ఆకాశంలో కృష్ణపక్ష చంద్రుడు ప్రవేశించాడు. ఎవరింట్లోంచో రేడియోలో సినిమా గీతాలు వినిపిస్తున్నాయి. బహుశా ప్రతి రాత్రీ ఆ వేళకి సినిమాపాటలు వేస్తారేమో! అన్ని నెలలుగా అక్కడ ఉన్నా, ఆ సాయంకాలంలాంటి తీరిక సాయంకాలం దొరకనందువల్ల ఆ పాటలు అప్పటిదాకా నా చెవినపడనేలేదు.

ఆ పాటలు ఇంట్లో అందరూ వింటున్నట్టుగా కొన్ని క్షణాల నిశ్శబ్దం అల్లుకుంది. బహుశా అప్పటికి రాత్రి వచ్చే చివరిబస్సు కూడా వచ్చి వెళ్ళిపోయి ఉంటుంది. మామూలుగా ఆ ఊరు ఏడూ, ఏడున్నరకే మాటుమణిగిపోతుంది. పిల్లలు వెన్నెలరాత్రుల్లో వీథుల్లో ఆటలాడుతూ ఉంటారు. చీకటి రాత్రులు మొదలయ్యాయి కాబట్టి పిల్లల ఆటలు కూడా సద్దుమణిగాయి. ఎక్కడో దూరంగా కొండవార అడవిలో ఏదో జంతువు అరుపు వినిపిస్తూ ఉంది.

'అన్నం తిని కూచో అమ్మాయీ' అన్నది పిన్నిగారు. మరి రాజు? అతని భోజనం? అతణ్ణి కూడా భోజనానికి కూచోమని ఆమె అనకుండా నేనెలా అడగ్గలను? కాని అతణ్ణి వీథిలో కూచోబెట్టి నేను భోజనానికి ఎలా లేవగలను? కాని ఆ పిల్లవాడి ధ్యాస మా మాటలమీద లేనే లేదు.

'మీరు తినెయ్యండి. నేను తర్వాత తింటాను' అన్నాను. పిల్లలు కూడా కొంతసేపు నా దగ్గర కూచున్నారుగాని, వాళ్ళు కూడా అన్నం తినడానికి వెళ్ళిపోయారు.

చంద్రుడు మా ఇంటిపక్క చింతచెట్టుదాకా వచ్చాడు. మా ఇంటి చూరుమీంచి కిందకి వాలి వెన్నెల ఇంటివాకిట్లో పూర్తిగా పరుచుకుంది. ఇంట్లో కొంతసేపు అన్నాలు వడ్డిస్తున్న చప్పుళ్ళు, ఆ తర్వాత గిన్నెలు సర్దుకుంటున్న చప్పుళ్ళు. కొంతసేపటికి బల్బు కూడా ఆర్పేసారు. పువ్వు పూసినట్టున్న వెన్నెల తప్ప మరే వెలుగూ లేదు.

నాకు ఆ వెన్నెల్లో ఒక్కసారేనా అడవిలోకి వెళ్లిరావాలనిపించింది. కనీసం వకుళకుటి దాకా. ఆ వెన్నెల్లో ఆ కుటీరం దగ్గర మామిడిచెట్ల నీడలు ఒక సెలయేటినీ, ఒక పడవనీ తీసుకొచ్చి మనకోసం వేచి ఉన్నట్టు ఉంటాయని నాకు తెలుసు.

ఆ రాత్రి ఎందుకు ఆ పిల్లవాడితో అంతసేపు అలా కూచుండిపోయాను? అన్నం, నిద్ర కూడా పక్కనపెట్టి, ఇంట్లో వాళ్ళు ఏమనుకుంటారో అన్న ఆలోచన కూడా వదిలిపెట్టి ఎందుకలా ఉండిపోయాను? తెలియదు. నిజానికి అప్పుడు నేను ఆ పిల్లవాడి ప్రెజన్సుని ఫీలయ్యానా లేక ప్రొఫెసరు, వనలతల సన్నిధిని తలచుకుంటూ ఉన్నానా లేక ఇవేమీ కాక, ఆ వెన్నెలనీ ఆ వేపపూల తెమ్మెరనీ, ఆ అడవి నిశ్శబ్దాన్నే అనుభవంలోకి తెచ్చుకుంటూ ఉన్నానా? రాజు మధ్యమధ్యలో ఏదో మాట్లాడుతూనే ఉన్నాడు, నేను వింటూనే వున్నాను గానీ, ఆ మాటలు ఆ నిశ్శబ్దాన్ని మరింత చిక్కబరుస్తూనేఉన్నాయి. కొంతసేపటికి మా ఇంటికెదురుగా ఉన్న రామకోవెలల్లో నీళ్ళు వదిలినట్టుగా కటకటాల్లోంచి వెన్నెల ధారలాగా పడటం మొదలయ్యింది. పక్కింటినుంచో మరెక్కడినుంచో వినబడుతున్న రేడియో కూడా ఆగిపోయింది.

నాకు ఆవులింతలు రావడం మొదలయ్యింది. చెయ్యి అడ్డుపెట్టుకుని ఆపుకుంటున్నాను. కాని 'మంచిది రాజూ, గుడ్ నైట్' అని మాత్రం చెప్పలేకపోయాను.

మరికొంతసేపటికి ఎక్కడినుంచో చిన్న చిన్న గంటల చప్పుడు లయబద్ధంగా వినబడటం మొదలయ్యింది.'ఎడ్ల బళ్లు ఇప్పుడే ఏటివైపు నుంచి ఊళ్ళో అడుగు పెట్టినట్టున్నాయి. ఎక్కడికో వెళ్తున్నాయి' అన్నాడు.

అనుకోకుండానే నా మనసు ఆ గంటలచప్పుళ్ళో లీనమయ్యింది. ముందు దూరంగా, మంద్రంగా, నెమ్మదినెమ్మదిగా, దగ్గరగా వస్తున్న కొద్దీ బిగ్గరగా వినబడుతూ వున్న ఆ ఎడ్లమెడలో గంటల చప్పుడు మా వీధి చివర రోడ్డుమీదకి వచ్చేటప్పటికి, ఒక నాట్యబృందం నడిచివెళ్తున్నంత సంరంభం వినిపించింది. మరికొన్ని క్షణాల్లో ఆ చప్పుడు మళ్ళా మంద్రంగా, దూరంగా, నెమ్మదిగా, మరింత దూరంగా జరిగిపోతూ ఉంది. ఇంకొంచెం సేపటికి అవి ఆ మామిడిచెట్ల నీడల్లోంచి, వకుళకుటిదాటి ముందుకు సాగిపోతున్నాయని తెలుస్తోంది. చివరికి మృదువుగా ఆ గంటల చప్పుడు ఒక ప్రకంపనగా మారి, ఆ మీద ఒక నీడలా వెన్నెల్లో కలిసిపోయింది.

ఆ ఎడ్లబళ్ళు ఆ ఊరికి ఉత్తరాన ఉన్న ఏరుదాటి దక్షిణాన ఉన్న చాపరాయిదాటడానికి అరగంటనో, ముప్పావుగంటనో పట్టి ఉంటుంది. బహుశా ఆ బండివాళ్లకి కునికిపాట్లు మొదలయ్యుంటాయి. వాళ్లు ఆ ఎడ్లని అదిలించడం మానేసి ఉంటారు. వాటి తోవ వాటికి తెలుసనీ, నెమ్మదిగా అవి తమ దారి తాము వెతుక్కుంటూ పోగలవన్న నిశ్చింత లో ఉండి ఉంటారు. లయబద్ధంగా వినబడ్డా ఆ గంటల చప్పుళ్ళో ఆ బండివాళ్ల నిశ్చింతనే ఎక్కువ వినబడింది నాకు.

అప్పటిదాకా మేమేదో వాద్యసంగీతం విన్నట్టుగా, ఆ కచేరీ పూర్తయినట్టుగా, 'ఇక వస్తాను' అని లేచాడు రాజు. నేను కూడా అరుగు దిగి, కంచెదాకా వెళ్లాను. అతను తలుపు తీసుకుని బయటకి అడుగుపెట్టాడు.

ఒక యువతి, ఒక యువకుడు, చుట్టూ వెన్నెల. కాని ఆ ఇల్లు, ఆ వీధి, ఆ ఊరు ఎంత నిశ్చింతగా నిద్రపోతూ ఉన్నాయి!

❋

15

డా. మిశ్రా ఉగాదివెళ్ళేక వచ్చాడు. అంతదాకా అడవినీ, కొండనీ పొలాల్నీ, ప్రకృతినీ మాత్రమే చూస్తూ వచ్చిన నాకు ఆ రెండువారాలూ ఆ ఊరు దగ్గరగా పరిచయమైంది. ఇంకా చెప్పాలంటే ఆ రెండు వారాలూ నేను ఆ ఊరికి అతిథిగా గడిపాను. అది ఎటువంటి ప్రపంచం కానివ్వు, చివరికి, నువ్వుండే సిటీలో, టౌనులో లేదా గ్రామంలో నువ్వు రోజూ జీవించే రోజువారీ జీవితమే కానివ్వు, నువ్వు అందులో భాగం అని కాకుండా, ఒక ఆగంతుకురాలిగా, ఒక అతిథిగా జీవించి చూడు. ఎంత కొత్త ప్రపంచం సాక్షాత్కరిస్తుందో ఊహించలేవు. మనుషులు దూరదేశాలకీ, తాము ఎన్నడూ చూసి ఉండని ప్రాంతాలకీ యాత్రలు చేయాలనుకోడానికీ, ప్రతి ఏడాదీ తీర్థయాత్రలకు బయల్దేరడానికీ కారణం ఇదే అనుకుంటాను. తమ హేబిట్ నుంచి, తమకి చిరపరిచితమైన హేబిటాట్ నుంచి బయటికి పోతే తప్ప తమ జీవితం కొత్తగా కనిపించదు. కానీ, ఆ రెండువారాల్లో ఆ ఊళ్లో నేను చూసిన ఇంద్రజాలం నా జీవితాన్నంతటినీ వెలిగించగల ఒక మంత్రాన్నిచ్చింది. అదేమంటే నువ్వెక్కడికీ పోనక్కర్లేదు. నీ మామూలు జీవితమే, కాని ప్రతి రోజూ కొత్త ప్రదేశంలో నిద్రలేచినట్టుగా నీ రుటీన్‌లో అడుగుపెట్టు. రోజూ చూసే మనుషులే, కాని కొత్త మనుషుల్ని చూస్తున్నట్టుగా, ఆ వండర్‌తో, ఆ క్యూరియాసిటీతో వాళ్ళకేసి చూడు, వాళ్ళు చెప్పే మాటలు విను. ప్రతి రోజూ పొద్దున్నే నీకు తారసపడే వదనాల్లో వాళ్ళు కితం రాత్రి కన్న కలలజాడల్ని పోల్చుకోడానికి ప్రయత్నించు అని చెప్పింది.

ఇదుగే, ఇన్నేళ్ళ తరువాత, ఇక్కడ ఈ నగరంలో కూచుని, నేనొకప్పుడు తిరుగాడిన ఆ అడవినీ, నివసించిన ఆ ఊరునీ, దర్శించిన ఆ కొండల్నీ గుర్తుచేసుకోబోతుంటే నా కిటికీ పక్క పసుపుతురాయి చెట్టు నా జ్ఞాపకాల్ని తను కూడా పంచుకుంటున్నట్టు

కనిపిస్తోంది. పొద్దుణ్ణుంచీ ఆ చెట్టు మీద ఎన్ని పిట్టలు వచ్చి వాలతాయి! చూస్తుంటే, ఆ చెట్టు పక్షుల అభయారణ్యమా అనిపిస్తోంది. పొద్దున్నే ఎక్కణ్ణుంచో ఒక ఒరియోల్ వచ్చి వెళ్తుంది. ఆ తర్వాత నాలుగైదు చిలకలు చెట్టంతటినీ కొమ్మ, కొమ్మనీ పలకరించి వెళ్లిపోతాయి. ఆ తర్వాత ఒక స్పాటెడ్ డోవ్. దాన్ని అడవిలో విన్నప్పుడల్లా అప్పుడే అడవి నిద్రమేల్కొంటున్నదా అనిపించేది. చివరికి మధ్యాహ్నాలవేళల్లో కూడా దాని కూత వినబడగానే అడవి దుప్పటి తొలగించి అదెక్కడుందో చూసుకుంటోందో అనిపించేది. ఆ తర్వాత రెడ్ వెంటెడ్ బుల్బుల్, బ్లాక్ బుల్బుల్, పిచికలు, పావురాలు, గోరువంకలు ఆ చెట్టు తలుపులు నాలుగు వేపులా బార్లా తీసి వెళ్ళిపోతాయి. ఇక రోజంతా చిన్న చిన్న హనీ సకిల్స్ ఆ పూలగిన్నెల మూతలు తీస్తూనే ఉంటాయి. కొన్ని మూతలు కిందపడిపోతూ ఉంటాయి. ఆ చప్పుడు కళ్ళకి మాత్రమే వినబడుతూ ఉంటుంది. అప్పుడప్పుడు ఆ అభయారణ్యంలో కొత్త అతిథి కాపర్ స్మిత్ బార్బెట్. అది రాగానే చెట్టు ఒక కొలిమిగా మారిపోతుంది. ఆ పిట్ట చిగుళ్ళూ, పూలూ పోతపోసి కాంతిని చెక్కుతూ ఉంటుంది. దాని నుదుటిమీదా, వక్షస్థలమ్మీదా ఆ కొలిమి మంటలు సిందూరవర్ణాలై మెరుస్తాయి. అడవిమొత్తాన్ని ఒక్కసారిగా గొంతులోకి తీసుకున్నట్టుగా మింగేసి మళ్ళా పుక్కిలించి ఉమ్మినట్టుగా వినిపించే దాని కూజితం ఒక్కటి చాలు, ఈ రోజు మొత్తం వెలిగిపోయిందని నా డైరీలో రాసుకోడానికి.

ఆ రెండువారాలూ మరే పనిలేకుండా, పొద్దున్న లేవగానే ఒకరిదగ్గరకు వెళ్ళి నిలబడ వలసిన అవసరం లేకుండా, సాయంకాలం అయ్యేటప్పటికి, ఆ రోజు చేసిన పని ఒకరికి రిపోర్టు చెయ్యవలసిన బరువుబాధ్యతలేమీ లేకుండా గడిపాను. చెట్లు ఎలా పెరుగు తున్నాయో, రోజూ ఎంత పెరుగుతున్నాయో మన కళ్ళకి కనిపించకుండానే, ప్రతి క్షణం పెరుగుతూనే వున్నట్టు, కొండలు యుగాల కాలమానంలో అంగుళాల దూరం జరిగినట్టు, ఆ పల్లెటూళ్ళో కూడా మనుషులు ముందుకు నడుస్తోనే ఉంటారు, పిల్లలు ఎదుగుతూ ఉంటారు, కన్యలు పెళ్ళీడుకు వస్తారు, నవవధువులు బాలెంతలుగా మారతారు, రైతులు వృద్ధులవుతారు, వాళ్ల పిల్లలు కొత్తగా మేడిపడతారు, ఇప్పుడే గిత్తలుగా కనిపిస్తున్నవి, ఇంతలోనే ఎడ్లుగా ఎదిగి మెడకు కాడి తగిలించుకుంటాయి. ఏమీ జరగనట్టుగా, ఎటూ కదలనట్టుగా, ఏమీ పట్టనట్టుగా, తనలో తను, తనకోసమే తను అన్నట్టుగా ఉండే ఆ ఊళ్ళో, నువ్వు కళ్ళప్పగించి చూడాలే గాని, అనుక్షణం జీవితం ముందుకో, వెనక్కో, పక్కకో జరుగుతూనే ఉంటుంది. ఇంతలో సంతోషం, ఇంతలో విచారం, ఇంతలో కోపాలు, ఇంతలో శోకాలు, ఇంతలో తాపాలు, ఇంతలో ఓదార్పు– బహుశా ఒక మనిషి తనను

తాను మర్చిపోడానికి ఒక గ్రామం కన్నా తగిన చోటు మరొకటి ఉండదేమో!

అంతకు ముందు పొద్దున్నే ఫీల్డువర్కు కి పరుగెత్తే తొందరలో మా ఇంటి ఎదురుగానే ఉన్న స్కూలు మీద నా దృష్టి పడనేలేదు. రామకోవెల్లో నడిచే ఆ స్కూల్లో ఇద్దరు ఉపాధ్యాయులు. ఒకరు పంతులమ్మగారు, పెద్దామె. మరొకరు ఉపాధ్యాయుడు, యువకుడు. ఆమె పెద్ద క్లాసులకి పాఠం చెప్పేవారు. ఆ క్లాసులు రామకోవెల లోపల జరిగేవి. ఆ మందిరానికి చుట్టూ ఇనపకటకటాలు. ఆమె చెప్పే పాఠాలూ, పిల్లలు అప్పచెప్పే పాఠాలూ కూడా ఊరంతా వినబడుతూనే ఉండేవి. ఆ ఉపాధ్యాయుడు చిన్న తరగతులకి చదువు చెప్పేవాడు. ఆ క్లాసులు రామమందిరం బయట అరుగుమీద నడిచేవి. గోడలూ, తలుపులూ లేని అరుగు అది. ఆ పిల్లలు అక్షరమాల, అంకెలు, ఎక్కాలు గట్టిగా చదివేవారు. లోపలా, బయటా ఆ పిల్లలు గట్టిగా అక్షరాలూ, లెక్కలూ, పద్యాలూ అప్పగిస్తుంటే ఊరంతా పాఠం చదువుకుంటున్నట్టు ఉండేది.

రోజూ పొద్దున్న పది పదిహేను నిమిషాల పాటు హాజరు తీసుకునే రిచ్యువలు నడుస్తూ ఉండేది. పంతులమ్మగారూ, పంతులయ్యా కూడా ఎవరికి వారు ఒకేసారి హాజరుపట్టీలోంచి పిల్లల పేర్లు గట్టిగా చదివేవారు. పేరు చదవగానే పిల్లలు ప్రెజంట్ సార్ అని అరిచేవారు. వారం రోజులు ఆ హాజరు పిలుపులు విన్నాక, ఆ పేర్లన్నీ నా నోటికి కూడా వచ్చేసాయి. అన్ని పేర్లూ అయిపోయాక, పంతులమ్మగారూ, 'ఎస్. విమలా' అని గట్టిగా పిలుస్తారని ఎదురుచూసేదాన్ని. నాలో నేనే మనసులో 'ప్రెజంట్ టీచర్' అని చెప్పుకునేదాన్ని. నేనక్కడ ఉండగానే ఆ స్కూలు రామకోవెల నుంచి కొత్తబళ్ళోకి వెళ్ళి పోయింది. ఆ ఉపాధ్యాయులు ఇప్పుడెక్కడున్నారో తెలీదు. నలభయ్యేళ్ళ కిందటి ఆ హాజరు పట్టీలు ఇంకా ఆ స్కూల్లో ఉండే అవకాశమే ఉండదు. కానీ, ఎవరేనా వెతికితే, బహుశా, ఆ పట్టీల్లో ఆ మార్చి నెలలో, ఆ పేర్లన్నిటి కిందా, ఒక అదృశ్యలిపిలో నా పేరు కూడా కనిపిస్తుందనే నా నమ్మకం.

పిల్లలు బడికి వెళ్ళే వేళకి అటూ ఇటూగా ఆవుల్నీ, మేకల్నీ మేతకు తోలుకుపోయే దృశ్యం కనిపిస్తుండేది. పిల్లలకు బడి, పశువులకు పచ్చిక ఉన్నంతకాలం ఆ ఊరుకి మరిదేంతోనూ పనిలేదన్నట్టే ఉండేది. అదే సమయానికి ఇళ్ళల్లో వంటలు మొదలయ్యేవి. ఆ ఇళ్ళగడ్డికప్పు మీంచీ, తాటాకు కప్పులమీంచీ వంటపొగ బరువుగా చుట్టలు చుట్టుకుంటూ పైకి లేచే దృశ్యం కళ్ళముందు నుంచి ఇప్పటికీ పక్కకి జరగడం లేదు. అనాది కాలం

నుంచీ మనుషులు ఆకాశానికి అల్లిన తీగల్లాగా ఆ వంటపొగ చింతచెట్లకీ, వేపచెట్లకీ, మామిడిచెట్లకీ నులితీగలు అల్లుకునేది.

పొద్దున్న బడి అయిపోయేలోపు ఇటునుంచి రెండు బస్సులూ, అటునుంచి రెండు బస్సులూ వచ్చి ఆగేవి. ఒకరో, ఇద్దరో దిగేవారు. ఒకరో, ఇద్దరో ఎక్కేవారు. మరో ఊరికి వెళ్ళవలసిన పనిలేకుండానే, మరొకరికి ఉత్తరం రాయవలసిన పనిపడకుండానే ఆ ఊళ్ళో చాలామందికి జీవితం నడిచిపోయేది.

మధ్యాహ్నం బడి విడిచిపెట్టాక ఊరంతా మాటుమణిగిన అర్ధరాత్రిలాగా ఉండేది. ఆ అపరాహ్ణంలనిశ్శబ్దాన్ని భంగం చెయ్యడానికి ఎవరికీ ఇష్టం ఉండేది కాదనుకుంటాను. మళ్ళా రెండుగంటల తర్వాత స్కూలు గంటకొట్టగానే ఊళ్ళో నెమ్మదిగా చలనం మొదలయ్యేది. మూడింటికి అటూ ఇటూగా ఎవరో ఒకరు పక్కింటికి నిప్పు కోసం బయల్దేరే వారు. రేడియో సిలన్ లోంచి మీనాక్షి పొన్నుదొరై మృదుమధుర కంఠస్వరంలో అనౌన్స్‌మెంట్లు మొదలుపెట్టేది. ఇక వరసగా పాటలు వినిపించేవి.

బళ్ళో పొద్దున్న వినిపించినంత గట్టిగా మధ్యాహ్నం పూట పాఠాలు వినిపించేవి కావు. సాయంకాలం బడి విడిచిపెట్టేటప్పుడు పిల్లలకి ఉప్మా పెట్టడం కోసం వంట ఏర్పాట్లు మొదలయ్యేవి. మూడున్నరకో, నాలిగింటికో ఆటలు ఆడించేవారు. పిల్లలకి ఉప్మా పెట్టి జనగణమన పాడించి పంతులమ్మగారూ, పంతులయ్యా వెళ్ళిపోయేవారు. కాని పిల్లలకి ఆటల్లోంచి బయటపడటం అంత సులువుగా ఉండేది కాదు. ఆ తర్వాత చాలాసేపటిదాకా, పిల్లలు వాళ్లకు తెలిసిన ఆటలు వాళ్ళు ఆడుకుంటూనే ఉండేవారు.

'పులొచ్చే మేకా, దాంకో మేకా ..'

'వచ్చొచ్చె గిల్లకోడి, పారిపో రామచిలక..'

'డబ్బుకు రెండు ద్రాక్షపళ్ళు, చీనాపిల్ల, నీకేం తెలుసు, నాకేం తెలుసు, ఆఖరిపిల్లను పట్టుకోండోయ్..'

ఇంకా సాయంకాలం కాకముందునుంచే చింతపండు గంపలూ, కావిళ్ళూ, బుట్టలూ పట్టుకుని గిరిజనులు గిరిజన కార్పొరేషను ముందు బారులు తీరేవారు. పిక్కతీసిన చింతపండూ, తియ్యనిదీ వేరువేరుగా కొనుగోలు నడిచేది. పొడుగ్గా రెండు వరసల్లో తమవంతు వచ్చేదాకా కొండరెడ్లు ఓపిగ్గా నిలబడేవారు.

సాయంకాలానికి మళ్లా ఆవులూ, మేకలూ ఊళ్ళో అడుగుపెట్టేవి. అవి నడిచినంతమేరా ఎర్రని దుమ్ము పైకి రేగేది. ఏదో వింత వాసన గాలంతా అల్లుకునేది. ఊరూరా ఐసు ఫ్రూట్లు అమ్ముకునే ఐసుడబ్బావాళ్ళు హారను మోగించుకుంటూ వెళ్ళి పోతూండేవారు. అప్పటిదాకా చెట్టుమీద చింతబొట్టలు రాళ్ళతో కొట్టికొట్టీ పిల్లలు పిడికెడు చింతపండు చేత్తోపట్టుకుని ఆ ఐసుఫ్రూట్లవాళ్లకోసం ఎదురుచూసేవాళ్లు. చెట్టుకి కాసిన పండ్లు వాళ్లకిచ్చి ఏ చెట్టుకీ కాయని పండ్లు కొనుక్కునేవారు. అప్పటికే కరిగిపోయిన ఐసుఫ్రూట్లలో తీపిదనం తగ్గిపోయి ఉండేది. ఆ పిడికెడు చింతపండుకి ఒకటో రెండో ఐసుఫ్రూట్లు దొరికేవి. పిల్లలు వాటిని జుర్రుకునేవారు. ఐసంతా కరిగిపోయి మిగిలిన పుల్లల్ని కూడా పీల్చుకునేవారు. ఏ సుగంధమో వాటినింకా అట్టిపెట్టుకుని ఉండిపోయిందనే సంతోషం వాళ్ల కళ్లల్లో కనిపించేది.

రోడ్డుకి అవతల పక్క చింతచెట్లమీద కొంగలు తపసు మొదలుపెట్టేవి. ఆ చెట్లకింద ఇళ్ళముందు ఎర్రగా విప్పారిన బోగన్‌విల్లియా మసకచీకటిలో కూడా మిలమిల్లాడుతుండేది.

పగలంతా పనికి వెళ్ళిన కొండరెడ్లు సాయంకాలం కిరాణా దుకాణం దగ్గర టీపాకెట్లు, బెల్లంపాకెట్లు, ఉప్పూ, మిరపకాయలూ కొనుక్కోడానికి మూగేవారు. కొంతసేపటికి వీథుల్లో పాదచారుల అడుగుల చప్పుళ్ళు పలచబడేవి.

కొండరెడ్ల ఇళ్ళల్లో ఉడుకునీళ్ళతో స్నానం చేస్తున్న చప్పుడు వినిపించేది. ఆ ఆడవాళ్ళు తమ భర్తలకి దగ్గరుండి వీపురుద్ది మరీ స్నానం చేయించే దృశ్యాలు కనిపించేవి.

సాయంకాలం బస్సులు కూడా వెళ్ళిపోయాక కమ్యూనిటీ రేడియోలో వార్తలో, పొలంపనుల మాటలో వినిపించేవి. కొంతసేపటికి ఆ రేడియో కూడా కట్టేసేవారు. ఎవరింట్లోనో కోడిని కాలుస్తున్న వాసనో, లేదా మసాలా కూరలు వండుకుంటున్న వాసనో ఘాటుగా పలకరించేది. దినాంతం సంపూర్ణమయ్యాక అప్పుడు మళ్లా విజయవాడ, విశాఖపట్టణం, ఒక్కొక్కప్పుడు కడప రేడియో నుంచి కూడా పాటలు వినిపించేవి.

'వగల రాణివి నీవే, సొగసుకాడను నేనే..'

'పచ్చబొట్టూ చెరిగిపోదులే నా రాజా పడుచుజంటా చెదిరిపోదులే..'

'కోడికూసే జాముదాకా తోడురారా చందురూడా..'

'నీ కోసం వెలిసిందీ ప్రేమమందిరం నీ కోసం వెలిసిందీ హృదయనందనం..'

'ఏ తీగ పూవునో, ఏ కొమ్మ తేటినో..'

'చిన్న మాటా, ఒక చిన్న మాటా..'

అప్పుడు వేపచెట్లమీంచీ, పక్కింటి పందిరిమీద విరబూసిన రాధామనోహరం గుబుర్లలోంచీ పూలతావి గాల్లో అడుగుపెట్టేది. ఆ కృష్ణపక్షపు రాత్రుల్లో ముందు చుక్కలు ఉదయించేవి. నెమ్మదిగా ఏ రాత్రికో చంద్రుడు తీరిగ్గా వచ్చేవాడు.

దూరంగా కొండలమీద ఎండిపోయిన అడవులు మండిపోతూ కనిపించేవి. కానీ కొండమీద మంటలని గట్టిగా చెప్పకూడదనే వారు. వేలితో చూపించకూడదనే వారు. రాత్రిపూట ఆకాశంలో వెలిగే చుక్కల్లాగా కొండలమీద ఆ మంటల వరసలు కూడా మౌనంగా చూస్తూ ఉండవలసిన దృశ్యంగానే కనిపించేవి.

దాదాపుగా ప్రతి సాయంకాలం రాజు వచ్చి పలకరించేవాడు. రాత్రి బాగా పొద్దుపోయేదాకా కూచుండిపోయేవాడు. అప్పటికి మా ఇంట్లో సాయంకాలం అన్నాలు పూర్తయిపోయేవి. ఏవేవో కబుర్లు చెప్తుండేవాడు. ఆ కబుర్లకి తలాతోకా ఉండేది కాదు. ఉండాలని కూడా నేను అనుకోలేదు. అతను వచ్చేక, అప్పటిదాకా నేనొక్కతినే ఆస్వాదిస్తూ ఉన్న నిశ్శబ్దం, అతని మాటల్తో మరింత మెత్తబడేది. ఆ నిశ్శబ్దంలో అడవి మీంచి వీచే కొండగాలి కలిసి ఉండేది. ఏటి ఒడ్డున విరిగిపడే చిన్నచిన్న అలల గలగల కలగలిసి ఉండేది. ఉండీ ఉండీ అడవిలోంచి వినిపించే ఏ జంతువు అరుపులో ఆ నిశ్శబ్దానికి వన్నెపెట్టేవి.

తర్వాత రోజుల్లో డా.మిశ్రా ఆ ఊరిని ఎంతేనా విమర్శించి ఉండవచ్చుగాక, నాకు మాత్రం ఆ ఊరు గుర్తురాగానే ఆ నిశ్శబ్దమే గుర్తొస్తుంది. ఆ నిశ్శబ్దాన్ని వినడం నేను ప్రొఫెసరు సేన్‌గుప్త దగ్గరే నేర్చుకున్నాను. అడవిలానే, కొండలానే ఊరు కూడా నువ్వు దానిముందు నిలబడి ఏమని పిలిస్తే అదే బదులిస్తుంది.

వసంతఋతువు వెలుగు ముందు కనిపించేది ఫాల్గుణమాసపు చివరి రెండు వారాల్లోనే. అది పెళ్ళి వేడుకకి ఎదురుసన్నాహంలాగా, పండగ ముందురోజు సాయంకాలం లాగా, జెండాపండగ ముందు రోజు రాత్రిలాగా, ఒక ఆగమనం కోసం ఎదురుచూడటంలో ఉండే సంతోషం. స్నేహితులూ, బంధువులూ వస్తారంటే ఇల్లు అలంకరించిపెట్టుకున్నట్టుగా, వసంతం కోసం ఊరూ, అడవీ కూడా ముస్తాబయ్యేవేళ అది. కొండరెడ్లకి చైత్రం చాలా పెద్ద పండగ. అందుకని ఫాల్గుణమాసపు చివరిదినాల్లోనే వాళ్ళు అన్ని ఏర్పాట్లూ చేసి పెట్టుకునేవారు. ఊరంతా కలకలంగా ఉండేది.

మా ఇంటిపక్క చింతచెట్టు కూడా చిగురించడం మొదలుపెట్టింది. లేతాకుపచ్చనీ, లేతఎరుపునీ చిగురించే చింతచెట్టు పుడమి నీళ్ళుపోసుకున్నట్టుండేది. అంతదాకా రామకోవెలకి ఆవతల పక్క ఒక రావిచెట్టు ఉన్నదే నేను గమనించలేదు. మాఘమాసమంతా ఒక్క ఆకుకూడా మిగలకుండా రాల్చేసిన ఆ చెట్టు ప్రతి కొమ్మకీ, రెమ్మకీ చిన్న చిన్న జెండాలు తగిలించుకున్నట్టు, రంగురంగుల దీపాలు వెలిగించుకున్నట్టు చిగురించడం మొదలయ్యింది. రావిచెట్టు చిగురించే రోజుల్ని చూడటమే ఒక పండగ. ఆ చెట్టు చిగురించడం సప్తాహంలాగా, దశాహంలాగా నడిచింది. ఆ చెట్టు చిగురిస్తున్నంతకాలం ఊళ్ళో ప్రతి ఒక్కరూ తామే పనిలో ఉన్నా, మేలుకుని ఉన్నా, నిద్రపోతున్నా కూడా ఆ చెట్టువైపు ఒక చెవి వేసి ఉంచేవారనే అనిపించింది.

చిగురిస్తున్న రావిచెట్టునీ, చింతచెట్లనీ చూసాక నాకు అడవిమీద మరీ బెంగపుట్టింది. అప్పటికే రెండువారాలు గడిచిపోయింది. చేయి చాస్తే అందేటంత దూరంలో అడవి ఉండి కూడా అందుకోలేకపోతున్నాననే బాధ మొదలయ్యింది. ఇక ఒకరోజు ఉండబట్టలేక రాజుని అడిగాను, ఒకసారి అడవికి పోయి రావాలని ఉంది, వస్తావా అని.

ఇంట్లో ఏదో చెప్పాను. వాళ్ళు కూడా ఏమీ అడగలేదు. సరేనన్నారు. పొద్దున్నే ఏడుగంటలకల్లా ఊరుబయట చాపరాయి దాటి వెలగచెట్టుకీ, నేరేడు వనానికీ మధ్యనుండే మట్టిబాటకు చేరుకున్నాం. రాత్రంతా కురిసిన మంచుకి ఇంకా పచ్చిక మెత్తగానూ, తేమగానూ ఉంది. అప్పుడప్పుడే పరుచుకుంటున్న సూర్యకాంతికి అడవి నిద్రమేల్కొంటూ ఉంది. మేము మరికొంత దూరం నడిచేటప్పటికి, చుట్టూ కాలిబాటలుగాని, కరెంటు స్తంభాలుగాని, తారురోడ్లూ, బస్సుల, లారీల హోరను మోతలూ లేని చోటుకి చేరుకునేసరికి అడవి నిర్మలసౌందర్యంతో ప్రత్యక్షమయింది.

రెండువారాల కింద ఆ అడవి నిండా పరుచుకున్న రాగిరంగు, బూడిదరంగు, జేగురురంగుల స్థానంలో ఇప్పుడు లేతపసుపు, బంగారం, నునులేత ఎరుపు, హరితం– కొత్త కొత్త రంగులు కనిపిస్తూ ఉన్నాయి. నిన్నటిదాకా ఎండిపోయి బోలుగా ఊళ పెడుతున్నట్టుండే ఎండిన తరుకాండాల చుట్టూ ఇప్పుడు లేతాకుపచ్చని సంగీతం ప్రసరిస్తున్నట్టుంది. తల్లికన్నా ముందే నిద్రలేచి తల్లి కొంగుతో ఆడుకునే బిడ్డల్లాగా ఎన్నెన్నో పక్షులు ఆ అడవితో ఆడుకుంటున్నాయి. ఇప్పుడిప్పుడే పత్రవృంతాల్లో తలెత్తుతున్న లేత చిగుళ్ళ గుసగుస ఆ అడవిని సునాదభరితం చేస్తున్నది. కొండమామిడి చెట్ల పైనున్న కొమ్మల్లో లేత ఊదారంగు, ముదురు ఎరుపురంగు, లేతపసుపురంగు చివుళ్ళు జెండాల్లాగా కదలాడుతున్నాయి. ఇప్పుడిప్పుడే ఆకులు విచ్చుకుంటున్న నల్లమద్ది, సంద్ర, రేల, మోదుగ

చెట్లతో పాటు నెమలి చెట్లు తళుకుటద్దాల చీర ధరించినట్టుగా కొత్త చిగుళ్ళతో మిలమిలా మెరిసిపోతున్నాయి.

వానలు మొదలవగానే తూర్పుకనుమలనుంచి వలసపోయిన పక్షులు, సీతాకోక చిలుకలు, తేనెటీగలు, తుమ్మెదలు మళ్ళా అడవి బాటపట్టినట్టుంది. గుంపులుగుంపులుగా ప్రతిరోజూ పక్షిసమూహాలు ఆ అడవికి చేరుకుంటున్నట్టుగా ఆ రోజు పొద్దున్నంతా అడవి కోలాహలంగా ఉంది. పూసిన ప్రతి పువ్వు చుట్టూ తేనెటీగలు పరిభ్రమణాలు మొదలు పెట్టాయి. చెట్లబెరళ్ళమీంచి కారుతున్న తొలి పాలచారికలమీద కూడా చీమలు బారులు కట్టాయి. వడ్రంగిపిట్టలు చెట్లనీ, అడవినీ కూడా నిద్రపోనివ్వనట్టే ఉంది. ఊరికే మారాం పెట్టే పిల్లల్లాగా స్కైలార్కులు అడవిలో గీపెడుతున్నాయి. ఎక్కడో ఒక పక్షి ఆగీ ఆగీ నీటిబొట్లు పడుతున్నట్టుగా ఉండీ ఉండీ కూతపెడుతున్నది. ఒక బుల్బులు తెల్లవారింది రండహో అని ఎక్కడెక్కడి పిట్టల్నీ బాకా పెట్టి ఊదినట్టు మరీ పిలుస్తున్నంత హడావిడి చేస్తోంది. ఒక దర్జీపిట్ట పండగరోజుల్లో సద్గురుమూర్తి మిషనులాగా రాత్రంతా కూడా గాలిని కాంతిపోగులుగా నేసినట్టుంది. ఎక్కడచూసినా సాలీడు దారాలకన్నా పలచని గోసమేర్లు. మరీలోపల అడవిలో ఒక పిట్ట తాను నేర్చుకున్న పురాతనగీతాన్ని ఎక్కడ మర్చిపోతుందో అన్నంత ఆత్రుతతో తొందర తొందరగా అప్పగిస్తున్నట్టుగా కూతపెడుతూ ఉంది. ఆ పక్షిరుతాలు రంగురంగుల గాలిబొంగరాల్ని గిరగిరాతిప్పినట్టుగా, రంగురంగుల గాజుల్ని ఏటవాలుగా గాల్లోంచి జార్చినట్టుగా కళ్ళకు కనిపిస్తూ ఉన్నాయి. ఆ మధ్యలో ఎక్కడో ఒక బుల్బులు కూజితం వినిపిస్తూ ఉంది. అది అరిచిన తర్వాత, ఆకాశం మళ్ళా మామూలు కాడానికి కొంతసేపు పట్టేటట్టే ఉంది. ఆ ప్రకంపన చెట్ల ఆకులమీంచి, మొదళ్ళదాకా, అక్కణ్ణుంచి వేర్లమ్మట భూగర్భంలోకీ ప్రసరిస్తున్నట్టుంది.

మేము ఒకరితో ఒకరం మాట్లాడుకోడం కూడా మర్చిపోయి ఆ అడవిదారిన అలాగే ముందుకు నడుచుకుంటూపోయేం. కొండలమీదా, కొండల అంచుల్లోనూ మర్రి, జువ్వి, మేడి, బొడ్డ, రావిచెట్లు చిలకముక్కుల్లాంటి చిగుళ్ళు తొడుగుతుండటంతో ప్రతి కొమ్మమీదా చిలకలు వాలినట్టే ఉంది. మరికొంతదూరం పోయాక ఆ బాట కొండల్లోకి అదృశ్య మయ్యేచోట పెద్ద అడవిబూరుగచెట్టు. ఆ చెట్టు ఒక మహోద్యమంలాగా ఉంది. దాని కొమ్మకొమ్మనా ఎర్రటిపూలు, అప్పటికే పూసి, పండి కిందంతా రాలిపడ్డ పూలు గులాబిరంగు దుప్పటి పరిచినట్టు ఉంది. కొన్ని పూలు కొమ్మలమొదళ్ళలో ఇరుక్కుపోయి ఉన్నాయి. కొన్ని చెట్టు కింద ఉన్న పొదలమీద రాలిపడ్డాయి. కొన్ని పచ్చటితీగలకంపల్లో ఇరుక్కుని ఆ తీగలు కూడా ఆ పూలు పూస్తున్నాయా అన్నట్టున్నాయి. తక్కిన పూలు

సుగంధాన్ని వెదజల్లితే బూరుగపూలు తేనెలు విరజిమ్ముతున్నాయి. ఆ తేనెలు కొమ్మకొమ్మ మీంచీ కారుతూ చారికలు కట్టాయి. నేలమీద రాలిన పూలతేనెకి వేలాది కండచీమలు, చలిచీమలు స్పృహతప్పి పడిపోయి ఉన్నాయి. ఆ చెట్టుకింద కొన్ని క్షణాలపాటు నిలబడ్డాను. ఆ దృశ్యంకోసమే, ఆ నీడ కోసమే, ఆ తేనెవాకలకోసమే నేను అంతలా కొట్టుకుపోయానని అర్థమయింది. చూడవలసింది చూసాను అనిపించింది. వెనక్కి వెళ్దామన్నాను రాజుతో.

ఆ ఫాల్గుణ పూర్వాహ్ణవేళ ఆ అడవిలో నేను చూసిందీ, విన్నదీ గుర్తుతెచ్చుకుని చెప్తున్నానుగానీ, నిజానికి ఆ రోజు అక్కడ నాకు అనుభవంలోకి వచ్చిందాన్ని సుగంధానుభవం అని చెప్పాలి. నాలుగైదు మైళ్ళపొడుగునా ఆ అడవిలో ఒక్క పూలే కాదు, లేతచిగుళ్ళు, లేతకొమ్మలు, కొమ్మలకి కారుతున్న పాలు, చిలకలు కొరికిన పిందెలు, పక్షులు ముట్టిన మొగ్గలు ప్రతి ఒక్కటీ సుగంధాన్నే వెదజల్లుతూ ఉన్నాయి. ఈ రోజు ఇక్కడ కూచుని ఆ ప్రభాతాన్ని తలుచుకుంటూ ఉంటే, సూర్యకాంతికన్నా ముందు, అడవిలో చిగురిస్తున్న ఆకుపచ్చకన్నా ముందు, ఆ బూరుగపూల వాన కన్నా కూడా ముందు ఆ తేనెల వాసనలే నాకు గుర్తొస్తూ ఉన్నాయి. ప్రతి మనిషీ తన జీవితంలో ఒకసారేనా, కనీసం ఒక రోజేనా ఒక కొండ పక్కనుంచి నడిచి వెళ్ళకుండా ఉండడు. ఒక కొండకింద పల్లెలోనో, పట్టణంలోనో బసచెయ్యకుండా ఉండడు. కానీ జీవితంలో ఒకసారేనా, కనీసం ఒక గంటసేపేనా ఫాల్గుణమాసపు అడవి దారిన నడిచివెళ్లినవాళ్ళ భాగ్యమే భాగ్యమని చెప్పగలను.

అక్కడున్నంతసేపూ తృప్తిగానూ, చూడవలసింది చూసినట్టుగానూ ఉండిందిగానీ, మళ్లా ఇంటికి రాగానే మరొకసారి మళ్లా ఆ అడవి దారిన నడవాలనిపించింది. సాయం కాలం పొద్దు కుంకేవేళల్లో పసిడికాంతి ఆ చెట్లమీద పడుతుంటే వాటినీడలు ఒకదానితో ఒకటి అల్లుకుంటూ ఉంటే ఆ దారిన నడిస్తే ఎలా ఉంటుందో చూడాలని పించింది.

రాత్రి మళ్ళా రాజు మా ఇంటికి వచ్చాడు. మాటలు మొదలుపెట్టాడు. ఇంతలో మా ఇంటి ఎదట ఉన్న రామకోవెల్లో హడావిడి వినబడింది. పదిమంది అక్కడ చేరి బిగ్గరగా మాట్లాడుకుంటున్న కలకలం. మధ్యలో బల్లలు, కుర్చీలు లాగిన చప్పుళ్ళు వినబడటం మొదలయ్యింది.

'ఏమిటది?' అనడిగాను రాజుని.

'రామనవమికి మన ఊళ్ళో యూత్ కూడా ఒక నాటకం వేస్తున్నారు. రిహార్సలు మొదలుపెడుతున్నారు ఇవాళ్టినుంచీ' అన్నాడు. 'నన్ను కూడా రమ్మన్నారు' అన్నాడు.

'నువ్వు కూడా వేషం వేస్తున్నావా?'– మీరు అని పిలిచే పిలుపు హటాత్తుగా అనుకోకుండా నువ్వుగా ఎలా మారిపోయిందో నాకే అర్థం కాలేదు. కాని రాజు అదేమీ గమనించినట్టు లేదు.

'వేషమా? అదేం లేదు. కాకపోతే ఊళ్ళో ఏమి జరిగినా, ఏమి చేసినా నన్ను కూడా ఉండమంటారు. నాక్కూడా చిన్న గాంగు ఉంది లెండి' అన్నాడు.

'ఏం నాటకం వేస్తున్నారు?'

'ఏదో సాంఘిక నాటకం. మా చుట్టాలబ్బాయి కనకరాజు డైరక్టరు. గిరిజన కార్పొరేషన్ సేల్స్‌మేనూ, ఫారెస్టుగార్డుగారి అబ్బాయి ప్రకాషూ, ఇంకా చాలామందే ఉన్నారు యాక్టర్లు. వీళ్ళు కాక మనం చూసిన కాంతామతి ట్రూపు వేరే ఉంది. వీళ్ళంతా యూత్ అన్నమాట'

కొంతసేపటికి హడావిడి తగ్గి రిహార్సులు మొదలైనట్టుంది. మొదటి డైలాగులు ప్రాక్టీసు మొదలుపెట్టారు. ఆ మాటలు మా ఇంట్లోకీ వినబడుతున్నాయి.

'అమ్మా, నేటినుంచీ విజయ్ విశాలప్రపంచంలోకి అడుగుపెడుతున్నాడు' అని ఒక గొంతు వినిపించింది.

'అలాకాదు, ఇదిగో ఇలా' అంటో మరో కంఠం. డైరక్టరు తానే స్వయంగా చేసి చూపిస్తున్నట్టున్నాడు.

'ఇదిగో, ఇలా రెండు చేతులూ విశాలంగా చాపి, ఇలా చెప్పాలి: అమ్మా, నేటినుంచీ విజయ్ విశాలప్రపంచంలోకి అడుగుపెడుతున్నాడు.'

ఇంతలో ఎవరో 'టీ వచ్చింది' అంటో అరిచారు.

'సరే, ముందు టీ తాగి చెప్పండి' మళ్ళా డైరక్టరు వాయిస్.

'కాదు సార్, ఫస్ట్ డైలాగ్. బ్రేక్ చెయ్యొద్దు. చెప్పనివ్వండి. ఇదిగో మీరు చెప్పినట్టే, చూడండి'–

'అమ్మా నేటినుంచీ విజయ్ విశాలప్రపంచంలో అడుగుపెడుతున్నాడు..'

కానీ నా మనసింకా ఆ బూరుగపూల నిశ్శబ్దం దగ్గరే తచ్చాడుతూ ఉంది.

❋

16

ఉగాది వెళ్ళిన మర్నాడు పొద్దున్నే మా ఇంటిదగ్గర జీపు ఆగింది. దేవయ్య తలుపు తీసుకుని లోపలకి వస్తుంటే ఆయన వెనక ఒకాయన లోపల అడుగుపెడుతూ ఆ వాకిట్లో నిలబడి ఉన్న నా దగ్గరకొచ్చి 'మీరేనా విమల, గ్లాడ్ టు సీయూ. మై సెల్ఫ్ మనోరంజన్ మిశ్రా. ప్రొఫెసరు సేన్‌గుప్త ప్రాజెక్టులో యాంత్రొపాలజిస్టుని' అని పరిచయం చేసుకున్నాడు.

మనిషి ముప్పై అయిదేళ్ళ వయసుండొచ్చు. కోలగా ఉన్న ముఖం, రిమ్‌లెస్ కళ్ళద్దాలు, చక్కగా పాపిడి తీసి దువ్వుకున్న జుత్తు, జీన్సు పాంటుపైన ఫుల్ స్లీవ్సు చొక్కా, కానీ స్లీవ్సు మోచేతులదాకా వెనక్కి మడుచుకోకుండా వదిలేశాడు. ఆ కళ్ళల్లో సూటిదనంతో పాటు ఒక అవిశ్రాంతికూడా కనిపిస్తోంది. అట్టే సమయం లేదన్నట్టూ, నన్ను పరిచయం చేసుకోగానే తక్కిన పనులమీద పోడానికి సిద్ధంగా ఉన్నట్టూ కనిపిస్తున్న వాలకం.

నేను నమస్కారం పెట్టి లోపలకి ఆహ్వానించాను.

'నో, ఐ నీడ్ టు గెట్ గోయింగ్. చాలామందిని కలవాలి' అన్నాడు నేను ఊహించినట్టే.

'ప్లీజ్, ఇంటికి వచ్చారు కదా! మా వాళ్ళని పరిచయం చేస్తాను, రండి' అని లోపలకి పిలిచి, అరుగు మీద కుర్చీ వేసాను. గోద్రెజు ఛైరు. అది అప్పటికే ఒక పక్క తుప్పు పడుతోంది. కాని ఒక గ్రామీణ పాఠశాల ఉపాధ్యాయుడి ఇంటికి వచ్చి కుర్చీలో కూచుని మాటాడే అతిథులు ఎప్పుడోగాని రారు.

ఆయన లోపలకి వచ్చికూచున్నాడు. చేతిలో ఒక నోట్ పాడ్ ఉంది. ఆ పాడ్ వొళ్ళో పెట్టుకుని చుట్టూ కలయచూసాడు. సూర్యనారాయణగారూ, పిల్లలూ కూడా బడికి

వెళ్ళిపోయారు. రామలక్ష్మిగారిని పరిచయం చేస్తాను రమ్మంటే ముందు ఆమె చాలా కంగారు పడిపోయింది. ఎట్టకేలకు తలుపు పక్కనే సగం దాక్కుని ఆ వచ్చిన అతిథికి నమస్కారం పెట్టి మంచినీళ్ళు తీసుకువస్తానని లోపలకి వెళ్ళిపోయింది.

డా. మిశ్రా నన్ను కూడా కూచోమన్నాడు. అక్కడ మరో కుర్చీ లేకపోడంతో, అరుగు మీద కూచున్నాను. ఆయన నేరుగా తను చెప్పాలనుకున్న విషయంలోకి వచ్చేసాడు.

'నేను పొద్దున్నే వచ్చాను. ఫారెస్టు ఆఫీసరు గారు ఏర్పాటు చేసిన అకామడేషన్‌లోనే ఉంటాను. రేపూ, ఎల్లుండీ రెండు రోజుల పాటు ఇక్కడ ముఖ్యమైనవాళ్లని, సమితి ఆఫీసు అధికారుల్ని కలవాలి. వీలైతే ఒకసారి డిస్ట్రిక్ట్ హెడ్‌క్వార్టర్స్‌కీ, ఐటిడిఏ ఆఫీసుకీ వెళ్ళిరావాలనుకుంటున్నాను. మనం రెండుమూడు రోజుల తర్వాత మళ్ళా కలుద్దాం. నేను ఇక్కడికే మీ ఇంటికే వచ్చేస్తాను. లెట్ అజ్ చాక్ ఔట్ అవర్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ దెన్ ఇట్ సెల్ఫ్. ఐ జస్ట్ వాంటెడ్ టు సీ యూ' అని లేచి షేక్ హాండిచ్చాడు. నేను మొహమాటంగానే చేయికలిపాను. 'ప్రొఫెసర్ స్పోక్ వెరీ హై అబౌట్ యూ' అని కూడా అన్నాడు.

నాకేమనాలో అర్థం కాలేదు. ప్రొఫెసర్ సేన్‌గుప్త ఎక్కడ? నేనెక్కడ? అసలు అటువంటి మనిషితో కూచుని మాటాడటానికి కూడా నా అర్హత సరిపోదు. కానీ, ఆ మాటవినగానే ఎందుకో చాలా సంతోషంగా అనిపించింది. ఆయన ఏమన్నాడో అడగాలని కూడా అనిపించింది.

'బై ది బై, ఈ ఊళ్ళో ఎవరైనా యూత్ కనబడ్డారా? ఎనీ గ్రాడ్యుయేట్స్?'అనడిగాడు.

'ఒకతను ఉన్నాడు. బి ఏ ఫైనల్ ఇయర్‌లో ఉన్నాడు. పేరు రాజు' అని చెప్పాను.

'దేవయ్యకు తెలుసా?'

తెలుసని చెప్పాను.

'దట్స్ గుడ్. అతనికి కబురు చేస్తాను. వస్తాను' అన్నాడు కుర్చీలోంచి లేస్తూ.

పిన్నిగారు ఆయనకి చిన్న స్టీలు గ్లాసులో కాఫీ తీసుకొచ్చి ఇచ్చారు. ఆ గ్లాసు అందుకుని మళ్లా కుర్చీలో కూచున్నాడు.

నేను నెమ్మదిగా గొంతు సవరించుకుని 'నేను బోటనీ స్టూడెంట్‌ని. యాంత్రొపాలజీ ఏమీ తెలియదు..' అని అనబోతూండగా,

'నో ఇస్యూస్. అదీ కాక, ప్రొఫెసర్ టోల్డ్ మీ దట్ యు ఆర్ ఎ స్మార్ట్ లెర్నర్' అన్నాడు కనీ కనిపించకుండా చిరుమందహాసం చేస్తూ.

'ఏవైనా పుస్తకాలు ఉన్నాయా?' అనడిగాను, సందేహిస్తూనే.

'ఏం పుస్తకాలు?'

'ట్రైబల్స్ గురించి. ఈ ఊళ్ళో ఉన్నవాళ్లని కొండరెడ్లు అంటారని తెలిసింది. వాళ్ల గురించి తెలుసుకోడానికి ఏవైనా పుస్తకాలున్నాయా?'

డా. మిశ్రా ముఖంలో ఒకింత అసహనం తొంగిచూసింది.

'మీ చుట్టూ ఉన్న ట్రైబల్స్ గురించి తెలుసుకోడానికి పుస్తకాలెందుకు? డైరక్టుగా వాళ్లనే పోయి కలుసుకుంటే తెలుస్తుంది కదా. వాళ్ళతో మాట్లాడినా తెలుస్తుంది' అని అంటూ కుర్చీలోంచి లేచాడు.

'నిజమే అనుకోండి, కాని యాంత్రొపాలజీ ఒక సైన్స్ కదా, హూమన్‌సైన్స్. అందుకని ఎంతో కొంత మెథడాలజీ తెలిస్తే బాగుంటుందని అనుకున్నాను. ఏవైనా ఎత్నాలజీ పుస్తకాలు–' అంటూండగా

అతని కనుబొమలు ముడిపడ్డాయి. అసహనం పూర్తిగా ముఖమంతా ఆవరించింది.

'ఎత్నాలజీ! ఎక్కడ విన్నారు ఆ మాట? ఇట్ ఈజ్ ఎ నైన్‌టీన్త్ సెంచరీ వర్డ్. నన్నడిగితే ఆల్ ఎత్నాలజీ ఈజ్ మియర్ హియర్ సే' అంటాను. 'డోంట్ బాదర్ అబౌట్ బుక్స్ అండ్ సైన్స్. లెట్ అజ్ టాక్ అబౌట్ పీపుల్, వర్క్ ఆన్ దెమ్ అండ్ ఫర్ దెమ్ ఒన్లీ' అని చకచకా అడుగులు వేసుకుంటూ బయటికి వెళ్లిపోయాడు. నేను వీథిదాకా వెళ్లాలన్న మర్యాద గుర్తొచ్చి బయటకి అడుగుపెట్టేటప్పటికే జీపు కదిలిపోయింది.

నేనడిగిన మాటలో అతనికి అంత కోపం రావలసిన విషయం ఏముందో అర్థం కాలేదు. నాకు ఒకసంగతి గుర్తొచ్చింది. ఒకరోజు ప్రొఫెసరు సేన్‌గుప్తాతో మాట్లాడు తుండగా, ఆయన గదిలో 'ద టెస్టిమొని ఆఫ్ ద రాక్స్' అనే పుస్తకం చూసాను. ఆ టైటిల్ చాలా ఆసక్తికరంగా ఉండటంతో ఆ పుస్తకం తీసుకుని పేజీలు తిరగేసాను. అందులో ఏముందో నాకంతగా అర్థం కాలేదు.

'ఇందులో ఏమి రాసి ఉంది?' అనడిగాను.

సేన్‌గుప్తా తన నోట్సు రాసుకుంటున్నవాడు తలపైకెత్తి ఆ పుస్తకం కేసి చూసి 'అదా, థియాలజీ ఆఫ్ జియాలజీ' అన్నాడు. ఆ మాట మరింత ఆశ్చర్యకరంగా ఉండటమే కాక, నన్ను మరింత అయోమయానికి గురిచేసింది.

'అంటే ఏమిటి?'అని మళ్ళీ అడిగాను.

ఆయనకి నా సమస్య అర్థమయినట్టుంది. ఒక చిరునవ్వు నవ్వాడు.

'అది బైబిల్లో చెప్పిన భూమి వయస్సుకీ, సైన్సు ద్వారా తెలుస్తున్న జియొలాజికల్ టైమ్‌కీ మధ్య సమన్వయం చేస్తూ ఒక జియాలజిస్టు ఇచ్చిన లెక్చర్లు. ఒక స్కాటిష్ జియాలజిస్టు. చివరికి సూయిసైడ్ చేసుకున్నాడు. ఫైనల్‌గా చెప్పాడనుకో, బైబిల్ సైన్సు కాదు అని. నైంటీన్త్ సెంచరీలో సైంటిస్టులు చాలామంది తమ మీద ఈ బాధ్యత ఒకటి ఉందనుకునేవారు. అంటే సైన్సూ, రెలిజియనూ రెండూ చెప్తున్నది ఒకటే అనో లేదా ఆ రెండింటి గమ్యమూ ఒకటే అనో, అలాంటిదే ఏదో ఒకటి చెప్పాలని ప్రయత్నించేవారు. ఈ రోజు సైన్సు ఆ అవసరం నుంచి చాలా దూరం వచ్చేసింది. ఇప్పుడెవరికీ అలాంటి ప్రయత్నాలు, కనీసం ఎర్త్ సైన్సెస్ వరకూ చేసే అవసరం కనిపించడం లేదు' అని అన్నాడు.

'అయితే మరి మీరెందుకు ఈ పుస్తకం దగ్గర పెట్టుకున్నారు?'

'విమలా!' ఆయన తన చేతిలో ఉన్న పెన్ను పక్కన పెట్టి తన నొసటిని చేత్తో రుద్దుకున్నాడు. 'ఐ థింక్ ఐ నీడ్ టు ఎలాబొరేట్ ఏ బిట్' అని చెప్పడం మొదలుపెట్టాడు.

'సైన్సులో ట్వెంటియెత్ సెంచరీలో గొప్ప ప్రోగ్రెస్ సంభవించింది. ముఖ్యంగా మన టూల్స్, మన సైంటిఫిక్ మెథడ్, మనం సేకరించుకుంటున్న డేటా, అంతర్జాతీయంగా సైంటిస్టులు తాము చూసిందీ, గ్రహిస్తున్నదీ ఎప్పటికప్పుడు పంచుకోగలిగిన సామర్థ్యం, మన కమ్యూనికేషన్ టెక్నాలజి– మనం చరిత్రలో ఎప్పుడూ లేనంత ప్రెసిషన్‌తో దేన్నైనా పరిశీలించగలుగుతున్నాం, రికార్డు చేయగలుగుతున్నాం, ఒకరితో ఒకరం షేర్ చేసుకోగలుతున్నాం. కాని నైంటీన్త్ సెంచరీలో ఇంత ప్రెసిషన్ లేదు, మన టూల్స్, మన డివైసెస్, మన అబ్జర్వేటరీస్ ఇంత పవర్ ఫుల్ కాదు. కాబట్టి ఆ రోజుల్లో శాస్త్రవేత్తలు తాము చూడగలిగింది చాలా స్వల్పమనే మెలకువలో ఉండేవారు. తాము చూడగలిగిన ఆ కొద్ది విషయాన్ని బట్టీ, చూడలేని దాన్ని ఊహాగానంతో పూరించాలనుకునేవారు. అంటే ఎంత అబ్జర్వేషన్ ఉండేదో, అంత ఇమాజినేషన్ కూడా ఉండేదన్నమాట. యు నో ప్రెటీ వెల్ దట్ ఐ లైక్ ఇమాజినేషన్. ఐ లైక్ పొయెట్రీ. ఇమాజినేషన్ ఈజ్ ఎ క్రియేటివ్ ప్రాసెస్.

చాలాసార్లు సైంటిస్టులు చెప్పినదానికన్నా కూడా సైంటిఫిక్ ఫిక్షన్ రైటర్స్ ఊహించినవి ఎక్కువ నిజం కావడం, అందుకనే, నాకు ఆశ్చర్యమనిపించదు. నిజానికి భాష మెటఫరికల్‌గా ఉన్నప్పుడే చాలా మీనింగ్‌ఫుల్‌గా ఉంటుంది. కాని సైంటిఫిక్ లాంగ్వేజి లీగల్ లాంగ్వేజి లాంటిది. మెటఫరికల్‌గా ఉంటే కుదరదు. ఒకటి పట్టుకుంటే రెండోది వదిలెయ్యాలి. కాని ఐ యామ్ ఎ లిటిల్ బిట్ ఎరాటిక్. నా కళ్ళకి సైన్సు కావాలి, చెవులకి కవిత్వం కావాలి.'

అక్కడితో ఆగబోయాడుకాని, మరొక రెండు మూడు మాటలు చెప్పాలనుకున్నాడు. మళ్ళా చెప్పడం మొదలుపెట్టాడు.

'ఒకప్పుడు ఇంగ్లాండులో ఫ్రాన్సిస్ బేకన్ అనే తత్త్వవేత్త ఉండేవాడు. సెవెంటీన్త్ సెంచరీ మాన్. సైంటిఫిక్ మెథడ్ అనే దాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చినవాడిగా ఆయన్ని గుర్తుపెట్టుకుంటారు. ఆయన అన్నాడట: నాట్ టు ఇమేజిన్ ఆర్ సపోజ్, బట్ టు డిస్కవర్ వాట్ నేచర్ డజ్, ఆర్ మే బి, మేడ్ టు డు అని. ఆ మాటలు దాదాపుగా ప్రతి సైంటిస్టూ కోట్ చేస్తుంటాడు. కాని నాకు అర్థం కానిదేమిటంటే, ఇమాజినేషన్‌కీ, డిస్కవరీకీ తేడా ఎక్కడుందని. కొలంబస్ తాను ఇండియా వెళ్తున్నాను అనుకుని ప్రయాణం చేసి ఉండకపోతే అమెరికాని డిస్కవర్ చేసి ఉండేవాడా? కానీ దాదాపుగా సైంటిస్టులంతా ఇమాజినేషన్ ఈజ్ ద డొమేన్ ఆఫ్ లిటరేచర్ అండ్ ఆర్ట్ అనుకుంటారు. బట్, నా దగ్గర ఎంత ప్రిసైజ్ టూల్స్ ఉన్నా, నేను కలెక్ట్ చేసిన సాంపిల్స్‌ని ఎంత కెమికల్ అనాలిసిస్‌కి గురిచేసినా ఒక కొండ నాతో మాట్లాడే మాటల్ని సైంటిఫిక్ మెథడ్ ద్వారా ఎప్పటికీ తక్కినవాళ్లకి తెలియచెయ్యలేను. జాన్ మూర్ అని ఒక మౌంటనీర్ ఉండేవాడు. పందొమ్మిదో శతాబ్దంలో అతను వెస్ట్‌అమెరికాలో తిరగని కొండలేదు, చూడని అడవిలేదు. అతని ట్రావెలోగ్స్, ఉత్తరాలు, డైరీలు చదివితే కలిగే సంతోషం నాకు ఎన్ని జియాలజీ పుస్తకాలు చదివినా కలగదు. నా సూట్ కేసులోనో లేకపోతే ఒరుణిమ దగ్గరో అతని పుస్తకం 'మై ఫస్ట్ సమ్మర్ ఇన్ ద సియెర్రా' ఉండాలి, చూడు, చదివితే నీకే తెలుస్తుంది' అని కూడా అన్నాడు.

ఇప్పుడు డా.మిశ్రా మొత్తం ఎత్నాలజీ అంతాకూడా వినికిడి మాటలకన్నా మించింది కాదని అనగానే ప్రొఫెసరు ఆ మాటలు వింటే ఏమనిఉండేవాడా అనిపించింది.

ఆ సాయంకాలం రాజు వస్తాడేమో అని ఎదురుచూసాను. ఈ రోజు డా.మిశ్రా రావడం, మా మధ్య సంభాషణ అన్నీ అతనికి చెప్పొచ్చనుకున్నాను. కాని రాజు రాలేదు.

రాత్రి పొద్దుపోయేదాకా చూసాను. రామకోవెలలో డ్రామా ట్రూపు రిహార్సలు చాలాసేపు నడిచింది. రామనవమికోసమని రామకోవెలకి రంగులు వేయడానికీ, పందిరి వెయ్యడానికీ, తక్కిన ఏర్పాట్లకీ బడిని కొన్ని రోజులపాటు విలేజిచావిడికి షిఫ్టు చేసారు. దాంతో నాటకబృందం మరీ తొందరగానే రిహార్సలు మొదలుపెట్టి రాత్రి చాలాసేపటిదాకా ప్రాక్టీసు చేస్తూనే ఉన్నారు. గట్టిగా ఇంట్లోకీ వినబడుతున్నా ఆ డైలాగుల్ని బట్టి ఆ కథ ఏమిటో ఊహించాలని చూసానుగానీ, తలాతోకా తెలియలేదు. బహుశా ఆ నాటకంలో ఒకటి రెండు స్త్రీపాత్రలు కూడా ఉండిఉంటాయి, ఆ డైలాగుల వంతు వచ్చినప్పుడు, ఎవరో వాటిని చదువుకుంటూ పోతున్నారు. నాటకం వేసే రోజున ఎవరో ప్రొఫెషనలు నటిని బయట ఊరినుంచి తీసుకువస్తారని రాజు చెప్పడం గుర్తుంది. శుక్లపక్షపు రాత్రులు, అందునా వసంతనవరాత్రులు కావడంతో, గాలంతా తియ్యదనం మూటగట్టినట్టు ఉంది. ఆ తీపిగాలి తాగుతూ చందమామ రోజురోజుకీ మరింత లావెక్కుతున్నాడు.

మిశ్రా వచ్చి వెళ్ళిన మూడో రోజు సాయంకాలం రాజు మా ఇంటికి వచ్చాడు. అతణ్ని చూడగానే ప్రాణం లేచొచ్చినట్టనిపించింది. అతణ్ణి చూసిన ఉత్సాహం నా వదనంలో దాగకపోవడం అతను కూడా చూసినట్టున్నాడు.

'ఏమింత ఉల్లాసంగా ఉన్నారు ఇవాళ?' అనడిగాడు.

'ఉల్లాసమా? నీరసం. ఆ మిశ్రా మాటలు నాకేమీ అర్థం కాలేదు. అందుకే నీ కోసం చూస్తూ ఉన్నాను' అన్నాను.

'మిశ్రాగారు గ్రేట్ మాన్' అన్నాడు రాజు. ఆ మాటలంటూ కళ్ళు పెద్దవిచేసాడు. ఏదో వండర్ గురించి చెప్పబోతున్నప్పుడు మనుషుల ముఖంలో కనిపిస్తుందే, అలాంటి భావం అతని ముఖమంతా వ్యాపించింది.

'నువ్వు కలిసేవా ఆయన్ని?'

'మీరు నా పేరు చెప్పారట కదా. వెంటనే దేవయ్యతో నాకు కబురుపెట్టాడు. సాయంకాలం వెళ్ళి కలిసాను. నన్ను పరిచయం చేసుకోగానే 'మీరు చదువుకుంటున్నారు కదా, మీ ఊళ్ళో స్కూలు ఇంత డిప్లోరబుల్‌గా ఉంటే ఏం చేస్తున్నారు?' అనడిగాడు. బిత్తరపోయాను. నన్ను గ్రామసర్పంచ్ అనుకుంటున్నాడా అని అనుమానమొచ్చింది. 'ఏం సార్?' అనడిగాను. ఆయన వకుళకుటిలో దిగగానే మీ ఇంటికొచ్చాడట. మిమ్మల్ని కలిసి మళ్లా వెనక్కి వచ్చేటప్పటికి విలేజి చావిడిలో స్కూలు నడుస్తుండటం చూసి లోపలకి వెళ్లి చూసాడట. పాడైపోయి పడిపోడానికి సిద్ధంగా ఉన్న గోడలు, కింద కన్నాలు పడి

పగిలిపోయిన గచ్చు, ఊడిపోతున్న కిటికీలు, అన్నిటికన్నా ముందు, ఆ కొండవార, ఆ తుప్పల్లోంచీ డొంకల్లోంచీ పాముపుట్రా ఆ బడిలోకొచ్చి ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులు అని ఆ టీచర్లని అడిగాడట. ఇక నేను కనబడేదాకా దేవయ్యతో పదే పదే ఆ స్కూలు గురించే మాట్లాడుతున్నాడట. నన్ను చూడగానే ఏమనుకున్నాడో ఏమో ఆ ఆవేశం అంతా నామీద వెళ్ళగక్కాడు' అన్నాడు.

'ఇంటరెస్టింగ్' అన్నాను. నేను అతనితో చెప్పాలనుకున్న మాటలు మర్చిపోయేను.

'అంతేనా? ఇంకా ఉంది వినండి. నన్ను సర్పంచి దగ్గరకు తీసుకువెళ్ళమన్నాడు. అప్పటికే సాయంకాలం అయ్యిందా మన సర్పంచిగారు గుర్రమెక్కేసాడు. ఇలా కాదని మర్నాడు సమితి ఆఫీసుకి నన్ను కూడా తీసుకుపోయాడు. బిడీఓతో మాట్లాడేడు. మాట్లాడటం కాదు, యుద్ధం చేసినట్టుగా అరిచాడు. మీ పంచాయతీ సమితి ఎందుకుంది? అక్కడ పిల్లలకేదైనా అయితే ఎవరు బాధ్యులు? లాంటి ప్రశ్నలు కురిపించాడు. బీడీవో ఆయనేదో ట్రైనీ కలెక్టరేమో అనుకుని ఒకటే వణికిపోతూ ఉన్నాడు.'

'ట్రెయినీ కలెక్టరా?మనవాణ్ణి చూస్తే, సివిల్ సర్వీసు ఇంటర్వ్యూ బోర్డుతో తగాదా పెట్టుకోడానికి షర్ట్ ఫుల్‌స్లీవ్స్ వెనక్కి లాగినవాడిలాగా ఉన్నాడు' అన్నాను.

'అది కూడా చెప్పాడు. ఐయ్యేయెస్ ఎగ్జామ్ రెండు సార్లు రాసేట్ట. ఇంటర్వ్యూదాకా వెళ్ళాడట. రాలేదట. ఇంక అది తన పని కాదులే అనుకున్నాడట.'

'ఓహో' అనుకున్నాను. 'ఆ తర్వాత?''

'ఏముంది? బిడీవో ఫండ్స్ లేవన్నాడు. మీ జనరల్ ఫండ్స్ ఉంటాయి కదా అన్నాడు ఈయన. సమితిమొత్తం మీద అన్ని స్కూళ్ళూ అలానే ఉన్నాయనీ, ఏ స్కూలుకని డబ్బులివ్వ గలనని నీళ్ళు నమిలేడు బీడీవో. మీకు వీలైతే కలెక్టరుగారికి చెప్పి జిల్లా పరిషత్తు ఛైర్మన్‌కి ఒక మాట చెప్పించండి అని నసిగాడు కూడా. మనవాడు బయటికొచ్చాక కాకినాడ వెళ్దామంటాడేమో అనుకున్నానుగానీ, జీపు వెనక్కి తిప్పమన్నాడు.'రాజూ, ఇదంతా టైమ్ టేకింగ్ బిజినెస్. నేను ఐటిడిఏకి ఎలాగూ వెళ్దామనుకుంటున్నాను, ప్రాజెక్టు ఆఫీసరుతో మాట్లాడతాను. కానీ ఈ లోపు మనూళ్ళో బడిబిల్డింగ్ మనమే కడదాం' అన్నాడు. 'బిల్డింగా! మనం కట్టడమా!' అన్నాను. 'బిల్డింగ్ అంటే బిల్డింగ్ అని కాదు. కనీసం ఒక తాటాకు పాక వెయ్యలేమా? మీ ఊళ్ళో ఇళ్ళ చుట్టూ కట్టుకున్నారే అలా కంచె పెడదాం. ఆ కంచె చుట్టూ పూలతీగెలు పెడదాం. లోపల కిచెన్ గార్డెన్ వేద్దాం. మీ స్కూల్లో స్పెషల్ న్యూట్రిషన్ ప్రోగ్రాం నడుస్తున్నట్టుంది. దానికి ఆ కూరగాయలు వాడుకుందాం' అన్నాడు. విమలగారూ!

చెప్పొద్దూ! ఆయనలా చెప్తున్నప్పుడు, ఇదేమిటి, ఈయన ఇక్కడ ఎన్ని రోజులు ఉంటాడు? టోటల్‌గా ఇక్కడే ఉండిపోడుకదా, వచ్చి రెండో రోజు కాలేదు, అప్పుడే మన ఊరు, మన స్కూలు అంటాడేమిటి– ఇలాంటి ప్రశ్నలు కలిగాయిగాని, వాటికన్నా ముందు ఆయన ఆ మాటలు చెప్తుంటే వినడం భలేసంతోషంగా అనిపించింది. తిరిగి వస్తున్నంతసేపూ ఇవే మాటలు చెప్తూ ఉన్నాడు. జీపు మనూళ్ళోకి వస్తూండగా, 'ఏం రాజూ? డోంట్ యూ థింక్ ఇటీజ్ పాజిబుల్?' అనడిగాడు. 'మనకి సాధ్యం కాకపోతే మరెవరికి సాధ్యమవుతుంది సార్!' అన్నాను. గుడ్. అన్నాడు, నా భుజం తట్టాడు.

నేను ఆలోచనలో పడ్డాను. నిజమే కదా. ఆ ఊళ్ళో వాళ్ళు తలుచుకుంటే ఏది సాధ్యం కాదు? నాలుగైదు నెలలు ఉండివెళ్ళిపోయే మా కోసమే ఒక కుటీరాన్ని నిర్మించిన ఊరు అది.

'ఇంక నిన్నంతా ఊళ్ళో పెద్దమనుషులందరి దగ్గరికీ తిరుగుతూ ఉన్నాం. సర్పంచ్ గారు, కరణంగారు, మునసబు గారు, వి ఎల్ డబ్ల్యు గారు, చివరికి, ఆర్ అండ్ బి మైలు కూలీ ఒకాయన మనూళ్ళో ఉన్నాడంటే అతనిదగ్గరకి కూడా తీసుకుపొమ్మన్నాడు. అతని ద్వారా పి డబ్ల్యు డిలోనో, ఆర్ అండ్ బి లోనో ఇంజనీర్ల వివరాలు తెలుస్తాయనీ, వాళ్లని పట్టుకోవచ్చనీ.'

'చివరికి ఏమయ్యింది?'

'ఏమవుతుంది?మనవాడు పట్టు పడితే వదలడని అర్థమయింది. ఊళ్ళో వాళ్ళతో శ్రమదానం చేయించి కొత్తబడి కట్టాలనీ, అది కూడా ఈ ఏప్రిల్ నెలాఖరులోపు వేసవి సెలవులు మొదలవకముందే కొత్తబళ్ళోకి అడుగుపెట్టాలనీ పంచాయతీతీర్మానం చేయించాడు. బడికి కావలసిన తాటిదూలాలు ఒకాయన విరాళమిస్తానన్నాడు. వెదుళ్ళూ, తాటాకూ అడవినుంచి తెచ్చుకోడానికి ఫారెస్టు ఆఫీసరుని ఒప్పించాడు. మట్టిపని, కట్టడం, ఆకునెయ్యడం లాంటిదంతా గ్రామస్థులు శ్రమదానం చెయ్యాలి. ఇప్పుడు బడిబిల్డింగు ఉందే దాని పక్కన కడదామని నిర్ణయించారు. కాని ఆ బిల్డింగుకీ, ఈ కొత్తబడికీ మధ్యలో ఒక కంచె కూడా కడతారన్నమాట. అదీ ప్లాను.'

'ఇదంతా ఒక్కరోజులో జరిగిందా?'

'అవును. ఒక్కరోజే. ఇంకో మాట కూడా అన్నాడు. అసలు ఈ రామకోవెలనే బడిబిల్డింగుగా మార్చేస్తే బావుంటుంది కదా. అప్పుడు మీరు ప్రతి ఏడాదీ రామనవమికోసం ఇన్ని డబ్బులు ఖర్చుపెట్టాల్సిన పని ఉండదు అని కూడా అన్నాడు. ఆయన ఆ మాటలు

ఇంగ్లిషులో చెప్పడం, నేను తెలుగులో తిరిగి చెప్పడం. మనూళ్ళో వాళ్ళు ఆ మాటలు నేనే చెప్తున్నట్టు నన్ను మిర్రిమిర్రి చూసారు' అని అన్నాడు గట్టిగా నవ్వుతూ.

'మరి ఆయన భోజనం? కొండమ్మగారు వస్తున్నారా?'

'లేదట. జోసెఫ్ గారిని అడిగాడట. ఈ ఊళ్ళో హొటల్ ఏదైనా ఉందా అని. చిన్న టీబడ్డీలాంటిది ఉందనీ, గారెలూ, పుణుకులూ మటుకే వేస్తుంటారని చెప్పాడట ఫారెస్టరుగారు. అయితే వాళ్ళనే ఏదో ఒకటి తినడానికి ఇంత వండించి పాక్ చేసి పంపించమని చెప్పండి' అని చెప్పాడట. 'ఐ యామ్ నాట్ పర్టిక్యులర్ అబౌట్ ఫూడ్' అని అన్నాడట అన్నాడు రాజు 'ఫూడ్' అనే మాటని దీర్ఘంతీసి పలుకుతూ.

నేను ఆ మాటలు వింటూ అరుగుమీంచి లోపలకి తొంగిచూసాను. పిల్లలిద్దరూ ఇంకా పడుకోకుండా ఉన్నట్టయితే వెంటనే వాళ్ళదగ్గరికి పోయి 'అమ్మాయిలూ, మీకు కొత్త స్కూలు వస్తోంది' అని చెప్పాలనిపించింది.

రాజు ఇంకా ఆ విశేషాలే చెప్తున్నాడు.

'ఆయన ఉత్కళ్ యూనివెర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ అట. ప్రొఫెసర్ సేన్‌గుప్తాతో అయిదేళ్ళుగా పరిచయం అట. ఆయన తన టీములో పనిచేయడానికి ఇటువంటి వాళ్లకోసం వెతుకుతుంటే వీళ్ల ప్రొఫెసరు సేన్‌గుప్తాకి పరిచయం చేసాడట. ఐ యామ్ ఏ బ్లూ ఐడ్ బాయ్ ఆఫ్ ప్రొఫెసర్ సేన్‌గుప్తా అని చెప్పుకున్నాడు నాతో.'

ప్రొఫెసర్ సేన్‌గుప్తాకి బ్లూ ఐడ్ ఛైల్డ్ కానిదెవరు అనుకున్నాను.

'మీ గురించి కూడా ప్రొఫెసరుగారు చాలా గొప్పగా చెప్పారట ఆయనకి.'

'అవును. ఆ మాట నాతో కూడా అన్నాడు. కాని నా గురించి గొప్పగా చెప్పడానికి ఏముంది రాజూ? నేను కూడా నీకులాగే ఇంకా స్టూడెంట్‌నే కదా. అదీ కాక, ఆయన ప్రాజెక్టుకి నిజంగా నేనేమి చేసానో నాకిప్పటికీ తెలీదు' అన్నాను.

కాని అంతలోనే, రాజు గురించి తలుచుకుంటూ సేన్‌గుప్తా చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. అటువంటి యువకుడితో తాను తక్షణమే ప్రేమలో పడితీరాలని ఆయన అన్న మాటలు కూడా గుర్తొచ్చాయి.

అప్పుడు తెలియలేదుగాని, ఇన్నేళ్ళ జీవితం తర్వాత, ఇంత ప్రపంచం చూసాక ఇప్పుడు తెలుస్తోంది– సేన్‌గుప్తా లాంటి ఉదారులు ఈ ప్రపంచంలో చాలా చాలా అరుదు

అని. వాళ్లు ప్రపంచంలో ప్రతి ఒక్కరితోనూ ప్రేమలో పడగలరు. ప్రతి ఒక్కరి గురించీ మరొకరిదగ్గర పెద్దగా చేసి చెప్పగలరు. నాకు గుండెలో కన్నీళ్ళు కదలాడినట్టయింది.

రామకోవెల్లో రిహార్సలు మొదలయ్యింది. మళ్లా బల్లల చప్పుళ్ళు, 'టీ, టీ' అనే అరుపులు, 'ఇదిగో, ఈ కేరక్టరు ఇటునుంచి ప్రవేశిస్తాడు', 'అదేమిటి, అది స్వగతంరా బాబూ, డైలాగు అనుకుని పైకే చదివేస్తున్నావు'–

చివరి బస్సు కూడా వెళ్ళిపోయింది. చుక్కలన్నీ పంచమిచంద్రుడి చుట్టూ సభ మొదలు పెట్టాయి. సేన్‌గుప్తా గురించిన తలపులు, మిశ్రా గురించి విన్న మాటలు నా అంతరంగాన్ని స్థిమితంగా ఉండనివ్వడం లేదు.

'ఇంతకీ ఎందుకొచ్చానంటే, మిశ్రా గారు రేపు మనిద్దరినీ పదింటికి రమ్మన్నాడు. మొన్న మీతో చెప్పినప్పుడు డైరెక్ట్‌గా మీ ఇంటికి వస్తాను అన్నాట్ట కదా. కాదు, రేపు మనల్నే తన దగ్గరికి రమ్మన్నాడు. మనం చెయ్యాల్సిన పని గురించి చెప్తాడట. అన్నట్టు, మీకు ఈ ప్రాజెక్టుకి యూనిఫాం ఏమీ లేదండోయ్. మీకు ఎలా వీలైతే అలానే డ్రెస్ చేసుకు రమ్మన్నాడు.'

'అయ్యో! నువ్వు డ్రెస్ సంగతి కూడా చెప్పేసావా ఆయనతో?'

'అన్నీ చెప్పేసాను.'

కొంటెగా నవ్వుతున్న ఆ పిల్లవాడి కేసి చూసాను. ఆ పిల్లవాడెవరు? ఆ ఊరేమిటి? ఆ డా.మిశ్రా ఎవరు? నేనెవరు? ఎక్కడ మొదలుపెట్టాను? ఎక్కడికి వెళ్తున్నాను? జీవితం అంతే. ఒక తలుపు తెరిస్తే చాలు, మరెన్నో తలుపులు తెరుచుకుంటూ పోతాయి.

❋

17

మర్నాడు పొద్దున్నే పదింటికి రాజూ, నేనూ వకుళకుటికి వెళ్ళాం. మేం వెళ్ళేటప్పటికి చెట్లకింద పదిపదిహేనుమంది గిరిజనులున్నారు. మమ్మల్ని చూడగానే డా. మిశ్రా రాజుతో 'మీ కోసమే చూస్తున్నాను. ఇదిగో, నా మాటలు వీళ్ళకి తెలుగులో చెప్పు' అని వాళ్ళవైపున తిరిగి 'కాబట్టి, మీరు నాన్ ట్రైబల్స్‌కి బినామీగా ఉండకండి. మీ బంజరు మీరే దున్నుకోండి. మీకు కావలసిన ఎడ్లు, పనిముట్లు, విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం నుంచి వస్తాయి. ఐటిడిఏ ఉన్నది మీకోసమే' అని చెప్పాడు.

వాళ్ళు ఆయన్ని జీడిమామిడి మొక్కల గురించి అడిగారు.

'మీరు హార్టికల్చర్ క్రాపు వేసుకుంటే మరీ మంచిది. కొన్నేళ్ళ పాటు ఆ మొక్కల మధ్య ఇంటర్ క్రాపింగ్ కూడా చెయ్యొచ్చు. మొదట్లో ఆరునెలలు మొక్కల్ని దగ్గరుండి చూసుకోవాలి. మొదటి సమ్మర్ మొక్కలకి నీళ్ళుపోసుకుని చూసుకుంటే ఆ తర్వాత మీరు కొండపనికి పోయినా పర్వాలేదు. ఆ మొక్కలు బతుకుతాయి. నాలుగేళ్ళల్లో మీకు ఫలసాయం రావడం మొదలవుతుంది' అని చెప్పాడు.

ఆ సంభాషణ గంటసేపైనా సాగింది. ఆ గిరిజనులు ఆయన్ని రకరకాల ప్రశ్నలు అడిగారు. వ్యవసాయం గురించీ, ఎటువంటి పంటలు వేస్తే బాగుంటుందీ, వర్షాధారం మీద వరి పండిస్తే దిగుబడి పెరగాలంటే ఏమి చెయ్యాలి లాంటివేవో అడిగారు. ఆయన వాళ్ళకి ఓపిగ్గా జవాబిస్తూనే ఉన్నాడు. చూడబోతే ఆయన ఆ ప్రాంతంలో కొత్తగా ఉద్యోగంలో చేరిన అగ్రికల్చర్ డిమాన్‌స్ట్రేటర్లాగా కనబడ్డాడు.

వాళ్ళు వెళ్ళిపోయాక ఆయన కూడా మాతో పాటు ఆ అరుగు మీద కూచున్నాడు. నేనింకా ఆ ముంగిలి దాటి బయటకు వెళ్తున్న గిరిజనుల్నే చూస్తూ ఉండటం గమనించి డా.మిశ్రా నాతో 'ఈ రెండుమూడు రోజుల్లో నాకు ఇక్కడ ఏం అర్థమయిందంటే, దీజ్ పీపుల్ ఆర్ సబ్జెక్ట్ టు టెరిబుల్ ఇన్ జస్టిస్. సోషల్ ఇన్ జస్టిస్. డు యు నో అబౌట్ ద కాన్‌స్టిట్యూషనల్ సేఫ్ గార్డ్స్ ఫర్ ద ట్రైబల్స్? ఫిఫ్త్ షెడ్యూలు గురించి విన్నారా? ఇక్కడ దారుణమైన పరిస్థితులు నడుస్తున్నాయి. నాన్ ట్రైబల్స్ రాజ్యం నడుస్తోంది. ఇదుగో, ఈయన సంగతే చూడండి–' అని రాజు కేసి చూపించి–

వీళ్ళ నాన్నగారు వెస్ట్ గొడావరి డిస్ట్రిక్ట్ నుంచి వచ్చిన క్షత్రియుడు. అంటే నాన్ ట్రైబల్. మరి ఇక్కడ ఆయనకి అంత భూమి, అరటితోట, చెరకుతోట ఎలా వచ్చేయో చెప్పగలరా? దీన్నే లాండ్ ఎలియనేషన్ అంటారు. అసలు ఈ భూమి అంతా ట్రైబల్స్‌ది. ట్రైబల్స్ కే చెందాలి. కాని వీళ్లంతా ఏదో ఒక రూపంలో దాన్ని ఆక్రమించుకున్నారు. వాళ్ళని తమ పొలాల్లో పనివాళ్ళుగా మార్చేసారు. అర్థమవుతోందా?' అన్నాడు.

నేను చాలా కంగారు పడిపోయాను. నా ఎదురుగుండా రాజుని పట్టుకుని అతడి తండ్రినీ, కుటుంబాన్నీ నేరస్థులుగా చూపిస్తో అలా మాట్లాడుతుంటే నాకు కాళ్ళల్లో వొణుకు పుట్టింది. కాని రాజు కళ్ళల్లో అటువంటి భావమేదీ కనిపించడం లేదు. అతడు చాలా శ్రద్ధగా, తదేకంగా డా.మిశ్రా చెప్తున్న మాటలు వింటున్నాడు. అతడి కళ్లల్లో దీప్తి ఏ మాత్రం మసకబారలేదు.

'నేను ఒక ఎగ్జాంపుల్ చెప్పాను. కాని మొత్తం ఈ ఊళ్ళన్నీ అలాగే ఉన్నాయి. యు నో. దిస్ విలేజ్ ఈజ్ సిట్టింగ్ ఆన్ ఎ వోల్కెనో. ఎప్పుడు బరస్ట్ అవుతుందో తెలీదు. వెస్ట్ బెంగాల్లో వచ్చినట్టు, పదేళ్ళ కిందట శ్రీకాకుళంలో జరిగినట్టు, ఇక్కడ కూడా రెబెలియన్ రావచ్చు. బ్లడ్‌షెడ్ తప్పకపోవచ్చు' అన్నాడు.

'ఇక్కడ కూడా సీతారామరాజు బ్రిటిష్ వాళ్లమీద తిరుగుబాటు చేసాడు సార్. ఆయనకన్నా ముందు గరిమెళ్ళ మంగరాజు, ద్వారబంధాల చంద్రయ్య అనేవాళ్ళు కూడా ఇక్కడ ప్రభుత్వం మీద తిరగబడ్డారు' అన్నాడు రాజు.

'యెస్. ఐ హెర్డ్ అబౌట్ దెమ్. మళ్లా అటువంటి పరిస్థితులే ఇక్కడ కనిపిస్తున్నాయి. ఐ యామ్ డీప్లీ ట్రబుల్డ్, ఐ యామ్ వెరీ మచ్ కన్సర్న్‌డ్' అని అన్నాడు మిశ్రా.

నాకు ఆ సంభాషణ విని తలతిరగడం మొదలుపెట్టింది.

నేను ఇన్నాళ్ళూ చూస్తున్న ఆ సౌందర్యం, ఆ నిశ్శబ్దం– అవేమిటి? ఆ ఊరూ, ఈయన చెప్తున్న ఊరూ ఒకటేనా?

'సరే, లెట్ అజ్ కమ్ టు అవర్ సబ్జెక్ట్–' అని తనపక్కన మోడా మీద ఉన్న కాగితాలు చేతుల్లోకి తీసుకుని మాకు వివరించడం మొదలుపెట్టాడు.

'మనం చెయ్యవలసిన పని ప్రొఫెసర్ సేన్‌గుప్త ఐడెంటిఫై చేసిన కాచ్‌మెంట్ ఏరియాలో ఉన్న హాబిటేషన్స్ తాలూకు సోషియో–ఇకనమిక్ ప్రొఫైల్ తయారు చెయ్యడం. ఈ కాచ్‌మెంట్‌లో నాలుగు గ్రామాలు, రెండు హామ్లెట్లు, ఒక దళితవాడ ఉన్నాయి. డిసెన్నియల్ సెన్సస్ ఈ ఏడాది ఇంకా మొదలవలేదు. పాత సెన్సస్ డాటా పదేళ్ళ కిందటిది. కాబట్టి నేను తాలూక్ స్టాటిస్టికల్ అసిస్టెంట్ దగ్గరనుంచీ, సమితి ఆఫీసునుంచీ, ఎలొక్టరల్ లిస్టులనుంచీ సంపాదించి ప్రిలిమినరీ డాటా తయారుచేసాను. దాని ప్రకారం ఈ ఏడు హాబిటేషన్స్‌లో మొత్తం ఆరువందల నలభై మూడు హౌస్‌హెూల్డ్స్ ఉన్నాయి. మనం ఆ హౌస్ హెూల్డ్స్‌కి వెళ్ళి వాళ్ళని ఇంటర్వ్యూ చేసి, ఇదుగో, ఈచ్ హౌస్ హెూల్డ్ డాటా ఈ సర్వే ఫారంలో నింపాలి–' అని ఒక నమూనా సర్వే ఫారం చూపించాడు.

'మనం ఒక్కొక్కళ్లం, అంటే, మీరిద్దరూ అనుకోండి, రోజుకి ఒక్కొక్కరూ పది కుటుంబాల సర్వే చెయ్యగలిగితే, మొత్తం నెల రోజుల పని. మరొకరిని కలుపుకోగలితే ఇరవై రోజుల పని. దాంతో పాటు, ఈ ఏడు హాబిటేషన్ల బేసిక్ డాటా కూడా ఈ ఫార్మాట్ ప్రకారం నింపాలి. చెయ్యగలుగుతాం కదా?' అన్నాడు.

నేను ఆశ్చర్యపోయాను. ఎప్పుడు వచ్చాడు! ఎప్పుడు ఈ వివరాలన్నీ సేకరించాడు! ఇంత మెటిక్యులస్‌గా ఎలా ప్లాన్ చెయ్యగలుగుతున్నాడు!

ఆయన నాకు ఆ ఫామిలీ సర్వే ఫార్మాట్ అందించాడు. ఆ స్పెసిమన్ కాపీ నేను తిప్పి చూసాను. మొత్తం ఆరుపేజీలు ఉంది. అందులో ఆ కుటుంబం తాలూకు బేసిక్ డాటా సేకరించడంతో పాటు, వాళ్ళ అవసరాలు, కంజంప్షన్ పాటర్న్ లాంటివన్నీ ఉన్నాయి.

'నిజానికి ఇవాళే పని మొదలుపెడదాం అనుకున్నాను. కానీ మీ ఊళ్ళో రామ నవమి సెలబ్రేషన్స్‌లో అంతా బిజీగా ఉంటారని రాజు చెప్పాడు. కాబట్టి రేపు ఒక హౌస్ హెూల్డ్ విజిట్ చేసి వాళ్లని ఎలా ఇంటర్వ్యూ చెయ్యాలో, ఈ ఫార్మాట్ ఎలా నింపాలో మీకు చూపిస్తాను. మీరు పండగ అయిపోగానే పని మొదలుపెట్టండి. అంటే నా లెక్క ప్రకారం మార్చిమం, మే పదిహేనుకల్లా మన సర్వే పూర్తయిపోతుంది. అప్పుడు ఆ డాటాని

టాబ్యులేట్ చేసి, అనలైజ్ చేయడానికి మరో పది రోజులు. ప్రొఫెసరు సేన్‌గుప్త వచ్చేటప్పటికి మనం సర్వే మొదలుపెట్టగలిగితే హి వుడ్ ఫీల్ కాన్ఫిడెంట్' అని అన్నాడు.

ఆ మాటలు వింటుంటే నాలో కొత్త రక్తం ఎక్కినట్టుగా ఉంది. నా చిన్నప్పణ్ణుంచీ, స్కూల్లో, కాలేజిలో ఎవరూ ఇటువంటి మాటలు చెప్పడం వినలేదు. ఈ దేశంలో కొన్ని వేల ఉన్నతపాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. ప్రతి ఏడాది కనీసం కొన్ని వేలమంది విద్యార్థులైనా ఇలా గ్రామాలకి వెళ్ళి అక్కడ ఉండి, ఎంతో కొంత మార్పు తేగలిగితే, దేశం ఎలా ఉంటుందో అనిపించింది.

నేను ఆ కాగితాలు వివరంగా చూసాను. అదంతా నాకు కొత్త. ఇప్పటిదాకా ఆకులూ, కొమ్మలూ సేకరించి ఆల్బం రూపొందించడం మాత్రమే నేర్చుకున్నాను . కాని ఆయన చెప్తున్న పని బ్రహ్మవిద్య అనిపించలేదు. పైగా అదంతా చాలా ఆసక్తికరంగా కూడా అనిపించింది. కొత్త విషయాలు నేర్చుకోడంలో ఒక ఆనందం ఉందని అప్పటికే నాకు అనుభవానికి వచ్చింది. నువ్వు లెర్నరుగా మారితే నీకు తన రహస్యాలు చెప్పటానికి ఈ ప్రకృతిమాత్రమే కాదు, ఈ ప్రపంచం కూడా సిద్ధంగా ఉంటుందని అప్పటికే గ్రహించాన్నేను.

'ఎనీ థింగ్ ఎల్స్?'అనడిగాడు డా. మిశ్రా నావైపు చూస్తూ,

అతని ముఖంలో ఒక ప్రసన్నభావం కనిపిస్తూ ఉంది.

ఆయన పరిచయమైన తర్వాత, ఇది రెండవసారి ఆయన్ని చూడటం. కాని ఇంత ఆహ్లాదకరమైన చూపులు చూడటం ఇదేమొదటిసారి.

నాకు ఆయనతో ఏదైనా ఒక సంతోషకరమైన మాట మాట్లాడాలి అనిపించింది.

'మీరు ఈ ఊళ్ళో కొత్త బడి కట్టించడానికి ప్రయత్నం మొదలుపెట్టారని రాజు చెప్పాడు. ఆ మాట విన్నప్పుడు నాకు చాలా సంతోషంగా అనిపించింది. మా ఇంట్లో ఇద్దరు చిన్నపిల్లలు ఈ బడికే వెళ్తున్నారు. ఇద్దరూ గర్ల్ స్టూడెంట్స్. వాళ్లకి చెప్పాను, తొందరలోనే మీకు కొత్తబడి వస్తోందని' అని అన్నాను.

డా. మిశ్రా వదనంలో ఒక గంభీరభావం గోచరించింది.

'యెస్, మేడమ్. నేనేమనుకుంటానంటే, ఒక విద్యావంతుడు ఒక గ్రామానికి వెళ్ళిన తరువాత, అక్కడ ఒక రోజు ఉండనీ, వన్ యియర్ ఉండనీ, అతను అక్కణ్ణుంచి వెళ్ళిపోయేలోపు ఆ గ్రామానికి ఏదో ఒక మేలు జరగాలి. అతను వెళ్ళకముందు ఉన్న గ్రామానికీ, వెళ్లిన తరువాత ఉన్న గ్రామానికీ మధ్య డిసైడెడ్లీ ఒక టాంజిబుల్ బెనెఫిట్

సమకూరి ఉండాలి. లేకపోతే అతని చదువుకి అర్థమే లేదు. అందుకనే గాంధీగారు యువతీయువకుల్ని గ్రామాలకి వెళ్ళమని చెప్పేవారు. అక్కడే ఉండమని చెప్పేవారు. అండ్, లెట్ మీ టెల్ యూ, ఫర్ హిమ్, ఫ్రీడమ్ మూమెంట్ వజ్ నథింగ్ బట్ విలేజ్ రికన్‌స్ట్రక్షన్' అని అన్నాడు.

'నేను బనగర్‌వాడి అని ఒక నవల చదివాను. మరాఠీ నవల. అందులో ఇదే కథ. ఒక టీచరు ఒక గ్రామానికి వెళ్తాడు. అక్కడ బడి పాడుపడిపోయి ఉంటుంది. ఆ గ్రామస్థులకి చెప్పి వాళ్ళని ఉత్సాహపరిచి కొత్త బడి కట్టించడం మొదలుపెడతాడు. మీరు మన ఊళ్ళో కొత్తబడి కట్టాలని చెప్పినప్పుడు నాకు ఆ కథనే గుర్తొచ్చింది' అన్నాడు రాజు.

డాక్టరు మిశ్రా రాజుని అభినందన పూర్వకంగా చూసాడు. మేమిద్దరం క్లాసులో బ్రైట్ స్టూడెంట్సు లాగా, ఆయన మా కొత్త మాష్టారిలాగా కనిపించాడు. అప్పుడు మళ్లా నాకేసి తిరిగి, 'మొన్న మీరు ట్రైబల్స్ గురించి పుస్తకాలున్నాయా అనడిగారు. ఐ వజ్ ప్రోబబ్లీ రూడ్ టు యు. తరువాత ఆలోచిస్తే అనిపించింది. మీకు కొంత వివరంగా చెప్పి ఉండవలసింది అని' అని ఆ అరుగుమీంచి కిందకు దిగి, ఆ ఇంటివాకిట అటూ ఇటూ రెండుమూడు నిమిషాలు పచార్లు చేసాడు. అప్పుడు మళ్లా మా దగ్గరకొచ్చి నిలబడ్డాడు. మేము కూర్చునే ఉన్నాం.

'విమలా, మీకు ఎలా చెప్పాలా అని ఆలోచిస్తున్నాను. ట్రైబల్స్ గురించి చాలా పుస్తకాలు ఉన్నాయి. బట్ దోజ్ బుక్స్ ఆర్ అబౌట్ దెమ్. అబౌట్. అంటే అర్థమవుతోందా? వాళ్ళ గురించి రాసినవి. ఏదో చెట్లగురించీ, పక్షుల గురించీ, రకరకాల స్పీషిస్ గురించీ రాసినట్టు ట్రైబల్స్ గురించి కూడా రాసిన పుస్తకాలు. కలోనియల్ సివిల్ సర్వెంట్స్, ట్రావెలర్స్, మిషనరీస్– ఐ డోంట్ క్వశ్చన్ దైర్ ఇంటెన్షన్స్ ఆర్ ఇంటెగ్రిటీ– బట్, అవి ఆ రాసినవాళ్ళు తమవైపు నుంచి రాసినవి. ట్రైబల్స్‌ని ఒక స్పెసిమన్ లాగా లాబరేటరీలో అబ్సర్వ్ చేసినట్టు, అబ్సర్వ్ చేసి రాసినవి. యు మే గెట్ ఎ లాట్ ఆఫ్ డాటా ఫ్రమ్ దోజ్ బుక్స్. బట్ యు విల్ నెవర్ బి ఏబుల్ టు రీచ్ ద హార్ట్ ఆఫ్ ద ట్రైబల్ లైఫ్' అని ముందుకు వంగి తన ముందు పడి ఉన్న ఒక మామిడికాయని పైకి తీసాడు.

అది ఇంకా పిందెగా ఉన్నప్పుడే పగిలిపోయి కిందకు రాలిపోయింది. ఆయన ఆ మామిడిపిందెను తదేకంగా చూసాడు. దాన్ని కొరికి చూసాడు.

'డైరక్ట్ ఎక్స్‌పీరియెన్స్. దానికి ఏదీ సమానం కాదు. చూడు, ఈ పిందె. దీని గురించి ఎంత రాసినా, ఎంత చెప్పినా, ఇది కొరికి చూస్తే నీకు కలిగే ఇన్‌సైట్ మరే రకంగానూ దొరకదు. అందుకే ట్రైబల్స్ గురించి తెలుసుకోవాలంటే, ట్రైబల్స్ దగ్గరికి

వెళ్ళడమొక్కటే మార్గం. నీకు సేన్‌గుప్తా చెప్పే ఉంటాడు. కొండ గురించి తెలుసుకోవాలంటే, కొండనే అడగాలని' అన్నాడు నవ్వుతూ.

ఇంకా చెప్పడం కొనసాగించాడు.

'మిషనరీలూ, సివిల్ సర్వెంట్లే కాదు, యాంత్రొపాలజిస్టులు కూడా చాలాసార్లు ట్రైబల్స్‌ని కలుసుకున్నాక కూడా అదే తప్పు చేస్తారు. దే డోంట్ వెరిఫై దైర్ డాటా. ఒక యాంత్రొపాలజిస్టు మీ ఆంధ్రాలో ఒక ట్రైబల్ గ్రూప్ మీద ఒక పుస్తకం రాసాడు. పీపుల్ కన్సిడర్ దట్ ఎ క్లాసిక్. అందులో ఆయన రాస్తాడు, ఆ ట్రైబల్స్‌కి భగవంతుడు అనే దేవుడున్నాడని! వాట్ ఎ పిటీ!' అని వ్యంగ్యంగా నవ్వాడు.

'భగవంతుడు అని అన్నా, దేవుడని అన్నా ఒకటేనని అతనికి తెలియదు. వాళ్ళు ఎవరిని కొలుస్తారో కనుక్కోమని తన ఇన్ఫార్మెంటుని అడిగి ఉంటాడు. వాడు ఆ ట్రైబల్స్‌ని అడిగితే మేము భగవంతుణ్ణి కొలుస్తాం అని చెప్పి ఉంటారు. ఈ ఇన్ఫార్మెంటుకి అదెలా చెప్పాలో తెలిసి ఉండదు. అందుకని ఏదో చెప్పి ఉంటాడు. ఈ యాంత్రొపాలజిస్టు 'దే వర్షిప్ ఎ గాడ్ కాల్డ్ భగవంతార్' అని రాసేసాడు తన పుస్తకంలో!' అని గట్టిగా నవ్వాడు.

కాని అక్కడితో ఆగలేదు. ఇంకా చెప్పడం కొనసాగించాడు.

'ట్రైబల్స్ గురించి తెలుసుకోవడం అంటే వాళ్ల ఆచారవ్యవహారాలు, వాళ్ళ రిచ్యువల్స్, ఇంప్లిమెంట్స్ వాటి గురించి డాటా కలెక్ట్ చేయడం కాదు. ద క్రక్స్ ఈజ్ దైర్ వరల్డ్ వ్యూ. అది తెలుసుకోవాలి. అది వాళ్లంతటవాళ్ళు చెప్తే తప్ప మనకు తెలియదు. వాళ్ళు ఇంగ్లిషో, తెలుగో, ఒరియానో నేర్చుకుని రాస్తే తప్ప మనకు తెలియదు. మీరు చినువా అచెబె పేరు విన్నారా? థింగ్స్ ఫాల్ అపార్ట్ అనే నవల చదివారా?' అనడిగాడు.

ఇద్దరం కూడా తెలియదన్నట్టు తలాడించాం. కాని ఆయన అచెబె గురించి చెప్పలేదు. అది మా స్థాయికి అందదని అనుకుని ఉంటాడు.

'లేదా, ఎవరేనా నాన్ ట్రైబల్ ట్రైబల్స్ గురించి మాట్లాడితే, అతను వాళ్లతో కలిసి మెలిసి జీవించినవాడై ఉంటే, దెన్ ఐ కెన్ సే, హిజ్ అకౌంట్ ఆఫ్ దెమ్ ఈజ్ సమ్‌థింగ్ నియరర్ టు ద ట్రూత్. గిడుగు రామ్మూర్తి పేరు విన్నారా?' అనడిగాడు.

మళ్ళా తల అడ్డంగా ఆడించాం.

'సో శాడ్. మరి మీ స్కూళ్ళల్లో ఏం చెప్తారు? ఎవరి గురించి చెప్తారు? గిడుగు రామ్మూర్తి మా కోరాపుట్ జిల్లాలో సవర చిల్డ్రన్ కోసం సవరమీడియంలో మొదటి స్కూల్

తెరిచాడు. అప్పటికి ఇండియాలో యాంత్రొపాలజీ అనే మాటనే పుట్టలేదు. అఫ్ కోర్స్, ఆయనకన్నా ముందు కొంత మంది మిషనరీస్ నార్త్ ఈస్ట్‌లో స్కూల్స్ తెరిచారనుకో. కాని వాళ్ల ఎజెండా వేరు' అని అన్నాడు.

ఇది, సరిగ్గా ఇటువంటి విశేషాలే కదా, ఈయన్నుంచి వినాలని అనుకున్నది. మొన్న ఆయన్ని పుస్తకాల గురించి అడిగినప్పుడు నేను సరిగా చెప్పలేకపోయానుగాని, ఇలాంటి సంగతులు తెలుసుకోవాలనే కదా అప్పుడు నా మనసులో ఉన్నది.

'బట్ ఆనెస్ట్లీ, ఐ యామ్ నో లాంగర్ ఇంటరెస్టెడ్ ఇన్ దైర్ కల్చర్ అండ్ రిచ్యువల్స్. చూడండి. మీ ఊరే తీసుకోండి. ఇక్కడ పిల్లలకి చదువుకోడానికి సరైన నీడలేదు కాని ఊరంతా రామనవమి సెలబ్రేషన్స్‌కి డబ్బులు కర్చుపెట్టడానికి సిద్ధంగా ఉన్నారు. ట్రైబల్ లిటరసీ రేట్ ఎంతో తెలుసా? నా దగ్గర 71 సెన్సస్ డాటా మాత్రమే ఉంది. దాని ప్రకారం అయిదు శాతం. ఒన్లీ ఫైవ్ పెర్సంట్. ఐ యామ్ డీప్లీ డిస్టర్బ్డ్. ఫైవ్ పెర్సంట్. ఏం చేస్తే మనం లిటరసీ ఇంప్రూవ్ చెయ్యగలుగుతాం? ఆల్ మై థాట్స్ ఆర్ అరౌండ్ దట్ క్వశ్చన్ ఒన్లీ..' అని–

'ఒకే, ఇప్పటికే చాలాసేపయింది. రేపు ఫీల్డ్‌టెస్ట్ చేసాక ఏవైనా మాడిఫికేషన్స్ అవసరమైతే చూసుకుని ఫైనల్ ఫార్మాట్ ప్రింటుకిస్తాను. నర్సీపట్నంలో ప్రింట్ చేయించ వచ్చని దేవయ్య చెప్పాడు. మీ పండగ అయ్యేటప్పటికి ఆ ఫార్మాట్స్ కూడా రెడీగా ఉంటాయి. పండగ అయిపోగానే పని మొదలుపెడదాం' అని అన్నాడు.

మేము కూడా లేచి సెలవుతీసుకున్నాం.

'రేపు ఒక హౌస్ హోల్డ్ సాంపిల్ సర్వే చేద్దామన్నారు–' అని గుర్తు చేసాడు రాజు.

'అవును, ఐ రిమెంబర్ దట్. లెట్ అజ్ మీట్ ఎట్ విమలాస్ ప్లేస్ టుమారో' అని అన్నాడు డాక్టరు మిశ్రా, వీడ్కోలు పూర్వకంగా మాతో చేతులు కలుపుతూ.

బయటకు అడుగుపెట్టాం. నా మనసంతా బరువుగా అయిపోయింది. ఎన్నో విషయాలు, గుక్కతిప్పుకోడానికి వీల్లేనట్టుగా, ఆయన నా మనసులో కుక్కిపెట్టేసాడు. నేను విన్నది నెమ్మదిగా నెమరువేసుకుంటూ నడుస్తూ ఉండగా,

అప్పుడు వినిపించింది, ఆ మధ్యాహ్నా వేళ, మామిడిచెట్లమీంచో, లేక కొండకింద లోయలోంచో, లేదా దూరంగా పొలాలమీంచో–

కోకిల కూజితం.

ఆ కూత వినగానే హఠాత్తుగా ఒక మెరుపు మెరిసినట్టూ, అలా మెరిసిన చోట భళ్ళున కాంతివిచ్చినట్టూ అనిపించింది. పట్టపగలే, కాని పట్టలేనంత కాంతి.

❋

18

ప్రతి నావికుడూ ఒక రత్నాలదీవిని వెతుక్కుంటూనే బయల్దేరతాడు. నేను కావాలని కోరుకుని బయల్దేరకపోయినా నేను చేరుకున్న ఆ గ్రామం ఒక రత్నాలదీవి. ఎక్కడెక్కడి నుంచో ఎవరెవరో గురువులు వచ్చి ఆ తలుపులు యథేచ్ఛగా తెరిచి నన్ను ఆ గదులంతటా తిప్పి చూపించారు. కొన్ని నెలలు మాత్రమే ఉండివచ్చిన నాకే అన్ని రత్నాలు అందిస్తే, ఆ ఊరు, చిన్నప్పణ్ణుంచీ అక్కడే పుట్టి పెరిగిన రాజులాంటి వాళ్లకి ఇంకా ఎంత భాండాగారం చూపించి ఉంటుంది! లేదా, ఆ రత్నాలన్నీ నాకోసమేనా? తరగతిలో ఎంతసేపు పాఠం చెప్తున్నా ఒక్క అక్షరమ్ముక్క కూడా రాయకుండా ఎంతసేపూ పలక గుండెకి హత్తుకుని కూచుండే బిడ్డమీదనే ఉపాధ్యాయుడి దృష్టి ఉండేటట్టు, ఆ పాఠాలన్నీ నాకోసమేనా?

ఆ మర్నాడు డా.మిశ్రా నేరుగా మా ఇంటికి వచ్చేసాడు. కూర్చోడానికి కూడా టైము లేదన్నట్టుగా వస్తూనే మమ్మల్ని తన దగ్గర ఉన్న లిస్టులో ఒక హౌస్‌హోల్డ్ రాండంగా సెలక్టు చెయ్యమన్నాడు. మమ్మల్ని అంటే నన్ను. రాజుకి అక్కడవాళ్ళ పేర్లు ఎంతో కొంత తెలిసి ఉంటాయి కాబట్టి అతణ్ణి ఆ లిస్టు చూడనివ్వలేదు. నేను ఒక సాంపిలు ఎంపికచేసాక, రాజుని ఆ ఇల్లు ఎక్కడుందో తెలుసా అని అడిగాడు. రాజు గుర్తుపట్టగలనన్నాడు. మేము నేరుగా ఆ ఇంటికి వెళ్లాం.

అది ముర్ల గంగమ్మ అనే ఒక కొండరెడ్డి మహిళ ఇల్లు. నేను అనాలోచితంగా ఎంచుకున్న సాంపిలు మామూలు ఇల్లు కాదని మొదటి అయిదు నిమిషాల్లోనే మాకు తెలిసిపోయింది. ఆమె తండ్రి చిన్నప్పుడే చనిపోయాడు. అన్న పెంచిపెద్దచేసాడు. వాళ్ళకి భూమి ఉంది కాని, దాన్ని సాగుచేసే స్తోమతు లేదు. అందుకని ఆమె అన్న కొండపోడు

చేసేవాడు. గంగమ్మ చాలా చలాకీపిల్ల. అందగత్తె. ఇప్పుడామెకి నలభయ్యేళ్ళ వయసు ఉండొచ్చు. పాతికేళ్ళకిందట, ఆమె ఇంకా యవ్వనంలో అడుగుపెట్టీ పెట్టకుండానే ఆ ఊళ్ళో బాంబూ కూపులు నడుపుతున్న భూషణరావు కళ్ళల్లో పడింది. అతను ఏలేశ్వరానికి చెందిన గిరిజనేతరుడు. అతనికి అప్పటికి నలభయ్యేళ్ళ వయసు ఉంటుంది. పెళ్ళయింది. పిల్లలు కూడా ఉన్నారు. వాళ్ళు ఏలేశ్వరంలో ఉంటారు. వెదురు నరికించే పనిమీద అతను నెలల తరబడి ఈ ఊళ్ళో అడవిదగ్గరలో ఒక మకాం పెట్టుకుని ఉండిపోయేవాడు. ఆ మకాంలో తనకి వంటవండిపెట్టడానికీ, సాయం చెయ్యడానికీ ఒక మనిషి కోసం చూస్తూ ఉంటే ఎవరో గంగమ్మను పరిచయం చేసారు. కొన్నాళ్ళకే, ఆ పిల్ల యవ్వనాన్ని వాడు హరించాడు. ఆమెకి ఒక కొడుకు పుట్టాడు. అయినా భూషణరావు ఆమెని పెళ్ళిచేసుకోలేదు. ఆమెని వాడు ఉంచుకున్నాడు అని నలుగురూ అనేవారు. ఆమెకి ప్రభుత్వం తరఫున పదెకరాలు పట్టా ఇప్పించాడు. అయిదెకరాల్లో జీడిమామిడి వేయించాడు. ఆమె అహర్నిశలు ఆ తోటనే చూసుకుంటూ ఉండేది. ఆ పంట చేతికందినప్పణ్ణుంచీ, ప్రతి ఏడాదీ, వాడు ఆ పంటని ముందే దళారులకి అమ్మేసేవాడు. వచ్చిన డబ్బులో తృణమో, పణమో మాత్రమే ఆమెకి దక్కేది. కొన్నాళ్ళకు బాంబూ కూపులు ఎత్తేసారు. వాడు ఏలేశ్వరం వెళ్ళిపోయాడు. ఎప్పుడేనా ఏడాదికోసారి పంట చూసుకోడానికి ఈ ఊరు వస్తూంటాడు. ఆమె తన కుర్రాణ్ణి చదివించుకోలేకపోయింది. ఐదెకరాలతో పాటు మరొక ఐదెకరాల్లో జీడితోట పెట్టింది. అది కొడుక్కి అప్పగించింది. ఆ పిల్లవాడికి పెళ్లి చేసింది. తనని ఉంచుకున్నవాడికి తన పొలమ్మీద హక్కుందేమోగాని, తన కొడుకు పొలంలో ఒక్క మొక్క కూడా ముట్టుకునే అర్హత లేదని తెగేసి చెప్పింది.

ఆమె కథ వింటున్నంతసేపూ నేను కుతకుతా ఉడికిపోయాను. డాక్టరు మిశ్రా చెప్పిన వోల్కెనో సెగ నాకు చాలా దగ్గరగా తాకినట్టుగా అనిపించింది. రాజు అటువంటి కథలు చిన్నప్పణ్ణుంచీ ఎన్నో వింటూ ఉన్నవాడిలాగా, ఆమె మాటలు చాలా మామూలుగా వింటూ, డా. మిశ్రాకోసం ఇంగ్లిషులో తిరిగి చెప్తూ ఉన్నాడు.

పాతికేళ్ళ రెక్కల కష్టం తర్వాత కూడా గంగమ్మ ఇంట్లో చెప్పుకోదగ్గ సామానేమీ చేరలేదు. రెండు నులకమంచాలూ, ఒక నీళ్ల గోలెమూ, రెండు ఆవులూనూ. లోపల గదిలో గోడమ్మట పొడుగ్గా కర్రతో చిన్న అటకలాగా చేసి ఉంది. దాని మీద ఇత్తడి, సేవెండి గిన్నెలు, కంచాలు, గ్లాసులు బోర్లించి ఉన్నాయి. అవి ఒక్కటే ఆమె సామాజిక స్తోమతుని చెప్పే చిహ్నాలు. కష్టకాలంలో తాకట్టుపెట్టుకోడానికి పనికొస్తాయని, వాటిని చూస్తే గాని ఎవరూ అప్పివ్వరని చెప్పాడు రాజు.

ఆమె కథ వింటున్నంతసేపూ డా.మిశ్రా ఏమీ మాట్లాడలేదు. అంతా వినడమయ్యాక తర్వాత ఆమెకి మనమలు ఉన్నారా, వాళ్ళని బడికి పంపిస్తోందా అని మాత్రం అడిగాడు. ఒక మనమడు, మనమరాలు ఉన్నారనీ, వాళ్ళకింకా బడి యీడు రాలేదని చెప్పిందామె.

అప్పుడు డా.మిశ్రా 'ఎన్ని గిరిజన ప్రాంతాలు చూసాను! ఎక్కడికి వెళ్ళు, టాల్‌స్టాయి మాటలే నాకు గుర్తొస్తుంటాయి. అందుకనే ఎక్కడన్నా ట్రైబల్స్ గురించి మాట్లాడమంటే ఆ వాక్యాలతోటే మొదలుపెడతాను–' అని నాకేసి చూసాడు. నా కళ్ళల్లో కుతూహలం కనిపిస్తోందని నిర్ధారించుకున్నాక, 'ఆల్ హేపీ ఫామిలీస్ ఆర్ హేపీ అలైక్. ఆల్ అన్‌హేపీ ఫామిలీస్ ఆర్ అన్‌హేపీ ఇన్ దైర్ ఓన్ వే. ప్రతి ఒక్క గిరిజన గ్రామం, ప్రతి ఒక్క గిరిజన కుటుంబం, ప్రతి ఒక్క గిరిజనుడు– అన్‌హేపీ ఇన్ దైర్ ఓన్ వే' అని అన్నాడు.

కానీ నా దృష్టి ఆయన మాటలమీంచి పక్కకు జరిగి, గంగమ్మ ఇంటినే పరిశీలిస్తూ ఉంది. సంక్రాంతి పండగకి ఆమె ఇల్లు పూర్తిగా మెత్తుకుని వెల్లవేసి పెట్టుకుంది. అరుగుల్ని ఎర్రమట్టితో అలికి వాటిమీద తెల్లటి చుక్కల ముగ్గులు పెట్టుకుంది. ఇంటిముంగిట్లో చిన్న పందిరిమీద దొండపాదు తెల్లటిపూలతోనూ, పూలతోకల పిందెల్తోనూ కనిపిస్తోంది. గడపలకి పసుపురాసి ఎర్రటిరంగుతో అంచులు దిద్ది ఉంది. ఇంటివెనక రెండుమూడు నిమ్మచెట్లు ఉన్నట్టున్నాయి, వాటి పూతమీంచి తీపిగాలి ఆ ఇంటి చుట్టూ పేరుకుపోయింది.

'ఈచ్ ట్రైబల్ ఫామిలీ ఈజ్ అల్సో హేపీ ఇన్ హర్ ఓన్ వే' అని అనుకున్నాను. కాని డాక్టరు మిశ్రాతో ఏమీ మాట్లాడలేదు. ఆ తర్వాత ఆమె గురించిన వివరాలతో ఆ హవుస్‌హోల్డ్ ఫార్మాటు ఎలా నింపాలో ఆయన వివరించాడుగాని, అదేమంత కష్టమైన పనిగా కనిపించలేదు.

ఆ వెంటనే రామనవమి ఉత్సవాలు మొదలవడంతో నేను కూడా తక్కినవన్నీ మర్చిపోయాను. ఆ చిన్న ఊళ్ళో ఆ వేడుక కొండమీంచి ప్రవహించిన వరదలాగా ఆ ఊరంతటినీ వారం రోజుల పాటు ముంచెత్తింది.

అటువంటి ఉత్సవాలు నేనంతకు ముందెప్పుడూ చూసి ఉండలేదు. అక్కడ ఉన్నందుకు ఆ వేడుక ఒక కానుక కాగా, మరొక కానుక రోజాపుష్పం. రోజా గ్రేస్ మేడం గారి అక్క కూతురు. వరంగల్ ఆర్.ఇ.సిలో ఇంజనీరింగు చదువుతోంది. థర్డు యియరు. ప్రతి వేసవికీ తన పిన్నిగారింటికి వస్తూంటుంది. మామూలుగా కుటుంబమంతా వస్తూంటారుగాని, ఈసారి తనే రెండువారాలు ముందే వచ్చింది. ఈస్టరూ, సమ్మరూ

రెండూ కలిసివస్తున్నాయని ఆ పల్లెటూళ్ళో గడపడానికి వచ్చింది. వచ్చినరోజునే నా గురించి జోసెఫ్ గారూ, గ్రేస్ మేడంగారూ చెప్పగా విని వెంటనే చూడాలని మా ఇంటికి నడుచుకుంటూ వచ్చేసింది.

బార్బీడాల్ కళ్ళలాంటి కళ్ళూ, కనుపాపలూ, ఆ కళ్ళపైన నల్లటిదారంతో ఎంబ్రాయిడు చేసినట్టు ఒత్తుగా ఉండే కనుబొమలూ, అప్పుడే విచ్చుకుంటున్న గులాబిమొగ్గ లాంటి నోరూ– ఆమె తలుపు తోసుకుని ఇంట్లోకి అడుగుపెడుతూ ఉంటే వనలత రూపు మార్చుకునిగాని వచ్చిందా అని క్షణంపాటు విభ్రాంతి చెందాను. కాని మొదటిచూపులోనే, మొదటిమాటల్లోనే ఆమె ఎప్పటినుంచో నాకు తెలిసినంత దగ్గరగా వచ్చేసింది. కొంత సేపయ్యాక అనుకున్నాను: వనలత పూలతీగె, ఈమెనో, అప్పుడే రేకలు విప్పుకుంటున్న పువ్వు అని.

రామనవమి పేరుమీద అయిదురోజుల పండగ చేసారు. రెండురోజులముందే పెద్ద పందిరి వేసారు. ఒకవైపు ఆ పందిరినీడన మా ఇల్లూ, రామకోవెలా కలిసిపోయాయి. ఆ పందిరి కింద అడుగుపెట్టగానే జలజల కురుస్తూ పచ్చటి తాటాకు సువాసన. పందిరి నుంచి రోడ్డుపక్కకీ అటూ ఇటూ రెండు ఫర్లాంగులమేరకి సీరియలుసెట్ల దీపాలు. పైన రోడ్డు వేపుకి వెంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవి, ఆంజనేయుడు బొమ్మలు సీరియలు సెట్ల దీపాల్లో వెలుగుతూ,ఆరుతూ, వెలుగుతూ అందరి చూపులూ తమవైపు తిప్పుకుంటూ ఉన్నాయి. పందిరికి మామిడాకుల తోరణాలు కట్టారు. రంగురంగుల జెండాలు కట్టారు.

కరెంటు మాటిమాటికీ పోతూ ఉంటుంది కాబట్టి ఒక జెనరేటరు కూడా ఏర్పాటు చేసారు. పండగ ముందురోజే గ్రామఫోనుపెట్టెవాడు మైకుల్తో దిగాడు. నాలుగు లౌడు స్పీకర్లు నాలుగువేపులా పెట్టారు. ఆ వారం రోజులూ వాడు వినిపించని సినిమా పాటల్లేవు. కాని మరీ మరీ వినిపించినవి, బహుశా పురజనుల కోరికమీద కాబోలు, ప్రేమాభిషేకం, శంకరాభరణం, సర్దార్ పాపారాయుడు లాంటి తెలుగు సినిమా పాటలూ, కుర్బాని, కర్జ్ లాంటి హిందీ సినిమా పాటలూ. ఆ పాటలు వినివిని కొన్ని పంక్తులు నా ఒంట్లోకి ఇంజెక్టయిపోయాయి.

మరులు పూచిన పూలపందిరిలో
మమతలల్లిన ప్రేమసుందరికీ
పట్టాభిషేకం, పట్టాభిషేకం...

ఆప్ జైసా కోయీ మేరీ జిందగీ మే ఆయే
తో బాత్ బన్ జాయే, హా బాత్ బన్ జాయే..
హే తుమ్ నే కభీ కిసీసే ప్యార్ కియా?
కియా!
కభీ కిసీ కో దిల్ దియా?
దియా!
మైనే భీ దియా!..

పండగ ప్రోగ్రాం ఒక కాగితం అచ్చేసారు. పింక్ కలరు పేపరు. దానిమీద 'జానక్యాః కమలామలాంజలి పుటే యాః పద్మరాగాయితాః' అనే శ్లోకం. దానికింద ఆ ఏడాది కల్యాణం ఎవరు చేయిస్తున్నారో వారి పేర్లు. చివరిరోజు అన్నదానం చేసే దాతల పేర్లు. అయిదురోజులూ రాత్రి పూట సాంస్కృతికకార్యక్రమాల వివరాలు. కింద సమయాను కూలంగా ప్రోగ్రాములు మార్చబడును అనే క్లాజు కూడా.

మొదటిరోజు కల్యాణానికి ఊరంతా తరలి వచ్చింది. పొద్దున్నే చిరుజల్లు కూడా పడింది. వానకి తడిసిన తాటాకులనుంచి మరింత సువాసన కమ్ముకుంది. మొదటి రాత్రి సత్యహరిశ్చంద్ర నాటకం. తెల్లవార్లూ నడిచింది. నేనూ, మా ఇంట్లో ఇద్దరు చిన్నపిల్లల్తో పాటు రోజా కూడా రాత్రంతా నాటకం చూసాం. ఆ నాటకం ఎంత గుర్తుందో, ఆ నాటకం మొదలుపెట్టేముందు చేసిన రంగపూజ కూడా నా మనసులో అంత స్ఫుటంగానూ ముద్రపడిపోయింది.

రాత్రి తొమ్మిదైనా ఇంకా నాటకం మొదలుపెట్టలేదు. మేము ఎనిమిదన్నరకే అన్నాలు తినేసి కూచున్నాం. దాదాపు పదింటికి అనుకుంటాను, స్టేజి మీద కాషాయరంగు తెరవెనక ఒక హారతి దీపం వెలుగుతూ ఉండగా, డ్రామాట్రూపు మొత్తం 'పరబ్రహ్మ పరమేశ్వర' అంటో ప్రార్థన చేసారు. అప్పుడు కొబ్బరికాయ కొట్టిన చప్పుడు వినబడింది. ముందు తమ నాటకబృందానికి జై కొట్టుకున్నారు. తరవాత ఊళ్ళో పెద్దమనుషుల పేర్లు చెప్పి వాళ్ళకి కూడా జైకొట్టాక తెర పక్కకు జరిగింది. కిరీటధారిగా హరిశ్చంద్రుడు కనబడగానే కింద కూచున్న ప్రేక్షకులంతా చప్పట్లు కొట్టారు. ఒకరిద్దరు ఈలలు వేసారు. ఇక ఆ రాత్రంతా పద్యాల్తో, హార్మోనియం స్వరాలతో, గుక్కతిప్పుకోని రాగాల్తో ఆ స్టేజి, ఆ ఊరు, ఆ అడవి, ఆ కొండలు, చివరికి ఆ ఆకాశం కూడా మార్మోగిపోయాయి. నాకైతే వేరే లోకంలోకి పోయి వచ్చినట్టే ఉంది తెల్లవారేసరికి.

మర్నాడు ఊళ్ళో తమ్మారావు బృందం వారి కాంతామతి నాటకం. వాళ్లల్లో చాలామంది గిరిజనులు, ఒకరిద్దరు దళితులు. వాళ్ళు అంత చక్కగా పద్యాలు ధారణపట్టగలరనీ, అంత చక్కగా రాగాలు తియ్యగలరనీ ఊహించలేదు నేను. డిసెంబరునుండే రిహార్సలు మొదలుపెట్టడం వాళ్లకి బాగా కలిసొచ్చింది అనిపించింది.

మూడో రోజు మరేదో నాటకం వేసారు, గుర్తులేదు. ఎందుకంటే ఆ రాత్రి నేను ఇంట్లో పిన్నిగారికి సాయం చేస్తూ ఉండిపోయాను. నాలుగో రోజు యువకళాంజలి వారి నాటకం. అన్ని రోజుల పాటు రాత్రంతా రామకోవెల కప్పు చిల్లులు పడేలాగా రిహార్సలు చేసినా కూడా వాళ్లకేమీ కలిసివచ్చినట్టు లేదు. వాళ్ళ డైలాగులకన్నా తెరవెనక ప్రాంప్టింగే ఎక్కువ వినబడుతూ ఉంది. ముఖ్యంగా 'విజయ్ విశాలప్రపంచంలో అడుగుపెడుతున్నాడు' అనే డైలాగు ఎప్పుడు వస్తుందా అని ఆసక్తిగా మొత్తం నాటకమంతా చూసాను. ఇంతకీ, అది నాటకంలో చివరి డైలాగు. విజయ్ విశాలప్రపంచంలో అడుగుపెట్టడంతో నాటకానికి తెరపడింది. అయిదో రోజు మధ్యాహ్నం అన్న సంతర్పణ. డా.మిశ్రా ఆ సంతర్పణకి మాత్రం హాజరయ్యాడు. గ్రామస్థులందరితో కలిసి ఏకపంక్తిన భోజనం చేసే అవకాశం మళ్ళా మళ్ళా దొరకదు కదా అన్నాడు. ఆ రాత్రి రికార్డింగ్ డాన్సు. మేమెవ్వరం పోలేదుకాని, బాగా పొద్దుపోయిన దాకా లేటెస్టుసాంగ్సు రికార్డులన్నీ ఊరంతా వినిపిస్తూనే ఉన్నాయి.

వసంతఋతువు వస్తూ రామనవమిని తీసుకొచ్చిందో లేక రామనవమితో వసంత ఋతువు పరిపూర్ణత సంతరించుకుందోగాని పండగ వేడుకలు ముగిసే సరికి ఊరంతా మారిపోయి కనబడింది. ఊళ్ళో కనిపించే చింతచెట్లు, వేపచెట్లు, మామిడిచెట్లు, రావిచెట్లు కొత్త శోభసంతరించుకున్నాయి. ఊరంతా కలిసి ఒక పెళ్ళి చేసినంత సంతోషం ప్రతి ఒక్క దిక్కునా కనిపిస్తూ ఉంది.

ఊళ్ళో ఉండే రెండు తురాయిచెట్లూ (కృష్ణచూర అని అనాలి అంటుందేమో వనలత) కవి చెప్పినట్టుగా ఒక్కసారిగా బాండుమేళం మోగినట్టుగా విరబూసాయి. రోడ్డుకి ఇవతలి పక్కనుండే వేపచెట్టు విరగబూసింది. అవతలివైపు బోగనువిల్లియ కొత్త ఆకులు తొడుక్కుని నెత్తిన గులాబిరంగు కిరీటంతో ఆ వసంతకాలమంతా ధగధగలాడుతూనే ఉంది. ఒకప్పుడు నేనూ, డాక్టరూ మా పెళ్ళయిన కొత్తలో కృష్ణానది సముద్రంలో కలిసే హంసలదీవిదాకా వెళ్ళాం. ఆ సంగమానికి చేరుకోడానికి దాదాపు ఇరవై ముప్పై కిలోమీటర్ల దూరం నుంచే ఆ నదిలో, ఆ నేలలో, అక్కడున్న గడ్డిలో, చివరికి అక్కడ తిరుగాడే పక్షుల్లో కూడా సముద్రస్పర్శ కనిపిస్తూ ఉండింది. సంగమం ఎక్కడో నది సముద్రంలో కలిసే తావులో మటుకే లేదనీ, ఆ అనుభవం కూడా ఆ నది ఒక్కదానికే సంబంధించింది కాదనీ ఆ

రోజు నాకు అర్థమయింది. బహుశా కొన్నేళ్ళపాటు నువ్వు ఆ దారుల్లో సంచరిస్తే, నీ తలపుల్లో కూడా ఆ సంగమసంతోషం నీకు అనుభవానికొస్తూ ఉంటుందేమో అనుకున్నాను.

వసంతవేళ ఆ ఊళ్ళో నేను చూసిన వెలుగు కూడా అలాంటిదే. మంచుమబ్బు విడిపోయి ధారాళంగా సూర్యకాంతి వర్షించే కొద్దీ, కొండలమీదా, ఆడవిలోనూ మాత్రమే కాదు, ఊళ్ళో ఉన్న చెట్లలో, మొక్కల్లో, చివరికి మనుషుల్లో కూడా ఏదో అజేయమైన తళతళ కనిపించడం మొదలయ్యింది. చెట్ల మొదటగా చిగురు తొడిగేది బంగారాన్ని అని ఒక కవి చెప్పగా విన్నాను. ఆ ఋతువంతటా అక్కడ చెట్లమీద నేను చూసింది బంగారం కూడా కాదు, అసలు ఆ రంగు, ఆ వర్ణశోభ మనకు తెలిసిన ఏ మూలకానికీ లేదని చెప్పగలను. అది ఆకాశానిదీ, భూమిదీ కూడా కాదు. అదొక కాలానిది. ఆ ఋతువుకి మాత్రమే సాధ్యమైన రసవిద్య అది. ఆ రోజుల్లో నువ్వు ఆ ఊళ్ళో ఊరికే అటు ఏటినుంచి ఇటు చాపరాయి దాకా అటూ ఇటూ ఒకటి రెండు సార్లు తిరిగినా చాలు, వికసించిన విద్యుత్తేజమేదో నీలోకి ప్రవహిస్తున్న అనుభూతి చెందుతావు. నువ్వు గాలిని కాక కాంతిని పీలుస్తున్నావనే స్పృహ కలుగుతుంది. అలాగని ఒక ఏప్రిల్లో హటాత్తుగా ఒక రోజు నువ్వా ఊళ్ళో అడుగుపెడితేగాని ఈ రాసాయనిక చర్య నీకు అర్థం కాదు. నువ్వొక హేమంతకాలం నుంచీ అక్కడ ఉండాలి. అప్పటికే సీతాకోకచిలుకలూ, తుమ్మెదలూ అక్కణ్ణుంచి వలసపోయి ఉండాలి. అప్పటినుంచీ, ఆ అడవికీ, సూర్యుడికీ మధ్య ఎన్ని సంప్రదింపులు జరిగి ఉంటాయో అన్నీ కాకపోయినా కొన్నైనా నువ్వు విని ఉండాలి. ఆ రసచర్చల్లో పాలుపంచుకుని ఉండాలి. మళ్ళా తేనెటీగలు ఆ అడవిబాట పట్టడం కళ్ళారా చూడాలి. అప్పుడు ఆ హరితగంగావతరణం నీకు సాక్షాత్కరిస్తుంది. నిన్ను అనుగ్రహిస్తుంది.

రామనవమి అయిన మర్నాడే బడికి కుటీరం కట్టే పని కూడా మొదలయ్యింది. డాక్టరు మిశ్రా ఆ స్కూలు పిల్లల్లో ఒక గిరిజనబాలిక తల్లితో కొబ్బరికాయ కొట్టించి పని మొదలుపెట్టించాడు.

మేము సర్వే పని కూడా మొదలుపెట్టాం. రోజా కూడా నాకు సాయంగా రావడం మొదలుపెట్టింది. రోజూ మరీ పొద్దున్నే ఇళ్ళకు వెళ్ళి సర్వే చేసేవాళ్ళం. ఎనిమిది దాటితే కొండరెడ్లు అడవికో, కొండకో మరేదో పనికో వెళ్ళిపోతారు. సాయంకాలాలు కూడా సర్వే చేద్దామనుకున్నాంగాని అది అంత వీలుపడేలా కనిపించలేదు. రోజూ సాయంకాలం నేనూ, రాజూ, రోజా మా ఇంటిదగ్గరో, జోసెఫ్ గారి ఇంటిదగ్గరో కలుసుకునేవాళ్ళం. బడిపని మొదలుపెట్టాక నాలుగైదు రోజులు డాక్టరు మిశ్రా కనిపించలేదు. ఆయన రకరకాల స్థాయిల్లో అధికారుల్ని కలవడానికి అడ్డతీగలనో, రంపచోడవరమో, కాకినాడనో వెళ్ళి

ఉండవచ్చన్నాడు రాజు. ఆ తర్వాత ఒక సాయంకాలం రాజు కూడా కనిపించలేదు. మర్నాడు నేను జోసెఫ్ గారి ఇంటిదగ్గర రోజాతో మాట్లాడుకుంటూ వుంటే అక్కడికొచ్చాడు. చేతిలో కాగితాలూ, ఏదో పుస్తకం ఉన్నాయి. నేరుగా సర్వే నుంచి ఇటే వస్తున్నట్టుంది.

రాగానే నిన్నా మొన్నా ఏమైపోయావని అడిగితే, డా.మిశ్రాతో కలిసి కొండరెడ్ల పండగ చూడ్డానికి వెళ్ళానని చెప్పాడు.

ఆ ముందురాత్రి చైత్రపూర్ణమి అని తెలిసాక రాజు మీద చాలా కోపం వచ్చింది. నాకు చెప్పి ఉంటే నేను కూడా వచ్చి ఉండేదాన్ని కదా అన్నాను.

'ఎక్కడికొస్తావు? అది అడవిలో జరిగే పండగ. కొండరెడ్లు విల్లంబులు పట్టుకుని వేటకి వెళ్తారు. వేట అంటే వేట కాదులే. ఊరికే అలా వేటాడినట్టు అటూ ఇటూ అడవిలో తింటారు, తాగుతారు, తిరుగుతారు, డాన్స్ చేస్తారు' అని అన్నాడు. అతడు నన్ను మొదటిసారిగా 'నువ్వు' అని అన్నాడని తెలుస్తోందికాని, ఆ పండగ విశేషాల్లో ఆ స్ఫురణ పక్కకు పోయింది.

'అయితే ఏం మేం రాకూడదా?'

'రాకూడదంటే రాకూడదని కాదు. కాని డా. మిశ్రా వద్దన్నాడు' అన్నాడు.

'డా.మిశ్రాకి ట్రైబల్ రిచ్యువల్స్ మీదా కల్చర్ మీదా అంత శ్రద్ధ ఎప్పుడు పుట్టుకొచ్చింది?' అనడిగాను వ్యంగ్యంగా.

'నిన్న కూడా ఆయన వాళ్లతో ఆ పండగ గురించేమీ మాట్లాడలేదు. ఆయన చూసేదల్లా పదిమంది ట్రైబల్స్ ఎక్కడ కలిస్తే అక్కడికి పోవాలని. నిన్న కూడా అంతే, వాళ్లనేవో ప్రశ్నలు అడుగుతూనే ఉన్నాడు. భూమి సమస్యల గురించీ, భూమి బదలాయింపు గురించీ. వాళ్ల ధ్యాస ఇక్కడ లేదు. కొంతసేపటికి వాళ్ళు విసుక్కోడం కూడా మొదలు పెట్టారు.'

'కాని డా.మిశ్రా ఇలాంటి పండగలు ఎన్నో చూసాడని మాత్రం తెలుస్తోంది. నా చిన్నప్పుడు ఈ వెన్నెలరాత్రుల్లో రాత్రంతా పాటలు వినబడుతూనే ఉండేవి. కొండరెడ్ల వీథులు నిద్రపోయేవే కావు. అదంతా ఎందుకో ఇప్పుడు డా.మిశ్రా చెప్తుంటే అర్థమయింది. ఒకప్పుడు కొండరెడ్లు కొండపోడు చేసేటప్పుడు జనవరిలోనే అడవి నరికి తగలబెట్టేవారట. అలా నరికిన చెట్లూ, కాలినచెట్లూ, బూడిదా అక్కడే ఎరువుగా తయారయ్యేదిట. పల్లపు ప్రాంతాల్లో తొలివానలు జూను రెండవవారంలో మొదలవుతాయి. కాని మన్యంలో

తొలివానలు చైత్రమాసంలోనే మొదలవుతాయి. అందుకని వాళ్ళు చైత్రమాసం గడిచే దాకా ఆగి, వైశాఖం రాగానే వ్యవసాయం పనులు మొదలుపెట్టేవారు. ఫాల్గుణమాసం చివరి రెండువారాల్లోనూ అన్ని సమకూర్చుకునేవారు. ఇక ఈ చైత్రమాసమంతా ఊరంతా పండగ తప్ప మరొకటేమీ ఉండదు. ఎవ్వరూ పనిచెయ్యరు. ఆట, పాట, వేట– అంతే. ఇప్పుడు కాలం మారిపోతూ ఉంది కాబట్టి, ఆ ఆచారాలు కొన్ని మిగిలాయి, కొన్ని పోయాయి. మనూళ్ళోనే చూడు, కొండకింద పొలాల్లో పొలం పనులు ఏరువాకపున్నమికి మొదలవుతాయి. కాని కొండమీద పోడుచేసే చోట భూదేవి పండగనే ఏరువాక అన్నమాట' అని చెప్పాడు రాజు.

'నా చిన్నప్పణ్ణుంచీ మనూరి చిత్రపటంలో కొన్ని గాప్స్ ఉండిపోయేయి నా దృష్టిలో. డా.మిశ్రాతో మాట్లాడుతుంటే ఆ గాప్స్ ఫిలప్ అవుతూ ఉన్నాయి' అని కూడా అన్నాడు.

నేను వింటూ ఉన్నాను. నేను కూడా ఒక మగపిల్లవాణ్ణి అయి ఉంటే నిన్న రాత్రి ఆ కొండరెడ్ల పండక్కి పోగలిగి ఉండేదాన్ని కదా అనుకున్నాను. అడవిలో ఆ గిరిజనులు పాటలు పాడుకుంటూ ఉండే దృశ్యం కళ్ళముందు ఊహించుకోడానికి ప్రయత్నించాను.

'నేను కూడా చిన్నప్పణ్ణుంచీ వింటూ ఉన్నానుగాని, ఇదే మొదటిసారి ఆ పండగ చూడటం. వెన్నెలరాత్రి మగవాళ్ళంతా, అంటే ముసలాళ్ళు కాదు, కుర్రాళ్ళు, ఒక గ్రూపుగా మారి ఒకవైపు పాటలు పాడుతూ ఉన్నారు. ఆడవాళ్ళు, కన్నెపడుచులన్నమాట, మరొకవైపు పాటలు పాడుతూ ఉన్నారు. ఒకరినొకరు ఎత్తి పొడుచుకుంటూ ఉన్నారు, కవ్వించుకుంటూ ఉన్నారు. ఆ తర్వాత అంతా వరస కట్టి నాట్యం చేసారు. ముందు ఒక యువకుడు. అతని పక్కన ఒక యువతి. ఆమె తన కుడిచెయ్యి అతని భుజం మీద వేసింది. తన ఎడమచెయ్యి తన ఎడమపక్కనున్న యువకుడి నడుం చుట్టూ వేసింది. ఆమె ఎడమపక్కనున్న యువకుడు తన కుడిచెయ్యి ఆమె భుజం చుట్టూ వేసాడు. తన ఎడమచెయ్యి తన ఎడమ పక్కనున్న యువతి నడుం చుట్టూ వేసాడు. అలా ఒక మగ, ఒక ఆడ, ఒక మగ, ఒక ఆడ– వాళ్ళు నడిచే కెరటంలాగా, చేతులే తాళ్ళుగా కట్టుకున్న ఉయ్యాలలాగా ఒకటే డాన్సు చేస్తూ ఉన్నారు. తుళ్ళిపడుతూ ఉన్నారు. పాటపాటకీ ఓ అంటో కొండకోనల్ని రాగాల్తో నింపేస్తో ఉన్నారు. దాన్ని దిమిసా డాన్సంటారని చెప్పాడు మిశ్రా.'

'కొంత సేపటికి ఆ పాటల నిషా డా.మిశ్రాకి కూడా తలకెక్కింది. ఆయన కూడా వాళ్లతో కలిసి డాన్స్ చేసాడు. వాళ్లతో మాటలు కలిపాడు. నిజానికి అవి మాటలు కావు, సామెతలు. మీరు ఈ పండగ ఎందుకు చేస్తున్నారు అని అడిగాడు మిశ్రా. అప్పటికి

ఎన్నో సార్లు ఎందరో ట్రైబల్స్‌ని ప్రతిసారీ కొత్తగా అడిగినట్టే వాళ్లనీ అడిగాడు. ఒకాయన ఏమన్నాడో తెలుసా? 'దేవతలకి ఇచ్చి పెరగాలి, చుట్టాలకిచ్చి చెడిపోవాలి' అన్నాడు. మనూళ్ళో లొద్దు ఉంది చూడూ–'

'ఎక్కడా?'

'ఈసారి నీకు చూపిస్తాలే. అక్కడ నడిచింది ఈ గానాబజానా అంతా.'

'ఆ పాటలు దొరుకుతాయా? మళ్లా పాడమంటే పాడతారా?'

'ఏమో! రాత్రి ఆ పాటలు నేను వినలేదు, చూసాను. నువ్వడిగినట్టే, డా. మిశ్రాని అడిగితే, ఆయన పొద్దున్న నాకీ పుస్తకం ఇచ్చాడు. ఇక్కడి పాటలు కాదుగాని, పాడేరు మన్యంలో ఇలాంటప్పుడు పాడుకునే పాటలట. అయితే ఇవి ఒరియాలో ఉన్నాయి. అయితే పక్కన తెలుగులిపిలో కూడా ఉన్నాయి చూడు–' అని పుస్తకం తెరిచి, ఒక పాట చూపించాడు.

అతని చేతుల్లో పుస్తకం లాక్కుని చూసాను. 'ఆదిబసి లొకొర్ పొరొబ్ కత' ఆదివాసి ఒరియా–తెలుగు పుస్తకం. పేజీలు అటూ ఇటూ తిప్పాను. అప్పుడు అతను చూపించిన పాట చూసాను. తెలుగులిపిలో పాటా, అర్థం రెండూ ఉన్నాయి:

సిబి సిబి సిబి సిబి బబు దొనొ
రంగొని బిఢిరొ సిబి
గజ్ఞొ నిసనికె మనొకయ్ మంగిబి
సంకొడి కెలితొ జిబి
బాబు దొనొ కిందొరి కెలితొ జిబి

(సిబి సిబి సిబి సిబి అబ్బాయీ, అమ్మాయీ, రాళ్లవలపుల సిబి, మా ఊరి దేవతకు మనవి చేసుకుంటున్నాను, సంకిడి ఆడుతూ పోతాను. అబ్బాయి, అమ్మాయి, కిందొరి ఆటకు పోతాను)

అజి జిబి జిబి కలికె కయ్ జిబి
లగిల మొవసొ నొ చడె బెగి
అవు దొయ్ దినొ తిబి

(ఇవాళ పోతాను, పోతాను, రేపు తిని పోతాను, మళ్లా రెండురోజులుంటాను)

టొంట అంబొ లొంబొ లొంబొ బొలి
బారొ టొంట అంబొ లొంబొ లొంబొ
అజిసె దరిలి పొర్ తుమొ కయ్ నమొ
రొక్య కొరొ బిరాకొమొ

(గున్నమామిడి పొడుగు పొడుగు, గున్నమామిడి చాలా పొడుగు, ఈవాళే పట్టాను మొదటి పేరు, రక్షించు బ్రహ్మ రక్షించు)

రొకి జ రొకి జ రొయ్ కిల, కయ్
బెలె నొ మిలె సొబు కలె

(రక్షించు, రక్షించు, మించిపోతే మళ్లా రాదు ఈ రోజు)

అసిలిరె నువ కి బొలి నొ కువ
లాజొ ఎలె కజొ నయ్
లాజొ చడయ్ కి గితొ కయ్
గయిబు టొండె టొండే దెక నయ్

(వచ్చానురా కొత్తగా, ఏమీ అనకండి, సిగ్గుపడితే లాభం లేదు. సిగ్గువిడిచి నేను కూడా పాట పాడతాను. నా నోటికేసి చూడకండి)

గహ గహ దొనొ గాకు రొతొనొ
గహ తెభె సుని దెకు
ఉలొటొ పలొటొ పదొ పిటి గలె
పొదె పొదె గయ్ కెలు

(పాట పాడు అమ్మాయీ, పాడు, పాడితే వింటామందరం. ఎదురు బదురు పదాలు తప్పితే, సరిచేసుకుందాం, కలిసి పాడుకుందాం)

'ఆ పండగని ఇటిక్ష్ పండగ అంటారని చెప్పాడు. చొయత్ పొరొబ్ అని కూడా అంటారని చెప్పాడు. ఒకప్పుడు నెల్లాళ్ళు నడిచేదనీ, ఇప్పుడు కూడా పాడేరు మన్యంలో నెల్లాళ్ళపాటూ పండగ చేసుకునే గ్రామాలున్నాయనీ, కానీ చాలాచోట్ల రెండువారాలకీ, వారం రోజులకీ, అయిదురోజులకీ కుదించేస్తున్నారనీ చెప్పాడు. అన్నట్టు, మరో ఇంటరెస్టింగ్ మాట కూడా చెప్పాడు. నువ్వు వినాల్సిన మాట. నాకు చెప్పాడు' అన్నాడు.

'నాకు చెప్పమన్నాడా?' అనడిగాను. నాకు ఉక్రోషం పెరిగిపోతూ ఉంది.

'అలాగే అనుకో. ఇంతకీ ఏం చెప్పాడంటే, ఇలాంటి పండగలకీ, రిచ్యువల్స్‌కీ మామూలుగా తాను ఎందుకు వెళ్ళడో చెప్పాడు. ఎందుకంటేటా, ఒకప్పటి గిరిజనదేవతలు ఇప్పుడు నెమ్మదిగా అదృశ్యమైపోతున్నారట. ఈ ప్రపంచంలో అన్నిటికన్నా హృదయ విదారకమైన దృశ్యం, ఆయన మాటల్లో 'ద మోస్ట్ అన్‌సెట్లింగ్ ఎక్స్ పీరియెన్స్', దేవతలు మరణించే దృశ్యమంట. అందుకనే ఆ దరిదాపులకి పోవాలన్నా తనకి భయమని చెప్పాడు.'

'కానీ మరి నిన్న రాత్రి ఆయన దేవతల్ని చూసి ఉండాలే!'

'ఆయనదాకా ఎందుకు? నేను కూడా చూసాను! ఆ చింత తోపులో ట్రైబల్స్ డాన్స్ చేస్తుంటే అక్కడ కొండమీద ప్రతి బండమీదా దేవతలు వచ్చి కూర్చున్నట్టే ఉంది.'

నేను పుట్టిబుద్ధెరిగాక ఎప్పుడూ ఎవరిపట్లా అసూయ పడి ఎరగను. కానీ ఆ రోజు రాజుపట్ల చెప్పలేనంత అసూయ కలిగింది. ఆ చైత్రపూర్ణిమ రాత్రి, ఆ కొండవారలోయలో, ఆ చింతచెట్లతోపులో, ఆ కొండరెడ్ల దిమిసా చూడడానికి వచ్చిన దేవతల్ని నేను చూడలేక పోయానే అన్న దిగులు బహుశా ఈ జన్మకి నన్ను వదలదు.

❋

19

అనుకున్నట్టే పాఠశాల కుటీరం నిర్మాణం శరవేగంగా జరిగింది. దాదాపు అరవై డెబ్భై మంది గ్రామస్థులు ఆ పనిలో పాల్గొన్నారు. ముందునుంచీ చేస్తూ వచ్చిన ఏర్పాట్లు పక్కన పెడితే, మొత్తం కట్టడం మూడురోజుల్లో పూర్తి చేసేసారు. 'మూడు పగళ్ళు, మూడు రాత్రుళ్ళల్లో ఏది కట్టినా అది దేవాలయమే' అని గ్రేస్ మేడం తనతో అన్నదని రోజా చెప్పింది. కొండరెడ్లు తమ ఇళ్లు తీర్చిదిద్దుకున్నట్టే బడి గోడల్నీ, అరుగుల్నీ ఎర్రమన్నుతో అలికారు. అరుగుల చుట్టూ తెల్లటి చుక్కల వరస ముగ్గు పెట్టారు. గోడలమీద పొడుగ్గా పూలతీగెల్లాగా తెల్లటిగీతలు గీసారు. ఆ పాకని నిజంగానే ఒక పొదరిల్లుగా మార్చేసారు.

పిల్లలు కువకువలాడటంకోసం తల్లిపక్షి గూడు కట్టుకున్నట్టుగా తమ పిల్లలకోసం ఆ ఊరంతా అందమైన పిచికగూడు కట్టుకుంది. నిజంగానే దేవుడిమందిరంలానే కట్టారు దాన్ని. ఒక వంటపాక కూడా కట్టారు. చుట్టూ కంచె పెట్టారు. రామనవమి పందిరిలో రామకోవెల ముందు కొంత భాగం వదిలిపెట్టి తక్కిన పందిరి మొత్తం అక్కడ నుంచి తీసి ఇక్కడ మళ్లా పందిరి వేసారు. రంగుకాగితాలు కట్టారు. తోరణాలు కట్టారు. గ్రామఫోను పెట్టే, సినిమాపాటలూ లేవు తప్ప మొత్తం మరోసారి రాముడి కల్యాణం చేసినట్టే ఉంది అవాళ.

వేసవి సెలవులు ఇచ్చేముందు చివరి పనిదినం కన్నా ఒకరోజు ముందే అంటే ఏప్రిల్ ఇరవైరెండు నాడు ఆ బడి కుటీరానికి ప్రారంభోత్సవం జరిగింది. డా.మిశ్రా అదంతా పెద్ద వేడుకలాగా చేయించాడు. బ్లాక్ డెవలప్‌మెంటు ఆఫీసరుని దగ్గరుండి తీసుకొచ్చాడు. ఊళ్ళో ఉన్న పెద్దమనుషులందరినీ ఆహ్వానించేడు. టీచర్లు పిల్లల్ని విలేజిచావడినుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి కొత్త స్కూల్లో ప్రవేశం చేయించి కూచోబెట్టారు.

పెద్దమనుషులూ, బిడివో గారూ మాట్లాడేక డా.మిశ్రా కూడా క్లుప్తంగా ప్రసంగించాడు. గిరిజనుల అభ్యున్నతికి విద్యని మించిన ఆయుధం మరొకటిలేదనీ, చదువుకుంటేనే వాళ్ళకి సాధికారికత సిద్ధిస్తుందనీ చెప్పాడు. ఆ ఇంగ్లిషు ప్రసంగాన్ని తెలుగుచేసే అవకాశం నాకు లభించింది.

ఆ సాయంకాలం మళ్ళా మేమంతా బడి పాక దగ్గర మరో సారి కలుసుకున్నాం. మాలో ఏదో చెప్పలేని సంతోషం పొంగిపొర్లుతూ ఉంది. ఆ గ్రామానికీ, ఆ పిల్లలకీ ఏదో ఒక చిన్న సాయం మా వంతు మేము చెయ్యగలిగామన్న భావం మాకు కొత్తబలాన్నిస్తూ ఉంది. కాని మిశ్రా ముఖంలో ఏమంత సంతోషం లేదు.

'ఇంతా చేసాం గాని, పిల్లలకి సిట్టింగు ప్లాంకులు అవసరమని తట్టలేదు చూడండి. ఎంత వయసొస్తే ఏం లాభం? ఎంత అనుభవముందని చెప్పుకుంటే ఏం లాభం' అని మిశ్రా తనని తాను తిట్టుకుంటూ ఉన్నాడు.

'దానికేముంది సార్! మనకి ఎవరో ఒక దాత దొరక్కపోడు' అన్నాడు రాజు.

అతనా మాట అనగానే మిశ్రా కళ్ళల్లో ఆశ కనిపించింది.

'ఈ సమ్మర్‌లో మనం ఇక్కడ మొక్కలు పెంచలేం గాని, కనీసం కంచె చుట్టూ టేక్ ప్లాంట్స్ వేయిస్తే బాగుంటుంది. జోసెఫ్ గారితో మాట్లాడాలి' అన్నాడు మిశ్రా.

'నేను బాబాయ్‌కి ఇవాళే చెప్తాను' అంది రోజా.

ఒక విద్యావంతుడు ఒక గ్రామంలో ఒక్క రోజు ఉన్నా ఆ గ్రామంలో మార్పు రాక తప్పదని డా.మిశ్రా అన్నాడు. కాని ఆ రోజు మా నలుగురితో పాటు రాజు 'గాంగ్' మరో అయిదారుగురు యువకులున్నారు. నాగరాజు, తాతయ్యలు, బాబూరావు, సత్యనారాయణ, రాజన్నదొర, ఇంకొందరి పేర్లు నాకు గుర్తులేవు. మూడు రోజుల్లో మిరాకులసుగా బడికి కుటీరాన్ని లేపిన చేతులు వాళ్ళవి.

'మొన్న మేము చొయిత్ర పొరొబ్ డాన్స్‌కి వెళ్ళాం. రాజు మీకు చెప్పే ఉంటాడు' అన్నాడు మిశ్రా నాతో.

'అవును సార్. చాలా జెలసీగా అనిపిస్తోంది మిమ్మల్ని చూస్తుంటే. మాకు చెప్తే మేము కూడా వచ్చి ఉండేవాళ్ళం కదా. అవునూ! మీరు ట్రైబల్స్‌కి జరిగే ఇన్‌జస్టిస్ గురించి కదా ఎక్కువ ఆలోచిస్తుంటారు, మరి ఆ రిచ్యువల్ చూడటానికి ఎందుకు

వెళ్ళారు?' అనడిగాను. కావాలనే. ఎందుకనో మిశ్రాని చూస్తుంటే కాలేజిలో నా సీనియర్ స్టూడెంటుని చూసిన భావమే కలుగుతూ ఉంది నాలో. ప్రొఫెసరు సేన్‌గుప్తతో ఇలా మాట్లాడగలనని అనుకోను.

మిశ్రా ఏమీ మాట్లాడలేదు. మౌనంగా ఉన్నాడు. బహుశా ఏదో ఆలోచిస్తూ ఉండవచ్చు. నేనే సంభాషణ మరికొంత పొడిగించాను.

'మీరు ఈ ఊళ్ళో ప్రజలు రామకోవెల మీద చూపించిన శ్రద్ధ స్కూలు మీద చూపించ లేదని అన్నారు. మీ మాటలు నన్ను వెంటాడుతూనే ఉన్నాయి. నాకు ఒక కారణం దొరికింది. మొన్న ఒక రోజు మా ఇంట్లో ఉన్న పిల్లల టెక్స్ట్ పుస్తకాలు మొత్తం చదివాను. అందులో ఈ గిరిజనుల గురించీ, ఈ అడవి గురించీ, ఈ కొండల గురించీ, మీరు చెప్తున్న భూమిసమస్యల గురించీ ఏమీ లేదు. కనీసం ఒక చింతచెట్టు గురించీ, లేదా మీరు వెళ్లారే ఆ ఇటిజ్జ్ పండగ గురించీ ఒక్క వాక్యం కూడా లేదు. నాకనిపించింది, ఈ గిరిజనులకి ఈ బడి గురించి ఏమీ తెలీదు. దీనికీ వాళ్ళకీ ఏమీ సంబంధం లేదు. ఒకవేళ ఈ బడిలో తమ గురించీ, తమ జీవితం గురించీ పిల్లలకి చెప్తారని తెలిస్తే, ఈ ఊళ్ళో వాళ్ళు ఎప్పుడో ఈ బడికి పెద్ద బిల్డింగ్ కట్టుకుని ఉండేవారు కదా అనిపించింది' అన్నాను.

మిశ్రా నా మాటలు శ్రద్ధగా విన్నాడు. వింటున్నంతసేపూ కన్నార్పకుండా నన్నే చూస్తూ ఉన్నాడు.

'మొత్తం టెక్స్ట్ బుక్స్ చదివేరా! ఏ క్లాసులు?'

'ఫిఫ్త్ క్లాసు, థర్డ్ క్లాస్. తెలుగు, లెక్కలు, సాంఘిక శాస్త్రం, సామాన్య శాస్త్రం అన్నీ చదివేను. ఒక్క బొమ్మగాని, చివరికి లెక్కల్లో ఒక్క ఎగ్జాంపుల్ కూడా గిరిజన జీవితానికి చెందింది లేదు' అన్నాను.

డా. మిశ్రా తాను కూచున్నచోటునుంచి లేచి వచ్చి అభినందనపూర్వకంగా నాకు షేక్ హాండిచ్చాడు.

'నౌ ఐ అండర్ స్టాండ్ వై ప్రొఫెసర్ వజ్ సో అప్రిషియేటివ్ ఆఫ్ యూ' అని అన్నాడు.

కాని నేను చెప్పాలనుకున్నది ఆపలేదు.

'కాబట్టి నేను చెప్తున్నదేమిటంటే, ట్రైబల్ కల్చర్‌ని పక్కన పెట్టి ట్రైబల్ ప్రోబ్లమ్స్‌ని మనం అడ్రస్ చెయ్యలేం. ఆ పుస్తకాల్లో కనీసం కొన్ని పాఠాలేనా ట్రైబల్స్ గురించి ఉండి ఉంటే వాళ్ళు ఈ బడిని ఇంత పట్టించుకోకుండా వదిలిపెట్టేసి ఉండేవారు కాదు కదా!' అన్నాను.

మిశ్రా చిరునవ్వాడు. ఒక మనిషి అంత ఆహ్లాదపూర్వకంగా చిరునవ్వు నవ్వగలడని నాకు తెలీదు.

'ఓ! నౌ ఐ గెట్ యు. వచ్చినప్పణ్ణుంచీ నీ మనసులో నా మీద ఒక ముద్ర పడి పోయింది. నేను ట్రైబల్స్ గురించి మాట్లాడుతున్నానుగాని, వాళ్ళ కల్చర్‌ని పట్టించుకోవడం లేదని. ఐ థింక్, ఐ షుడ్ హేవ్ ప్రెజెంటెడ్ మైసెల్ఫ్ ఇన్ బెటర్ లైట్' అని అన్నాడు. అప్పుడు మళ్లా చెప్పడం మొదలుపెట్టాడు: 'విమలా, స్కూల్ యాజ్ ఎ కాన్సెప్ట్, యాజ్ ఏన్ ఇన్‌స్టిట్యూషన్ ఈజ్ ఎ టోటల్లీ మోడర్న్ అండ్ వెస్టెర్న్ కాన్సెప్ట్. కాని ఎడ్యుకేషన్ యాజ్ ఎ ట్రాన్స్ఫర్ ఆఫ్ నాలెడ్జి, ట్రాన్స్ఫర్ ఆఫ్ టెక్నాలజీ, నాట్ న్యూ టు ట్రైబల్ లైఫ్. మీరు చెప్తున్నదాంతో పూర్తిగా ఏకీభవిస్తున్నాను. ఆ మాటకొస్తే ఒకటి రెండు పాఠాలేమిటి? మొత్తం టెక్స్ట్‌బుక్స్ అన్నీ ట్రైబల్ రిలేటెడ్‌గా ఉండాలంటాను. అసలు ఒక స్టాండర్డ్ యూనివర్సల్ టెక్స్ట్ బుక్ ఆల్వేస్ గోస్ అగెనెస్ట్ ద టెనెట్స్ ఆఫ్ ట్రైబల్ లెర్నింగ్. అందరూ చదువుకునే చదువే తాముకూడా చదువుకోవడం వల్లనే కదా, ట్రైబల్ చిల్డ్రన్ అటు నాన్ ట్రైబల్ లైఫ్‌కీ చెందడం లేదు, ఇటు ట్రైబల్ లైఫ్‌కీ చెందడం లేదు' అని–

'రూత్ బెనెడిక్ట్ ఒక మాటన్నది. ద పర్పస్ ఆఫ్ యాంత్రొపాలజి ఈజ్ టు మేక్ ద వరల్డ్ సేఫ్ ఫర్ హ్యూమన్ డిఫరెన్సెస్ అని' అని అంటూ తన చుట్టూ ఉన్న వాళ్ల వేపు చూసాడు. తన మాటలు మరీ వాళ్ళకి అర్థం కాకుండా పోతున్నాయేమో అని సందేహించాడు. మళ్ళీ ఇలా అన్నాడు:

'కాబట్టి నేను కలగనే గిరిజన పాఠశాలలో లెసన్స్, సిలబి, అసలు కరికులం మొత్తం ట్రైబల్ పేరెంట్సే నిర్ణయించుకుంటారు. వాళ్ళూ, టీచర్లూ, పిల్లలూ కలిసి తమ టెక్స్ట్‌బుక్స్ తామే రాసుకుంటారు. దిస్ ఈజ్ మై డ్రీమ్. బట్, ఆ రోజు రావడానికి ఇంకా చాలాకాలం పడుతుంది. ముందు కనీసం పిల్లలు తలదాచుకోడానికి ఒక నీడా, కూచోడానికి నేలబల్లలూ కావాలి కదా. అందుకని కల్చర్ కన్నా ముందు ఇన్‌జస్టిస్ గురించి మాట్లాడాలంటాను. రాజు మీకు చెప్పే ఉంటాడు, యు మే నాట్ ఫైండ్ యాన్ ఆర్డెంట్ వర్షిపర్ ఆఫ్ ట్రైబల్ గాడ్స్ అండ్ గాడెసెస్ దేన్ మీ' అని అన్నాడు.

అప్పుడు డా. మిశ్రా మళ్ళా అక్కడున్న యూత్‌ని మరొకసారి మనసారా అభినందించాడు. అప్పుడొకరు 'మా ఊళ్ళో అన్నిటికన్నా పెద్ద సమస్య సారా దుకాణం. దాన్ని మూసెయ్యలేమా?' అనడిగారు. రాజు ఆ ప్రశ్నని ఇంగ్లిషులో చెప్పేటప్పటికి డా. మిశ్రా ముఖంలో ఒకింత విచారం అలముకుంది.

డా. మిశ్రా ఏమి సమాధానం చెప్తాడా అని కుతూహలంగా ఎదురు చూసాను. ట్రైబల్స్ వాళ్ల సారా వాళ్ళే కాచుకోవచ్చంటాడా లేకపోతే ప్రభుత్వాధికారులకి చెప్పి సారా దుకాణం మూయించేమంటాడా?

మిశ్రా ఆ రెండూ చెప్పలేదు.

'అందుకే నేను చదువు గురించి మాట్లాడుతున్నాను. సారా తాగడం వల్ల వచ్చే దుష్పరిణామాల్ని మనం మహిళలకు చెప్పగలిగితే వాళ్ళే తమ భర్తల్ని మార్చుకోగలుగుతారు. లేకపోతే, ఆ దుకాణం మూసెయ్యమని సత్యాగ్రహం చేస్తారు' అన్నాడు.

'ఆ సత్యాగ్రహం మనమే ఎందుకు చెయ్యకూడదు?' అనడిగారు ఒకరు.

డా. మిశ్రా మళ్లా చిరునవ్వాడు.

'గిరిజనుల విషయాలకు వచ్చేటప్పటికి అందరూ చేసే పొరపాటు ఇదే. వాళ్లని సోషల్‌ఇన్‌జస్టిస్ నుంచి కాపాడటానికి ప్రభుత్వమో, లేదా నక్సలైట్లో బాధ్యత పడాలనుకుంటారు. కాని నా దృష్టిలో అది గిరిజనుల్ని మరింత డిపెండెంట్ చెయ్యడం. అందుకే గాంధీగారు, ప్రజలదగ్గరకు వెళ్లండి, వాళ్ళతో మాట్లాడండి, వాళ్లని ట్రైన్‌అప్ చెయ్యండి అని చెప్పారు. గిరిజనుల సమస్యల్ని గిరిజనులే హేండిల్ చేసుకోగలిగే స్థితికి రావాలి. దాన్నే స్వరాజ్ అంటారు' అన్నాడు డా. మిశ్రా.

అర్థమయింది. మిశ్రా వచ్చేక గాంధీగార్ని కూడా మా గాంగులో ఒక మెంబరుగా మారుస్తున్నాడు!

'అవును సార్. మీరు చాలా ప్రాక్టికల్. అదే నాకు చాలా నచ్చింది మీలో' అని అన్నాడు రాజు.

'ప్రాక్టికల్'– ఆ పదం వినగానే నాకు వెంటనే సేన్‌గుప్త గుర్తొచ్చాడు. డా. మిశ్రా ప్రాక్టికలు అయితే సేన్‌గుప్త ఏమిటట? బహుశా ఆయన్నొక డ్రీమర్ అంటాడేమో రాజు.

కాని ఇప్పుడు ఆలోచిస్తే సేన్‌గుప్తానే మరింత ప్రాక్టికలేమో అనిపిస్తూ ఉంది. ఆయన తన చేతుల్లో ఉన్నదేదో, తన చేతుల్లో లేనిదేదో ఒక స్టోయిక్కులాగా స్పష్టంగా తెలిసినవాడనీ, తన చేతుల్లో లేనిదాని జోలికి పోకుండా, తాను ఏది చెయ్యగలడో దాన్ని చెయ్యడం మీదనే దృష్టిపెడుతూ వచ్చాడనీ ఎందుకనుకోకూడదు?

నిజానికి డా. మిశ్రా కన్నా డ్రీమరు ఎవరుంటారు? చాలా ప్రాక్టికలుగా కనిపించే డ్రీమరు కాదా? అతని కలలకీ, మెలకువలకీ విరామమంటూ ఉంటుందా? తల్లిదండ్రులూ, పిల్లలూ, ఉపాధ్యాయులూ కూచుని తమ పాఠశాల సిలబసు తామే రాసుకుని, తమ వార్షిక ప్రణాళిక తామే రూపొందించుకునే ఆ దృశ్యం ఎంత అందమైన కల! డా. మిశ్రా తన జీవితకాలంలో ఆ కలని తప్పకుండా నెరవేర్చుకోగలడు. కానీ, ఆ కల నిజమైన రోజున, ఇదుగో, స్కూలు బిల్డింగు కట్టినందుకు సంతోషించడం మాని నేలబల్లల సంగతి మర్చిపోయేమే అని బాధపడుతున్నట్టే, ఇంకేదో మర్చిపోయానని బాధపడుతుంటాడు కూడా. ప్చ్! డా. మిశ్రా ఒక ఎటర్నల్ డ్రీమరు అనుకున్నాను.

'మనం కొంతసేపు నడుద్దామా?' అనడిగాడు మిశ్రా.

అంతా స్కూల్లోంచి బయటికొచ్చాం. అప్పటికే చీకటి పడుతూ ఉంది. అంతా ఏటిదాకా నడిచాం. ఏటి దగ్గర వంతెన మీద కూచున్నాం. ఆ మసకచీకటిలో ఏటిపాయ తెల్లటిచారలాగా ఉంది. పక్కన ఇసకలో రెండు కొంగలు ధ్యానంలో ఉన్నాయి. మామిడిచెట్లు ఫలభారనమ్రాలుగా ఉన్నాయి. ఏటికవతల జీడిమామిడితోటల్లోంచి జీడిమామిడిపండ్ల వాసన గాల్లో తేలివస్తూ ఉంది.

'ఈ ఊళ్ళో ఇంతమంది చదువుకున్న యువకులు, ఇంత మంది యనర్జిటిక్ యంగ్‌మెన్ ఉంటారని ఊహించనే లేదు' అన్నాడు మిశ్రా.

నేను కూడా ఆ యువకులవైపు చూసాను. వాళ్ళల్లో ఉత్సాహం పొంగిపొర్లుతూ ఉంది. వాళ్ళకి కావలసిందల్లా దారి చూపించే ఒక మనిషి. వాళ్ళ శక్తిసామర్థ్యాలకు బోదెలుకట్టి ఆ ఊళ్ళో ఉన్న ప్రతి ఒక్క కుటుంబపు పాదులోకీ ప్రవహింపచెయ్యగలిగిన మనిషి.

'మీ మాటలు వింటుంటే నాకు ప్రొఫెసర్ సేన్‌గుప్త చెప్పిన మాటలు గుర్తొస్తున్నాయి' అన్నాను.

'ఏమిటవి?'-

డా. మిశ్రా కళ్ళు ఆ చీకట్లో మెరుస్తున్నాయి.

'ఇలాంటి ఒక కృష్ణపక్షపు రాత్రి మేము ఇలానే ఈ ఏటిదగ్గరకు వచ్చినప్పుడు పైన ఆకాశంలో కనిపిస్తున్న నక్షత్రాల్ని చూస్తూ ఆయన అన్నాడు కదా: ఈ క్షణాన నేనే కనక యువకుడిగా మారిపోతే ప్లేటో లాగా ఈ ఊళ్ళో ఒక అకాడెమీ ప్రారంభిస్తాను. అందులో కొందరు రాళ్ళని పరిశీలిస్తారు. కొందరు చెట్లని. కొందరు పక్షుల్ని, కొందరు నక్షత్రాల్ని పరిశీలిస్తారు. అంతా కలిసి ఇక్కడి గిరిజనుల్తో కలిసి మమేకమై వారి జీవితంలో పాలు పంచుకుంటారు అన్నాడు. ఎంత గొప్ప డ్రీమ్ అది' అని అన్నాను.

'ఇఫ్ యూ పర్మిట్ మీ, ఐ వుడ్ యాడ్ వన్ మోర్ కాంపొనెంట్ టు హిజ్ డ్రీమ్' అన్నాడు డా. మిశ్రా–

'మరేమీ లేదు. ఆ అకాడమీలో ప్రతి ఒక్కరూ ప్రతి సాయంకాలం పదేసి మంది గిరిజనులకి రాత్రిబడి నడుపుతుంటారు కూడా' అన్నాడు, చిరునవ్వుతూ.

కృష్ణపక్షపు తదియ రాత్రి. చంద్రుడు ఈ పాటికి కొండమీదకు చేరి ఉంటాడు. మా అందరినీ ఒక నావలో ఎక్కించి నదిమీద ప్రయాణం మొదలుపెట్టించినట్టు వేసవికాలపు మొదటి మారుతం వీచింది. దక్షిణం వేపు కొండమలుపులో టేకుచెట్లు కొత్తచిగుర్లు తొడిగి ఉంటాయి. ఏటికి తూర్పువేపు యూకలిప్టసు తోటల్లో ఆకుల్లో పత్రహరితం కాదు, సుగంధ తైలం తయారవుతున్నట్టుంది, ఆ దారిన నడిచిన ప్రతి ఒక్కరికీ అయాచితంగా స్వస్థత చేకూర్చే గాలి వీస్తున్నది.

ఎవరూ ఏమీ మాట్లాడలేదు. అంతా మౌనంగా ఉన్నారు. వంతెన కింద ఏటి అలలు చిన్న చిన్న రాళ్ళమీంచి విరిగిపడుతున్న చిరు గలగల తప్ప మరే చప్పుడూ లేదు. రోజంతా ఊరికీ, అడవికీ, అడవికీ, ఊరికీ తిరిగింది తిరిగినట్టుగా పచార్లు చేసి పాటలు పాడిన కోయిల ఈ రాత్రికి ఇక గూటికి చేరుకుంది.

'వనలత ఉండి ఉంటే ఇప్పుడొక పాట పాడి ఉండేది' అన్నాడు రాజు.

'వనలత పాటలు పాడతారా?' అనడిగాడు మిశ్రా.

నేనేదో చెప్పే లోపు, 'నేను కూడా పాడతాను' అనే తీపిమాటలు వినబడ్డాయి.

బార్బీ కళ్ళతో నవ్వుతూ రోజా.

'నువ్వు పాటలు పాడతావా!'అన్నాడు రాజు. వాళ్ళు ఎప్పుడంత దగ్గరైపోయారా అనుకుంటూ ఉన్నాను.

'మా హైస్కూలు మ్యూజిక్ టీచరు సుగుణ నేర్పించారు. ఎప్పుడో గాని పాడాలనిపించదు. ఇప్పుడు ఈ ఏటినీ, ఈ చుక్కల వెలుగునీ, మిమ్మల్నీ చూస్తుంటే పాడాలని ఉంది' అని గొంతు సవరించుకుని

'ఈ రేయి నన్నొల్లనేరవా రాజా' అంటో ఎత్తుకుంది.

'ఓహ్! ఎంకిపాటలు!' అన్నాడు రాజు చప్పట్లు కొడుతూ.

ఎంకి పాటలంటే ఏమిటో నాకు తెలీదు. నేనెప్పుడూ వినలేదు. కుతూహలంగా రోజానే చూస్తున్నాను. ఆమె చూపులు మా మీద లేవు. ఆ ఏటిమీద ఉన్నాయి. ఆమె పాడటం మొదలుపెట్టింది.

ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా
ఎన్నెలల సొగసంత ఏటిపాలేనటర!
ఆకాశమేమూలొ అణిగిపోయిన రేయి
ఏటి సెందురుడల్లె సాటుసూపుల కులికి–

ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా
ఎన్నెలల సొగసంత ఏటిపాలేనటర!

ఆకాశమోతీరు అడిలిపోయిన రేయి
మాటలెరుగని పాప– ఏటిగిలగిల సూపి–
ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా
ఎన్నెలల సొగసంత ఏటిపాలేనటర!

ఆకాశమావొరస ఆవులించిన రేయి
మిసమిసలతో ఏటి పసలతో ననుసుట్టి
ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా
ఎన్నెలల సొగసంత ఏటిపాలేనటర!

యెలుతురంతా మేసి ఏరు నెమరేసింది
కలవరపు నా బతుకు కలతనిదరయ్యింది–

ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా
ఎన్నెలల సొగసంత ఏటిపాలేనటర!

అని ఒక నిమిషం పాటు ఆగింది. చుట్టూ ఉన్న పిల్లలు పాట అయిపోయిందనుకుని చప్పట్లు కొట్టారు. అప్పుడు నెమ్మదిగా చివరి చరణం వినిపించింది.

ఒక్కతెను నాకేల ఓపజాలని సుకము
ఈ రేయి నన్నొల్ల నేరవా రాజా
ఎన్నెలల సొగసంత ఏటిపాలేనటర!

నేను విభ్రాంతిగా ఆ అమ్మాయినే చూస్తూ ఉండిపోయాను. ఆ బార్బీడాల్‌కి తెలుసా తానేమి పాడిందో? బహుశా ఆ సుగుణ టీచరుకి ఆ పాట ఏమేరకో అనుభవానికి వచ్చి ఉంటుంది. ఆమె తన హృదయావేదన అంతా ఆ పాటలో కుక్కిపెట్టి తన శిష్యురాలికి నేర్పి ఉంటుంది. ఎక్కడో ఏదో పండు చిట్లి ఒక విత్తనం ఏ పక్షి రెక్కలకో తగులుకుని ఎంతో దూరం ప్రయాణించేక ఏ ఏటి ఒడ్డునో సారవంతమైన నేలలో రాలిపడ్డట్టు ఆ పాట ఇన్నాళ్ళకు ఇక్కడ ఈ హృదయాల్లోకి వచ్చిపడింది. ఆ కవి వేదన ఆ మ్యూజిక్ టీచరు వేదనతో కలిసి ఆ గొంతులో భద్రంగా అంతదూరం ప్రయాణించేయన్నమాట.

'ఎక్సలెంట్' అన్నాడు రాజు. అప్పుడు ఆ పాటని ఇంగ్లిషులో తర్జుమా చేసి మిశ్రాకి చెప్పబోయాడుగాని, అతనికి చాతకాలేదు. 'ఏమిటి ఫస్ట్ లైన్ ? ఇంకోసారి చెప్పు' అని రోజాని అడుగుతుంటే మిశ్రా అతణ్ణి వారించాడు. 'ఐ గాట్ ఇట్. లెట్ ద సైలెన్స్ రిమైన్' అన్నాడు.

కోకిల గూటికి వెళ్ళిపోలేదు. రోజా గొంతులోకి వచ్చి కూచుంది అనుకున్నాను.

చాలాసేపు ఎవరూ ఏమీ మాట్లాడలేదు. డా.మిశ్రా కోరుకున్నట్టే ఒక ప్రశాంతనిశ్శబ్దం, పవిత్రనిశ్శబ్దం అక్కడ అలముకున్నాయి.

నెమ్మదిగా ఊరు బాట పట్టాం. ముందు జోసెఫ్ గారి ఇంటిదగ్గర రోజాని వదిలి పెట్టాం. రాజూ, తక్కిన పిల్లలూ డా.మిశ్రాతో వకుళకుటికి వెళ్ళిపోయారు. నేను ఒక్కర్తినీ ఇంటివైపు అడుగులువేసాను.

అప్పటికి చంద్రుడు కొండమీంచి తొంగిచూస్తున్నాడు. ఇళ్ళకప్పులమీదా, చెట్ల కొమ్మలమీదా, రోడ్డుమీదా తెల్లటి గీతలు గీస్తున్నాడు. నా మనసు ఇంతకు ముందు ఎప్పుడూ ఎరగనంత మెత్తగా అయిపోయింది. సినిమా పాటలు తప్ప మరే కవిత్వమూ

విని ఉండని నాకు ఆ ఊళ్ళో ఆ కొన్ని రోజుల్లోనే ఎంత గొప్ప కవిత్వం పరిచయమైంది! టాగోర్, నజ్రుల్, లాలన్, ఇప్పుడు ఎంకిపాటలు. ఆ పాటలో, ఆ మాటల్లో ఏదో ఉంది. వెన్నెల బయట కాస్తూ ఉంటే ఆ పాట నా లోపలనే వెన్నెల కాయిస్తున్నట్లుగా ఉంది.

ఇంటికి వెళ్ళాక, అన్నం తిన్నాక, పడుకున్నాక కూడా ఆ పాట నాతోటే ఉందనిపించింది. చిన్న పిట్ట ఒకటి అడవిలోంచి ఎగిరివచ్చి నా భుజం మీద వాలినట్టూ, నాతో పాటు ఇంటికి వచ్చి, నా పక్కనే పడుకున్నట్టూ అనిపించింది.

ఆకాశం ఏ మూలనో అణిగిపోయిన రేయి, ఆకాశం ఏ మూలనో ఆవులించిన రేయి- ఆ మాటలు నన్ను వదల్లేదు. 'యెన్నెలంతా మేసి యేరు నెమరేసింది-' బహుశా ఆ పాట ఆ ఏటి ఒడ్డున వినడం నా జీవితంలోకెల్లా గొప్ప భాగ్యమనుకుంటాను.

ఆ పాట విని నలభయ్యేళ్ళ పైనే కాలం గడిచిపోయింది. కాని ఎప్పుడేనా ఆ మాటలు గుర్తొచ్చినప్పుడు, ఆ ఏరు, ఆ ఏటిమిసమిసలు, ఆ మామిడిచెట్లు, ఆ యూకలిప్టసు తోట, రోడ్డు మలుపులో ఆ గ్రామదేవత గుడి, ఆ టేకు ప్లాంటేషనూ, ఆ బహుళపక్షపు తదియరాత్రి, కొండమీద చంద్రుడు దిగగానే మమ్మల్ని పలకరిస్తో తాకిపోయిన వసంత మారుతం-మరొక జన్మంటూ ఉంటే, ప్రతి రోజూ ఆ ఏటి ఒడ్డున కూచోగలిగే జీవితమే కావాలనుకుంటాను.

జీవితం పొడుగునా రకరకాల అనుభవాలు సంప్రాప్తమవుతుంటాయి. కొన్ని పూర్తిగా లభిస్తాయి. కొన్ని తెగిపోయినవి ఉంటాయి, కొన్ని విరిగిపోయుంటాయి. వాటన్నిట్లోనూ ఏరుకోగలిగినన్ని ఏరుకుని, ఆ పుల్లా, పుడకాతో మనం గూడు కట్టుకుంటాం. దాన్ని మన జీవితమని చెప్పుకుంటాం. కాని అందులో ఒక కోకిల చేరి కూజితం వినిపించినప్పుడు కదా ఆ గూడు గుడిగా మారేది. అప్పుడు ఈ జీవితం ఏమిటి, ఎందుకు, నేనెవర్ని, ఏం చెయ్యాలి, ఏమి తీసుకోవాలి, ఏది వదిలిపెట్టాలి లాంటి ప్రశ్నలన్నీ అదృశ్యమైపోతాయి. ఏదో కావాలన్న కోరికనుంచి, ఏదో పొందాలన్న ఆరాటం నుంచి, ఏదో పోగొట్టుకున్నామన్న వేదననుంచి ఒక్కసారిగా బయటపడిపోతాం. ఇక అప్పుడు-

ఒన్లీ ద సైలెన్స్ రిమెయిన్స్.

❋

20

బడికి కొత్త గూడు రావడంతో రోజూ రామకోవెల్లో నడిచే పాఠాలు ఆగిపోయేయి. ఆ తర్వాత సెలవులు మొదలయ్యాయి కూడా. మా సర్వే వేగం పుంజుకుంది. ఆ చిన్న ఊళ్ళో ఎన్ని సముద్రాలున్నాయి అనిపించింది ముప్ఫై నలభై కుటుంబాల సర్వే పూర్తిచేసాక. ఒక్కొక్కరిదీ ఒక్కొక్క కథ. కాని అన్ని ఇళ్లల్లోనూ సమానంగా ఉన్నది పేదరికమే. అప్పటికింకా కిలో రెండు రూపాయలబియ్యం పథకం మొదలుకాలేదు. ఐ.ఆర్.డి.పి పథకం అప్పుడప్పుడే మొదలవుతోంది. ఐ.టి.డి.ఏ జిల్లా కేంద్రం నుంచి రంపచోడవరం మార్చేరుగాని ఏ పథకాలు గిరిజనులకి ఆర్థిక భద్రతా, ఆహార భద్రతా సమకూరుస్తాయో ప్రభుత్వం ఇంకా ప్రయోగాలు చేస్తూనే ఉంది. ఆ ఊళ్ళో గ్రామదేవత గుడి దాటి రోడ్డు మలుపు తిరిగే చోట కొన్నేళ్ళ కిందట ఒక పాలకేంద్రం నడిచిందట. సి.వి.కృష్ణారావు అనే ప్రాజెక్టు అధికారి కొందరు గిరిజన మహిళల్ని సమీకరించి ఆ కేంద్రం తెరిపించాడట. దానికి 'క్షీరాబ్ధి' అని పేరుపెట్టాడట.

కొన్నిసార్లు మనం మొత్తం కల వినక్కర్లేదు. ఒక్క మాట వినబడితే చాలు, ఆ కల మొత్తం వర్ణచిత్రంలాగా కళ్ళముందు ప్రత్యక్షం కాగలదు. 'క్షీరాబ్ధి' అటువంటి మాట అనిపించింది. అటువంటి అధికారిని తానెప్పుడూ చూడలేదని రాజు చెప్పాడు. మామూలుగా ఆ ఊరికి అధికారులు రావడమే తక్కువ. ఎప్పుడేనా వచ్చే అధికారుల్లో అతి పెద్ద అధికారి అడ్డతీగల్లో ఉండే తహశీల్దారు మాత్రమే. అతను కూడా డిజిగ్నేషనుకి తహశీల్దారే కాని, సాధారణంగా డిప్యూటీ తహశీల్దారే అయి ఉండేవాడట. వాళ్ళు చాలా సార్లు దగ్గరగా చూసే అధికారి అంటూ ఉంటే అది ఆరై అని పిలిచే రెవెన్యూ ఇన్ స్పెక్టరు మాత్రమే. ఏ అధికారి వచ్చినా విలేజి చావిడి దగ్గరే దిగుతాడట. ఆ వచ్చినాయన గంటో,

రెండు గంటలో ఉండి వెళ్ళేదాకా ఊరంతా అరికాళ్ళకింద మంటలు పుడుతూనే ఉండేవట. అలాంటి ఊళ్ళోకి కృష్ణారావు గారు మలయమారుతంలాగా అడుగుపెట్టారని చెప్తాడు రాజు. ఆయన ఆ పొలంగట్లమీద కొండరెడ్డి మహిళల్తో కూచుని ఆ పాలకేంద్రం ఎలా పెట్టాలో, ఎలా నడపాలో మాట్లాడేవాడట. 'సీతమ్మా బావున్నావా?', 'గంగమ్మా రా ఇలా వచ్చి కూచో', 'చిలకమ్మా నీ పిల్లలేం చేస్తున్నారు?', 'లచ్చమ్మా మీ ఆయనకి ఒంట్లో ఎలా ఉంది'– ప్రతి ఒక్కరి పేరూ ఆయనకి గుర్తేనట. ప్రతి ఒక్కర్నీ పేరుపేరునా పలకరించేవాడట.

మా సర్వేకోసం డా.మిశ్రా సేకరించిన హౌస్ హోల్డ్సు డాటా దాదాపుగా నిర్దుష్టంగా ఉంది. అంతకు ముందు ఏడాదే పార్లమెంటు ఎలక్షన్లు జరిగి ఉండటంతో ఎలక్టొరలు జాబితాలు సవరించారు కాబట్టి అక్కడక్కడా ఒకటి రెండు కుటుంబాలు తప్ప దాదాపుగా అన్నీ ఆ జాబితాలో ఉన్నాయి. పొద్దున్నే ఇంకా ఎండ ముదరకముందే ఇంటింటికీ వెళ్ళి ఆ కుటుంబాల్తో మాట్లాడటంతో అది సర్వే కన్నా కూడా వాళ్ళ కష్టసుఖాల పరామర్శగానే ఎక్కువ అనిపించేది.

నాకు ఆ ఊరు వెళ్లాక అప్పటికే రెండు లాండ్‌స్కేప్‌లు పరిచయమయ్యాయి. అడవి, కొండలు, ఆ నిర్జన పూర్వాహ్ణాలూ–అదొక లాండ్‌స్కేప్. పూర్తి వైల్డర్‌నెస్. ప్రొఫెసర్ సేన్‌గుప్త దాని తలుపులు బార్లా తెరిచి నన్ను ఆ అలౌకిక లోకంలోకి ఆహ్వానించేడు. మరొకవైపు ఊరూ, ఇళ్ళూ, వీథులూ, పొలాలూ, తోటలూ, మనుషులూ ఉండే మరొక లాండ్‌స్కేప్. దీన్ని రాజు నెమ్మది నెమ్మదిగా నాకు పరిచయం చేస్తూ వచ్చాడు. మనుషుల్లేని భీకర సౌందర్యం ఒకవైపూ, మనుష్యసంచారంతో సంచలించే గ్రామజీవితం మరొకవైపూ– ఈ రెండూ నన్ను చెరొకపక్కకీ లాగుతుండేవని కూడా అర్థమయింది. అడవికి వెళ్ళినప్పుడు ఆ కొండల ముందు నిల్చున్నప్పుడు, సూర్యుడూ, చంద్రుడూ, నక్షత్రాలూ యుగాలుగా వాటితో మాటాడుతున్న సంభాషణల్ని ఆ శిలాక్షరాల్లో చదివి సేన్‌గుప్త చెప్తూ ఉంటే రోజూ ఒక పొయెట్రీ క్లాసు వింటున్నట్టు ఉండేది. మరొకవైపు ఆ సాయంకాలాల్లో ఆ పొలాలమ్మట, ఆ వీథుల్లో, ఆ ఏటి ఒడ్డున తిరుగుతుంటే పొద్దున్న విన్న కావ్యపాఠం మళ్ళా నలుగురు మిత్రుల్తో కూచుని చర్చించుకున్నట్టు ఉండేది. ఆ రెండూ వేరువేరు లాండ్ స్కేప్‌లు కాదనీ, ఒకదానికొకటి పూరకాలనీ ఎందుకో నాకు నేను రోజూ బలంగా చెప్పుకుని నమ్మించుకునేదాన్ని.

ఇప్పుడు డా.మిశ్రా వల్ల నాకు మూడవ లాండ్‌స్కేప్ పరిచయమైంది. ఇది చెట్లూ, చేమల్తోనూ, పొలాలూ, వెన్నెల్తోనూ నిండి ఉన్న ప్రకృతిదృశ్యం కాదు. సజీవులైన మనుషుల

ప్రపంచం. రక్తమాంసాలున్న మనుషుల ప్రపంచం. నవ్వులూ, కన్నీళ్ళు నిండి ఉన్న ప్రపంచం. మొదట్లో రెండు రోజులు ఆ ఇళ్ళచుట్టూ తిరిగి, ఆ పేదరికాన్నీ, ఆహారలేమినీ, ఆ మాల్ న్యూట్రిషనునీ అంత దగ్గరగా చూడగానే నాకు కళ్ళు తిరిగినంతపనైంది. అన్ని నెలలుగా నేనూ వాళ్ళూ ఒకే ఊళ్ళో ఉన్నా కూడా ఎప్పుడూ ఒక్కరి ఇంట్లో కూడా అడుగుపెట్టింది లేదు. ఇప్పుడు వాళ్ళ సమస్యలు– అవి ఎంత సరళమైన సమస్యలు!– కాని వాటికి ఏ ఒక్క పరిష్కారం గురించి ఆలోచించినా ఆ చర్చ ఎంత సంక్లిష్టంగా మారిపోయేది! ఇంటి వెనక ఇల్లు తలుపు తడుతూ ఉన్నప్పుడు నాకు ఆ కొండలోయలో ఆ వెన్నెల రాత్రి వాళ్ళ నాట్యం చూడ్డానికి వచ్చిన దేవతలు వాళ్ళ సమస్యలు తీర్చడానికి కూడా వస్తే ఎంత బాగుణ్ణు అనిపించేది. వాళ్ళ సంస్కృతి గురించి మాట్లాడటం కన్నా ముందు వాళ్ళకి రేషనుకార్డులు ఇప్పించడం అత్యవసరం అని డా.మిశ్రా ఎందుకు మొత్తుకుంటున్నాడో అర్థమయింది.

మేము సర్వే మొదలుపెట్టగానే చైత్రమాసం గడిచిపోయి వైశాఖం మొదలయ్యింది. ఒకప్పుడు చైత్రమాసమంతా కొండరెడ్లకు ఆటపాటల పండగ. ఇక్కడి పుల్ల తీసి అక్కడ పెట్టడం కూడా నిషిద్ధంగా గడిచేవట ఆ రోజులు. ఆ రోజుల్లో ఆడవాళ్ళకి కొమ్ములొస్తాయని చెప్పుకునేవారట. ఆ నెలంతా ఆడవాళ్లదే రాజ్యం. ఆ నెల గడిచి వైశాఖం మొదలవుతూనే పొలం పనులు మొదలుపెట్టే రోజులు మొదలైనట్టు.

ఒక సాయంకాలం డా.మిశ్రా నాతో 'చూడండి, గంగాలమ్మ పండగ మొదలవుతుంది. మీరు కొండరెడ్డి కల్చర్ గురించి తెలుసుకోవాలనుకున్నారు కదా. ఈ పండగ దగ్గరనుంచీ చూడండి. ఇంతకంటే మంచి అవకాశం దొరకదు' అన్నాడు.

ఆ పండగ నాలుగురోజులపండగ. రామనవమిని మించిన రంగులపండగ. రామనవమి– కోవెలదగ్గర, పందిరికింద జరిగిన పండగ. గంగాలమ్మ పండగ ఆకాశం పందిరిగా, భూదేవి వేదికగా ఊరంతా ప్రతి ఇంటా జరిగిన పండగ. అమావాస్య వెళ్లగానే ముహూర్తం పెట్టుకున్నారు. ఊరిమధ్య రోడ్డు పక్కనున్న చింతచెట్టు కింద గంగాలమ్మ దిగడానికి విడిది ఏర్పాటు చేసారు. ఈతాకులతో చిన్న పందిరి వేసారు. ఆ పందిరికి అలంకారంగా ఎర్రటిపూలతో ధగధగలాడుతున్న తురాయికొమ్మలు కట్టారు. పందిరిపైన కూడా తురాయిపూలు పరిచారు. ఆ పక్కనొక ఉయ్యాల కట్టారు. రెండు తాడిచెట్ల నిలువుండే రాటలు పాతి వాటికి మోకు కట్టారు. ఆ మోకుటుయ్యాలమీద కూచోడానికి మధ్యలో ఒక బల్లచెక్క కూడా అమర్చారు. ఒక ఘటం తయారుచేసి అందులో పసుపు, కుంకుమ, బియ్యం, అరిసెలు ఇంకా ఏవేవో వేసి ఆ చెట్టు మొదట్లో అమ్మవారిని ప్రతిష్ఠించారు.

ఎన్నో కొండరెడ్ల కుటుంబాలు తమ ఇళ్ళనుంచి ఐరేణి కడవలు తీసుకొచ్చారు.ఒక కన్నెపిల్లను అక్కడికి వేడుకతో ఆహ్వానించేరు. ఆమె కొత్త వస్త్రాలు ధరించింది. నుదుట కుంకుమ బొట్టు. జడలో పాలపూలు, తురాయిపూలు. ఆమె ఆ విడిది దగ్గరకు రాగానే బాజాలు మోగించారు. పిల్లంగోవి ఊదారు. కొండరెడ్ల పూజారి ఆమెకు నమస్కారం చేసాడు. మంత్రాలు చదివేడు. అప్పుడు ఆ ఘటాన్ని ఆమె నెత్తిన పెట్టాడు. బాజాలచప్పుడు మధ్య, పిల్లంగోవిరాగాల మధ్య ఆమెని ఉయ్యాల్లో కూచోబెట్టారు. మూడు సార్లు ఊయెలూపేరు. అప్పుడు ఆమె తన పుట్టింటికి బయల్దేరింది. ఆమె వెంట పూజారితో పాటు మొత్తం గ్రామస్థులంతా కదిలారు.

తన ఇంటికి వెళ్ళాక ఆమెకి స్నానం చేయించి మళ్లా కొత్త వస్త్రాలు కట్టారు. నెత్తిన ఘటం పెట్టారు. ఆమె తన ఇంటినుంచి ఒక్కొక్క ఇంటికీ బయల్దేరింది. ఆమె వెనక గోనె సంచులు, కుండలు, కడవలు పట్టుకుని పూజారి వర్గం బయల్దేరారు. మరికొందరు స్త్రీలు నెత్తిన ఐరేణి కడవల్తో ఆమెని అనుసరించారు. ఆమె నడిచినంతసేపూ బాజాలు మోగుతూనే ఉన్నాయి. పెద్ద పెద్ద తాళాలు మోగిస్తూ ఉన్నారు. ఒకతను నెమలీకల కట్టతో ఆమెకి వింజామర వీస్తూ ఉన్నాడు. పిల్లంగోవి రాగాలతీగలు చుట్టచుడుతూనే ఉంది. ఆమె ఏ ఇంటిదగ్గర ఆగితే అక్కడ ఆ ఇంటివారు ఆమెకు నమస్కారంతో స్వాగతం పలికేరు. తమ ఇంట్లోంచి బియ్యమో, పప్పులో, బెల్లమో ఏవో ఒకటి ఆ సంచుల్లో పోస్తూ ఉన్నారు. అలా ఆమె ఆ మొదటిరోజు తిరగగలిగినన్ని ఇళ్ళు తిరుగుతూనే ఉంది.

ఈలోపు ఆమె ఊగి వెళ్ళిన ఊయెల మీద ఊగడానికి యువతీయువకులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. కొందరు బల్లమీద కూచుని ఊగేరు. కొందరు నిలబడి ఊగేరు. నిలబడి ఊగినప్పుడు ఒకరిద్దరు ఆ ఉయ్యేల లాగగలిగినంత వెనక్కి లాగి వదిలి పెట్టేవారు. ఆ ఉయ్యేలమీద నిలబడ్డవాళ్ళు ఆకాశాన్ని అంటుకుంటున్నారా అన్నంత పైకెగిరేవారు. చూసేవాళ్ళకే కళ్ళు తిరిగేటంత ఎత్తుకి ఎగిరేవారు.

ఇక ఆ తరువాత మరింత ఆసక్తికరమైన దృశ్యం ప్రత్యక్షమయ్యేది. ఆ ఉయ్యేల మీద ఒకరికొకరు ఎదురెదురుగా ఇద్దరు నిల్చునేవారు. ఆ ఇద్దరూ కూడా అంత ఎత్తుకీ ఉయ్యాలలూగేవారు. కొన్నిసార్లు ఆ ఇద్దరూ మగవాళ్ళు, కొన్నిసార్లు ఆ ఇద్దరూ ఆడ వాళ్ళు, ఒక్కొక్కసారి ఆ ఇద్దరూ, ఒక మగ, ఒక ఆడ పడుచుజంటలు. ఆ పండగ మూడురోజులూ ఆ ఉయ్యేల నింగినీ నేలనీ కలుపుతూనే ఉండింది. పండగ అయిపోయేక కూడా పున్నమి రాత్రి దాకా ఆ ఉయ్యేలని అలానే ఉంచేరు. ఆ వెన్నెల రాత్రుళ్ళలో వాళ్ళతో పాటు చంద్రుడు కూడా కిందకీ, మీదకీ ఊగేవాడు.

మూడో రోజు సాయంకాలానికి గంగాలమ్మకి ఘనంగా వీడ్కోలు ఇచ్చారు. ఆ విడిది ఖాళీ చేసారు. పూజారి ఆ ఘటాన్ని ఆ చెట్టుమొదటనుంచి తీసి శుభ్రం చేసి ఇంటికి పట్టుకువెళ్ళిపోయాడు. కాని ఊళ్ళో వీడ్కోలు విలాపమేమీ వినిపించలేదు. ఎందుకంటే మూడు రోజుల గంగాలమ్మ పండగ అయిపోయిన మర్నాడే భూదేవి పండగ.

గంగాలమ్మ పండగలో బలిచ్చిన మేకపోతుల మాంసం, ఇంటింటా ఇచ్చిన బియ్యం, పప్పులు, దినుసులు అన్నిటితో ఆ రోజు పెద్ద వంట నడిచింది. ఆ చింతచెట్టుకిందనే ఒక పక్కగా గాడిపొయ్యి తవ్వేరు. ఘుమఘుమలాడే వంటలు వండుకున్నారు. ఊరంతటికీ పెద్ద విందు పెట్టారు. ఆ రోజు పొలాల్లోకి వెళ్ళి విత్తనాలు చల్లేరు. ఆ రోజునుంచీ పొలం పనులు మొదలుపెట్టుకోడానికి భూదేవి అనుమతి లభించింది. వానలు సమృద్ధిగా కురవడానికి గంగాలమ్మ అనుగ్రహం దొరికింది. ఆ రోజు ఇద్దరు ముగ్గురు నడివయసు కొండరెడ్లు ధనుర్బాణాలు ధరించి అడవికి వెళ్లడం కూడా నేను చూశాను.

ఆ ఊరు అటు విశాఖపట్టణం మన్యానికీ, ఇటు గోదావరిమన్యానికీ మధ్యలో ఉన్నందువల్ల ఎన్నో తిథులు, ఆచారాలు, పండగలు, పాటలు కలిసిపోయాయని డా. మిశ్రా అన్నాడు. ఆయన చెప్తున్నది గిరిజనుల పండగల గురించి. అవి కాక ఆ తర్వాత పొరలు పొరలుగా ఎన్ని సంస్కృతులు ఆ ఊరిమీద తమ తమ వస్త్రాలు కప్పుతూ వచ్చాయి! రామనవమి ఉత్సవాలు, దగ్గరలో సినిమాహాలు, అయిదేళ్ళకొకసారి ఆ దారంతా మోతపెట్టే ఎన్నికల ప్రచారగీతాలు– కాని ఎన్ని సార్లు నరికినా, మోడుగా వదిలిపెట్టినా, మళ్ళా ఏదో ఒక వేపు చిగిరించకుండా ఉండలేని మద్దిచెట్టులాగా ఆ కొండరెడ్ల పండగ ఆ గ్రామాన్ని వెలిగిస్తూనే ఉంది. ఆ కాలమంతా ఎటుచూసినా తెల్లటి కెరటాల్లాగా తలూపుతూ కనిపించే పాలపూలతో అడవి నిండిపోయింది. గంగాలమ్మ పండగ దాకా అ పూలమీద ఎవరూ చెయ్యి వేసేవారు కాదు. పండగ అయిపోగానే ఏ కొప్పులో చూసినా ఆ పూలే.

గంగాలమ్మ పండగ తర్వాత వసంతం వేసవిగా మారిపోయింది. ఆ వేసవి బహుశా నాలుగు వారాలు లేదా ఆరువారాలు. కాని అటువంటి కాలం నా జీవితంలో ఇప్పటిదాకా మరొకటి చూసి ఎరగను. బహుశా ఆరు ఋతువుల్లోనూ ఒకదానికొకటి మిర్రర్ ఇమేజిలాగా ఉంటాయనుకుంటే వసంతానికి శరత్తు ప్రతిబింబం. హేమంతానికి వేసవి ప్రతిబింబం. హేమంతం పరిపక్వకాలం. దేనికి? మనిషి ప్రయత్నాలకి, పంటలకి, పండ్లతోటలకి. కాని వేసవి ప్రకృతికి పరిపక్వకాలం. దేనికి? సూర్యకాంతికి, చెట్లకి, పత్రహరితానికి, నీలాకాశానికి, మహారణ్యానికి. ఆ వేసవికాలపు తెల్లవారుజాముల్లో గాలుల్లో తెల్లదనం, చల్లదనం కలిసి ఉండేవి. ఆ అరుగుల మీద ఇంత చాపనో, బొంతనో పరుచుకుని

పడుకున్న మా మీద రాత్రంతా రాలిన రాధామనోహరాల పూల గాలి పోగుపడి ఉండేది. తెల్లవారినా ఇంకా దుప్పటి ముసుగుదన్ని పడుకున్న మమ్మల్ని కోకిల లేపేసేది. మా మీంచి దుప్పటి లాగేసేది.

ఆ రోజుల్లో సూర్యనారాయణ గారి చిన్న తమ్ముడు కూడా వేసవి సెలవులకు వచ్చాడు. సుధీర్ అతనిపేరు. పాతికేళ్ళ యువకుడు. ఏలూరులో బాంకులో కాషియరుగా పని చేస్తుండేవాడు. ఆ ఏడాది చివర్లో అతనికి పెళ్ళి నిశ్చయమైంది. ఆ వేసవి అన్నగారి కుటుంబం దగ్గర గడుపుదామని వచ్చాడు. ఉన్న ఆ రెండుగదుల్లో నేనొక గదిలో ఉంటున్నాను కాబట్టి ఆ పిల్లవాణ్ణి ఆ వేసవికి రావొద్దని రాయడమా అని మాష్టారి దంపతులు ఒకరోజు మాట్లాడుకోవడం నా చెవిన పడింది కూడా. నాకేం చెయ్యాలో అర్థం కాలేదు. కాని ఆ వచ్చినపిల్లవాడు నన్నొక చెల్లెలిగా దగ్గరకు తీసుకోడంతో, కలిసొచ్చిన కాలానికి నడిచొచ్చిన అన్నయ్య దొరికినట్టు అయింది.

రోజూ సర్వే నుంచి రాగానే మధ్యాహ్నం అంతా కలిసి భోంచేసేవాళ్లం. అక్కడే ఆ అరుగుల మీదనే మధ్యాహ్నం చిన్న కునుకు తీసేవాళ్ళం. ఉష్ణమండల దేశాల వేసవి నిద్ర. ఆ తర్వాత టీ కాచుకునేవాళ్ళం. త్రీ రోజెస్ డస్ట్ టీ. అప్పటికి రాజూ, రోజా, మరి కొంతమంది మిత్రులూ చేరేవారు. సాయంకాలాలు అటు చాపరాయి వైపో, ఇటు ఏటివైపో నడిచే వాళ్ళం. కొంతమంది కుర్రాళ్ళు బావి దగ్గర సాయంకాలం స్నానాలు చేసేవారు. కొందరు ఏటిలో గేదెల్ని కడుక్కునేవారు. కాని ఆ నడక రోజూ నడిచేది కాదు. ఆ ఊళ్ళో పొద్దుటిపూట మాత్రమే మనుషులది. మధ్యాహ్నాలు వేసవివానలది. పొద్దున్నే పెళపెళా ఎండ కాయగానే ఇంతలోనే మబ్బు పట్టేసేది. పెద్ద వర్షం కురిసిపోయేది. వైశాఖమాసపు ఆ కృష్ణమేఘాలు, ఆ నల్లమబ్బులకి అడ్డంగా ఎగిరే తెల్లటి కొంగల బారులు, ఇంతలోనే హడావిడిగా ఎక్కణ్ణుంచో వచ్చి అంతే హడావిడిగా కురిసి వెళ్ళిపోయే ఆ వేసవి వానలు– ఆ రోజుల్ని తలచుకుంటే నాకు ఇప్పటికీ కవి చెప్పినట్లుగా 'ఆనందం లాంటి విచారం కలుగుతుంటుంది.' బహుశా ఇప్పుడు ఆ ఊళ్ళో కూడా ఆ వేసవిలాంటి వేసవి మళ్ళా రాదేమో అనిపిస్తుంది.

వానలు పడే మధ్యాహ్నాల్లో మేము మా ఇంటిదగ్గరో, జోసెఫ్‌గారి ఇంటిదగ్గరో కేరమ్స్ ఆడుకునేవాళ్ళం. సుధీర్ తనతో పాటు చిన్నది పేనాసోనిక్ కాసెట్ ప్లేయరు తెచ్చుకున్నాడు. అతనిదగ్గర పాతహిందీ పాటలు, తెలుగు పాటలు కేసెట్లు కూడా ఉండేవి. మేము మాట్లాడుకుంటూ ఉన్నాకూడా మా వెనక బాక్‌గ్రౌండు మ్యూజికు లాగా ఆ పాటలు నడుస్తూనే ఉండేవి. అదొక కాలం, అదొక లోకం. స్మార్ట్ టీవీలూ, స్మార్ట్ ఫోన్లూ, వాట్సప్

లూ, ఇన్స్టాగ్రాములూ లేని కాలం. అనుభవం అనే ఒక సరసులో అడుగుపెట్టకముందే సెల్ఫీ తీసుకుని నలుగురికీ చూపించుకోవాలనే తాపత్రయం లేని కాలం. అసలు ఒక అనుభవం మమ్మల్ని ముంచెత్తుతోందనే స్పృహకూడా లేకుండానే ఆ వడిలో పడి కొట్టుకు పోయిన కాలం.

ఆ నాలుగైదు వారాలు నేనటువంటి నిష్కల్మష లోకంలో గడిపాను. అప్పుడు నేనొక కన్యని. యవ్వనప్రాదుర్భావవేళ నా దేహం చిగురిస్తున్న యువతిని. కానీ ఆ రోజుల్లో ఒక్క క్షణం కూడా నాకు ఆ స్పృహ కలగలేదు. ఏ ఒక్క నేత్రద్వయం కూడా నన్నొక దేహంగా చూసిన జ్ఞాపకం లేదు. నిజానికి మేము ఎవరెవరిమో, ఎక్కణ్ణుంచో కొన్నాళ్ళు ఒక చెరువుదగ్గర చేరుకున్న పిట్టల్లాగా గడిపేం. అప్పుడు మాదంతా ఒకటే దేహం. ఒకటే మనస్సు. అప్పుడు మాలో ఏ ఒక్కరిని పలకరించినా మరొకరి గుండె జవాబిచ్చేది.

అలాంటి రోజుల్లో నాకు బాగా గుర్తు. మరవలేని సంఘటన అది. నేను కొండవార లొద్దు చూపించమని అడిగానని, ఒక మధ్యాహ్నం రాజు నన్ను కొండరెడ్ల వీథుల్లోంచి అడవి వైపు తీసుకువెళ్ళాడు. అక్కడ ఊరుదాటగానే పెద్ద చింతతోపు. వేలాది చిలకలు వాలినట్టు లేతాకుపచ్చ, ఎర్రటి చింతచిగురు గుబుర్లు. ఆ చింతతోపు కూడా దాటి ఇంకా ముందుకు తీసుకువెళ్ళాడు. అక్కడ కొండవార పొలంలో నిండుగా విరబూసిన నూరువరహాల చెట్టు. ఫ్లమేరియా. ఆ అపరాహ్ణాన్ని అది తన సుగంధంతో తడిపేస్తూ ఉంది. ఆ చెట్టుకింద కొంతసేపు నిల్చున్నాం. ఎన్నేళ్ళుగా అది అక్కడ పూలుపూస్తూ ఉన్నదో. ఎవరికోసం పూస్తూ ఉన్నదో. దాని గడిచిన జీవితమంతా ఎన్నో వంకర్లు తిరిగిన దాని కాండంలో కనిపిస్తున్నది. ఆ చెట్టు కూడా దాటి కొండకిందలోయలోకి వెళ్ళాం. ఆ లోయమీంచి కొండ ఎక్కడం మొదలుపెట్టాం. ఆ లోయలో మొదలుపెట్టి కనిపించే కొండ పొడుగునా కొండమామిడి చెట్లు. ప్రతి చెట్టు నిండా కొమ్మకొమ్మకి గంపలకొద్దీ మామిడిపళ్ళు. పుష్కలత్వం అనే మాటకి అంతకన్నా బొమ్మకట్టి చూపించగల ఉదాహరణ మరొకటి ఉండదేమో. మేము ఆ లోయలో ఉండగానే ఆకాశంలో నల్లనిమబ్బులు పేరుకోవడం మొదలుపెట్టాయి. 'అప్పుడే పడదులే వాన' అన్నాడు రాజు.

కాని ఇంతలోనే అనూహ్యంగా గాలిదుమారం చెలరేగింది. ఆ గాలికి చెట్టుమీదనే మిగలముగ్గుతున్న పండ్లు వడగళ్లలాగా కింద రాలిపడటం మొదలయ్యింది. ఆ పండ్లు ఏరి ఒక్కొక్కటే రాజు నాకు ఇస్తూ ఉన్నాడు. ఒక్కొక్క పండూ ఇచ్చింది ఇచ్చినట్టుగా నేను రసం పీలుస్తూ ఉన్నాను. ప్రతి పండూ ఒక జ్యూస్ పేకెట్. ప్రతి పండూ ఒక రసపాత్ర.

చూస్తూండగానే గాలివాన మహావర్షంగా మారిపోయింది. ఆ కొండలు నేలలోకి కుంగిపోతాయేమో అన్నట్టు, ఆ అడవి ఆ ధారల్లో కొట్టుకుపోతుందేమో అన్నట్టు, ఆకాశం కరిగిపోయి భూమిలో కలిసిపోతుందేమో అన్నట్టు వాన. ఆ మహారణ్యంలో, ఆ మహావర్షంలో మేమిద్దరమే. చెట్ల మీద కొండల మీద వాన చప్పుడు అల్లిబిల్లిగా అల్లుకుపోయిన ఆ కీకారణ్యం మధ్యలో అక్కడ చిల్లుల్లోంచి పడుతున్నట్టుగా వాన ధారలూ, తడిసిన సూర్యకాంతీను. మేమట్లానే ఒక బండమీద కూర్చుండిపోయాం. అక్కడ అలా ఎంతసేపు ఉండిపోయామో తెలియదు.

వాన వెలిసి, ఇంటికి తిరిగొస్తుండగా, ఏప్రిల్లోనే కదా, రాజు ఫైనలు యియరు పరీక్షలు అని గుర్తొచ్చింది. 'రాజూ' అని అరిచాను గట్టిగా.

ఏమిటన్నట్టు ఉలిక్కిపడి చూసాడు.

'నీ పరీక్షలు. బి ఏ ఫైనల్ యియర్!'

'అవా! అయిపోయింటాయి ఈ పాటికి.'

షాక్ తిన్నట్టయ్యాను. 'పరీక్షలు రాయలేదా? ఎందుకు?'

'పరీక్షలు మొదలయ్యేటప్పుడే మనూళ్ళో కొత్త బడి కట్టడం మొదలుపెట్టాం. తీరా నేను కాకినాడ వెళ్ళిపోతే అంతా తలోదిక్కుకీ జారుకుంటారు. మిశ్రాగారికి ఒక్కడు కూడా పలకడు. అందుకని ఇక్కడే ఉండిపోయాను' అన్నాడు..

పసిపిల్లలు ఎక్కడుంటే దేవుడక్కడ ఉంటాడన్నది అందరూ చెప్పేమాట. అక్కడ దేవుడి ఉనికి అమాయకంగా ఉంటుంది. పాపం, పుణ్యం తెలియని ప్రాయం అది. కాని పదహారేళ్ళనుంచి పాతికేళ్ళ మధ్య వయసు యువతీయువకులున్నచోట కూడా దేవుడుంటాడు. అక్కడ ఆయన ఉత్సాహంగా తుళ్ళిపడుతూ ఉంటాడు. ఎనర్జిటిక్‌గా ఉంటాడు. లాభం నష్టం చూసుకోని వయసు అది. తన, పర అనే మాటలు తెలియని మనసులవి. అటువంటి యువతీయువకులెవరేనా మీకెప్పుడేనా తారసపడితే వాళ్ళకి బుట్టెడు గులాబీపూలు కానుకగా ఇవ్వండి. వాళ్ళున్నచోటికి వెళ్ళాలనుకుంటే మీ చెప్పులు బయట విడిచి, కాళ్ళు కడుక్కుని లోపల అడుగుపెట్టండి. మీ మతాలూ, నమ్మకాలూ, సిద్ధాంతాలూ, రాజకీయాలూ చెప్పుల్తో పాటే ఆ గుమ్మంబయటనే పక్కన పెట్టేయండి.

❋

21

ఒక ఆదివారం పొద్దున్నే రాజు మా అందరికీ తాటిముంజలు తినిపిస్తానని తన పొలానికి తీసుకువెళ్ళాడు. పొలం గట్లమీద తాటిచెట్లమీంచి లేత గెలలు దింపడం, దింపినవి దింపినట్టు మాకోసం ముంజలు కొట్టిపెట్టడం. ప్రతి తాటిముంజ ఒక చలివేంద్రంలాగా ఉంది. రోజా, సుధీర్ ఇలా తాటిముంజలు చెట్టుకింద కూచుని ఇంతకుముందెప్పుడో తిన్నామని చెప్పారుగాని, నాతో సహా అందరికీ అది మొదటిసారి సరదాలానే ఉంది. వేసవి ఆ ముంజల్లో నింపిపెట్టిన ఆ తియ్యని చల్లని నీళ్ళు ఒళ్ళంతా, గుడ్డలంతా చిందుతుండగా, ఆ ముంజలు తింటూ ఉంటే పెదాలకీ, ముఖానికీ, చేతులకీ ఆ తునకలు అంటుకుపోతూండగా, మధ్యలో జోకులూ, నవ్వులూ మా అవస్థని మరింత దురవస్థగా మారుస్తూ ఉండగా, రోడ్డుమీంచి ఆ పొలాలకి అడ్డం పడి ఒక పిల్లవాణ్ణి తీసుకుని మిశ్రా మా దగ్గరకి వస్తూ కనబడ్డాడు. ఏదో అత్యవసరమైన పని ఉంటే తప్ప, ఆయన అంతగా మమ్మల్ని వెతుక్కుంటూ రాడుకదా అని ఒక క్షణం కంగారుపడ్డాం.

కాని ఆయన అల్లంత దూరం నుంచే 'సేన్‌గుప్తా నుంచి టెలిగ్రాం. డిలే రిగ్రెటెడ్, జాయినింగ్ బై ఎండ్ ఆఫ్ మే' అంటూ ఆ మెసేజి అక్కణ్ణుంచే గట్టిగా చదివి వినిపిస్తూ వచ్చాడు. ఆ మెసేజికి ఎలా ప్రతిస్పందించాలో అర్థం కాలేదు. మొత్తం మీద రెండు నెలలు డిలే అవుతున్నారు కాబట్టి ప్రాజెక్టు మరో రెండు నెలలు పొడిగిస్తాడా అని కొద్దిగా కంగారుగా అనిపించింది. ఆ మాటే అన్నాను మిశ్రాతో.

'లేదు. ఆయన పొడిగించడానికి అవకాశం ఉండదు. ఎలాగైనా మే నెలాఖరుకి ప్రాజెక్టు పూర్తిచెయ్యకతప్పదు. ఆయన వచ్చేక రాప్ అప్ చేసేస్తాడు. కాకపోతే నేను ఫిఫ్టీంత్ కల్లా వెళ్ళిపోతాను, ఆయన ఎండ్ ఆఫ్ మే జాయిన్ అవుతాడు' అని అన్నాడు.

మళ్ళా 'అదీ ఒకందుకు మంచిదేలే, అప్పటికి మన సర్వే కూడా పూర్తయిపోతుంది' అని కూడా అన్నాడు డా. మిశ్రా.

ఆయన్ని కూడా తాటిముంజలు తినమని రాజు అడిగాడు, కాని, ఆ ఆదివారం నన్ను దగ్గరలో ఉన్న ఒక సంతకు తీసుకువెళ్దాం అనుకుంటున్నానని చెప్పాడు. రాగలిగితే తక్కినవాళ్ళని కూడా రమ్మన్నాడు.

దాంతో అందరం త్వరత్వరగా ఊళ్ళోకొచ్చి తొందరగా భోజనాలు చేసి సంతకు వెళ్ళడానికి సిద్ధమైపోయాం. మాకోసం ఆ రోజు జీపు పిలిపించాడు.

గిరిజన ప్రాంతంలో నేనొక సంత చూడటం అదే మొదటిసారి. చూడగానే నాకు అదొక రంగుల వేడుకలాగా అనిపించింది. వారం వారం జరిగే తిరనాళ్ళ లాగా కనిపించింది. కానీ ఆ రంగుల వెనక, ఎన్ని రకాల మోసాలు జరుగుతున్నాయో మిశ్రా దగ్గరుండి, ఒక్కొక్క అంగడినీ చూపిస్తూ మరీ వివరించాడు. తూనికలు, కొలతల దగ్గరనుంచీ, కల్తీ సరుకులు అమ్మడం దగ్గరనుంచి, చివరికి గిరిజనులకు అమ్మే టీనీళ్ళదాకా ప్రతి ఒక్కచోటా దోపిడీ ఎంత ఇన్‌స్టిట్యూషనలైజు అయిపోయిందో వివరించాడు. రాజు అప్పటికి ఆ సంతలు ఎన్నోసార్లు చూసి ఉంటాడు. కాని రోజాకి, సుధీర్‌కీ, నాకూ ఆ అనుభవం అంత తొందరగా డైజెస్టు కాలేదు. నాకు ఆ సాయంకాలానికి కడుపులో దేవేసినట్టయిపోయింది.

'మొదటిసారి సంతకి వచ్చినవాళ్ళకి ఆ ఎండుచేపల వాసనకీ, పొగాకుకాడలమీంచీ, సారాదుకాణం మీంచి కొట్టే కంపుకీ కళ్ళు తిరక్కుండా ఉండదు' అన్నాడు రాజు.

'కాదు రాజూ, ఆ సంతలో డా. మిశ్రా చెప్పిన విషయాలకి నాకు తలతిరుగుతోంది. ఆ ట్రైబల్స్ ముఖ్యంగా ఆ సామంతాలు ఎంత ఇన్నొసెంటో కదా. వాళ్ళని ఎట్లా దోచుకుంటున్నారో చూసాక నాకు నాగరికత మీద నమ్మకం పోయింది' అన్నాను.

తిరుగు ప్రయాణానికి జీపు ఎక్కబోతూ, ఆ సంతపాకలనుంచి దూరంగా కనిపిస్తున్న ఆకుపచ్చని అడవినీ, కెరటాల్లాంటి కొండల్నీ, నీలాకాశాన్నీ చూసాను. ఆ సంతకీ, ఆ చుట్టూ ఉన్న లాండ్‌స్కేప్‌కీ ఎంత ప్రయత్నించినా నాకు పొంతన కుదరలేదు.

జీపులో వస్తూ ఉండగా డా. మిశ్రాతో 'సార్, మీరు ఐ.ఏ.ఎస్ పరీక్ష రాయకూడదా! మీలాంటివాళ్ళు అధికారులుగా వస్తేనన్నా వీళ్ళకి న్యాయం జరుగుతుందేమో' అన్నాడు సుధీర్.

'ఆయన ఇప్పటికే రెండుసార్లు రాసారు. ఇంక రాయకూడదనుకున్నారు' అన్నాడు రాజు, సుధీర్‌కి ఆ వివరాలు తెలియవని.

కాని డా. మిశ్రా సుధీర్ కి ఓపిగ్గా జవాబిచ్చాడు. 'యెస్. ఒక ఉన్నతాధికారి ట్రైబల్ ఏరియాలో చాలా చెయ్యగలడు. ఇక్కడ ఉన్న ఇన్ జస్టిస్‌ని ఎంతో కొంత అరికట్టగలడు. కాని ఒక ఐఏఎస్ అధికారి జీవితమంతా ట్రైబల్ ఏరియాలోనే పనిచెయ్యడం కుదరదు కదా. ఇక్కడ పనిచేసాక నెక్స్ట్ పోస్టింగ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్‌లోనో లేదా టెక్నికల్ ఎడ్యుకేషన్‌లోనో వేస్తారు. ఒక ఐఏఎస్ అధికారి మొత్తం సర్వీసులో మహా అయితే రెండుమూడేళ్ళ కన్నా ఎక్కువకాలం ట్రైబల్ ఏరియాలో పనిచేసే అవకాశం దొరకదు. అండ్, ద ప్రైస్ ఒన్ హేజ్ టు పే ఫర్ దట్? గవర్న్‌మెంట్ జాబ్ కట్టిపడేస్తుంది. స్వేచ్ఛగా సంచరించడం ఎలానూ కుదరదు, కనీసం స్వేచ్ఛగా కూడా ఆలోచించలేం. అదీకాక, గిరిజనుల సమస్యలకి ప్రభుత్వం ఇవ్వగల పరిష్కారాలకి కూడా చాలా లిమిటేషన్స్ ఉన్నాయి' అని అన్నాడు.

'మరి అందుకేనా ట్రైబల్ ఏరియాలో తీవ్రవాదులు వస్తున్నారు? మరి వాళ్ళుండి కూడా ఇలాంటి దోపిడీ ఇక్కడ ఎలా కంటిన్యూ అవుతోంది?' అని అడిగాడు సుధీర్. అతనికి ఒక యాంత్రొపాలజీ ప్రొఫెసరు ఇలా దొరకడం ఇదే మొదటిసారి, ఇదే చివరిసారీ అన్నట్టుగా ప్రశ్నలమీద ప్రశ్నలు అడుగుతూనే ఉన్నాడు.

కాని డా. మిశ్రా అతనికి మళ్ళా ఓపిగ్గా జవాబిచ్చాడు. 'తీవ్రవాదుల ఎజెండా కేవలం ఎక్స్‌ప్లాయిటేషన్‌ని అరికట్టడమే కాదు, వాళ్ళ దృష్టిలో వాళ్లదొక దీర్ఘకాలికపోరాటం. అంతిమంగా రాజ్యాధికారం మీదనే వాళ్ళ దృష్టి. ఈలోపు ఈ పీడనని తాము ఏదో ఒక రూపంలో చెక్ చేస్తూంటారుగాని, దీని రూట్స్ చాలా పెద్దవి, చాలా డీప్ కూడా. ఇది వాళ్ళొక్కళ్ళూ పరిష్కరించగలిగే సమస్యకాదు, అలాగని కేవలం ప్రభుత్వ యంత్రాంగం ఒక్కటీ కూడా సాల్వ్ చెయ్యగలిగే ఇష్యూస్ కూడా కాదు. అందుకే నేనేమంటానంటే, గిరిజన సమస్యల్ని తామొక్కళ్ళే, తాము మాత్రమే పరిష్కరించగలమని ఎవరన్నా, వాళ్ళంతా కూడా తీవ్రవాదులే' అని అన్నాడు గంభీరంగా.

ఇంకా చెప్పడం కొనసాగించాడు. 'ట్రైబల్ ఇష్యూస్‌కి మూడు డైమన్షన్స్ ఉన్నాయి. మొదటిది, ఈ షెడ్యూల్డ్ ఏరియాస్ గవర్నెన్స్. ఇది పేరుకి గవర్నరు పేరుమీద జరుగుతుంది కాని, నిజానికి లోయెస్ట్ ఫంక్షనరీ ఇన్ ద సిస్టమ్ ఈజ్ ద డీ ఫాక్టో గవర్నర్‌లాగా ఉంటాడిక్కడ. అందుకే ట్రైబల్ ఏరియాస్‌లో ప్రాబ్లెమ్స్ నిజంగా సాల్వ్ చెయ్యగలిగేది

గ్రామాధికారులూ, ఫారెస్టుగార్డూ, ఎలక్ట్రిసిటీ లైన్‌మానూ, పోలీస్ కానిస్టేబులూ– ఇలాంటి వాళ్ళే. ఎందుకంటే సమస్యలు సృష్టించేదే వీళ్ళు కాబట్టి. దీనికి పరిష్కారమంటూ ఉంటే, గిరిజనప్రాంతాల్లో పాలన గిరిజనుల చేతికి అప్పగించడమే. యు మస్ట్ హేవ్ హర్డ్ అబౌట్ ద యాన్షియెంట్ విలేజ్ రిపబ్లిక్స్. నిజానికి బ్రిటిష్‌వాడు రాకముందు ట్రైబల్ ఏరియా గవర్నెన్స్ ట్రైబల్స్ చేతుల్లోనే ఉండేది. అప్పుడు వాళ్లది ఒకరకమైన డైరక్ట్ డెమోక్రసీ. బ్రిటిష్ వాడు వచ్చాక, ఇన్ ద నేమ్ ఆఫ్ డెమోక్రసీ, వాళ్ళ డైరక్ట్ డెమోక్రసీ స్థానంలో ఇన్‌డైరక్ట్ డెమోక్రసీ తీసుకొచ్చాడు. గిరిజన ప్రాంతాల్లో గవర్నెన్స్ ప్రాబ్లమ్స్ దాదాపుగా అన్నీ దానివల్ల వచ్చినవే' అని అన్నాడు.

అప్పుడు క్షణం విరామం తీసుకుని 'అందుకే, అప్పుడప్పుడు అనిపిస్తూ ఉంటుంది నాకు, మహాత్మాగాంధీ చంపారన్‌తో కాకుండా ఏదేనా గిరిజన ప్రాంతం నుంచి ఇండియాలో తన పోరాటం మొదలుపెట్టి ఉంటే ఎలా ఉండేదా అని. మన జాతీయోద్యమ స్వరూప స్వభావాలే మారిపోయి ఉండేవి. ఎందుకంటే ట్రైబల్ మోడ్ ఆఫ్ గవర్నన్స్‌కీ, గాంధియన్ స్వరాజ్‌కీ మధ్య ఆట్టే తేడా లేదు' అని కూడా అన్నాడు.

ఆ తర్వాత కొంతసేపు ఏమీ మాట్లాడలేదు. అందరం నిశ్శబ్దంగా ఉన్నాం. కాని సుధీర్ ఒకటిరెండు సార్లు తటపటాయించి, 'మొత్తం మూడు డైమన్షన్స్ అన్నారు. ఇంకా రెండున్నాయి, మీరు చెప్తే వినాలని ఉంది. నేను అయిదేళ్ళుగా బాంకులో పనిచేస్తున్నాను. ఇంతకు ముందు చాలా సార్లు ఈ ఊరొచ్చానుగాని ఈ విషయాల గురించి మీలా ఇంత చక్కగా చెప్పేవాళ్ళెవరూ కనిపించలేదు' అన్నాడు.

జీపులో ముందు సీటులో కూచున్న మిశ్రా తలవెనక్కి తిప్పి సుధీర్‌ని చూసాడు. తనకు తారసపడిన మనిషి కూడా గిరిజనప్రేమి అయి ఉంటాడేమో అని ఆ గిరిజన ప్రేమి ఒకసారి కన్ఫర్మ్ చేసుకోడానికి చూసినట్టు ఉంది ఆ చూపు.

'వాటి గురించి చాలా వివరంగా చెప్పాలి. నాట్ ఇన్ దిస్ బ్రీఫ్ ట్రిప్. బట్, బ్రాడ్‌గా చెప్పాలంటే, మొదటిది డెవలప్‌మెంట్. అందులో మళ్ళా రెండు కాంపొనెంట్స్. ఒకటి ఏరియా డెవలప్‌మెంట్. అంటే ఇన్ఫ్రా. రోడ్లు, కరెంటు, హౌసింగ్ లాంటివి. రెండోది ఇకనమిక్ డెవలప్మెంట్. గిరిజనుల జీవనోపాధుల్ని మెరుగుపర్చడం. వాళ్ళకి ఇప్పుడున్న రిసోర్సెస్‌లో ప్రొడక్టివిటీ పెంచడం. ఇక రెండో డైమన్షన్ వాళ్ళ సోషల్ డెవల్ మెంట్, సోషల్ సెక్యూరిటీ, వెల్ఫేర్. అన్నిటికన్నా ముందు న్యూట్రిషన్, హెల్త్, ఎడ్యుకేషన్. ఎడుకేషన్ అంటే ఏదో హాస్టళ్ళు నడపడం కాదు, క్వాలిటీ ఎడ్యుకేషన్ ఇవ్వాలి. ఈ

ట్రైబల్స్ దేశంలో ఎవరితోనైనా కంపీట్ చెయ్యగలిగేటట్టుగా ఉండాలి. అఫ్ కోర్స్, నేను చెప్తున్నా ఈ అంశాలన్నిటి గురించీ ఎన్నో డిబేట్స్ ఉన్నాయి. ఈ సర్వీసెస్ ఎలా ఉండాలన్నదాని గురించి ఎవరి అభిప్రాయాలు వాళ్ళకున్నాయి. బట్ నేనేమంటానంటే, ఏదైనా సరే, ట్రైబల్స్ ఛాయిస్ ప్రకారం ఉండాలి. దే షుడ్ బి ఎంపవర్డ్ ఎనఫ్ టు డిసైడ్ థింగ్స్ ఫర్ దెమ్‌సెల్వ్స్' అని అన్నాడు.

ఆ జవాబు విన్నాక ఇంక సుధీర్ కూడా ఏమీ మాట్లాడలేదు. బ్రీఫ్ ట్రిప్ అని అంటున్నప్పుడు డా.మిశ్రా బహుశా మేం సంతకు వెళ్ళి తిరిగిరావడం గురించే అని ఉండవచ్చుగాని, నాకైతే, అసలు మేముగాని, ఆయన గాని ఆ ఊళ్ళో ఉండటానికి వచ్చిన ఆ నాలుగైదు వారాల ట్రిప్పు ఎంతమాత్రమూ సరిపోదు ఆ అంశాల గురించి లోతుగా చర్చించుకోడానికి అనిపించింది.

మేము ఇంటికి వచ్చేసాక, ఆ సాయంకాలం మళ్ళా మా ఇంటిదగ్గర మరోసారి మిశ్రా గురించి పెద్ద చర్చే జరిగింది.

'ఆయన్ని చూస్తుంటే బాగా తెలిసినవాడిలానే ఉన్నాడు' అన్నాడు సుధీర్.

'ఆయన చెప్పినదాన్నిబట్టి దండకారణ్యమంతా చూసాడు. ఒడిస్సానే కాదు, మధ్యప్రదేశ్, సౌత్ బీహార్ కూడా తిరిగానని చెప్పాడు' అన్నాడు రాజు.

'నాకు ఆయనతో మాట్లాడినప్పుడల్లా మన దేశంలోనే మనకు తెలియని భారతదేశం పరిచయమవుతూ ఉంటుంది' అని అన్నాను. 'ఎంతసేపూ ఈ గిరిజనులకీ, ఈ గిరిజన ప్రాంతాలకీ, ఈ కుటుంబాలకీ ఏమి చెయ్యగలమా అనే ఆలోచిస్తుంటాడు. నేనొకసారి ఆయనతో భారతదేశం స్వతంత్రమయ్యాక గిరిజనుల జీవితాలు మెరుగవుతున్నాయి కదా అని అంటే, ఇప్పుడు ఈ ప్రాంతాలూ, ఈ సమాజాలూ సంధియుగంలో ప్రవేశించాయనీ, బ్రిటిష్‌కాలంకన్నా కూడా ఇప్పుడే గిరిజనులు మరింత విషమపరిస్థితులు ఎదుర్కుంటు న్నారనీ అన్నాడు' అని అన్నాను.

'యా. ఆయన చాలా ప్రాక్టికల్' అన్నాడు రాజు.

'నువ్వింతకుముందు కూడా ఈ మాటే అన్నావు రాజూ. డా.మిశ్రా ప్రాక్టికల్ అయితే సేన్‌గుప్త ఏమిటి? ఆయన డ్రీమరా?' అనడిగాను.

'అంతే కదా, డా.సేన్‌గుప్తాకి మనుషులే పట్టరు. ఎప్పుడూ తనలోకంలో తానుంటాడు. చెట్టూ, చేమా కనిపిస్తే చాలు, తక్కినవన్నీ మర్చిపోతాడు' అన్నాడు రాజు.

'ఆ అమ్మాయి పక్కనుండకపోతే అడవికి వెళ్ళినవాడు ఇంటికొస్తాడని కూడా నమ్మకం లేదు' అని అన్నాడు నవ్వుతూ.

'ఇది చాలా అన్యాయం రాజూ' అన్నాను ప్రొటెస్ట్ చేస్తూ. మా మాటలు వింటూ సూర్యనారాయణగారు కూడా అక్కడే కూచున్నారు, అరుగుమీద గోడకి ఆనుకుని.

అప్పుడు రాజుతో చెప్పడం మొదలుపెట్టాను:

'నాకు తెలిసి ప్రొఫెసర్ సేన్‌గుప్తాకీ, డా.మిశ్రాకీ మధ్య బేసిగ్గా ఏమీ తేడా లేదు. ఒకవేళ తేడా ఉందని మనం అనుకుంటే అదంతా వాళ్ళ కాలమానంలో తేడా మటుకే. ప్రొఫెసర్ సేన్‌గుప్తా జియొలాజికల్ టైమ్‌లో జీవిస్తాడు. ఆయన దృష్టిలో ఒక చెట్టుకి, ఒక రాయికి, ఒక సాలీడుకి మధ్య తేడా లేదు. తన కళ్ళముందు ఒక పచ్చని చెట్టు కూలిపోయినా కూడా ఆయన శోకించడు. ఎందుకని అడిగావనుకో, రెండుకోట్ల సంవత్సరాల తర్వాత ఆ చెట్టు శిలగా మారుతుందేమో ఎవరికి తెలుసు అనడుగుతాడు. దృశ్యప్రపంచంలో ప్రతీదీ అనుక్షణం పుడుతూ, అదృశ్యమవుతూ ఉంటుందనీ, అదృశ్యమైన ప్రతీదీ, తిరిగి రూపు మార్చుకుని మరో చరాచరంగా సృష్టిలో తన వంతు పాత్ర తను పోషిస్తూ ఉంటుందనీ నమ్ముతాడు. చరాచరాలన్నిటిమధ్యా ఒక కమ్యూనికేషన్ వెబ్ లాంటిది ఉందంటాడు. ఎవరో కవి అన్నాడట, ఏదో ఒక నక్షత్రాన్ని డిస్టర్బ్ చేయకుండా నువ్వు ఒక్క పువ్వుని కూడా తెంపలేవని. ఆ మాట తనకి గైడింగ్ ప్రిన్సిపుల్ అని ప్రొఫెసరు చెప్పాడు. నేననుకుంటాను, ఆయన్ని పోల్చాలంటే, మనం బహుశా ఇదిగో ఈ ఊళ్ళో ఉండే కొండరెడ్లతో పోల్చగలం. లేకపోతే, ఎవరేనా ఒక బుద్ధిస్ట్ మాంక్‌తో పోల్చగలం. అంతే' అని అన్నాను.

'మరి డా.మిశ్రా సంగతేమిటి?' – రాజు కాదు, ఈ ప్రశ్న, సూర్యనారాయణగారి నుంచి వచ్చింది.

నేను ఒక క్షణం ఆశ్చర్యపోయాను. ఆయన అంత కీన్‌గా నా మాటలు వింటున్నారనుకోలేదు. నాకు కొంత సంతోషంగానూ, ఒకింత గర్వంగానూ కూడా అనిపించింది. నేను ఇక్కడకు వచ్చిన అయిదారునెలల్లో మొదటిసారి ఆయన నామాటలు వింటున్నారు.

'మిశ్రా గారు సోషియలాజికల్ టైమ్‌లో జీవిస్తాడు మాష్టారూ. సేన్‌గుప్త చూస్తున్న స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టన్స్ నాచురల్ వరల్డ్ కి చెందింది. మిశ్రా కూడా అదే స్ట్రగుల్ చూస్తున్నాడు కాని హ్యూమన్ సొసైటీలో చూస్తున్నాడు. అయితే, సేన్‌గుప్త ఎవరి పక్షం తీసుకోడు,

కాని డా. మిశ్రా గిరిజనుల పక్షాన నిలబడటం మన బాధ్యత అంటాడు. అది మనం అర్జెంటుగా చెయ్యవలసిన పని కూడా అంటాడు. అదొక్కటే తేడా. కాని ఒకటి మాత్రం చెప్పగలను. ఇద్దరూ కూడా మన కంటికి కనిపించేదే ట్రూత్ అనరు. ఇద్దరూ కూడా డ్రీమ్ టైమ్‌లో జీవిస్తుంటారు. కాని ప్రొఫెసరు సేన్‌గుప్త డ్రీమ్‌లో సృష్టి, స్థితి, లయాలమధ్య తేడా లేదు. కాని అదే మిశ్రా అయితే మీరు దేన్ని అసత్యమన్నా ఒప్పుకుంటాడుగాని, ఇన్‌జస్టిస్‌ని అసత్యం అంటే మాత్రం ఒప్పుకోడు. దాంతో ఏదో ఒక రకంగా తలపడాలంటాడు. బట్, అలా తలపడటానికి కావలసిన ఎనర్జీ మాత్రం తన డ్రీమ్స్ నుంచే డ్రా చేసుకుంటాడు' అని అన్నాను.

'అదే, ఆ గుణం వల్లనే నేను ఆయన్ని ప్రాక్టికల్ అంటున్నాను' అన్నాడు రాజు.

'నీకో సంగతి చెప్పనా? మొన్నొక రాత్రి మేమిద్దరం చాపరాయి మీద గడిపేం. అక్కడ బీడీ ఆకులు సేకరించే వాళ్లతో మాట్లాడుతూ ఉన్నాం. బీడీ ఆకుల కట్టకి అప్పుడిస్తున్న రేటుకన్నా కనీసం రెండు పైసలు అదనంగా పెంచితే ఆ గిరిజన కుటుంబాలకి ఆర్థికంగా ఎంత లబ్ధి చేకూరగలదో మిశ్రా అక్కడికక్కడే లెక్కలు వేసాడు. ఆ బీడీ ఆకుల కంట్రాక్టర్లతో రేటు పెంచడం గురించి మాట్లాడేడు. ఆ సంగతి మర్నాడు జోసెఫ్‌గారికి తెలిసింది. ఆయన కంగారు పడ్డాడు. ఫారెస్టు డిపార్ట్‌మెంట్‌లో పై అధికారుల దృష్టికి వెళ్తే తనకి మాట వస్తుందని భయపడ్డాడు. అటువంటి మనిషికి తాను ఆశ్రయం ఇవ్వవలసి వచ్చిందే అని చిరాకు కూడా పడ్డాడట. ఆ సంగతి నేను మిశ్రాకి చెప్పాను. చెప్పగానే ఏం చేసాడో తెలుసా, డైరక్టుగా నన్ను తీసుకుని జోసెఫ్ గారి దగ్గరికి వెళ్ళిపోయాడు. ముందు ఆయనకి ఏదన్నా ఇబ్బంది కలిగితే క్షమించమని అడిగాడు. అప్పుడు తాను వేసిన లెక్కలన్నీ చెప్పాడు. బీడీ ఆకుల రేట్లమీద ట్రైబల్స్‌లో అన్‌రెస్ట్ పెరుగుతోందనీ, ఇప్పుడు ఫారెస్ట్ డిపార్ట్ మెంటు పట్టించుకోకపోతే ముందుముందు అది పెద్ద సమస్యగా మారుతుందనీ, అందుకనే తాను ఆ కాంట్రాక్టర్లని హెచ్చరించాననీ చెప్పాడు. మీ డిపార్ట్‌మెంట్ హయ్యర్ అఫిషియల్స్‌కి చెప్పమంటే ఇప్పుడే పోయి చెప్తాను అని కూడా అన్నాడు. ఇంకేముంది? జోసెఫ్‌గారు ఆయన్ని కూచోమని టీ ఇచ్చి నవ్వుతూ మాట్లాడి థాంక్స్ చెప్పి మరీ పంపించాడు'.

'అటువంటి మనిషి మీద ఎలా కోపం తెచ్చుకోగలం?' అని కూడా అన్నాట్ట, ఇదుగో మన రోజా చెప్పింది ఆ తర్వాత' అని చెప్పాడు రాజు.

మా మాటలకి అక్కడ ఎక్కువగా చలించింది సూర్యనారాయణగారే. ఆయన రాజు మాటలు విన్నాక–

'నేనీ ప్రాంతాల్లో ఇరవైఏళ్ళబట్టీ పనిచేస్తున్నాను. కాని ఈ సమస్యల గురించి ఎవరూ ఇలా మాట్లాడుకోడం ఇంతదాకా వినలేదు. మామూలుగానే చదువుకున్నవాళ్ళంటే నాకెంతో గౌరవం. కానీ చదువుకున్నవాళ్ళు ఇలాంటి చక్కటి విషయాలు, నలుగురి మంచికోరే విషయాలు మాట్లాడుకుంటున్నారంటే, మీ అందరిమీదా నాకు మరింత గౌరవం కలుగుతోంది' అని తన తమ్ముడి కేసి చూస్తూ ' ఒరే, ఆడపిల్లలు చదువుకుని ఊళ్ళేలతారా అనడుగుతారు మనవాళ్ళు. చూడు, ఆ అమ్మాయి, ఇక్కడికొచ్చి నాలుగునెలలు కాలేదు, అంత పెద్ద పెద్ద ప్రొఫెసర్ల గురించి ఎంత బాగా చెప్పింది. ఎంత బాగా అర్థం చేసుకుంటే అంత బాగా చెప్పగలుగుతుంది' అని అన్నాడు.

సుధీర్ తన కళ్లల్లోంచి ప్రశంస కురిపిస్తూ 'మా చెల్లాయిలాంటి స్కాలర్‌ని నేనిప్పటిదాకా చూడలేదు' అన్నాడు.

'అంతా హేపీగా ఉన్నారుకాబట్టి ఈ సందర్భంగా నా ప్రపోజల్ ఏమిటంటే ఈ పున్నమికి మనమంతా సినిమాకి వెళ్దాం–'

అని చిన్న సస్పెన్స్ పెట్టినట్టు అరక్షణం ఆగి అప్పుడు 'బస్సు మీద కాదు, రెండెడ్ల బండిమీద' అన్నాడు రాజు.

'ఎడ్లబండిమీదనా? ఎన్నిరోజులు ప్రయాణం ?' అనడిగింది రోజా. ఆ బార్బీ ప్రశ్నలో వ్యంగ్యం లేదు, అమాయికత్వమే ఉంది.

'ఎన్ని రోజులా? సాయంకాలం బయల్దేరతాం. రెండో ఆట చూస్తాం. సినిమా అయిపోగానే బయల్దేరతాం. తెల్లవారకుండా ఇంటికొచ్చేస్తాం. మీ ఇంట్లో నేనొచ్చి అడుగుతాలే పర్మిషను' అన్నాడు రాజు.

పున్నమిరాత్రి రెండెడ్లబండిలో ప్రయాణం! నా మనసు అప్పటికే చాపరాయిమీంచి వెలగచెట్టు కూడా దాటేసింది!

❋

22

అప్పటిదాకా ఏ పున్నమికోసమూ నేనట్లా ఎదురుచూసిందిలేదు. ఆ పున్నమి రావడానికి మరొక నాలుగురోజులు గడవాలి. ఆ నాలుగురాత్రులూ నేను నిద్రపోలేదు. అసలు వైశాఖమాసం మొదలయ్యాక ఆ వెన్నెలరాత్రులంతా ఆ ఊరు కూడా నిద్రపోలేదు. గంగాలమ్మ పండక్కి కట్టిన ఉయ్యాల ఏ ఒక్కరాత్రి కూడా ఆగిందిలేదు. అప్పటిదాకా నా మనసుకి ఎక్కలేదు గాని, ఆ ఉయ్యాల చుట్టూ అన్ని నవ్వులు, అన్ని పరిహాసాలు, అన్ని పాటలు, అన్ని రాగాలూ పొంగిపొర్లుతున్నాయని ఆ నాలుగు రాత్రుల్లోనే నాకు బాగా తెలిసింది.

పున్నమి రాత్రి ఎడ్లబండిలో ప్రయాణం అని రాజు చెప్పిన మర్నాటి రాత్రి, నేను ఇంట్లో ఏదో పని చేసుకుంటూ ఉండగా, ఉన్నట్టుండి గాల్లోంచి 'నోయి మావల్లారా ఉయ్యాలో– మావలన్నల్లారా ఉయ్యాలో' అంటో ఒక పాట వినిపించింది. ఆ పాట పెరటివైపు నుంచి వస్తున్నదనుకుని ముందు పెరటివైపుకు వెళ్ళాను. అప్పటికే వెన్నెల ధారాపాతంగా కురవడం మొదలయ్యింది. ఆ ఇంటివెనక ఉన్న నిమ్మతోటమీంచి తొలిపూత గాలి తరలి వస్తున్నది తప్ప పాట కాదని అర్థమయింది. ఆ పెరటిలోంచి చుట్టు తిరిగి వీథివైపుకు వచ్చాను. తొలివాన పడేటప్పుడు గదికిటికీ తెరవగానే గుప్పున తొలిజల్లు ముఖాన చిందినట్టు, పాట కంచె మీంచి నా మీద తొణికింది. గబగబా, కంచె తలుపు తీసుకుని వీథిలోకి వెళ్ళి నిలబడ్డాను. ఆ ఉయ్యాల మీద ఉయ్యేలూగుతూ ఇద్దరు స్త్రీపురుషులు పాట పాడుతుంటే వాళ్ళని ఊపుతున్నవాళ్ళూ, పక్కననిలబడ్డవాళ్ళూ ఆ పాటకి గొంతు కలుపుతున్నారు. ఆ క్షణాన ఆ ఉయ్యాల ఒక ఊటలాగా, ఆ పాట దాన్లోంచి చిమ్ముతున్న జలధారలాగా ఉంది.

నోయి మావల్లారా ఉయ్యాలో, మావలన్నల్లారా ఉయ్యాలో
సిరిదలచి నిను దలచి ఉయ్యాలో సింహాద్రి నే దలచి ఉయ్యాలో

చంద్రుడు ఇంకా ఆకాశమధ్యానికి రానేలేదు. చివరి బస్సు ఇంకా వెళ్ళిపోలేదు. ఇళ్ళల్లో దీపాల ఒత్తులు ఇంకా మందగించలేదు. కానీ, ఆ స్త్రీ పురుషుల ఉత్సాహం అప్పటికే ఎంతోకాలంగా ఆ క్షణాల కోసం ఎదురుచూస్తున్నట్టుగా ఎగిసి పడుతూ ఉంది. ఆ సమయాన ఆ గ్రామం రెండు వరదల్లో చిక్కుకున్నట్టు ఉంది. ఒకటి, నింగి పైన వెన్నెల వరద. మరొకటి నేలపైన యవ్వనపు వరద.

ఆ స్త్రీపురుషులు ఎవరు? వాళ్లది ఆ గ్రామం కాదా? పొద్దున్నప్పుడు ఇంటింటికీ తిరిగి నేను ఇంటర్వ్యూ చేస్తూ వింటున్న ఆ కష్టాలు వీళ్లవికావా? భూములు అన్యాక్రాంతం అవుతున్నవాళ్ళూ, నూటికి యాభై వడ్డీ కడుతున్నవాళ్ళూ, ప్రసూతిమరణాల్లో తల్లుల్నీ, బిడ్డల్నీ పోగొట్టుకుంటున్నవాళ్ళూ వారు కారా? ఏమో, అది పగటి ప్రపంచం, ఇది వెన్నెల ప్రపంచం. ఆ వ్యథలకీ, ఈ సుధలకీ మధ్య యోజనాల దూరం ఉందనిపించింది.

ఏళ్ళ తరువాత, ఎప్పుడో ఒక అక్టోబరులో డాక్టరూ, నేనూ మాచర్ల మీదుగా సాగర్ కారులో వెళ్తూ ఉండగా, ఒక పల్లెటూళ్ళో చిరు చీకటిలో ఊరంతా అట్లతద్ది ఉయ్యాల ఊగుతున్న దృశ్యం చూసాను. ఆ ఉయ్యాల పక్కన ఒక బడి ఉంది. పిల్లలాడుకునే ఆటస్థలంలో కట్టారు ఆ ఉయ్యాల. దగ్గరలో నిద్రగన్నేరు చెట్లు. ఆ చెట్లకి ఆవల దూరంగా ఒక చెరువుమీద తదియ నాటి చుక్కల వెలుగు వెన్నచారికలాగా కనిపిస్తూ ఉంది. ఆ ఉయ్యాల చుట్టూ పిల్లలు కేరింతలు కొడుతున్నారు. కారులో వెళ్తూ ఉండగా అదాటున కిటికీలోంచి ఆ ఉయ్యెల కనబడగానే నా మనసు స్పృహతప్పిపోయింది. ఎన్నో ఏళ్ళ కిందట, ఒక వసంతఋతురాత్రి ఆ కొండకింద పల్లెలో, ఆకాశమంత ఎత్తుకి ఊగిన ఉయ్యాల గుర్తొచ్చింది. చెప్పలేనంత బెంగ ఆవహించింది.

ఆ బెంగ ఆ ఊరికోసమా? లేక ఆ ఊరినుంచి నేను అందుకున్న తొలిప్రేమలేఖ కోసమా? లేక ఆ రాత్రులు మరెన్నటికీ రావనే కరకు మెలకువ వల్లనా? దాన్నేనా నోస్టాల్జియా అంటారు?

మొబైల్లో నెట్ తెరిచి నోస్టాల్జియా అనే మాటకి అర్థమేమిటా అని చూసాను. వట్టి అర్థం కాదు, ఎటిమలాజికల్ మీనింగ్ ఏమైఉంటుందా అని చూసాను. నోస్టాల్జియా గ్రీకు నుంచి పుట్టిన పదం అట. తిరిగి వెళ్ళడం, బాధ– అనే రెండు పదాల కలయిక అట. పునర్యాన వేదన. ఆ బాధ తిరిగివెళ్ళడంలోని బాధనా? వెళ్లలేమని తెలియడంలోని

బాధనా? లేక ఎలాగేనా తిరిగివెళ్ళిపోవాలనిపించి మనని నిలవనివ్వని బాధనా? నెట్ లో పెద్ద వ్యాసం కూడా ఉంది. నోస్టాల్జియా ప్రధానంగా స్థలంతో ముడిపడ్డది అని. కాని, అది స్థలం కన్నా కూడా ఎక్కువగా కాలంతో ముడిపడ్డ వేదన అని నాకు తెలుస్తున్నది. ఆ స్థలం అక్కడే ఉన్నా, ఆ కాలం అక్కడ లేదని ఎలా మర్చిపోగలను?

గతించిపోయిన కాలం గురించి బెంగపెట్టుకుని ఏమి లాభం? మనుషులెప్పుడూ ముందుకే చూస్తుండాలి అనే మాటలు నేను చిన్నప్పణ్ణుంచీ వింటూనే ఉన్నాను. చిన్నప్పణ్ణుంచీ ఇంటిదగ్గరే పెరిగినందువల్ల, హోమ్ సిక్‌నెస్ అనే మాట నాకు తెలియదు. కాని నాకేమీకాని ఒక ఊళ్ళో ఆరేడునెలలు మాత్రమే గడిపి వచ్చినతరువాత నాలో నాకు తెలీకుండానే కొత్త సిక్‌నెస్ ఒకటి పుట్టడం గమనించాను. దాన్ని ఫార్-సిక్‌నెస్ అందామా? ఆ ఊళ్ళో గడిపి వచ్చిన తరువాత నాకు మరేవో కొత్తప్రపంచాలు చూడాలనే కోరిక అదృశ్యమైపోయింది. సేన్‌గుప్తా బంగ్లాదేశ్ వెళ్ళలేనట్టే నేను కూడా ఆ కాలానికి తిరిగి పోలేను. ఏళ్ల మీదట ఎంతో నలుగులాట పడ్డాక చివరికి నేను సాధనచెయ్యగలిగిన విద్య ఒకటే: నేను ఎక్కడ ఉండవలసి వస్తే, ఆ స్థలాన్నే, ఆ కాలాన్నే ప్రేమించడం.

ఇది ఎన్నో ఏళ్ళ తరువాతి మాట. కాని ఆ రాత్రి నా పరిస్థితి నేను మాటల్లో పెట్టగలిగేది కాదు. నాలోనూ ఏదో ఉధృతి పరవళ్ళు తొక్కడం తెలుస్తూ ఉంది. నేను కూడా అలా ఎవరో ఒకరితో ఆ బల్లమీద నిల్చొని, నేలకీ, నింగికీ మధ్య ఉయ్యాల ఊగాలని అనిపించింది. ఆ రాత్రి నువ్వు ఉయ్యేలలూగాలని కోరుకున్నది ఒక మనిషితో కాదు, ఒక గంధర్వుడితో అని మర్చిపోకు అని ఆ తర్వాత నాకు నేను ఎన్ని సార్లు చెప్పుకున్నానో!

ఆ రాత్రి నాకు నిద్రపట్టలేదని ముందే చెప్పాను. తెల్లవారేటప్పటికి చిరుజల్లు కురిసి పోయింది. మామూలుగా ఆ అడవిదేశంలో వసంతవాన చైత్రంలో పొద్దున్న పూట కురిసి పోతుంది. వైశాఖంలో వానలు మధ్యాహ్నాల ముచ్చట. కాని ఆ రోజు వైశాఖ పూర్వాహ్ణమే ముత్యాలవాన కురిసింది. బహుశా రాత్రంతా పాడినపాటలకి గడ్డకట్టిన వెన్నెల తెల్లవారగానే కురిసిపోయినట్టుంది.

లేవగానే చిరుజల్లు పడుతూ ఉంటే నా దేహం పూర్తిగా తేలికపడిపోయింది. తూలికాతుల్యం అయిందని చెప్పగలను. ఇంటివెనక్కి వెళ్ళినిలబడ్డాను. అప్పటికి జల్లు ఆగిపోయింది. చింతచెట్లమీద కొంగలు రెక్కలు విదుల్చుకుంటున్నాయి. కరణంగారి నారింజతోట మీంచి నునులేత పూలగాలి ఆ దారంతటినీ దేవతలు నడిచే దారిగా

మారుస్తోంది. నాకు వెంటనే ఆ దారమ్మట అడవిలోకి నడుచుకుంటూ వెళ్ళిపోవాలని పించింది. మే నెల ఇండియన్ లాబర్నమ్ నెల అంటారు. అడవిలోనూ, కొండమీదా పసుపుమంటలాగా ప్రజ్వరిల్లే రేలపూల వెల్లువ కళ్ళారా చూస్తే తప్ప నా మనసు శాంతించదు అనిపించింది. కాని ఆశ్చర్యం, రాత్రి ఉయ్యేలలూగడానికి ఒక తోడు కావాలని పించిందిగాని, పొద్దున్నే అడవికి మాత్రం ఒక్కత్తెనే వెళ్ళాలనిపించింది. రేలచెట్ల కింద నిలబడి ఆ పూలు పాడే పాటలు నేనొక్కతినే వినాలనిపించింది. కాబట్టి, అడవికి ఎలానూ పోలేను. ఊరంతా తిరుగుదామా అని అనుకున్నాను.

ఆ పొద్దున్నే కాగితాలు చేత్తో పట్టుకుని ఊరంతా తిరుగుతుంటే ఎవరికీ విడ్డూరంగా అనిపించకపోవచ్చు. ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తున్నాననే ప్రతి ఇంట్లోనూ అనుకోవచ్చు, ఇబ్బంది ఉండదు అనుకుని గబగబా ముఖం కూడా కడుక్కోకుండా ఇంట్లోకి వచ్చి, కాగితాలు చంకనపెట్టుకుని పెరటి తలుపు తీసుకుని బయటికి అడుగుపెట్టాను. ఆ దారమ్మట కొండరెడ్ల ఇళ్ళమధ్యనుంచి సన్నని కాలిబాటమ్మటే నడుస్తో పోయేను.

అది నాకు తెలిసినదారి కాదు. ఆ ఇళ్లు కూడా సర్వేలో నా వంతువచ్చినవి కావు. అప్పుడప్పుడే ఇళ్ళముందు మనుషుల సంచారం పెరుగుతోంది. కోళ్ళు చప్పుడుచేసుకుంటో ఆ చిరుతడినేలలో పురుగులకోసం వెతుక్కుంటూ ఉన్నాయి. ఆ ఇళ్ళుదాటి కూడా ముందుకు పోయేను. మరికొన్ని నిముషాల్లో ఊరూ, అడవీ కలుసుకునే హద్దుకి చేరుకున్నాను. నా ఎదట చింతతోపు. ఆ తోపుదాటగానే కొండవార లొద్దు కనిపిస్తోంది. అంతకుముందు వారంరోజులకిందటనే ఒక మధ్యాహ్నం వేళ రాజుతో కలిసి ఆ కొండలోయలో వైశాఖ మాసపు వానలో చిక్కుకుపోయిన విషయం గుర్తొచ్చింది. ఆ చింతతోపు దాటితే నూరువరహాల చెట్టు నిండుగా పూసి ఉంటుందని గుర్తొచ్చింది. ఎదురుగా కొండలు వేసవిరంగు తిరిగి ఉన్నాయి. వానజల్లు ఆ కొండల ఊదారంగు మీద తెల్లటిపూత పూసింది. ఆ తడిపూత ఆరడానికి మరికొంతసేపు పడుతుంది. అక్కడ ఒక కోకిల ఆకాశానికి తలుపులు బార్లాతీస్తూ, మళ్ళా వేస్తూ ఉంది. ఇక అక్కణ్ణుంచి మరిముందుకు వెళ్ళలేక పోయాను. అప్పటికింకా తడిగాలీ, పొడి ఎండా కలుసుకుని మాట్లాడుకుంటూనే ఉన్నాయి. మరికొంతసేపటికి ఒకరు వెళ్ళిపోతారు, మరొకరు ఇటువైపు అడుగుపెడతారు. వెనక్కి తిరిగాను.

వచ్చిన దారిన కాక అక్కడ ఖాళీ నేలకి అడ్డంగా నడిచి పెద్దరావిచెట్టు పక్కనుంచి మళ్లా ఊళ్ళో అడుగుపెట్టాను. అటువైపు ఎక్కువ ఇళ్ళుండవు. ఆ మలుపులో ఒక తురాయి చెట్టు ఉంది. వేసవి మొదలైనప్పటినుంచీ, ఆ చెట్టు ఎలుగెత్తి పాటలు పాడుతూనే ఉంది,

పాడగా అరిగిపోయిన పాటలు తునిగిపోయి కింద రాలిపోయినట్టు పూలరేకలు కింద మట్టిలో కలిసిపోతూ ఉన్నాయి. ఆ చెట్టు ఆ వేసవిరాత్రులంతా ఆ నేలకి వేనవేల ముద్దులు పెడుతున్నట్టు ఎర్రటి మరకలు. వాటిమీద పొద్దున్న కురిసిన చిరుజల్లుకి మళ్లా కొత్తగా రాలిపడ్డ ఎర్రని రేకలు, ఆకుపచ్చని మొగ్గలు, తెగిపడ్డ కేసరాలు, అక్కడక్కడా విరిగిపడ్డ కొమ్మలు. ఆక్కడినుంచి కాళ్ళు ఒకపట్టాన ముందుకు సాగలేదు. అక్కడికి కొండ చాలా దగ్గరగా కనిపిస్తూ ఉంది. ఆ కొండమీద ఒక అతిథిగృహం ఉన్నట్టూ, ఈ చెట్టు ఆ అతిథి గృహం ప్రాంగణంలో ఉన్నట్టూ, రాత్రి ఎవరో అతిథి ఆ కొండమీద దిగినట్టూ, ఇక్కడ రాలిపడ్డ పూలని ఊడ్చడానికి ఇంకా ఎవరూ రానట్టూ ఉంది. కోకిల నా వెనకే అక్కడికీ వచ్చింది. బిగ్గరగా అరుస్తూ నాకేదో చెప్తున్నది. అదేమిటో నాకు తెలుస్తున్నట్టే ఉందిగాని, అక్షరాలు తడిసిపోయిన లేఖలా అర్థంకాకుండా ఉన్నది.

మూడు రోజుల తర్వాత సినిమాకి బయల్దేరేటప్పటికి నా మనోలోకంలో ఒక కొండ మీద అతిథీ, అతను కోకిల కూజితంలో చుట్టి పంపిన ప్రేమలేఖా మాత్రమే ఉన్నాయి. అవి నా మనసుని పూర్తిగా ఆక్రమించి తక్కినవాటన్నిటినీ బయటకు నెట్టేసాయి.

ఆ రోజు సాయంకాలం బయల్దేరి మొదటి ఆట చూసి అర్థరాత్రికి ఇంటికి తిరిగి వచ్చేసేటట్టు ఏర్పాట్లు చేసాడు రాజు. కానీ మధ్యాహ్నానికి ఎప్పట్లానే వసంతమేఘం గర్జించింది. కృష్ణమేఘాలు కమ్ముకున్నాయి. పెద్ద వాన పడింది. ఇక ఆ రోజుకి మా ప్రయాణమే ఆగిపోతుందేమో అనుకున్నాం. మూడింటికల్లా సిద్ధం అయినవాళ్ళం వాన తగ్గేదాకా ఎదురుచూస్తూ కూచున్నాం. తీరా వానవెలిసేటప్పటికి సాయంకాలం అయిదు దాటింది. వానవెలిసాక పరుచుకునే పసిడి వెలుతురు ఊరంతా కమ్ముకుంది. కంచెమీద కురిసిపోగా మిగిలిన వాననీళ్ళు వెదురు తడికల మీంచి బొట్లుబొట్లుగా కిందకి జారుతూ ఉన్నాయి. ప్రతి నీటిబిందువుమీదా సంధ్యకాంతి చిట్లి రంగురంగుల వలయాలు సాలీడు దారాల్లాగా ఊగుతున్నాయి.

ఇంటిముందు రెండు బళ్ళు వచ్చి ఆగాయి. ఒక్కో బండిలోనూ ఎండుగడ్డి పరిచి వాటిమీద గోనెసంచులు పరిచారు. ఆ గోనెపట్టాలమీద జంబుఖానాలు పరిచారు. ఒక బండిలో నేనూ, మా ఇంట్లో చిన్నపిల్లలిద్దరూ కూచున్నాం. మరో బండిలో రాజూ, సుధీరూ కూచున్నారు. ఒకపక్కన ప్లాస్టిక్ తాబేటికాయల్లో మంచినీళ్ళు, తినడానికి వేయించిన అటుకులు పెట్టుకున్నాం. ఊళ్ళో వాళ్ళు మమ్మల్నే చూస్తున్నారు. బళ్ళు నెమ్మదిగా కదిలి విలేజి చావడి దాటి వకుళకుటి దగ్గర ఆగాయి. అక్కడ డా.మిశ్రాతో పాటు మరొక కుర్రవాడు రాజు కూచున్న బండిలో ఎక్కారు. రోజా కుందేలుపిల్లలాగా నడుచుకుంటూ

వచ్చి మా బండి ఎక్కింది. ఆమెతో పాటు మృదువైన శాండల్ పెర్ఫ్యూమ్ కూడా బండిలో ప్రవేశించింది.

బళ్ళు ఊరుదాటేటప్పటికి సూర్యాస్తమయం కావొస్తూ ఉంది. కోకిల చివరిసారి కొండలన్నిట్నీ పలకరించి వెళ్ళిపోతూ ఉంది. కోతలు కోసిన తర్వాత నుంచీ నాలుగైదు నెలలుగా బీడుపడ్డ పొలాల్లో ఎండిపోయిన దుబ్బుల మీద వానచినుకులు మెరుస్తున్నాయి. వాటిమధ్య గోరువంకలు పురుగుల్ని వెతుక్కుంటున్నాయి. అక్కడక్కడా ఇంకా మేత నుంచి వెనక్కి మళ్ళని ఆవులూ, గేదెలూ కనిపిస్తున్నాయి. అవి నడుస్తున్నప్పుడు చెదిరి పైకి లేచే పురుగుల కోసం కొంగలు వాటి పక్కనే పొంచి పొంచి కదుల్తున్నాయి. మేత ముగించి ఏ పొలాల్లోంచి పశువులు ఇంటిదారిపట్టాయో అక్కడనుంచి కొంగలు గుంపులు గుంపులుగా ఆకాశంలోకి ఎగురుతున్నాయి. వేసవివానకు తడిసిన సాయంకాలపు అడవులమీంచి తేమగాలి మమ్మల్ని తాకిపోతున్నది.

బండి నడుపుతున్న ఎడ్లకి మెళ్ళో చిన్నచిన్న గంటలున్నాయి. బండినడుపుతున్న మనిషి తన చేతిలో కుచ్చుకర్రతో ఎడ్లని అదిలిస్తూ ఉన్నాడు. తారురోడ్డుమీదనే నడుస్తున్నా కూడా బళ్ళు అటూ ఇటూ ఊగుతున్న కుదుపు తెలుస్తూ ఉంది. మా బండి దాదాపు మా ముందుబండిని ఆనుకునే నడుస్తున్నది. ఆ బండిలోంచి మిశ్రా మమ్మల్ని చేయూపుతో పలకరించాడు. నేను రెండు చేతులూ జోడించి నమస్కారం పెట్టాను. ఇంతలోనే వాళ్ళంతా ఏదో మాటల్లో పడిపోయారు. సుధీర్ అన్నయ్య ఆయనతో యాంత్రొపాలజీ పాఠాలు చెప్పించుకోడం మొదలుపెట్టాడేమో అనుకున్నాను.

కొంతసేపటికి బళ్ళు ఊరు దాటాయి. అటూ ఇటూ అడవి. అడవిని చూసి ఎన్నేళ్ళో అయినట్టుగా ఉంది. ఆ రోజు ఫాల్గుణమాసంలో బూరుగచెట్ల దారిన నడిచిన తర్వాత మళ్ళా ఇదే అడవిగాలి పీల్చడం. ఎక్కడ చూసినా రేలపూలూ, అక్కడక్కడ తురాయిపూలూ, వాటిమధ్య ఎర్రటిపూలలాగా కొమ్మలన్నీ చిగిర్చిన చెట్లు కనిపిస్తున్నాయి. అవేమి చెట్లని అడిగాను బండినడిపే మనిషిని. తానిచెట్లయి ఉండొచ్చన్నాడు. అడవిలో అన్నిటికన్నా ఆఖరున చిగిర్చే వృక్షజాతులన్నీ ఆకుపచ్చని చీరకు లత్తుక అద్దుతున్నట్టు ఉన్నాయి.

నెమ్మదిగా బండి ఆ దారిలో వచ్చే మొదటిపల్లె దాటింది. ఆ పల్లెలు పగలే నిద్ర పోతున్నట్టు ఉంటాయి, ఇక సంజెవేళ చెప్పేదేముంది? ఎక్కడో లోపలకి ఉన్న ఒక ఇంట్లో అప్పుడే దీపం వెలిగించినట్టుంది. ఆ పల్లె కూడా దాటాక, కొంత బయలు ప్రదేశం ఉంది. అది కూడా దాటాక రెండుమైళ్ళ అడవిదారి ఉంటుందని గుర్తు.

ఆ బయలుప్రదేశంలో బళ్ళు అడుగుపెట్టేటప్పటికి ఎక్కణ్ణుంచో ఎవరో గాయిక ఆలాపన మొదలుపెట్టినట్టుగా దూరంగా ఆకాశం మీంచి తెలిపసుపు కాంతి కనిపించింది. ఆ కాంతి వెనకనే చంద్రుడు సముద్రంలోంచి పైకి వస్తున్న పువ్వులాగా కనబడ్డాడు. మా దేహాలకు ఎప్పుడూ తెలిసిఉండని మనోహరమైన తెమ్మెర ఒకటి తూర్పునుంచి పడమటి వేపుకు వీచింది.

నేను ఆ చంద్రుణ్ణే కన్నార్పకుండా చూస్తూ ఉండిపోయాను. సరసులోకి హంస ప్రవేశించినట్టు చంద్రుడు ఆకాశంలో అడుగుపెట్టాడని కవులు రాసారు. యుగాలుగా చంద్రోదయాన్ని వర్ణించడానికి మరో ఉపమానం అంతకుమించింది దొరక్క అదే పోలిక ఒక కవిసమయంగా మారిపోయింది. కాని ఆ ప్రదోషవేళ చంద్రుడు ఒక పక్షిలాగా అడవిలో అడుగుపెట్టాడని చెప్తే అది సరైన వర్ణన కాదు. ఎందుకంటే పక్షిరెక్కలు ఎంతో కొంత సవ్వడి చెయ్యకుండా ఉండవు. గంధంసానమీద గంధం సానతియ్యడానికి పెట్టిన గంధపుచెక్కలాగా ఉన్నాడని అన్నా అది కూడా సరికాదు, ఎందుకంటే, ఇప్పుడో, మరు నిమిషమో ఆ చెక్క ఆ సానమీద రాపాడిన చప్పుడు మనకు వినిపించకమానదు. బహుశా మనసులో ప్రశాంతి ఉదయించినప్పుడు మాత్రమే అంత వెలుగు అంత నిశ్శబ్దంగా అనుభవానికి వస్తుందనుకుంటాను.

అంతవరకూ మేము చూస్తూ వచ్చిన అడవి వేరు, చంద్రోదయవేళ అడవి వేరు. అంతకుముందు నేను అడవిని ఎన్నో వేళల్లో, ఎన్నో ఋతువుల్లో, ఋతుసంధ్యల్లో చూసాను గాని, చంద్రోదయవేళ చూడలేదు. ఒక మహాసముద్ర కెరటం నీ మీద పడిపోకుండా ఆకాశమంతా పరుచుకుంటే ఎలా ఉంటుంది, అలా ఉంది. అప్పటిదాకా చెట్లు విడివిడిగా ఉన్నాయి, వెన్నెల పడటం మొదలవగానే అవి ఒకదానికొకటి మరింత చేరువగా జరిగాయి. కొమ్మలకీ, తీగలకీ కొత్త బాహువులు పుట్టుకొచ్చినట్టుగా ఉంది. హేమంతకాలంలో వణికించే చలిలో ఇంట్లో పిల్లలం ఒకరికొకరం దగ్గరగా, మరింత దగ్గరగా జరిగినట్టుగా, చెట్లూ, చేమలూ, బండలూ కూడా ఆ వెన్నెల్లో మరింత దగ్గరగా హత్తుకోడం కనిపిస్తోంది.

పదినిమిషాల ముందు, చంద్రుడు ఇంకా కనబడక ముందు, రోజాని ఏదేనా పాట పాడమందామా అని అడగాలనుకున్నాను. కాని వెన్నెల వాన మొదలయ్యాక, పాటలే కాదు, ఎవరూ మాట్లాడకుండా ఉంటే కూడా బాగుణ్ణనుకున్నాను. ఆ తర్వాత మా ప్రయాణం మరొక గంటా రెండుగంటల పాటు సాగి ఉంటుంది. అంతసేపూ నేను ఆ బండిలో లేను, చంద్రుడితోపాటే నెమ్మదిగా ఆకాశయానం చేస్తూ ఉన్నాను.

మేము సినిమాహాలుకు చేరుకునేసరికి మొదటి ఆట ఇంకా నడుస్తూ ఉంది. కథ చివరిలోకి వచ్చిన క్లైమాక్సు చప్పుళ్ళు వినిపిస్తూ ఉన్నాయి. రెండో ఆటకోసం ఎదురుచూస్తున్న వాళ్ళతోనూ, మొదటి ఆటకు వచ్చిన రెండెడ్ల బళ్ళతోనూ ఆ గ్రౌండు నిండిపోయి ఉంది. ఎడ్లకి కాడి వదులు చేసారు. అవి నేలమీద వాలి తమ ముందు వేసిన ఎండుచొప్పమధ్య తిన్నది నెమరేసుకుంటూ ఉన్నాయి. నల్లగా మాసిపోయిన ఆ సినిమాహాలు రేకుల కప్పుకి వెన్నెల వెల్లవేస్తూ ఉంది.

అందరం బళ్ళు దిగాం. రాజు మమ్మల్ని ఒక పాక హొటలు దగ్గర కూచోబెట్టాడు. ఆ హొటల్లో ఇడ్లీలు వేడి వేడిగా వాయి మీద వాయి దింపుతున్నారు. రాజు మా అందరికీ ఇడ్లీలు ఆర్డరు చేసాడు. అడ్డాకుల ప్లేట్లలో ఆవిరికక్కుతున్న పల్చని ఇడ్లీలు, వాటితో పాటు కారప్పొడి, చట్నీ. అవి నోట్లో వేసుకోగానే వెన్నలాగా కరిగిపోయాయి. ఇడ్లీలు తినగానే టీ. పిల్లలిద్దరికీ, రోజాకి పాలు. మరో అయిదునిమిషాల్లో సినిమా పూర్తవుతుందన్నాడు రాజు. డా.మిశ్రా సినిమా కోసం రాలేదనీ, నలుగురు మనుషుల్నీ చూడొచ్చనే అక్కడికి వచ్చి ఉంటాడనీ నేననుకున్నది నిజమే అయింది. ఆయన రాజు జబ్బ పట్టుకుని అక్కడ నిలబడి ఉన్న గిరిజనులవైపు వడివడిగా అడుగులు వేసాడు.

అప్పుడు చూసాను, ఆ సినిమా హాలు ఎదురుగా ఉన్న పోస్టరుమీద సినిమా పేరు. అప్పటిదాకా ఏ సినిమా కి వెళ్తున్నామని అడగాలని కూడా తోచలేదు నాకు.

రెండవ ఆట పూర్తయ్యేటప్పటికి అర్ధరాత్రి దాటింది. 'మళ్ళా టీ తాగుతావా?' అనడిగాడు రాజు.

'ఏమి చెప్తున్నాడు మిశ్రా మీకు?' అనడిగాను సుధీర్ అన్నయ్యని. ఆయన చెప్పే పాఠాలేవో మిస్సయ్యానేమో అని ఒకపక్క పీకుతూనే ఉంది.

'ఏం పాఠాలు? ఆయన చిన్నప్పటి సంగతులు చెప్తున్నాడు. ఒరిస్సా పల్లెటూళ్ళూ, ఇదిగో ఇలాంటి టూరింగుటాకీసులకి సినిమాకి పోవడం, ఇలాంటిసంగతులే చెప్తూ ఉన్నాడు. ఎక్కువ మనవాడే ఏవో ఒకటి చెప్తూ ఉన్నాడు. ఈ సినిమా హాలు డెబ్భయి మూడులో కట్టారుట. అప్పణ్ణుంచే కొండరెడ్ల పల్లెల్లో పాటలు వినబడటం మానేసాయని చెప్పాడు' అన్నాడు.

'అప్పణ్ణుంచే కొండరెడ్ల దేవతలు కనిపించడం మానేసి ఉంటారని కూడా మిశ్రా చెప్పి ఉండాలే?' అన్నాను.

'ఎగ్జాక్ట్లీ. అలాంటి మాటలే ఏవో చెప్పాడు. ఎలా ఊహించేవు?' అనడిగాడు అన్నయ్య.

నేను చిరునవ్వాను.

మళ్ళా బళ్ళు బయల్దేరాయి. తిరుగు ప్రయాణం మూడు గంటలేనా పట్టి ఉంటుంది. బళ్ళు ఊరు దాటగానే మా బండిలో రోజా, పిల్లలూ నిద్రలోకి జారుకున్నారు. మా ముందుబండిలో కూడా రాజూ, అన్నయ్యా, తక్కిన కుర్రాళ్ళిద్దరూ కూడా నిద్ర ఆపుకోలేక పోయినట్టే కనిపిస్తూ ఉంది. మిశ్రా మాత్రం బండివెనకవేపు కూచుని కాళ్ళు కిందకి వేలాడేసుకుని ప్రయాణం సాగినంతసేపూ మేలుకునే ఉన్నాడు. అరగంట గడిచేక బహుశా నేను కూడా నిద్రపోతున్నానని అనుకున్నాక సిగరెట్ వెలిగించాడు. ఆ ప్రయాణం పొడుగునా ఆయన స్మోక్ చేస్తోనే ఉన్నాడు.

కొంతసేపటికి నేను కూడా బాసింపట్టు వేసుకుని బండికి ఒక వైపు వీపు ఆనించుకుని కూచున్నాను. రోజా నాకు ఎదురుగా కూచుంది. పిల్లలిద్దరూ చెరొకరి వొళ్ళోనూ తలపెట్టుకుని నిద్రలోకి జారుకున్నారు. రోజా దారిపొడుగునా కునికిపాట్లు పడుతూనే ఉంది.

మేము వెళ్ళేటప్పటి వెన్నెలకీ, తిరిగి వచ్చేటప్పటి వెన్నెలకీ మధ్య చాలా తేడా ఉంది. వెళ్ళేటప్పుడు వెన్నెల ఒక వస్త్రం నేస్తున్నట్టుగా ఉంది. వచ్చేటప్పుడు తాను అంతదాకా నేసిన వస్త్రాన్ని మామీద నిండుగా కప్పినట్టుగా ఉంది. చంద్రుడు ఉదయిస్తున్నప్పుడు ప్రతి కొమ్మలోనూ, ప్రతి ఆకులోనూ ఏదో సున్నితమైన స్పందన కనిపిస్తూ ఉండింది. గాలికి సరసు మీద చిన్న చిన్న అలలు కదలాడినట్టు అడవిమీద వెన్నెల పడటం మొదలు కాగానే తరంగాలు, తరంగాలుగా ఏదో పులకింత మొత్తం ప్రకృతిని ముంచెత్తడం గమనించాను. కాని వచ్చేటప్పుడు అంతా నిస్తరంగ సముద్రంలాగా ఉంది. వెన్నెలంతా మేసి అడవి నిదరోతున్నట్టుగా ఉంది. బండినడిపే మనిషి కూడా నిద్రలోకి జారుకున్నాడు. ఎడ్లు ఎన్నో ఏళ్ళుగా ఆ దారిన నడవడం అలవాటయినట్టే నడుచుకుంటూ పోతున్నాయి. ఒకప్పుడు ఇంట్లోకి వినిపించిన ఆ గంటల చప్పుడు ఇప్పుడు నా పాదాలకు చుట్టిన మువ్వలచప్పుడులాగా వినిపిస్తూ ఉంది. ఆ చప్పుడు ఆ వెన్నెల చిక్కదనాన్ని మరింత గడ్డ కట్టిస్తూ ఉంది.

మొదటిగంట ప్రయాణం నడిచేటప్పటికి ఆకాశంలో పాలపుంత అడవిమీదకు ఒరిగిపోయిందా అనిపించింది. అడవికీ, అడవికీ మధ్య ఖాళీగా ఉన్న ప్రదేశాలు వచ్చినప్పుడల్లా, కొండలు దూరంగా జరుగుతున్నాయి. ఆ కొండల్ని ఏదో ప్రాచీన నిశ్శబ్దం,

ప్రీ కేంబ్రియన్ యుగాలనాటి నిశ్శబ్దం, భూమి నుంచి చంద్రుడు విడిబడ్డ సంరంభం సద్దుమణిగినప్పటి నిశ్శబ్దం ఆవరించింది. మరికొంతసేపటికి ఆకాశం ఈమూలనుంచి ఆ మూలకి ఎవరో పాలకావడి మోసుకుపోతున్నట్టుగానూ, ఆ కావడి నడిచిన దారి పొడుగునా పాలపుంతకి చిల్లుపడి కారిపోతున్నట్టుగానూ ఉంది.

నేనున్నచోట నుంచే 'డియర్ డాక్టర్ మిశ్రా, గిరిజనదేవతలూ, వనదేవతలూ ఎక్కడికీ పోలేదు. చూడండి, ప్రాచీన దేవతాసమూహం ఒకటి ఈ రాత్రంతా ఊరేగింపుగా ఈ అడవిదారుల్లో నడుస్తూనే ఉన్నారు' అని గట్టిగా అరిచి చెప్పాలనిపించింది. ఏమో! ఎవరికి తెలుసు? డా.మిశ్రా కూడా సిగరెట్టు మీద సిగరెట్టు కాలుస్తూ వాళ్ళతోటే సంభాషిస్తో ఉన్నాడేమో!

రెండు గంటల ప్రయాణమయ్యేటప్పటికి బళ్ళు టేకు ప్లాంటేషను దారిలో అడుగు పెట్టాయి. ఆ చెట్లమధ్య, చెట్టుకి చెట్టుకి మధ్య సందుల్లో వెన్నెల నిట్టనిలువుగా పడుతోంది. దాన్ని చూస్తుంటే ఆ టేకు ప్లాంటేషను మధ్యలో ఆ రాత్రికి రాత్రే ఒక వెన్నెలతోట వికసించినట్టుగా ఉంది. ఆ దారిలో ఒక్క చెట్టుగానీ, ఒక లతగానీ లేకుండా వట్టి కొండలు మాత్రమే ఉండి ఉంటే ఆ వెన్నెల ఎలా ఉండేదో చెప్పలేను. ఒకవేళ ఆ సమయంలో నేనొక సముద్రం మీద ప్రయాణిస్తో ఉండి ఉంటే, ఆ వెన్నెల ఎలా కనిపించి ఉండేదో కూడా ఊహించలేను. కాని ఆ అడవి, మధ్యమధ్యలో ఆరుబయలు, దారిపక్కన చెట్లు, నిద్రపోతున్న ఊళ్ళు, ఇళ్ళల్లో సగం కొడిగట్టిన దీపాలు, ఊళ్ళు దాటేక ప్లాంటేషన్లు, ఆ తోటలమధ్య ఖాళీలు, అల్లిబిల్లిగా అల్లుకున్న జీడిమామిడితోటల్లో మిగలముగ్గి, కుప్పగా రాశిపోసిన జీడిమామిడి పండ్లమీంచి వీచే గాలి– నాకు ఆ ప్రయాణమంతా, అడవిదారుల్లో ఒక నదిమీద చిన్న తెప్పవేసుకుని ప్రయాణిస్తో ఉన్నట్టుంది.

ఆ తర్వాతి జీవితంలో ఎన్నో ప్రదేశాలు చూసాను, ఎన్నో ప్రయాణాలు చేసాను, సరస్తీరాల్లో, సముద్రతీరాల్లో, చివరికి హిమాలయాల్లో కూడా సంచరించాను. కాని, ఆ వైశాఖపూర్ణిమ రాత్రి ఆ రెండెడ్లబండిమీద చేసిన ఆ ఎనిమిది కిలోమీటర్ల ప్రయాణం లాంటిది నేను మరొకటి చేసి ఉండలేదు. అన్నాళ్ళు ఆ అడవిలో తిరిగినందుకు, పేరుపేరునా ప్రతి చెట్టునీ పలకరించినందుకు, ఒక గిరివన ప్రేమికుడికీ, మరొక గిరిజన ప్రేమికుడికీ సాయపడ్డందుకు, బహుశా కొండదేవతలూ, వనదేవతలూ తమలో తాము మాట్లాడుకుని మరీ నాకా ప్రయాణాన్ని ప్రసాదించారనిపించింది.

❋

23

ఆ మర్నాడు పొద్దెక్కేదాకా మేమెవ్వరం నిద్రలేవలేదు. లేచాక కూడా చాలాసేపటిదాకా ఈ లోకంలోకి రాలేకపోయాను. ఆ సాయంకాలం ఎప్పట్లాగా నడిచే మా గోష్ఠి నడవలేదు. రాజు రాలేదు. బహుశా అతను కూడా మాకులానే నిద్రమత్తులో మునిగితేలుతుంటాడని అనుకున్నాను.

ఆ మర్నాడు పొద్దున్న పదింటికి మిశ్రా మా ఇంటికి వచ్చేసాడు. అప్పటికి నేను సర్వే డాటా టాబులేటు చేసుకుంటూ ఉన్నాను. మిశ్రాని లోపలకి రమ్మని కుర్చీ వేసాను. బ్రేక్ ఫాస్టు అయ్యిందా అని అడిగాను.

మిశ్రా 'ఒక మాట చెప్పి వెళ్దామని వచ్చాను. మన హౌస్ హోల్డ్ సర్వే, హాబిటేషన్ సర్వే రెండూ పూర్తయిపోయాయి కాబట్టి, ఇవాళ వెళ్ళిపోదామనుకున్నాను. కానీ మళ్ళా అనిపించింది, నువ్వు నేను రాకముందు నాకోసం రెండు వారాలు ఇక్కడ వెయిట్ చేసావు. ఇప్పుడు మళ్ళా సేన్‌గుప్త కోసం వెయిట్ చేస్తూ గడపాలి. నిన్నొక్కర్తినీ వదిలిపెట్టి వెళ్ళిపోడం కరెక్ట్ కాదనిపించింది. అదీకాక–' అని ఆగి

'నిన్ననేం జరిగిందో తెలుసా?' అనడిగాడు.

ఏమి జరిగింది సార్? అన్నట్టుగా కుతూహలంగా చూసాను.

'నిన్న రాత్రి ఈ ఊళ్ళో ఒక ప్రెగ్నంట్ లేడీకి కానుపు కష్టమయింది. హౌస్ హోల్డ్ సర్వేలో వాళ్ళకి రాజు బాగా పరిచయమయ్యాడు. ఆ రాత్రి వాళ్ళు రాజు ఇంటికి పరుగెత్తారట. రాజు ఆ రాత్రికి రాత్రి మీ ఊళ్ళో ఎవరిదో లూనా తీసుకుని ముందు మిడ్

వైఫ్‌ని పట్టుకొచ్చాట్ట. ఆ తర్వాత దగ్గరలో ఎవరూ గవర్న్‌మెంట్ డాక్టర్ లేకపోడంతో తనకి తెలిసిన ఆర్‌ఎంపిని ఎవరినో పట్టుకొచ్చాట్ట. ఆ ప్రసవం సేఫ్ డెలివరీ అయ్యేటప్పటికి తెల్లవారింది. నేను మార్నింగ్‌వాక్‌కి వెళ్తూ ఉంటే దారిలో కనబడ్డాడు. ఏమిటని అడిగితే ఈ సంగతంతా చెప్పాడు' అని అన్నాడు.

మొన్న రాత్రి ఆ వెన్నెల దారిన ప్రయాణం ఏర్పాటు చేసినందుకే రాజుకి ఎలా కృతజ్ఞతలు చెప్పడమా అని ఆలోచిస్తూ ఉన్నాను. ఈ సంఘటనతో అతనిపట్ల నా గౌరవం రెట్టింపు అయింది.

'చాలా చాలా మంచి పిల్లవాడు సార్' అన్నాను డా. మిశ్రాతో.

'యా. యాన్ ఎక్స్‌ట్రార్డినరీ యంగ్ మాన్' అని తలూపాడు మిశ్రా.

'అటువంటి యంగ్ మాన్‌తో ప్రేమలో పడకుండా ఉండటం అసాధ్యం అన్నారు సార్ ప్రొఫెసర్ సేన్‌గుప్త' అని అన్నాను మిశ్రాతో.

'యా, యా, ట్రూ' అని తలూపి–

'కాబట్టి నాకేమనిపించిందంటే, అన్నిటికన్నా ముందు ఈ ఊళ్ళో ఒక మెడికల్ కాంప్ కండక్ట్ చెయ్యవలసిన అవసరం ఉంది. ఇటువంటి కేసులు ఇంకా ఎన్నున్నాయో మనకి తెలీదు. ఇవి కాక క్రానిక్ ఎయిల్‌మెంట్స్ కూడా ఉండి ఉండొచ్చు. అందుకని, ప్రొఫెసర్ సేన్‌గుప్తా వచ్చేలోపు మనం ఒక మెడికల్ కాంప్ ఆర్గనైజ్ చేద్దాం. ఆ మాట చెప్దామనే వచ్చాను' అని అన్నాడు.

అప్పటికే మా పక్కకు వచ్చి నిలబడ్డ సుధీర్ అన్నయ్య ఆ చివరి మాటలు విని 'గ్రేట్ ఐడియా. ఐ విల్ ఆల్సో జాయిన్' అన్నాడు.

మిశ్రా అతణ్ణి చూసి పలకరింపుగా చిరునవ్వాడు. ఈలోపు సూర్యనారాయణగారు కూడా అక్కడకొచ్చి మిశ్రాని పలకరించారు. మిశ్రా ఆయన్ని చూడగానే లేచి నిల్చొని నమస్కారం చేసాడు.

'డా. మిశ్రా ఈ ఊళ్ళో ఒక మెడికల్ కాంప్ నిర్వహిస్తే బాగుంటుంది అంటున్నారు' అన్నాడు సుధీర్ ఆయనతో.

అప్పటిదాకా ఆ ఊళ్ళో మెడికల్ కాంప్ లాంటిది ఎవరూ ఆర్గనైజ్ చేయలేదని ఆ మాష్టారు అన్నారు. తనకి తెలిసి ప్రసూతిమరణాలు ఆ గ్రామాల్లో సాధారణం అని కూడా

అన్నారు. ఆ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు తెరిచి ఉన్నప్పటికీ, ఐసిడిఎస్ పథకం అమల్లో ఉన్నప్పటికీ, వాటి ఉనికి ఇప్పుడు నలుగురికీ తెలిసినంతగా అప్పటికింకా తెలియని రోజులు. ప్రసవాలు ఇళ్ళల్లోనే జరిగేవి. గిరిజనమహిళల్లోనే సాంప్రదాయికమైన మంత్రసానులు ఉండేవారు. ఒక హెల్త్ విజిటరు గ్రామాలకు వచ్చి గర్భిణీ స్త్రీలను పరామర్శ చేసి వైద్య, ఆరోగ్య సలహాలు ఇస్తూండేదిగాని, ఆ సేవలు ఇప్పుడున్నంత ఇంటెన్సివ్‌గా ఉండేవి కావు. మెడికలు ఆఫీసరు గ్రామాలకి వెళ్ళి వైద్యం గురించీ, ఆరోగ్యం గురించీ ప్రజల్ని ఎడ్యుకేటు చెయ్యాలని ఉండేదిగాని, ఆ కార్యక్రమాలు జరిగినట్టుగా అక్కడ ఎవరికీ తెలీదు. అటువంటి పరిస్థితుల్లో ఊళ్ళోనే ఒక మెడికలు కాంపు నడపాలన్న ఆలోచనకి ఊరంతా స్పందించింది.

ఇన్నేళ్ళు గడిచాక, ఒక గ్రామంలో ఒక రోజు వైద్యశిబిరం నడపడం చాలా చిన్న పని అనీ, అదేమీ నలుగురికీ చాటిచెప్పుకోవలసినంత ఘనకార్యం కాదనీ నాకే అనిపిస్తూ ఉంది. కానీ, ఆ రోజు ఆ గ్రామంలో ఉన్న పరిస్థితుల్లోంచి చూసినప్పుడు అది ఇప్పటికీ నాకు ఎంతో ఆశ్చర్యకరమైందిగానూ, ఆరాధించదగ్గ పని గానూ తోస్తున్నది. అదీకాక, అసలు ఆ ఆలోచన ఎలా వచ్చింది? ఎవరికి వచ్చింది? నీ గ్రామంలో ఏదో స్టడీ కోసం వచ్చి ఉన్న ఒక వ్యక్తికి. అతను నీ గ్రామస్థుడు కాడు, నీ రాష్ట్రం వాడు కాడు, ప్రభుత్వ ఉద్యోగి కాడు, కాని ఒకామెకి ప్రసవం కష్టమయిందని వినగానే స్పందించి ఏదో ఒకటి చెయ్యాలని అనుకుని, అది చేసేదాకా మామూలుగా ఉండలేకపోయినవాడు.

బహుశా ఇన్నేళ్ళ తరువాత వెనక్కి తిరిగి చూసుకుంటే, ఈ రోజు అటువంటి శిబిరాలు నిర్వహించడం ఏమంత కష్టం కాకపోవచ్చుగానీ, అలా తపించే మనుషులు కనబడటమే దాదాపు అసాధ్యం అనిపిస్తూ ఉంది. బహుశా అందుకనే రాజు డా.మిశ్రా ని మాటిమాటికీ 'ప్రాక్టికల్' అని అంటూంటాడని అనుకున్నాను. కాని ఇప్పటి 'ప్రాక్టికల్' మనుషులెవరికీ అటువంటి ఊహలు రావు. కొన్నేళ్ళ కిందట నా మిత్రురాలు ఒకామె ప్రభుత్వంలో ఉన్నతాధికారి, ఒక ఆదివారం మేము కలుసుకున్నప్పుడు, ఆ ముందు రోజు తానొక సెమినార్‌కి వెళ్లానని చెప్తూ ఒక విషయం చెప్పింది. ఆ మీటింగులో, డిఎఫ్ఐడికి చెందిన కన్సల్టెంటు ఒకరు ప్రస్తుతం ఉన్న పిహెచ్‌సిల్ని రేషనలైజు చేసి తాలూకా కేంద్రాల్లో మల్టీ స్పెషాలిటీ హాస్పటళ్ళు పెట్టాలని పెద్ద ప్రెజెంటేషను ఇచ్చాడట. ఈమె ఆ ప్రతిపాదనని అంగీకరించలేక, లంచి విరామంలో అతణ్ణి కలిసి ఆ మాటే చెప్పిందట. 'పిహెచ్‌సిలు కేవలం వైద్యకేంద్రాలు కావు, అవి ఆరోగ్యవిద్యాకేంద్రాలు కూడా. ప్రజల్లో ఆరోగ్యచైతన్యం కలిగించడం వాటి బాధ్యత. వాటిని ఎత్తేసి పాలీక్లినిక్‌లు పెట్టడం

ఎంతవరకూ సమంజసం?' అని అడిగిందట. అప్పుడు ఆ కన్సల్టెంటు 'మేడం, ఇప్పుడు నలుగురు ప్రైవేట్ డాక్టర్లు కలిసి కార్పొరేట్ హాస్పటళ్ళుగా మారుతున్న కాలంలో ప్రభుత్వం కూడా ప్రాక్టికల్‌గా ఆలోచించాలి కదా' అని అన్నాడట.

డా.మిశ్రాకి ఒక ఆలోచన రావడమే తడవు దాన్నెట్లా అమలు చేస్తాడో బడి బిల్డింగు విషయంలో నేనే కాదు, ఊరంతా చూసింది. ఇప్పుడు కూడా అంతే శరవేగంగా పనులు చేసుకుంటోపోయేడు. ఆ వచ్చే ఆదివారం మెడికలు కేంపు పెట్టాలని పంచాయతీతో తీర్మానం చేయించాడు. ఆ రోజు పక్క గ్రామంలో సంత కాబట్టి, సంతకి వచ్చినవాళ్ళు కూడా ఈ సేవల్ని వినియోగించుకోగలుతారని ఒక ఆలోచన.

రామకోవెల్లోనే కేంపు. అంతకు ముందు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల డ్రైవ్ జరిగే రోజుల్లో విలేజి చావిడిలో చేసేవారట. కాని ఆ బిల్డింగు కూలిపోడానికి సిద్ధంగా ఉందనీ, రామకోవెల ఊరి మధ్య ఉండటమే కాకుండా, రామనవమికోసం కొత్తగా రంగులు వేసి, లైట్లూ, ఫాన్లూ కూడా బిగించారు కాబట్టి ఇక్కడ నడపడమే అనువుగా ఉంటుందని మిశ్రా వాదించాడు. అదీకాక రామకోవెల పక్కనే కొత్తగా వేసిన బోరువెల్లు కూడా ఉంది.

ఈలోపు ఆయన బ్లాకు ఆఫీసులోనూ, ఐటిడీఏలోనూ మాట్లాడి వాళ్ళని భాగస్వాముల్ని చేసాడు. ఒకరోజు కాకినాడ వెళ్ళి జిల్లా కలెక్టర్ని కలిసి ఆ శిబిరం ప్రారంభించడానికి రమ్మని పిలిచాడు. ఆ రోజు జీపు మీద తనతోపాటు గ్రామసర్పంచిని కూడా తీసుకువెళ్ళాడు. వాళ్లతో పాటు రాజుని కూడా. ఒక గిరిజన గ్రామసర్పంచి వచ్చి అడిగితే కలెక్టరు కాదనలేడని మిశ్రా ఊహ.

ఆ కేంపుకి మూడు రోజుల ముందునుంచీ నేనూ, రాజూ, రోజా, సుధీర్, అంతకు ముందు బడికి పాక వెయ్యడంలో చేతులు కలిపిన యువకులూ– అందరం ఇంటింటికీ వెళ్ళి కేంపు గురించి చెప్పాం. కుటుంబంలో ప్రతి ఒక్కరూ తప్పని సరిగా వచ్చి వైద్య, ఆరోగ్యపరీక్షలు చేయించుకోవాలని చెప్పాం.

ఆ రోజు ఆ శిబిరాన్ని జిల్లా కలెక్టరు తరఫున జిల్లా వైద్య ఆరోగ్య అధికారి వచ్చి ప్రారంభించాడు. తన సర్వీసులో ఒక గిరిజన ప్రాంతాన్ని విజిటు చెయ్యడం అదే మొదటిసారి అని మీటింగులోనే చెప్పాడు. ఆయనతో పాటు జిల్లా మలేరియా అధికారి, ఇంకా వైద్యారోగ్య శాఖకి చెందిన ఫీల్డుసిబ్బంది కూడా వచ్చారు. జిల్లావైద్యాధికారి కాకినాడలో ఒకటి రెండు స్వచ్ఛందసంస్థలకి కూడా చెప్పినట్టున్నాడు. వారు కూడా వాలంటీర్లతో హాజరయ్యారు.

ఆ రోజు నాలుగైదు కౌంటర్లు తెరిచారు. స్త్రీలకీ, పురుషులకీ, వృద్ధులకీ, చిన్నపిల్లలకీ నాలుగు కౌంటర్లతో పాటు, గర్భిణీ స్త్రీలకీ, బాలెంతలకీ మరో కౌంటరు. వచ్చినవాళ్ళందరికీ ముందు విధిగా బరువు, ఎత్తు కొలతలు నమోదు చేసారు. గర్భిణీ స్త్రీలకోసం ప్రత్యేకంగా ఒక గైనకాలజిస్టు వచ్చింది. టిబి కేసుల్ని కూడా అక్కడికక్కడే పరీక్షించడానికి ఒక మొబైల్ ఎక్స్‌రే ప్లాంటు కూడా తీసుకువచ్చారు.

ఆ మెడికలు అండ్ హెల్తు బృందం, ఎన్‌జిఓ ప్రతినిధులు, ఇతర సిబ్బంది కలిసి మొత్తం ముప్ఫై మందిదాకా ఉన్నారు. వారందరికీ వకుళకుటిలో లంచి ఏర్పాటు చేసారు. ఆ ఖర్చంతా డా.మిశ్రా తనే పెట్టుకున్నాడు. కేంపుకి బయట ఊళ్ళనుంచి వచ్చిన గిరిజనులకి భోజనం ఊళ్ళో వాళ్లని ఏర్పాటు చెయ్యమని అడిగాడు. 'ఇది కూడా రామనవమి సంతర్పణ లాంటిదే అనుకోండి' అని చెప్పాడు.

కేంపు మొదలుపెట్టేముందు సభలాంటిది ఏమీ నిర్వహించలేదు. డిఎంఅండ్‌హెచ్‌ఓ రాగానే ఆయన్ని ఒక గిరిజనబాలిక స్వాగతించింది. ఆయన ఆ బాలికని 'హెడ్ టు టో' రొటీన్ చెక్ అప్ చేసి, ఆమె లంగ్సుని స్టెత్‌తో పరీక్షించాడు. వెంటనే కేంపు మొదలయిందని డిక్లేరు చేసాడు.

ఆ రోజంతా తాము పరిశీలించిన వాళ్ళల్లో దీర్ఘవ్యాధుల్తో బాధపడుతున్నవాళ్ళనీ, మరింత వైద్య సహాయం అవసరమైనవాళ్ళనీ, రిఫరల్ సర్వీసులు అవసరమైనవాళ్ళనీ ఆ బృందం గుర్తించింది. వాళ్ళ పేర్లు ఆ సాయంకాలం అందరికీ చదివి వినిపించారు. ఆ పేర్లు నేనూ, సుధీర్ అన్నయ్యా రెండు జాబితాలు రాసాం. ఒక జాబితా గ్రామ సర్పంచికి ఇచ్చాం. మరొక జాబితా డా.మిశ్రా తీసుకున్నాడు. సాయంకాలం అయిదింటికి, కాంపు ముగించే ముందు ఆ బృందానికి ఊళ్ళో వాళ్ళతో ధన్యవాదాలు చెప్పించాడు.

తమకి ఆ ఊరు రావడం, ఆ కేంపు నడపడం ఒక లెర్నింగు ఎక్స్ పీరియెన్సు అనీ, దీన్ని మళ్లా వదిలిపెట్టకుండా ఫాలో అప్ చేస్తామనీ, మరికొన్ని గ్రామాల్లో కూడా ఇలాంటి శిబిరాలు నడుపుతామనీ డిఎంఅండ్‌హెచ్‌వో డా.మిశ్రాకి చెప్పాడు. ఆయన వెళ్ళే ముందు మా అందరికీ కూడా పేరుపేరునా ధన్యవాదాలు చెప్పాడు. జీపు ఎక్కేదాకా కూడా ఆయన మిశ్రా చేయి వదల్లేదు.

ఆ రాత్రి మళ్లా మా ఇంటి అరుగుమీద అంతా ఆ కేంపు విశేషాలన్నీ ఏ ఒక్క సంగతీ వదిలిపెట్టకుండా మళ్లా తలుచుకున్నాం. నేను ఆ ఊళ్ళో అడుగుపెట్టిన తరువాత ఎన్నో సామూహికకార్యక్రమాలు చూసానుగాని, ఆ వైద్యశిబిరం నాకు ఎంతో సంతృప్తి

నిచ్చింది. పదిమందికి అన్నసంతర్పణ చెయ్యడంలో కూడా తృప్తి ఉంటుంది. కాని ఒక మెడికల్ కేంపు అంతకన్నా ఎక్కువ తృప్తినిచ్చింది. ఎందుకని? ఆ ప్రశ్నే అడిగాను, ఆ సాయంకాలం అందరినీ.

ప్రతి ఒక్కరూ ఎవరికి తోచిన సమాధానం వాళ్ళు చెప్పారుగాని, డా.మిశ్రా నేను జీవితాంతం గుర్తుపెట్టుకోగల జవాబు చెప్పాడు. ఆయన అన్నాడు కదా:

'విమలా! అన్నదానంలో సేవ ఉంది, త్యాగం ఉంది, దానం ఉంది, ధర్మం ఉంది. కాని ఎక్స్‌పర్టైజ్ అక్కర్లేని పని అది. మెడికల్ కాంప్ అలా కాదు. దానికి నిపుణులు కావాలి. అది కూడా జనరల్ ఎక్స్‌పర్ట్స్ కాదు, స్పెషలిస్టులు కావాలి, నిస్వార్థంగా పనిచేసే ఒక కార్యకర్తా, ఎక్స్‌పర్టూ- ఈ ఇద్దరూ కలిస్తేనే ఇటువంటి ప్రోగ్రాములు నడుస్తాయి, సక్సెస్ అవుతాయి' అని అన్నాడు.

'నిజానికి మన దేశానికీ, మన సమాజానికీ కావలసింది ఇటువంటి కలయిక. ఒక్క మెడికల్ అండ్ హెల్త్‌లో మాత్రమే కాదు. అగ్రికల్చర్‌లో కావాలి, హార్టికల్చర్‌లో కావాలి, లైవ్ స్టాక్ డెవలప్ మెంట్‌లో కావాలి. అంతెందుకు? చివరికి ఒక స్కూలు నడపడంలో కూడా కావాలి. స్కూలు సంగతే తీసుకో. అక్కడ టీచర్ ఎక్స్‌పర్ట్. తల్లిదండ్రులు కార్యకర్తలు కావాలి. ఆ గ్రామంలో చదువుకున్న యువత కార్యకర్తలు కావాలి. గాంధీగారు విలేజ్ రికన్‌స్ట్రక్షన్ గురించి మాట్లాడినప్పుడు చెప్పిందిదే' అని కూడా అన్నాడు.

మేమంతా ఆ మాటలు విని ఆలోచనలో పడ్డాం.

మళ్లా మిశ్రా చెప్పడం మొదలుపెట్టాడు.

'ఎక్స్‌పర్ట్‌తో ప్రాబ్లెం ఏమిటంటే, అతని దగ్గర ఎక్స్‌పర్టైజ్ ఉంటుందిగానీ, పబ్లిక్ పర్పజ్ ఉండకపోవచ్చు. ఒక ధ్యేయం ఉండకపోవచ్చు. ప్రజలకష్టసుఖాల్ని చూసి స్పందించే హృదయం ఉండకపోవచ్చు. అందుకే మన సమాజాల్లో ఎక్స్‌పర్ట్స్ కొన్నాళ్ళకి స్టాగ్నంట్ అయిపోయి చివరికి కౌంటర్‌ప్రొడక్టివ్‌గా తయారవుతారు. అదే కార్యకర్తని తీసుకో. అతని దగ్గర ప్రజలకి మేలు చెయ్యాలనే తపన ఉంటుంది. ఈ రోజు ఈ కేంపు ఇలా నడిచిందంటే, కేవలం ఎక్స్‌పర్ట్స్ వల్లనా? మన వలంటీర్లందరూ కూడా తలో చెయ్యి వేసినందువల్లనే కదా. నిస్వార్థ కార్యకర్త ఎప్పటికప్పుడు ఎక్స్‌పర్ట్‌ని ఎనర్జిటిక్‌గా, డైనమిక్‌గా మారుస్తాడు. అతణ్ణి అలర్ట్‌గా ఉంచుతాడు. అప్పుడు ఎక్స్‌పర్ట్ తాలూకు ఎక్స్‌పర్టైజ్ నిలవనీరుగా మారిపోకుండా ఇన్నొవేటివ్‌గా మారుతుంది' అని కూడా అన్నాడు.

ఈలోపు రాజు పెద్ద గంపలో మామిడిపండ్లు తీసుకొచ్చాడు. ఎండుగడ్డిలో మగ్గబెట్టిన ఆ మామిడిపండ్ల సువాసనకి అందరం ఒక క్షణం మూర్ఛపోయాం. అతను ఆ గంప అక్కడ పెట్టి పెరట్లోంచి ఒక బకెటులో నీళ్ళు తెచ్చి ఆ పండ్లు అందులో వేసాడు.

రెండు మూడు నిమిషాలు ఆ ప్రక్రియ అంతా చూస్తో మౌనంగా ఉన్న డా.మిశ్రా మళ్ళా చెప్పడం మొదలుపెట్టాడు.

'ఎక్స్‌పర్ట్ అంటే ప్రభుత్వ ఉద్యోగి ఒక్కడే కాదు. ఈ గ్రామంలో కూడా కొన్ని కొన్ని విషయాల్లో కొంతమంది ఎక్స్‌పర్టులు అయి ఉండవచ్చు. బయటినుంచి కూడా ఎక్స్‌పర్టులు రావచ్చు. అలాగే నిస్వార్థ కార్యకర్తలు అంటే పంచాయతీ మెంబర్లూ, సర్పంచులూ కారు. అసలు ఒక మనిషిలో వలంటీరింగ్ స్పిరిట్ ఉంటేనే అతడు ప్రజాప్రతినిధిగా ఎన్నికవుతాడు. నిజమే, కాని, చాలాసార్లు, పదవి అతనిలోని నిస్వార్థ కార్యకర్తను అదృశ్యం చేసేస్తుంది. వలంటీరింగ్ ఎప్పటికప్పుడు వికసించే ఒక స్పిరిట్. పదవుల్లో ఉన్నవాళ్ళూ, ఉద్యోగాలు చేసుకునేవాళ్ళూ నిస్వార్థ కార్యకర్తలు కావడం కష్టం. ఎవరో గాంధీ లాంటి వాళ్లు తప్ప జీవితకాలంపాటు నిస్వార్థ కార్యకర్తలుగా ఉండగలిగే వాళ్ళు కూడా అరుదు. ఒక గ్రామం మారాలంటే, ఒక ఉద్యోగి, ఒక సర్పంచ్ వల్ల మాత్రమే ఎప్పటికీ సాధ్యం కాదు. ఒక ఎక్స్‌పర్టూ, ఒక వలంటీరూ కలిస్తేనే అది సాధ్యమవుతుంది' అని అన్నాడు.

'ఇవిగో, మా తోటలో మామిడిపళ్ళు. చెరకు రసాలు. వీటిని రుచి చూస్తూ మాట్లాడుకోండి' అంటో రాజు ప్రతి ఒక్కరి చేతుల్లోనూ మామిడిపండ్లు పెట్టాడు.

'మరి తీవ్రవాదులు ఎక్స్‌పర్టులా? వాలంటీర్లా?' అనడిగాడు సుధీర్.

డా.మిశ్రా చిరునవ్వాడు.

'ఒక మనిషి అధికారంలోకి రాకముందు ఎంత త్యాగశీలత చూపించినా, ఒకసారి అధికారం అందుకున్నాక తోటి మనిషికి దూరమైపోవడం మనం చూస్తూనే ఉన్నాం, ఇంక అధికారాన్ని కోరుకునేవాడు వాడి కన్నా డిఫరెంట్‌గా ఎలా ఉంటాడు చెప్పండి?' అని అన్నాడు.

అప్పుడు తన చేతుల్లో పెట్టిన మామిడిపండుని చుట్టూ తడిమి చూసాడు. దాని పరిమళాన్ని గాఢంగా ఆఘ్రాణించాడు. మళ్లా సుధీర్‌తో చెప్పడం మొదలుపెట్టాడు.

'బ్రిటిష్‌కాలం నుంచీ మన సమాజంలో ఫ్రీడమ్ అన్నా, డెవలప్‌మెంట్ అన్నా రెండే అర్థాలు: ఒకటి పదవి, రెండోది ఉద్యోగం. మోస్ట్ ఆఫ్ అవర్ నేషనలిస్ట్ మూమెంట్

దేని గురించి? చట్టసభల్లో మరిన్ని సీట్ల గురించి, సివిల్ సర్వీసులో మరిన్ని ఉద్యోగాల గురించి. గాంధీగారు దీనికి నూట ఎనభై డిగ్రీలు వ్యతిరేక దిశలో నడిచిన వ్యక్తి. ఆయన దృష్టిలో, పదవి అంటే స్వయంపాలన. ఉద్యోగం అంటే ప్రజలతో కలిసి జీవించడం. ఈ రెండూ కలిస్తేనే స్వరాజ్యం. ఒక్క మాట చెప్తున్నాను గుర్తుపెట్టుకోండి, రాజ్యాధికారం కోసమో, లేదా మరిన్ని ఉద్యోగాలకోసమో పాకులాడేవాళ్ళు ఎప్పటికీ ప్రజలకి విముక్తి నివ్వలేరు' అని-

వెంటనే 'లెట్ మీ కరెక్ట్ మైసెల్ఫ్. అసలు ప్రజలకు ఒకళ్ళు విముక్తినివ్వడమేమిటి? వాళ్ల విమోచన మరొకళ్ళు సాధించిపెట్టడమేమిటి? అది ప్రజలు తమంత తాముగా చేసుకోగల పని. మనం చెయ్యవలసిందల్లా మనదగ్గర ఏ రంగంలో ఎక్స్పర్టయిజ్ ఉంటే దాన్ని ఆ రంగంలో ప్రజలకి ఉచితంగా ధారపొయ్యడమే' అని అన్నాడు.

'ఇంకో మాట కూడా చెప్పాలి. ప్రభుత్వాలు ఎంతకాలమైతే రిసోర్సెస్‌ని కార్పొరేట్లకీ, కాంట్రాక్టర్లకి దోచిపెడుతూ ఉంటాయో, ఎంతకాలమైతే వాటిని ప్రశ్నిస్తున్న ప్రజల్ని అణచి పెట్టడానికి సైన్యాన్నీ, పోలీసుల్ని వాడుకుంటూ ఉంటాయో అంతకాలం ఏదో ఒక రూపంలో ఎక్స్ట్రీమిస్టులూ, టెర్రరిస్టులూ పుట్టుకొస్తూనే ఉంటారు. వాళ్లు సమాజానికి అవసరం అవుతూనే ఉంటారు. నేను చెప్తున్నదల్లా గ్రామ పునర్నిర్మాణం వాళ్లకు సాధ్యం కాదని మాత్రమే' అని కూడా అన్నాడు.

అప్పుడు నాకేసి చూసాడు.

'ఇదుగో, మన దగ్గరే ఎగ్జాంపుల్స్ ఉన్నాయి. ఎక్స్పర్ట్ ఎవరంటే, మన విమల. ఆమెని చక్కగా గైడ్ చేసేవాళ్ళుండాలేగాని ఏ శాస్త్రమైనా ఇట్టే నేర్చుకోగలదు, నలుగురికీ చెప్పగలదు. ఇంక వలంటీరు అంటారా? రాజుని మించిన వలంటీరు నాకిప్పటిదాకా కనబడలేదు. మన సమాజానికి కావలసింది, ఇటువంటి ఎక్స్పర్టూ, ఇటువంటి వలంటీరూ- వీళ్ళిద్దరూ కలిసి పనిచెయ్యడం. కాదంటారా?' అనడిగాడు.

❋

24

మెడికలు కేంపు పూర్తయిన మర్నాడే సేన్‌గుప్త నుంచి టెలిగ్రాం వచ్చింది. తాను ఇంక రాబోవడంలేదనీ, మాకు కలిగించిన అసౌకర్యానికి చింతిస్తున్నాననీ. వెంటనే డా. మిశ్రా నర్సీపట్నం వెళ్ళి ట్రంకాలు చేసి ఆయనతో మాట్లాడేడు. యూనివెర్సిటీ పనుల వల్ల కొంతా, ఎండలు ముదరడంతో తనకి ఒంట్లో నలతగా ఉండటం వల్ల మరికొంతా, ఈసారికి ఫీల్డువర్కు ముగించేద్దామని ప్రొఫెసరు ఆయనతో చెప్పాడట. డా. మిశ్రా తనకి అప్పగించిన పని సంతృప్తికరంగా పూర్తిచేసానని చెప్తే, ఆ రిపోర్టులూ, సంబంధించిన కాగితాలూ తనకి పంపించమని చెప్పాడట. అక్కడ చేయవలసిన పేమెంటులన్నీ పూర్తి చేసేసి ఆ లెక్కలూ, రసీదులూ తనకు పంపించమని చెప్పాడుట. మా అందరికీ, ముఖ్యంగా జోసెఫ్ గారికి మరీ మరీ ధన్యవాదాలు చెప్పమని చెప్పాడట. ఆ సాయంకాలం డా. మిశ్రా మా ఇంటికి వచ్చి ఆ సంగతంతా చెప్పి, తాను మర్నాడే వెళ్ళిపోతానని కూడా చెప్పాడు.

ఆయన్ని ఆ మర్నాడు తమ ఇంటికి భోజనానికి రమ్మని సూర్యనారాయణగారు ఆహ్వానించేరు. ఆ చిన్న గ్రామంలో ఆయన ఉన్న రెండు నెలల్లోనూ గొప్ప కదలిక తీసుకువచ్చేరనీ, ఆయనది ఎంతో స్ఫూర్తిదాయకమైన సాంగత్యం అనీ మిశ్రాను నోరారా ప్రశంసించారు. డా. మిశ్రా ఆయనకు పాదనమస్కారం చేసాడు. మర్నాడు పొద్దున్నే బయల్దేరిపోతే విశాఖపట్టణంలో ఒకటి రెండు పనులున్నాయనీ, అవి చూసుకుని రాత్రికి భువనేశ్వర్ బయల్దేరిపోతాననీ, ఈసారికి వారి ఆతిథ్యం తీసుకోలేకపోతున్నందుకు తనని మన్నించమనీ అడిగాడు.

నేనూ, రాజూ కూడా పూర్తి చేసిన సర్వే ఫార్మాట్లు నా దగ్గరే ఉన్నాయి. అవన్నీ ఒక బాగులో పెట్టి ఆయనకిచ్చాను. సేన్‌గుప్త వెళ్ళేటప్పటికి ఇంకా నేను పూర్తి చేయలేకపోయిన

ఆల్బంలు, తర్వాత పూర్తిచేసినవి కూడా మరొక బాగులో పెట్టి ఇచ్చాను. ఎప్పట్లానే రాజు సాయంకాలం వస్తాడేమో అని డా.మిశ్రాని మరికొంత సేపు కూచోబెట్టాను. కాని రాజు రాలేదు.

డా.మిశ్రా ఆలస్యమైపోతోందని చెప్పి సెలవు తీసుకోడానికి లేచాడు. నా దగ్గరకు వచ్చి ఒక షేక్ హేండిచ్చాడు.

'యు ఆర్ ఎ బ్రైట్ స్టూడెంట్. సివిల్ సర్వీసు పరీక్షలు రాయి. బోటనీ, యాంత్రొపాలజీ ఆప్షనల్స్ తీసుకో. యాంత్రొపాలజీకి నేను గైడెన్స్ ఇస్తాను. నోట్సు పంపిస్తాను' అని అన్నాడు. 'మరి వస్తాను' అని వడివడిగా అడుగులు వేసుకుంటూ బయటికి వెళ్ళిపోయాడు. మొదటిసారి వచ్చినప్పుడు కూడా అలానే వడివడిగా అడుగులు వేసుకుంటూ మా ఇంట్లో అడుగుపెట్టాడని గుర్తొచ్చింది.

ఇంక అక్కడకి నేను వెళ్ళిన పని అయిపోయిందని అర్థమయింది. నన్ను తీసుకు వెళ్లడానికి రమ్మని ఆ మర్నాడు నాన్నకి టెలిగ్రాం ఇవ్వబోతుండగా, సూర్యనారాయణగారు వారించారు.

'అమ్మాయి, రోహిణికార్తె మొదలయ్యింది. ఎండలు భయంకరంగా ఉంటాయి. మీ నాన్నగారు ఈ ఎండనపడి నిన్నిప్పుడు అర్జంటుగా తీసుకుపోకపోతే ఏమవుతుంది? పదిరోజులాగితే చల్లబడుతుంది. అప్పుడు బయల్దేరుదువుగాని' అని అన్నారు.

'మరొక పదిరోజులా?' కాని ఆయనకి అడ్డుచెప్పలేకపోయాను. ఆ విషయమంతా వివరంగా నాన్నకి ఉత్తరం రాసి ఆ రోజే పోస్టు చేసాను.

ఆ రోజో, ఆ మర్నాడో సేన్‌గుప్త నుంచి ఒక ఉత్తరం, పెద్ద పార్సెలు వచ్చాయి. ఆ ఉత్తరం ఇంకా విప్పి చదవకుండానే నాకు చాలా బెంగగా అనిపించింది. ఆ ఉత్తరం ఆయన చేత్తో కాక హృదయంతో రాసాడు. తాము నన్ను పిలిచి, తీరా నేను వచ్చాక, ఆ గ్రామంలో నన్నొకర్తినీ వదిలిపెట్టి తాము అర్థాంతరంగా వెళ్ళిపోయినందుకు పదే పదే క్షమాపణలు చెప్పుకున్నాడు. నా ప్రెజన్సు తనకెంతో నమ్మకాన్నీ, ధైర్యాన్నీ కలిగించింది అని చెప్పాడు. రాబోయే కాలంలో తాను ఎక్కడ ప్రాజెక్టు తీసుకున్నా, నన్ను కూడా ఫీల్డువర్కుకి పిలుస్తాననీ, నేను తప్పకుండా రావాలనీ కోరాడు. ఇక ఆ ఉత్తరంతో పాటు నాకూ, మా తల్లిదండ్రులకీ నూతన వస్త్రాలు పంపిస్తున్నాననీ, వాటిని స్వీకరించాలనీ కోరాడు. ఆ ఉత్తరంతో పాటు ఆరువేలకి చెక్కు కూడా ఉంది. ఏ లెక్కన చూసినా అది చాలా పెద్ద మొత్తం. నేనక్కడున్న రోజులకి గాను నాన్న డబ్బులు ఇస్తానంటే మాస్టారు

దంపతులు మనసు కష్టపెట్టుకున్నారు. నన్ను తమ కూతురనే అనుకున్నామనీ, పేయింగ్ గెస్టు అని అనుకోలేదనీ అన్నారు. అందుకని ఆ ఫీల్డువర్కు పేరు మీద నా ఖర్చు మొత్తం రెండువేలు మించి ఉండదు. అటు సేన్‌గుప్తా ఔదార్యానికీ, ఇటు మాష్టారి దంపతుల ఆత్మీయతకీ ఎలా ప్రతిస్పందించాలో నాకు తోచలేదు.

ఆ పార్సెలు విప్పి చూసాను. అందులో ఎర్రటి బెంగాలు కాటను చీర, పట్టువస్త్రాలు ఉన్నాయి. అవి మా అమ్మానాన్నకి అని అర్థమవుతోంది. వాటితో పాటు బిష్ణుపురి సిల్కు శారీ ఉంది. గులాబిరంగు చీర, దానికి బెంగాలు పటచిత్ర మోటిఫ్స్‌తో పెద్ద బోర్డరు. ఆ చీరకి చిన్న స్లిప్పు పిన్ను చేసి ఉంది. దానిమీద, 'ఫర్ యువర్ వెడ్డింగ్. డోంట్ ఫర్ గెట్ ఇన్వైటింగ్ అజ్– బనలత' అని రాసి ఉంది. ఆ చిన్న చీటీ చూడగానే నాకు ఒక్కసారిగా కన్నీళ్ళు ఉబికి వచ్చాయి. ఆపుకోలేనంతగా బెంగ పుట్టుకొచ్చింది. ఎన్నో దృశ్యాలు, ఎన్నో పాటలు, ఎన్నో నవ్వులు, ఎన్నో నిశ్శబ్దాలు– అన్నీ గుర్తొచ్చాయి. మేమిద్దరమూ ఏ జన్మలోనో, బహుశా ఆ పద్మానది ఒడ్డున రెల్లు పొదల్లో దాగుడుమూతలాడుకున్నామేమో అనిపించింది.

సేన్‌గుప్తకే కాదు, మర్చిపోయిన గ్రామాల్ని గుర్తుచేసే అరుణిమాసన్యాల్ , ఆ క్షణాన నాకు కూడా దర్శనమిచ్చింది. ఎవరో నా పక్కన నిలబడి 'షె కి తుమి, షె కి తుమి' అని పలకరిస్తున్నట్టుగా తోచింది.

ఆ సాయంకాలం రాజు వచ్చాడు. ఆ రెండుమూడు రోజులూ ఏమైపోయావని అడిగాను. వాళ్ళనాన్నగారు ఏదో పనిచెప్పారనీ అందుకని నర్సీపట్నం, విశాఖపట్టణం వెళ్ళి రావాల్సి వచ్చిందని చెప్పాడు. డా.మిశ్రా వెళ్ళిపోయాడనీ, వెళ్ళేటప్పుడు తనకోసం చూసాడనీ చెప్పాను. మిశ్రా అడ్రసు తనదగ్గర ఉందనీ, ఉత్తరం రాస్తాననీ అన్నాడు. అప్పుడు సేన్‌గుప్తనుంచి ఉత్తరమూ, పార్సెలూ వచ్చిన సంగతి చెప్పాను. 'నా గురించి అడిగారా?' అనడిగాడు.

ఆ ఉత్తరంలో రాజు ప్రస్తావన లేదని గుర్తొచ్చింది. మళ్ళా ఆ ఉత్తరం ఆమూలాగ్రం గుర్తుచేసుకోడానికి ప్రయత్నించాను. లేదు, ఆయన ఆ ఉత్తరంలో కనీసం జోసెఫ్ గారి గురించి కూడా ప్రస్తావించలేదు.

'బహుశా నీకు వేరే ఉత్తరం రాస్తారేమో' అన్నాను, మరేమనాలో తెలియక.

'వాళ్ళు వెళ్ళినప్పుడు కూడా ఇలాగే మిస్సయ్యాను. మళ్ళీ వస్తారు కదా అనుకున్నాను. మిశ్రానంటే మళ్లా చూస్తానని నమ్మకం ఉందిగాని, ఆ లడ్డూ అమ్మాయినీ, ఆ బడ్డూ తాతనీ మళ్ళా చూస్తానని నమ్మకం లేదు' అన్నాడు.

ఆ మాటలు వినగానే ఆపుకోలేనంత నవ్వొచ్చింది నాకు.

'లడ్డూ అమ్మాయా! వనలత నీకు లడ్డూ అమ్మాయిలా కనిపించిందా!'– తెరలు తెరలుగా నవ్వొస్తూనే ఉంది నాకు.

కాని వాళ్ళు తనని మర్చిపోయారని రాజుకి మనసులో కష్టం కలిగిందని నాకు అనిపిస్తూనే ఉంది. కళ్ల ముందు కనిపిస్తున్నంతసేపే మనుషుల్ని పట్టించుకుని ఆ తర్వాత మర్చిపోయే మనిషి కాడు సేన్‌గుప్త. కాని ఆ క్షణాన రాజు మనసులో ఏర్పడ్డ ఆ చిన్నపాటి శూన్యాన్ని ఎలా పూరించాలో నాకు తెలియలేదు.

ఏ పనీ లేకుండా మరో పదిరోజులు ఆ ఊళ్ళో ఎలా గడపడమా అనుకున్నానుగాని, కళ్ళుమూసి తెరిచేటంతలోనే పది రాత్రులూ గడిచిపోయాయి. అంతకుముందు కూడా రెండు వారాలు ఏ పనిలేకుండా ఉన్నప్పటికీ, అప్పుడు డా.మిశ్రా కోసం ఎదురుచూడటం ఉంది, ఆయన వచ్చేక ఎలాంటి పని మొదలుపెట్టవలసి ఉంటుందో తెలియకపోవడమూ ఉంది. కాని ఈ పదిరోజులూ పూర్తి ఆటవిడుపు. సుధీర్‌లాగా, రోజాలాగా నేను కూడా ఆ వేసవి సెలవులకి మా బంధువుల ఇంటికి వెళ్ళినట్టే అనిపించింది.

పూర్తి సోమరి రోజులు. ఆకాశంలో దినమల్లా కోకిల కూడా నాలానే సోమరిగా కూస్తుండేది. వైశాఖమాసం మొదలైనప్పుడు గంగాలమ్మ వస్తూ వానలు వెంటబెట్టుకొచ్చింది. కాని రోహిణికార్తె మొదలయ్యాక వానలు అదృశ్యమైపోయాయి. అడవీ, కొండా, ఊరూ అన్నీ అలసిపోయినట్టుండేవి. ఎప్పుడు సాయంకాలమవుతుందా అని ఎదురుచూసేవాళ్ళం. మరికాసేపటికి సంధ్యవాలుతుందనగా ఊరంతటినీ మనోహరమైన చల్లదనం ఆవరించేది. ఆ చల్లదనంకోసం రోజంతా ఆ ఎండని తట్టుకోవచ్చనుకునేవాళ్ళం. ఇప్పటిలాగా పంకాలూ, ఏసీలూ లేని రోజులు.

మధ్యాహ్నం ఉక్కబోసేది. పేడతో అలికిన ఆ అరుగులమీద ఒక చాప పరుచుకుని దానిమీదనే దొర్లుతుండేవాళ్ళం. వానపడుతుందేమో అనుకునేవాళ్ళం. చినుకులుపడేవికావు గాని గుమాయింపు మరింత ఎక్కువయ్యేది. తాటాకు విసనకర్రల్తో విసురుకునేవాళ్ళం. నిద్రపట్టేది కాదు. అటూ ఇటూ దొర్లినంతసేపు దొర్లేక ఇక విసుగొచ్చి లేచేవాళ్ళం.

అదీ సమయం మామిడిపండ్లు ఆరగించడానికి. అవి పళ్ళల్లాగా కనిపించేవికావు. పూతనుంచి పండుదాకా అక్కడ గడిచిన నాలుగునెలల సంతోషమంతా కుక్కిపెట్టుకున్న జ్ఞాపకాల మూటల్లాగా ఉండేవి.

రాజు ఒక్కొక్కప్పుడు మరీ సాయంకాలం కాకుండానే వచ్చేసేవాడు. ప్రతి సాయంకాలమూ అతను రావాలనీ, వస్తే ఎక్కడికో ఒకచోటికి పోవచ్చనీ నాలో ఒక ఎదురుచూపు ఉండేది. అతనూ, నేనూ, అన్నయ్యా కలిసి రోజా వాళ్ళింటికి వెళ్ళేవాళ్ళం. అక్కణ్ణుంచి చాపరాయి దగ్గరికో లేదా ఇటువైపు ఏటిదాకానో, ఒక్కొక్కప్పుడు ఆ ఏరు దాటి టేకుచెట్ల అడవిదాకానో నడిచేవాళ్ళం. ఒకసారి యూకలిప్టసు తోటలోకి కూడా వెళ్ళాం. మరీ ముఖ్యంగా రెండు అనుభవాలు, మరవలేనివి, రెండింటికీ రాజుకి ఋణపడి ఉంటాను.

ఒకరోజు కృష్ణదేవి పేట వెళ్ళేదారిలో ఉన్న ఏడొంపుల ఘాటికి తీసుకువెళ్ళాడు. ఆ తర్వాత జీవితంలో నేనెన్నో ఘాటు రోడ్లలో ప్రయాణం చేసాను. డాక్టరుతో, మా పిల్లల్తో వేసవి సెలవుల్లో ఎన్నో హిల్ స్టేషన్లలో గడిపినప్పుడు ఎన్నో ఘాటురోడ్లలో పొద్దుటిపూటనో, సాయంకాలంపూటనో నడిచిన రోజులూ తక్కువేమీ కావు. వాటితో పోలిస్తే ఆ ఏడొంపుల ఘాటి మరీ పెద్దదేమీ కాదు. ఆ అడవి కూడా మహారణ్యమూ కాదు. ఆ రోజు జీపు తీసుకుని వెళ్ళి ఉండవలసింది. సాయంకాలం బస్సుకి వచ్చేద్దామనుకుని ఇటునుంచి బస్సులో వెళ్లాం. కాని మా ఆటల్లో, మాటల్లో, పాటల్లో పడి బస్సుమిస్సయ్యాం. అవి కృష్ణపక్షపు రాత్రులు. చిమ్మటలూ, చీకట్లూ తప్ప మరింకేమీ ఆ అడవిలో కనిపించడం మానేసాయి. ఇంటికి ఎలా రావాలో తెలీదు. నడుచుకుంటూ పోదామా అన్నాడు సుధీర్ అన్నయ్య. ఆయన కూడా మాతో ఉన్నాడు కాబట్టి ఇంట్లో మరీ అంత కంగారు పడరని ఒక ధైర్యం. ఎంతసేపు ఆ ఘాటీ మీద వెయిట్ చేస్తామని నడవడం మొదలుపెట్టాం. ఆకలి వేస్తూ ఉంది. రెండు మలుపులు తిరిగేటప్పటికి, కృష్ణపక్షపు చంద్రుడు ఆకాశంలో అడుగుపెట్టాడు. వెన్నెలరాత్రుల చంద్రుణ్ణి మాత్రమే చూసిన నాకు, ఆ దశమినాటి వెన్నెల్లో అడవిని చూడటం కొత్తగా ఉంది. ఆ రాత్రి అడవి మాతో కలిసి నడవడానికి చంద్రుణ్ణి తోడుగా పంపించినట్టుంది. అదొక మిడ్ సమ్మర్ నైట్ డ్రీమ్. ఇంతలో గిరిజన కార్పొరేషను లారీ దొరికింది. ఆ లారీ రాకపోయుంటే, ఆ చంద్రుడు మా ఇంటిదాకా వచ్చి ఉండేవాడే.

ఇంకోరోజు, అది కూడా నేను మరి రెండురోజుల్లో అక్కణ్ణుంచి వచ్చేస్తాననగా, అందరం ఆ ఊరిని ఆనుకుని ఉన్న కొండ ఎక్కాం. ఎప్పుడూ చాపరాయి దాకానో లేదా మరొక నాలుగు అడుగులు పైకో ఎక్కి వచ్చేసేవాళ్ళం, ఆ రోజు కొండపైదాకా ఎక్కాం. అప్పుడు కూడా సాయంకాలమవుతూ ఉంది. ఆ కొండమీంచి చూస్తే దిగంతందాకా ఆకుపచ్చని సముద్రం, ఆ సముద్రం మీంచి పైకి లేస్తున్న ఊదారంగు కెరటాల్లాగా కొండలు. అంతదాకా తాను చిటికెనవేలు పట్టుకుని నడిపిస్తున్న తన బిడ్డని తండ్రి

ఒక్కసారిగా తన నెత్తిమీద ఎక్కించుకుని చుట్టూ ఎలా ఉందో చూపిస్తే ఎలా ఉంటుందో అలా ఉంది నాకు ఆ రోజు ఆ కొండమీంచి అప్పటిదాకా నేను తిరుగాడిన దేశం చూస్తే.

మృగశిర కార్తె రాగానే వాతావరణం ఒక్కసారిగా చల్లబడిపోయింది. రోడ్లు పగిలేట్టు కాసిన రోహిణికార్తె ఎండ అకస్మాత్తుగా చల్లని నీడగా మారిపోయింది. ఋతుపవనం కన్నా ముందే వానకోయిల అడవిలో అడుగుపెట్టింది. అలాంటి చల్లని వేళ మా నాన్న వచ్చాడు. ఆ రోజు సాయంకాలం నాకు ఒక వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసారు. సేన్‌గుప్త వచ్చినప్పుడు ఏర్పాటు చేసినట్టే, ఈ సమావేశం కూడా జోసెఫ్‌గారే ఏర్పాటు చేసారు. గ్రామంలోని పెద్దల్తో పాటు, మా నాన్న, సూర్యనారాయణగారి కుటుంబం, సుధీర్, రోజా, రాజూ, దేవయ్య, రాంబాబు, చెల్లన్న దొర, ఇంకా మరికొందరు వచ్చారు. జోసెఫ్‌గారు అందరికీ టీపార్టీ ఇచ్చారు. నా గురించి ఆదరపూర్వకంగా నాలుగు మాటలు మాట్లాడేరు. ఆయన మాట్లాడటం చూసి గ్రామసర్పంచి కూడా నాలుగు మాటలు మాట్లాడేడు. మరొక ఇద్దరు ముగ్గురు పెద్దలు కూడా మాట్లాడేరు. మా నాన్న అందరికీ కృతజ్ఞతలు చెప్పాడు. తన కూతురిని కడుపులో పెట్టుకు చూసుకున్నారని చెప్పాడు. నన్ను కూడా మాట్లాడమన్నారు. కానీ నాకు గొంతుపెగల్లేదు. నిజానికి అటువంటి వీడ్కోలు డా.మిశ్రాకి ఇచ్చి ఉండవలసిందని ఆ తర్వాత ఎన్నిసార్లో అనుకున్నాను. ఒక విద్యావంతుడు ఒక గ్రామంలో ఒక్కరోజు గడిపినా కూడా ఆ గ్రామంలో ఎంతో కొంత మార్పు కనబడాలని ఆయన చెప్పినప్పుడు ఆ మాటలకి తనే ఒక ఉదాహరణగా నిలబడతాడని నేను ఊహించలేదు.

టీపార్టీ అయిపోయి అంతా వెళ్ళిపోయాక, రోజా ఇంకొంచెం సేపు కూచోమని అడిగింది. నాన్న మాష్టారి కుటుంబంతో పాటు ఇంటికి వెళ్ళిపోయాడు. నేనూ, రాజూ, సుధీరూ మాత్రమే మిగిలాం. మేము నలుగురం వకుళకుటికి వెళ్లాం. మామిడికాయలు కాపు దింపెయ్యడంతో మళ్లా చెట్లు బోసిగా కనిపిస్తున్నాయి. నేలంతా వేపకాయలు రాలి వున్నాయి. మేము ఏదో మాట్లాడుకుంటూ ఉన్నాం గాని, మాట్లాడుకోవలసిందేదో మాట్లాడు కోవడం లేదని తెలుస్తూనే ఉంది. ఆ కుటీరం అరుగుమీద కూచున్నాం.

'రోజా, ఒక పాట పాడవా' అనడిగాను. రాత్రయింది, పొద్దున్న పడ్డ నాలుగు చినుకులే తప్ప మరి వాన రాలేదు. అంతా గుమాయింపుగా, ఉక్కపోతగా ఉంది. ఆమె ఏదన్నా సినిమా పాట పాడితే వాతావరణం తేలిక పడుతుందేమో అనిపించింది.

ఒక హిందీ పాట పాడనా అనడిగింది రోజా.

'మనం హిందీలో పూర్' అన్నాడు రాజు.

'పాడి ఊరుకుంటే చాలదు, అర్థం కూడా చెప్పాలి' అని కూడా అన్నాడు, నవ్వుతో, కాని, సీరియస్‌గానే.

'అలాగే, తప్పకుండా' అంది రోజా. చెట్టుగుబుర్లలో దాగి కనిపించని కోయిల పాట మాత్రమే వినిపించేటట్టు, ఆ చీకట్లో రోజా ఒక పాట ఎత్తుకుంది.

యే దౌలత్ భీ లేలో యే షోహరత్ భీ లే లో
భలే ఛీన్ లో ముఝ్ సే మేరీ జవానీ
మగర్ ముఝ్ కో లౌటాదో బచ్ పన్ కా సావన్
వో కాగజ్ కీ కష్టీ, ఓ బారిష్ కా పానీ..

ఆ పాట జగజీత్ సింగ్, చిత్రా సింగ్ పాడిన ఎంతో సుప్రసిద్ధగీతమని ఆ తర్వాత ఎన్నో ఏళ్ళకు నాకు తెలిసింది. కాని ఆ పాట మొదటిసారి విన్నది మాత్రం ఆ కొండకింద పల్లెలో, ఆ మామిడిచెట్ల నీడలో, ఆ ఊళ్ళో నేను గడిపిన ఆ చివరి వేళల్లో.

ఆమె పాడుతున్నంతసేపూ కొండా, కోనా, నింగీ, నేలా అన్నీ మౌనంగా ఆ పాట విన్నాయి. ఆ తర్వాత ఆమె ఓపిగ్గా ప్రతి ఒక్క వాక్యానికీ అర్థం చెప్పింది.

'ఈ సంపద తీసేసుకో, ఈ కీర్తిప్రతిష్ఠలు పట్టుకుపో, నా యవ్వనం కూడా పట్టుకుపో, కాని, నా చిన్నప్పటి రోజులు మాత్రం నాకిచ్చెయ్యి, ఆ వానాకాలపు రోజులు, ఆ కాగితం పడవలు–'

'ఆ గ్రామంలో మిగిలిన పూర్వకాలపు ఆనవాళ్ళు, అమ్మమ్మలు చెప్పే కథల్లో కనిపించే దేవదూతలు, యుగాల గాథలు చెప్పే ఆ ముఖం మీది ముడతలు, మర్చిపోడం సాధ్యంకాని ఆ ముచ్చట్లు, తొందరగా గడిచిపోయే ఆ రాత్రులు, ఎంతకీ ముగిసిపోని ఆ కబుర్లు–'

'మధ్యాహ్నాలవేళ ఎండలో బయటికి పోవడాలు, ఆ పిట్టల వెంట, ఆ బుల్బుళ్ళ వెంట, ఆ సీతాకోకచిలుకల వెంట పడటాలు, ఆ బొమ్మల పెళ్ళిళ్ళు, ఆ తగాదాలు, ఆ ఉయ్యేలలూగడాలూ, కిందకిపడిపోడాలూ, పడిపోకుండా తప్పించుకోడాలూ, అపురూపంగా దాచుకున్న ఆ చెల్లని కాసులు, ఆ పగిలిన గాజులు–'

'పెద్ద పెద్ద ఇసుకకుప్పలమీద ఎక్కడాలు, ఇసుకగూళ్ళు కట్టడాలు, కట్టినవాటిని కూలదొయ్యడాలు, కళ్లల్లో మెరిసిన ఆ కోరికలు, ఆ కలలు, ఆ బొమ్మలు, ఎలాంటి చీకూ చింతాలేని ఆ అనుబంధాలు, ఆ చక్కని రోజులు, ఎప్పటికీ గుర్తుండిపోయే ఆ రోజులు, ఆరాధనీయమైన ఆ రోజులు–'

ఆ పాటా, ఆ మాటలూ ముగిసాక రోజా చిన్న గొంతుతో నా చెవిలో 'రాజు నీతో ఏదో మాట్లాడాలనుకుంటున్నాడు' అంది. కాని అప్పటికే బాగా ఆలస్యమైపోయింది. సుధీర్ 'పొద్దున్నే ప్రయాణముంది, పద' అని తొందరపెట్టాడు..

ఆ మర్నాడు పొద్దున్నే ఫస్టుబస్సుకే బయల్దేరిపోయాం. వెళ్ళేముందు మాష్టారి దంపతులకి నాన్న తెచ్చిన కొత్త బట్టలు పెట్టాను. వారి పాదాలకు నమస్కరించాను. ఒక్కరోజు కూడా ఒక్క మాట కూడా అనలేదు వాళ్ళు. పగలూ, రాత్రీ ఎలా తిరిగినా, ఎక్కడికి తిరిగినా, ఎవరితో ఎంతసేపు కబుర్లు చెప్పినా వారు ఏ ఒక్కరోజూ కనుబొమకూడా ముడిచింది లేదు. ఆయన సరే. ఆమె కూడా.

సుధీర్ పెళ్ళికి తప్పకుండా వస్తామని నాన్న మరీ మరీ చెప్పాడు. బయలుదేరేముందు ఆ పిల్లలిద్దర్నీ దగ్గరగా పొదువుకున్నాను. బాగా చదువుకొమ్మని చెప్పాను. ఉత్తరాలు రాస్తూఉండమని చెప్పాను. నన్ను మర్చిపోవద్దని మరీ మరీ చెప్పాను.

బస్సెక్కేముందు ఆ ఇంటిని, ఆ వీధిని, ఆ రామకోవెలని మరోసారి చూసాను. 'అమ్మా, నేటి నుంచీ విజయ్ విశాలప్రపంచంలో అడుగుపెడుతున్నాడు' అని అక్కడ ఇంకా రిహార్సలు నడుస్తున్నట్టే ఉంది.

బస్సు కదిలింది. నాన్న గిరిజన్ కార్పొరేషనులో కొన్న చింతపండుబుట్ట, చీపుళ్ళూ, తేనెసీసాలూ సర్దుకుంటున్నాడు. బస్సు ఏరు దాటింది, గ్రామదేవత గుడి కూడా దాటింది. ఆ యూకలిప్టసు తోటలూ, ఆ టేకు వనాలూ వెనక్కి వెళ్ళిపోయాయి. మరొక గంట గడిచేటప్పటికి ఆ అడవీ, ఆ కొండలూ కూడా కనుమరుగైపోయాయి.

❋

25

దాదాపు ఎనిమిది నెలల తర్వాత మళ్ళా ఇంట్లో అడుగుపెట్టేటప్పటికి మా అమ్మ నన్ను చూస్తూనే కళ్ళనీళ్ళు పెట్టుకుంది. 'ఇలా చిక్కిపోయేవేమిటే! ఇంతలా నల్లబడి పోయేవేమిటే!' అంటూనే ఉంది. 'అక్కడ రాళ్ళు కొట్టేవా? మూటలు మోసావా' అనడిగింది రజని. మా తమ్ముడూ, చెల్లెలూ హటాత్తుగా పెద్దవాళ్ళు అయిపోయినట్టనిపించింది.

మహాసముద్రాలమీద ఎన్నో ఏళ్ళు ప్రయాణాలు చేసి తిరిగివచ్చాక నావికులు తమ ఇంట్లో అడుగుపెట్టినప్పుడు మొదట ఏమి చేసి ఉంటారు? ఏమి చూసి ఉంటారు?

నేను చేసిన పని మాత్రం ఒకరోజంతా నిద్రపోవడం. అది వట్టి ప్రయాణం తాలూకు అలసట వల్లనే అని అనుకోలేను. ఇప్పుడు మనం జెట్ లాగ్ అంటామే, బహుశా అలాంటిదే ఏదో. ఇక్కడ పగలైతే అక్కడ రాత్రి, అక్కడ పగలైతే ఇక్కడ రాత్రీలా ఉండే రెండు దేశాల మధ్య ప్రయాణించి వచ్చినదానిలా, నాకు ముందు ఆ కాలమానానికి కుదురుకోడానికే చాలా విశ్రాంతి కావలసి వచ్చింది.

పూర్తిగా ఒక పగలూ, ఒక రాత్రీ నిద్రపోయాక, ఆ మర్నాడు తెల్లవారుతూనే ఎందుకో చెప్పలేని బెంగ కలిగింది. అది దేనిపట్లనో చెప్పలేను. ఆ క్షణాన ఇవీ అని చెప్పదగ్గ దృశ్యాలుగానీ, ఫలానావాళ్ళు అని గుర్తుపట్టగల ముఖాలు గానీ ఏవీ నా మనసులో లేవు. అదొక ఫ్లూయిడ్ స్టేట్ లాంటి మనఃస్థితి.

ఆ మర్నాడు ఈ ప్రపంచంలోకి వచ్చాక నేను చేసిన మొదటిపని ఆ చెక్కు మా అమ్మ చేతుల్లో పెట్టడం. 'నీకు ఏ కానుకా తేలేదు. ఇది నా మొదటి జీతం అనుకో. నీ ఇష్టం. నీకేం కావాలంటే అది కొనుక్కో' అన్నాను. సేన్‌గుప్తా పంపించిన బెంగాలు

కాటను చీర కూడా ఆమె చేతుల్లో పెట్టాను. అప్పుడు ఇల్లంతా ఒకసారి కలయచూసాను. ఆ ఇంట్లో నా చిన్నప్పటినుంచీ నాన్న అలవాటు చేసిన రిథమ్ అలానే ఉంది. చిన్నపాటి తేడా కూడా లేదు. ఎక్కడి వస్తువులు అక్కడే ఉన్నాయి. నేను వెళ్తున్నప్పుడు తీసుకువెళ్ళకుండా వదిలిపెట్టిన దుస్తులూ, పుస్తకాలూ ఏ సూటుకేసులో పెట్టుకున్నానో అదే నేను ఏ మంచం కింద పెట్టానో అక్కడే చెక్కుచెదరకుండా ఉంది.

రజని బిఏ సెకండు ఇయరు పరీక్షలు రాసి ఆ జూలైలో మూడోఏడాదిలో అడుగు పెట్టబోతోంది. ప్రశాంత్ ఇంటరు పరీక్షలు రాసాడు. రిజల్ట్సు కోసం చూస్తున్నాడు. మంచిమార్కులొస్తే జెఎన్‌టియులో సీటు దొరుకుతుందని ఆశపడుతున్నాడు. వాళ్ళిద్దరూ ఇంట్లోనే ఉండటంతో వారంరోజుల పాటు నా ఫీల్డు వర్కు సంగతులన్నీ పూసగుచ్చినట్టు చెప్పేసాను. కొన్ని సంగతులు బహుశా రెండుమూడు సార్లు కూడా చెప్పి ఉంటాను. వారం పది రోజులు గడిచేటప్పటికి నేనేదైనా ఒక విషయం ఎత్తుకోబోతే 'అబ్బా, ఆ తర్వాత ఏమవుతుందో మాకు తెలుసు' అనేవారు. 'ఆ సాయంకాలం ఆ ఏటిదగ్గరికి వెళ్ళాక-' అని చెప్పబోతుంటే, 'ఆ యూకలిప్టసు తోటలో ఒక పక్షి అరిచింది కదా' అనేవారు. అక్కడ నేను కలుసుకున్నవాళ్ళు, తారసపడ్డవాళ్ళు, మేము తిరిగిన చోటులు, చేసిన పనులు, మాట్లాడుకున్న మాటలు అన్నీ చెప్పాను. ప్రతి సారీ చెప్పినవన్నీ చెప్పాక 'ఎప్పుడన్నా మనం ముగ్గురం ఆ ఊరు వెళ్దాం' అనేదాన్ని. 'వెళ్దామక్కా, నాకు ఇప్పుడే చూడాలనిపిస్తోంది' అనేవాడు ప్రశాంత్. 'ఎందుకు పోవడం? అంతా నీ మాటల్లో చూసేసేం కదా' అనేది రజని.

వచ్చినప్పుడు వెంటనే తెలియలేదుగాని, రెండు వారాలు గడిచేటప్పటికి నాకు ఆ ఊరిమీదా, ఆ మనుషుల మీదా బెంగ పుట్టడం మొదలయ్యింది. ప్రొఫెసర్ సేన్‌గుప్తతో మరికొన్ని విషయాల మీద మాట్లాడించి ఉండవలసిందేమో, వనలతతో మరికొన్ని పాటలు పాడించుకుని ఉండవలసిందేమో, డా. మిశ్రాతో మరికొన్ని మంచిపనులు చేయించి ఉండవలసిందేమో అనిపించేది. రోజా గురించి ఏమీ తెలుసుకోలేదు, ఆమె చదువెలా ఉంది, ఇంజనీరింగు అయ్యాక ఏం చెయ్యాలనుకుంటోంది, ఆమె నేను వచ్చేసిన వెంటనే తను కూడా ఆ ఊరునుంచి వచ్చేసిందా లేక మరికొన్నాళ్లుందా అని అడగాలనిపించేది. మరీ ముఖ్యంగా రాజు తన చదువు సంగతి ఏమి ఆలోచించాడు, పరీక్షలు, మొత్తం మూడేళ్ళ పరీక్షలు రాయాలి కదా, ఎలా ప్లాను చేసుకుంటున్నాడో అడగలేదే అనిపించేది. 'పరీక్షలు రాయడం మానెయ్యకు. తప్పకుండా రాయి' అని చెప్పాలనుకున్నానుగాని, ఆ చివరిరోజు హడావిడిలో ఆ మాటలు చెప్పడమే మర్చిపోయాను.

మరీ ముఖ్యంగా పడుకోబోయేముందు కళ్ళు మూసుకోగానే ఆ కొండా, ఆ అడవీ, ఆ ఏరూ, ఆ చింతచెట్లూ, ఆ కాగితంపూల పందిరీ, ఆ కొంగలూ, ఆ గోరువంకలూ, ఆ రామకోవెలా గుర్తొచ్చేవి. ఇప్పుడు అక్కడ ఏం చేస్తూ ఉంటారో కదా అనుకునేదాన్ని. సేన్‌గుప్తా లానే ఆ ఊరు కూడా ఒక జియొలాజికల్ టైములో జీవిస్తూ ఉంటుంది కదా అనుకున్నాను. ఒక మహావృక్షం మీద ఒక పిట్ట వచ్చి వాలి కొంతసేపు ఆ పూలసుగంధాన్నో, ఆ పిందెల కసరుదనాన్నో రుచిచూసి ఎగిరిపోయిందనుకో, ఆ చెట్టుకి అది తెలుస్తుందా? ఎస్.విమల, బి.ఎస్.సి అనే ఆమె కొన్నాళ్ళు తమ మధ్య సంచరించిందనీ, విభ్రాంతితో అనుదినం తమనే పరికిస్తూ గడిపిందనీ, ఆ పర్వతాలకీ, ఆ అరణ్యానికీ, ఆ గగనతలం మీద సభచేసుకునే నక్షత్రాలకీ గుర్తుంటుందా? అసలు అటువంటి ఒక మనిషి అక్కడికి వచ్చివెళ్ళిందని వాటికి తెలుసా?

రాత్రి పడుకోబోయేముందు కలిగే ఆలోచనలు ఒకలాంటివి. అందులో ఎక్కువ తలపులే ఉండేవి. కాని పొద్దున్నే నిద్రలోంచి మెలకువ రాగానే ఒక్కొక్కప్పుడు హృదయాన్ని తడిగుడ్డగా పిండినట్టు చెప్పలేని ఏదో బెంగ పుట్టేది. ఆ వకుళకుటి గుర్తొచ్చేది. డా.మిశ్రా వచ్చినప్పటికే, ఆ ముంగిలి చిమ్మటం మానేసారు. పూలూ, పిందెలూ, కాయలూ, చెట్టుమీదనే మిగలముగ్గి కిందకు రాలిపడ్డ పండ్లూ అన్నీ చెల్లాచెదురుగా పడి ఉండేవి. ఇక ఇప్పుడు ఆ కుటీరం పాడుపడిపోడం మొదలవుతుందా? జోసెఫ్‌గారు దాన్ని తన ఆఫీసుగా మార్చుకుని ఉంటే బావుండేదేమో కదా అనిపించేది.

ఒకరోజు పొద్దున్నే ఇంకా నేను దుప్పటి ముసుగు తియ్యలేదు. ఎవరో ఏదో పాట పాడుతున్నారు. ఆ పాట ఎక్కణ్ణుంచో ఆకాశపు కొసల్లోంచి వినవస్తున్నట్టుగా ఉంది. ఆ పాట వినబడటం మొదలుకాగానే నేను నా ఊహల్లోనే రోదించడం మొదలుపెట్టాను. అది కలా కాదు, మెలకువా కాదు. నా హృదయాన్ని ఎవరో కోసేస్తున్నట్లు చెప్పలేనంత బాధ అనుభవానికి వస్తూ ఉంది. ఏ ప్రాచీనస్మృతుల్నో ఎవరో కెరలించినట్టుగా, నా లోపల ఒక చేదవేసి, నాలోపలి లోతుల్లోంచి ఏదో తోడి పైకి తీస్తున్నట్టుగా ఉంది. అటువంటి రంపం కోత నేనెప్పుడు అనుభవించి ఎరగను. అంతకు ముందూ, ఆ తర్వాత కూడా. నాలో నేనే గింజుకుంటూ, ఆ కోత తప్పించుకోడానికి మెలికలు తిరుగుతూ ఒక్కసారిగా దుప్పటి ముసుగు పక్కకి జరిపేసాను. నా ముఖం మీద కిటికీలోంచి వెలుతురు పడుతూ ఉంది. ఆ పాట రేడియోలోంచి వినబడుతూ ఉంది. ఏదో పాట. ఆ మాటలు కూడా గుర్తు లేవు.

నేను అక్కణ్ణుంచి బయల్దేరినప్పుడే మాన్సూను మొదలయ్యింది. ఇక్కడకు వచ్చేటప్పటికి ఋతుపవనమేఘాలు ఆకాశాన్ని కప్పేసాయి. రోజూ తెల్లవారగానే మా ఇంటి డాబా మీదకు వెళ్ళిపొయ్యేదాన్ని. పైన ఆకాశంలో నల్లమబ్బులు, తమలోపల వెయ్యిదీపాలు దాచుకుని ఆకాశంలో పయనిస్తూ కనిపించేవి. ఆ మబ్బుల్లోనూ, ఆ నల్లదనంలోనూ కాదు, ఆ కరిమబ్బుల మధ్యలో ఉండే వెలుగు ఉందే, ఆ విద్యుత్కాంతి, దాన్ని చూస్తేనే నాకు చెప్పలేనంత బెంగ పుట్టేది.

ఎందుకు? ఎందుకని అక్కణ్ణుంచి అంత తొందరగా వచ్చేసాను? ఆ అడవిమీద ఈ ఋతుపవనం ప్రయాణిస్తున్నప్పుడు ఎలా ఉంటుందో చూడకుండా ఎందుకొచ్చేసాను? ఆ వెలగచెట్టుకీ, ఆ నేరేడుతోపుకీ మధ్య ఇంద్రధనుస్సు అల్లుకుంటే ఎలా ఉంటుందో ఇంక నాకెప్పటికీ తెలియదు కదా!

ఆ ఊళ్ళో ఉన్నప్పుడు భూమి గోళాకారంగా ఉన్నట్టుగా ఉండేది. ఆకాశమూ, భూమీ దిగంతరేఖదగ్గర కలుసుకుని ఒక వలయం ఏర్పడుతున్నట్టుగా ఉండేది. సూర్యాస్తమయాలూ, చంద్రోదయాలూ ఒకదాన్నొకటి అల్లుకుని రెండు చేపలు ఒకదాన్నొకటి కరిచిపట్టుకున్నట్టుగా ఉండేది. కాని ఇక్కడికొచ్చాక భూమి బల్లపరుపుగా ఉందని అర్థమయింది. బయటికి వచ్చి చూస్తే చతురస్రాకారంగానో, దీర్ఘచతురస్రాకారంగానో, ఇళ్ళూ, వీథులూ, రోడ్లూ కనిపించేవి. అక్కడ కళ్ళకి అడ్డంగా ఏదీ ఉండేది కాదు. అక్కడ ఇళ్ళున్నా, అవి నిట్రాతిగుడిసెలో లేక అటూ ఇటూ కప్పులు ఏటవాలుగా వాలి ఉండే తాటాకు ఇళ్ళో, బంగాళా పెంకుటిళ్ళో కావడం వల్ల సూర్యుడూ, చంద్రుడూ చెయ్యి చాస్తే అందేటట్టుగా ఉండేవారు. నీకూ, దిగంతానికీ మధ్య అపారమైన ఖాళీ జాగా ఉండేది. చివరికి ఆ వీథుల్లో గోధూళి రేగినప్పుడు కూడా మొత్తం నేలంతా నీకు దగ్గరగా జరిగినట్టుండేది. ఇక్కడ అలా కాదు, ఒక గళ్ళనుడి కట్టులాగా, గ్రాఫునోటుపుస్తకంలో పేజీలాగా అన్నీ గళ్ళుగళ్ళుగా విడిపోయి కనిపిస్తాయి. ఆ గళ్ళల్లో, నీ ఇల్లొక గడి. అందులో నీ గది ఒక గడి. ఆ గదిలో నీ మది ఒక గడి.

ఆ ఊరునుంచి వచ్చిన రెండు మూడు వారాల దాకా నాకు ఊపిరాడలేదు. అడవిలోంచి ఒక పిట్టను తెచ్చి పంజరంలో పెడితే ఎలా ఉంటుందో అలా ఉండింది. పది పదిహేను రోజులు గడిచాక, ఇక్కడ నేను విహరించడానికి మిగిలిన ఒకే ఒక్క స్థలం ఆకాశం మాత్రమే అని అర్థమయింది. అది కూడా మా ఇంటి డాబా మీదకు వెళ్తేనే. కిందకు వస్తే, గళ్ళూ, గోడలూ తప్ప మరేమీ కనిపించవు. కానీ, ఆ ఆకాశం మాత్రం ఆ వూర్నీ, నన్నూ కలుపుతున్న గొడుగులాగా అనిపించేది. మా డాబా మీంచి

చూస్తే నెమ్మదిగా పయనమవుతున్న మేఘాలు ఇవాళో రేపో ఆ అడవికి చేరుకుంటాయి అని అనిపించేది. ఎప్పుడో పూర్వకాలంలో ఒక యక్షుడు మాన్సూను మేఘాన్ని చూసి సందేశం పంపించాడంటే మొదటిసారిగా నమ్మబుద్ధేసింది నాకు.

మా ఊళ్లో అప్పట్లో ఇంకా చెట్లు కనిపించేవి. తర్వాత రోజుల్లో పట్టణంలో ప్రతి ఒక్క స్క్వేరు ఇంచినీ డబ్బులెక్కల్లో చూడటం మొదలయ్యాక ఒక చెట్టులేకపోతే, ఒక స్క్వేరు యార్డు మిగులుతుంది కదా అని మనుషులు లెక్కలేసుకోడం మొదలయ్యాక, ఆ చెట్లు కూడా కనుమరుగైపోయాయి. నాకు తెలిసిన ఒకాయన ఇంటిముందొక పెద్ద వేపచెట్టు ఉండేది. ఒక తుపానులో ఆ చెట్టు విరిగిపోయింది. దాన్నలా వదిలిపెట్టి ఉంటే మళ్ళా చిగురించి ఉండేదేమో. కాని అదే అవకాశంగా ఆయనదాన్ని కొట్టించేసాడు. ఆ చెట్టుండే స్థలాన్నీ, తన ఇంటినీ కలుపుతూ చిన్న షట్టరు దింపి ఒక లాండ్రీకి అద్దెకిచ్చాడు.

కాని అప్పటికింకా ఆ వీథుల్లో చెట్లు కనిపించేవి. మా వీథి దాటి స్కూలుకెళ్ళే దారిలో పెద్ద నిద్రగన్నేరు చెట్లు ఉండేవి. ఆ ఊళ్ళో బస్టాండు పక్కన కూడా పెద్ద నిద్రగన్నేరుచెట్లు ఉండేవి. వాటి పక్కన ఒక కట్టెలఅడితీ ఉండేది. పచ్చనిచెట్లనీడన ఆ కొయ్యదుంగల దుకాణం నాకు ఒక విరోధాభాసగా కనిపించేది. కాని ఆ చెట్టునీడ అక్కడ పడుతున్నంతకాలం నా దృష్టి ఆ అడితీమీద పడేది కాదు. ఇన్ని చెట్లున్నాయిగాని, ఇక్కడిక్కడ ఈ చోటుల్లో ఉన్నాయని గాని ఒకప్పుడు నాకు తెలిసేది కాదు. అసలు నా దృష్టి స్కూలూ, కాలేజీ, లంచి బాక్సూ, ప్రాక్టికల్సూ, హోంవర్కూ దాటి మరిదేనిమీదా ఉండేది కాదు. అదే చిత్రం, మూడేళ్ళు బోటనీ చదువుకున్నా, క్లాసురూములో తప్ప మరెప్పుడూ నేను చెట్ల గురించీ, మొక్కల గురించీ ఆలోచించింది లేదు. కాని ఇప్పుడు ఆ ఊరినుంచి తిరిగొచ్చాక, ఎక్కడ పచ్చదనం కనబడ్డా నేనొక పిట్టగా మారి అక్కడ వాలదాం అనిపించేది. ఆకాశంలో ఋతుపవనమేఘాల్ని ఎంతసేపేనా అలా చూస్తూ ఉండిపోవాలని పించేది. రాత్రి పూట రేడియోలో పాటలు వినబడుతుంటే నేను ఆ ఊళ్ళో ఆరుబయట నులకమంచం మీద వెల్లకిలా పడుకుని నక్షత్రాల్ని లెక్కపెడుతున్నట్టు ఊహించుకునేదాన్ని.

ఇలా కొన్ని రోజులు గడిచాయి. అప్పటికే స్కూళ్ళు తెరిచారు. తొలకరి చిరుజల్లు ఉండీ ఉండీ పట్టణం మీద సంతోషాన్ని చిలకరిస్తూ పోతుండేది. ఒకరోజు నాన్న నాతో 'నువ్వేం చేద్దామనుకుంటున్నావు?' అనడిగాడు.

అప్పటిదాకా నాకు నా భవిష్యత్తు గురించిన ఆలోచననే లేదు. పోస్టు గ్రాడ్యుయేషను చెయ్యాలంటే అప్పట్లో యూనివెర్సిటీకి వెళ్ళి చదువుకోవడమొక్కటే మార్గం. కాని నన్ను

హాస్టల్లో పెట్టి చదివించే స్తోమతు నాన్నకి లేదని నేను గ్రాడ్యుయేషను అయిపోగానే గ్రహించాను. నన్ను సివిలు సర్వీసు పరీక్షలకి ప్రిపేరవమని డా.మిశ్రా చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. నాకు అంత పెద్ద ఆశలేదు. అది సాధ్యం కాగలదన్న నమ్మకం కూడా లేదు. అసలు ప్రొఫెసర్ సేన్‌గుప్తా, డా.మిశ్రా నన్ను అంత బ్రైట్ స్టూడెంటుగా ఎందుకు భావించారో కూడా నాకు తెలియదు. ఏ రకంగా చూసినా నేను యావరేజి స్టూడెంటుని. నా శక్తిసామర్థ్యాలు ఏ పాటివో నాకు తెలుసు.

ఆ ప్రశ్న అడిగినప్పుడు నాన్న మనసులో ఉన్న ఉద్దేశమేమిటో నాకు ఆ తర్వాత మరికొన్ని రోజులకి గాని తెలియలేదు. కాని అప్పుడు నాన్న నన్ను ఏం చేద్దామను కుంటున్నావు అని అడిగినప్పుడు, నేను ఏదో ఒకటి చెయ్యాలనీ, ఇంట్లో ఖాళీగా కాలం గడపడం సరికాదనీ అనిపించింది. కాని ఏదైనా ఉద్యోగం చెయ్యాలంటే వెంటనే ఎవరిస్తారు? అదీ ఒక గ్రాడ్యుయేటుకి? ఆలోచించగా బాంకు పరీక్షలు రాయడం ఒక అవకాశంగా కనిపించింది. బిఎస్‌ఆర్‌బి ప్రకటనలు చూడటం మొదలుపెట్టాను. కానీ అవి కూడా మనం ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు పెట్టే పరీక్షలు కావు కదా. వాటికి కూడా ఒక కాలెండరు ఉంటుంది.

ఆ ఆలోచనల మధ్య ఒకరోజు నేను ఆ ఊళ్ళో చదువుకున్న హైస్కూలుకి వెళ్ళాను. అది సెయింటు థెరేసా మిషనరి స్కూలు. ఆ స్కూలుకి ఎందుకు వెళ్లానో గుర్తులేదు. బహుశా అక్కడ ఆ ఊళ్ళో రామకోవెలలో స్కూలు నడిచినప్పటి జ్ఞాపకాలు నన్ను మళ్ళా ఏదో స్కూలుకి పోయి చూడాలనిపించేట్టు చేసి ఉండవచ్చు. ఆ ప్రిన్సిపాలు సిస్టర్ ధన్య మాకు హైస్కూల్లో ఇంగ్లిషు చెప్పేది. ఆమె నన్ను చూడగానే గుర్తుపట్టింది. ఇంకా అడ్మిషన్ల హడావిడి నడుస్తున్నా కూడా ఆమె నన్ను కూచోబెట్టి మాట్లాడింది. మాటల మధ్యలో తాము ఒక కొత్త బ్రాంచి తెరుస్తున్నామనీ దానికి టీచర్లకోసం వెతుకుతున్నామనీ చెప్పి 'నువ్వు బియిడి చేసావా?' అనడిగింది.

చెయ్యలేదని చెప్పాను.

'ఎందుకని? డిగ్రీ లాస్టియరే కదా అయ్యింది. మరి ఈ ఏడాదంతా ఏం చేసావు?' అనడిగింది.

నేను నాకు దొరికిన అసైన్మెంటు గురించి చెప్పాను. ఆమెకి అదంతా అర్థమయినట్టు లేదు గాని, కలకత్తా యూనివెర్సిటీ ప్రొఫెసరు, జియాలజీ, ఉత్కళ్ యూనివెర్సిటీ, ఆంత్రొపాలజీ లాంటి మాటలు ఆమెని కొంత ఆశ్చర్యానికి గురిచేసాయి.

'అంత పెద్దవాళ్ళతో నువ్వు పనిచేసావా? రియల్లీ!' అంది నోరంతా తెరిచి.

'ప్లీజ్ కమ్ టుమారో. మీన్ వైల్ ఐ విల్ టాక్ టు ఫాదర్ దేవసహాయం' అని అంది.

ఆ మర్నాడు నేను ఇంటర్వ్యూకి వెళ్తున్నట్టే ఆ స్కూలుకి వెళ్ళాను. అప్పటికి ఫాదర్ దేవసహాయం కూడా అక్కడే ఉన్నారు. నేను ఆయన్ని చూడటం అదే మొదటిసారీ, చివరిసారీ కూడా. కాని పేరుకి తగ్గట్టే ఆయన్నుంచి నాకు సకాలంలో సరైన సాయం అందింది. తాము కొత్తగా తెరవబోతున్న లిటిల్ ఏంజెల్స్ ఇంగ్లిష్ మీడియం కాన్వెంటులో అన్ ట్రైన్డు టీచరుగా నాకు ఆ రోజే అపాయింటుమెంటు ఆర్డరు ఇచ్చేసారు. నేను గనక తొందరలో బియిడి చేసేటట్టయితే ట్రైన్డుటీచరుగా తీసుకుంటామనీ, రాబోయే రోజుల్లో పర్మనెంటు చేసే అవకాశం ఉంటుందనీ కూడా చెప్పారు. ఆ మర్నాడే నన్ను స్కూల్లో రిపోర్టు చెయ్యమని చెప్పారు.

ఊహించని మరొక సంతోషం ఆ స్కూలు కూడా మా ఏరియాలోనే ఉండటం. మా ఇంటినుంచి ఇరవై నిమిషాల నడక.

ఆ స్కూల్లో టీచరుగా జాయినింగు రిపోర్టు ఇచ్చినప్పుడు నాకు చాలా సంతోషం కలిగింది. జీతం ఎంతిస్తారన్న ప్రశ్న అడగాలని కూడా అనిపించలేదు. నాకు రెండవ తరగతి అప్పగించారు. పొద్దున్నే హాజరుపట్టీ చేతుల్లోకి తీసుకుని, పిల్లల పేర్లు ఒక్కొక్కరివీ చదవడం మొదలుపెట్టగానే నాకు వెంటనే ఆ రామకోవెల స్కూలు గుర్తొచ్చింది.

నా అరవై ఏళ్ళ జీవితంలో నేను కొన్ని అద్భుతాలు చూడకపోలేదు. కొన్ని అదృష్టాలు కూడా నా తలుపు తట్టకపోలేదు. కాని నేను చూసిన అద్భుతాల్లోకెల్లా గొప్ప అద్భుతం ఏమిటి అని అడిగితే రుటీను అని చెప్తాను. దానికి దేన్నైనా మరిపించగల శక్తి ఉంది. దేన్నైనా తనలోకి జీర్ణంచేసుకోగల సామర్థ్యం ఉంది. అందులోనూ నీకు ఏదో ఒక ఉద్యోగం– చిన్నదో, పెద్దదో ఉండి, దానికొక నిర్దిష్టమైన పని గంటలు అంటూ ఉంటే అది కొన్ని రోజుల్లోనే నిన్ను నువ్వు గుర్తుపట్టలేనట్టుగా మార్చెయ్యగలదు. గానుగెద్దు జీవితమనీ, ఎంతసేపూ, తిరిగిన దారినే తిరుగుతూ, జీవితంలో కొత్త అందాలూ, ఆనందాలూ చూడలేకపోతున్నారనీ– అటువంటి జీవితాల్ని ఎవరేనా ఎద్దేవా చెయ్యవచ్చు గాక, కాని, రోజువారీ జీవితంలో ఒక శానిటీ ఉందనీ, గొప్ప స్వస్థత ఉందనీ మాత్రం మర్చిపోకూడదు. ఆ పనిని మరింత ఉత్సాహపూరితం, మరింత ఉజ్వలం చేసుకోవడం ఎలా అన్నది ఆ తర్వాత సంగతి.

నేను ఆ స్కూల్లో టీచరుగా చేరి రెండుమూడు వారాలు గడిచేటప్పటికే, అంటే మిడ్ జూలై కల్లా తక్కినవన్నీ మర్చిపోయాను. పొద్దున్నే లేవడం, తొందరతొందరగా తయారవడం, బ్రేక్ ఫాస్టు చేసి, లంచిబాక్సు కట్టుకోవడం, ఎనిమిదింటికల్లా స్కూల్లో ఉండటం, రోజంతా పిల్లల్తో గడిపేక సాయంకాలం అయిదింటికి ఇంటికి రావడం, సాయంకాలం టీ, కొంత సేపటికి స్నానం, డిన్నరూ, నిద్రా. అలాంటి రుటీనుతో ఆ పట్టణంలో, ఆ ఇంట్లో వెయ్యేళ్ళు కూడా సునాయాసంగా గడిపెయ్యగలిగి ఉండేదాన్ని.

ఆ వానాకాలంలో నేను అన్నిటికన్నా ముందు మర్చిపోయింది ఆ వెన్నెలరాత్రుల్ని, ఆ వేసవిని, ఆ హేమంత, శిశిర ఋతువుల్ని, ఆ పక్షి కూజితాల్ని, ఆ సామూహిక సందర్భాల్ని. ఆ అనుభవాలు నెమ్మదిగా జ్ఞాపకాలుగా మారి, అవి కూడా మనస్సముద్రంలో ఎక్కడికో అడుక్కి చేరిపోయేయి. ఆగస్టు పదిహేను గడిచేటప్పటికి నేను పూర్తి ఉద్యోగిగా మారిపోయాను. రోజంతా నిల్చుండి పాఠాలు చెప్పిన అలసటకి రాత్రి నడుం వాల్చగానే కళ్ళు వెంటనే మూతలు పడిపోయేవి. తెల్లవారి మెలకువ వస్తూనే త్వరత్వరగా తయారవ్వాలనే తొందరలో మరేమీ గుర్తొచ్చేది కాదు.

తాను ఎంబిబిఎస్ చేసిన కొత్తలో డాక్టరు కొన్నాళ్ళు గవర్నమెంటులో కాంట్రాక్టు మెడికలు ఆఫీసరుగా పనిచేసాడు. ఆ అనుభవం మీంచి అనేవాడు 'నువ్వు ఎన్ని అందమైన ప్రదేశాలకు వెళ్ళు, హిమాలయాలకు వెళ్ళు, వాలీ ఆఫ్ ఫ్లవర్సుకి వెళ్ళు. కాని ఎక్కడికెళ్ళినా, తిరిగొచ్చి నీ బాసుని చూస్తే తప్ప నీకు మనశ్శాంతి ఉండదు' అని. అమేయసౌందర్యాలూ, అలౌకికమైన ఆనందాలూ ఈ జీవితం తాలూకు సాధారణ గుణాలు కావనీ, నీ రోజువారీ జీవితమే– కొంచెం హడావిడి, కొంచెం కంగారు, కొంచెం తొందర, కొంచెం టెన్షన్తో కూడుకుని ఉండే నీ డెయిలీ లైఫు మాత్రమే నీ అసలైన జీవితమనీ మనం ప్రతి ఒక్కరం లోపల్లోపల బలంగా నమ్ముతూ ఉంటామనుకుంటాను.

ఆ స్కూల్లో టీచరుగా చేరినతర్వాత, అలాంటి స్కూల్లో స్టూడెంటుగా గడిపిన జీవితానికీ, టీచరుగా గడిపిన జీవితానికీ మధ్య నాకు ఆట్టే తేడా కనిపించేదికాదు. అప్పుడు బల్లకి ముందు ఉండేదాన్ని, ఇప్పుడు బల్లకి వెనకాల ఉంటున్నాను. అప్పుడు కూచొని ఉండేదాన్ని, ఇప్పుడు నిలబడి ఉంటున్నాను. కానీ అప్పుడూ అదే తొందర, హోమ్‌వర్కు బరువు, మిస్ ఏమంటుందో అని భయం, ఎగ్జామ్సులో మార్కులు ఎలా వస్తాయో అని టెన్షను. ఇప్పుడూ అదే తొందర, కాకపోతే అప్పుడు నాదొకటే హోమ్ వర్కు. ఇప్పుడు నలభై మంది పిల్లల హోమ్‌వర్కు. ఇప్పుడూ సిస్టర్ ఏమంటుందో అని భయం. ఎగ్జామ్సులో పిల్లలకి మార్కులు ఎలా వస్తాయో అని టెన్షను. అప్పుడు నాకొక్కదానికీ

మంచిమార్కులొస్తే సరిపోయేది, ఇప్పుడు నలభై మందికీ మంచి మార్కులొస్తాయో రావో అని కంగారు.

మనం మరీ చిన్నప్పుడే బళ్ళో చేరకుండా ఉండి ఉంటే, అసలు మన జీవితాల్లో విద్యార్థి జీవితమనేదే లేకపోతే ఎలా ఉండి ఉండేవాళ్లమో మనకు తెలీదు. కాని స్టూడెంటు లైఫు అన్నిటికన్నా ముందు మనల్ని ఒక రుటీనుకి అలవాటు పడేలాగా చేస్తుందని మాత్రం చెప్పగలను. ఎవరో ఒకరు ఏదో ఒకటి చెప్తూ ఉంటే వినడానికీ, ఏదో ఒక పని ఇస్తూ ఉంటే విధేయంగా చెయ్యడానికీ, చేసింది చేసామని రిపోర్టు చెయ్యడానికీ, అలా రిపోర్టు చేసాక వాళ్ళు మన పెర్ఫార్మెన్సుకి ఎన్ని మార్కులు ఇస్తారో అని టెన్షనుగా ఎదురుచూడ్డానికీ అలవాటుచేస్తుంది. కాబట్టి నేను కాలేజి వదిలిపెట్టాక మళ్ళా కొత్తగా కాన్వెంటులో చేరినట్టే ఉండింది నాకు.

అలాంటి రోజుల్లో, ఆగస్టు నెలచివరలో, ఒక ఆదివారం, నేను ముందుగదిలో కూచుని పిల్లల నోటుబుక్కులు కరెక్షన్లు చేస్తూ ఉండగా కాలింగ్‌బెల్లు చప్పుడయింది. లేచి వెళ్లి తలుపు తీసాను. ఎదురుగా ఇద్దరు యువకులు నిలబడ్డారు. ఇద్దరూ పాతికేళ్ళకి అటూ ఇటూ వయసు ఉన్నవాళ్ళు. ఒక యువకుడు తెల్లగా, మరొకతను చామనచాయ లోనూ ఉన్నారు. ఆ చామనచాయ యువకుడు నీటుగా ఇన్‌షర్టు చేసుకుని ఉన్నాడు.

'ఉండండి, నాన్నగార్ని పిలుస్తాను' అని వెనక్కి తిరిగాను. వాళ్లు మా నాన్నగారికోసం వచ్చి ఉంటారన్న ఉద్దేశంతో. కాని అప్పటికే మా నాన్నకూడా వీథిగదిలో అడుగుపెట్టాడు.

'రా, శ్రీనివాస్' అని మా నాన్న ఆ ఇద్దరిలో ఒకతణ్ణి పలకరిస్తో, ఆ పక్కనున్నతని కేసి చూసాడు.

ఆ శ్రీనివాస్ అనే యువకుడు చాలా మామూలుగా డ్రెస్సు చేసుకుని ఉన్నాడు. బెల్‌బాటం పాంటు మీద ప్లెయిన్‌కలరు హాఫ్‌హాండ్సు షర్టు. తను చెప్పులు విడిచి లోపలకి అడుగుపెడుతూ, 'ఇతను శివశంకర్ , మా కజిన్' అని అన్నాడు. ఆ శివశంకర్ గుమ్మం బయట తన షూసు విప్పి ఒద్దిగ్గా ఒక పక్కనపెట్టి లోపలకి ప్రవేశించి మా నాన్నకీ, నాకూ కూడా నమస్కారం చేసాడు.

నేను లోపలకి వెళ్ళబోతూండగా, నాన్న వాళ్ళని కూచోమని చెప్తూ, 'విమలా, నువ్వు కూడా కూచో' అన్నాడు.

అప్పుడు ఆ శ్రీనివాస్‌ని పరిచయం చేసాడు. ఆ యువకుడు ఎంబిబిఎస్ పూర్తి చేసి, పాండిచ్చేరిలో జనరల్ మెడిసినులో పిజి థర్డు యియరులో ఉన్నాడు. వాళ్ల నాన్నగారు

ఒక హైస్కూలు హెడ్ మాష్టరు. నాన్నకి చాలాకాలంగా తెలిసిన వ్యక్తి. ఆ డాక్టర్ శ్రీనివాస్ చూడటానికి ప్రసన్నంగా కనిపిస్తున్నాడు. అతను చిరునవ్వితే మరింత సౌమ్యంగా కనిపిస్తున్నాడు. అతనితో వచ్చిన ఆ శివశంకర్ అనే యువకుడు చాలా చలాకీగానూ, ఉత్సాహంగానూ కనిపిస్తున్నాడు.

నన్ను కూడా వాళ్ళకి పరిచయం చేసాడు. లిటిల్ ఏంజెల్స్ స్కూల్లో టీచరు అని చెప్తూ, నా ఫీల్డువర్కు గురించి కూడా ప్రస్తావించాడు. ఆ వచ్చినవాళ్ళిద్దర్నీ ఫీల్డువర్కు అన్న మాట ఎక్కువ ఆకర్షించింది. చాలాసేపు వాళ్ళు నన్ను జియాలజీ గురించీ, యాంత్రొపాలజీ గురించీ ఏవేవో ప్రశ్నలు అడుగుతూ ఉన్నారు.

'మీరు పెద్ద స్కాలరన్న మాట. ఈ విషయాలేవీ మాకు తెలీనే తెలీవు' అన్నాడు ఆ శివశంకర్ అనే యువకుడు. అతను ఎలక్ట్రికలు ఇంజనీరింగు పూర్తిచేసి ఎలక్ట్రిసిటీ బోర్డులో అసిస్టెంటు ఇంజనీరుగా కిందటేడాదే ఉద్యోగంలో చేరాడు.

ఇంతలో మా అమ్మ వచ్చి 'శ్రీనివాస్ బావున్నారా? కాఫీ ఇవ్వనా?' అని అడిగింది. అంటే అతను అమ్మకి కూడా తెలుసన్నమాట అనుకున్నాను. బహుశా నేను ఊళ్ళో లేనప్పుడు అతను మా వాళ్లకి పరిచయమై ఉంటాడు.

వాళ్లతో మాట్లాడుతుండగా టైము తెలియలేదు. మధ్యాహ్నం లంచిటైము దాకా మా కబుర్లు నడుస్తుండటంతో, అమ్మ వాళ్ళని భోజనం చేసి వెళ్ళమంది. లంచిలో కూడా మేము కబుర్లే ఎక్కువ భోంచేసాం. భోజనాలవగానే వాళ్ళు సెలవుతీసుకుని వెళ్ళిపోయిన తర్వాత నేను మళ్ళా పిల్లల నోటుబుక్కులు ముందేసుకుని కూచున్నాను.

నాన్న చెయ్యి తుడుచుకుంటూ వచ్చి నా ఎదురుగుండా సోఫాలో కూచుంటూ 'హుషారైన కుర్రాళ్లు. ఆ రెండో అబ్బాయి కూడా చూడబోతే మంచివాడిలానే కనిపిస్తున్నాడు. ఏమంటావు?' అనడిగాడు.

❋

26

నాన్న ఆ ప్రశ్న ఊరికే అడగలేదనీ, ఆ రెండో పిల్లవాడి గురించి కూడా ఆలోచిస్తూనే ఉన్నాడనీ, ఆ తర్వాత అతని గురించి మరింత వాకబు చేసాడనీ నెమ్మదిగా తెలిసింది. రెండు మూడు వారాల తర్వాత అమ్మనీ, నన్నూ, రజనీని కూర్చోబెట్టి తన మనసులో మాట చెప్పాడు. డా.శ్రీనివాస్ తల్లిదండ్రుల్తో మాట్లాడేననీ, వాళ్ళు నన్ను తమ కోడలిగా చేసుకోడానికి ఇష్టపడుతున్నారనీ, అలాగే ఆ శివశంకర్ అనే పిల్లవాడితో రజనికి పెళ్ళి చేస్తే బాగుంటుందని కూడా అనుకుంటున్నాననీ చెప్పాడు. ఈ రెండు ప్రతిపాదనలూ డా.శ్రీనివాస్‌తో ముందు ప్రస్తావించాననీ, అతను శివశంకర్ చాలామంచివాడనీ, తాను వాళ్ళ తల్లిదండ్రుల్తో మాట్లాడతాననీ చెప్పాడట. నిజానికి శివశంకర్‌తో సంబంధం కలుపుకుంటే బాగుంటుందన్న సూచన తనదేనని డాక్టరు ఆ తర్వాత రోజుల్లో చెప్పాడు. మాతో ఈ విషయాలు చెప్పిన రోజో ఆ ముందురోజో నాన్న శివశంకర్ తల్లిదండ్రుల్ని వెళ్ళి కలిసినట్టున్నాడు, వాళ్ళనుంచి కూడా అంగీకారం దొరికినట్టుంది. నా పెళ్ళి గురించి మరోలా ఆలోచించడానికీ, అభ్యంతరం చెప్పడానికీ నాకేమీ కారణం కనిపించలేదుగాని, రజనీకి అప్పుడే పెళ్ళంటే మాత్రం నాకేమంత సమంజసంగా అనిపించలేదు. అది ఇప్పుడే డిగ్రీ ఫైనలియర్లో ఉంది. నేనెలాగూ పిజి చెయ్యలేకపోయాను, కనీసం అదైనా ఎమ్మే చదువుకుంటే బాగుణ్ణు అనిపించింది. కానీ, నాన్నతో నా భావాలు ఎలా వ్యక్తం చేయాలో తెలీలేదు.

'పెళ్ళాయ్యాక రజని చదువుకుంటానంటే చదివిస్తారా?' అనడిగాను. నా మాటలకి వంతగా రజని తను కూడా ఏదో ఒక మాట మాట్లాడితే బాగుణ్ణనుకున్నాను. కాని అది ఏమీ మాట్లాడలేదు. అంత తొందరగా పెళ్ళంటే దానికేమీ అభ్యంతరం లేదా అని కూడా

అనుమానమొచ్చింది. మా అమ్మ మాత్రం నాన్న ఆలోచనని సమర్థిస్తూ, మాట్లాడుకోవలసిన మాటలేవో వీలైనంత తొందరగా మాట్లాడుకుంటే బాగుటుంది కదా అంది.

ఎనభైల మొదట్లో పట్టణాలు ఇంకా పెద్ద గ్రామాల్లానే ఉండేవి, ఆలోచనల్లోనూ, జీవితభయాల్లోనూ, జాగ్రత్తల్లోనూ కూడా. ఇద్దరు ఆడపిల్లలు ఇంట్లో ఉన్న తల్లిదండ్రులకి ఆ పిల్లలిద్దరికీ ఎంత తొందరగా పెళ్ళిచేస్తామా అన్న ఆలోచన తప్ప మరేదీ పట్టదని నాకు తొందర్లోనే అర్థమయింది. ఆ యువకులిద్దరూ మా ఇంటికి వచ్చి వెళ్ళిన నెల్లాళ్ళదాకా రోజూ రాత్రి మా అమ్మా, నాన్నా ఆ సంబంధాల గురించే చాలాసేపు మాట్లాడుకునేవారు. రాత్రి భోజనాలయ్యేక గంటసేపేనా వాళ్ళ మధ్య శిఖరాగ్రచర్చలు నడుస్తూండేవి. పెద్దమ్మాయి వట్టి గ్రాడ్యుయేటు మాత్రమే, రెండో అమ్మాయి చదువింకా పూర్తి కాలేదు. కాని ఆ పిల్లల్లో ఒకరు మెడిసిను పిజి చదువుతున్నాడు, మరొకరు ఇంజనీరు, గవర్నమెంటు జాబులో ఉన్నాడు. నాన్న ఆర్థిక స్తోమతు పెద్ద కట్నకానుకలు ఇవ్వగలిగేది కాదు. ఏ విధంగా చూసినా మాకు ఆ సంబంధాలు కుదురుతాయి అనుకోవడం అత్యాశ అనే మా తల్లిదండ్రులు తీర్మానించుకున్నారు. ప్రతి రాత్రీ వాళ్ళు ఎంత సేపు మాట్లాడుకున్నా, చివరికి, 'ఇవి మనకి అందుబాటులో ఉన్నవి కావు' అనే మాటతో, ఆ వెనక ఒకటి రెండు నిట్టూర్పుల్తో, ఆ సంభాషణలు ముగిసిపోయి, ఆ గదుల్లో నిశ్శబ్దం వచ్చి చేరేది.

కాని ఎవరు చొరవచూపారో, ఏ దైవసహాయం మాకు తోడుగా నిలబడ్డాడో గాని, సెప్టెంబరు నెలాఖరుకల్లా ఆ యువకులిద్దరి కుటుంబాలూ కూడా మా నాన్న ప్రతిపాదనలకి అంగీకారం చెప్పారు. బహుశా, అదంతా డా.శ్రీనివాస్ చొరవవల్లనే అయి ఉంటుందని నాకిప్పటికీ నమ్మకం. ఒక మెడిసిను విద్యార్థి సాధారణంగా మరొక మెడిసిను విద్యార్థినే పెళ్ళి చేసుకోవాలనుకోవడం, పెళ్ళయ్యాక ఇద్దరూ కలిసి ఒక క్లినిక్కునో లేదా నర్సింగు హోమునో పెట్టుకోవడం రివాజు. కాని ఒక మెడికలు పిజి స్టూడెంటు నాలాంటి గ్రాడ్యుయేటు విద్యార్థిని పెళ్ళిచేసుకోడానికి ఎందుకు సుముఖత చూపించాడో నాకిప్పటికీ తెలియని విషయం. అప్పటికి అతను నన్నొక్కసారే చూసాడు. నాలో అతణ్ణి ఏమి ఆకర్షించిందో నా ఊహకి కూడా అందని విషయం. అతనితో నా పెళ్ళి నిశ్చయం కావడానికి నా అదృష్టం తప్ప మరొకటి కారణం కాదనే ఇప్పటికీ అనుకుంటూ ఉంటాను.

నా అదృష్టం అక్కడితో ఆగలేదు. పెళ్ళి మాటలు మాట్లాడుకునేటప్పుడు తానేమీ కట్నకానుకలు ఆశించడం లేదని డాక్టర్ శ్రీనివాస్ చెప్పినప్పుడు మా అమ్మా నాన్నా తమ చెవుల్ని తామే నమ్మలేకపోయారు. నలభై ఏళ్ళకింద ఇది మా అమ్మానాన్నలకే కాదు, ఏ

మధ్యతరగతి కుటుంబానికైనా కూడా ఊహించలేని విషయమే. మా చెల్లెలి విషయంలో మాత్రం ఏవో కట్నకానుకల మాటలు జరిగినట్టున్నాయి. అదే మోయలేనంత బాధ్యత మా నాన్నకి.

డా.శ్రీనివాస్ పాండిచ్చేరిలో ఉండగా అతనితో మా నాన్న ఎప్పుడు మాట్లాడేవాడో, ఎలా మాట్లాడేవాడో నాకు అర్థం కాలేదు. వాళ్ళు ఉత్తరాలు కూడా ఏమీ పెద్దగా రాసుకోలేదు. బహుశా శివశంకర్ ద్వారా ఈ మాటలన్నీ నడిచి ఉంటాయి. ఆ మధ్యలో మా నాన్న ఒకసారో, రెండుసార్లో పాండిచ్చేరి వెళ్ళి వచ్చినట్టు మాత్రం నాకు గుర్తుంది.

మాకు స్కూలుకి దసరా సెలవులు ఇచ్చిన తరువాత ఒకసారి మేమంతా పాండిచ్చేరి వెళ్ళాం. అది డా.శ్రీనివాస్ ఆహ్వానం మీదనే అని తర్వాత తెలిసింది. మేమక్కడ మూడు రోజులున్నాం. ఆ మూడు రోజులూ శివశంకర్ కూడా మాతో పాటు ఉన్నాడు. మేము హొటల్లో ఉన్నాం. శ్రీనివాస్ హాస్టల్లో ఉండేవాడు. ఆ మూడురోజులూ మమ్మల్ని పాండిచ్చేరి అంతా తిప్పి చూపించాడు. అదే మొదటిసారి అతనూ, నేనూ ఒకరినొకరం దగ్గరగా చూసుకోవడం, మాట్లాడుకోవడం. మా చెల్లెలికీ, శివశంకర్‌కీ కలిసి కబుర్లు చెప్పుకునే అవకాశం అదే మొదటిసారి.

పాండిచ్చేరిలో మేము గడిపిన ఆ మూడురోజుల్లోనూ నా గుండె కొట్టుకోవడమే నాకు ఎక్కువ వినిపిస్తూ ఉంది. మా నాన్న కోరుకున్నట్టు ఆ రెండు సంబంధాలూ నిశ్చయం కావాలనీ, మా పెళ్ళిళ్ళు ఏ అడ్డంకీ లేకుండా జరగాలనీ మా తల్లిదండ్రులకన్నా నాకే ఎక్కువ ఆత్రుత మొదలయ్యింది. అందులోనూ నాకన్నా కూడా మా చెల్లెలి పెళ్ళి గురించి నాలో ఆందోళన ఎక్కువ అవుతూ ఉండింది. నా పెళ్ళి కూడా అయితే రజని పెళ్ళికి మరింకేమీ అడ్డు ఉండదన్న ఆలోచన వల్ల అనుకుంటాను, నా పెళ్ళి కూడా నిర్విఘ్నంగా జరగాలని కోరుకోవడం మొదలుపెట్టాను. ఇదంతా ఇప్పుడు చెప్తుంటే, అరవైల్లో వచ్చిన తెలుగు సినిమా కథలాగా వినిపిస్తూ ఉండవచ్చు. కాని ఇందులో త్యాగం అనే మాటనే లేదు. బహుశా ఏదన్నా ఒక్క మాట మాత్రమే చెప్పు అంటే అదృష్టం అనే మాట తప్ప మరే మాటా నాకు స్ఫురించడం లేదు. కాని ఆందోళన ఉండింది. ఉంటుంది కూడా. ఎందుకంటే, ఒకటి పొందడానికి తగిన అర్హతలో, యోగ్యతలో నీకు లేవని నువ్వు నమ్ముతున్నప్పుడు, అది నీ ఇంటితలుపు తడుతున్నప్పుడు, అది తప్పకుండా నీ స్వంతం కాబోతున్నదని రూఢి అవుతూ ఉన్నప్పుడు, అన్నిటికన్నా ముందు కలిగే అనుభూతి సంతోషం కాదు, ఆందోళననే. 'ఇది నిజమేనా?', 'దేవుడా, ఇది అనుకున్నట్టే జరుగుతుందా?', 'ఏ ఆటంకాలూ రావు కదా?', 'మధ్యలో ఏమీ గొడవలు జరగవు

కదా' లాంటి ఆలోచనలు నీ ప్రమేయం లేకుండానే కలగడం మొదలవుతాయి. చివరికి ఆ ఆలోచనలూ, భయాలూ ఎంత దూరం పోతాయంటే, మా కుటుంబాల్లో ఎవరికీ యాక్సిడెంట్లు కావు కదా, ఎవరూ హటాత్తుగా సిక్ అయిపోరు కదా అని కూడా అనుకుంటూ ఉండేదాన్ని.

ఉద్యోగం, పెళ్ళి– ఈ రెండింటి గురించీ మనకి పెద్దగా ఏమీ ఊహలూ, కలలూ ఉండకపోవచ్చుగాని, తీరా అవి మనకి అందుతున్నాయనే సూచనలు మొదలయ్యాక మాత్రం చెప్పలేనంత టెన్షను మొదలవుతుంది. పిల్లల విషయం కూడా అంతే. వాళ్లు పసితనంలో ఉన్నప్పుడూ, పెరిగి పెద్దవాళ్లవుతున్నప్పుడూ మనకేమీ భయాలుండవుగాని, ఒకసారి వాళ్ల కెరీరూ, పెళ్ళీ గురించిన ఆలోచనలు మొదలయ్యాక, మరే ఆలోచనలకీ మన మనసులో చోటుమిగలదు.

బహుశా మనిషికి కలిగే సంతోషాలన్నిటిలోనూ పెళ్ళివల్ల లభించేది గొప్ప సంతోషం అవునో కాదో నేను చెప్పలేనుగానీ, పెళ్ళికి సంబంధించిన ప్రతి చిన్న విషయం కూడా చెప్పలేనంత ఆందోళనకలిగిస్తుందని మాత్రం చెప్పగలను. అది మన వివాహమే కానక్కర్లేదు. మరొకరి పెళ్ళి అయినా కూడా, అందులో మన పాత్ర ఎంత స్వల్పాతి స్వల్పమైనా కూడా, పెళ్ళి కలిగించగల ఆందోళన అంతా ఇంతా కాదు.

ఒకసారి మాకు తెలిసినవాళ్ళ ఇంట్లో పెళ్ళికి నేనూ, డాక్టర్ వెళ్ళాం. పెళ్ళయ్యాక మేము బయటికి వచ్చాం. డాక్టర్ పార్కింగు లోంచి కారు బయటికి తీసి కల్యాణమంటపం ముందుకి వచ్చాడు. నేను కారు ఎక్కబోతూ ఉన్నాను. ఈలోపు పెళ్లికూతురి తండ్రి డాక్టరుని కారు ఆపమని దగ్గరకొచ్చి, 'మా కారు డ్రైవరు ఫోను ఎత్తడం లేదు, ఈ దంపతులిద్దర్నీ పక్క వీథిలో ఉన్న విడిది దగ్గర డ్రాప్ చేసి రాగలరా' అని అడిగాడు. డాక్టరు సంతోషంగా వాళ్ళని ఎక్కించుకుని, పక్క వీథిలో డ్రాప్ చేసి తిరిగి వచ్చాడు. అలా డ్రాప్ చేసి రావడానికి మూడు నాలుగు నిమిషాలు పట్టి ఉంటుంది. అంతసేపూ నేను ఆ ఫంక్షను హాలు ఎదటనే ఉన్నానుగాని చెప్పలేనంత ఆందోళనకి గురయ్యాను. వాళ్ళని డాక్టరు కారులో జాగ్రత్తగా తీసుకువెళ్తున్నాడా లేదా మధ్యలో ఏ టర్నింగు దగ్గరో ఏమీ యాక్సిడెంటు కాలేదు కదా, అసలు ఆ సమయంలో మేమెందుకు వాళ్ళకి కనబడాలి, వాళ్ళ డ్రైవరు ఫోను ఎందుకు ఎత్తకుండా పోవాలి, భగవంతుడా, ఏమీ జరగదు కదా– ఎన్ని ఆలోచనలు, ఎంత టెన్షను పడ్డానో ఆ దేవుడికే తెలియాలి.

బహుశా ఇంకెవరూ ఇలా ఆలోచించరేమో, ఇది నా బలహీనత మాత్రమేనేమో అని కూడా అనుకుంటూ ఉంటాను. కాని ఆ రోజుల్లో, ఇంకా మా పెళ్ళిళ్ళకి నిశ్చితార్థం

జరక్కముందు, ఆ రెండుమూడు నెలల పాటు నేను అనుభవించిన ఆందోళన అంతా ఇంతా కాదు.

అందుకని పాండిచ్చేరిలో గడిపిన ఆ మూడురోజుల్లోనూ నిజంగా నా మనసు మనసులో లేదు. ఏదో బస్సులో ప్రయాణిస్తూ ఉంటే, ఆ కుదుపుల మధ్యలో అందమైన కల కంటూ ఉన్నట్టుంది. కల అందమైందే, గుర్తుండిపోతుంది, కాని ఆ కుదుపులు కూడా గుర్తుండిపోతాయి. ఆ తర్వాత మళ్ళా మళ్ళా ఆ రోజుల్ని గుర్తుచేసుకోబోతే నా కళ్ళముందు ఆ నీలసముద్రమూ, దానిపైన పడే శుభ్రసూర్యకాంతీ తప్ప మరేవీ గుర్తు రావు. అప్పుడే శ్రీనివాస్ మమ్మల్ని అరోవిల్లి కూడా తీసుకువెళ్ళాడు. అక్కడేవో చూపించాడు. కాని అక్కడ ఏదో మెడిటేషను హాల్లో కూచున్నప్పుడు నిశ్శబ్దంగా మమ్మల్ని అల్లుకున్న అగరుధూపం తప్ప మరేమీ గుర్తులేదు.

విజయదశమినాడు రెండు పెళ్ళిళ్ళకీ నిశ్చితార్థాలు జరిగాయి. అవి పెద్ద ఎత్తున కాకుండా సింపులుగానే జరపమనే రెండు కుటుంబాల వాళ్ళూ మా నాన్నకి చెప్పడం ఆయనకి గొప్ప ఊరట. నిశ్చితార్థం రోజున డాక్టరు నా వేలికి ఉంగరం తొడిగాడు. దానిమీద 'వి' అనే అక్షరం చెక్కి ఉంది.

డాక్టరు పిజి థర్డు యియరులో ఉన్నాడు కాబట్టి, ఆ మరుసటి ఏడాది చదువు పూర్తవగానే శ్రావణమాసంలో పెళ్ళికి ముహూర్తం నిర్ణయించారు. పెద్దమ్మాయి పెళ్ళయ్యే లోపు చిన్నమ్మాయికి పెళ్ళి చేయలేరు కాబట్టి, ఆ పెళ్ళి కూడా శ్రావణమాసంలోనే ఒకే వేదిక మీద చెయ్యడానికి మరో ముహూర్తం కూడా నిర్ణయించారు. శివశంకర్ తండ్రి ఇన్సూరెన్సులో డెవలప్‌మెంటు ఆఫీసరుగా పనిచేస్తున్నాడు. మాటకారి. కలుపుగోలు మనిషి. ఆయనకి శివశంకర్ కాక మరో అబ్బాయి, అమ్మాయి కూడా ఉన్నారు. వాళ్ళింకా చదువుల్లో ఉన్నారు. ఈ పెళ్ళిళ్ళు మా ఇంట్లోలానే ఆ రెండు కుటుంబాల్లో కూడా మొదటిసారిగా జరగబోయే వేడుకలు. మూడు కుటుంబాల్లోనూ కూడా ఆ నిశ్చితార్థం కొత్త బంధాల్ని అల్లడం మొదలుపెట్టింది. అందరిలోనూ కొత్త ఊహలు, కొత్త ఉద్వేగాలు.

కాని ఆ పెళ్ళిళ్ళు నిశ్చయం కావడం మా నాన్నకి ఎంత సంతోషాన్నిచ్చిందో, ఆ ముహూర్తం కోసం మరొక పదినెలల పాటు వేచి ఉండక తప్పదనే విషయం మరింత ఆందోళనకి గురిచేసింది. అన్నాళ్ళపాటు ఆయన తన ఆందోళనని ఎలా తట్టుకోగలిగేడో ఇప్పుడు తలుచుకుంటే ఊహకి అందడంలేదు.

కానీ ఆశ్చర్యంగా నా ఆందోళన మటుకు మాయమైపోయింది. మొదటిసారిగా డాక్టరు రూపం నా కళ్ళముందు స్పష్టంగా కనిపించడం మొదలుపెట్టింది. మొదటిసారి

అతను మా ఇంటికి వచ్చినప్పుడు నేను చూడగలిగిన సౌమ్యమైన ఆ చిరునవ్వు మళ్ళీ మళ్ళీ చూడాలనిపించడం మొదలుపెట్టింది. పాండిచ్చేరిలో అతను ఎన్నో సార్లు చిరునవ్వి ఉంటాడు, ఎన్నోసార్లు మృదువుగా ఏవో మాటలు మాటాడి ఉంటాడు, కాని ఆ రోజులనాటి ఆందోళన వల్ల అప్పుడు వాటికీ నాకూ మధ్య ఒక గాజుతెర ఉండింది.

ఇప్పట్లాగా మొబైళ్ళూ, వాట్సపులూ, వీడియో కాల్సూ లేని కాలం. దూరంలో ఉన్న మనిషితో మాట్లాడాలంటే ట్రంకాలు ఒక్కటే శరణ్యం. కాని ఒక పబ్లిక్ టెలిఫోను బూత్ దగ్గర నిలబడి గట్టిగా అరిస్తే తప్ప ఒకరిమాట ఒకరికి వినబడని రోజులు కూడా అవి. ఒకరినొకరు పలకరించుకోవాలంటే, మనసులో మాట చెప్పుకోవాలంటే ఉత్తరాలు రాసుకోవడమొక్కటే మార్గం. కాని ఒక ఉత్తరం రాయొచ్చన్న ఊహకే వొణికిపోయాన్నేను.

రెండునెలలట్లానే గడిచిపోయాయి. ఇప్పుడు స్కూలు నుంచి ఇంటికి రాగానే, ఎంత అలసటగా ఉన్నా వెంటనే నిద్రపట్టేది కాదు. కళ్ళుమూసుకోగానే ఇదీ అని స్పష్టంగా చెప్పలేని భావనలేవో తలపుల్ని ఆక్రమించేవి. కొంతసేపటికి మనసుకి తిమ్మిరి పట్టినట్టుండేది. పొద్దున్నే లేవగానే స్కూలుకి పరుగెత్తాలన్న తొందరతో పాటు నన్నెవరో తలుచుకుంటూ ఉన్నారన్న ఊహ కూడా మనసులో ఉదయించేది. ఆ వేళప్పుడు ఆ మనిషి ఇంకా నిద్రలేచి ఉంటాడా ఉండడా అనిపించేది.

మళ్ళా డాక్టతీబని చూడాలంటే సంక్రాంతి సెలవులదాకా వేచి ఉండకతప్పదని అనుకున్నానుగాని, ఒకరోజు సాయంకాలం ఇంటికొచ్చేటప్పటికి డాక్టర్ వీథిగదిలో ప్రత్యక్షమయ్యాడు. అతణ్ణి చూడగానే నా మోకాళ్ళలో వణుకు మొదలయ్యింది. ఇంట్లో అడుగుపెడుతూండగానే 'హలో మిస్! ఎలా ఉన్నారు?' అని నవ్వుతూ పలకరించాడు.

ఆ నవ్వులో సౌమ్యత ఉండే ఉంటుంది, కాని కళ్ళెత్తి చూడటానికి ధైర్యం చాల్లేదు. సిగ్గా? కాదనుకుంటాను. నా ఎదట ఉన్నది పురుషుడనే భావన కూడా అప్పుడు నాలో కలగలేదనే అనుకుంటాను. మరేమిటి? జీవితం నీ ఎదట నిల్చొందనీ, రానున్న నీ కాలమంతా ఆ అనుబంధానికే అంకితం కాబోతోందనీ ఏదో స్పష్టాస్పష్టంగా ఉండే ఎరుక. హటాత్తుగా నీ భవిష్యత్తు మీ ఇంటికొచ్చి, మీ వీథి గదిలో కూచుని, 'హలో మిస్' అని పలకరిస్తే, నువ్వు సోఫాలో కాలుమీద కాలు వేసుకుని కూచుని నిదానంగా మాట్లాడగలవా?

పెళ్ళి అనగానే ఒక కన్యమనసులో మొదట కలిగే భావన భయమే అనుకుంటాను. మనుషుల పట్ల కాదు, తెలియని ఒక అనిశ్చితి పట్ల భయం. ఒక అన్‌సర్టనిటి హటాత్తుగా

ముఖాముఖి ఎదురుపడ్డప్పుడు కలిగే భయం. ఒకవేళ ఆ యువకులిద్దరూ మా అక్కాచెల్లెళ్ళకి కాబోయే వరులుగా కాక, స్నేహితులుగానే పరిచయమై ఉంటే, బహుశా, ఆ స్నేహాన్ని నేను మరింత గాఢంగా లోపలకి తీసుకోగలిగి ఉండేదాన్నేమో. కాని ఆ రోజులంతటా, డాక్టరు నా తలపుల్లోకి వచ్చినా, నా ఎదట పడ్డా నా గుండె వేగంగా కొట్టుకోవడమే నాకు ఎక్కువ గుర్తుంది. బహుశా మా నాన్నతో కలిసి డాక్టర్ శ్రీనివాస్ మేము ఆ అన్‌సర్టనిటీని ఎదుర్కోడానికి మమ్మల్ని మానసికంగా నెమ్మదిగా సంసిద్ధుల్ని చేస్తూ వచ్చేడేమో అని ఇప్పుడనిపిస్తోంది.

ఎందుకంటే అప్పుడు డాక్టరు మా ఇంటికి వచ్చినప్పుడు క్రిస్మసు సెలవులకోసం వచ్చానని చెప్పినా, అది నాతో, మా ఇంట్లో వాళ్ళతో ఒక సాన్నిహిత్యాన్ని పెంచుకోడం కోసమే అని నాకు రెండు మూడు రోజులకే అర్థమయింది. ఆ రోజులన్నిటా అతను దాదాపు మా ఇంట్లోనే గడిపేవాడు. ఎక్కువ మా నాన్నతో మాట్లాడేవాడు. మా చెల్లెల్తో, తమ్ముడితో ఏదో ఒక సంభాషణ కలుపుతూ ఉండేవాడు. అప్పటికి మా తమ్ముడు ఇంజనీరింగులో చేరాడు. కాకినాడ జెఎన్‌టియులో సీటు దొరికింది. వాడు కూడా సెలవులంటూ ఇంటికి వచ్చాడు. డాక్టరు వాడితోనూ, రజనితోనూ ఇంగ్లిష్‌లో మాట్లాడే వాడు. ఒకరోజు రజనిని తన పుస్తకాలు, నోట్సులు చూపించమన్నాడు. వాటిల్లోంచి ఒక పుస్తకం తీసి ఆ టైటిలు పైకి చదివాడు.

'పారడైజ్ లాస్ట్, జాన్ మిల్టన్. ఈజ్ దిస్ ఆల్సో పార్ట్ ఆఫ్ యువర్ సిలబస్?' అనడిగాడు. 'యెస్. బట్ ఒన్లీ వన్ బుక్. బుక్ ఫోర్' అందిరజని. 'డు యు నో ద స్టోరీ? ఐ మీన్ ద థీమ్?' అనడిగాడు.

ఇప్పుడు ఆ పుస్తకం సారాంశం ఇంగ్లిషులో ఎక్కడ అప్పచెప్పమంటాడో అని రజని భయపడిందిగాని, అతను ఆ ప్రశ్నని మరి రెట్టించలేదు. రజని వాళ్ళ కాలేజి గురించీ, లెక్చెరర్ల గురించీ, క్లాస్మేట్ల గురించీ అడగడం మొదలుపెట్టాడు.

ఒక్కొక్కప్పుడు నేరుగా వంటింట్లోకి వెళ్ళిపోయేవాడు. అమ్మని పలకరించి ఏదో ఒక జోకు వేసేవాడు. బహుశా అతణ్ణి చూస్తే నాకన్నా కూడా అమ్మ ఎక్కువ నెర్వసుగా ఫీలయ్యేదేమో. అందుకని ఆమెని పలకరించిన ప్రతిసారీ ఏదో ఒక కొత్త జోకు చెప్పేవాడు. నా అనుమానం, ఆ రోజుల్లో అతను జోకుల పుస్తకాలు చదువుకుని మరీ మా ఇంటికి వచ్చేవాడేమోనని.

న్యూ ఇయర్ డే నాడు మమ్మల్ని సినిమాకి వెళ్దాం రమ్మన్నాడు. ఆదివారం. మాటినీకి తీసుకుపోయాడు. బహుశా ఫస్టుషో కి వెళ్దామన్నా కూడా మా ఇంట్లో అడ్డుపెట్టేవారు

కాదేమో. అదీకాక నన్నొక్కర్తినే కాదు, రజనీని, ప్రశాంత్ ని కూడా రమ్మన్నాడు. ఆ రోజు మా ఇంట్లోనే లంచి చేసాడు. సినిమాకి వెళ్దాం అనగానే నేను నాన్నవంక చూసాను. నాన్న ఏమీ అనలేదు. అమ్మ మాత్రం లోపలకి రమ్మని సైగ చేసింది. వెళ్ళొద్దంటుందేమో అనుకున్నాను. కాని ఆమె నన్ను లోపలకి పిలిచి నా చేతిలో డబ్బులు పెట్టి 'అతణ్ణి టిక్కెట్టు తియ్యనివ్వకు. మీ నలుగురికీ నువ్వే టిక్కెట్టు తియ్యి' అంది.

ఇప్పుడు తలుచుకుంటే, నవ్వొస్తుందికాని, ఆ రోజుల్లో, నీ అన్నో, తమ్ముడో, బంధువో కాని వ్యక్తితో సినిమాకి వెళ్ళడం చాలా పెద్ద విషయం. సినిమాహాల్లోకి వెళ్ళాక కూడా ఎవరు ఎక్కడ కూచోవాలన్నది కూడా పెద్ద విషయమే. అవేవీ మాట్లాడుకునే విషయాలు కాదు, కాని, అదంతా సరిగ్గా లేకపోతే, ఆ తర్వాత నిజంగానే మాట్లాడుకునే విషయంగా మారుతుందని భయం. సినిమాహాల్లో చివరి సీట్లో అతను కూచున్నాడు. అతని పక్కన ప్రశాంత్, వాడి పక్కన రజని, ఈ కొసన నేను.

ఏదో సినిమా, పేరు గుర్తుంది, ఎలా మర్చిపోతాను? డాక్టరుతో చూసిన మొదటి సినిమా. కాని దాన్ని అలా గుర్తుపెట్టుకోవడమే నాకు ఇష్టం. ఇంటర్వెల్లులో బయటికి వెళ్ళి కూల్‌డ్రింక్సు పట్టుకొచ్చాడు. వాటికి మాత్రం నేను డబ్బులివ్వలేదు. 'ప్రశాంత్ ఏం చేస్తున్నాడు? వాడు పోయి తేవచ్చు కదా' అంది అమ్మ, ఆ తర్వాత, మా స్టోరీ అంతా విన్నాక.

సినిమా అయ్యాక డాక్టరు మా ముగ్గురినీ ఒక రిక్షా ఎక్కించి తను వేరే పనుందని వెళ్ళిపోయాడు. అతను కూడా ఆ సాయంకాలం మా ఇంటికి వచ్చి ఉంటే బాగుణ్ణనీ, ఆ రాత్రి డిన్నరు దాకా ఉండిపోతే బాగుణ్ణనీ మనసులో అనిపిస్తూనే ఉంది. కాని నోరు తెరిచి అడగలేకపోయాను. పిల్లలు ఏమనుకుంటారో అనే సంకోచం నా నోరు పెగల నివ్వలేదు.

ఇంటికి వచ్చాక, రాత్రి భోజనాలయ్యాక, అమ్మ 'చూడు నీకీ లెటరొచ్చింది' అంటో ఒక కవరు చేతికిచ్చింది.

యాభై పైసల ఎల్లో కలరు ఎన్వలపు. ఆ కవరు బరువుగా ఉంది.

నా పేరు రాసిన ఆ కవరు మీద 'ఫ్రమ్ రాజు' అని ఉంది.

❋

27

రాజు నుంచి ఉత్తరం అనగానే చాలా సంతోషంగా అనిపించింది. నా గదిలోకి వెళ్ళి మంచం మీద కూచుని ఆ కవరు చింపాను. ఆ ఊరు వదిలి వచ్చి ఆరునెలలు పైనే దాటింది. వచ్చిన మూడు నాలుగు వారాలదాకా చాలా బెంగగా ఉండింది, కానీ స్కూల్లో చేరాక, రోజువారీ జీవితం ఆ బెంగని కప్పేసింది. ఇక ఈ రెండు మూడు నెలలుగా, మా జీవితాల్లో సంభవిస్తున్న కొత్త మార్పుల వల్ల ఆ ఊరి జ్ఞాపకాలు కూడా అడుగున పడిపోయేయి. నాకు గుర్తుండి ఆ రెండుమూడువారాలుగా ఆ ఊరికి సంబంధించిన మనుషులు కూడా ఎవరూ నా తలపుల్లో లేరు. అలాంటిది హటాత్తుగా అక్కణ్ణుంచి ఉత్తరం, అది కూడా రాజునుంచి అనగానే ఎంతో ఆసక్తిగా అనిపించింది.

పెద్ద ఉత్తరం. ఆరుపేజీలు. సగానికి మడిచి రాసిన మూడు తెల్లకాగితం తావులు. గుండ్రంగా ఉన్న దస్తూరీ. రాజు చేతిరాత ఎలా ఉంటుందో సర్వే ఫారాలు నింపుతున్నప్పుడు చూసానుగానీ అవన్నీ పొడిపొడి అక్షరాలూ, మాటలూ. ఇలా ఒక కాగితం పొడుగునా అతని చేతిరాత ఎలా ఉంటుందో చూడటం ఇదే మొదటిసారి. ఆ కాగితాల్లో కూడా ప్రతి పేజీకీ మార్జిను ఉంది, లైన్లు ఎక్కడా వంకరపోకుండా కుదురుగా, కాగితం కింద రూళ్ళకాగితం పెట్టుకు రాసాడా అన్నంత పొందిగ్గా ఉన్నాయి.

ఉత్తరం పైన ఊరుపేరూ, డిసెంబరు 26 అని తేదీ ఉన్నాయి.

దానికింద

'ప్రియమైన విమలా'

అని ఉంది. ఆ 'ప్రియమైన' అనే పదం దగ్గర ఒక క్షణం ఆగేను. ఆ పదం నాకెందుకో ఇబ్బందిగా అనిపించింది. ఇంగ్లిషులో 'డియర్' అనే మాటని తెలుగులో అలా రాసి ఉంటాడులే అనుకున్నాను.

ఆ తర్వాత మొదటి రెండు పేజీలూ తన గురించిన వివరాలూ, ఆ ఊళ్ళో జీవితం గురించిన వివరాలూ ఉన్నాయి. నిజంగా సంతోషించదగ్గ విషయాలు. అన్నిటికన్నా ముందు, సుధీర్ పెళ్ళి రాజమండ్రిలో జరిగిందనీ, ఆ పెళ్ళికి తను కూడా వెళ్ళాననీ, అక్కడ సుధీర్ నా గురించి అడిగాడనీ, పెళ్ళికి ఎందుకు రాలేదని అడిగాడనీ కూడా రాసాడు. 'సుధీర్ ఎవరు?' అని మనసులో అతిచిన్న ప్రశ్న, క్షణంలో పావువంతు కాలంలో తలెత్తి, వెంటనే 'సుధీర్ అన్నయ్య' గుర్తొచ్చాడు. అతని పెళ్ళి డిసెంబరులో అని అప్పట్లో మాట్లాడుకోడం కూడా గుర్తొచ్చింది. ఎలా మర్చిపోయేను ఆ మనిషినీ, ఆ పెళ్ళి సంగతినీ? నేను రాలేదని అడిగాడంటే నాకు వెడ్డింగుకార్డు పంపాడనే కదా. కాని నాకే కార్డూ అందలేదే? ఏ అడ్రస్సుకి పంపాడు? లేకపోతే మాష్టారు పంపించి ఉంటారనుకున్నాడా? నాకు గుర్తుండి నేనే వస్తాననుకున్నాడా? అతని పెళ్ళి విషయం నాకు గుర్తు లేదని తోచగానే మనసు చేదుగా అయిపోయింది.

ఉత్తరంలో ఆ తర్వాత రాసిన విషయాల్లో, తాను బిఏ మూడు సంవత్సరాల పరీక్షలూ ఆ సెప్టెంబరులో సింగిలు సిట్టింగులో రాసేసాడనీ, ఆ పరీక్షలు రాసేదాకా నాకు ఉత్తరం రాయకూడదని అనుకున్నాడనీ కూడా రాసేడు. తాను మొత్తం పరీక్షలు రాసేసాడని చదవగానే సంతోషంగా అనిపించింది.

ప్రొఫెసర్ సేన్‌గుప్తనుంచి గానీ, డా.మిశ్రానుంచి గానీ ఎటువంటి సమాచారమూ లేదనీ, రోజా కూడా నేను వచ్చేసిన వారం రోజులకే, కాలేజీలు తెరిచే టైమయ్యిందని, వెళ్ళిపోయిందని కూడా రాసాడు.

'నువ్వు నిజంగా పొంగిపోయే వార్త ఒకటి ఉంది చెప్పనా? అసలు ముందు ఆ వార్తతోటే ఈ ఉత్తరం మొదలుపెట్టాల్సింది–'

ఏమిటన్నట్టు ఆ కింద వాక్యాల్లోకి వెంటనే కళ్ళు పరుగెత్తాయి.

'మనూళ్ళో స్కూలుకి గవర్న్మెంటు కొత్త బిల్డింగు శాంక్షను చేసింది. ఆ మధ్య ఎక్కడో కలిసినప్పుడు బిడివో గారు చెప్పారు–'

ఆ తర్వాత నాలుగు పేజీలు. అదే అసలు ఉత్తరం అంతా. అసలు అతను అటువంటి తెలుగు రాయగలడని నేను ఎప్పుడూ అనుకోలేదు. కాని ఆశ్చర్యం ఏముంది? వనలత

అనే పేరు వినగానే టాగోరు పుస్తకాల్లో పాత్రనా అని అడిగినప్పుడే అతను బెంగాలీ అనువాదాలు చదువుతుంటాడని తెలిసింది. శరత్ బాబు నవలలు తెలుగు అనువాదాలు చదివినవాడు అటువంటి తెలుగు రాయడంలో ఆశ్చర్యం లేదు.

కాని ఆ నాలుగు పేజీలూ నేను అతికష్టం మీద చదివాను. భాష అందంగా ఉంది, దస్తూరీ అందంగా ఉంది, పంక్తులు పొందిగ్గా ఉన్నాయి. కాని, ఆ కాగితాలు ఒక్కొక్కటీ తిప్పి చదవాలనిపించకా, కాని ఒక్కొక్కటీ తిప్పకుండా ఉండలేకా, చదవకుండా ఉండలేకా, అతికష్టమ్మీద చదివేను. ఇంకా పండుదలకి రాని మామిడి కాయని ఎండుగడ్డిలో మగ్గబెడితే, దాని జీడివాసన ఎలా పోదో, ఆ పండుని నోటిదగ్గర చేర్చుకున్నప్పుడు, తీపిదనంకన్నా కసరుదనమే ఎలా ముందు అనుభవానికొస్తుందో, ఆ ఉత్తరమంతా అలా ఉంది.

ఇక ఆ ఉత్తరం చివర, 'నిన్నెప్పటికీ ప్రేమించే– నీ రాజు' అని సంతకం చేసి ఉంది.

రెండు సార్లు లవ్, లవ్– ఉత్తరం మొదట్లో ఒక లవ్ , చివర్లో మరో లవ్.

ఒక్కమాటలో చెప్పాలంటే, అది ప్రేమలేఖ.

నా జీవితంలో ఎవరినుంచేనా మొదటిసారి అందుకున్న ప్రేమలేఖ.

కాని నా మనసంతా వగరుగా అయిపోయింది. గుండె వడివడిగా కొట్టుకోవడం మొదలుపెట్టింది. టెన్షను మొదలయ్యింది. ఎవరో నా వెనక నిలబడి ఆ ఉత్తరంలో ఏముందా అని చూస్తున్నట్టు అనిపించింది.

ఈలోపు రజని ఆ గదిలోకి వచ్చింది.

'ఎవరు రాసేరక్కా ఆ ఉత్తరం' అనడిగింది.

నేను వెంటనే సర్దుకున్నాను. నా ముఖంలో భావాలు దానికి ఏదో ఒకటి చెప్పేముందు నేనే మాట్లాడటం మంచిదనుకున్నాను.

'నేను వెళ్ళొచ్చానే ఆ ఊరు. అక్కడ రాజు అనే పిల్లవాడి గురించి చెప్పాను కదా. అతను రాసాడు. ఆ ఊరు సంగతులన్నీ రాసాడు.'

'ఓహో' అంది రజని.

'అప్పుడు మేమంతా ఆ ఊళ్ళో బడికి బిల్డింగు లేకపోతే, అంతా కలిసి ఒక పాక వేసామని చెప్పాను కదా–'

'అవును ఒక యాంత్రొపాలజిస్టు–'

'డా. మిశ్రా, బాగా గుర్తుందే నీకు! ఇప్పుడు ఆ బడికి గవర్నమెంటు కొత్త బిల్డింగు శాంక్షను చేసారని రాసాడు.'

'గ్రేట్' అంది రజని కళ్ళు పెద్దవిచేస్తూ. అప్పుడు బీరువాలోంచి నైటీ తీసుకుని డ్రెస్సు మార్చుకోడానికి పక్క గదిలోకి వెళ్ళింది.

ఆ ఉత్తరం మరోసారి చదవాలనిపించింది. చదవడం కాదు, స్కాను చెయ్యాలని పించింది. ఆ ఉత్తరంలో వాక్యాల్ని కాదు, అది చదువుతున్నంతసేపూ నన్ను నేను స్కాను చేసుకోవాలనిపించింది.

ఎందుకు? ఎందుకలా రాసాడు?

నేనెప్పుడన్నా అతనితో అటువంటి ఊహలకి అవకాశమిచ్చేటట్టు ప్రవర్తించానా? అతనిపట్ల ప్రగాఢమైన ఇష్టమెప్పుడన్నా చూపించేనా? అతనంటే నాకు చాలా ఇష్టమని అతను అనుకోడానికి కనీసం అటువంటి సిగ్నళ్ళు ఎప్పుడేనా నా నుంచి వెలువడ్డాయా?

ఒక్కసారిగా సినిమాలో రీలు తిప్పినట్టు ఆ ఎనిమిదినెలలపాటు గడిచిన రోజులూ, రాత్రులూ అన్నీ త్వరత్వరగా నా మనసులో కదలాడిపోయేయి. మేమంతా కలిసి తిరిగిన ప్రతి చోటూ మరొకసారి గాలించేను. మనం నడిచివస్తూండగా, ఏదన్నా పోగొట్టుకుంటే, తిరిగి మళ్లా ఆ దారమ్మట వెతుక్కుంటూ వెళ్తామే, అలా నేను తిరిగిన దారులన్నీ గాలించేను. ఎక్కడేనా ఏదన్నా ఒక సంజ్ఞ, ఒక సూచన, ఒక సంకేతం. ..

ఎన్ని రాత్రుళ్ళో ఆ ఇంటి మీద వెన్నెల కురుస్తూ ఉండగా నేను ఆ అరుగు మీద నా మోకాళ్ళు నా చేతుల్తో చుట్టుకుని కూచుని అతను చెప్పిన మాటలు విన్నాను, నిజమే, కాని నేనెప్పుడూ ఏదీ మాట్లాడలేదే! ఎన్నో సాయంకాలాలు అతను వస్తాడా లేదా అని ఎదురుచూసాను. కాని ఏం ఒక స్నేహితుడికోసం ఎదురుచూడరా? నీ క్లాస్మేటు, నీ బంధువు, నీ కొలీగు– మనుషులు కలిసి మాట్లాడుకోరా? తుళ్ళిపడరా? నవ్వుకోరా? పోట్లాడుకోరా?

ఆ పదిపదిహేను నిమిషాల్లో మళ్ళా రజని ఆ గదిలోకి వచ్చేలోపు నన్ను నేను తీవ్రాతితీవ్రంగా శోధించుకున్నాను. నన్ను మరీ మరీ తరచి చూసుకునే కొద్దీ, ఆ ఊళ్ళో దృశ్యాలు, ఆ రోజులు, ఆ వెన్నెల రాత్రులు మరింతగా గుర్తు రావడం మొదలుపెట్టాయి.

హటాత్తుగా ఆ సాయంకాలం మేము అడవినుంచి తిరిగివస్తూ ఉండగా మమ్మల్ని ఆపేసిన వెలగపళ్ళ వాసన గుర్తొచ్చింది. ఆ వాసన ఎంత తాజాగా నా ముక్కుపుటాలకు తోచిందంటే, ఎవరో ఒక పండువెలగ పళ్ళ బుట్ట ఆ మంచం కింద పెట్టారేమో అన్నంతగా. వెంటనే, ఇక్కడేదో పాము తిరుగుతూ ఉంటుంది అని దేవయ్య అన్న మాటలు గుర్తొచ్చాయి. ఆ ఫలసౌరభం పక్కనే ఒక సర్పభ్రాంతి ఆ రోజు నాలో కలిగించిన మిశ్రమభావాల్లాంటిదే ఆ రాత్రి ఆ ఉత్తరం చేతుల్లో ఉండగా కలిగింది.

నా చేతుల్లో ఒక ప్రేమలేఖ. నా మనసులో ఒక సర్పభ్రాంతి.

నాకు నేను నిదానంగా చెప్పుకోడం మొదలుపెట్టాను. 'లుక్, విమలా, ఆ పిల్లవాడు. గుర్తు తెచ్చుకో. బడిపిల్లలకి స్కూలు కట్టాలంటే, తను రాయాల్సిన పరీక్షల్ని పక్కన పెట్టేసిన పిల్లవాడు, మీరంతా సినిమాకి పోయి రాత్రంతా వెన్నెల్లో గడిపి, ఇంటికొచ్చాక, ఒళ్ళెరక్కుండా నిద్రపోతుంటే, ఆ పిల్లవాడు మళ్ళా బయల్దేరి ఆ మర్నాడంతా మంత్రసానికోసం, డాక్టరు కోసం తిరుగుతూ ఉన్నాడు. ఎవరో యాంత్రొపాలజిస్టు తన ప్రాజెక్టు కోసం హౌస్ హోల్డు సర్వే చెయ్యాలంటే, తన పనులన్నీ పక్కన పెట్టి, తన చదువు పక్కన పెట్టి, ఇంటింటికీ తిరిగి ఆ ఫారాలు పూర్తిచేసాడు. గుర్తుందా! సేన్‌గుప్త నీకు రెమ్యునరేషను చెల్లించాడు. కాని అతనికి కనీసం ఉత్తరం కూడా రాయలేదు. ఏమో? నీకు చెల్లించిన రెమ్యూనరేషనులో అతనికి కూడా కొంత ఇవ్వవలసి ఉందేమో–'

'కానీ ఆ పని డా. మిశ్రా అప్పగించాడు. సేన్‌గుప్తా కాదు.'

'ఏమో, డా. మిశ్రా ఆ సంగతి సేన్‌గుప్తాకి చెప్పకుండా ఉంటాడా?'

'అలా అయితే మిశ్రానే నాకు చెప్పి ఉండేవాడే.'

'బట్, లుక్, ఆ మిశ్రా ఆ రోజు నువ్వు చెప్పావు కాబట్టి రాజు కోసం ఒక గంటసేపు వెయిట్ చేసాడు. అది కూడా ముళ్లమీద కూచున్నట్టు. నువ్వు రాజు గురించి గుర్తు చేయకపోయి ఉంటే, వెళ్ళిపోయి ఉండేవాడు. ఆ రాజు అనే పిల్లవాడికి చెప్పి సెలవు తీసుకోవాలని అతనికి ఎప్పటికీ తట్టకపోయుండేది.'

నా మనసు నన్ను పక్కదోవ పట్టిస్తోందని అర్థమవుతోంది. ఆ క్షణాన నేను ఆలోచించవలసింది సేన్‌గుప్తాల గురించీ, మిశ్రాల గురించీ కాదు, ఆ రెమ్యునరేషను లెక్కలు అసలే కాదు. అదంతా సర్ఫేస్ లెవెల్ నాన్సెన్సు. అంతకన్నా లోతైంది, మరింకేదో, నీ అంతరంగం నీ నుంచి దాచిపెడుతున్నదేమో, దాన్ని బయటకి తియ్యి. నిన్ను నువ్వు

ముఖాముఖి ధైర్యంగా ఎదుర్కో. ఒకే ఒక్క ప్రశ్న-నిన్ను నువ్వు సూటిగా అడగవలసిన ప్రశ్న ఒకే ఒక్కటి- అడగవలసింది ఆ ఒక్క ప్రశ్న. ఆ ఒకే ఒక్క ప్రశ్న.

నాకు తలతిరగడం మొదలయ్యింది. ఆ వారం రోజులుగా ఎంతో హుషారుగా గడిచిన రోజులు మాయమైపోయాయి. ఆ రోజు ఆ సినిమాకి వెళ్ళడం, ఆ హాల్లో కూచునేటప్పటి గుంజాటన ఒక్కసారి గుర్తొచ్చి, ఆ దృశ్యం పక్కకు తప్పుకుని ఆ రాత్రి మేమంతా రెండెడ్లబండిమీద సినిమాకి వెళ్ళిన జ్ఞాపకం ముందుకొచ్చింది.

'ఆ వేళ నువ్వు అతనితో సినిమాకి వెళ్లావే. మరి నీ అన్ననో, తమ్ముడో కాకుండా మరెవ్వరితోనూ ఎప్పుడూ సినిమాకి వెళ్లింది లేదనుకున్నావే ఇవేళ-'

'ఆ రోజు అందరం ఉన్నాం, రోజా, పెద్దమ్మాయి, చిన్నమ్మాయి-'

'ఇవేళ కూడా నీ తమ్ముడూ, నీ చెల్లెలూ ఉన్నారు-'

అవును. నిజమే. ఆ రోజు అతనితో ఆ అర్ధరాత్రి ఆ అడవిలో ఎడ్లబండిమీద ఆ పల్లెటూరి టూరింగు టాకీసులో సినిమాకి వెళ్ళినప్పుడు నా గుండె ఎందుకు కొట్టుకోలేదు? ఇవాళ డాక్టరుతో, నాకు నిశ్చితార్థం జరిగిన ఒక యువకుడితో, సినిమాకు వెళ్ళినప్పుడు ఎందుకంత నెర్వస్‌నెస్సు ఫీలయ్యాను?

హటాత్తుగా మనసులో ఒక మెరుపు మెరిసినట్టయ్యింది. అర్థమయింది.

నేను రాజుని ఒక స్నేహితుడిగా మాత్రమే చూసాను కాబట్టి, అతని ప్రెజన్సులో నేను మాత్రమే ఎక్స్‌క్లూజివుగా పొందే ఆనందం ఏదీ లేదు కాబట్టి నేను టెన్షను పడలేదు. అసలు ఆ రోజు నా తలపుల్లో రాజు లేడు, వెన్నెల మాత్రమే ఉంది. నిజానికి ఆ రాత్రి తిరిగి వస్తున్నప్పుడు రాజు కూడా నిద్రపోయాడు. ఆ ఏకాంతకౌముదిలో నాకు తోడుగా మెలకువగా ఉన్నది డా.మిశ్రా మాత్రమే. కాని ఆ రాత్రి ఆయన తన ప్రపంచంలో తానున్నాడు, నా ప్రపంచంలో నేనున్నాను.

ఆ తలపులు సాగుతూండగానే నాకు చెప్పలేనంత ఊరట కలిగింది. అవును, రాజు ఒక మంచి స్నేహితుడు. అక్కడ ఎంతో స్నేహంగా కలిసి మెలిసి తిరిగాం. ఎన్నో సంతోషాల్ని కలిసి పంచుకున్నాం. కాని ప్రేమ? అది వేరే పదం.

ఉత్తరం కవర్లో పెట్టేసాను. ఈ లోపు రజని గదిలోకి వచ్చింది. నాతో పాటు మంచమ్మీద ఎక్కింది. తన జడకి పెట్టుకున్న రబ్బరు బాండు తీసి పక్కన పెట్టి జుట్టు వదులు చేసుకుని వెనక్కి తోసి తలగడ మీద తలపెట్టుకుని పడుకుంది.

నేను కూడా ఫ్లోరెసెంటు లైటు స్విచ్చి ఆపుచేసి పడుకున్నాను.

కాని అప్పటిదాకా కలవరపడ్డ కొలను నీళ్ళు నెమ్మదిగా సర్దుకుని ఆకాశమూ, మేఘాలూ కనిపించడం మొదలైనప్పటిలా, నా ముందొక దృశ్యం కనిపించడం మొదలు పెట్టింది.

వకుళకుటి. ఆ రోజు డా.మిశ్రాని కలిసి మాట్లాడి ట్రైబల్సు వెళ్ళిపోయాక అక్కడ నేనూ, రాజూ అరుగుమీద కూచుని ఉన్నాం. మాతో డా.మిశ్రా అంటున్నాడు: 'ఇక్కడ దారుణమైన పరిస్థితులు నడుస్తున్నాయి. నాన్ ట్రైబల్సు రాజ్యం నడుస్తోంది. ఇదుగో, ఈయన సంగతే చూడండి–' అని రాజు కేసి వాళ్ళనాన్నగారి గురించి తీవ్రమైన ఆరోపణలు చేయడం గుర్తొస్తోంది. అప్పుడు నేను కంగారు పడిపోడం గుర్తొస్తోంది. నా ఎదురుగుండా రాజుని పట్టుకుని అతడి తండ్రినీ, కుటుంబాన్నీ నేరస్థులుగా చూపిస్తో అలా మాట్లాడుతుంటే నాకు కాళ్ళల్లో వొణుకు పుట్టడం గుర్తొస్తోంది. అప్పుడు రాజు ముఖం కేసి చూసాను. అప్పుడు– మళ్ళా ఇప్పుడు– ఆ గదిలో, ఆ చీకట్లో, మంచం మీద పడుకుని కళ్ళు మూసుకోగానే, అతని ముఖం తేటపడ్డ కొలనులో ప్రతిబింబంలాగా స్పష్టంగా కనిపిస్తోంది.

అప్పుడు ఆ ముఖం? అది ఎవరిది? ఒక పసివాడిదా? తన తండ్రిని తన ఎదటే మరొక మనిషి నేరస్థుడిగా ఎత్తి చూపుతుంటే, ఆ భాష ఏమీ అర్థంకాని ఒక పసివాడిదా? కాని రాజుకి ఆ భాష అర్థమవుతోందే– కానీ ఒక ట్రూత్ వింటున్నంత నిర్మలమైన ముఖంతో, ఆ ట్రూత్ ముందు తన తండ్రిని కూడా పక్కన పెట్టగలిగినంత ప్రశాంత చిత్తంతో ఆ మాటలు వింటున్న ఆ ముఖం దేవుడిదా? దైవసమానుడైన మనిషిదా? మసకబారని అతని కళ్లల్లోని దీప్తి గుర్తొస్తోంది. నాకు తెలీకుండానే కళ్ళల్లోంచి నీళ్ళు ఉబికి చెంపలమీంచి ధారలు కట్టడం మొదలయ్యింది.

మరుక్షణంలో నా కళ్ళ ముందు ఆ ముఖం చెరిగిపోయింది. ఎటు చూసినా పొలాలు. పండిన వరిచేలు. వాటిమీద ఇంతలో ఎండ పడుతోంది, ఇంతలో మబ్బునీడ పడుతోంది. ఇద్దరు పిల్లలు ఆ పొలాల మధ్య గళ్ళకు గంతలు కట్టుకుని ఒకరినొకరు పట్టుకోడానికి పరుగెడుతున్నారు వాళ్ళిద్దరూ గంతలు కట్టుకున్నారు, లుక్, విమలా, ఇద్దరూ, అంటే నువ్వు కూడా, కళ్ళకి గంతలు కట్టుకున్నావు–

నాకు తలబరువెక్కిపోయింది. తలనొప్పి మొదలయ్యింది. ఏదో ఒక మాట దొరకాలి, ఒక మాత్రలాగా దొరకాలి. నా ఎదట ఒక మాట ఉంది. ప్రేమ. కాని ఆ మాటకి ఆ తలనొప్పిని తగ్గించే శక్తిలేదు సరికదా, ఆ మాటని చూస్తే మరింత శిరోభారం పెరుగుతోంది.

నేను ఆ మాటను ఎక్కడ చూడవలసి వస్తుందోనని నాకే భయంగా ఉంది. ఆ మాటని ఎవరేనా నా ముందు పక్కకి లాగేస్తే బాగుణ్ణని ఉంది. ఆ ఒక్క మాటా ఆ ఉత్తరం లోంచి తీసేస్తే ఆ ఉత్తరాన్ని ఎంతో అపురూపంగా హృదయానికి హత్తుకోవాలని ఉంది.

అప్పుడు నిజంగా కావలసింది ఒక మాట. ఒక మాత్రలాంటి మాట. ఆ మాత్ర ఎక్కడో మనసులోపల ఉంది. నువ్వొక టెలిఫోను కాల్ చెయ్యడానికి రూపాయి నాణెం కావలసి వచ్చినప్పుడు, ఆ కాయిను కోసం నీ హేండు బాగు వెతుక్కుంటూ ఉంటే నీ చేతికి అన్నీ తగులుతున్నాయి– హేండు కర్చీఫు, గాజులు, బొట్టుబిళ్లల పాకెట్టు, ఉత్తరాలు, బాల్‌పాయింటు పెన్ను– ఆ కాయిను అక్కడ ఉన్నట్టుగా స్పర్శకి తెలుస్తోందిగాని, చేతి కందదు చూడు, అచ్చం, అలానే ఉంది. ఆ మాత్ర, ఆ మాట, అదొక్కటీ దొరికితే నా తలనొప్పి తక్షణం తగ్గిపోతుంది.

నా చెంపల మీద తడి ఆరిపోయింది. ఈ సారి రజని వైపు తిరిగి పడుకున్నాను. 'పారడైజ్ లాస్ట్. జాన్ మిల్టన్. ఈజ్ దిస్ ఆల్సో పార్ట్ ఆఫ్ యువర్ సిలబస్?–' రాజు అడుగుతున్నాడు రజనిని (డాక్టరు కదా అడిగాడు!).

దిగ్గున లేచి కూచున్నాను.

'ఏంటక్కా?' అంది రజని నిద్రాద్వారం దగ్గర.

'నీ పారడైజ్ లాస్ట్ పుస్తకం ఎక్కడుంది?'

'ఇప్పుడెందుకు?' మగతగా అడుగుతున్నది.

'చదవాలని ఉంది.'

లేచి లైటు వేసాను. దాని అలమారులో పుస్తకాలు వెతికాను. పైనే ఉంది. తీసి చూసాను. 'పారడైజ్ లాస్ట్ అండ్ రీగెయిన్డ్: జాన్ మిల్టన్'. మొదటి పేజీ తెరిచాను. ఏం చదవాలని తెరిచాను?

'బుక్, ఫోర్' అనే మాట గుర్తొచ్చింది.

తెరిచాను. అది వెర్స్ అని అప్పటిదాకా తట్టలేదు. ఎప్పుడూ చదివింది కూడా కాదు. ఆ ఇంగ్లిషు అర్థం కాలేదు. మామూలుగా పొద్దున్నే కూచుని శ్రద్ధగా తెరిచి కూడబలుక్కుని చదివినా కూడా అంత తొందరగా అర్థమయ్యే ఇంగ్లిషు కాదు. ఇక అప్పటి నా మనఃస్థితిలో ఏమి అర్థమవుతుంది? కాని నా మనసుని ఏదో కఠినాతికఠినమైన

మరో అంశం మీదకు బలవంతంగా మళ్ళిస్తే తప్ప నా మీద ఒరిగిపడ్డ ఆ బరువునుంచి నేను తప్పించుకోలేననిపించింది.

బుక్ ఫోర్. యాంత్రికంగా నా కళ్ళముందున్న కనిపిస్తున్న పద్యపంక్తులు చదవడం మొదలుపెట్టాను.

అకస్మాత్తుగా కొన్ని వాక్యాలు నాకు అర్థమవుతున్నట్టుగా అనిపించడం మొదలు పెట్టాయి. అవేవీ ఇప్పుడు గుర్తు లేవుగాని, Why satt'st thou like an enemy in wait here watching at the head of these that sleep? అన్న వాక్యం గుర్తుండి పోయింది. ఎవరో ఆ రాత్రి నన్ను నిద్రపోనివ్వకుండా నా పక్కన ఒక శత్రువులాగా పొంచి ఉన్నారనిపించింది.

ఎవరు ఆ శత్రువు?

నా లోపల ఉన్నాడా? బయట ఉన్నాడా?

పుస్తకం మూసేసాను.

Paradise Lost and Regained .

ఆ అక్షరాల్ని చేత్తో తడిమాను. నేను పారడైజు పోగొట్టుకున్నానా? పోగొట్టు కుంటున్నానా లేక పోగొట్టుకోబోతున్నానా? పోగొట్టుకున్న పారడైజును పొందబోతున్నానా లేక మళ్ళా పోగొట్టుకోబోతున్నానా? ఒక్క అడుగు– ఒకే ఒక్క అడుగు– పోగొట్టుకుంటానో తెలీదు. పొందుతానో తెలీదు.

జీవితంలో ప్రతి మలుపులోనూ నీకు రెండు కంఠాలు వినబడుతూ ఉంటాయి. కవి అన్నట్లుగా 'ఎటుబోతే పూలతోట? ఎటుబోతే వల్లకాడు?' మనిషి ఎదుర్కోవలసిన అత్యంత కఠినమైన పరీక్ష మరొకడు పెట్టేది కాదు. అది ఎప్పటికప్పుడు తనకి తాను పెట్టుకునే పరీక్ష. తనలో వినబడే రెండు కంఠాల్లో ఏది తన కంఠస్వరం? ఏది తనది కానిది? దేన్ని వినడం తనకి సుఖంగా ఉంటుంది? దేన్ని వింటే తనకు పరమహితం కలుగుతుంది?

ఇటువంటి మాటలు పెద్దవాళ్ళు చెప్తుండగా ఏదో ఒకరూపంలో నేను వినకపోలేదు. కాని ఆ రాత్రి నాకు కొత్తగా అర్థమయిందేమంటే, నీకు వినబడుతున్న రెండు కంఠాలూ నీ మంచిని కోరుకుంటున్నవిగానే వినబడతాయి. ఆ రెండు స్వరాలూ కూడా నీకు

సంతోషాన్నిచ్చేవిగానే వినిపిస్తాయి. ఆ రెండూ కూడా నిన్ను ఒక్కలానే ప్రలోభపరుస్తాయి. ప్రలోభపూర్వకంగా వినిపించే ఆ రెండు కంఠాల్లోను ఏది నమ్మదగ్గ ప్రలోభం? ఏది నమ్మకూడని ప్రలోభం?

ఆ రాత్రి నన్ను నిద్రపోనివ్వకుండా నా పక్కన ఒక శత్రువులాగా పొంచి ఉండి నన్ను టెంప్టు చేస్తున్నది నాలోని ఒక భాగమే అని గుర్తుపట్టానుగాని, నాలోని ఆ నేను చిన్న నేనా? పెద్ద నేనా? మంచి 'నేనా'? చెడ్డ 'నేనా'? ఆ ప్రలోభానికి లొంగకూడదంటే నేనేం చెయ్యాలి?ఏం చెయ్యకూడదు? అసలు అన్నిటికన్నా ముందు ఏ ఆలోచన నిలుపుకోవాలి? దేన్ని బయటకు నెట్టేయాలి?

వెనక్కి తలవాల్చి ఒక క్షణం కళ్ళు మూసుకున్నాను.

నా కళ్ళముందు మళ్ళా ఊదారంగు కొండలు, గాలికి అవిశ్రాంతంగా రాలిపడుతున్న కృష్ణచూర పుష్పదళాలు, కృష్ణపక్షపు రాత్రుల్లో వజ్రాలు వెదజల్లినట్టుగా ఆకాశమంతా చిమ్మిన నక్షత్రాలు కనిపిస్తున్నాయి. అడవిని నిద్రపోనివ్వని వడ్రంగిపిట్ట చప్పుడు వినిపిస్తూ ఉంది. కొంతసేపటికి ఆ చప్పుడు పెద్దదై నా తల బద్దలైపోతుందేమో అనిపించింది.

పుస్తకం పక్కన పెట్టేసాను. అలమారు దగ్గర నుంచి వెనక్కి వచ్చి నేలమీద కూచున్నాను. బాసింపట్టు వేసుకుని నాకు నేను చెప్పుకోడం మొదలుపెట్టాను.

'లుక్. విమలా. పిల్లవాడు. లోకం తెలియని పిల్లవాడు. కళ్లకి గంతలు కట్టుకుని నీతో దాగుడుమూతలాడుతున్నాడు. అందులో అంత కంగారు పడవలసిందేముంది? పొద్దున్నే ఉత్తరం రాయి. నీ విశేషాలన్నీ రాయి. నీకు పెళ్ళి ఫిక్సయిందనీ, పెళ్ళికి తప్పకుండా రమ్మనీ రాయి. వెడ్డింగుకార్డు పంపించు. అతనితో పాటు ఆ ఊళ్ళో ఆ రోజు బడికి బిల్డింగు కట్టడంలో సాయం చేసారే వాళ్ళందరినీ కూడా రమ్మని రాయి. హి ఈజ్ ఎ గుడ్ ఫ్రెండ్. అటువంటి ఫ్రెండ్సు వస్తే పెళ్ళి నిజంగా పండగ్గా మారుతుంది. అతణ్ణి ఎమ్మే చదవమని చెప్పు. సివిలు సర్వీసు పరీక్షలకి కట్టమను. మిశ్రాకి ఉత్తరం రాయమను. యాంత్రొపాలజీలో గైడెన్సు ఇస్తాడని చెప్పు. ఊహించు, అలాంటి వాడు ఐఎఎస్ ఆఫీసరైతే ఎన్ని గ్రామాల్లో ఎన్ని పాఠశాలలకి భవనాలు లభిస్తాయో!'

ఆ ఊహల్తో మనసు తేలికపడింది. ఒకింత ఉల్లాసంగా కూడా అనిపించింది. మొదటిసారిగా డాక్టరుకి ఒక ఉత్తరం రాయాలనిపించింది. లేచి రజని అల్మైరాలోంచి దాని లాంగ్ నోట్‌బుక్ ఒకటి తీసుకుని దాని పెన్ను, ఎగ్జామ్సు రాసుకునే పాడ్ కూడా

తీసుకుని మంచం మీదకు వచ్చి కూచున్నాను. ఆ పాడ్ వొళ్ళో పెట్టుకుని, నోటుబుక్కు లో ఒక వైట్ పేజీ తెరిచి, పెన్ను చేతుల్లోకి తీసుకున్నాను.

ఊరు పేరు రాసాను, జనవరి 1, రాత్రి 11.30.

ఏమని సంబోధించాలి?

'ప్రియమైన శ్రీనివాస్–?' ఉహు.

'డియర్ డాక్టర్?' ఉహు.

'మై డియర్ డాక్టర్–?' ఉహు.

డాక్టరుకి ఆ రాత్రివేళ ఉత్తరం రాయాలని కూచోగానే అన్నిటికన్నా ముందు నా గుండె చప్పుడు నాకే వినిపిస్తూ ఉంది. ఆ హృదయస్పందనం లేశమాత్రం కూడా ఆ సంబోధనల్లోకి రావడం లేదు.

మా అమ్మ మా నాన్నని ఏమనిపిలుస్తుంది?

'ఏమండీ–'

'ఏమండీ–' అని మొదలుపెట్టనా? నవ్వొచ్చింది. అప్పటికి మూడు గంటలుగా నా నుంచి దూరంగా జరిగిపోయిన నవ్వు మళ్లా అప్పుడే నాకు దగ్గరగా వచ్చింది.

నవ్వొచ్చిందని గుర్తురాగానే మళ్ళా నవ్వొచ్చింది.

'ఏంటక్కా? ఏం చేస్తున్నావు? ఇంకా పడుకోలేదా?' అనడిగింది.

ఇంతలో హటాత్తుగా రజని లేచింది. దాని కళ్ళల్లో ఇంకా నిద్ర కుదురుకోని జీర.

'ఉత్తరం రాస్తున్నాను.'

'ఉత్తరమా? ఎవరికి?'

పొరపాటు చేసేనని తట్టింది. ఆ అర్ధరాత్రి డాక్టరుకి ఉత్తరం రాస్తున్నానని ఆ చిన్నపిల్లతో ఎలా చెప్పను? ఆ సాయంకాలమే కదా, మేము సినిమాచూసింది. ఇంతలోనే ఉత్తరం రాయాలనిపించిందా అని అనుకుంటే బావుంటుందా?

'రాజుకి, రాజు అని చెప్పానే–'

'అబ్బా? ఎన్ని సార్లు చెప్తావక్కా? ఇంక ఇప్పుడు ఆ కథలన్నీ మళ్లా మొదలుపెట్టకు. పొద్దున్న రాసుకోవచ్చుకదా, నిద్ర రావడంలేదా?' అంది. మళ్ళీ పడుకుంది.

'లైట్ తీసెయ్యక్కా, నాకు నిద్రపట్టడం లేదు' అంది కళ్ళుమూసుకుంటూ.

మంచం దిగి ఆ నోట్ బుక్కూ, ఆ అట్టా, ఆ పెన్నూ అల్మైరాలో పెట్టేసాను. లైటు తీసేసాను. హాల్లోకి వచ్చాను. ప్రశాంత్ సోఫాలో పడుకుని నిద్రపోతున్నాడు. కిచెనులోకి వెళ్ళి మంచినీళ్ళు తాగాను. మళ్ళా గదిలోకి వచ్చి దానిపక్కన పడుకున్నాను.

ఇప్పుడు నా మనసులో ఏ ఆలోచనలూ లేవు. హటాత్తుగా వాన వెలిసిపోయినట్టు ఉంది. వైశాఖమాసంలో ఆ ఊళ్ళో అపరాహ్ణాల్లో వాన కురిసి వెలిసాక పరుచుకునే వెండీ, బంగారం కలిసిన వెలుతురులాంటిది నా మనసులో పరుచుకుంది.

ఆ వెలుతురోంచి ఏదో ఒక పక్షి నా చేతుల్లో జారవిడిచిన పదంలాగా ఒక మాట స్ఫురించింది. ఇందాకటినుంచీ నేను వెతుక్కుంటున్న మాత్ర. నా తలనొప్పిని మటుమాయం చెయ్యగల మాత్ర–

ఒక్కమాట:

'ఇష్టం.'

అవును, రాజు అంటే నాకు ఇష్టం.

అంతే.

ప్రేమ?

అది వేరే పదం.

❋

28

ఆ మర్నాడు పొద్దున్నే లేవగానే మనసు ప్రశాంతంగానే ఉండింది. బయటికి వచ్చి బ్రష్షు చేసుకుంటూ ఉంటే హటాత్తుగా ఆ ఉత్తరం గుర్తొచ్చింది. ఆ కవరు ఎక్కడ పెట్టానా అని కంగారు పుట్టింది. వెంటనే గదిలోకి పరుగెత్తాను. థాంక్ గాడ్. రజని ఇంకా నిద్రపోతూనే ఉంది. ఆ కవరు తలగడ పక్కనే ఉంది. దాన్ని తీసుకుపోయి ముందు నా హేండుబాగులో పెట్టేసాను.

స్కూలుకి వెళ్ళేదాకా నా మనసులో మళ్ళా యుద్ధం జరుగుతూనే ఉంది. దేని గురించి, వేటి మధ్య అంటే చెప్పలేను. ఏదో ఒక అన్‌సెటిల్డ్ ఫీలింగ్. ఆ భావం ఏమిటో తరచిచూసుకోడానికి మనసు ఇష్టపడటం లేదు. ఎటూ తెగని, ఎటూ తేల్చని ఆలోచనల మధ్య అకస్మాత్తుగా, కిందటేడాది ఎక్కడున్నాను, ఎలా గడిచాయి ఆ రోజులు అనిపించింది. డిసెంబరు 31 రాత్రి కేంపు ఫైరు, వనలత ఆలపించిన బావుల్ గీతం, రాత్రి పన్నెండు దాటిన తర్వాత సేన్‌గుప్త మాకు హేపీ న్యూయియర్ చెప్పడం అన్నీ గుర్తొచ్చాయి. ఆయన చెప్పినట్టే నిజంగానే ఆ న్యూయియర్ నా జీవితంలో నేనూహించని హేపీనెస్ పట్టుకొచ్చింది. ఆ హేపీనెస్ అకళంకంగా ఉండింది, మళ్ళా కొత్తసంవత్సరం మొదటి రోజుదాకా.

త్వరత్వరగా తయారయ్యాను. డాక్టరు ఇంకా ఊళ్ళోనే ఉండి ఉంటాడు. సాయంకాలం మళ్ళా తప్పకుండా ఇంటికొస్తాడు. అప్పటికేనా నా మనసు నిమ్మళంగా ఉండాలి. డాక్టరు ఎలాగేనా ఇంటికి రావాలి. ఇవాళ సెకండు షోకి వెళ్దామన్నా కూడా వెళ్ళడానికి సిద్ధమే అని నాకు నేను చెప్పుకున్నాను.

ఆ రోజు స్కూల్లో రోజంతా కూడా నా మనసు ఆ హేండుబాగు చుట్టూతానే పరిభ్రమిస్తూ ఉంది. స్టాఫ్ రూములో నా లాకరులోంచి ఆ బాగు ఎవరూ తీసి ఉండరు

కదా. ఎవరూ ఆ ఉత్తరం చదివి ఉండరు కదా. బడి విడిచిపెట్టేదాకా నా మనసు మనసులో లేదు. అప్పుడు బయటికొచ్చి స్టాఫ్ రూము పక్కన నిలబడి, నన్నెవరూ చూడటం లేదని చూసుకున్నాక, ఆ కవరు బయటికి తీసాను. అందులోంచి ఆ ఉత్తరం. దాన్ని మళ్లా తెరిచి చదివే ధైర్యం లేదు. వెంటనే ఆ ఉత్తరాన్ని అడ్డంగా చింపేసాను. ఆ తర్వాత మరిన్ని ముక్కలు చేసాను. ఆ ఉత్తరంలో చివరి పేజీలో ఆ సంతకం ఉన్న భాగాన్ని మరిన్ని ముక్కలుగా చింపేసాను. ఆ కవర్ని కూడా. చింపేసిన కాగితం ముక్కలు ఉండలాగా చుట్టి స్కూలు నుంచి బయటికి వచ్చాక రోడ్డు పక్కన ఉన్న డ్రైనేజిలోకి విసిరేసాను. నువ్వేదన్నా తోటలోంచి నడిచి వచ్చినప్పుడు బయటికి వచ్చాక నీ చేతిమీద చిన్న పురుగు కనిపిస్తే దాన్ని తక్షణమే ఎలా విదిలించుకుంటావో, అలాగన్నమాట. నాకు ఆ ఉత్తరం వచ్చిందన్న ఊహని కూడా నా మనసులోంచి విదిలించి పారేసాను.

కాని తీరా ఇంటికి చేరుకునేటప్పటికి, ఆ పదినిముషాల నడకలోనే మనసు మళ్ళా వికలమైపోయింది. నేను ఆ ఉత్తరం చింపకుండా ఉండవలసిందేమో అనిపించింది. దాచుకుని ఉండవలసింది. అందులో రాసింది నిన్ను ఇబ్బందిపెట్టిన మాట నిజమే. కాని అవి అతని భావాలు. వాటిని అంగీకరించకపోయినా కనీసం గౌరవించి ఉండవలసింది. కాని ఎక్కడ దాచుకుంటాను? హృదయంలో కుట్టిపెట్టుకుంటే తప్ప మరెక్కడా దాన్ని మరొకరి కంట పడకుండా కాపాడుకోలేనే. దానికేముంది? ఆ ఉత్తరం అతనికే తిప్పి పంపించి ఉండవచ్చు కదా. అలా తిరిగి పంపిస్తే అతనికి అర్థమయి ఉండేది కదా. అతను నీ గురించి భావించుకుంటున్నట్టుగా నువ్వు అతణ్ణి తీసుకోవడం లేదని చెప్పకుండానే చెప్పినట్టు ఉండేది కదా.

మళ్ళా నాకు తిలతిరగడం మొదలుపెట్టింది. చెప్పలేనంత నీరసం వచ్చేసింది. డాక్టరు ఈ పూట ఇంటికి రాకపోతే బాగుణ్ణని మరీ మరీ అనిపించింది. ఈ ఒక్క పూట గడిస్తే, ఈ ఒక్క రాత్రి నన్ను నాకు వదిలిపెట్టేస్తే, రేపటికి నన్ను నేను స్వాధీనంలోకి తెచ్చుకోగలను అనుకున్నాను.

నా అదృష్టం కొద్దీ ఆ సాయంకాలం డాక్టరు మా ఇంటికి రాలేదు. రానందుకు మనసులో ఎక్కడో లోటుగా అనిపించినా ఊరటగా కూడా అనిపించింది. నిజానికి అతనొస్తే అతని ముఖంలో ముఖం పెట్టి చూడలేనేమో అనిపించింది. అతని దాకా ఎందుకు? ఆ రోజు మా అమ్మనీ, నాన్ననీ కూడా చూడలేననిపించింది. అసలు నేనా ఊరు వెళ్ళకుండా ఉండి ఉంటే ఎంత బాగుణ్ణు అనుకున్నాను. ఆ రోజు అక్కడ అడవిలో నాకు తెలీకుండానే గాంధారిపాప ఉండే కొండమీద అడుగుపెట్టినట్టుగా నేను నాకు

తెలీకుండానే ఎక్కడో ఏదో నిషిద్ధరేఖ దాటానా? ఆ సాయంకాలం రాజు ఎదురుగుండా నేనూ, వనలతా ఆ ఏటినీళ్ళల్లో తుళ్ళింతలాడేమే? అదేనా నేను చేసిన పొరపాటు?

కాని మళ్ళా నిదానంగా ఆ ఉత్తరం గుర్తుతెచ్చుకోడానికి ప్రయత్నించాను. అందులో చూస్తే అభ్యంతరకరంగా అనిపించే మాట ఏదీ ఉన్నట్టు గుర్తురాలేదు. బహుశా ఆ రాత్రి, ఆ ఊరినుంచి వచ్చేసే ముందురోజు రాత్రి ఆ వకుళకుటి దగ్గర రోజా పాట పాడిన తర్వాత 'రాజు నీతో ఏదో మాట్లాడాలనుకుంటున్నాడు' అంది. అప్పటికే ఆలస్యమైందని ఇంటికి వచ్చేసాం. అప్పుడు మాట్లాడి ఉంటే ఈ మాటలే మాట్లాడి ఉండేవాడని ఇప్పుడు తెలుస్తోందిగాని, నేను, ఆ మాటలు విని ఇప్పుడు భయపడుతున్నట్టుగా అప్పుడు భయపడి ఉండేదాన్నా? నిజంగానే రాజు ఆ మాటలు చెప్పడంలో చాలా ఆలస్యం చేసాడా?

రాత్రి పడుకోబోయేముందు మళ్ళా నా తలలో వలయాలు వలయాలుగా ఆలోచనలు సుళ్ళు తిరగడం మొదలుపెట్టాయి. ఆ ఆలోచనలముందూ, మధ్యా, చివరా కూడా ఆ ఊళ్ళో గంగాలమ్మ పండక్కి కట్టిన ఉయ్యాల గుర్తొస్తూ ఉంది. ముఖ్యంగా, వైశాఖపున్నమి వెళ్ళగానే ఆ ఉయ్యాల రాటలు నరికేసారు. మూడడుగుల ఎత్తుదాకా మిగిల్చి పైన నరికేసారు. ఆ ఉయ్యాల మోకు తీసేసారు. ఆ రాటలు మళ్ళా ఏడాది గంగాలమ్మ పండగ దాకా అలానే ఉంచేస్తారట. మళ్ళీ ఏడాది పండక్కి ఆ రాటలు తీసేసి కొత్త రాటలు పాతి, పసుపు రాసి, మామిడాకులు కట్టి కొత్త మోకు తగిలిస్తారట. మళ్ళా పండగ పదిరోజులో పదిహేను రోజులో ఆ ఉయ్యాల ఊరంతా ఊగుతారట.

ఆ పండగ రాత్రుల్లో ఆ ఉయ్యాలలో ఎదురెదురుగా ఊగిన ఆడామగా ప్రతిసారీ భార్యాభర్తలే కాదని, పెళ్ళి కాబోయే స్త్రీపురుషులు కూడా కావొచ్చని అప్పుడు విన్నాను. అసలు వాళ్ళు పెళ్ళికాబోయే స్త్రీపురుషులే కానక్కరలేదు, ఏ ఇద్దరు యువతీయువకులేనా కావచ్చేమో కూడా. బహుశా యువతీయువకుల మధ్య సాంగత్యం గురించి, ఆ సాంగత్యానికి ఎంత వెసులుబాటు ఇవ్వాలో ఆ ఆదిమగిరిజన సమాజానికి స్పష్టంగా తెలుసేమో అనిపించింది. ఆ ఊళ్ళో పండగ అంటే అన్ని అంతస్తుల్నీ, కట్టుబాట్లనీ పక్కన పెట్టి మనుషులు మనుషులుగా దగ్గరయ్యే వేళ. కాని వారం రోజులో, రెండు వారాలో మాత్రమే. ఊరి మధ్యలో కట్టిన ఆ ఉయ్యాల ఏడాది పొడుగునా ఊగడానికి కాదు, జీవితకాలం పాటు ఊగడానికి కాదు. ఆ ఉయ్యాలని అలాగే వదిలేస్తే, అన్నిటికన్నా ముందు ఊళ్ళో పనులు ముందుకు సాగవు. కాని ఆ ఉయ్యాలే లేకపోతే, ఆ పనిపాటలకి అర్థమూ లేదు.

ఆ ఉయ్యాలతో పాటు ఆ చైత్రపున్నమి రాత్రి అడవిలో నడిచిన గిరిజననృత్యం గురించి విన్నమాటలు కూడా గుర్తొచ్చేయి. నేను చూడలేకపోయిన నాట్యం అది. అక్కడ ఒక స్త్రీ, ఆమె భుజం మీద ఒక చెయ్యి వేసి మరొక స్త్రీ నడుం చుట్టూ మరొక చెయ్యి వేసి ఒక పురుషుడు, ఆ పురుషుడి పక్కన మరొక స్త్రీ, ఆ స్త్రీ పక్కన మరొక పురుషుడు..అక్కడ మనుషులందరూ ఒకే ఒక్క దేహంగా తప్ప, విడివిడి వ్యక్తులుగా లేని ఒక ప్రాచీన జీవితోత్సవం– ఆ దిమిసా చూడటానికి ప్రతి బండమీదా దేవతలు వచ్చి కూచున్నారంటే ఆశ్చర్యం ఏముంది?

నిజమే, ఆ ఊళ్ళో మేమంతా ఒక పండగలాగే గడిపాం. మా మధ్య దేహాలస్పృహ లేదు. మేమంతా ఒకే దేహంగా గడిపాం. పాఠశాలకి కుటీరం కట్టాలంటే జమకూడిన చేతులన్నీ ఒకరివే. ఇంటింటికీ తిరిగి సర్వే చెయాలంటే వివరాలు కనుక్కున్న నోళ్ళన్నీ ఒకరివే. ఆ ఫారాలు నింపిన వేళ్ళన్నీ కూడా ఒకరివే. కాని, ఇప్పుడు, ఎందుకని, ఆ పిల్లవాడి నుంచి 'నిన్ను ప్రేమిస్తున్నానని' ఉత్తరం రాయగానే, ఎందుకని, ఎందుకని, ఇంత కల్లోలంగా ఉంది మనస్సు?

ఎప్పుడో తెల్లవారేవేళకి నిద్రపట్టింది. స్కూలుకి సెలవు పెడదామంటే హాఫ్ ఇయర్లీ పరీక్షలు. ఆ హాంగ్ ఓవరుతో అలానే పరుగెత్తాను. కాని ఆ మధ్యాహ్నం సెలవు పెట్టి ఇంటికి వచ్చేసాను. పడుకుండిపోదామనుకున్నాను. కాని ఆశ్చర్యంగా డాక్టరు సాయంకాలం నాలుగింటికే మా ఇంటికొచ్చాడు. మా అమ్మతో మాట్లాడవలసిందేదో ఉందని. మా అమ్మతో మాట్లాడి వెళ్ళిపోతూ ఉండగా, 'మనం ఎక్కడికేనా బయటికి వెళ్దామా?' అనడిగాను అతణ్ణి.

అతడు ఆశ్చర్యంగా నా వైపు చూసాడు.

'చలికాలం. ఈ వేళప్పుడు బయటికి ఎక్కడికి వెళ్తారు?' అంది మా అమ్మ. ఆమె కూడా ఆశ్చర్యపోయే ఉండాలి.

కాని డాక్టరు నన్నేమీ ప్రశ్నించలేదు.

తలూపి బయటకు నడిచాడు. బజాజ్ చేతక్ స్టార్టు చేసాడు. నేను వెనక ఎక్కాను. జీవితంలో మొదటిసారి, ఒక యువకుడి వెనక స్కూటరు మీద.

మా వీధి మలుపు తిరిగాక 'ఎక్కడికి వెళ్దాం?' అనడిగాడు.

ఎక్కడికి? ఏమో ఆలోచించలేదు.

'ఏదేనా పార్కుకి వెళ్ళి కూచుందాం' అన్నాను.

కాని డాక్టరు నన్ను నేరుగా పార్కుకి తీసుకువెళ్ళలేదు. ఉడిపి భవన్‌కి తీసుకువెళ్ళాడు. ఎప్పుడో నేను టెన్త్‌పరీక్షలు రాసినతర్వాత మా నాన్న నన్నిక్కడికి తీసుకొచ్చి కాఫీ ఇప్పించాడు. మళ్ళా ఇన్నాళ్ళకి.

డాక్టరు కూడా మాకు కాఫీ ఆర్డరు చేసాడు. పాండిచ్చేరిలో కాఫీ ఎంత బాగుంటుందో చెప్తున్నాడు. నేనేదో అనీజీనెస్సు ఫీలవుతున్నాననీ, దాన్నుంచి ఏదోలా బయటపడెయ్యడమే ఆ సాయంకాలం తన బాధ్యత అనీ అనుకున్నట్టున్నాడు.

అక్కణ్ణుంచి మునిసిపలుపార్కుకి వెళ్ళాం. ఎప్పుడూ దూరం నుంచి చూడటమే. లోపల అడుగుపెట్టింది లేదు. అడుగుపెట్టేటంత తీరిక కూడా ఎప్పుడూ దొరకలేదు.

ఆ పార్కులో ఒక బెంచీ మీద కూచున్నాం. మరీ దగ్గరగా, మరీ దూరంగా కాకుండా కూచున్నాడు. బహుశా అతని సంస్కారంలోనే ఒక మెజర్‌మెంట్ టేపు ఇమిడిపోయి ఉంటుందేమో అనుకున్నాను.

హటాత్తుగా ఒక తీపి సుగంధం నన్ను తాకింది. చుట్టూ చూసాను. మేము కూచున్న బెంచీ వెనగ్గా పార్కు ప్రహరీగోడని అనుకుని కంచెలాగా పున్నాగపూల చెట్లు. ఆ హేమంత కాలపు చివరి పూలరేకలు గాలికి రాలుతూ ఉన్నాయి. కింద రాలిపడ్డ రేకల మీద ప్రతి రాత్రీ కురిసే మంచు ఒక సూక్ష్మసుగంధలోకాన్ని సృష్టిస్తూ ఉంది. కాని ఆ ఒక్క సుగంధమే కాదు, మరొకటేదో, నా గడిచిపోయిన రోజులనుంచి, రాత్రులనుంచి నా కన్నా ముందే అక్కడికొచ్చి చేరింది. తలతిప్పి చూసాను. ఇటు కూడా పున్నాగ చెట్లే. కాని, వాటినుంచి కాదు, ఎక్కడనుంచో, ఎప్పటిదో, డైరీలోంచి పేజీలు నాతో మాటాడుతున్నట్టుగా చిరపరిచిత పరిమళం.

అప్పుడు తెలిసింది. మా బెంచీ పక్కనే మామిడి చెట్టు ఉన్నదనీ. మేము దాని నీడనే కూచున్నామనీ. నన్నంతగా కలవరపరుస్తున్నది ఆ మామిడిచెట్టు తొలిపూతనే అని.

'చూడు. ఎంత స్వీట్ ఫ్రాగ్రెన్సునో కదా' అన్నాను. చూడండి అని అనకుండా చూడు అని ఎందుకన్నానో నాకే తెలియదు. కాని ఆ రోజు, ఆ సాయంకాలం, ఆ క్షణం అతను నా పక్కన లేకపోయుంటే నాకు మతిస్థిమితం తప్పి ఉండేదని మాత్రం చెప్పగలను.

'ఫ్రాగ్రెన్సా? ఎక్కణ్ణుంచి?' అనడిగాడు. తనేమీ పెర్ఫ్యూమ్ వేసుకు రాలేదు కదా అని కూడా ఆలోచిస్తూ ఉండవచ్చు.

'మాంగో. ఇదిగో ఈ బెంచీ పక్కన చెట్టు చూడు. మాంగో ఫ్లవరింగ్ సీజను మొదలయ్యింది' అని అన్నాను.

అతను ఆ బెంచీ పక్కనున్న చెట్టుకేసి చూసాడు. కాండం తప్ప మరేమీ కనిపించలేదు. పైకి చూసాడు. కిందకి పరుచుకున్న కొమ్మల గుబుర్లు కనిపించాయి.

'ఇప్పుడిప్పుడే మొదలైన పూత కిందకి ఎలా కనిపిస్తుంది? ఫ్రాగ్రెన్సుతో గుర్తుపట్టాలి. అంతే' అని అన్నాను.

డాక్టర్ నవ్వేసాడు. 'ఓ! మీరు బోటనిస్టు కదా! అందుకే తెలుస్తుంది. మాలాంటి వాళ్ళకి ఎలా తెలుస్తుంది చెప్పండి!' అని అన్నాడు.

కనీసం ఆ ఒక్కక్షణం ఆ చిన్న విషయం అతనికి తెలియంది నాకు తెలిసిందను కోవడం గర్వంగా అనిపించింది. కాని మామిడిచెట్టుని గుర్తుపట్టడంలో ఏముంది? నేను తూర్పు కనుమల్లో దాదాపు రెండువందల వృక్షజాతుల్ని గుర్తుపట్టినదాన్ని అని చెప్పాలని పించింది. మద్ది, బూరుగ– ఎన్ని చెట్లని! 'ఓ, ఔదుంబరమా!' అని ప్రొఫెసర్ అన్నమాట నా చెవుల్లో మోగడం మొదలుపెట్టింది.

నన్ను వేధిస్తున్న సమస్య మొత్తం డాక్టరుకి చెప్పేద్దామా అని ఆ క్షణం ఎంత బలంగా అనిపించిందంటే, అతని చెయ్యి నా చేతుల్లోకి తీసుకుని ఆ మొత్తం సంగతులు చెప్పేంతసేపూ కూడా అలానే పట్టుకుని ఉండిపోదామనిపించింది. కానీ అతి కష్టమ్మీద నన్ను నేను అదుపుచేసుకున్నాను.

'మీ స్కూలు ఎలా నడుస్తోంది?' అనడిగాడు డాక్టరు. మంచి ప్రశ్న. దేవుడిలాగా అడిగాడు. ఇక ఆ తర్వాత ఆ మాటల్లో పడి కాలం మర్చిపోయాం.

పొంగలు వెకేషను అయ్యేదాకా డాక్టరు దాదాపుగా ప్రతి రోజూ మా ఇంటికి వస్తూనే ఉన్నాడు. వచ్చిన వెంటనే మా అమ్మని పలకరించేవాడు. ఆ తర్వాత రజనీని. పరీక్షలకు బాగా ప్రిపేరవుతున్నావా అని అడిగేవాడు. ఆ తర్వాత ప్రశాంత్‌తో చాలాసేపు మాట్లాడేవాడు. ఒక్కొక్కసారి వాళ్ళిద్దరూ కలిసి ఎక్కడకో పోయేవారు. లేదా వాణ్ణి వాళ్ళింటికి లంచికి తీసుకుపోయేవాడు. అతనొచ్చినప్పుడు మా నాన్న ఇంట్లో ఉంటే కొంతసేపు మాట్లాడేవాడు. అందరికన్నా అతి తక్కువ నాతోనే మాట్లాడేవాడు. అతను రాగానే, ఇంట్లో అడుగుపెట్టగానే నేనెక్కడ ఉన్నా నాకు తెలిసిపోయేది. కాని నాకు వెంటనే అతడి ఎదటపడాలని ఉండేది కాదు. అప్పుడు వంటింట్లో ఉంటే ఇంకొంతసేపు అమ్మకి సాయం చేస్తూ ఉండిపోయేదాన్ని. మా అమ్మ 'అతనొచ్చాడు' అనేది. 'తెలుసు, విన్నాను' అనే దాన్ని. ఏమి విన్నాను? అతని

అడుగులచప్పుడా? ప్రతి ఒక్కర్నీ విష్ చేస్తున్నప్పుడు గలగల్లాడే ఆ చిరునవ్వా? లేకపోతే అతనొచ్చాడని మా అమ్మ చెప్పే మాటలా? ఒకవేళ అప్పుడు నా గదిలోనే ఉండి ఉంటే తీరిగ్గా జడ అల్లుకునేదాన్ని, లేకపోతే బీరువాలో మడిచిపెట్టిన బట్టలు మరోసారి బయటికి తీసి ఒక్కొక్కటే మళ్ళా సర్దేదాన్ని. అతణ్ణి కలుసుకునేవరకూ, అతని ప్రెజెన్సుని నా మనసుతో అనుభూతి చెందేదాన్ని. అదొక ధ్యానంలాగా ఉండేది. మరే ఆలోచనలూ నన్ను చేరేవికావు. ఒకే ఒక్క ఆలోచన. ఆలోచన కూడా కాదు, ధ్యాస.

అప్పుడు నింపాదిగా హాల్లోకి వచ్చి 'హలో' అనేదాన్ని. అతను కళ్ళెత్తి ఒక క్షణం నన్ను చూసేవాడు. నా కళ్ళకేసి చూసేవాడు. నా కళ్లని బట్టి నా ఆరోగ్యం ఎలా ఉందో తెలుసుకోడానికి చూసేవాడా? నాలో ఏదో చెప్పుకోలేని నలత తలెత్తిందని అతనొక్కడే గుర్తుపట్టేడా? కాని అతను క్షణంపాటే చూసినా కూడా ఆ చూపు గొప్ప స్వస్థత చేకూర్చినట్టుగా ఉండేది. ప్రతిరోజూ క్రమం తప్పకుండా నీ ఇంటికొచ్చి నీతో అనునయంగా ఔషధం తాగించే వైద్యుడికోసం నువ్వెదురు చూడకుండా ఎలా ఉండగలవు?

హాల్లోకి వచ్చి అతణ్ణి పలకరించడంతో అప్పటిదాకా నేను అడ్డుగా వేసి పట్టుకున్న తెర ఎగిరిపొయ్యేది. ఇక మేమంతా కూచుని కబుర్లు చెప్పుకునేవాళ్ళం. అతను మమ్మల్ని నవ్వించడంకోసమే కొత్త కొత్త జోకులు చదువుకుని వస్తున్నాడని కూడా తెలిసిపోయింది.

దాదాపుగా ప్రతి సాయంకాలం ఎక్కడికో ఒకచోటకి వెళ్ళేవాళ్ళం. పార్కు, రెస్టరెంటు, లైబ్రరీ– సంక్రాంతి రోజుల్లో ఊరికే ఆ మెయిన్ రోడ్డు అంతా చుట్టివచ్చేవాళ్ళం. పొంగల్ షాపింగు కోసం కిక్కిరిసిపొయ్యే ఆ దుకాణాల మధ్య, ఆ విద్యుద్దీపాల ధగధగలో, ఆ వీథిలో నడవడమే ఒక పండగలాగా ఉండేది.

కాని మా ప్రతి కలయికలోనూ, కలిసి నడిచిన ప్రతి అడుగులోనూ ఆ మెజర్ మెంటు టేపు కూడానే ఉండేది. ఒక్కరోజు కూడా అతను నా చిటికెనవేలు కూడా తాకింది లేదు. చివరికి అతను మా నిశ్చితార్థం నాడు ఉంగరం తొడిగిన వేలిని కూడా.

పండగ అయిపోగానే డాక్టరు పాండిచ్చేరి వెళ్ళిపోయాడు. 'మళ్ళా ఎప్పుడు?' అని అడుగుదామని అనుకున్నాను, కాని నోరుపెగల్లేదు. 'ఉత్తరాలు రాస్తాను. జవాబు రాస్తారా?' అని మాత్రం అడిగాను. చిరునవ్వుతో తలూపాడు.

మా స్కూలు తెరిచారు. నా రుటీను మొదలయ్యింది. ప్రశాంత్ కూడా కాలేజికి వెళ్ళిపోయాడు. రజని కాలేజి మరొక వారం రోజుల తర్వాత తెరుస్తారు. ఇల్లంతా ఒకలాంటి శూన్యం అలముకుంది. ఏదో నిశ్శబ్దం. కాని దాన్ని భగ్నం చెయ్యాలని ఎవరికీ లేదు.

అలాంటి రోజుల్లో ఒకసాయంకాలం నేను కాన్వెంటు నుంచి ఇంటికొచ్చేసరికి రజని నా చేతుల్లో ఒక కవరు పెట్టింది,

యాభై పైసల యెల్లో కవరు. ఈసారి దాని మీద నా పేరు మాత్రమే రాసి ఉంది. ఫ్రమ్ అడ్రసు లేదు. కాని ఎవరు రాసారో తెలుస్తూనే ఉంది. ఆ కవరు చూడగానే నాకు గుండెదడ మొదలయ్యింది. గొంతు తడారిపోయింది. మౌనంగా ఆ కవరు తీసుకుని నా గదిలోకి వెళ్ళాను. ఆ క్షణాన నాకు వనలత గుర్తొచ్చింది. ఆమె చేతుల్లోకి ఇలానే ఒక పోస్టలు కవరు వచ్చిన రోజున ఆమె వెక్కి వెక్కి ఏడవడం గుర్తొచ్చింది. ఆమె ఎంత అదృష్టవంతురాలు అనుకున్నాను. ఒక ఉత్తరం నీ చేతుల్లోకి వస్తే ఇలా గుండెదడ వచ్చే పరిస్థితి ఏ ఆడపిల్లకీ సంభవించకూడదనుకున్నాను.

ఆ ఉత్తరం తెరవాలా వద్దా? పొద్దున్నే స్కూలుకి వెళ్ళేటప్పుడే దాన్ని చింపి డ్రైనేజిలో పారేస్తే మంచిది కదా అనుకున్నాను. కాని ఏదో కుతూహలం నన్ను ముందుకునెడుతూ ఉంది. ఏమి రాసి ఉంటాడో చదివి అప్పుడు చింపేద్దాం అనుకున్నాను. నెమ్మదిగా కవరు తెరిచి, ఆ కాగితాలు బయటికి తీసాను. ఈసారి చిన్న ఉత్తరమే. రెండు పేజీలే రాసాడు.

కాని ఉత్తరం మొదలవుతూనే 'నా ప్రియమైన విమలా–'

నాకు గుండె ఊడి చేతుల్లో పడ్డట్టయింది. కళ్ళు తిరిగాయి. కష్టమ్మీద తక్కిన వాక్యాలన్నీ చదివాను. గదిలో బీరువాని ఆనుకుని అలాగే కొన్ని క్షణాలు నిలబడిపోయాను. ఆ ఉత్తరం మడిచి కవర్లో పెట్టి, ఆ కవరు నా హాండుబాగులో పెట్టుకున్నాను. అమ్మకి సాయం చెయ్యడానికి వంటింట్లోకి వెళ్ళాను.

నాకు ఒక సంగతి అర్థమయింది. నేను అక్కడున్నప్పుడు ప్రొఫెసర్ సేన్‌గుప్త నాకొక ఆదర్శంగా ఉండేవాడు. కాని రాజు ఆయన్ని డ్రీమరంటూ ఎకసెక్కం చేసేవాడు. అతనికి డా.మిశ్రా ఒక ఆదర్శంగా మారుతున్నాడని తొందరలోనే గ్రహించాను. మిశ్రా 'చాలా ప్రాక్టికల్' అనే వాడు. కాని ఇదేమిటి? ఇప్పుడు రోల్ మోడళ్ళు రివర్సు అయ్యారని తెలుస్తోంది. రాజు డ్రీమరుగా మారుతున్నాడు. నేను ప్రాక్టికలుగా మారుతున్నాను. అలా మారకతప్పదని కూడా తెలుసుకున్నాను.

ఎన్నో ఏళ్ళ తర్వాత నేనొక నవల చదివాను. అందులో రెండు మూడు కుటుంబాలు వనభోజనాలకి అడవికి వెళ్తారు. వాళ్ళ పిల్లలు, వరసకి బంధువులు, చిన్న పిల్లలు

ఆడుకుంటూ వాళ్లకి తెలీకుండానే అడవిలోకి వెళ్ళిపోతారు. కొంతసేపటికి తాము దారితప్పామనీ, తమ వాళ్లనుంచి దూరంగా వచ్చేసామనీ గ్రహిస్తారు. భయపడతారు. అటూ ఇటూ పరుగెడతారు, చివరికి ఎలాగైతేనేం వెనక్కి వస్తారు, తమ వాళ్లని కలుసుకుంటారు. కాని ఆ కథానాయకుడు, తన జీవితంలో తర్వాత ఎప్పుడో ఆ సంఘటన తలుచుకుంటూ, ఆ రోజు ఆ అడవిలో మాకేమైందో తెలీదుగాని, మేము అడవినుంచి బయటికి వచ్చేటప్పటికి అకస్మాత్తుగా పెద్దవాళ్లమైపోయాం అంటాడు.

అచ్చం అలాంటి సంఘటననే మా జీవితాల్లోనూ సంభవించింది. ఆ వైశాఖమాసపు అపరాహ్ణం మేము ఆ కొండవార లోయలోకి వెళ్ళినప్పుడు వర్షం పడ్డప్పుడు మేమిద్దరమే ఆ అడవిలో ఒంటరిగా గడిపాం. అప్పుడు మా మధ్య ఏమీ జరగలేదు. కానీ ఇన్ని నెలల తర్వాత, నాకు తెలుస్తున్నది, ఆ పిల్లవాడు మరింత చిన్నపిల్లవాడైపోయాడు. నేను మరింత పెద్దదాన్నైపోయాను.

రాజు అనే ఆ పిల్లవాడు జియొలాజికల్ టైములో జీవించడం మొదలుపెట్టాడనీ, నేను సోషియొలాజికల్ టైములో అడుగుపెట్టాననీ నన్ను నేను సముదాయించుకున్నాను. కానీ, ఈ ఉత్తరాలేమిటి? ప్రేమ అనేది మాటల్లో ప్రకటించేదికాదని వనలత చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. నిజంగా ఆ పిల్లవాడికి నా మీద ఉన్నది ప్రేమే అయితే, ఈ ఉత్తరాలు రాసేవాడే కాదనిపించింది. ప్రేమ అంటే అన్నిటికన్నా ముందు ఎదటిమనిషిని ఏ విధంగానూ ఇబ్బంది పెట్టకపోవడం కదా.

ఆ ఆలోచనలు సాగుతున్నప్పుడు అనుకోకుండానే అతణ్ణి డాక్టరుతో పోల్చుకున్నాను. డాక్టర్ ఇప్పటిదాకా 'ఐ లవ్ యూ' అనే మాట ఒక్కసారి కూడా చెప్పలేదు. అసలు అటువంటి మాట చెప్పవలసిన అవసరం ఉన్నట్టే అతనికి తోచి ఉండదు. అతను నన్ను తనమనిషిగా కాక, ముందు ఒక మనిషిగా గుర్తిస్తున్నాడు, నా స్పేస్ నాకిస్తున్నాడు అనిపించింది. ఆ ఉంగరమే చూడు, దాని మీద 'ఎస్' అని ఎందుకు చెక్కించాలి? అది మా ఇంటిపేరు కదా. 'వి' అనే అక్షరమే పొదిగించి ఉండవచ్చు కదా!

కాని నా మనసులో అలాంటి పోలిక రాగానే ముందు నా మనసులోనే ఒక భాగం చాలా కుంచించుకుపోయింది. నువ్విలా కూడా ఆలోచించగలవా అని నన్నెవరో ఎత్తి చూపిస్తున్నట్లుగా తోచింది.

'కమాన్, టెల్ మీ. ఎప్పుడు, ఎప్పుడేనా ఆ పిల్లవాడు నీ స్వాతంత్ర్యాన్ని, నీ గౌరవాన్ని భంగపరిచిన మాట, చేత– ఒక్కటంటే, ఒక్కటేనా ఉందా చెప్పు?'

నా ఆలోచనలు ఇంక ముందుకు సాగడం అసాధ్యమనిపించింది. ఎలాగేనా డాక్టరు వచ్చేస్తే బాగుణ్ణని బలంగా అనిపించింది. ఏమీ మాట్లాడక్కర్లేదు. అతను వచ్చి హాల్లో కూచుంటే చాలు, నా ఆలోచనలు మొత్తం కట్టడైపోతాయనిపించింది.

❋

29

ఆ తర్వాత ఒక నెల రోజుల పాటు మామూలుగానే గడిచింది. పగలంతా కాన్వెంటూ, రాత్రుళ్ళు డాక్టరు గురించిన తలపులూ. నెమ్మదిగా ఆయనకి ఉత్తరాలు రాయడం మొదలు పెట్టాను. ప్రతి ఉత్తరంలోనూ మామూలు విషయాలే, రోజువారీ సంగతులే రాసేదాన్ని. నీ కంటూ ఒకమనిషి ఉండి, చిన్నవో, పెద్దవో, నీది ప్రతి ఒక్క విషయం పంచుకోడంలో ఉన్న సంతోషం నెమ్మదిగా అనుభవానికొస్తూ ఉండింది. ప్రతి ఉత్తరానికీ డాక్టరునుంచి విధిగా జవాబు వచ్చేది. కాని ఏ ఉత్తరమూ పది పదిహేను వాక్యాలకి మించి ఉండేది కాదు. ఆ చేతిరాత కూడా ప్రిస్క్రిప్షను రాసినట్టే ఉండేది. చాలా పొడి పొడి వాక్యాలు. అందులో సగం కుశలప్రశ్నలే ఉండేవి. మా అమ్మ ఆరోగ్యం, మా చెల్లెలి చదువు, మా తమ్ముడు ఉత్తరాలు రాస్తున్నాడా, నాన్న ఎలా ఉన్నాడు– ఇంక తక్కినవన్నీ తన చదువుగురించీ, పాండిచ్చేరిలో విశేషాలేవైనా ఉంటే అవీ, ఆ మధ్యలో ఏమైనా సినిమాలు చూసి ఉంటే, ఆ సంగతులూ.

ప్రతి ఉత్తరం 'హలో మిస్' అని మొదలయ్యేది. చివరలో 'యువర్స్' అనే పదమూ, దానికింద సంతకమూ ఉండేవి. ఆ 'యువర్స్' అనే మాట చూడటం నాకెంతో ఆప్యాయంగా ఉండేది. ఆ పదిపన్నెండు వాక్యాల 'ప్రిస్క్రిప్షన్' పదే పదే చదువుకునేదాన్ని. మేమిద్దరం ఒక ఇంట్లో ఉండబోతాం, కలిసి ఒక గూడు కట్టుకోబోతాం లాంటి ఆలోచనలదాకా నా ఊహలు నడిచేవని చెప్పలేనుగాని, నాకు దగ్గరగా ఎవరో ఒక మనిషి ఉన్నాడు, అతను నా పక్కనొచ్చి నిలబడతాడు అనే ఊహ కలిగేది. ఆ ఉత్తరం చదవడం ముగించగానే కిటికీ బయట ఎవరో ధారాళంగా సూర్యకాంతిని కుమ్మరిస్తున్నట్టుండేది.

ఫిబ్రవరి నెల చివరలోనో, మార్చి నెల మొదటివారమో గుర్తులేదు. ఇంటికి వచ్చేటప్పటికి ఆలస్యం అయింది. రజని ఇంకా ఇంటికి రాలేదు. నాన్న కూడా ఇంట్లో

లేదు. నేను ఎప్పట్లానే నా గదిలోకి వెళ్ళాను. అక్కడ మంచం మీద ఒక కవరు కనిపించింది. చూడగానే అది రాజునుంచి వచ్చిందే అని గుర్తుపట్టేను. ఆ కవరు చేతుల్లోకి తీసుకుని చూద్దును కదా, దాన్ని ఎవరో అప్పటికే చింపినట్టు కనిపిస్తోంది.

నా గుండె కొట్టుకోడం ఆగిపోయినట్టయింది. మోకాళ్ళల్లో వొణుకు వచ్చేసింది. ఆ కవర్ని పట్టుకుని అట్లానే నిలబడిపోయాను. కొంతసేపటికి ధైర్యం కూడదీసుకుని ఆ ఉత్తరం తెరిచి చదివాను. థాంక్ గాడ్! అందులో కవిత్వం ఉంది. కాని ఆ కవిత్వం చదవగానే నాకు చాలా బెంగగా అనిపించింది. మొదటి ఉత్తరం వచ్చినప్పటి భయం రెండో ఉత్తరానికి సగానికి సగం తగ్గిపోయింది. కాని, ఈసారి భయం కాదు, ఎందుకో వేదన తోచింది. ఆ కవిత చదివి, ఆ కాగితాలు మళ్ళా కవర్లో పెట్టబోతుండగా, ఇంకా ఏదో ఆ కవరులో ఉండిపోయినట్టుగా చేతులకి తగిలింది. తీసి చూద్దును కదా-

బూరుగపువ్వు!

ఎర్రటి పువ్వు. అయిదు రేకలు. వాటి మధ్యలో నలిగిపోయినా కూడా, ఇంకా బిగించిన తంత్రుల్లాగా, ఏదో సంగీతాన్ని వినిపించడానికి నాకేసి చూస్తున్న కేసరాలు.

ఆ పువ్వుని చూడగానే నాకు మాఘ-ఫాల్గుణాల మధ్యకాలం నడుస్తోందని గుర్తొచ్చింది. బహుశా చెట్టుకింద రాలిన ఒక తాజాపువ్వుని ఏరి పంపించి ఉంటాడు. అది ఆ అడవినుంచి నా చేతుల్లోకి వచ్చేటప్పటికి నల్లబడింది, చూస్తూండగానే మరికొన్నాళ్లకు ఎండిపోతుంది. కాని దాన్ని అంటిపెట్టుకుని ఏకంగా ఒక అడవిమొత్తం నాదాకా ప్రయాణించి వచ్చింది. దానిమీద మాఘఫాల్గుణాల వెన్నెల కురిసి ఉంటుంది. నక్షత్రధూళి రాలి పడి ఉంటుంది. ఆ పువ్వు రంగులు పోసుకుంటున్నప్పుడు ఎంతో సూర్యరశ్మి దాని ఈనెల్లోకి ప్రవహించి ఉంటుంది. అప్పటికే సగం వాడిపోతూ ఉన్న ఆ పువ్వుని చేత్తో పట్టుకున్నాను. భగవంతుడా! అతని ఉత్తరాలు, మాటలు, చివరికి ఆ కవితలు కూడా చొరలేని ఏదో తావుని ఆ తేనెమరక స్పృశించింది. అది నా గుండె మీద సన్నని గాటుపెట్టింది.

ఆ కవిత నాకేమీ అర్థం కాలేదు. కాని అతనొక డ్రీమ్ టైములోకి ప్రవేశించాడని అనుకున్నాను. కాని వెనువెంటనే 'ఏం? నువ్వు మాత్రం బయట ఉన్నావా? నువ్వు కూడా ఒక డ్రీమ్‌టైములోనే కదా జీవిస్తున్నావు?' అని నన్ను నేనే ప్రశ్నించుకున్నాను. రెండు స్వప్న ప్రపంచాలు ఒకదానికొకటి ఎదురయినప్పుడు, అవి కలవలేకపోతే, కనీసం

మృదువుగా పక్కకు జారిపోవాలి కదా! బూరుగదూది పింజల్లాగా తేలిపోవాలి కదా! కాని కీచుమంటో ఈ చప్పుడేమిటి?

చాలా ఏళ్ళ కిందటి మాట. మేము మొదటిసారి ఇటలీ వెళ్ళినప్పుడు డాక్టరు ఒక కారు రెంటలుకి తీసుకుని నన్ను లాంగ్ డ్రైవుకి తీసుకువెళ్లాడు. ఆ హైవే మీద కను చూపు మేరలో ఎక్కడా మరొక వాహనం కూడా కనిపించడంలేదు. ఇంతలో ఏదో కీచుమంటూ చప్పుడు వినిపించడం మొదలుపెట్టింది. ఆ చప్పుడు వినగానే డాక్టరు ఉలిక్కిపడి బండి వేగం పెంచగానే మళ్ళా కీచుమంటూ చప్పుడు. ఏదో వైబ్రేషను మాకు తెలుస్తూ ఉంది. ముందు మేం మా కారులో ఏదన్నా డిఫెక్టు ఉందేమో అనుకుని భయపడ్డాం. మరికొంతదూరం అలానే భయంతోనే నడుపుకుంటూపోయేక ఒక సెక్యూరిటీ ఔట్ పోస్టు దగ్గర అసలు సంగతి తెలిసింది. అవి రంబుల్ స్ట్రిప్పు అని. రోడ్లమీద డ్రైవర్లు హైవే-హిప్నొసిసుకి లోనవకుండా ఏర్పాటు చేసిన అలర్ట్ స్ట్రిప్పులని.

బహుశా అతని స్వప్నలోకం, నా స్వప్నలోకాన్ని తాకినప్పుడు నాలో వస్తున్న హెచ్చరికలు కావచ్చు ఆ చప్పుళ్లు. అతనొక హైవే- హిప్నొసిసుకి లోనై ఉండవచ్చు. కాని నేను అతనిలాగా వేగంగా, మరేదీ పట్టకుండా పోలేనని కూడా నాకు తెలుసు.

నిజానికి, ఆ ఉత్తరమూ, ఆ ఉత్తరాన్ని నా కన్నా ముందే ఎవరో చింపి చదివారన్న సంగతీ నన్నెంత భయపెట్టిఉండాలి? నీరసపెట్టి ఉండాలి! కాని ఆ చిన్న పువ్వు నా అలసటనీ, భయాల్నీ, టెన్షనునీ మటుమాయం చేసేయడమే కాక, చాన్నాళ్ల తరువాత మొదటిసారిగా ఆ పిల్లవాడి గురించి స్థిమితంగా ఆలోచించేటట్టు చేసింది.

నిజమే. ఆ పిల్లవాడు ఉత్తరాలు రాయడంలో తప్పేముంది? ఆ ఉత్తరాల్లో నిజంగా అభ్యంతరపెట్టేదేముంది? ఎవరన్నా చదివితే మాత్రం ఏమవుతుంది? అయినా కూడా ఆ పిల్లవాడు నాకు ఉత్తరాలు రాయకుండా ఉంటేనే బాగుండనిపించింది. ఉత్తరాలు రాయకపోవడమే కాదు, అసలు నా గురించి ఆలోచించకుండా ఉంటే నేను మరింత సంతోషంగా ఉంటాననిపించింది. నిజమే, మేము చిన్నపిల్లల్లాగా కొన్ని రోజులు ఒక యేటి ఒడ్డున ఇసుకలో ఆడుకుని పిచ్చికగూళ్ళు కట్టుకున్నాం. కాని ఆ ఆటముగిసాక ఆ గూళ్ళు కూలదోసేసుకుంటాం కదా. అక్కడే ఉండిపోలేం కదా. వాటిని ఇంటికి తెచ్చుకోలేం కదా. నిదానంగా ఆలోచిస్తే, అతని ముందు రెండు దారులున్నాయనిపించింది. ఒకటి, బాగా చదువుకుని సివిల్ సర్వీసు పరీక్షలు రాసి ఉన్నతోద్యోగం సంపాదించుకుని నలుగురికీ పనికొచ్చే పనులు చెయ్యడం. లేదా ఒక సామాజిక కార్యకర్తగా మారి ప్రజలతో కలిసి

మెలసి జీవిస్తూ వాళ్ళకోసం పనిచెయ్యడం. ఏ విధంగా చూసినా ఇలా కవిత్వం రాసుకోవడం అతనికి తగదనిపించింది. నేను జవాబులివ్వకపోయినా ఇలా ప్రేమలేఖలు రాస్తూ ఉండటం అతని స్వభావానికి తగదనిపించింది. అతను ఎక్కడో దారితప్పుతున్నాడు అనిపించింది.

ప్రేమ అని పదే పదే ఉత్తరాలు రాస్తున్న ఆ పిల్లవాడికి నిజంగా ప్రేమ గురించి తెలిస్తే అలా ఉత్తరాలు రాయడు కదా అనుకున్నాను. తనకి జవాబు రాయకపోయినా పదే పదే ఉత్తరాలు రాయడం బాధ్యత లేకపోవడం తప్ప మరేమీ కాదని కూడా చెప్పుకున్నాను. ప్రేమ అన్నిటికన్నా ముందు అపరిమితమైన బాధ్యత. బాధ్యతారాహిత్యాన్ని మించిన వైల్డ్ నెస్ మరొకటి ఉండదు. కాని వైల్డ్‌నెస్ అనే మాట స్ఫురించగానే ప్రొఫెసరు సేన్‌గుప్త గుర్తొచ్చాడు. ఆ వయసు పిల్లలు 'వైల్డ్' గా కాకపోతే మరోలా ఎలా ఉంటారని అడుగుతాడేమో. కాని మరి ఆయనెందుకు అతనికి ఉత్తరం రాయలేదు? కనీసం నాకు రాసిన ఉత్తరంలోనైనా అడిగానని మాటమాత్రమేనా ఎందుకు రాయలేదు? వైల్డ్ పీపులుకి మనం ఉత్తరాలు రాయక్కర్లేదా? వాళ్ళు ఉత్తరాలు రాస్తే జవాబులివ్వక్కర్లేదా?

మొదటి రెండు ఉత్తరాల్లానే ఈ ఉత్తరం కూడా వెంటనే చింపేసాను. దాన్ని చింపడంకోసం మర్నాడు పొద్దున్న స్కూలుకి వెళ్ళేదాకా ఆగాల్సిన పనిలేదనిపించింది. అదీకాక దాన్నెవరో అప్పటికే చింపి చదివారు కూడా. కానీ, ఆ పువ్వు! ఆ పువ్వునేం చెయ్యాలి? దాన్ని పారెయ్యలేకపోయాను. ఆ పువ్వుమీద కూడా ఒక ప్రేమలేఖ రాసి ఉందిగాని, అది సూర్యలిపి. మనుషులకి బోధపడేది కాదు.

అప్పటికి దాన్నెక్కడ దాచాలో తెలియక, అల్మైరాలో పైనే ఉన్న పారడైజ్ లాస్ట్ పుస్తకం పేజీల్లో భద్రంగా పెట్టాను. కాని ఆ రోజు అక్కడ పెట్టానన్న సంగతి ఇదిగో, ఇప్పుడు, గుర్తొస్తున్నది. ఏమైపోయిందో ఆ పువ్వు!

ఆ రాత్రి మా భోజనాలయ్యాక, మేమిద్దరమే ఉండగా చూసి మా అమ్మ నెమ్మదిగా నాతో 'ఆ కవరు నేనే చింపాను' అన్నది. ఆమె ఆ మాట అనగానే నిజానికి నా గొంతులో తడారిపోయి ఉండాలి. కాని అందులో ఉన్నది ఒక కవితా, ఒక పువ్వూ మాత్రమే అని తెలిసింది కాబట్టి, నేను ఆమెకేసి చూడకుండానే 'ఏమోనమ్మా పిచ్చి రాతలు రాస్తుంటాడు. ఎలా చెప్పాలో తెలియడం లేదు' అని మటుకే అనగలిగాను. అప్పుడు ఆమెకేసి చూసాను.

మా అమ్మ ఏమీ అనలేదు. ఆమె చూపులు నా మీద లేవు.

ఆ తర్వాత మళ్ళా ఎప్పుడూ అతణ్ణుంచి నేను ఉత్తరాలు అందుకోలేదు. నాకు నిశ్చయంగా తెలుసు: అతను మరికొన్నాళ్ళ పాటు ఉత్తరాలు రాస్తూనే ఉండి ఉంటాడు, కాని మా అమ్మ వచ్చినవాటిని వచ్చినట్టే చింపేస్తూ ఉండి ఉంటుందని. మరికొన్ని రోజులు పోయేకనో, లేదా మరికొన్ని వారాలు పొయ్యేకనో, 'అమ్మా! నాకేమన్నా ఉత్తరం వచ్చిందా?' అని అడగాలనిపించినా, మళ్ళా ఎప్పటికీ, అడగలేనట్టుగా ఒక కంచె కట్టేసింది మా అమ్మ అని కూడా నాకు అర్థమయింది.

ఆ తర్వాత నన్ను అతడి తలపులు కూడా బాధపెట్టడం మానేసాయి. మార్చీ, ఏప్రిలూ కూడా త్వరత్వరగా గడిచిపోయేయి. స్కూళ్ళకీ, కాలేజీలకీ సెలవులిచ్చారు. రజని థర్డియరు పరీక్షలు బాగానే రాసింది. ప్రశాంత్ కూడా ఇంజనీరింగు మొదటి ఏడాది పూర్తి చేసుకుని సమ్మరు హాలిడేసుకి ఇంటికొచ్చాడు.

ఆ వేసవి అంతా మేము వర్షాకాలంకోసం ఎదురుచూస్తూ గడిపాం. ఇంకా చెప్పాలంటే శ్రావణమాసంకోసం ఎదురుచూస్తూ గడిపేం. మే నెల రెండోవారానికల్లా డాక్టరు కూడా పాండిచ్చేరినుంచి వచ్చేసాడు. దాదాపుగా ఆ రెండుమూడు నెలలూ మేమంతా ఉల్లాసంగా తుళ్ళిపడుతో గడిపేం. శివశంకర్ ఉద్యోగంలో ఉన్నాడు కాబట్టి రోజూ రాలేకపోయేవాడు. ఎప్పుడేనా మేము డిన్నరుకో, సినిమాకో వెళ్తే తను కూడా వచ్చి మాతో కలిసేవాడు. ఆదివారాలు మాత్రం తప్పనిసరిగా మాతోనే గడిపేవాడు.

జూన్ నెల మొదలయినప్పణ్ణుంచీ నాన్నకి ఒక రకమైన ఆందోళన తగ్గి మరొక రకమైన ఆందోళన మొదలయ్యింది. అప్పటిదాకా ఈ పెళ్ళిళ్ళు నిశ్చయమేనా, ఇవి నిజంగానే జరుగుతాయా అన్న ఆందోళన ఉండేది. రోజూ మా అమ్మా నాన్నా ఎప్పుడూ మాటాడుకునే మాటలే మాటాడుకుంటూ, చెప్పుకున్న భయాలే మళ్ళా మళ్ళా చెప్పుకుంటూ ఉంటే విని విని నాకు విసుగెత్తిపోయింది. తీరా మరొక నెలా, రెండునెలల్లో పెళ్ళి ముహూర్తం దగ్గర పడుతోందన్నప్పణ్ణుంచీ నాన్నకి పెళ్ళి ఏర్పాట్ల ఆత్రుత మొదలయ్యింది. మా బంధువుల్లో ఆయనకి తోడుగా నిలబడి పెళ్ళి పనులు నెత్తిన వేసుకునే మనుషులెవరూ లేరు. ఆయన కంపెనీలో పనిచేసే సహోద్యోగులకి చిన్నవో పెద్దవో పనులు అప్పగించ వచ్చుగాని, నాన్నకి అది ఇష్టం లేదు. దాంతో చాలా పనులు డాక్టరే దగ్గరుండి చూసుకోవలసి వచ్చింది. డాక్టరుతో పాటు నేను కూడా. అది కూడా మాకు ఉల్లాసంగానే ఉండింది.

అన్ని పనుల్లోకీ నాకు సరదా వేసిన పని శుభలేఖలు అచ్చొత్తించడం. మా అందరి ఇళ్ళల్లోనూ అదే మొదటి వేడుక కాబట్టి మా ముందేమీ శుభలేఖల నమూనాల్లేవు. ముందు ఆ కార్డులు అమ్మే షాపుని పట్టుకున్నాం.

అందులో పది రకాల మోడళ్ళు ఎంచుకుని ఇంటికి తీసుకొచ్చి అందరికీ చూపించి ఏదో ఒకటి సెలక్టుచెయ్యమన్నాం. ప్రజాస్వామిక పద్ధతిలో మేము ఆ మోడల్ని ఎంపిక చెయ్యలేమని రెండురోజుల తర్వాత అర్థమయింది. మా ఇంట్లోనూ అదే పరిస్థితి. డాక్టరు ఇంట్లోనూ అదే పరిస్థితి. ఒకరికి నచ్చిన మోడలు ఇంకొకరికి నచ్చదు. ఏం చెయ్యాలి?

చివరికి మేమిద్దరం కూచుని ఒక రాజీ ఫార్ములా ప్రతిపాదించాం. అందరికీ నచ్చిన అన్ని డిజైన్లలోనూ కొన్ని కొన్ని కార్డులు ఒక్కొక్కరి పేరుమీదా ప్రింటు చెయ్యాలనుకున్నాం. కార్డులు ప్రింటయ్యాక మా నాన్నతరఫున అమ్మ తరఫునా పంచడానికి పెద్దగా ఎవరూ లేరు. నేను కొన్ని కార్డులు మా కాన్వెంటులో కొలీగ్సుకి ఇచ్చాను. ఒకటి సిస్టర్ ధన్యకి ఇచ్చాను. మరొకటి దేవసహాయంగారికి ఇద్దామనుకుంటే ఆయన ఊళ్ళో లేరు. అది కూడా సిస్టర్‌కే ఇచ్చి ఆయనకి అందచెయ్యమని చెప్పాను.

సూర్యనారాయణదంపతులకి మా నాన్న వైపునుంచి కార్డు పంపించాను. జోసెఫ్ గారికి, రోజాకు కూడా జోసెఫ్‌గారికే పంపించాను. ప్రొఫెసర్ సేన్‌గుప్తకీ, డా.మిశ్రాకీ కూడా కార్డులు పంపించాను. వనలతకి కార్డుతో పాటు చిన్న ఉత్తరం కూడా రాసాను. ఆమె పంపిన చీర నా వెడ్డింగుకి తప్పకుండా కట్టుకుంటానని రాసాను.

అప్పుడు, అప్పుడు– మళ్ళా ఒకసారి రాజు నా తలపుల్లో మెదిలాడు. అంతమందికి నా పెళ్ళివార్త తెలిసాక అతనికి ఎలానూ తెలుస్తుంది. కాని నా వెడ్డింగుకార్డు అతనికి పంపాలా వద్దా? తేల్చుకోలేకపోయాను. అతనికి నా పెళ్ళి నిశ్చయమైందని తెలిసే అవకాశమే లేదనీ, తెలిసి ఉంటే, ఆ ఉత్తరాలు రాసి ఉండేవాడు కాదనీ నాకు అప్పటికి రూఢి అయ్యింది. అయినాకూడా అతనికి నా వెడ్డింగు కార్డు పంపడం సమంజసమో, పంపించకపోడం సమంజసమో తేల్చుకోలేకపోయాను. ఎవరినీ సలహా అడిగే విషయం కూడా కాదాయె!

నాలో నేనే ఏ పక్షం వైపూ మొగ్గలేక, ఎటూ తేల్చుకోలేక ఆ కార్డు నా సూట్ కేసు అడుగున పడేసాను. ఆ విషయమే మర్చిపోయాను.

ఎన్నో నెలల తర్వాత, నా సామానులన్నీ మా కొత్త కాపురానికి తరలిస్తూ ఉన్నప్పుడు, సూట్ కేసులు సర్దుకుంటూ ఉంటే, ఆ కార్డు కనబడింది. అప్పట్లో దానికి రాసిన పసుపుతోబాటే, అప్పుడు స్ప్రే చేసిన పెర్ఫ్యూము కూడా ఆ కార్డుని అంటిపెట్టుకునే ఉంది.

❋

30

నలభై ఏళ్లయింది. ఇప్పుడు మళ్ళా మరొక వైశాఖమాస ప్రభాతాన ఇలా కూచుని, నా జీవితంలో ఒకప్పుడు, రెండు వైశాఖమాసాలమధ్య నేలకీ నింగికీ మధ్య ఊయెలూగిన నా మనోడోలికను నేనే ఆశ్చర్యంగా పరికిస్తో వున్నాను.

నగరంలో కోకిల అందరికన్నా ముందు తాను లేచి ప్రపంచాన్ని మేల్కొల్పుతోంది. ఇప్పణ్ణుంచి రాత్రిదాకా అది చిన్నపిల్లలాగా ఆకాశం తలుపులు ఊరికే తెరిచి మూస్తూ మళ్లా తెరుస్తూ ఉంటుంది. నా ఎదట ఉన్న పచ్చతురాయి చెట్టు మీద ఎన్నో రకాల పక్షులు వచ్చి వాలుతుంటాయి. ఏపాటి చిరుగాలి వీచినా ఆ పూలరేకలు జలజలమని రాలిపోతుంటాయి. 'నీ జీవితంలో నువ్వెవరినైనా ప్రేమించేవా?' అని మధురిమ నన్ను అడిగిన తర్వాత ఈ నెలరోజులుగానూ ఈ చెట్టునే చూస్తో, ఈ పూలరేకల జాడలు పట్టుకుని నా లోపలకి నేను ప్రయాణం చేస్తూ వచ్చాను.

ఇది నోస్టాల్జియానే. నేను దాటివచ్చిన కాలానికీ, స్థలానికీ ఎలానూ పోలేనని తెలుసు. కాని నేను అప్పటి నా మనఃస్థితికి ప్రయాణించగలనా అని చూశాను. నన్ను నేను మభ్య పెట్టుకోకుండా, అప్పటి నా ఆనందాలకీ, భయాలకీ మరొకమారు చేరుకోగలనా అని చూసాను. నా మీదా, మరొకరిమీదా ఎటువంటి తీర్పులూ తీర్చకుండా, అప్పటి నా మనఃస్థితిని తిరిగి అందుకోగలనా అని చూసాను. నేను ఎంత వరకూ సఫలురాలినయ్యానో నాకు తెలీదు.

'ప్రేమించావా?' అని కదూ అడిగింది. ప్రేమ అంటే ఏమిటి? ఇప్పటికీ నాకు ఈ ప్రశ్నకి అర్థం తెలియలేదు. ఇన్నేళ్ల జీవితంలో బాధ్యత అనే మాటని అర్థం చేసుకోగలిగాను.

మోహం అంటే ఏమిటో కూడా తెలుసుకోగలిగాను. ఇన్నేళ్ళ జీవితంలో రకరకాల మనుషుల పట్ల రాగద్వేషాలు కూడా ఏదో ఒక మేరకు అనుభవంలోకి వస్తూనే ఉన్నాయి. ఆ పరిభాష లోంచే చూస్తూ, ప్రేమని కూడా మనం స్త్రీపురుషుల మధ్య తలెత్తే ఒక ఆకర్షణగా, ఉద్వేగం, ఉన్మాదంగా గుర్తుపడుతున్నామా? ఆ అవస్థలన్నిటినీ కలిపికట్టి ప్రేమ అని పిలుస్తున్నామా?

అలా అయితే నా కథ ప్రేమకథ కాదు.

ప్రొఫెసర్ సేన్‌గుప్త ఒక రోజు ప్రేమ గురించి చెప్తూ దాన్నొక సింబాలిక్ ఫ్రేమ్‌వర్క్ అనడం గుర్తుంది. ఒకరినొకరు ప్రేమించుకుంటున్నామన్న ఏ రెండు హృదయాలైనా ఆ ఫ్రేమ్ వర్కులో ఇమడకపోతే, ఒకరి ప్రేమ మరొకరికి అర్థం కాదని ఆయన చెప్పినమాటలు బాగా గుర్తున్నాయి. ఆ మాట చెప్పడానికి మొత్తం మానవజాతి పరిణామం మీదనే ఆయనొక పెద్ద లెక్చరిచ్చాడు అవాళ.

కాని నిజంగా నా జీవితానుభవానికి వచ్చినప్పుడు ఆ మాటల వల్ల ఏమీ తెలియలేదు. ప్రేమ అనే రెండు అక్షరాలు నన్ను తీవ్రంగా భయపెట్టినప్పుడు ఆయన మాటలు నాకేమీ ఓదార్పునివ్వలేదు. అసలు ప్రేమని ఇంటలెక్చువలు పరిభాషలో ఎప్పటికీ అర్థం చేసుకోలేం అనిపించింది. ఆయన మాటలేకాదు, నేను చదివిన ఏ ప్రేమకథా కూడా నాకు దారి చూపించలేదు.

నా పెళ్ళయిన తర్వాత ఎన్నో ఏళ్ల పాటు నాలో ఒక ప్రశ్న కదలాడుతూనే ఉండింది. 'అంతా బాగానే ఉంది. అతను నిన్ను ప్రేమిస్తున్నానని రాసాడు. నీకతని మీద ప్రేమ కలగలేదు. సరే. కానీ ఆ మాటే అతనికి చిన్న చీటీ రాసి ఉండవచ్చు కదా! ఎందుకు? ఎందుకని అతనికి కనీసం చిన్న కార్డు కూడా రాయలేకపోయావు? ఎందుకని అతనికి నీ వెడ్డింగు కార్డు పంపలేదు? పంపితే అతని హృదయానికి గాయమవుతుందనే అత్యంత బలహీనమైన భావన ఏదో, నీలోపల్లోపల కదలాడుతూ ఉందా? ఏం అతను బాధపడితే నీకేమిటి? నువ్వతణ్ణి ప్రేమించడం లేదు కదా!'– ఇదీ ప్రశ్న.

ఇన్నాళ్ళుగా నా తలపోతల్లో గడుపుతూ వచ్చాక ఇప్పుడు నాకు అర్థమయిందేమంటే, నేను కూడా ఆ రోజుల్ని ఎంతో గాఢంగా ప్రేమించానని. ఆ రోజుల్లో భాగంగా అతణ్ణి కూడా ప్రేమించానని. ప్రేమ– అంటే, ఇప్పటి పిల్లలు చెప్తుంటారే– 'అతనంటే నాకు ఫీలింగ్సు కలుగుతున్నాయి' అనో లేదా 'అతనికి నా మీద ఫీలింగ్సు ఉన్నాయి కాని, నాకు లేవనో'– అలాంటి అర్థంలో కాదు. ప్రేమంటే అలాంటి పొసెసివ్ ఫీలింగు కానే కాదు.

ఎక్కడో చదివాను, నోస్టాల్జియా అన్నిటికన్నా ముందు మనల్ని ప్యూరిఫై చేస్తుందని. నా తలపోతలు నన్ను నా ముందు సాహసంగా నిలబడేటట్టు చేసాయని ఇప్పుడు తెలుస్తోంది. ఇన్నాళ్ళూ నన్ను నేను ముఖాముఖి ఎదుర్కోలేకపోయాను. నా అంతరాంతరాల్లో ఏదో ఆరని దీపంగా వెలుగుతూ ఉంది గాని, ఆ మందిరం తెర తొలగించి చూడటానికి నాకిన్నాళ్ళూ సాహసం లేకపోయింది.

నా తలపోతల్లో నేను మర్చిపోయాననుకున్నవి ఎన్నెన్నో గుర్తొస్తూ ఉన్నాయి. ఇన్నాళ్ళూ అవి జ్ఞాపకాలపెట్టెలో అడుగున ఉండిపోయేయి. అలాంటి వాటిల్లో ఇరవయ్యేళ్ళ కింద నేను విన్న మాటొకటి నాకు ఈ రెండు మూడు వారాలుగా పదే పదే గుర్తొస్తూ ఉంది. అది ఒక మహాకవి అన్నాడని ఎక్కడో చదివాను. ఒక ఋషిలాంటి కవి. భగవంతుడి గురించి చెప్తూ 'ఆయన ఉనికి కన్య స్నేహం వంటిది' అని అన్నాడట ఆ కవి.

భగవంతుడి ఉనికి కన్నె కలల్లాంటిదో, యువతి వలపులాంటిదో అని అనకుండా 'కన్య స్నేహం' వంటిదని ఆయన ఎందుకన్నాడు? ఒక బిడ్డ స్నేహం అనో, తల్లి స్నేహం అనో అనకుండా కన్య స్నేహం అని మాత్రమే ఎందుకన్నాడు?

ఇరవయ్యేళ్ళుగా నాలోపల్లోపల అదొక ప్రశ్నగానే ఉండిపోయింది. అటువంటి ప్రశ్నలు నీ జీవితగమనానికీ, నీ రోజువారీ జీవితానికీ ఏ విధంగానూ అడ్డుపడవు. ఆ ప్రశ్నకి జవాబు చెప్పకపోతే నువ్వు ఏ ఇంటర్వ్యూలోనో సెలక్టు కావనే భయమేమీ ఉండదు. ఏదో పరీక్షలో నెగ్గవేమో అనే టెన్షను ఉండదు. కాని అటువంటి ప్రశ్నలుంటాయి, నీ అంతట నువ్వు, నీ జీవితపు ఏ మలుపులోనో, జవాబు వెతుక్కునేదాకా, అవి నిన్ను వెన్నంటే ఉంటాయి. ఈ జీవితకాలంలో వాటికి నువ్వు జవాబు చెప్పుకోలేకపోతే, బహుశా మరుజన్మకి కూడా నీ వెంటవస్తాయి.

ఇప్పుడు నా తలపుల తలపోత నన్ను శుభ్రపరుస్తూ వచ్చాక ఆ ప్రశ్నకు నాకు జవాబు దొరికింది. ఆ రోజుల్లో, ఆ రాత్రుల్లో మేము కలిసి గడిపిన ఆ అనుభవాలు ఒక్కొక్కటే గుర్తొస్తూ ఉంటే, ఆ జవాబు నాకు నెమ్మదిగా తెలుస్తూ వచ్చింది. కన్య కూడా ఒక బాలికనే. పసిపాపనే. పసిపాప ఎంత నిర్మలచిత్తనో ఒక కన్య కూడా అంత నిర్మల మనస్కనే. అసలు ఒక కన్య అనేమిటి? పదహారేళ్ళనుంచి పాతికేళ్ళ వయస్సులో ఉండే యువతీయువకులంతా నిర్మలమనస్కులే. పసిపిల్లలే. 'పిల్లలూ దేవుడూ చల్లనివారే, కల్లకపట మెరుగని కరుణామయులే' అని కవి అన్నమాటలో యువతీయువకుల్ని కూడా కలుపుకోవచ్చు.

'ఆయన ఉనికి కన్యస్నేహం వంటిది' అనే మాటని, నేను 'ఆయన ఉనికి యువతీ యువకుల స్నేహం వంటిది' అని మార్చుకుంటే ఆ కవీశ్వరుడు కాదనడనే అనుకుంటున్నాను. అవును. ఏ ఇద్దరు యువతీయువకులేనాగానీ – ఆ వయసులో వాళ్లకి నేను, నువ్వు అనే తేడాలుండవు. ఒకరిని స్వంతం చేసుకోవాలనే తలపుగాని, ఎవరో ఒకరికే తాను స్వంతం కావాలనే తలపు గాని ఉండవు. ఆ వయసులో వాళ్ల మనసుల్లో ఉండేదే– అదే ప్రేమ. దాన్ని ప్రాపంచికమైన మరే పదంతోనూ నువ్వు వివరించ లేవు. పసిపిల్లలు ఉంటారట్లా. కాని తాము అలా ఉంటున్నామని వాళ్లకి తెలియదు. యువతీయువకులు అలా ఉంటున్నప్పుడు తాము అలా ఉంటున్నమనే ఎరుక ఏ కొంతనో వారికి ఉండకుండా పోదు. కొంత మెలకువతో కూడిన కలల ప్రపంచం వాళ్ళది. అందుకనే ఆయన 'బిడ్డ స్నేహం' అనలేదు. 'కన్యస్నేహం' అన్నాడు.

అవును. మేమిద్దరం ఆ అడవిలో, ఆ కొండల మధ్య, ఆ పొలాల్లో, ఆ వెన్నెల్లో, ఆ ఏటి ఒడ్డున, ఆ రెల్లుపొదల దగ్గర పిల్లల్లాంటి మనసుతో సంచరించిన యువతీయువకులం. కానీ, ఆ జీవితం నుంచి బయటపడ్డాక అతను నన్ను స్వంతం చేసుకోవాలని అనుకున్నాడు, నేను మరొకరెవరికో స్వంతం కావాలని అనుకున్నాను. ఇద్దరి కోరికల్లోనూ తప్పు లేకపోవచ్చు. ఇద్దరి స్వప్న ప్రపంచాలూ సమంజసమైనవే కావచ్చు. కాని, ఏ క్షణం మేం మా మా కలలప్రపంచాల్లోకి అడుగుపెట్టామో, ఆ క్షణమే ఆ నిర్మలప్రపంచం నుంచి ఇద్దరమూ దూరమైపోయాం. ఒకరి నుంచి మరొకరు కూడా దూరంగా జరిగిపోయాం.

ఆ రోజుల్లో మేమంతా సామూహికంగా ఒక సంతోషాన్ని అనుభవించాం. అది ఒక పండక్కి బంధువులు మన ఇంటికి వచ్చినప్పుడు మనమంతా కలిసి గడపడం లాంటిది. ఆ సంతోషానికి ఏ ఒక్కరో కారణం కాదు. ప్రతి ఒక్కరూ కారణం. అన్నిటికన్నా ముందు ఆ సందర్భం కారణం. కాని ఆ ఇళ్ళల్లో ఉండే ఏ పిల్లవాడో ఆ సంతోషానికి ఫలానా బంధువే కారణం అనుకుని ఆ బంధువుకేసే చూస్తూ ఉంటే ఎలా ఉంటుంది? రాజు నాకు ఉత్తరాలు రాయడం అలాంటిదే అని ఇప్పుడు అనిపిస్తోంది. ఆ రోజుల్లో అక్కడ ఉండగా ఈ స్పష్టత నాకు ఒనగూడి ఉంటే నా జీవితం మరోలా ఉండేదేమో. లేదా కనీసం, ఎన్నో ఏళ్ల పాటు నేను అనుభవించిన సంఘర్షణని అనుభవించవలసిన పని లేకపోయి ఉండేదేమో.

అవును. ఆ వెన్నెల రాత్రుల్లో నాకు కూడా ప్రేమ అనుభవానికొచ్చింది. కాని అది ఏ ఒక్క వ్యక్తిపట్లనో ప్రేమ కాదు. ఏ ఒక్క వ్యక్తినో నా మనిషిగా మార్చుకోవాలన్న ప్రేమ కాదు. అది ప్రతి ఒక్కరి పట్లా ప్రేమ. నేను ప్రొఫెసర్ని ప్రేమించాను, డా.మిశ్రాని

ప్రేమించాను, వనలతను ప్రేమించాను, రోజాని ప్రేమించాను, అలాగే రాజుని కూడా ప్రేమించాను. కాని వాళ్ళెవర్నీ విడివిడిగా ప్రేమించలేదు. అసలు అప్పుడు, అక్కడ ఎవరికీ విడివిడి వ్యక్తిత్వాల్లేవు. అందరిదీ ఒకటే దేహం. ఒకటే మనస్సు. ఆ కొండవారలోయలో ఆ చైత్రమాసపు వెన్నెల రాత్రి ఆ గిరిజన స్త్రీపురుషసమూహమంతా ఏకగోత్ర, ఏక గాత్ర సహపంక్తిగా వర్ధిల్లినప్పుడు దేవతలంతా ఆ నృత్యం చూడ్డానికి వచ్చారంటే, అందుకే, అది నాకు అబద్ధమనిపించలేదు.

ఎటువంటి మనఃస్థితి అది! అటువంటి ఏకమనస్కులైన ఒక మానవసమూహం ఒక్క పాఠశాల నిర్మించడమేమిటి, తలచుకుంటే, స్వర్గాన్నే భూమ్మీదకు దింపగలుగుతారు. కాని ఆ మనఃస్థితినుంచి పక్కకు జరిగాక, నువ్వూ, నీ మనసూ, నీ జీవితం అనే తలపు మొదలయ్యాక, ఒక వెడ్డింగుకార్డు ప్రింటు చేయించుకోడం కూడా ఎంతో పెద్దపనిగా మారిపోతుంది.

నా తలపుల దారుల్లో ఇన్నాళ్ళూ ప్రయాణం చేసాక నాకు అర్థమయిందేమంటే ప్రేమ ఒక సింబాలిక్ ఫ్రేమ్‌వర్కు అని అనుకున్నా కూడా అది ఒక్కరికో, ఇద్దరికో పరిమితమైన భావప్రసారం కాదు. అదొక సామూహిక సద్వర్తన. సామాజిక సద్వర్తన.

ఒక మనిషిని గాఢంగా కామించడమో, మోహించడమో ప్రేమ కానే కాదు. ప్రతి ఒక్క కాముకతా పర్యవసానంలోనూ తప్పకుండా ఒక క్రైమ్ పొంచి ఉంటుంది. తీవ్ర మోహపర్యవసానం తప్పనిసరిగా హత్యకో, ఆత్మహత్యకో దారి తీస్తుంది. కాని ఏ ఒక్క మనిషినోకాక, మనుషుల్ని ప్రేమిస్తే అందుకు పర్యవసానం? నీడలేని బడికి ఒక గూడు దొరుకుతుంది. ప్రసవం కష్టమైన ఒక స్త్రీకి సకాలంలో వైద్యం అందుతుంది. రోజంతా అడవికిపోయి ఆకలి కడుపుతో బీడీ ఆకులు సేకరించే ఒక గిరిజన కుటుంబానికి, ప్రతి కట్టమీదా కనీసం రెండు పైసలు అదనం ఆదాయం దొరుకుతుంది. అలాగని ఇలా ఏదో ఒకటి జరుగుతుందని చెయ్యడం– ప్రేమ కాదు. అప్పుడది ఎజెండా అవుతుంది, మానిఫెస్టో అవుతుంది, మళ్ళా ఒక కొత్త హయరార్కీ అక్కడికొచ్చి చేరుతుంది.

యువతీయువకుల తొలియవ్వనకాలంలో అటువంటి మనఃస్థితి ఉంటుందని గుర్తుపట్టడం ఒక విద్య. ప్రేమవిద్య. కాని మహాకవి చెప్పినట్లుగా ఆ విద్య ఇంట్లో తల్లిదండ్రులు చెప్పరు, బళ్ళో ఉపాధ్యాయులూ చెప్పరు, దానికి పాఠ్యపుస్తకాలూ, సిలబస్సూ, కరికులమూ ఎలా ఉంటాయో తెలియదు. ప్రేమ చివరికి ఒక యాసిడు దాడిగానే పరిణమించే కళాశాలలు మనవి. ఇంక ప్రేమ అంటే ఏమిటో చెప్పేవాళ్ళెవరు? కవులూ, రచయితలూనా? ప్రేమసౌభాగ్యం వల్ల కాక, ప్రేమరాహిత్యం వల్లనే మనుషులు కవులుగా మారుతున్న సమాజం మనది.

'కానీ. విమలా, ఒక్క మాట చెప్పు. మనుషులు ఎప్పటికీ తమతొలియవ్వనప్రాయం లోనే ఉండిపోతారా? తమ తమ జీవితాల్లోకి తాము ప్రయాణించకుండా అక్కడే ఆగి పోతారా?'

లేదు. మనుషులు అక్కడ ఆగిపోరు. ఆగిపోకూడదు కూడా. కాని ఆ తొలియవ్వన కాలం ఒక ప్రేమపాఠశాల. అప్పటి ఆ నిర్మల మనఃస్థితి నీకు నేర్పే చదువు నీ జీవితకాలం పొడుగునా నీకు తోడుగా వస్తుంది. నీ తదనంతర జీవితంలో నువ్వు కలుసుకున్న యువతీ యువకులకి నువ్వు ఆ మెలకువని పంచిపెడతావు. ప్రొఫెసర్ సేన్‌గుప్త చేసింది అదే. అతనికి తెలుసు. తన తొలియవ్వనకాలపు బెంగాలుకి తాను తిరిగిపోలేడని. అందుకనే ఒకప్పటి తన గ్రామాల్ని తర్వాత తాను నడిచిన ప్రతి గ్రామంలోనూ, ఆ కొండల్ని తాను చూసిన ప్రతికొండలోనూ వెతుక్కుంటూ తిరిగేడు. ఆయన నీడలో పెరిగింది కాబట్టే, వనలత కూడా ప్రేమ అంటే మాటల్లో చెప్పేది కాదని తెలుసుకోగలిగింది.

ప్రపంచం చాలా చిన్నది. సూర్యనారాయణగారి చిన్నమ్మాయి తర్వాత రోజుల్లో విశాఖపట్టణంలో కాలేజి లెక్చరరుగా పనిచేస్తో ఎలాగో నా అడ్రసు పట్టుకుని కాంటాక్టు లోకి వచ్చింది. ఆమె చెప్పింది, ప్రొఫెసర్ సేన్‌గుప్త, ఆ తర్వాత రోజుల్లో కర్నూలు-కడప బేసిన్‌లో ఫీల్డువర్కులో ఉండగా, నల్లమల కొండల్లో, ఈ లోకాన్ని విడిచిపెట్టేడని. ఇంకా చాలా సంగతులు చెప్పింది. మేము వచ్చేసిన రెండు మూడేళ్ళ తర్వాత ఆ ఊళ్ళల్లో నక్సలైట్లు ప్రవేశించేరనీ, ఎన్నో గిరిజనేతర కుటుంబాలు ఆ ఊరు వదిలిపెట్టి వెళ్ళిపోయేరనీ, అందులో రాజు కుటుంబం కూడా ఒకటనీ చెప్పింది. మేమక్కడ ఉన్నప్పుడు ఆ ఊరు, డా.మిశ్రా చెప్పినట్టు, నిజంగానే ఒక వోల్కెనో మీదనే ఉందన్నమాట అనుకున్నాను.

మరి రాజు ఇప్పుడెక్కడున్నాడో తెలిసిందా?

తెలిసింది.

కాని ఆ రాజు మీద నాకేమీ ఆసక్తి లేదు.

నాకు తెలిసిన రాజు- రవీంద్రసంగీతంలాగా, నజ్రుల్‌గీతి లాగా, ఏటి ఒడ్డున విన్న ఎంకిపాటలాగా, నింగినీ, నేలనీ కలిపిన గంగాలమ్మ ఊయల్లాగా, దేవతలు తిలకించిన కొండరెడ్ల నాట్యం లాగా, ఆ వెన్నెలరాత్రుల్లో ఒక భాగంగా ఎప్పటికీ నాతోనే ఉంటాడు.

**



వాడ్రేవు చినవీరభద్రుడు

ఆ వెన్నెలరాత్రులు

◎

రచయిత అందరికీ తెలిసిన మంచి పేరున్న కవి, విమర్శకుడు, అనువాదకుడు, చిత్రకారుడు, నిత్యాన్వేషి, దార్శనికుడు- ఇంత ప్రత్యేకత ఉన్న వ్యక్తి మలెనాడులో పుడితే కువెంపు సరసన జ్ఞానపీఠ అవార్డుతో నిలబడేవారు అనిపించింది.

కల్యాణి నీలారంభం

ఈ కథ చెప్పడానికి చినవీరభద్రుడు ఒక బొటానిస్టు అయ్యారు, ఒక జియాలజిస్టు, ఒక ఇండాలజిస్టు, ఒక యాంత్రొపాలజిస్టు, ఒక పాలియాంటాలజిస్టు, ఒక సాహసి, ఒక అన్వేషకుడు, ఒక పరిశోధక విద్యార్థి, ఒక వైల్డ్ యువకుడూ, ఒక ప్రొఫెసరూ, ఒక దేశం నుంచి విడిపడ్డ బిడ్డా, ఒక కవీ, ఒక కథకుడూ అన్నిటినీ మించి ఒక మహాస్వాప్నికుడు అయ్యారు.

సునీత రత్నాకరం